ఆంధ్ర మహాభారతోపన్యాసములు

(ఉపన్యాస సంకలనం)

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.

ఆంధ్ర మహాభారతోపన్యాసములు

(ఉపన్యాస సంకలనం)

ప్రధాన సంపాదకులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్

ఆచార్య సి. నారాయణ రెడ్డి

అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత పరిషత్తు

సంపాదకులు

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

ప్రధాన కార్యదర్శి, ఆంధ్ర సారస్వత పరిషత్తు

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.

ఫోన్: 040 - 24753724

1957 సెప్టెంబర్, ప్రథమ ముద్రణము - *2,000*
1959 అక్టోబర్, ద్వితీయ ముద్రణము - *2,000*
1962 సెప్టెంబర్, తృతీయ ముద్రణము - *2,000*
1969 సెప్టెంబర్, చతుర్థ ముద్రణము - *2,000*
1981 సెప్టెంబర్, పంచమ ముద్రణము - *2,000*
2007 మార్చి, ఆరవ ముద్రణము - *1,000*

మూల్యం : **రూ. 100/-**

ప్రతులకు :
ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001.
ఫోన్: 040-24753724

ముద్రణ :
విష్ణ కంప్యూటర్ సర్వీసెస్
(డిజైనర్స్ & మల్టీకలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్)
నల్లకుంట, హైదరాబాద్ - 500 044.
ఫోన్: +040-27654003, 27676910

అవతారిక

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, పద్మభూషణ్
ఆచార్య సి. నారాయణ రెడ్డి
అధ్యక్షులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు

నిజాం పాలనలో తెలుగు భాషాదీపం కొడిగట్టిన కాలంలో దాని పునరుద్దీపనానికి ఉద్యమించిన మాతృసంస్థ ఆంధ్ర సారస్వత పరిషత్తు. శ్రీ మాడపాటి హనుమంతరావు, శ్రీ సురవరం ప్రతాపరెడ్డి, శ్రీ లోకనంది శంకరనారాయణరావు వంటి పలువురు సాహితీమూర్తుల ప్రేరణతో పరిషత్తు 1943లో రూపుదిద్దుకొని ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లో అగ్రేసర సాహితీ సంస్థగా విశిష్ట స్థానం వహించింది. మాన్యమిత్రులు కీ.శే. డా. దేవులపల్లి రామానుజరావుగారు యావజ్జీవితం పరిషత్తు అభివృద్ధికి శ్రమించారు. ఉత్తమాదర్శాలతో, ఆశయాలతో ఆవిర్భవించిన పరిషత్తు కాలానుగుణంగా బహుముఖీన కార్యక్రమాలు చేపట్టి సమర్థంగా నిర్వహిస్తూ అందరి మన్ననలందుకుంటున్నది. వీటిలో భాషా బోధన, గ్రంథ ప్రచురణ ముఖ్యభూమికలు వహిస్తున్నాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రాథమిక, ప్రవేశ, విశారద పరీక్షలు జరపడంతోపాటు, తెలుగు పండిత శిక్షణ కళాశాల, స్నాతకోత్తరస్థాయి ప్రాచ్యకళాశాల నిర్వహిస్తున్నది. పరిషత్తు రూపొందించి నిర్వహించే సాహితీ సభలు, సమావేశాలు, ప్రసంగాలు, సదస్సులు, ఉత్సవాలు, చర్చాగోష్ఠులు, సాంస్కృతిక కార్యక్రమాలు మొదలైనవి వైలక్షణ్యాన్ని సంతరించుకున్నాయి. పరిషత్తు ప్రచురించే గ్రంథాలను సాహితీ లోకం హార్దికంగా స్వాగతిస్తున్నది. ఇంతవరకు 300పైగా గ్రంథాలు వెలువరించింది.

అత్యంత ప్రధాన సాహిత్యాంశాలపై అగ్రశ్రేణి కవి పండితుల ప్రసంగాలు ఏర్పాటు చేసి, ఆ ప్రసంగపాఠాలను గ్రంథరూపంలో ప్రచురించడం పరిషత్తు ఒక సంప్రదాయంగా పాటిస్తున్నది. ఈ పరంపరలోనిదే ప్రస్తుత గ్రంథం 'ఆంధ్ర మహాభారతోపన్యాసములు'. ఉద్దండభాషాసాహిత్యాభిజ్ఞులు శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ, వేదాలతిరువేంగళాచార్యులు, కోరాడ రామకృష్ణయ్య, నండూరి బంగారయ్య, గడియారం వేంకటశేషశాస్త్రి, కురుగంటి సీతారామయ్య, కేశవపంతుల

నరసింహశాస్త్రి గార్ల ప్రసంగాలను పరిషత్తు 1955లో నిర్వహించింది. ఆ ప్రసంగపాఠాలను 1957లో గ్రంథంగా ప్రచురించింది. ఇంతవరకు అయిదు ముద్రణలు పొందిన ఈ గ్రంథం విశేషాదరణ పొందింది.

ఆధునిక సామాజిక జీవనంలో మననం చేసుకోవలసిన అనేకాంశాలు మహాభారతంలో నిక్షిప్తమై ఉన్నాయి. ప్రాచ్యపాశ్చాత్య వేదాంతుల దృష్టిని ఆకర్షించిన భగవద్గీత కూడా మహాభారతాంతర్గతమే. మహాభారతాన్ని అధ్యయనం చేయగలిగితే మానవ మనస్తత్వాలు సమగ్రంగా అవగతమవుతాయి. మహాభారతాన్ని ఐతిహాసిక దృష్టితోనే కాకుండా కావ్యదృష్టితో వివేచిస్తే అనేక కావ్యలక్షణాలు స్ఫురిస్తాయని నిరూపిస్తున్నాయి ఈ గ్రంథంలోని ప్రముఖుల ప్రసంగాలు.

'ఆంధ్ర మహాభారతోపన్యాసములు' గ్రంథ పునర్ముద్రణను సాహితీప్రియులెందరో అభిలషిస్తున్నారు. వారి సౌకర్యార్థం ఆరవముద్రణ వెలువరిస్తున్నాం. యథాపూర్వంగా ఈ ప్రచురణను సాహితీలోకం ఆదరిస్తుందని విశ్వసిస్తున్నాను.

హైదరాబాదు
20-3-2007

డా॥ సి. నారాయణ రెడ్డి

ప్రవేశిక

ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్వహిస్తున్న అనేక కార్యక్రమాలలో సదస్సులు నిర్వహించి, ఆ సదస్సులలో సమర్పితమైన ప్రసంగపత్రాలను గ్రంథాలుగా వెలువరించటం ఒకటి. అలాంటి గ్రంథాలలో ఆంధ్ర మహాభారతోపన్యాసములు, ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు ఎందరి మన్ననలో అందుకున్నాయి. అనేక పర్యాయాలు ముద్రితమైనాయి. 'ఆంధ్ర మహాభారతోపన్యాసములు' పట్టభద్రస్థాయిలో అనేక సంవత్సరాలు పాఠ్యగ్రంథంగా కొనసాగింది. తెలుగు సాహిత్య పరిశోధనలో పరిషత్తు ప్రకటించిన అనేక గ్రంథాలతోపాటు ఇవి ప్రముఖ - ఆకర గ్రంథాలుగా పేరుపడ్డాయి. అందుకు కారణం ప్రసిద్ధులైన ప్రసంగకర్తలు, వారి పరిశోధనస్థాయి. భవిష్యత్తులో పరిషత్తు ఇలాంటి నూతన ప్రసంగపరంపరలను గ్రంథరూపంలో వెలువరిస్తుందనీ, ఇందుకు సంస్థ అధ్యక్షులు జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు డా. సి. నారాయణరెడ్డిగారు సంకల్పించారనీ మా మనవి.

ఆంధ్ర మహాభారతం వ్యాసభారతం లాగానే తెలుగు వారికి ఆరాధ్యగ్రంథం. సంస్కృత భారతం ధార్మిక విషయ సంభరితమైన గ్రంథం. కథాకథనం కన్నా, ధార్మిక విషయచర్చలకే అందులో అవకాశం ఎక్కువ. తెలుగువారికి కవిత్రయ భారతమే ప్రమాణం. ఋషితుల్యులైన కవిత్రయం వారు దాన్ని ఐతిహాసిక కావ్యంగా తీర్చిదిద్దారు. నన్నయ 'కవి వృషభులు మహాకావ్యమనియు' అని అనడం కావ్యచ్ఛాయలు పుష్కలంగా ఉన్నాయని చెప్పటమే. కవిత్రయ భారతం వెలువడ్డ తర్వాత మరెవ్వరూ పునరనువదించటానికి పూనుకోలేదు. మూల విధేయంగా రచించాలని ప్రయత్నించిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి రచన పఠనపాఠనస్థాయిని అందుకోలేక నామమాత్రంగా మిగిలిపోయింది. నన్నయమహాకవి రచనలో ప్రసన్నకథాకలితంగా అర్థయుక్తిని జోడించారు. అరణ్యపర్వశేషాన్ని రచించిన ఎఱ్ఱన మహాకవి నన్నయ మార్గాన్ని అనుసరించి, తరించి, కృతార్థుడైనాడు. అరణ్యపర్వశేషాన్ని 'తద్రచనగా' పూరించానని చెప్పిన ధీరవిచారుడు ఆ ప్రబంధ పరమేశ్వరుడు. ఇక తిక్కన మహాకవి కవిబ్రహ్మ అని చెప్పనవసరం లేదు.

ఈ ప్రసంగ వ్యాసాలలో మహాకవి విశ్వనాథ సత్యనారాయణగారు నన్నయ భారతాంధ్రీకరణాన్ని నిపుణంగా విశ్లేషించారు. మూలంలోని ఉపాఖ్యానాలను అంతకన్నా రమణీయంగా అనువదించారని భావించారు. ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భంలో మూలాన్ని, అనువాదాన్ని పేర్కొని నన్నయగారు ఎంత గాఢంగా ఆలోచించి రచిస్తారో నిరూపించారు. నగ్నత అంటే ఏమిటో ఆయన వివరించిన తీరు సముచితంగా ఉంది. శకుంతలోపాఖ్యాన వివరణ సందర్భంగా నన్నయగారు మహాశిల్పి అని నిరూపించారు. ఈ సందర్భంగా శిల్పమంటే ఏమో వ్యాఖ్యానించారు. నన్నయగారు కథలను ఎలా వ్యాఖ్యానిస్తారో, వాటికి ఎలా భాష్యం చెబుతారో, కథలోని క్లిష్టాంశాలను ఎలా వివరిస్తారో,

అసంగతంగా కనిపించే అంశాలను ఎలా సుసంగతం చేస్తారో విశ్వనాథ వారు వివరించిన తీరు వారి ప్రతిభాపాటవాలకు దర్పణంగా నిలుస్తుంది. అలంకార శాస్త్రాల లోతుపాతులు తెలిసిన విశ్వనాథవారు ఆయా సందర్భాలలో వాటిని సమన్వయించి చూపిన పద్ధతి అనితరసాధ్యం.

అరణ్య పర్వశేషాన్ని గురించిన వ్యాసం శిరోమణి వేదాల తిరువేంగళాచార్యుల వారిది. వారు ఆంధ్ర ధ్వన్యాలోక కర్త. అరణ్య పర్వశేషం పరిమాణంలో చిన్నదైనా ఈ ప్రసంగ వ్యాసం మాత్రం దీర్ఘమైంది. మహాభారతం, అలంకార శాస్త్రాన్ని పుక్కిట బట్టిన మహా విద్వాంసులువారు. వేదాల వారి వ్యాసం మరీ దీర్ఘంగా ఉంటే అందులో చాలా భాగాన్ని తగ్గించి అచ్చువేశామని కీ.శే. డా. గడియారం రామకృష్ణశర్మగారు నాతో ఒక సందర్భంలో అన్నారు. తిక్కన నాటికి అరణ్యాపర్వం సమగ్రరచనగా ఉందని, తరువాత వినష్టమై ఎర్రన మహాకవిచేత పూరింపబడిందని అన్నారు. కొమర్రాజు లక్ష్మణ రావుగారి 'సంస్కృత భారత మొక బంగారు ముద్ద. తెలుగు భారతమందులోనుండి కొంత బంగారము తీసి మంచి పనివాని తనముతో తీర్చిన ఒక అమూల్యాభరణము' అనే వాక్యాలతో పూర్తిగా ఏకీభవించారు వేదాలవారు. వారి వ్యాసంలో ఖండన మండనములు సమానంగా ఉండటం విశేషం.

భారతంలో కీలకమైన విరాటపర్వం గురించి శ్రీకోరాడరామకృష్ణయ్యగారి వ్యాసం చాలా విలువైనది. విరాటపర్వం ఎందుకు హృదయాహ్లాదిగా ఉందో సోపపత్తికంగా వివరించారు. తిక్కన కావ్యశిల్పదృష్టిని విశదీకరించారు. తిక్కన తన రచనలో మనోవృత్తి వివరణ నైపుణ్యాన్ని, భావావిష్కరణ శక్తిని, రూపకల్పనా చాతుర్యాన్ని, శబ్ద ప్రయోగ నైపుణ్యాన్ని పొందుపరిచి 'ప్రబంధమండలిని' తీర్చి దిద్దిన వైనాన్ని తెలియపరచారు. నిజంగా అనువాదంలో విరాటపర్వం కొంత పెరిగింది. ఇందుకు కారణం పాత్రల భావోన్మీలన సందర్భాలు, వర్ణనలు, దేశీయాచార వర్ణనలు కారణమని అన్నారు కోరాడవారు. మూలాన్ని అనువాదాన్ని పోల్చి చూపి మూలంలో కన్నా తెలుగులోనే కథా సంధానంలో పటిష్ఠత కనిపిస్తుందని చెప్పారు. భావానుగుణంగా రూపొందిన రచనా విన్యాసం రసస్ఫురణకు ఉపకరించిందని కోరాడవారి అభిప్రాయం. తిక్కన మూలానికి భిన్నంగా రచించి మెరుగు పెట్టిన ఆరు అంశాలను పేర్కొనటం ఆయన పరిశోధన పటిమకు తార్కాణం. తిక్కన తెలుగుదనాన్ని, జాతీయాల సొంపును గురించి సోదాహరణంగా వివరించారు.

తిక్కన మహాకవి ఉద్యోగపర్వాన్ని అనుశీలించారు శ్రీ నండూరి బంగారయ్య గారు. తిక్కన రచనలోని గొప్పతనాన్ని, వ్యాసమహర్షి రచనలోని మహనీయతను ప్రామాణికంగా వివరించారు. వ్యాసుడే మరొక అవతారమెత్తి తిక్కనగా జన్మించాడని అంటారాయన. మూలంలోని సనత్సుజాతీయాన్ని సందర్భోచితిని దృష్టిలో పెట్టుకొని తిక్కనగారు వదలిపెట్టడాన్ని నండూరి వారు సమర్థించారు. దీనివల్ల రసం, వస్తువులకు శోభ కలిగిందని అంటారు. ద్రుపద, సంజయ, శ్రీకృష్ణరాయబారాలను స్వభావ రమ్యంగా

విశ్లేషించారు. శ్రీకృష్ణుని వక్తృత్వాన్ని గురించి, ఆయన ఉపన్యాస రామణీయకతను గురించి సశాస్త్రీయమైన ఆలోచన చేశారు శ్రీ నండూరి వారు. ఎదుటివారి మనస్తత్త్వాలను గురించి ఎలా సమాధానం చెప్పాలో శ్రీకృష్ణుని పరంగా వారు తెలిపిన విషయాలు చాలా సమంజసంగా ఉన్నాయి. అంబోపాఖ్యానం, వృత్రాసుర వధ వంటి ఉపాఖ్యానాల్లో తిక్కన కథనశక్తి ఎంత ప్రస్ఫుటంగా ప్రతిఫలించిందో దృష్టాంతపూర్వకంగా తెలిపారు.

యుద్ధషట్కాన్ని సమగ్ర వీక్షణం చేశారు శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రిగారు. యుద్ధషట్కంలోని ఇతివృత్తం యుద్ధప్రారంభంతో మొదలయి రణరంగంలో చనిపోయిన వారికి ఉదక ప్రదానంతో ముగుస్తుంది. తిక్కన మంత్రిగా యుద్ధరంగాలను వీక్షించి ఆ అనుభవ వైభవంతోనే యుద్ధవర్ణనలు చేయగలిగాడని తెలిపారు గడియారం వారు. వ్యూహనిర్మాణాలు, వాటి భేదనాన్ని ఎంతో మెలకువతో అభివర్ణించాడు తిక్కన అన్నారు. శాంతిత్రయాన్ని గురించి శ్రీకురుగంటి సీతారామయ్యగారు చక్కని పరిశోధనాత్మకమైన వ్యాసాన్ని రచించారు. తిక్కన అనువాదం దాక్షిణాత్యప్రతులను అనుసరించిందని తెలిపారు. సార్వజనీనత, సార్వకాలీనత మహాభారతంలోని వరిష్ఠగుణాలని అంటారు. ఆశ్రమవాస చతుష్టయాన్ని గురించిన వ్యాసం శ్రీ కేశవ పంతుల నరసింహ శాస్త్రి గారిది. కృష్ణ నిర్యాణ సందర్భాన్ని వీరు వివరించిన విధానం, మహాప్రస్థానిక స్వర్గారోహణ పర్వాలలోని తాత్త్విక భూమికను వీరు వెలువరించిన తీరు వారి వైదుష్యానికి నిదర్శనం.

ఇవి రేఖామాత్రంగా ప్రసంగ వ్యాసాల్లోని అంశాలు. అనుశీలన చాలా వరకు కావ్యకళ, ధర్మదృష్టులపై కేంద్రీకరించబడింది. ఇవి అర్ధశతాబ్దికి పూర్వం చేసిన ప్రసంగాలు. చరిత్రకు, నృశాస్త్రానికి, సంస్కృతికి సంబంధించిన అనేకాంశాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఈ అంశాలతో పునఃమహాభారత విమర్శ జరగవలసి ఉంది. మానవీయ మూల్యాలకు మహాభారతం పట్టం కట్టింది. ఈ విషయం గ్రహించడానికి ఒక్క ధర్మవ్యాధోపాఖ్యానం చాలు. ఆంధ్ర మహాభారతాన్ని గురించి అనేక వేల వ్యాసాలు వెలువడ్డాయి. వందల సిద్ధాంత వ్యాసాలు, గ్రంథాలు వచ్చాయి. అయితే ఆధునిక సామాజిక జీవితానికి అవసరమైన ఎన్నో విలువలు భారతంలో ఉన్నాయి. వాటి పరమార్థాన్ని సమాజానికి తెలుపవలసిన బాధ్యత ఈతరం విద్వాంసులపై ఉంది. ఆంధ్ర మహాభారతాన్ని అభినవంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. అందుకు ఇలాంటి గ్రంథాలు ప్రాతిపదికలుగా నిలుస్తాయి. ఈ దృష్టితోనే ఈ ఆరవముద్రణకు పూనుకొన్నాం అందరి సహకారాన్ని అభ్యర్థిస్తూ.

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ప్రధాన కార్యదర్శి
ఆంధ్ర సారస్వత పరిషత్తు

హైదరాబాదు
20.3.2007

విషయ సూచిక

***

౧

శ్రీ నన్నయగారి
భారతాంధ్రీకరణము

శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు

భారతము నాంధ్రీకరించుటలో నన్నయగారు వైదిక మతమును సంరక్షించుటకుఁ బ్రయత్నము చేసిరనియు, వైదికమత రక్షణార్థమే నన్నయగారిచేతఁ దెలుఁగు భారతము వ్రాయఁబడె ననియు నొక ప్రచారము దేశములో నున్నది. దీనినిఁ జారిత్రకులు ప్రారంభించినట్లున్నది. విశ్వవిద్యాలయములలో దీనికిఁ బ్రచార మెక్కువగా నున్నది. ఈ విశ్వవిద్యాలయములలోఁ జదివినవారు వ్రాసిన బహు గ్రంథములలోనను, జేసెడి బహూపన్యాసములలోనను ధారాళముగా నీ ప్రశంస చేయుచున్నారు. ఇది నిరాధారమైన మాటగాఁ గన్పించుచున్నది. ఏల యనఁగా నీ మాట కాధారమైన విషయము కనిపించదు. నన్నయగారి భారతావతారికలో నీ ప్రసక్తియేలేదు. రాజరాజ నరేంద్రుఁడు

ఇవి యేను స్సతతంబు నాకును గరం బిష్టంబులై యుండుఁ బా
యవు, భూదేవకులాభితర్పణ మహీయః ప్రీతియు, న్భారత
శ్రవణాసక్తియుఁ, బార్వతీపతి పదాబ్జధ్యాన పూజామహో
త్సవము, స్సంతత దానశీలతయు, శశ్వత్సాధు సాంగత్యమున్.

మఱి యదియునుం గాక.

హిమకరు దొట్టి పూరు భరతేశ కురుప్రభు పాండుభూపతుల్
క్రమమున వంశకర్తలనఁగా మహి నొప్పిన యస్మదీయ వం
శమునఁ బ్రసిద్ధులై విమల సద్గుణ శోభితులైన పాండవో
త్తముల చరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్టమెంతయున్.

అని మాత్రమే యడిగెను గానిఁ మన సనాతన మతము పాడయి పోవు చున్నది. నీ వీ కావ్యమును దెలుఁగు చేసి పెట్టుము. అని యడిగిన జాడలేదు. మఱియు

బహు భాషల బహు విధముల
బహు జనములవలన వినుచు భారత బద్ధ
స్పృహు లగువారికి నెప్పుడు
బహుయాగమ్ముల ఫలమ్ము పరమార్థమగున్॥

అన్నవిషయమే చెప్పఁబడెను. ఇట్టి యపప్రథకు శాసనాధారమైనను గానిపించదు. శాసనవేత్తలయిన చారిత్రకులు కూడ నట్టి వున్నట్లు చెప్పుటలేదు. మఱి యీ నిరాధారమైన వాక్యమెందుకుఁ బుట్టినదో తెలియదు. ఈ దేశమున సాహిత్య విమర్శ యిట్టి నిరాధారములైన బహు విషయములతో నల్లుకొని పోవుచున్నది. అప్రమాణములైన బహు సిద్ధాంతములు విమర్శరూపమునఁ జెప్పఁబడు చున్నవి. అది భాషకు, సాహిత్యవేత్తలు కాని సామాన్యులయిన సాహిత్యాభిమానులకు నపకారము చేయుచున్నది.

నన్నయగారు మత దృష్టితో నీ కావ్యము వ్రాయలేదనుటకు ననేకములైన యుదాహరణములు చూపించవచ్చును. సభాపర్వములో శిశుపాలవధ సందర్భమున భీష్ముఁడు శ్రీకృష్ణుని యొక్క పరమేశ్వరత్వముఁ జాలసర్గలయందు వర్ణించెను కృష్ణుఁడు పరమేశ్వరుఁడని, సృష్టికిఁ బూర్వము జలమునకు హేతువని, సర్వ యజ్ఞ కర్తయని, వరాహాద్యవతారములెత్తినవాఁడని, మధుకైటభులను సంహరించినవాడని, బలి నణఁగఁద్రొక్కినవాఁడని, మఱి యెన్నియో సంగతులనుఁ జెప్పెను. ఇవి యన్నియు విష్ణుపారమ్య బోధకములైన విషయములు, వీని నన్నింటిని నన్నయగారు వదలిపెట్టెను. హిందూమతమును రక్షించుటకు నన్నయగారు భారతమును వ్రాసినచో నీ భాగములను వదలి పెట్టరాదు గదా.

మందపాల చరితములో మందపాలుఁడు వైశ్వానరుని నగ్నిఋక్కులతో స్తోత్రముచేసెను. మందపాలుని కుమారులైన స్తంబమిత్రుఁడును, ద్రోణుఁడును ఋగర్థములతో వహ్నిని స్తోత్రముచేసిరి. ఈ స్తోత్రము లేమియు నన్నయగారి భారతములో లేవు. ఇవి ఋగ్వేదములోని యగ్నిసూక్తములకు వ్యాసమహర్షి వ్రాసిన శ్లోకములు. హిందూమతము వేదముల నాశ్రయించియున్నది కదా. ఋగర్థములను వదలిపెట్టినవాఁడు హిందూమతమును సంరక్షించుటకు వ్రాసె ననుట యెట్లు పొసగును. ద్రౌపదీ వస్త్రాపహరణ సందర్భమున దుశ్శాసనుఁడు ద్రౌపది చీరలాఁగఁ బోవుచుండఁగా ద్రౌపది శ్రీకృష్ణుని బహు శ్లోకములతోఁ గీర్తించెను.

శ్లో॥ ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యా చింతితో హరిః
గోవింద ద్వారకావాసిన్ కృష్ణ గోపీజనప్రియ

కౌరవైః పరిభూతాం మాం కిం న జానాసి కేశవ॥
హే నాథ హే రమానాథ ప్రజానాథార్తినాశన
కౌరవార్ణవమగ్నాం మా ముద్ధరస్వ జనార్దన॥
కృష్ణ కృష్ణ మహాయోగిన్ విశ్వాత్మన్ విశ్వభావన
ప్రపన్నాం పాహి గోవింద కురుమధ్యేఽవసీదతీం ॥
ఇత్యనుస్మృత్య కృష్ణం సా హరిం త్రిభువనేశ్వరం
ప్రారుద ద్దుఃఖితా రాజన్ముఖ మాచ్ఛాద్య భామినీ ॥
యాజ్ఞసేన్యా వచ శ్శ్రుత్వా కృష్ణో గహ్వరితోఽభవత్
త్యక్త్వా శయ్యాసనం పద్మాం కృపాళుః కృపయాఽభ్యగాత్ ॥
కృష్ణంచ విష్ణుంచ హరిం నరంచ త్రాణాయ విక్రోశతి యాజ్ఞసేనీ
తతస్తు ధర్మోఽంతరితో మహాత్మా సమావృణోద్వై వివిధై స్సువస్త్రైః॥

నన్నయగారిభాగము నేమియుఁ దెలుఁగు చేయలేదు. ప్రాతిగామి పిలిచి నప్పుడు ద్రౌపది రాకపోవుటచేత దుర్యోధనుఁడు దుశ్శాసనునిఁ బంపించెను. దుశ్శాసనుఁ డామెను జుట్టుపట్టుకొని తీసుకొని వచ్చెను. అప్పుడు ద్రౌపది

ఇది యుచితమ్ము గాదనక యిక్కురుముఖ్యులు సూచుచుండ దు
ర్మదుఁడయి వీఁడు నన్ను నవమానితఁ జేసెడి సర్వధర్మ సం
విదు లన నున్న యీ భరతవీరుల వంశము నేఁడధర్మ సం
పద నతి నింద్య మయ్యె నని భామిని కృష్ణుఁ దలంచె భీతయై ॥

ఈ పద్యములో నున్న చివరి వాక్యము తప్ప నన్నయగారు వేఱే ప్రస్తావన చేయలేదు. వ్యాసమహర్షి భారతమునఁగథ గజేంద్ర మోక్షణమువలెఁ గలదు. ఇచటం గథకుఁ బ్రాముఖ్యము కలదు. కాని భగవద్భక్తికిఁ బ్రాముఖ్యము లేదు. ఈ రీతిగా బహు స్థలములయందు నన్నయగారు మత విషయములకుఁ బ్రాధాన్య మీయక, కథకే ప్రాధాన్య మిచ్చిరి. ఇట్టి సందర్భములో నన్నయగారు మతమునకుఁ బ్రాధాన్య మిచ్చి భారతమును వ్రాసిరనియు. యజ్ఞయాగాది క్రతువులను రక్షించుటకు భారతము వ్రాసిరనియుఁ జెప్పెడిమాట లప్రామాణికములు. నన్నయగారిని జాగ్రత్తగాఁ జదివి చెప్పిన మాటలుకావు. వ్యామోహము చేతఁ బలికిన మాటలు.

నన్నయగారు ప్రధానముగాఁ దాను భారతము నాంధ్రీకరించునపుడు తన కావ్యమునందు మూఁడు గుణము లుండునని చెప్పెను. మొదటిది; కథాకలితార్థ యుక్తి రెండవది: యక్షరరమ్యత. మూడవది: నానారుచిరార్థసూక్తినిధిత్వము. చివరి రెండు గుణములు సర్వజన విదితములైనవే. మొదటి గుణమే గ్రహించుట

కష్టము. దానిని గ్రహించలేకపోవుట యట్లుంచి దుర్వ్యాఖ్యానము చేయుట దుర్మేధా విలసితము.

నన్నయగారు తన కథలు వ్యాసుని కథలకంటె నెక్కువ రమణీయములుగాఁ జేసెను. నన్నయ్య తన్నుఁ గూర్చి తాను 'లోకజ్ఞు నుభయభాషా కావ్యరచనాభి శోభితు'నని వ్రాసికొనినాఁడు. తాను లోకజ్ఞుఁడనని చెప్పుకొనినాఁడు. ఆయన యెంత లోకజ్ఞుఁడో నేను నా వ్రాసిన 'నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి' యన్న గ్రంథమున నిరూపించితిని. ఆయన లోకజ్ఞత్వమును మనము గ్రహించినఁ జాలును. చాలమంది నేఁడు ఆయన యలౌకికుఁ డని వృథాభాష లాడుచున్నారు. ఆయన యలౌకికుఁడు కాఁడు. అలౌకికుఁడు కవియే కాలేఁడు. వ్యవహార విదుడు కానివాఁడు కవి యగుట కష్టము. వ్యవహారవిదులు కానివారు నన్నయ్యగారిని నిరాకరించవచ్చును. వారిని గుఱించి యెవ్వరు నేమియుఁ జేయలేరు. వారికి 'నమోవాకం ప్రశాస్మహే.'

లోకమునం దందఱును గవులే, 'కవయతీతి కవిః' కవయతి యనఁగా వర్ణయతి వర్ణించుచున్నాఁడు. కావ్యమంతయు వర్ణనమే ఒక సన్నివేశమును జెప్పుటయు వర్ణించుటయే. కథను వ్రాయుటయు వర్ణించుటయే. ఈ వర్ణన బహు విధములుగా నుండును. కథారూపమున నుండును. సన్నివేశ రూపమున నుండును. ప్రసంగ రూపమున నుండును. వస్తు స్వరూప నిర్ణయ రూపమున నుండును. కాని యీ వస్తు స్వరూప నిర్ణయ రూపమున నున్నది మాత్రమే వర్ణన మని లోకము నందు సామాన్యముగా ననుకొనఁ బడుచున్నది. ఉషఃకాలము, వసంతఋతువు, అటవి, నదులు, గిరులు, స్త్రీలు, ఒక పురుషుని యొక్క రూపము ఇట్టివాని గుఱించి చేసిన వర్ణనము మాత్రమే వర్ణనమని, తక్కినది కాదని సామాన్యాభిప్రాయ మేర్పడెను. నిజానికి నీ పై చెప్పిన విషయములవంటి విషయములను నేర్పుతో స్వభావోక్తి యుపమోత్ప్రేక్షారూపకాద్యలంకారములతో వర్ణించిన కవిని లోకము నందు గొప్ప కవిగా భావింతురు. కవి కొంత శక్తిమంతుడైనచో నీ వర్ణనములు రమ్యములుగానే చేయవచ్చును. ఇంతకంటె నధికమైన శక్తిమంతుడు యథార్థమైన వర్ణనము యొక్క స్వరూపముఁ దెలిసినవాఁడు వేఱొకఁ డుండును. అతఁడు మహాకవిశబ్దవాచ్యుఁ డతఁడొక్కఁడే యగును. నన్నయ్యగా రట్టి వర్ణనములు చేయును. ఆ వర్ణనము లెట్లుండు ననఁగా లౌకిక దృష్టితో జూచి చేసెడి వర్ణనములు కావు. దానికాంతరదృష్టి కావలయును. ఈ పద్యముఁ జూడుఁడు ద్రౌపదినిఁ బార్థుఁడు తన యింటికిఁ దీసికొని వచ్చెను. "మేమొక్క భిక్షఁదెచ్చితి

మని తల్లికి నివేదించిన నెఱుంగక యెప్పటి యట్లకా వగచి కుంతీదేవి సంతసిల్లి దాని మీ రేవురు నుపయోగింపుఁడని కొడుకుల నియోగించి" ఈ మాటతో ధర్మసందేహ ముద్భవించినది. ఇచట నన్నయగారొక పద్యమును వ్రాసెను.

ఆ లలితాంగియందు హృదయంబులు దృష్టులు నిల్పి పాండు భూ
పాలకుమారపంచకము పంచశరాహతిఁ బొందె నొక్కతన్
బాలికఁ దొల్లి యేవురికి భార్యనుగా సృజియించియున్న య
య్యాలరి బ్రహ్మ చెయ్దు పరమార్థము గాకది యేల యొండగున్॥

ఇది యాశ్చర్యకరమైన విషయము. అర్జునుఁ డామెను గెలిచి తెచ్చెను. న్యాయముగా నతని కామె భార్య కావలయును. లోకములో నలుగురన్నదమ్ము లున్నచో వారిలో నొకరి కేర్పడిన పెండ్లికూఁతుమీదఁ దక్కిన సోదరులకుఁ గోర్కి కలుగదు. ఇది సృష్టిలోని రహస్యము. ఇది స్వభావము. దీనికి వ్యతిరేకముగా ద్రౌపదియందుఁ బంచపాండవులు పంచశరాహతి బారి కగ్గమైనా రనుట విలక్షణమైన రచన, లోకము నెఱింగి దానికంటె విశేషమైన యొక సన్నివేశము వచ్చినపుడు లోకాతిశాయి యైన యా విషయమును నిరూపించి చెప్పుట ఈ పద్యము నందలి మొదటి రెండు చరణములలోని యర్థము వ్యాసమహర్షి వ్రాసినదియే. తక్కిన రెండు చరణములలోననే నన్నయగారి విశేష మున్నది. ఈ యర్థముఁ దెలిసికొని నన్నయగారు వ్రాసిన వ్రాఁత లోకమునకంటె భిన్నముగా నున్న యీ యనుభవమును బ్రహ్మ చెయ్దుగా నిరూపించుట నన్నయగారు వ్రాసిరి. ఇది సామాన్య వర్ణనముకంటెఁ బై మెట్టు విషయము.

శకుంతలోపాఖ్యానమున.

విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథ యీ పుత్రగా
త్ర పరిష్వంగ సుఖంబుఁ సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్రపరాగప్రసరంబు చందనము చంద్రజ్యోత్స్న యున్ బుత్రగా
త్ర పరిష్వంగము నట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే॥"

సంస్కృత భారతములో

"న వాససాం న రామాణాం నాపాం స్పర్శ స్తథావిధః
శిశోరాలింగ్యమానస్య స్పర్శ స్సూనో ర్యథా సుఖః

అని మాత్రమే కలదు. దానిని నన్నయగా రిట్లు తెలుఁగు చేసిరి. మఱియు నిందులో నొక విశేషము కలదు. శకుంతల తన కొడుకునుఁ జూపించుటలో నతని

స్పర్శ యిట్టిదని చెప్పుటలో నన్నయగారు వేరే యర్థమును నిక్షేపించిరి. తన్ను దుష్యంతుఁడు నిరాకరించఁగా, నా బిడ్డయే తన బిడ్డ కాదనఁగా నతనిని నీవు కౌఁగిలించుకొనుము. పుత్రస్పర్శ యిటువంటిది. యితనిస్పర్శ నీ కట్టిది యైనచో నీ విషయము ఋజువగునుగదా, యన్నట్లు చెప్పినది. ఇది మహావిషయము. సర్వగుణములు రక్తనిష్ఠమై యుండును. ఉత్తములకుఁ బుత్రులయొక్క, భార్యయొక్క స్పర్శ యవిదితమైన విషయమునకు నిరూపకమైన సాక్ష్యము. రక్తగతమైన యీ మహాగుణము నాశ్రయించియే భవభూతి తన యుత్తర రామచరిత్ర నాటకమును వ్రాసెను. భాసుఁడు తన ప్రతిమానాటకములో, దిఙ్నాగుఁడు కుందమాలలో రామచంద్రునియొక్క కుశలవుల తోడి సమాగమము నీ రక్తనిష్ఠమైన గుణము మీఁదనే యాధారపడి వర్ణించిరి. భవభూతి నాటకములో సీతాస్పర్శము వలన రామచంద్రుఁడు మూర్ఛనుండి లేచుట దీనికంటె భిన్నమైన విషయము. ~~ఈ~~ మహావిషయమునే నన్నయగారీ పద్యమునందు వర్ణించిరి.

నన్నయగారు తానొక విషయమును గాఢముగా నాలోచించికాని వ్రాయరు. ద్రౌపదీవస్త్రాపహరణ విషయమున భారతమునం దిట్లున్నది.

ఆకృష్యమాణే వసనే ద్రౌపద్యాస్తు విశాంపతే
తద్రూప మపరం వస్త్రం ప్రాదురాసీ దనేకశః॥
నానారాగ విరాగాణి వసనా న్యథ వై ప్రభో
ప్రాదుర్భవంతి శతశః ధర్మస్య పరిపాలనాత్॥

తతో హలహలా శబ్ద స్తత్రాసీద్ ఘూరవిస్స్వనః
తదద్భుతతమం లోకే వీక్ష్య సర్వే మహీభృతః॥
శశంసు ర్ద్రౌపదీం తత్ర కుత్సంతో ధృతరాష్ట్రజం
శశాప తత్ర భీమ స్తు రాజమధ్యే బృహత్స్వనః॥

దీనిని నన్నయ్యగా రిట్లు తెనుఁగు చేసిరి.

ఇది సేయఁగాదని మది విచారింపక సద్ధర్షితుండు దుశ్శాసనుండు
నెట్టన ద్రౌపది గట్టిన పుట్టంబు సభలోన విడ్చె నాశంక లేక
యుడుగక యొలువంగఁబడియు మున్నపనీతమైన తద్వస్త్రంబునట్టివలువ
లలితాంగి జఘనమండలముఁ బాయక యొప్పుచునున్న నయ్యువిదఁ జూచి
సభ్యులెల్ల నుదితసమ్మదు లయిరి దుశ్శాసనుండు వస్త్రచయము పర్వ
తోపమాన మైన నొలువంగనోపక యుడిగె లజ్జఁబొంది యుక్కు దక్కి॥

ఇట్టు భీమసేనుఁడు ద్రుపదరాజనందనకు దుశ్శాసనుండు సేసిన యవమానంబు సూచి, కోపరక్తాంత నయనుం డగుచు నంతకాకారంబున దంత సందష్ట దారుణముఖుండయి యెల్లవారును విన నిట్లనియె.

వివిధములైన యనేక వర్ణములు కలిగిన వసనములు పుట్టుచున్నవి. దీనికి హేతువు ధర్మము పరిపాలింపఁబడుట, సభలోఁ బెద్ద ధ్వని కలిగెను. ఈ యద్భుత మునుఁ జూచి రాజు లందఱు ద్రౌపదినిఁ బొగడిరి. దుర్యోధనునియందుఁ గుత్స వహించిరి. భీముఁడు శపథముఁ జేసెను. నన్నయగారు వస్త్రములయొక్క నానా రాగవిరాగత్వము వర్ణించలేదు. అది యనవసరము. జనులలో హాలాహలశబ్ద ముదయించినది. దానిని నన్నయగారు వదిలి పెట్టిరి. ఇది యొక మహాఘోరము జరుగుచున్నపుడు జనులు నిస్తబ్ధులై నీరవులై యుండిపోదురు. అందుచేత నన్నయగారు దానిని వదలిపెట్టెను. ఆమెను జూచి సభ్యులుదితసమ్మదులయిరి. ప్రశంసించలేదు.

నన్నయగారు భారతకథను జూచిన చూపు వేఱు. ఆ దృష్టిలోని విశేషము తెలియుటకుఁ జాల జాగ్రత్తగాఁ జదువవలయును. దుర్యోధనుఁ డన్నచో నందఱకు భయము. అతని నెదిరించఁ గలవాఁడొక్క విదురుఁడే. తక్కిన యెవ్వరును సభలో మాటాడుటకు వీలులేదు. ఇది రాజసభామర్యాద. రాజసభలో నొక మహాఘోరము జరుగుచుండవచ్చును. జనులు తమలోఁదా మెంత గుబ్బిసలాడినను జనులు క్రిక్కు రు మనుటకు వీలులేదు. రాజుయొక్క యిష్టమునకు వ్యతిరేకముగా సభలో నెవఁడు తన మనోభావములనుఁ బ్రకటించుటకు సాహసించునో వానిని వెంటనే రాజభటులు నిగ్రహింతురు. ఆ మర్యాద తెలిసిన నన్నయ యిట్లు వ్రాసెను.

మఱియుఁ 'తద్రూపమపరం వస్త్రం ప్రాదుర్భవతి' యన్న మాటను నుడుగక యొలువంగఁ బడియును మున్నపనీతమైన తద్వస్త్రమ్మునట్టి వలువ లలితాంగి జఘనమండలమునఁ బాయక యొప్పుచున్న" దని నన్నయగారు తెలుఁగుఁజేసిరి. ఈ తెలుఁగు సేతలోనున్న సొగఁసేమి? ద్రౌపదికి మానభంగము చేయవలయునని దుర్యోధనాదుల యూహ. మానభంగ మనఁగా నేమి? ఆమె వివస్త్రయగుట. వివస్త్రత యనఁగా నగ్నత, నగ్నత యనఁగా నేమి? ఇచట విచారణ చేయవలెను. వస్త్రము ధరించినందువలన శరీరావయవములు కప్పఁబడు నని యనుకొందుము. కప్పఁబడుట యనఁగా నొక వస్తువుయొక్క స్వరూపజ్ఞాన మేర్పడకుండ నుండుట. శరీరము యొక్క నగ్నత్వ మనఁగా శరీరాంచలములు భాసించుట. మనకొక వస్తువు కనిపించుచున్న దనఁగా నా వస్తువుయొక్క యవధిభూతములయిన

రేఖలు సుస్పష్టముగాఁ గనిపించుటయే, ఒక పేటికను జూచితిమి. ఒక ఘటమును జూచితిమి. మఱి యింకొక వస్తువును జూచితిమి. తద్వస్తువు యొక్క లోపలి భాగమును జూడలేదు. దాని పై యంచులనుఁ జూచితిమి. ఈ యంచులు రేఖలు. దృష్టికిఁగనిపించునది రేఖ. అందుచేతనే చిత్రకారుఁడు రేఖలతో మనకు వస్తుదర్శన మీయ గలఁడు. వస్త్రముచేత శరీరాంచలరేఖలు కప్పఁబడును. అపుడు శరీరము వస్త్రాచ్ఛాదితమైనదని చెప్పుదుము. అంచల రేఖలు విస్పష్టముగా భాసించుచు దానిపయిన వస్త్రమున్నను వస్తువు వస్తువుగా భాసించును. కొందఱు పెట్టెలకు మాసిపోకుండఁ బైన గుడ్డలు వేసి కుట్టింతురు. పెట్టె కనిపించుచునే యుండును. ఆ పెట్టె కనిపించుటలేదు. పెట్టె యని గుర్తుపట్టుటకు వీలులేదని చెప్పుటకు వీలులేదు. పురుషులు వస్త్రములు ధరించుట యీ ప్రయోజనము కొఱకు. శరీరాంచల రేఖలు భాసించకుండ ముడుతలతోఁ, గుచ్చెళ్ళతో, మడతలతో వస్త్రములను ధరించుట పేరు వస్త్రము ధరించుట. నగ్నత లేకుండఁ జేయుట. శరీరము నంటుకొనియున్న వస్త్రము నగ్నతను రక్షించదు. అందుచేతఁ బాశ్చాత్యులు వేయు దుస్తులు నగ్నతను సరిగా రక్షించవు. అది యనాగరకమైన వేషము. భారతీయులు కుచ్చెళ్ళు పెట్టుకొని కట్టెడు ధోవతి పరమ నాగరికమైన వేషము.

అట్టి కుచ్చెళ్ళు, నట్టి మడతలు - నేది తొలఁగినను నగ్నత భాసించును. ద్రౌపది ధరించిన చీర యామెయొక్క నగ్నతను రక్షించునదిగా నున్నది. దుశ్శాసనుఁ డొక చీర తీసిన తరువాత మఱియొక చీర యచట భాసించినచో నది తొలఁ గియిది వచ్చులోన నగ్నత భాసించును. గాలిచేతఁ జీర తొలఁగినప్పుడే వేణీ సంహారమున దుర్యోధనుఁడు భానుమతీ విషయమున నాటకాంగమైన గండము నిక్షేపించు స్థలములో నూరు ప్రస్తావన చేసెను. అది నగ్నత. నగ్నత రేఖామాత్రమున భాసించినను ద్రౌపదికిఁ బరాభవము జరిగినట్లే. అందుకనియే 'మున్నపనీతమైన తద్వస్త్రమ్మునట్టి వలువ' యని చెప్పుట నానారాగ విరాగములైన వసనములైనచో నొలిచిన వలువకు మఱల మొలిచిన వలువకు భేదమేర్పడి నగ్నతాభ్రాంతి కలుగ వచ్చును. తద్వస్త్రము నట్టివలువ యనుటచేత నొకవలువ యొలువఁబడినది లేదు. మఱియొక వలువ, తత్స్థానీయమైనది మొలిచినట్లు లేదు. నగ్నతలేదు సరికదా నగ్నతాభ్రాంతికూడ లేదు. ఇది యాశ్చర్యమైన రచన. నన్నయగా రీ విషయము నంత పరమ సూక్ష్మముగా విచారించి, యా మాటల నచ్చటఁ బొదివెను. పరమేశ్వరానుగ్రహ మన్నచో నింత పరాభద్రమైన స్థితి యేర్పడుటయే. నగ్నత యనఁగా నేమి? యన్న విషయమును బహుముఖములుగా విచారించిన మహామేధాశాలికాని యిట్లు వ్రాయలేఁడు. పాశ్చాత్య దేశములలోఁ గొందఱు స్త్రీలు

నగ్న నృత్యమును చేయుదురు. వారు నిజముగా నగ్నలుకారు. శరీరవర్ణము వంటి వర్ణము కలిగిన సన్నని బనియను లాపాదమస్తకము తొడిగికొనెదరట. ఐనను దానికి నగ్న నృత్య మనియే పేరు. ఎందుచేత? శరీరాంచల రేఖలు సుస్పష్టముగాఁ గనుపించును. కనుక, అది నగ్నత యొక్క స్వరూపము. దానినిఁ దెలిసి నన్నయ్యగారు ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టము నిట్లు రచించినారు. ఇది నిజమైన వర్ణన. ఇట్టి వర్ణన చేయఁ గలవాఁడు మహాకవి. వసంతకాలము వచ్చినది; పూవులు పూచినవి; కోకిలలు కూసినవి; చివుళ్ళెత్తఁబడినవి; సన్నని గాలి వీచినది-ఇదియు వర్ణనయే. మధురమైన శబ్దములతో నీమాత్రమైన వర్ణనచేసినవాఁడు గూడ మహాకవి యని చెప్పఁబడుట మహాకవిత్వ మెట్టిదో తెలియక పోవుట.

ఇట్లు బహుస్థలములయందు నన్నయ్యగారు తాను లోకోత్తరములయిన విషయములను మననము చేసి, భావనచేసి, తన కావ్యమునందు నిక్షేపించినాడు.

ఇది స్థూలముగా నన్నయ్యగారు మహాకవి యగుట చెప్పుట యైనది. ఆయన మహాశిల్పి కూడాను. అట్టి శిల్పము నాన్యతో దర్శనీయము. శిల్పము కథాగతమై యుండును. కథను రచించుటలోఁ గథ యొక్క పౌర్వాపర్యములు విచారించి కథ యొక్క యాయుపుపట్టులు తెలిసికొని యవి సువ్యక్తమగుటకుఁ గొన్ని మెలఁకువ లుపయోగించుట శిల్పమని చెప్పవచ్చును. దానికిఁగూడ రెండుదాహరణములు చూపించెదను. శకుంతలోపాఖ్యాన మున్నది. ఇది భారతములోని కథ. ఈ కథను గవికుల గురువైన కాళిదాసు తీసికొని, దాని కవధిభూతమైన మెఱుఁగులుచేసి వదలి పెట్టెను. ఆ కథను మఱియెవ్వఁడును ముట్టుకొనుటకు వీలులేదు. అట్టి కథను భారతము తెలుఁగుఁ జేయుట కారంభించిన నన్నయ్యగారు వ్రాయకతప్పదు. యథామూలముగా వ్రాసినచో దోష మేమియు లేదు. కాని కథలుమార్చి, మెఱుఁ గులు చూపవలె నన్న దృష్టితో వ్రాసెడుకవికిఁ గష్టమగును. నన్నయ్యగారు వ్యాసుఁ డు వ్రాసిన కథల కన్నింటికి మెఱుఁగులు దిద్దినవాఁడు. ఇంక మెఱుఁగులు దిద్దుటకు వీలులే దన్నట్లు కాళిదాసు వ్రాసిన శకుంతల కథలో మెఱుఁగులు దిద్ద వలసివచ్చినది. ఇందులో రెండు మెఱుఁగులు చేసెను. మొదటిది; శకుంతలా పాత్రపోషణము కాళిదాసు తన మహాధ్వనిమయమైన కావ్యములో రసదృష్టితో వెళ్ళినాఁడు. కనుక శకుంతలాపాత్రమును రసదృష్టితోఁ దీర్చినాఁడు. కాని పాత్ర సృష్టితోఁ దీర్చలేదు. నన్నయ్యగారి కది వీలిచ్చినది. ఆయన శకుంతలనుఁ జిత్రముగాఁ దీర్చినాఁడు. నన్నయగారు స్త్రీ పాత్రలను సృష్టించుటలో నందెవేసిన చేయి. ఇక్కడ నది ప్రసక్తము కాదు. కథను నడుపుటలో నాయన చూపిన శిల్పమునుగదా

చెప్పవలయును. దుష్యంతుఁడు కణ్వాశ్రమమునకుఁ బోయెను. శకుంతలను జూచెను. ఆమెయం దతనిమనస్సు తగుల్కొన్నది. ఆమె బ్రాహ్మణకన్య యని యనుమానము. అంతటి సత్పురుషుఁడైన దుష్యంతమహారాజునకుఁ దనకు వివాహయోగ్యకాని స్త్రీ యందు మనస్సు లగించదు. ఇది సత్పురుషలక్షణము, సత్పురుషునియొక్క మనస్సు ధర్మేతర విషయమునందుఁ బ్రవర్తించదు. ధర్మేతరమైన యూహయే యతనికి రాదు. అందుకనియే కాళిదాసుయొక్క దుష్యంతుఁడు తనకుఁ గలిగిన సందేహమునుఁ దన యంతఃకరణ ప్రకృత్తి యొక్క సాక్ష్యమువలనఁ దానే దొలఁ గించుకొనెను. "అసంశయం క్షత్ర పరి గ్రహక్షమా యదేతదస్యా మభిలాషి మే మనః సతాంహి సందేహపదేషు వస్తుషు ప్రమాణ మంతఃకరణ ప్రవృత్తయః॥" తాను సత్పురుషుఁ డగుటచేతఁ దన యంతఃకరణ ప్రవృత్తి తప్పుదారులను బోదు కనుకఁ దన మనస్సు శకుంతలమీఁదఁ దగులుకొన్నది. కనుక నామె తప్పకుండ క్షత్రపరిగ్రహయోగ్యయని నిర్ణయించుకొనెను. దీనిని నన్నయగారు.

"ఇది మునికన్యయేని మఱి యేలొకొ యీ లలితాంగియందు నా
హృదయము తద్దయుం దవిలె నిప్పలు కెంతయు నమ్మనేఱ నయ్యెద"

ననిమాత్రము వ్రాసి వదలిపెట్టిరి. కాళిదాసువలె హేతువు చెప్పలేదు. కాళిదాసు చెప్పిన హేతు విచ్చట ననుమీయమాన మగుచున్నది. ధ్వనిత మగుచున్నది. తాను కాళిదాసు తరువాత వ్రాసినవాఁడు కావున నన్నయ్యగారీ విశేషము నిందుఁ జేసెను. కాళిదాసు ననుసరించెను. కాని నూతన కవితాగుణ సంధానము చేసెను.

నన్నయగారి శిల్ప మిదికాదు. ఈ రీతిగా శకుంతలఁ జూచి దుష్యంతుఁడు సందేహపడినాఁడు. ఆమె క్షత్రపరిగ్రహయోగ్యయన్న విషయము నిశ్చయింపఁ బడు వఱకుఁ గథ యాఁగిపోయినది. ఆవిడ రాజపరిగ్రహయోగ్య యని నిర్ణయింపఁ బడిన తరువాతఁ గదా కథ సాగును. కనుక నిది యొక క్లిష్టఘట్టము. కథ యారంభించి యొక ధర్మసందేహము వచ్చి, కథా ప్రసారము నిలిచిపోయినది. ఆ సందేహము నివర్తింపఁబడిన తరువాతఁగాని మఱలఁ గథ యందుకొనదు. ఇది రసప్రవాహము కట్ట నిలిచిపోయిన ఘట్టము. దీనిచేతఁ బాఠకుని బుద్ధి రసమునుండి మఱలును. ధర్మ విషయమునఁ బ్రవర్తించును. మఱల రసము నందుకొనువేళకు బుద్ధి పరిస్రస్తమయి పోవును. పాఠకుని బుద్ధియందుఁ గలుగు నీ మార్పును సరిదిద్దుకొనుట మహాకవి తన శిల్పముచేతఁ జేయవలయును.

శకుంతల తన జన్మ వృత్తాంతమును జెప్పెను. ఈ సందియము వివృతమైన

ఇప్పుడు శకుంతలను జూచినవేళ దుష్యంతునకుఁ గలిగిన కోరిక నందిపుచ్చుకొని కథ నడువవలయును. కవి యా కోరికకును సేతుబంధము కట్టవలయును. వంతెన కట్టుట యనఁగా గాలువకు రెండువైపుల రెండు పెద్ద స్తంభములను నిర్మించ వలయును. ఆ రెండు స్తంభములు సమానమయినవి. ఒకటేరీతిగా నుండును. నిర్మాణ పద్ధతియందధిక సామ్యముండును. ఈ శకుంతలా జన్మవృత్తాంత కథా ప్రవాహమునకు రెండు సమానములయిన స్తంభములను ననఁ గాఁ బద్యములను వ్రాయుట యొక మహాశిల్ప లక్షణము.

ఇది మునికన్యయేని మఱి యేలొకొ యీ లలితాంగియందు నా
హృదయము తద్దయుం దవిలె నిప్పలు కింకను నమ్మనేల న
య్యెద విజితేంద్రియుండనఁగ నమ్మునిఁ బాయక విందునంచుఁ దా
నిది కలరూపెఱుంగ నవనీపతి యుత్సుకుఁడయ్యె నాత్మలోన్॥

ఇది మునినాథ కన్యయని యెంతయు నిస్పృహవృత్తినున్న నా
హృదయము రాజపుత్త్రినని యి క్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిఁగించిన న్మదనబాణ పరంపర కిప్పు డుండ నా
స్పదమయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్॥

ఇవి రెండును రెండు మహాస్తంభములు అవాంతర కథా ప్రవాహ సేతునిబంధకములు, ఇది యొక మహాశిల్ప లక్షణము. కథలోనున్న యీ ఘట్టము యొక్క సువిస్పష్టమైన విభాగము తెలిసినఁగాని యిట్టి నిర్మాణము కవి చేయలేఁడు. ఇది మహాకవియే చేయఁగలఁడు. ఇట్లు చేసినవాఁడే మహాకవి.

మఱి యింకొక మహాశిల్ప విషయమును జూపించెదను. పాండవులను జూద మాడుటకు విదురుఁడు పిలిచికొనివచ్చెను. పాండవులు వచ్చిరి. వారును, వీరును దగ్గఱి చుట్టములు, మనసులలో శైత్యము లున్నను, బై పరామరికలకు లోపముండదు కదా. ఈ పరామర్శలు జరిగెను. ఇక్కడ నుండి కౌరవ పాండవులు జూదమాడుట ద్రౌపదీ వస్త్రాపహరణము, ధృతరాష్ట్రుఁడు ద్రౌపదికి వరములిచ్చుట-యీ మొదలయిన కథలు జరుగును. ఈ కథలోని ప్రధాన విషయము ద్రౌపదియొక్క పరాభవము. రాజు లెంతమంది జూదమాడరాదు. ఓడిపోరాదు. ఈ జూదములో నున్న విశేషము ద్రౌపదీ పరాభవము. ఇట్టి కథ యెందును జరుగలేదు; జరుగదు. కనుక నీ కథలో ద్రౌపది ప్రధాన పాత్ర వహించును. ఒక్క పరాభవము పొందుటచేతనే గాదు. పాండవులకుఁ దిరిగి రాజ్యప్రాప్తి కలుగుటకు నామెయే హేతువు. ఇంతకును దుర్యోధనాదుల కోపమంతయు ద్రౌపదిమీద నున్నది. ఆమె

యైదుగురి భార్యయగుట నామె యందుఁ బరులకు వాంఛ కలుగుటకు హేతువైనది. ఆమె సర్వజనసామాన్య కావలయును, గాని పాండవులకు భార్యయేమి? అందులోఁ బతివ్రతయేమి? మహారాణి యేమి? ఇవి యన్నియుఁ బైకిఁ జెప్పని దుర్యోధనాదుల మనసులలోని యూహలు. మాత్సర్యము చమత్కారమైనది. ఈ మాత్సర్యము ద్రౌపదీ విషయమునఁ గౌరవులకే కాదు; కౌరవుల భార్యలకుఁ గూడఁ గలదు.

ఈ సర్వవిషయములచేతఁ బాండవ కౌరవ ద్యూత కథాసౌధ మూలస్తంభము ద్రౌపది. ఇది నన్నయ్యగారు చేసిన నిర్ణయము. అందుచేత నీ కథ యొక్క యాద్యంతములందు నన్నయ్యగారు ద్రౌపదిని నిక్షేపించిరి. గాంధారి కోడండ్రు.

అఖిల లావణ్య పుంజంబు నబ్జభవుఁడు
మెలఁతగా దీనియందు నిర్మించె నొక్కొ
కానినాఁ డిట్టి కాంతి యేకాంతలందు
నేల లేదని సామర్ష హృదయలైరి ॥

ఆమె యొక్క లావణ్యమును జూచి కౌరవుల భార్యలు చుప్పనాతితనమునుఁ బొందిరి. నన్నయ్యగారు వాడిన శబ్దము లావణ్యము, సౌందర్యము కాదు. లావణ్య శబ్దమునకు సౌందర్యమని సామాన్యముగా నర్థము చెప్పినను నిజమైన యర్థ మదికాదు. లవణము యొక్క భావము లావణ్యము. రాతి ఉప్పు పగులగొట్టినచో, బలకలు పలకలుగా నుండును. ఒక ద్రవ్యము పలకలు పలకలుగా నున్నపుడు, నది స్నిగ్ధమైన వస్తువైనపుడు దానిమీఁద సూర్యకిరణ ప్రసారము జరిగి యది తళతళలాడును. ఆ మెఱుపు లావణ్యము. స్త్రీ యొక్క శరీరచ్ఛాయయు, స్నిగ్ధత్వమును, బోషణచేత వచ్చిన సౌకమార్యమును, నైగనిగ్యమును-నివియన్నియు లావణ్యమనిపించుకొనును. అట్టి లావణ్యము ద్రౌపదీ శరీరమందుఁ గౌరవుల భార్యలు మాత్సర్యము వహించుఁ దగినంతగా నుండెను. దీనిచేత ద్రౌపదీ దేవియొక్క భోగలక్షణాధిక్యము వ్యజ్యమాన మగుచున్నది. అందుచేత వారు మత్సరము పడిరి. వారందఱూ రాత్రి తమ భర్త లందఱితో నామెయొక్క యీ భోగవైశిష్ట్యమునుఁ గూర్చి చెప్పియుందురు. వారందఱుకు ద్రౌపది యన్నచో, జుప్పనాతితనము బలిసినది. మఱునాఁడు జరుగఁబోవు నధర్మమునకు నందఱును హర్షించిరి. ఇంత ప్రయోజనకారిగా నన్నయ్యగారీ పద్యము నిచ్చట నిక్షేపించిరి. ఒక్క ద్యూత కథా మూల స్తంభమగుటయే కాదు. అట్టి మూల స్తంభ మగుటకుఁ బ్రధానకారణమయిన ద్రౌపది యందలి లక్షణములు, నా లక్షణములు వారి మాత్సర్యమునకు హేతువులు, నామాత్సర్యము ద్రౌపది పరాభవము హర్షించుటకు హేతువులు. ఈ రీతిగా

నన్నయ్యగారు ద్యూతకథా మహాభవన మూలస్తంభ మయిన ద్రౌపదినిఁ దొట్టదొలుత స్థాపించి, తరువాత ద్యూత కథలోనికి వెళ్ళిరి.

మఱియు నీ ద్యూతకథావసానము ద్రౌపది. ఆమెకు ధృతరాష్ట్రుఁ డిచ్చిన వరములచేతనే యా విచిత్ర ద్యూతఫల మహావైపరీత్యము మఱియొక త్రోవ పట్టినది. ఆ వరము లీయకున్నచో భారతకథ యేమి యయ్యెడిది? పాండవులు బ్రదికినన్నాళ్లు కౌరవ దాసులుగా నుండిపోదురా? ఉండిపోయెడివారు, భారతకథయే లేదు. పాండవులు దాసులై యుండి కౌరవులతో యుద్ధము చేయుదురా? ఇది యొక చిత్రమైన సమస్య. ఆ సమస్య సమాధానములేని సమస్య. ద్రౌపదిచేతఁ బరిష్కరించఁబడినది. ఈ రీతిగా ద్రౌపది భారతకథలో నున్న యనేకములయిన కథా ప్రవాహ భంజకము లయిన ఘట్టములలోఁ గథ సాగించిన యొక సహకారిణి. ఈ ఘట్టమునందు ద్రౌపదియొక్క ప్రాధాన్య మిట్టిది. దానినిఁ దెలిసికొని నన్నయగారు రచన చేసిరి. మహాకవి తాను వ్రాసెడి కథయొక్క స్వరూపము తెలిసికొని వ్రాయును. ఆ కథాగత సమస్యలను (బరిష్కరించును. ఆ పరిష్కరించిన వైఖరి ఘట్టములుగాఁ గనిపించును. ఆ ఘట్టములు మనకు సువ్యక్తములుగా నుండును. వాని యొక్క సువ్యక్తతచేతనే పాఠకులకు మహాకవి చేసిన కథానిర్ణయము తెలియును. అవి సువ్యక్తమగుటకు గవి నిరూపించిన విషయములు శిల్పతీర్థములు.

ఈ కథావసానమునందు మఱల నన్నయగా రిట్లు వ్రాసెను.

తలము: తరుణి ద్రౌపది యిట్లు పాండవ ధార్తరాష్ట్రులదైన భీ
కర పరస్పర కోప వేగము గ్రన్నఁ బాచి విపత్తి సా
గర నిమగ్నుల నుద్ధరించెఁ బ్రకాశ కీర్తుల ధీరులం
బురుషసింహములన్ నిజేశులఁ బూని దద్దయుఁ బ్రీతితోన్॥

ఈ రెండు పద్యములచేత ద్యూతకథయంతయు నెట్లు ద్రౌపదిమీఁద నాధార పడియున్నదో, భారతకథా ప్రవాహములో నిది యెటువంటిఘట్టమో నన్నయగారు నిరూపించిరి. ఈ రెండును నన్నయ్యగారి మహాశిల్పమున కుదాహరణములు. మఱియు నన్నయ్యగారు తన తెలుఁగు సేతఁలో ననంతములయిన సౌందర్యములు చేయుదురు. ఆంధ్రభాష కుజ్జీవన హేతువులయిన కొంత రచన చేయుదురు.

ఆహుతం చాగ్నిహోత్రం తే సూర్య శ్చాస్తంగతః ప్రభో
అగోపా శ్చాగతా గావః కచ స్తాత న దృశ్యతే ॥

ఇందులోఁ 'సూర్య శ్చాస్తంగతః' అన్నమాటను దీసికొని 'వాడి మయూఖముల్ గలుగువాఁ డపరాంబుధిఁ గ్రుంకె' నని తెలుఁగు సేఁత తరువాత వచ్చిన సర్వాంధ్ర కవులకు భావముచేఁత, తెలుఁగుభాషలో మెలఁకువతనముచేతఁ దెలుఁగు భాషయొక్క వ్యాకరణ విషయ మొకదానిని బోధించుటచేతఁ, బద్య మెత్తుగడలోని సొగసుచేత నాచార్యకముగా నున్నది. తరువాత నెందఱో కవు లిట్టి కూర్పులు కూర్చిరి. కాని యుపదేష్ట నన్నయ్యగారు 'వాఁడి మయూఖముల్' అన్న సమాసము లాక్షణికులచేత నుదాహరణముగాఁ దీసికొనఁబడినది. ఇట్టి వెన్నియో నన్నయగారి యందుఁ గలవు. తక్కిన కవులకు భాష స్వాధీన మగుటకుఁ గారణము నన్నయ్యగారు భాష స్వాధీన పడుటకు వేసిపోయిన రహదారులు. అట్టి వేలకొలదిఁ మార్గములలో నిది యొక్కటి.

వ్యాసుఁడు ప్రధానముగాఁ గథనుఁ జెప్పికొనుచుఁబోవును. భారతము విష్ణు పారమ్యబోధక మయిన గ్రంథము. శ్రీకృష్ణుని యొక్క పరమేశ్వరత్వ స్థాపనము వీలయినచోటుల నెల్లఁ జేయబడుచుండును. నన్నయ్యగారు భారతకథమీఁద బ్రధానముగా దృష్టికలవాఁడు. అందుకనియే 'కథాకలితార్థయుక్తి లోనారసి మేలునా' నని వ్రాసినాఁడు. భారతకథలో నున్న రమణీయత్వ మాయనకుఁ బ్రధానము. ఆ కథలోని మెఱుపులు చూపించుట యాయనకుఁ బ్రధానము అందుచేత మూలకథలో నున్న యద్భుతత్వము విష్ణుమాహాత్మ్యము, పువ్వులవానలు కురియుట మొదలయిన వానినిఁ బరిహరించును. రాజసూయయాగ సందర్భమున భీష్ముఁడు కృష్ణునియొక్క పరమేశ్వరత్వమును మిక్కిలిగా నుపన్యసించిన యనంతరమున సహదేవునకుఁ గోపమువచ్చి యీ క్రింది రీతిగా ననెను.

కేశవం కేశిహంతార మప్రమేయ పరాక్రమం
పూజ్యమానం మయా యో నః కృష్ణం న సహతే నృపః॥
సర్వేషాం బలినాం మూర్ధ్ని మయేదం నిహితం పదం
ఏవ ముక్తే మయా సమ్య గుత్తరం ప్రబ్రవీతు నః॥
మౌనినాం బలినాం రాజ్ఞాం మధ్యే వైదర్శితే పదే
తతోఽపత త్పుష్పవృష్టి స్సహదేవస్య మూర్ధని ॥

మౌనుల యొక్కయు, బలవంతులయిన రాజులయొక్కయు నడుమ సహదేవుఁడు తన పాదము నెత్తి చూపించఁగా సహదేవుని శిరస్సుమీఁదఁ బుష్పవృష్టి కురిసెను. దీని నన్నయ్యగా రిట్లు దెనిఁగించిరి.

ఎడపక యర్ఘ్య మచ్యుతున కిచ్చితి మిచ్చిన దీని కిం దొడం
బడమని దుర్జనత్వమునఁ బల్కెడి వీరుల మస్తకంబుపై
నిడియెద నంచుఁ దాఁ జరణ మెత్తె సభ న్సహదేవుఁ డట్టిచో
నుడిగి సభాసదు ల్పలుకకుండిరి తద్దయు భీతచిత్తులై ॥

తెలుఁగు సేఁతలోఁ బుష్పవృష్టి ప్రసక్తియే లేదు. సభలో నున్నవారందఱు భయపడి, పలుకకుండ నూఱకుండి రని వ్రాయఁబడెను. సహదేవుఁడు పాండవులలో నందఱికంటెఁ జిన్నవాఁడు. అన్నగారల కతఁడన్నచో ముద్దు. పట్టరానంత ప్రేమ. అతనిమీఁద నీఁగ వ్రాలనీయరు. ఒకవేళ నెవఁడయిన భీమార్జునుల నెదిరించి బ్రతికి పోవచ్చునేమోగాని సహదేవు నేమైనఁ జేసినచో భీమార్జునుల చేతులలో వాని మృతి తథ్యము. ఈ భ్రాతృవాత్సల్యము, నీ లోక స్వభావము దీనియందు ధ్వనితమగుచున్నది. పాండవుల పరాక్రమము దీనియందలి మహాధ్వని కనుక నన్నయ్యగారి కథాంశములమీఁద నున్నంత దృష్టి మతము మీఁద, వేదముల మీఁద, దేవతల మహత్త్వము మీఁద లేదు.

ఈ పద్యమునందు మఱియొక విశేష మున్నది. నన్నయ్యగారు రసభావవేత్త, ఈ సహదేవుని కోపము శిశుపాలవధ కథలో నున్న యొక చిన్న యవాంతర విషయము. ఈ కోపమును బెంచి వ్రాయవచ్చును. వ్రాసినచోఁ బ్రధాన కథకు ముప్పము జరుగును. కవి తాను బ్రవేశ పెట్టు నవాంతర రసములు కథ నడుమఁ గల చిన్ని చిన్ని సన్నివేశములు ప్రధాన కథాభంగకారులు కాకుండఁ జూచుకొన వలయును. సహదేవుని కోప మీ పద్యమునందు మొదటి మూఁడు చరణములందే కలదు. ఆ మూఁడు చరణములందు రౌద్రరసము భాసించినను, సభికులు పొందిన భయమునకు నీ రౌద్రరస మంగమై చెడిపోవుచున్నది. రౌద్రరసమునకు వ్యక్తిత్వము లేదు. సభలో నున్న వారి భయమున కది యంగమగుటచేత దాని యాయుర్దాయము స్వల్పము. ఈ సహదేవుని రౌద్రము పాండవుల పరాక్రమాతి శయమునకు దోహద మగుచున్నది. కాని స్వయంవ్యక్తిని సంపాదించుకొనుటలేదు. మఱియు నిచ్చట శ్రీకృష్ణుని పరమేశ్వరత్వముకంటెఁ బాండవుల పరాక్రమాతి శయమే ప్రధానమయినదిగా నేర్పడుచున్నది. ఇది రసదృష్టితోఁ చేసెడు కథారచన. నన్నయ్య సర్వరచనయందు నీమహాలక్షణము భాసించుచుండును. ఇది యంశతః చూడఁదగినది.

నేఁటి కాలమునఁ జాలమంది నన్నయ్యగారి యందు దోషము చూపించు చున్నారు. ఈ దోషములు చూపింపఁబోవుట యెందులకో తెలియదు. ఇందుచేత

మఱి యితర కవులు గొప్పవారనుటకో, కొన్ని దురభిమానములు పురస్కరించు కొనియో తెలియదు. సారస్వత ప్రీతి కవితా రసానుభవము ననేకావరణములు దాటినచోఁ బొందఁదగినది. ఈ యభిమానాదులు ఆవరణములు. వీనిని దాఁటినగాని రసానందములేదు. ఎవఁ డావరణముచుట్టు తిరుగుచుండునో వాఁడు లోనికిఁ బ్రవేశించుట జరుగదుగదా. ఒకప్పు డొక మిత్రునితో నీ క్రింది పద్యమునుగూర్చి కొంత చర్చ జరిగినది. ఆ మిత్రుడు గొప్ప పండితుఁడు, భావుకుఁడు. ఆయన యన్నచో నాకుఁ జాల గౌరవము. గౌరవమే కాదు. నాకు బంధువువంటివాఁడు. కాని యాయనకు నన్నయ్యగారి రచన యెక్కువ నచ్చదు. దాని కెవ రేమిచేయఁ గలుగుదురు. ఒకదృష్టితోఁ జూచిన నొక కవి యాధిక్యము తెలియఁగలదు. ఒక కవి యాధిక్యము తెలిసికొనుటకుఁ గావలసిన దృష్టి యొకనికిఁ బరమేశ్వరుఁడు ప్రసాదించకపోయినచో నదియేమి యౌషధమా సూదులతో నెక్కించుటకు? ఆ పద్యమిది.

అవిరళ సూర్యమండల సహస్ర సమప్రభమై ధనంజయ
ప్రవరు కరమ్మున వ్వెలుఁగు పాశుపతాస్త్రముఁజూచి దైత్య దా
నవ సుర యక్ష రాక్షసగణమ్ము కరమ్ము భయమ్మునందె నం
దవనియు దిర్దిరం దిరిగె నబ్ధి శిలోచ్చయ సంచయంబుతోన్ ॥

ధనంజయ ప్రవరుఁడు. ధనంజయుఁ డనగా నర్జునుడు. ఈ పేరు మీద శ్రేష్ఠవాచకము వేయుట తప్పని యా మిత్రుఁడనెను. అది సరికాదు. ధనంజయ శబ్దమునకు రెండర్థములు కలవు. అగ్నిహోత్రుఁడు నర్జునుఁడునని. ఈ యిద్దఱిలో శ్రేష్ఠుఁడని యిక్కడ నర్థము. అర్జునుని ధనంజయ ప్రవరుఁడనుటలో మఱియు నెంతో యర్థసంపత్తి కలదు. ఇద్దఱును గాండీవధారులు. గాండీవము వీతిహోత్రుని చేతిలో కంటె నర్జునుని చేతిలో నుండి యధిక వైశిష్ట్యమును సంపాదించుకొన్నది. ఆ అగ్నిహోత్రుఁడే తన వ్యాధినివారణము కొఱకుఁ ఖాండవవన దహనముకొఱకు నర్జును నాశ్రయించెను. అగ్నిహోత్రుఁడు పాశుపతాస్త్ర మెఱుఁగఁడు. ఈ రీతిగా నతఁడు ధనంజయ ప్రవరుఁడు.

కరమ్మున వ్వెలుఁగు పాశుపతాస్త్రము. అస్త్రమనఁగా మంత్రము. అది చేతిలోఁ బ్రకాశించుట యేమి? లోకములో 'వాని చేతిలో నావిద్య యున్నది' యందుము. ఆ విద్య వానికి వశమైనదని లక్షణార్థము ఈ యర్థములోఁ దెలుఁగు జాతి వాడుకొనునట్లు రమణీయార్థ ప్రతిపాదకముగా నన్నయ్యగారు దీనిని వాడిరి.

"దైత్య దానవ సుర యక్ష రాక్షసగణమ్ము కరమ్ము భయమ్ము నొందె" ఇచ్చట గణమ్ము కరమ్ము భయమ్ము నన్న యుకారసహిత ద్విత్వమకారసంఘటిత వృత్త్యనుప్రాసముచేత భీత్యతిశయము వ్యజ్యమాన మగుచున్నది. ఇది రచనా శిల్పములోని రహస్యము. దీనినిఁ జాలమంది చూడలేరు. ఏదో పద్యము విఱిగిన దనుకొందురు.

'అందవనియు దిర్దిరం దిరిగె? ఆ మిత్రుఁడు - ఇచ్చట నున్న 'అందు' అన్న మాట కర్థము లేదనెను. ఇట్లే నన్నయ యన్వయములేని మాటలు వేయుననెను. నేను కాదని చెప్పితిని.

నన్నయ్యగారి రచన తెలుఁగువారు మాటాడుకొనునట్లుండును. ఆ మాటలలోని గడుసుఁదన మంతయు బొదుగఁబడి యుండును.

లోకములో మన మిట్లందుము. 'వానికింత పలుకుఁబడి యున్నది. వాఁ డతనినిఁ బోయి యాశ్రయించును. ఇతనిచేతఁ బనిచేయించుకొనఁగలఁడు. వాని కెంతకుమ్మక్కు కలదు. ఇంత మద్దత్తు కలదు. ఈ విషయములో మనము వాని నేమియుఁ జేయలేము' ఈ విషయములో ననఁగా నీ పరిస్థితులయందు - అని యర్థము. పైనఁ జెప్పిన వాక్యములయొక్క సమాహారభూతమైన విషయమునందు అని యర్థము. ఇక్కడ 'నందు' అన్నమాటయే తదర్థకము.

ఒక కవియొక్క కవిత చదువుటకు సానుభూతి కావలయును. రెండవది బహు విషయములను సంయోజన పఱచుకొనవలయును. 'తాను వలచినదియే రంభ. తాను మునిఁగినదియే గంగ' కాఁగూడదు.

నన్నయ్యగారు అచ్చముగాఁ దెలుఁగువారు మాటాడుకొనునట్లే వ్రాయును. అందులో రచనాశిల్పమును బొదువును. శకుని దుర్యోధనునితోఁ జెప్పుచున్నాఁడు.

సీ॥ "నాగరథాశ్వ సన్నాహమొనర్పక యొద్దనంబులు తీర్ప కుభయసైన్య
వీరుల కరముల వివిధాయుధమ్ముల నన్యోన్య సంఘట్టనారవంబు
లెసఁగంగ సంగ్రామ మేర్పడజేయక యక్షముల్ తాలిచి నేనశ్రమమునఁ
బ్రతిపక్షతతుల సంపదలు జయించి నీ కిచ్చెద వగవంగనేల;"

ఈ పని సులభముగాఁ జేసిపెట్టెదను, అని లోకమునం దెవఁడయినను జెప్పునపుడు ఆ కష్టమును విస్తరించిచెప్పుట; చెప్పుటలో అందులో నున్న మెలికలు తెలియఁజేయుచు, దానిలో నున్న వైయర్థ్యము తేటపడునట్లు చెప్పుదురు. ఇచ్చట

నావైయర్థ్యము రెండు సైన్యములలోని వీరుల చేతులలోని యనేకాయుధము లొక దానితో నొకటి కొట్టుకొనుటచేతఁ గలిగెడు ధ్వనులు విజృంభింపఁగా యుద్ధము లేకుండునని చెప్పుట మిక్కిలి లోకసహజము; ఆ యుద్ధములో జరిగెడి మహాఘోర విషయము లేమియుఁ జెప్పలేదు. అప్రధానమైన కత్తుల రాపిళ్ళవలనఁ గలిగెడి ధ్వని మాత్రమే చెప్పెను. ఇదియొక చమత్కారమైన రచన. నన్నయ్యగా రనేక విధములయిన రచనలు చేయును. తరువాత వచ్చిన సర్వాంధ్ర మహాకవులకు నాయన పెట్టిన భిక్షయే. అందుకనియే యాంధ్రభాషలో నాధునిక యుగమునఁ గవికుల గురువులయిన శ్రీ తిరుపతి వేంకటేశ్వరులు.

"నన్నయకవి పెట్టినాఁడు కదా తిక్కనాది కవుల కాదిభిక్ష"

అని వ్రాసినారు ఈ యాదిభిక్ష యెట్టిదియో చూతము. నన్నయగారిలో నొక విలక్షణమైన రచన యున్నది. ఆ రచనాపద్ధతినిఁ దీసికొని తిక్కన్నగారు దానినిఁ బెంచికొని యొక ప్రత్యేక శైలిగా వృద్ధి పొందించుకొన్నారు. తిక్కన్న గారి శైలి నన్నయ్యగారి నుండి గ్రహించినదే, నన్నయ్యగారా శైలినిఁ గొన్ని కొన్ని చోట్ల నుపయోగించుచు వచ్చిరి. సామాన్యముగా ధర్మములు చెప్పునప్పుడు పొడి పొడి మాటలతో నన్నయ్యగారు వ్రాయుదురు.

కం॥ ధీరమతియుతులతోడ వి
చారము సేయునది మును విచారిత పూర్వ
ప్రారబ్ధమైన కార్యము
పారము పొందును విఘాత పద దూరంబై.

కం॥ జనపాలుఁడు మృదుకర్మం
బున నైనను క్రూర కర్మమున నైనను నే
ర్పున నుద్ధరించునది ద
న్ననపాయత బొంది చేయునది ధర్మమ్ముల్.

కం॥ తఱియగు నంతకు రిపుఁ దన
యఱకటఁ బెట్టికొని యుండునది తఱి యగుడున్
జెఱచునది ఱాతి మీఁదను
వఱలగ మృద్ఘటము నెత్తివైచిన భంగిన్

ఉ॥ ఇమ్మహి నీవుఁ బాండవులు నెప్పటియట్ల పరస్పరానురా
గమ్మున నేలుచున్కి యిది కార్యము పాండవలక్ష్మి నీ కస

హ్యా మ్మననేల వంచనఁ బరార్థ పరిగ్రహబుద్ధిఁజేసి పా
పమ్మగుఁ బాపకారులకుఁ బాయు నవశ్యము నర్థధర్మముల్.

ఆ.వె॥ అల్పుఁడయ్యు మనుజుఁ డతి పరాక్రమమున
పేర్మిఁదర తరంబ పెరుగుచున్న
వాఁడు ప్రాని మొదలి వల్మీకమాత్రానిఁ
జెఱచునట్లు గడఁగి చెఱచుఁ బగఱ.

కం॥ వనగతులని వారలపై
చని భంగము పొందిరాఁగ సమకట్టెడు నీ
తనయుఁడు గావున నీ వా
తని వారింపు మది యనుచితం బని నెమ్మిన్

కం॥ విను నీవును గురుఁడును శాం
తనవుఁడు విదురుండు నుండి తగు నయధర్మం
బున నీ యుపేక్ష ననయం
బునుఁ బాండవ విగ్రహంబు బుట్టుట లగ్గే.

ఇట్టి పద్యములు నన్నయగారిలో వందలు కలవు. ఇది యొక శైలి. ఈ శైలిని నన్నయ్య కొన్ని కొన్ని భావములు చెప్పుటకు నుపయోగించెను. దీనినిఁ దీసికొని తిక్కన్నగారు సర్వదా యది తన కవితాముద్ర చేసికొన్నాఁడు. ఇంతే భేదము.

నన్నయ్యగారు రసమును శబ్దసంయోజన శక్తి నుండి కలిగింతురు. విస్తరించి భావములను జెప్పుటచేతఁ జేయరు. ఇది యొక చమత్కారమయిన విలక్షణమయిన మార్గము.

హా మహారాజ మహా మహీరక్షణ
దక్ష దక్షిణబాహుదండ దండి
తారాతి నిషధరాజాగ్రణి నన్నిట్లు
వీతదయుండవై విడిచి చనఁగఁదగునె"

అని దమయంతి వలపోసిన వలపోఁతయు

సీ॥ ఇభరాజ గమన నీ వెందుల కరిగిత
త్యురుకుచాభోగ యెందున్నదాన
వబల యెవ్వరిచేత నడవులలోఁ బట్టు

వడి తశనాపేక్షఁ బఱచుచున్న
యుగ్రమృగంబుల యుదరంబులో నున్న దానవే ॥

మొదలయిన నలుని దుఃఖము సంబోధనలచేత భాసించుచున్నది. "హా! మహా రాజమహామహీరక్షణ" మొదలయిన పిలుపులచేతనే శోకరసము వెల్లి విరియుచున్నది. 'ఇభరాజగమన' 'అత్యురుకుచాభోగ' ఈ రెండు సంబోధనల చేత శృంగార శోకరసములు పెనఁగొని పరమ రమణీయమయిన యాహ్లాదమును గలిగించుచున్నవి. ఆఁకలి కొఱకు పరుగెత్తెడి యుగ్రమృగముల యుదరమ్ములో నున్నదానవా? అని రచనయందోజోగుణము సంధానము సేయుటచేత నీ యోజోగుణము దుఃఖరసమునకు సంగముగా స్వీకరింపఁబడి కావ్యగుణము రస స్ఫూర్తి కొఱకు నుపయోగించిన మహాశిల్పము వ్యక్తమగుచున్నది. ఏ కవియందు వృత్తులు, రీతులు, గుణము, లలంకారములు సర్వము రసాభిముఖముగాఁ బ్రసరించునో యతఁ డొక్కడేఁ మహాకవి శబ్దవాచ్యుఁడు. వృత్తి రీతి గుణాలంకారాదులు రసమునందుఁ గలసిపోవుట యెట్లు తెలియుననఁగా మఱల నాలోచించినపుడవి భాసించి కథ చదువుచున్నప్పుడు వాని స్థితి మనకు గోచరించని దెప్పుడో యప్పుడు. కొందఱు కవులయొక్క రచనలో రసము భాసించుచున్ననూ తద్రసావభాసనమునందుఁ గూడ వారి శైలియొక్క, వృత్తి యొక్క, రీతియొక్క, ప్రాధాన్యము బుద్ధిని వదలిపెట్టదు. ఏలకులు, మిరియాలు' కుంకుమపువ్వు మొదలయిన వస్తువులతో మిళితమయిన పానకము త్రావినపుడు దానిలోని తీపిదనము వీనియొక్క రుచిచేత నధిక సేవ్యమానమయినట్లుగా శైలీ వృత్తిరీత్యాది గుణసామగ్రీ విశిష్టతకల కవియొక్క రచన యందలి రసానుభూతి తద్విశిష్టగుణ సహితముగా నుండును. అచ్చమయిన మధువునందు వట్టి మాధుర్యమే భాసించును. నన్నయ్యగారి రచన యిట్టిది. సర్వదా రసభావములే గోచరించును గాని యీ యలంకార మెంత చక్కఁగా వాడినాడు ఇక్కడ నెంత గొప్ప భావము చెప్పినాఁడు. ఇట్టి భావములే రావు. నన్నయ్యగారి రచన రసభావములను కరిగించి పోసిన రచన. ఇట్టి రచన మఱియొకచోటఁ గనిపించనే కనిపించదు.

ఒక్కొక్కచోట నాయన చేసెడు చమత్కారములు నూహాతీతములు. రాక్షసులు దేవతలతో యుద్ధము చేసిరి. అమృతమునందు విగృహీతులై వారు దేవతల మీఁదకు యుద్ధమునకు బయలుదేరిరి. ఈ భావమును సీసపద్యముతో మొదలిడెను. ఆ సీసపద్యమునందు ప్రాసయును సమకూర్చెను. ఆ సమకూర్పఁబడిన ప్రాసము చేత రాక్షసుల కోప మంతయు వ్యజ్యమాన మగుచున్నది.

"అంత దేవాహితు లమృతమ్ము గానక
యెంతయు నలిగి బలీంద్రుఁ గూడి
మంతనంబుండి యమర్త్యులతోడి పా
త్తింతియ చాలు నింకేల యనుచు
సంతనకట్టి యుత్సాహ సమేతులై
యంతంబులేని రథాశ్వములను
దంతుల నమితపదాతు నొడఁగూర్చి
యంతకాకారులై యార్చి."

ఈ సీసపద్యపు నాల్గు చరణముల పూర్వపరార్థములయందు నిక్షేపించిన యనుస్వార పూర్వకతకార ప్రాసముచేత నిచటి రాక్షసుల కోపము, యుద్ధ ప్రయత్నము నేమి విచిత్రముగా స్ఫూర్తికలుగుచున్నది: ఇది తెలిసి చేసిన రచన. శిల్పస్వరూప మెఱిఁగిన రచన.

నన్నయగారి కవితాగుణములు చెప్పుటకు శక్తి చాలదనవచ్చును. గ్రహించుటకుఁ దొలుత శక్తి యుండినచోఁ జాలును.

"కలి దమయంతిఁ బాప సమకట్టు సతిం బతి బాయనోపఁ డా
లలన సుదీర్ఘ సౌహృద బలంబున నిట్టులు రెంటఁజేసి య
న్నలుఁడు విమోహరజ్జులఁ బెనంగి గతాగత కారియైన యు
య్యెలయును బోలె నూరడక యెంతయుఁ బ్రొద్దు వినిశ్చితాత్ముఁడై.

ఇచ్చట విమోహశబ్దము రెండర్థములయందు వాడఁబడినది. 'వి' అను నుప సర్గకు విగత విశిష్టార్థములు రెండునూ కలవు. 'విమోహ రజ్జులన్' విగతమోహము లయిన రజ్జువులు. విశిష్ట మోహములయిన రజ్జువులు. విగత మోహములు నలుని పంపింపఁ జూచును. విశిష్టమోహములు నలుని నిలుపఁజూచును. ఇట్లు రెండర్థములలో నీ శబ్దము ప్రయోగింపఁబడినది. ఇట్టి చమత్కారములు నన్నయ్యగారి యందెన్నియో గలవు.

నన్నయ్యగారు భారతములోని కథలకు వ్యాఖ్యానము చేయును. భాష్యము వ్రాయును. కథలోని క్లిష్టార్థములు విడిపరచి చెప్పును. అసంగతములుగాగనిపించుఁ వానికి సంగతత్వము కనిపించును. దీని కొక చిన్న యుదాహరణము, ధృతరాష్ట్రునకుఁ బెండ్లి కావలయును. అతఁడు గ్రుడ్డివాఁడు. రాజైనను తొందరగా నెవ్వరును బిల్లనివ్వరు. అట్టివానికి వివాహము కొన్ని ప్రత్యేక పరిస్థితులయందే జరుగును.

అట్టి పరిస్థితులు వ్యాసుని భారతమునందు లేవు. ఈ క్రింద నన్నయ్యగారి తెలుఁగు సేఁతలు సంస్కృత భారతమునందలి గాంధారీ వివాహ కథాభూత శ్లోకములును నుదహరింపఁ బడుచున్నవి. వానినిఁబట్టి నన్నయ్యగారి తెలుఁగుసేఁత యర్థము చేసికొనవచ్చును. ఈ పెండ్లి యగుటకుఁ గారణము గాంధారి తండ్రియైన సుబలుఁడు. తన కూఁతును ధృతరాష్ట్రుని కిత్తునని నిశ్చయించుకొనుటకు నాయన చాల యుద్ధతుఁడు. అతనిమాట కెదురులేదు. బంధువులతనికి భయపడుదురు. అతఁ డన్నమాట కాదనువాఁడు లేఁడు. ఆయన యిట్టివానిఁగా నన్నయ్యగారు సృష్టించి గాంధారీ వివాహ పరిష్కారమును జేసెను. ఆయన యిట్టివాఁడని ధ్వనితమగుచున్నది గాని వాచ్య మగుట లేదు.

ఈ కులము వివర్ధింపఁగ నా కభిమత మేనువింటి నలినేక్షణ దా
నేకశత సుతలఁ బడయఁగ నాకన్యక వరమువడసె నఁటె హరుచేతన్॥9

కావున ధృతరాష్ట్రునకు గాంధారిని వివాహంబు సేయుదము. గాంధారపతి మనతోడి సంబంధమునకుం దగునని నిశ్చయించి సుబలుపాలికిఁ దగుముదుసళ్ళంబంచిన సుబలుండును సుముఖుండై కురుకుల విస్తారకుండయిన ధృతరాష్ట్రుండు యిక్కన్యకకు నర్హుండు గావున నా రాజునకు గాంధారి నిచ్చితి ననిన వాని బంధు జనంబులెల్లఁ దమలో నిట్లనిరి:

అంగములలోన మేలుత్తమాంగ మందు
నుత్తమంబులు గన్నుల యుర్విజనుల
కట్టికన్నులు లేవను టంతెగాక
యుత్తముఁడుగాఁడె సద్గుణయుక్తి నతఁడు॥ 11

అనిన వారి పలుకులు విని గాంధారి ధృతరాష్ట్రునకుఁ బితృవచన దత్తఁగాఁ దన్ను నిశ్చయించి నాకుఁ బతి యమ్మహీపతియకాని యొరుల నొల్లనని పరమ పతివ్రత పరపురుష సందర్శనంబు పరిహరించి తన పతి కనుగుణంబుగా నేత్రపట్టంబు గట్టికొనియుండె.

అథ శుశ్రావ విప్రేభ్యో గాంధారీం సుబలాత్మజాం
ఆరాధ్యవరదం దేవం భగనేత్రహరం హరమ్॥ 9

గాంధారీ కిల పుత్రాణాం శతం లేభే వరం శుభా
ఇతి శుశ్రావ తత్త్వేన భీష్మః కురుపితామహః॥ 10

తతో గాంధారరాజస్య ప్రేషయామాస భారత
అచక్షు రితి తత్రాஉஉసీత్ సుబలస్య విచారణా॥ 11

కులం ఖ్యాతించ వృత్తంచ బుద్ధ్యాతు ప్రసమీక్ష్య సః
దదౌ తాం ధృతరాష్ట్రాయ గాంధారీం ధర్మచారిణీమ్॥ 12

గాంధారీ త్వథ శుశ్రావ ధృతరాష్ట్ర మచక్షుషమ్
ఆత్మానం దిత్సితం చాస్మై పిత్రా మాత్రాచ భారత॥ 13

తత స్సా పట మాదాయ కృత్వా బహుగుణం తదా
బబంధ నేత్రే స్వే రాజన్ పతివ్రతపరాయణా॥ 14

నాభ్యసూయాం పతి మహ మిత్యేవం కృతనిశ్చయా ॥

ఆయన తన కూఁతురు నిచ్చితి ననెను. బంధువులు తమలో నిట్లనుకొనిరి. అది గాంధారి వినున ట్లనుకొనిరి, ఆమె తండ్రి యెంత చెప్పిన నంత, ఆమెచేత నెదురుతిరిగింపించవలె నని వారి యుద్దేశ్యము. మూఁడు మాటలలో నీ కథ యంతయుఁ బరిష్కారము చేయఁబడినది. సుబలునియొక్క గృహవిషయముల యందలి యౌద్ధత్యము ఒకటి, యిచ్చితి ననుటలో రెండవది, బంధువులు తమలో నిట్లనుకొని రనుటలో సువ్యక్తమైనది. ఆయన కథ లన్నియు నిట్లే వస్తుధ్వని ప్రాధాన్యము కలవిగా నుండును. జాగ్రత్తగా విచారించినచో లోకము సువ్యక్త మగును. ఆయన యంతటి లోకజ్ఞుఁడు. తాను లోకజ్ఞుఁడ నని తనకుఁ దెలియును. 'లోకజ్ఞు నుభయభాషాకావ్య రచనాభిశోభితు' నని చెప్పికొన్నాఁడు.

అన్ని సాహిత్యములలో మొట్టమొదటనే మహాకవులు పుట్టుదురు. మఱల నంతటి కవి భాషలోఁ బుట్టఁడు. చదురుగా నొకరిద్ద ఱున్నచో నుండవచ్చును. సంస్కృతములో వాల్మీకియుఁ దెలుఁగులో నన్నయ్యగారును నట్టివారు. తరువాత నేకవులును వారిని మించలేరు. తరువాతి సర్వకవులకు వారు పెట్టినదియే భిక్ష.

౨

శ్రీ ఎఱ్ఱన మహాకవి

అరణ్య పర్వ శేషము

- శిరోమణి శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు

ఉపక్రమము ప్రస్తావన

ఎఱ్ఱన మహాకవి మహానుభావుఁడు. పవిత్రుఁడు, అట్టి మహానీయుని నామస్మరణము దురితనివారకము. సకల సంపదలను సమకూర్చునదియుఁ గూడ, మనయాంధ్రుల యాది వాఙ్మయ సర్వస్వమగు నాంధ్ర మహాభారతమును ప్రణయించిన ఋషి త్రయము వంటి కవిత్రయములోని మన యెఱ్ఱన యాంధ్ర ప్రపంచమునకు మొదల వెలుఁగునిడు నరుణుఁడే. తమస్సుచే నావరింపఁబడి విచ్ఛిన్న ప్రాయములైన పగుళ్లను నిరస్తనీరదావరణములనుగా సరిగా సమన్వయించి వాని వ్యవహారములను నావరణ ప్రతిబంధము లేకుండ నవిచ్ఛిన్నముగా తళత్కమల వైభవజృంభణ ముల్లసిల్లునట్లుగా నుద్ధరతర హంససారస మధు వ్రత మధుర నిస్వనములు చెలఁగు తీరున దిద్దఁగల్గునది యరుణుఁడుగాక మఱెవ్వరు? సరిదిద్దఁ గల్గును కనుకనే సరిదిద్దవలసినవాఁడును, సరిదిద్దినవాఁడును నతఁడే యయినాఁడు.

మన యెఱ్ఱనమహాకవియు నంధకారబంధురమగు కాలములోనే నీరంధ్ర నీరదావరణములోననే, యడఁగిపోయి పరస్పర సంబంధము లేక విచ్ఛిన్నమైయున్న ఆదిమ మహాకవి నన్నయ రచనను, ద్వితీయమహాకవి తిక్కన సోమయాజి రచనను సరిగా నవిచ్ఛిన్నముగా సమకూడునట్లు, నా యావరణము నిరస్తమగు నట్లును, మహాకవి రచనలు కమలదళములవలె విస్తరించి వైభవాతిశయముతో దీపించునట్లును, సరిదిద్దఁగలవాఁడు గనుకనే సరిదిద్దవలసినవాఁడై, సరిదిద్ది, సరస పండిత కవివరుల ప్రశంసల నెగడింపలేదా?

మఱియుఁ బ్రపంచమునకు మొదట వెలుఁగు నవిచ్ఛిన్నముగా నొసంగి ప్రపంచ వ్యవహారమును సరిగా నిర్వహించవలసిన వాఁడును నరుణుఁడే యగుట ప్రసిద్ధమే కావున మన యరుణుఁడును నాంధ్ర ప్రపంచపు మొదటి వెలుఁగు

నాంధ్ర మహాభారతమును నవిచ్ఛిన్నముగా నొనరించి యొసంగి యాంధ్ర ప్రపంచ వాఙ్మయ వ్యవహారమును సరిగా నిర్వహించినవాఁ డయ్యెను.

అంతటివాఁడు కనుకనే యీ మహనీయుఁడు కాలక్రమమునఁ గవిత్రయములోఁ జివరివాఁ డయ్యును, దన గుణగరిమచే, నన్నయ తిక్కనల నడుమ మధ్య మణివలె వెలుఁగొందుచున్నాఁడు. అంతేకాక సంస్కృత భాషకు ప్రమాణభూతులైన పాణిని, వరరుచి పతంజలులవలె యాంధ్రభాషకుఁ బ్రమాణ మూర్ధన్యులైన ముగ్వురిలో నీ మహానుభావుఁడు సహజముగ వరరుచియే. ఈ మహనీయుఁడు శంభుదాసుఁడు, ప్రబంధ పరమేశ్వరుఁడు, పరమేశ్వర స్మరణము, సేవయు నతి లోకములగు శుభసంపత్తులను గూర్పఁగలుగునే గదా? మహనీయులకు సేవ యొనరించుటయు నొక విశిష్టమగు సత్కృత్యమే. వారికి సేవచేయుట యనఁగా వారి గ్రంథముల విమర్శించుటయే యని యభిజ్ఞ సంప్రదాయము. అదియే యీ ప్రాతస్మరణీయుఁ డగు నరుణుని ఎఱ్ఱన, యరణ్య పర్వశేషోన్నయమును విమర్శించుట కుత్సాహము కల్గించినది.

దేశము

మొదట నీ మహానుభావునివలన ధన్యతనొందిన దేశ మేదియో విచారింతము. ఈ మహనీయుని తాత వేఁగినాటిలోని కరాపర్తి గ్రామములో వృత్తిమంతుఁడై యుండెనట. వర్ణసామీప్యము వలన నిది యిప్పటి వంగవోలు తాలుకాలో అమ్మన బ్రోలు ప్రక్కనున్న రైల్వేస్టేషను గ్రామమైన కరవది యని నేను భావించుచున్నాను. దీని నిప్పటికినిఁ గొంతమంది "కరావది" యని వాడుదురు. ఇంచు మించుగా నీ ప్రదేశమంతయుఁ బూర్వము వేఁగినాటిలోనిదే నేమో! అంతేకాక ఈ "కరవది" కి కొలఁది దూరమునుండియే పాకనాఁడు ప్రారంభమగును, అట గ్రుడ్లూరులోనే కదా మన కవీశ్వరుఁడును నతని తల్లిదండ్రులు పోతమాంబా సూరనార్యులును గూడ నివసించియుండిరి. చివరి రోజులలో నీ కవీశ్వరుఁడు "కరవది" గ్రామమునకుఁ జేరువ గుండ్లకమ్మ యేటి యొడ్డున నున్న చదలువాడ గ్రామముననే కదా కాపుర ముండి చదలువాడ వారని యింటిపేరొందినది. కనుక "కరవది" సమీప గ్రామమున కేఁగి రనుటయే యుక్తము.

కాలము

హరివంశములో

"కావునఁ జెప్పెదకళ్యాణావహ మహనీయ రచన హరివంశము సద్భావమున నవధరింపుము భూవినుత గుణాభిరామ ప్రోలయవేమా."

అని ప్రోలయ వేమనకు వినిపించుచు నతని కంకిత మొనర్చినట్లున్నది. ఈ ప్రోలయ వేమన 1328 క్రీస్తు శకము ప్రాంతమున స్వతంత్ర రాజ్యమును స్థాపించి క్రీ.శ. 1346 వఱకు నేకధాటిగాఁ గృష్ణాగోదావరుల నడుమ నేలెనని కందుకూరి వీరేశలింగం పంతులుగారు వ్రాయుచున్నారు. కాని యీతనికి "తనకు నద్దంకి తగు రాజధానిగాఁగ" అను హరివంశమునుబట్టి కృష్ణా పెన్నా నదుల నడుమ నున్న అద్దంకి రాజధాని యగుటవలన నీతని రాజ్య మించుమించుగా గోదావరి పెన్నల నడుమ సాగినదేమో యని తోఁచుచున్నది సరి! ఈ ప్రోలయవేమనకు హరివంశమును గృతి యిచ్చిన యీ మన మహాకవియు క్రీ.శ. 1345వ సంవత్సరము ప్రాంతమువాడనుటకు నభ్యంతర మేముండును? అని కందుకూరి వీరేశలింగ ప్రభృతుల యాశయము. కాని ఇది విచారింపవలసి యున్నది. ఏమనఁగాఁ దిక్కన పదమూడవ శతాబ్దివాడనియు ననఁగా క్రీ.శ. 1250 నాటివాఁడనియు వారే వ్రాసిరి. అతఁ డోరుగంటి రాజైన గణపతి దేవుని కడకేగి రాజ్యభ్రష్టుడైన తన రాజు మనుమసిద్ధిని గద్దెనెక్కింప నతని సహాయ్యము సంపాదించెనని వారే యనిరి. అట్టియెడ గణపతిదేవుని మనుమడు రెండవ ప్రతాపరుద్రుఁ డోరుగల్లు రాజ్యము నుండి భ్రష్టుఁడైన తరువాతఁగాని యీ ప్రోలయ రాజ్యము వెలయలేదు కదా! అపుడు ప్రోలయ రాజ్యము పదునాల్గువందల డెబ్బది ప్రాంతమై యుండకతప్పదు. తరమునకు నలుబది సంవత్సరములని వారు చెప్పిన లెక్క ప్రకారమైనను నట్లే యగును. ప్రతాపరుద్రుని రాజ్యము పోయిన వెంటనే యీ రాజ్యము వెలయలేదు. కదా! కావున నింకను దరువాత కాలమునకే యీ ప్రోలయయు నితనితోఁబాటు మన కవియుఁ గూడ దేకవలసి యున్నారు. మఱియు నీ మధ్య నొకరు తిక్కన గణపతిదేవుని కడకేఁగియట జైనకరణములకుఁ బోటీగా బ్రాహ్మణుల నారువేల మందిని కరణీకమునకు దింపెనని వ్రాసిరి. అదియుఁ దప్పే. ఈ యెఱ్ఱన మహాకవికిఁ బూర్వము అరవతరము వాఁడైన యీతని తాత భీమన మంత్రి వెలనాటి చోడుని వలన గౌరవింపఁబడి యతనికడ మంత్రిపదవిని వహించి నట్లుగా నెఱ్ఱన తన నృసింహ పురాణములో వ్రాసియున్నాఁడు. తరమునకు వారు తెల్పునట్లు నలుబది సంవత్సరముల లెక్కను జూచినను ఎఱ్ఱనకు ముందేఁబది సంవత్సరముల నాఁడున్ను తిక్కనకన్న నూరేండ్లు పై చిల్లర ముందుగనే నియోగి శాఖ యేర్పడెనని తేలుచున్నది. కనుక నీ రెండు విషయములును సరికాదని తోఁచుచున్నది.

కులగోత్రములు

ఇతఁడు స్మార్త బ్రాహ్మణుఁడు. "ప్రగ్గడ" శబ్ద ముండుటవలన నియోగియన వలయును. శ్రీ వత్సగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు.

మతము

ఈ మహానుభావుఁడు రచించిన గ్రంథములన్నియు గోవింద కథా సుధారసములే కాని యీయన శంభుదాసుఁడు. ఈతని తండ్రిసూరనార్యుఁడు. "శివ పదాబ్జసంతత ధ్యాన సంసక్తచిత్తుఁడు." కాపురమా? నీలకంఠేశ్వర స్థానము. గ్రుడ్లూరు. (చూ. అరణ్యాపర్వము చివర) గురువు శంకరస్వామి (చూ. హరివంశకృత్యాది). ఈ కారణము లతనిని "గిరీశ పదభక్తి రసతత్పర భావము కలిమి శంభుదాసుఁడనంగాఁబరగు" నట్లొనర్చినవి. కాని యీ వెనువెంటనే "గోవింద గుణాదర సంభృత సౌమనస్య ధన్యుఁడ నెందున్" అనియెను. ఈతని తాత యెఱపోత సూరి "కంసారి చరణకమల మధుకరపతి" కనుక నతని పోలిక యబ్బి యుండును. లేక వీరశైవుఁడే యగుచో గోవింద కథామృతములగు గ్రంథముల రచించుట కాని "గోవింద గుణాదర సంభృత సౌమనస్య ధన్యుడఁ" ననుకొనుటఁ గాని సంభవింపనేరవు. కనుక నీలకంఠేశ్వర స్థానపు బలిమియుఁ దండ్రి పోలికయు, శివునకు భక్తు నొనరించినను, పైతామహమును, ననువంశికము నగు గోవింద గుణాదర సౌమనస్యము విడువక శివకేశవులందు సమాన ప్రతిపత్తిని సమకూర్చినది. "యేనాస్య పితరో యాతాః యేన యాతాః పితామహాః". అని పెద్దలు తండ్రితాతల మార్గమునఁ బోవుట ప్రశస్తముగా నెంచెదరుగదా! నిజమున కీతనికిఁ దండ్రి యందుకన్నఁ దాతయందే యెక్కుడు భక్తి. తాత కలలోఁ గన్పడి ప్రోత్సహించుటవలన శ్రీనృసింహపురాణమును వ్రాసెను. అందులోఁ దన తాతను విశేషముగాఁ గీర్తించెను. అతని యనుభావ విశేషమే యితని యందతిశయించి యన్నియు గోవింద కథామృతమునే రచింపఁజేసినది. కాని యొక్క శైవ గ్రంథమును గూడ రచింపఁ జేయలేదు. అంతేకాక యీతఁడు రచించిన హరివంశములోనే కైలాసయాత్రా ఘట్టమున హరిహరుల యైక్య మనుఁడు, లేదా సామ్య మనుడు. అది యంతయు మహర్షిసంఘము హరిహరుల వలన విస్పష్టముగా నెఱుంగుటఁను నతి రుచిరముగాను, దన మనసుకు వచ్చినట్లుగాను, నీతఁడు కూర్చి యున్నాడుఁ. ఇప్పటివారివలెఁ జదివిన గ్రంథములలోని విషయముల ననుభవము లోకిఁ దెచ్చుకొననివారు కారుకదా యప్పటివారు! కనుక నిట్లు పరిణతమతి విభవుఁడగు నీ మహనీయుఁడు తిక్కన సోమయాజివలె శివకేశవులందభేద ప్రతిపత్తి గలవాఁడే యయినాఁడు.

రచించిన గ్రంథములు

రామాయణము, అరణ్యాపర్వ శేషోన్నయము, నృసింహ పురాణము, హరివంశము నను నీ నాల్గును నితని రచనలుగా సుప్రసిద్ధము లయినవి.

రచనాక్రమము

నృసింహ పురాణములో

ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై
యెన్నికమై ప్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వశే
షోన్నయ మాచరించి సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తొ
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్"

అను నీతని పద్యమునుబట్టి మొదట నొక కావ్యమును, (రామాయణమును) బిమ్మట నరణ్య పర్వశేషోన్నయమును, దరువాత నృసింహపురాణమును రచించెనని తెలియుచున్నది. తదనంతరమున, హరివంశమునుబట్టి "బంధురాష్టాదశ పర్వనిర్వహణ సంభావితం బగు మహాభారతంబు హరివంశపూర్ణ మగునట్లుగాఁ గ్రమవ్యాఖ్యాన" మొనరించెనని తెల్లమగును.

మొట్ట మొదట నీతండు రచించినది రామాయణకావ్యమే యని హరివంశము నిర్ధారించుచున్నది.

నాతమ్ముండు ఘనుండు మల్లరథినీ నాథుండు ని న్నాతత
శ్రీతోడన్ సముపేతు జేసి యెలమిం జేపట్టి మా కిచ్చుటన్
జేతోమోద మెలర్ప రామకథ మున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి మింక నేను దనియన్ గావ్యామృతాస్వాదనన్.

ఇతని చిన్న మనుమఁడు చదలువాడ మల్లయగూడ "వల్మీకభవు వచో వైఖరి రామాయణంబు నాంధ్రప్రబంధంబుఁజేసె" అని యీ విషయమే స్థిరపరచుచున్నాడు. అయితే యాతని గ్రంథరచనాక్రమ మిదేనా యని పరిశీలింతము. నృసింహపురాణపు బద్యములో రచించిన గ్రంథములఁ బేర్కొనుచోట హరివంశమును నుడువకుండుట వలన నది యిప్పటికి రచింపఁబడలే దనుట యుక్తమేకదా, హరివంశములోఁగూడ రామాయణ మొకటిదక్క నృసింహ పురాణాదికము పేర్కొనఁబడలేదు కనుక నవి నృసింహపురాణము నరణ్యపర్వ శేషోన్నయమును నప్పటికి రచింపఁబడలే దనరాదా యని యాశంకింపవచ్చును.

కాని యచ్చటి సందర్భము వేరు. అనఁగా నృసింహపురాణములో నీ కవి రచించిన గ్రంథములను దెలుపవలసిన ప్రసక్తి వచ్చినది. కనుక నప్పటికి రచింపఁ బడిన గ్రంథములను దెలుపవలసిన సందర్భ మేర్పడినది కనుక నప్పటికి రచింపఁ బడిన గ్రంథము లవి యని తెలుపఁబడినది. ఎట్లనఁగా "నృసింహపురాణము"

అను పురాణ గ్రంథమును రచింపఁజేయబోవునపుడా గ్రంథమును రచించుట కతనికిఁ గల యర్హత నిరూపణీయము. అది రచిత పూర్వములగు గ్రంథముల ద్వారమునఁ బ్రశంసింపదగి యున్నది. కనుకనే యదివరలో నీ పురాణము వంటి ప్రాక్తన కథాసందర్భముగల రామాయణ భారతముల రచించియుండుటను దప్పక ప్రశంసింపవలసియున్నది. అట్లే ప్రశంసింపఁబడినది. రామాయణ భారతముల రచన యొనరించి పురాణరచన యందతనికిఁగల యర్హతను నిరూపించుకొన్నాఁడనుట యప్పటికి, హరివంశము రచింపఁబడియుండనిచో నది వెనుకటి యన్నిటికన్న మంచి రచన కల్గిన పురాణమే కనుక దానినిఁ దప్పక పేర్కొనియే తీరవలెను. నృసింహపురాణ రచనయందర్హత్తమత్వమును నిరూపింపఁగలది కదా యది? అటనట నుదాహరింపబడిన యెఱ్ఱన రామాయణపు బద్యములును, నరణ్యపర్వశేషోన్నయమును నృసింహపురాణమును, హరివంశమును సవిమర్శగా పరికించుచుచో నెఱ్ఱన కవితామార్గమునఁ బ్రథమావతారము రామాయణ మనియు, నుత్తరోత్తర గుణవంతమయిన యతని కవితా రచన హరివంశమున విశ్రాంత మయినదనియుఁ దోఁచితీరును. అట్టియెడల సారవత్తమమయిన రచనగల హరివంశమును నిదివరలోనే రచించినచో నృసింహపురాణములోఁ బేర్కొనకుండుట యుక్తముకాదు. అంతేకాక అట్టి హరివంశ రచన దానికన్న తక్కువ పరిణతిగల నృసింహపురాణ రచనకుఁ బూర్వముండుటయు సంభవము కాదు. తిక్కన యాంధ్ర భారతరచనకుఁ దరువాత నతని నిర్వచనోత్తరరామాయణపు రచన యుండఁ గలదా? కవితా పరిణతి పరమావధియగు నన్నయ యరణ్యాపర్వ రచన తరువాత నతని యాదిపర్వరచన యుండుట యెన్నఁడైన సంభావ్యమా? కనుక నృసింహపురాణములో హరివంశము ప్రస్తావింపఁబడకపోవుటుచితమే.

అయితే చిట్టచివర నీతడు రచించినది హరివంశ మనికదా మీ రనునది? అట వెనుకటి గ్రంథములు అర్యణపర్వ శేషోన్నయమును, నృసింహ పురాణమును నేల రచింపఁబడియు స్మరింపఁబడలేదు? పోనీ, వెనకటి గ్రంథములు స్మరింపఁ బడలేదేమో యనుకొన్నచో రామాయణ మేల యిదివరలో రచింపఁబడిన దని, అటఁ దెలుపఁబడెను? అని యాశంక కలుగవచ్చును.

కాని యచట సందర్భమును బరిశీలించుచో నీ యాశంక తొలుగును. అచట ప్రోలయవేమన, మన కవినిఁ దనకు హరివంశమును గృతి యీయవలసినదని యడుగుట సందర్భము. అపుడు తనకును గవికినిఁ గల పూర్వ సంబంధమును ప్రకృత కార్యోప యుక్తముగాఁ బేర్కొనవలసివచ్చెను. అదివరలోఁ దన తమ్ముఁడీ

మహాకవి యెఱ్ఱనను ధనధాన్యాదికమున సత్కరించి తన యొద్దఁ గవిగాఁ బరిచయ మొనరించుటయు నతనివలన నపుడొక గ్రంథమును దాను రచింపఁజేసి తాను కృతి గైకొనుటయు దాని యందలి స్వారస్య విశేషమువలనఁ దనకుఁ దనివితీరక పోవుటయు నది కారణముగాఁ బ్రకృత గ్రంథమును - హరివంశమును రచింపఁ జేయవలయునను కోరిక యుదయించుటయు యుక్తతరమును, సామాజికమును గూడఁ గదా! అది కారణముగా నిటఁగృతిపతికినిఁ గృతి కర్తకును గల సంబంధము తమకు మాత్రము సంబంధించిన కృతులవలన దెలుప వలయుటయే ప్రసక్తము కాని యతనికి సంబంధము లేని గ్రంథముల మూలమునఁ గాదుకదా! అట్లుభయులకును సంబంధము కలవి రామాయణము, హరివంశము మాత్రమే. కడమవి రెండును బ్రకృత కృతిభర్తయైన ప్రోలయ వేమునితో సంబంధము లేనివి. కనుక వానిని బేర్కొనకుండుటయే యుక్తము. అదియే యిట నొనర్పఁ బడినది. అవి యిదివరలోనే రచింపఁబడియుండుట నృసింహపురాణము పద్యము వలననే స్పష్టపడెనుగదా! ఈ నిరూపణము వలన నీ నిర్ణయము పర్యవసన్న మగుచున్నది.

మొదటి కావ్యము - రామాయణము, తరువాత భారతారణ్యపర్వశేషోన్నయము, పిమ్మట నృసింహపురాణము, చివర హరివంశమును మన మహాకవి రచించిన క్రమము.

బిరుదములు

ఈ మహానుభావుని బిరుదములను విచారించుటకు ముందీతని నిజనామ మేమియో సరిగాఁ దెలియవలసియున్నది. నృసింహపురాణములోఁ బ్రజ్ఞాపవిత్రు డాప స్తంబసూత్రుండు.......

సూరనార్యు మజ్జనకుని.....గన్న తండ్రి
వేఁగినాట కరాపర్తి వృత్తిమంతుఁడు
అనఘుఁ డెఱపోతసూరి కంసారి చరణ
కమల మధుకర పతి సార విమలయశుఁడు.

. . . .

. . . .

"నను దన పేరి వాఁడని మనంబున నెప్పుడు నాదరించుటన్"

అను వ్రాఁతనుబట్టి మన మహాకవి నిజనామము "ఎఱపోతసూరి" అదియే

లోకుల వాడుకలో "ఎఱ్ఱన" గాను ఎఱ్ఱప్రగడ" గాను, మారినదని తెలియుచున్నది. ఇఁక బిరుదములు. ఈ మహానీయునకు శంభుదాసుఁడు, ప్రబంధ పరమేశ్వరుఁడు అను రెండు బిరుదము లున్నవి. "గిరిశ పదభక్తి రసతత్పర భావము కలిమి శంభుదాసుఁ డనంగాఁ బరగిన" వాఁడని మొదటిది వివరింపఁబడినది. శంకరస్వామి శిష్యతయు నిందు సూచితముగా నగును. ఇక రెండవ బిరుదము ప్రబంధ పరమేశ్వరుఁడు.

దీనినిఁ గూర్చి విచారింతము.

ప్రబంధ పరమేశ్వరుఁడు

నృసింహ పురాణములోని

ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై
యెన్నికమై ప్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వశే
షోన్నయ మాచరించి సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించితో
నన్నయభట్ట తిక్క కవినాథుల కెక్కిన భక్తి పెంపునన్.

అను పద్యమునుబట్టి నన్నయ్యభట్ట తిక్క కవినాథుల యందలి భక్తి పెంపునఁదా నరణ్యాపర్వ శేషోన్నయ మొనర్పఁగా సుజనులు దాన సంతసించి ప్రబంధ పరమేశ్వర బిరుదము నొసంగిరని మన మహాకవి తెల్పుచున్నాఁడు

దీని స్వరూప స్వభావములను బాగా విచారింపవలసియున్నది. ఏమనఁగా నీ బిరుదము ప్రకృతమగు నరణ్యాపర్వ శేషముతోనే చాల సంబంధము కల్గియున్నది గదా!

ఈ విషయములో రావుబహదూర్ కందుకూరి వీరేశలింగం పంతులుగారు తమ యాంధ్రకవుల చరిత్రలో నిట్లు వ్రాసిరి. "ఎఱ్ఱాప్రగడకు శివభక్తుఁడగుటచేత శంభుదాసుఁడనియుఁ, బ్రబంధ ధోరణిని భారతారణ్య పర్వమును జమత్కార బంధురముగ రచించుటచేతఁ బ్రబంధ పరమేశ్వరుఁ డనియు బిరుదనామములు కలవు" అని.

ప్రబంధములు, పురాణములు

కాని యిది సరిగా నున్నట్లుతోఁచదు. ఏమనఁగా-బ్రబంధధోరణి యనఁగా నేమి? మనుచరిత్రాదికమును బ్రబంధముల ధోరణిలోనివనియు, భారత భాగవత భాస్కరరామాయణ మార్కండేయపురాణాదికమును, బురాణ ధోరణిలోని వనియుఁ

బండితులుఁ, గవులు సుప్రసిద్ధముగా వాడుచున్నారు. "ప్రబంధ కల్పనా కథా" యను యమరుని సూక్తినిఁబట్టి సామాన్యముగా నష్టాదశ వర్ణనల ద్వారమున రసస్ఫురణఁ గల్గింపఁ బ్రయత్నించు వానినిఁ బ్రబంధము లనియు, నట్లుగాక ధర్మార్థ సంగతముగా హితైక బోధకములగు కథలతో నితివృత్త నిరూపణ ప్రధానములను బురాణము లనియుఁ బెద్దలు విభజింతురు.". ప్రబంధములందు గుణాలంకారాదులు, శబ్దార్థాడంబర వైచిత్ర్యములు, వర్ణనా ప్రాగల్భ్యము మొదలగు వస్తుప్రధాన కవిత యతిశయించియుండును. పురాణములందు, నట నట వర్ణనాది మయమగు వస్తుకవిత యత్యల్పముగా నుండి కథా విస్తరణాత్మకమైన భావ ప్రధాన కవిత్వము విస్తరించి యుండును." అని పండిత గోష్ఠిలోఁ బ్రసిద్ధమే.

వస్తుకవిత

ఉదాహరణము

మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘనసార సాంద్ర వీటీగంధ
స్థగితేతర పరిమళమై
మగువ పలుకుఁ దెలుపు నొక్క మారుత మొలసెన్.

మను చరిత్రము. ౨ఆ.

ఇచట ననుప్రాస శబ్దాలంకారము. మీలిత మర్థాలంకారము. వీటి వస్తువు, అది మారుతానీతగంధమై స్వగత వస్తువిశేషముచేత మగువ పలుకును దెలుపుట ప్రతిపాద్యము.

భావకవిత

భావప్రధానమైన కథా విస్తరణ కవిత కుదాహరణము.

అంతఁబరమేష్ఠి చోదితమైన యొక్క మారుతము నలిరేఁగి దుర్వారభంగి విలయకాల విశృంఖల విపుల వారిధరచయంబుల నెల్లను విరియఁజేయు.

అరణ్యా. ౪ అ. ౨౪౯

ఇటఁగూడ మారుత మున్నది. కాని శబ్దార్థాలంకారములు దాని నలంకరింపలేదు. ప్రళయకాలమునందు జరుగునట్టి కథను విస్తరించుచు సర్వముఁ బరమేశ్వరాధీనమై ప్రవర్తించు నను భావమును బ్రధానముగా తెలుపును. ఇచట వస్తువు, ప్రళయకాలమారుతమున్నను దానికి బ్రాధాన్యముగాని, విస్తరణముగాని లేక యది

కార్యాంతర వ్యావృతమై పరమేశ్వరాజ్ఞా నిర్వృత్తినిఁ దెల్పుటలోఁ బర్యవసించును. "భగవానుని యాజ్ఞవలన నప్పటిగాలి వారిధరములను విరియఁజేయును." అనుకథ నడచును. ఈ తీరు కవిత్వమే యారణ్యపర్వములో నత్యధికముగా నున్నది. ఎటనైననుఁ గొంచెముగా వర్ణన మున్నను నది వెంటనే భావములోనో కథలోనో పర్యవసించునట్లుగాఁ గరిగిపోవును. ఉదాహరింతుము.

భావకథాపర్యవసానము

"స్ఫురదరుణాంశురాగరుచి" ఈ వర్ణనము భావములోఁ బర్యవసించుట ముందు ముందు నిరూపింతుము.

దానామ్బుః పటలంబునన్ బృథుపయోధారవలిం దాల్చి గ
ర్జా నిర్ఘోషము బృంహిత చ్ఛలనఁ బ్రచ్ఛాదించి ప్రావృట్పయో
దానీకంబు శరద్భయంబున నిగూఢాకారతన్ డిగ్గ నాఁ
గా నొప్పారె మదోత్కట ద్విరద సంఘంబుల్ వనాంతంబునన్

కల నీలకంఠ కోలాహల లీలలు సెలగె రాజహంసకులములన్
బులకించె సప్త వర్ణావళి, విగళిత కుసుమ కుటజవాటి కల డరెన్

అతిగాంభీర్య విభూతి నేక చుళుకాహంకార నిశ్శేష శో
షిత పాథోధిపయస్కుఁడైన ముని తోఁచెన్ బుణ్యతేజోమయా
కృతి నయ్యామ్యదిగంత వీథిఁ బ్రకట క్రీడా కళాగర్వగ
ర్జిత మండూక కళంకితాంబు శుచితాసిద్ధిప్రదాచార్యుఁడై.

అరణ్యా. ౪ ఆ. (ఎఱ్ఱన కవిత ప్రారంభము.)

ఈ మొదలగు శరద్వర్ణన మంతయు ముందు రాఁబోవు దుర్యోధనా ద్యుత్కట మదోద్ధతుల ఛలచ్ఛన్నమగు ఘోషయాత్రా సంరంభంబును, వారికిఁ జిత్రసేనాది గంధర్వులవలనఁ గలుగనున్న పరాభవమును, బాండవాగ్రజుఁ డొనర్ప నున్న తద్విమోచనమును దుర్యోధనాదుల దుశ్చేష్టలవలన భీమసేనాదులు కలుషిత హృదయు లగుటయు ధర్మజుని సామాలాపాద్యుపాయముల నది తీరుటయు నింకను నిట్టివ యగు భావాంతరములందువ్యంజక మార్గమునఁ బర్యవసించి వాచ్య ముఖమునఁ దత్కాలమున మహాసరస్వతీనదిలో సలిల స్నానావకాశముల యోగ్యతాభిప్రాయమునకుఁ బోషకమై పాండవులా నదీతీరంబునఁగార్తికమాసంబు కడవఱకు నుండుటను గార్తికస్నానములఁ గర్తవ్యతను నగస్త్యోదయము ద్వారమున జల పారిశుద్ధ్యాదులను దెలిపి నిర్వర్తించుచుఁ బ్రకృతపుఁ గథను - బాండవుల యరణ్యావాసపుఁ గథను ముందుకు నడుపును.

అరణ్య పర్వశేషములోని కవిత్వము ప్రాబంధికము కాదు

ఈ రకపుఁ గవిత్వమును బ్రాబంధికమని తెల్పఁగలమా? తెల్పుదురా యెవరైన? ఈ వర్ణనా ప్రధానమైన కవితకూడ నారణ్యపర్వములో "నెఱ్ఱాప్రగడ కవిత్వము" అను భాగములోఁ జాల యల్పము (నాచన సోమనకును నితనికినిఁ గల భేద మిదే అతఁడు వర్ణనైక ప్రధానమై, శృంగారాది వివిధ రసపరిపోషక మగు కవిత్వపు మార్గమున నత్యుచ్చతమ స్థాయి నందినవాఁడు. మన యెఱ్ఱన మహాకవి పౌరాణిక మార్గమున హృదయముల నలరించుచుఁ గథాకథన స్వభావముతో మృదుల కదళీపాకమునఁ గవితను నడిపించువాఁడు. ఇరువురకును బోలికయేలేదు. రెండును నలరించునవియే కవితామార్గములు, భ్రూవిలాసానభిజ్ఞలగు జనపద వధూలోచనములచేఁ బీయమానుఁ డగు సరసజలద యువకుఁడు శ్రీ విశాలయగు విశాలలోని నాగరిక విలాసిని కటాక్షముల భావముల నలరనిచో వంచితుఁడు నౌఁ బోవునని మహాకవి కాళిదాసు తెల్పలేదా? అందులోని యంతరార్థ ధ్వనిని గుర్తింపక యనవసర కలహముల కవకాశ మిచ్చెదరేల? సరి అది మనకేల?)

ఇంతకుఁ బ్రకృతమునఁ జెప్పవచ్చిన దేమనగా "మన యెఱ్ఱన యారణ్య పర్వ" మను దానిలో నెచ్చటను బారిభాషిక ప్రబంధములగు మనుచరిత్రాదులందుఁ గల వర్ణనాది ప్రధానధోరణి, వస్తువిశ్రాంత్తమైనది కన్పడదు. కనుక నందువలనఁ బ్రబంధ పరమేశ్వర బిరుదము వచ్చినదను కం. వీ. లింగంగారి వాదన యుక్తముకాదని.

ఈ విషయము నింకొక విధముగాఁ బరిశీలింతము.

"ప్రబంధ" పదము నర్థము (ప్రాచీనుల కాలములో)

అసలు మన మహాకవి యెఱ్ఱన నాటికిఁ బ్రబంధపదము తెలుఁగులోనే యర్థ మున వాడఁబడుచున్నదో గమనింతము. తిక్కన విరాటపర్వ ప్రారంభములో

"అని రచనా కౌతుకమున మనమలరఁగ నీ ప్రబంధమండలి కధినాథునిఁ గానే పురుషునిఁ బేర్కొను వాఁడనో యనుతలంపుఁ గూరిన మదితోన్.

"అని పూని యాదృశంబులగు ప్రబంధంబులు దేవసన్నిధిం బ్రశంసించుటయు నొక్క యారాధనావిశేషం బగుటంజేసి"యని విరాట పర్వాదిగా నున్న భారతేతిహాసము నంతయుఁ బ్రబంధమనియే వాడినాఁడు.

ఈ సందర్భములో నాదికవీంద్రుఁడు నన్నయ "మహాభారత బద్ధ నిరూపితార్థమేర్పడ" ననుట గమనింపఁ దగినది. ఇట "బద్ధ" పదముగాక "బంధ" మై యుండునని నా యూహ. లేనిచో నర్థము సరిగాఁ బొసఁగదు. పైన నన్నయ శైలియు నా సమాసము కాఁజాలదు. "బంధ" పదము "ప్రబంధ" పదమునకు - గ్రంథవాచకమునకుఁ బర్యాయము. అయితే దీని నూహించుటకు హేతువేమి?

చెడిపోయిన సీసములు

నన్నయ కవితలోఁ జాలచోట్ల నితరుల చేతులుఁ గలసినవి. అది యిచట సుస్పష్టముగాఁ దెలియఁదగియుండు రెండుదాహరణముల నిరూపింతుము.

నన్నయ సీసములందు వడి, ప్రాస, నియమము కలవనుట సుప్రసిద్ధమే కదా! లాక్షణిక శిరోమణి యగు నప్పకవి స్పష్టపఱచియే యున్నాఁడు. నన్నయ కవితలోని యీ సీసములను జూడుఁడు.

హితుఁడైన తన పురోహితు నుపదేశంబు పేర్మితోఁ జేకొని ధర్మసుతుఁడు
నెమ్మిఁ బుష్పోపహారమ్ముల నాదిత్యుఁ బూజించి భాగీరథీజలంబు
లందుండి విషయంబులం దింద్రియంబుల ననవరతావధానమున నొడిచి
వాయుభోజనుఁడుఁ బ్రాణాయామపరుఁడునై సూర్యాదినామముల్ సూర్యుంగుఱించి.

అరణ్యా. ౧ ఆ. ౪౨ ప.

మూఁడవ పాదము నుత్తరార్థమునఁ బ్రాసనియమము చెడుటయేకాక యసలు యతియే చెడినది.

ఇంకొకటి:

పరశు పాశాంకుశ కరవాల శూల ముద్గరములు నామీఁదఁ దెరలఁ గురిసె
నేనును గడఁగి యద్దానవు శస్త్రముల్ వాయంగఁ జేసితి, మాయఁ జేసి
వెఱవక సాల్వుండు వెండియు నామీఁదఁ బరుష శిలావృష్టి వరుస గురిసె
సమర దమఃప్రకాశములతో దుర్దిన సుదిన శీతోష్ణముల్ గదియఁజేసి.

అరణ్యా. ౧ ఆ. ౧౮౮ ప.

మూఁడవ పాదపుఁ బూర్వార్ధమునఁ బ్రాస నియమము పోయినది. ఇది నన్నయ శైలి కాదు. కనుక నిందువలన నన్నయ కవితలో నితరుల హస్తక్షేపము వలన నీ దుస్సహమగు సాంకర్య దోషము సంభవించిన దనుట స్పష్టమే కదా! కనుక నట్లే బంధపదము "బద్ధ"గా మాఱియుండును.

ఎఱ్ఱన ప్రబంధ మేది?

సరి. అది యట్లుండుఁడు. మనము ప్రబంధ పదము నర్థమును విచారించుచున్నాము. ఇప్పుడు మన మహాకవి యెఱ్ఱనయు నృసింహపురాణ కృత్యాదియందుఁ బ్రబంధ పదము నే యర్థములో వాడినాఁడో కనుఁగొందము.

(1) మించిన వేడ్క వీనులకు మిక్కుటమై మధువృష్టి గ్రమ్మ రా
యంచలు కూయఁ గ్రౌంచమును నావలఁ గూయఁ దొడంగుభంగిఁ బ్రౌ
ఢాంచిత శబ్దసారులు మహాకవు లాద్యులు కావ్యశయ్యఁ గీ
లించిన కీర్తిసంగ సుఖలీలకు నేనును గాంక్ష సేసితిన్

(2) సరస బహుపురాణ ధర్మశాస్త్ర కథావిస్తార వేదివి కావున బ్రబంధ రచనా ప్రావీణ్యము నీకు సహజ పరిచిత సిద్ధంబు.

(3) బ్రహ్మాండాది పురాణోక్తంబయిన శ్రీ నరసింహావతారంబను పురాణంబుఁ దెనుంగుబాసఁ బ్రకటింపవలయు నమ్మహా ప్రబంధమునకు నస్మత్పితామహ హృదయ గుహావిహార సింహంబగు శ్రీమదహోబల నరసింహదేవుఁ డధీశ్వరుం డగుటం జేసి.

(4) కృతికి విభుండు శ్రీవిభుఁడు.

(5) ఏను విన్నపంబు సేయంగల లక్ష్మీనరసింహావతారం బను పురాణ కథకుఁ బ్రారంభంబు.

ఈ యయిదుచోట్ల మాటలును, శ్రీ నృసింహ పురాణముగాని, భారతము గాని, మను చరిత్రాదికము వంటి పారిభాషిక ప్రబంధమని తెల్పఁగలవా? తెలుపలేవు. భారత మెటువంటి కావ్యమో యటువంటి కావ్యమే యీ గ్రంథమును. అనఁగా భారతము నాద్యులగు నన్నయ తిక్కనలేకావ్యశయ్యను రచించిరో, కీర్తినొందిరో యట్టి కావ్యశయ్యను గ్రంథమును రచింపవలెను. కీర్తినొందవలె నను తలంపుతో శ్రీ నృసింహపురాణమును మొదలిడె నెఱ్ఱన. భారతమునందు నన్నయ తిక్కన లవలంబించిన కావ్యశయ్య యనఁగా బురాణ శయ్యయేకదా! అసలీ గ్రంథపుఁ బేరుకూడ నృసింహపురాణమనియే కాని నృసింహ చరిత్ర లేక నృసింహ ప్రబంధమని కాదుకదా, మను చరిత్ర, వసుచరిత్రాదులందున్న ప్రబంధధోరణి కాదుకదా యిది? కనుక నెఱ్ఱన పేర్కొనిన కావ్యశయ్య యాతని గ్రంథములం దంతటను భారతారణ్య పర్వశేషోన్నయమునందును గన్పడు పురాణ శయ్యయే. మఱొకటి కాదు. కనుక మన యెఱ్ఱన మహాకవి కూడ పురాణధోరణి గ్రంథమునే ప్రబంధ

మని తెల్పినాఁడని స్పష్టము. నన్నయ "బంధము", తిక్కన "ప్రబంధము" ఎఱ్ఱన "ప్రబంధము, కావ్యము" ఇవి యన్నియు నొకే యర్థమునఁ బురాణధోరణి గల గ్రంథ మనియే తెల్పునని స్పష్టము.

భారతమునఁ బురాణధోరణియేల?

భారతము శాస్త్రకావ్యము. అందువలన దాని ననువదించు నప్పుడు శాస్త్రోచితమును గావ్యోచితమునగు శయ్య నవలంబింపఁ దగును. నన్నయ యా "మహా భారత సంహితా రచనబంధురుఁడయ్యె జగద్ధితంబుగన్" కనుక "ప్రసన్న కథా కలితార్థయుక్తి"తోఁ బాటు "అక్షరరమ్యత"యు నాదరింపఁబడి "కవీంద్ర కర్ణ పుట పేయమై" "హృదయాహ్లాద" మొనర్చి. సాధుజన హర్షసిద్ధి కల్గింపఁ గలిగినది. కాఁగా శయ్యాపాకములు సముచితముగా నాదరింపఁబడి యందఱి మనసులకును నవగాహనమై యానందదాయకమగు హితరచన. పురాణ రచనను దెనుఁగు మహా భారతమున మన కవిత్రయము సరసముగాఁ గూర్చినది, అయితే కేవలము వైదర్భిశయ్య యగుచోఁ నది కథాకలితార్థయుక్తి కనువుగాదు. గౌడీశయ్య యగుచో జగద్ధితము కాదు. పాంచాలశయ్య యగుచోఁ బైరెండింటికిని మధ్యస్థమై పై రెండు గుణములను సమకూర్పఁగలదు. "అశ్లిష్ట శ్లథభావాఁ తు పురాణచ్ఛాయయాన్వితాం. మధురాం సుకుమారాం చ పాంచాలీం కవయో విదుః" అనికదా వామనాచార్యుఁ డన్నది.

అంతటను బంధశైథిల్య మలవరించి
ప్రాఁతగిల్లిన జయలఁ బాలువడియు
మధురమై సుకుమారమౌ విధినిఁ గవులు
పేరుకొందురు పాంచాలి పేరుతోడ

ఆంధ్ర కావ్యాలంకార సూత్రవృత్తి.

కాని యిది సాంస్కృతికుల మతము. అయితే మన యాదిమహాకవి, సకలాంధ్ర భువనోపజీవ్యుఁడు నన్నయ భట్టారకుఁడు. సర్వే సర్వత్ర సరసోదాత్త మగు వైదర్భీ శయ్యనే చాల జాగ్రత్తగా నుపయోగించి ద్రాక్షాపాకముతో మేళవించి కథాగమనమున కడ్డుతగలకుండ రసమయమగు రచన యొనరించెను. ఆ మార్గమే కవిబ్రహ్మ యగు తిక్కనయు నించుమించుగా నమలోదాత్తమగు శయ్యాపాకముతోనే తన భావమంజుల కవితను సాగించెను. మన యెఱ్ఱన మహాకవి వారిరువురియందును హరిహరులందువలె గాఢ భక్తితత్త్వపరత గలవాఁ డగుటవలన నిరువురి రచనలను ననుసరింపఁబూని. తన శక్తికొలఁదిఁ బాంచాల

శయ్యలో విశ్రాంతుఁ డయ్యెను. కనుకనే నన్నయ రచనలో నెచ్చటను వర్ణనల వలనఁగథాగమన మడ్డుపడక రసమంజులముగాఁ గథాప్రవాహ మత్యంతోదాత్తముగా శ్రవణాంజలి పుటపేయమగు నక్షర రమ్యతతోఁ గవిత యెసలారును. కవిబ్రహ్మ తిక్కన రచనా విన్యాసము కూడ నించుమించుగా నాత్రోవలోనే యనుభావ బహుళమగు భావముతో నుజ్జ్వలమై వర్ణన లెడనెడఁ గొంచెము వ్యవధానము కల్గించినను, దానినిఁ దోపనీయని స్ఫూర్తితో సాగిపోవును. మన యెఱ్ఱన మహాకవి రచనయుఁ బై యిరువురి త్రోవలఁ దప్పిపోవక యటనట వర్ణనలు కథాభావములందు పర్యవసింపఁగా సరళముగా శిథిల మధురమగు నడకతో మాఘమాసపు సరస్వతీ ప్రసన్నతతో మృదువుగాఁ జదువరులఁ దనవంక కాకర్షించును. ఇట్లు మొత్తము మీఁద ముప్పురునుఁ బురాణధోరణిలోనే కావ్యశయ్యతోఁ నాంధ్రుల యదృష్టమును బంగారు పూవులఁ బూయించిరి.

నిజమునకు, నానాఁడు నిపుడుఁ ప్రబంధము లనునట్టి గ్రంథములు కానీ, యటువంటివానికే ప్రబంధములను పేరుకానీ లేదు. (ఇంకను లోఁతుగాఁ బరిశీలించుచో నప్పటి కట్టి ప్రబంధములు పుట్టుట కవకాశము లేనుగూడ లేదు.) ఇది విషయాంతరము. కొలఁది రోజులనాఁడు "ప్రబంధ వికాసము'' అను రేడియో యుపన్యాసములో సమగ్రముగా నిరూపించి యుండుటవలనఁ బ్రకృతములో నుపేక్షించితిమి. అయితే ప్రబంధములకు బీజములు మాత్ర మేర్పడినవి. నన్నయ కవితయందును (ఇంద్రప్రస్థపురాది వర్ణనమునందు) తిక్కన నిర్వచనోత్తర రామాయణము, విరాట పర్వాదులందునుగూడ నివి స్పష్టముగా గోచరించును. అయినను వాని నెవ్వరును ప్రబంధము లనరు. నన్నయ యారణ్య పర్వభాగమునుఁ ప్రబంధమనువా రెవ్వరును గూడ లేరు. ఇందులోఁ బ్రబంధ బీజములు కూడ లేవు. నిజముగాఁ బ్రబంధ బీజములున్న గ్రంథములను రచించిన నన్నయకుఁగాని తిక్కనకుఁగాని నానాఁడు "ప్రబంధ'' పదఘటితమైన బిరుదములేదు. ఇంకొక చిత్రము. "వల్మీకభవు వచోవైఖరి రామాయణమ్ము నాంధ్ర ప్రబంధముగఁ జేసె'' నని చదలవాడ మల్లన-మన యెఱ్ఱన మహాకవి చిన్నమనుమఁడు వ్రాసినట్లుగా, నితఁడు రామాయణ ప్రబంధ రచన యొనర్చినపుడు "ప్రబంధపరమేశ్వర బిరుద మెఱ్ఱన కెవ్వరు నీయలేదు. కానీ, యెట్టి ప్రబంధ లక్షణములను, బ్రబంధ బీజములు లేని యీ యరణ్య పర్వశేషమును బూరించినపుడు మాత్రము సుజను లీ బిరుదము నిచ్చుట విచిత్రము కాదా!''

అరణ్యపర్వ శేషములోఁ బ్రబంధధోరణికానీ, అది చమత్కార బంధుర మగుటకానీ లేదు.

ఇంకొక విషయము. "ప్రబంధధోరణినిఁ జమత్కార బంధురముగా నారణ్య పర్వశేషమును రచించెనఁట." అసలారణ్య పర్వశేషములోఁ బ్రబంధధోరణి కానీ యది చమత్కారబంధురమగుట కానీ లేదు. విరాట పర్వాదులకన్నఁ జమత్కారముగాఁ గూడ లేదు. నిజమున కీ యారణ్యపర్వశేషము నన్నయ రచించిన వెనుకటి భాగమున కన్నను, తిక్కన రచించిన విరాటపర్వాదిక మగు నుత్తర భాగము కన్ననుగూడ, నెఱ్ఱన రచించిన యితర గ్రంథముల కన్నను గూడఁ దక్కువ రకములో నున్నది. రచనలో జిగిబిగి కాని, శయ్యాపాకాదులు కాని వానితో సమానము కావు. చమత్కారమునఁ గూడ న్యూనముగానే యున్నది. ఈ విషయము సకల సహృదయ పండిత కవులకే గాక శేషభాగరచనా వాదులగు కం. వీ. గారు, శేషాద్రి వేంకటరమణ కవులు మొదలగువారందఱికినిఁ గూడ నొప్పుకొనక తప్పనిదే. అట్టియెడఁ "బ్రబంధ" పదఘటిత బిరుదము నన్నయ తిక్కనల కీయక వారికన్న న్యూన చమత్కార మగు దీనినిఁ జమత్కారబంధుర మనుకొనువారు సుజను లెట్లగుదురు? వారిచ్చిన బిరుదము సభా జనార్హ మెట్లగును? కనుక నెన్ని విధముల విచారించినను కం. వీ. గారి వ్రాఁత బాగా లేదు.

ఉపపత్తి

సరి, యీ బిరుదపు టుపపత్తియేమి? దీనినిఁ గనుఁగొందము.

ఈ బిరుదమే సందర్భములో నీయఁబడినదో విచారింతము.

అరణ్య పర్వము చివర

తే॥ ఎఱ్ఱనార్యుండు సకలలోకైకవినుతుఁడైన నన్నయభట్ట మహాకవీంద్రు
సరస సారస్వతాంశ ప్రశస్తిదన్నుఁ జెందుటయు సాధుజన హర్ష సిద్ధిఁగోరి
క॥ "ధీరవిచారుఁడు తత్కవితారీతియుఁ గొంతదోపఁ దద్రచనయ కా
నారణ్య పర్వశేషముఁ బూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్

అని యున్నది.

ఇఁక నృసింహ పురాణములో

"ఎన్నికమైఁ బ్రబంధ పరమేశుఁడనంగ....నారణ్య పర్వశేషోన్నయ మాచరించి సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా" అని యున్నది. దీనివలన నేమి

తెలియుచున్నది? ఆరణ్య పర్వశేషోన్నయమును జూచి హర్షించిన సుజనులు "ప్రబంధ పరమేశ్వరుఁడు" అను బిరుద మొసంగిరి. "ఉన్నయము" అనఁగా "పూరణము" అని. వారు బిరుదము నిరర్థకముగా నొసఁగరుకదా? అందువలన నీ బిరుదమునకును నా పూరణమునకును నేదో ఘనిష్ఠమైన సంబంధ మున్నదని తోఁచును. లేదేని సుజను లా బిరుదము నెట్లొసఁగుదురు? సంబంధములేని "రావుబహదూర్" మొదలగు బిరుదముల నిప్పటివారివలె నొసఁగినచో వారు సుజను లెట్లగుదురు? అ ట్లొసఁగుట సుజన ధర్మము కాదుకదా? కనుక నారణ్య పర్వశేషోన్నయ మొనర్చుట ప్రబంధ పరమేశ్వర కృత్యమని యా రెంటికిని సంబంధమును వారు గ్రహించిరి.

ఈ సంబంధము కం. వీ. గారు చెప్పినది కాదని యిదివఱకే నిరూపించితిమి. అనఁగా నారణ్య పర్వశేషోన్నయము ప్రబంధము. (ఉన్నయము - పూరణము) నొనర్చినవాఁడు కనుక మన యెఱ్ఱన మహాకవి పరమేశ్వరుఁడు. అనగా-హరుఁడు అయితే యితనిని హరుఁడని యేల తెల్పవలెనో?

ఇది విచారింతము.

'అని యిట్లు వచనము'

నన్నయ భట్టారకుఁడు తన భారత కృత్యాదియందు "అని యిట్లు సకల భువన రక్షణ ప్రభువులైన హరిహర హిరణ్యగర్భుల పద్మోమావాణీపతుల" అని క్రమముగా మొదట హరినిఁ దరువాత హరుని, పిమ్మట హిరణ్యగర్భునిఁ బ్రశంసించెను. ఇది భవిష్యదర్థ సూచనమునకు బీజరూపమగు విన్యాసము. సంస్కృత భారతము వ్యాస వైశంపాయన సూతులను ఋషిత్రయముచేఁ బ్రకాశితమై నిర్వహింపఁబడినది. అట్లే యాంధ్ర మహాభారతముగూడ నట్టి ఋషులు ముప్పురిచే నిర్వహింపఁబడవలెనని భగవానుని సంకల్పము కాఁబోలును. ఆ దైవ సంకల్పమున కనుగుణముగానే యిట నన్నయాదులు ముప్పురిచేతనే యిది నిర్వహింపఁబడి ప్రకాశితమయ్యెను. ఈ భవిష్యదర్థమే నన్నయ "అబోధపూర్వము"గా గ్రంథాదియందు వెనుక వ్రాసిన వాక్య రూపమున స్మరించెను. సంస్కృత భారతము "వ్యాసో నారాయణో హరిః" అను ప్రమాణమున నారాయణుఁడైన వ్యాసునిచే "నారాయణం నమస్కృత్య" యని నారాయణోపక్రమముగానే బయల్పఱుపఁ బడినది కదా! అట్లే యాంధ్ర మహాభారతము గూడ నారాయణుఁ డగు (నన్నయ శబ్దము నారాయణ శబ్దభవ మని పెద్దల వాడుక) నన్నయ యుపక్రమించుట యుక్తమే కదా!

ఇట్లు హరి-యాద్యుఁడు నన్నయ ప్రబంధ రచనను మూఁడు పర్వముల దనుక నెరవేర్చెను. ఆ పిమ్మటఁ దిక్కన సోమయాజి రచన పదునైదు పర్వములు తుదిదాఁక నెరవేర్చెను. అతఁడు హిరణ్యాగర్భుఁడు. చివరవాఁడు హిరణ్యాగర్భుఁ డేకదా: తిక్కన కవిబ్రహ్మ యని మన యెఱ్ఱన మహా కవియే "కవిబ్రహ్మ నా వినుతింతున్ గవి తిక్కయజ్వ నిఖిలోర్వీ దేవతాభ్యర్చితున్" అని తెల్పినాఁడు. అసలాంధ్ర కవిప్రపంచమునందంతటను నతఁడు "కవిబ్రహ్మ" యనియే సుప్రసిద్ధముకదా: ఇట్లాద్యుఁడగు హరియుఁ జివరివాఁడు హిరణ్యాగర్భుఁడును నాంధ్ర మహాభారత రచనమునఁ బాల్గొనిరి. కాని యిట రెండవవాఁడగు హరుఁ డు మిగిలిపోయినాఁడు. ఈ రచనమున నింత వఱకుఁ బాల్గొనలేదు. అంతేకాక యతని సమయమునకు నారణ్య పర్వశేషము పూరింపవలసిన స్థితి యేర్పడి ముందు గ్రంథము విరాటపర్వముతో నదుక కున్నది. వెనుకటి భారత గ్రంథము-ఆరణ్యాపర్వశేషము నాల్గాశ్వాసము లించుమించుగా నున్నదియు, ముందున్న విరాట పర్వమును, సరిగా బంధింపఁ బడక-అనఁగా సరిగా నదుకునట్లు కూర్పఁబడక విచ్ఛిన్నముగానే యుండిపోయినవి. దాని నా శేషగ్రంథము నీ మహామహుఁడు సరిగా నున్నయ మొనర్చి-పూరణ మొనర్చి వెనుక ముందుల గ్రంథమును సరిగా నేకముఖముగా సంధించి ప్రబంధించినాఁడు. ఇట్లు సరిగా నదుకున ట్లొనరించి నిర్వహించిన దెవ్వరు? శంభుదాసుఁడు. శంకర స్వామి శిష్యుఁ డు. శంభుదాసులకు శంభుసారూప్యము సుప్రసిద్ధమే. కనుక హరుఁడైనాఁ డెఱ్ఱన. సుజనులీ విశేషమునంతను గ్రహించిరి. అదివఱకు విచ్ఛిన్నముగా నున్నవానినిఁ బ్రబంధించి శంభు సారూప్యముచే హరుఁడగు నెఱ్ఱనను "ప్రబంధ పరమేశ్వరుఁ డు" అని కీర్తించిరి. గ్రంథపు వినాశము హరున కవకాశమిచ్చినది. ఇది యుచితము. అయినను నా వినాశము స్ఫురించి యుద్వేగము కలుగకుండుటకును బ్రకృత క్రియ వినాశ ప్రశమనమగుటను గమనించిన మన సుజనులు 'బ్రబంధ హరుఁ డు' అనక 'ప్రబంధ పరమేశ్వరుఁడు' అని యెఱ్ఱనను సత్కరించి తాము ధన్యులైరి.

శ్రీ వాణీ గిరిజా:- శ్లోకము

ఈ విషయములో నాంధ్ర మహాభారతపు మొదటి శ్లోకము కూడ సూచన కవకాశ మొసగుఁను. అట మూర్తిత్రయము, తరువాతి గద్యములోని క్రమము కన్న వేఱుగా 'శ్రీవాణీ గిరిజాధిపులని పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరు'లని యున్నది. మొదటిదగు శ్లోకమునుబట్టి బ్రహ్మ రెండవవాఁడు. ఈ సూచనవలన కవిబ్రహ్మ రెండవ నిర్మాత యయ్యెను. శ్రీకంధరుఁడు మన ప్రబంధ పరమేశ్వరుఁడు

తరువాత కవియని సూచనయందున్నది. వచనములో, శ్లోకములోని కవుల పరిణామము సూచితమైనది. కనుకనే మూఁడవ నిర్మాతయైన ప్రబంధ పరమేశ్వరుఁడు పురుషోత్తమాంబుజభవులకు నడుమవాఁడుగా స్వకృత గ్రంథ స్వభావముచే నయ్యెను. రాధామాధవకవి యీ విషయము నందిట్లనుచున్నాఁడు.

భారత కావ్య హార మొక భాగము నన్నయభట్టొనర్చె ము
క్తారమణీయ వాక్యములఁ దక్కిన భాగము సోమయాజి సొం
పార నొనర్చె రెంటిఁగలయన్ శివదాసుఁడు మధ్యనాయక
శ్రీ రచియించె శారద ధరింపఁ గవిత్రయ కీర్తిమించఁగన్.

వీరు ముప్వురును సకల భువన రక్షణ ప్రభువులు, సకల (స+కలా) భువన మనగా నాంధ్ర కవితా కళా ప్రపంచము. దానికి రక్షణ సమర్థులు కవిత్రయమువారు. ఆంధ్ర కవితా కళాప్రపంచము నుద్ధరించిరనుటలోఁ దెనుఁగు నాట సంశయము లేదు కదా. ఒక కవియు నిట్లు తెల్పియున్నాఁడు.

మహి ము న్వాగనుశాసనుండు సృజియింపన్ గుండలీంద్రుండు త
న్మహనీయస్థితి మూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవన్ మహా
మహిముల్ సోముఁడు భాస్కరుండు వెలయింపన్ సొంపువాటించు నీ
బహుళాంధ్రోక్తిమయ ప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్.

(భట్టుమూర్తి-వసుచరిత్రము)

ఇట భాస్కరుఁడు. మన యెఱ్ఱన-యరుణుఁడే కాని భాస్కర రామాయణకర్త హుళక్కి భాస్కరుఁడు కాఁడు. అతనికి సోమునితోడి సాహచర్య మేది? హరివంశ రచనచే నాచనసోమునితో సాహచర్యము మన యరుణునకు నెఱ్ఱన కున్నది కనుక మన యెఱ్ఱనయే యిట భాస్కరుఁడు - స్ఫురదరుణుఁడు.

ఈ యారణ్య పర్వశేషోన్నయము వలననే యీ మహనీయుఁడు నన్నయ తిక్కనలతోఁ బాటు భారత కవిత్రయ పూరకుఁడయ్యెను, ఇతనినాటినుండియే భారత కవిత్రయ ప్రసిద్ధి యేర్పడినది. అంతేకాక 'నిత్యసత్య వచనుఁడగు నన్నయ భట్టారకుని' 'హరిహరహిరణ్యగర్భులు' అను వచనము తన సూచనతో సత్యాపితమైనది.

లౌకికానాం హి సాధూనాం అర్థం వాగనువర్తతే
ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోఽనుధావతి.

(లోకమునందలి సాధువులు ముందు రాఁబోవు నర్థమునుబట్టి మాటాడుదురు. ఆర్యులగు ఋషు లాడెడు మాటలను బట్టి ముందు జరుగఁబోవునవి జరుగును.) యని కదా మహాకవి భవభూతి తెల్పినది:

కాఁగా ప్రబంధపరమేశ్వర బిరుదమునకు మూలమైనది 'ఆరణ్యా పర్వశేషోన్నయము' అన్నది స్పష్టము. ఆ యారణ్యా పర్వశేషోన్నయ మనఁగా నేమో విచారింతము. ఒకచోట-నృసింహ పురాణములో, 'ఆరణ్యా పర్వశేషోన్నయము' అనియు. మఱొకచోట-నారణ్యాపర్వము చివర 'అరణ్యా పర్వశేషముఁ బూరించె' ననియు నున్నది. వాని యర్థమేమో విచారింపవలసియున్నది.

అరణ్యా పర్వశేషోన్నయము, అరణ్యాపర్వశేషముఁ బూరించెన్.

ఇది 'ఉన్నయము' అను పదము నర్థమునఁ జాలమంది విప్రతిపన్నులైరి. అందుఁ గొందఱు రచనము అని యర్థమొనర్చిరి. ఆరణ్యాపర్వములో 'స్ఫురదరుణాంశు' అను పద్యము మొదలుకొని, యేడవ యాశ్వాసము చివర వఱకును ఎఱ్ఱన యెఱ్ఱాప్రగడ కవిత్వము' అను శీర్షిక యున్నది. కనుక ఎఱ్ఱన మహాకవి యారణ్యా పర్వశేషమును, ననఁగా మూఁడాశ్వాసముల పై చిల్లర ప్రబంధమును రచించెననియే వారి విశ్వాసము.

మఱికొందఱు 'ఉన్నయము'' అనఁగా "ఊహించుట" లేక "పైకిఁ దీసుకొని వచ్చుట'' అను నర్థమును దెల్పిరి. అనఁగా నరణ్యా పర్వము సమగ్రముగా మూఁడు కృతులు-మూఁడు పర్వములును నన్నయ రచించినవే. అందులో నారణ్యా పర్వపుఁ జివరి భాగము కొంత కొంత శిథిలమై పోవఁగా నటనటఁ దోఁచు నన్నయ కవితా రీతినిఁబట్టి యూహించి. యనఁగా నన్నయ యిట్టిట్లురచించి యుండునని భావించి యటనటఁబూరించి, యదివరలోఁ జెదలు మొదలగు వానివలన శిథిలములై పైకి రాలేక యెటనో దేనిచాటునో పడియున్న నన్నయ పద్యభాగములను శిథిలములయిన వానిని, లోకములోఁ బండితకవి సుజనులకు హర్షము సిద్ధించునట్లుగాఁ బైకిఁ దీసుకొని వచ్చినవాఁడె ప్రబంధ పరమేశ్వరుఁడు. ఎఱ్ఱన మహాకవి యని వారి తాత్పర్యము.

ఈ తీరున శేషభాగ రచన మని కొందఱును, శిథిలాంశ పూరణమని మఱి కొందఱును రెండు పక్షములవారును నానావిధముల వాద ప్రతివాదములను "ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక'' మొదలగువానిలోఁ జాల కాల మొనర్చిరట. కాని, వానిని నేనెంత ప్రయత్నించినను గనుఁగొనఁజాలక పోయితిని. అయితే మన మీ

రెండు పక్షముల వారికిని మధ్యస్థులమే. ఏదే నొక పక్షము నవిచారితముగా నభిమానించుచో దృష్టి పక్షపాతకలుషితమై వాస్తవము గమనించఁజాలక పోదుము. కనుక మనమే పక్షమునకును జేరక స్వతంత్రముగా నాలోచించి నిర్ణయించుట కుపక్రమింతము. మన మాలోచించి నపుడు ప్రకృతములో నున్న ప్రమాణములను బట్టియే ప్రయత్నింపవలెను. ప్రమాణానుగతమైన దృష్టియే తత్త్వదర్శనమును గల్గించి తీరునుగదా?

ప్రమాణములు

అయితే మన మీ విషయములో గ్రహించవలసిన ప్రమాణము లేవి? అనఁగా వేనినిఁ బ్రమాణముగా గ్రహింపనగును? అనుట, మొట్టమొదట నెఱ్ఱన మహాకవి వాక్యములు ప్రమాణములుగా గ్రహింపక తప్పనివేకదా? అతఁడే కదా ప్రకృత గ్రంథకర్త! ప్రకృత గ్రంథపుటుపక్రమమును నిరూపించినవాఁడతఁడే కదా! ~~ఈతని~~ తరువాతఁ బకృత గ్రంథమునకు సంబంధించిన యితర ప్రామాణిక మూర్ధన్యులవాక్యములు మనము ప్రమాణములుగాఁ గైకొనఁదగి యుండుటలో నభ్యంతర మేముండును?

ఎఱ్ఱన మహాకవి యారణ్య పర్వము చివర వ్రాసిన వాక్యముల నీవఱకే యుదాహరించితిమి, వాని యుర్థమును సరిగా విచారించి తెలిసికొందము.

ఎఱ్ఱన వాక్యములు

ఎఱ్ఱనార్యుఁడారణ్య పర్వశేషమును బూరించెనని యన్వయము ఎట్లు పూరించెను? తద్రచనయకా-నన్నయభట్టు రచనగానే యేల? తత్కవితారీతియుఁ గొంతదోప నన్నయభట్టు కవిత్వపుఁ దీరు గూడఁ గొంత కనఁబడగా ("రవిదోపన్ మునిదోఁచెన్" (ఎఱ్ఱన) ఇత్యాదులందున్న యర్థమును గ్రహింపవలెను) ఎట్లు తోఁచినది? ధీర విచారుఁడు, నిబ్బరముగా నెమ్మదిగా నాలోచించి వెదుకఁగా ("విచారించుట - investigation . ఆ యిల్లిక్కడ విచారించండి యని తెలుఁగు వాడుక.) ఏల తాను విచారింప వలసి వచ్చెను? సాధుజన హర్షసిద్ధిగోరి-సుజనులకు సంతసముఁగూర్పఁదలఁచినపుడు? నన్నయభట్టు సరససారస్వతాంశ ప్రశస్తి తన్నుఁ జెందుటయు - నన్నయభట్టారకుని రసవంతమయిన సాహిత్య గ్రంథములోని - మహాభారతములోని భాగముయొక్క మంచితనము తనకుఁ దెలియఁగానని యాకాంక్షా క్రమమున నర్థము.

నన్నయభట్టు యొక్క రసవంతమయిన యాంధ్ర మహాభారతములోని

కొంత భాగ మింపుగా, దోఁచఁగా (ఇందువలన నెఱ్ఱన నాటికి నారణ్యపర్వపుఁ జివర భాగము శిథిలమైపోయి కొంత శిథిలముగా నున్నదని సూచితము. లేదేని సారస్వతము నంశమే దొరుకు టెట్లు? సకల లోకులకును సుప్రసిద్ధమయిన (సకలలోకైకవిదితుఁడయిన) నన్నయ సారస్వతము "జగద్ధితంబుగన్" అని సాధుజనముల హితముగోరియే యుదయించినది కనుక, నది కొంత దొరకఁగాఁ జదివి దాని ప్రాశస్త్యమును బట్టి యింకను బాగుగా వెదకి యచ్చటచ్చట నన్నయ కవితారీతి కన్పడఁగా - అనఁగాఁదాను వెదకుటవలన నన్నయగ్రంథ మింకను బయటపడి కన్పడఁగా, నారణ్యపర్వపు శేషమును శిథిల భాగమును నన్నయరచనగానే కవీంద్రు లాస్వాదించునట్లుగా నెఱ్ఱన మహాకవి పూరించెను. అని తాత్పర్యము. నన్నయ

> సారమతిం గవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తి లో
> నారసి మేలునా నితరు లక్షరరమ్యత నాదరింప నా
> నా రుచిరార్థ సూక్తి నిధి నన్నయభట్టు తెనుంగునన్ మహా
> భారత సంహితారచన బంధురుఁడయ్యె జగద్ధితంబుగన్.

ఆది. ౧ అ.

అని కవి పండితుల కాదరము కల్గునట్లుగా సకల సాధు జగద్ధితంబు పొంటె దెలుఁగు మహాభారత సంహిత రచింప దొరకొనెను. కనుక నాతని గ్రంథములోని కొంత మంచి భాగ మెఱ్ఱనకు దొరకఁగా దానినిఁ దాను బాగుగాఁ జదివెను. దాని స్వారస్యము తన మనసునకు నచ్చినది. సాధుజనులకై నిర్మితమగు నీ గ్రంథము శిథిలమై సరిగా దొరకక యనుభవింపలేకపోవుటవలన సాధుజనులు చింతిలఁ, జొచ్చిరి. వారికి హర్షము కల్గుటకై నన్నయ తలంచిన ప్రయోజనము నెరవేరుటకై యా శిథిలములను బట్టి యింకను గొంత నెమ్మదిగా నటనట విచారించినాడు. అపుడు నన్నయ కవితా రీతి -కవిత్వాంశములు తోఁచినవి - కన్పడినవి, దానినంతను నడుమ నడుమఁ దాను నన్నయ కవితానుగుణముగాఁ - గవీంద్రులు విని నన్నయ కవి యనఁదగునట్లుగాఁ బూరించెను. దేనిని? అరణ్య పర్వశేషమును, అంతేకాని యారణ్యపర్వమును గాదు. శిథిలమైనదానినిఁ గదా పూరింపవలసినది. శేషము శిథిలమైనది. దానినిఁ బూరించెను. అంతేకాని యారణ్యపర్వము మొత్తము శిథిలము కాలేదే? కనుక నారణ్యపర్వమును బూరించెననక యారణ్య పర్వశేషము బూరించెననుటలోనే శేషాంశములోని శిథిలాంశములకడ నటనటఁదన పదవిన్యాసమే 'నారణ్య పర్వముఁ బూరించెన్' అనవలదా? పూరించవలసినది దేనిని? ఆరణ్య

పర్వమా? తచ్ఛేషమా? శేషము రచితము కానినాఁడు పర్వము పూరణీయము. (కుండలో నీరు కొంతపోసి కొంతపోయక యున్నపుడేది పూరణీయము. కుండకదా? నిండుట యనునది కుండయొక్క సమష్టిధర్మము కాని యవశిష్టభాగపు ధర్మము కాదే? దాని ధర్మము జలకలితమగుటయే కదా! అట్లే) ప్రకృతములో శేషము - ఇపు డెఱ్ఱన రచించె ననుచున్న భాగము ఎఱ్ఱననాటికి రచితము కానిచో నారణ్యాపర్వమును బూరింపవలెనుగాని (ఆరణ్యాపర్వ) శేషమును గాదు పూరింప వలసినది. "పూరించుట" యనఁగా "రచించుట" యని తప్పర్థము చేసుకొని పొరపడుచున్నారు. కనుక శేషము రచిత శిథిలమైనది. దాని నతఁడు పూరించెను. శిథిల భాగములకడ మాటల నదికి పూరించెను. ఈ విషయమును సరిగా గ్రహింపక (ఆలోచింపక) పోవుటవలన వివాద మేర్పడియుండును. ఇంతకుఁ దేలినదేమి? అరణ్యాపర్వము శేషాంశ రచనచేతఁ బూరింపఁ బడలేదనియు, శిథిలాంశ రచనచేత నారణ్యా పర్వశేషమే పూరితమయినదనియు, దీనిని నెఱ్ఱన చెప్పిన మాటలే స్పష్టపఱచుచున్నవనియు, అరణ్యాపర్వశేషము శిథిలమయినదనియు నా శిథిలభాగములను మన యెఱ్ఱన మహాకవి సరిగాఁ బూరించెననియు నీ యర్థము నెఱ్ఱన మహాశయుని మాటలే స్పష్టముగాఁ దెలియఁ జేయుచున్నవనియును బర్యవసానము.

సరస సారస్వతాంశ ప్రశస్తి

ఇచట "సరస సారస్వతాంశ ప్రశ స్తిదన్ను ఁజెందుటయు" అనగా "నన్నయ యొక్క విద్యావిశేష మెఱ్ఱనకుఁ జెందినది" యని యర్థ మొనరింతురు. అది సరి కాదు. సారస్వతమనఁగా సాహిత్య గ్రంథము. సరస్వతి యన వాక్కు! తన్-విష్యం దము సారస్వతము గ్రంథము, సాహిత్య గ్రంథమునకు సారస్వత మనియు, సకల విధి గ్రంథములకు వాఙ్మయ మనియు వాడుక సుప్రసిద్ధము. ప్రతాపరుద్రీయము మొదట "సారస్వత ప్రక్రియా బీజన్యాస భువః" అని యున్నది. దానికి సారస్వత ప్రక్రియా: కావ్యనాటకాది వాఙ్మయ విశేషాః? అని కుమారస్వామి సోమపీథి రత్నాపణ వ్యాఖ్య. విద్యా విజ్ఞానాంశ మను నర్థము సరస లభ్యము కాదు. అంతేకాక "ప్రశస్తి" యనుదాని కపుడసలర్థమే లేదు. "సరస" అను దానితోనే గతార్థమగును. ఇట్లే "ధీరవిచారుఁడు" పద్యమంతయు నిరర్థకము. "పూరించెన్" దుష్ప్ర యుక్తము వారి పక్షములో నారణ్యాపర్వము పూరణీయముకాని. శేషము కాదుగదా! ఇట్లే యా పక్షము పదానురూప్యము లేకుండ నడుగిడుట కన్పడును. మఱియు నృసింహ పురాణములో "అరణ్యాపర్వశేషోన్నయ మాచరించి" యన్నాఁడు

కాని "శేషరచనము" అనలేదు. "ఉన్నయ" పదమున కర్థము "పైకిఁ దీసుకొనివచ్చుట" లేక "యూహించుట." ఇంతేగాని "కవితా రచన" యని యర్థము లేదు. అసలితఁడే యున్నయమనఁగా "నారణ్యపర్వశేషముఁ బూరించెను' అని యర్థము చెప్పు కొన్నాఁడు. ఇఁక:- లక్షణ నాశ్రయింతమన్నను నది యశక్తి లక్షణయే యగును. కాని యెట్లో యొప్పుకొందమన్నను "నారణ్యపర్వ శేషముఁ బూరించెన్" అనునది స్వవచన వ్యాఘాతమై దీనిని బాధించును. ఇట్లు సాధక మేమియు లేక బాధకములున్న యర్థముఁ జెప్పనొప్పదు. లేదా?

తిక్కనాదుల వాక్యములు

ఇంతకును మన మీ యాలోచనయంతయు, నన్నయభట్టారణ్యపర్వమును సమగ్రముగా రచింపలేదను నూహతో నొనరించుచున్నాము. కాని ప్రమాణములో యూహకు వ్యతిరేకముగా నున్నవి.

ఈ యాంధ్ర మహాభారతముతో బాగుగాఁ బదునైదు పర్వముల సంబంధము కల్గియున్న కవిబ్రహ్మ తిక్కన సోమయాజి నన్నయ గ్రంథమునుగూర్చి యిట్లు వ్రాసినాఁడు.

"ఆదరణీయ సార వివిధార్థగతి స్ఫురణంబు గల్గి య
ష్టాదశ పర్వనిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నం
దాది దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వ విశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్"

మూఁడు కృతులు-మూఁడు పర్వములు. దీని నీతని శిష్యుఁడు మారన స్పష్టపఱచుచున్నాఁడు.

"సారకథా సుధారస మజస్రము నాగళ పూరితంబుగా
నారఁగఁ గ్రోలుచున్ జనులు హర్షరసాంబుధిఁ దేలునట్లుగా
భారత సంహితన్ ముని త్రిపర్వము లెవ్వఁ డొనర్చె నట్టివి
ద్యారమణీయు, నాంధ్ర కవితాగురు నన్నయభట్టుఁ గొల్చెదన్"

(మార్కండేయ పురాణము)

కాకునూరి అప్పకవి విస్పష్టముగాఁ దన గ్రంథములో

ఆ మూఁడు పర్వములలో నా మాన్యుఁడు నుడువు తెఁనుగు లరసికొని, "కృతుల్ దాము రచించిరి. తిక్కసుధీమణి మొదలయిన తొంటి తెనుఁగు కవీంద్రుల్" అన్నాడు.

"షుమారు" వాదము

ఇక్కడఁ కందుకూరి వీరేశలింగంగారు "ఎనిమిది వందల ముప్పదియాఱు మంది సభకు వచ్చినను" "వేయిమంది" వచ్చి రందురు. అట్లే రెండు పర్వముల మూఁడాశ్వాసముల నూట నలుబది రెండు పద్యములయినను మూఁడు పర్వములు రచించె నన్నారు తిక్కనాదులు" అని చెప్పిరి. సభకు వచ్చినవా రింతమందే యని నిర్ణయమయిన తరువాత "వేయిమంది" యనుమాట *లాక్షణిక మని, "సామీప్య నిమిత్తక" మని గ్రహింపఁబడును. అది నిర్ణయము కానంతవఱకును బై మాటకు వేఱర్థము చెప్పినచోఁ దప్పను టందఱికిని దెలిసినదేకదా! ప్రకృతములో మూఁడు పర్వముల పైచిలుకే నన్నయ రచించెనని నిర్ణయమగుచో నీ మాటలు లాక్షణికము లగునని వారు చెప్పిన "షుమారు" అను నర్థము గ్రహింపనగును. అట్టి ప్రమాణమే వారి కెంత తంటాలు పడినను దొరకదు. అప్పుడా మాటలకు వేఱర్థము తెలుపఁ బోవుట కేవలము ననుచితము.

మఱియు నికరముగా నెంతయో తెలిసిన వారట్లెన్నఁడును వేయిమంది వచ్చి రనరు. నికరముగా లెక్క తెలియనివారును, బ్రచారమునకై యబద్ధము లాడువారును మాత్రమే "వేయిమంది" యనెదరు. ప్రకృతములోఁ దిక్కనాదులకు నన్నయ గ్రంథము యొక్క వాస్తవస్థితి తెలియదందుమా? తెలియునందుమా? ఏ పక్షమయినను కం. వీ. గారికి బాధకమే. తిక్కన సరిగా తెలియకయే "మూఁడు పర్వములనుచోఁ దిక్కన నాటికే యాగ్రంథ మరణ్యావాసమో యజ్ఞాతవాసమో చేయుచున్నదని యేర్పడును గనుక నా గ్రంథము శిథిలమగుటను గూర్చిన వారి యాక్షేపణలనాలోచితములగును. నికరముగాఁ దెలియునన్నచో "నన్నయ మూఁడు పర్వములు రచింపనియెడల" నట్లు చెప్పుట యనృతమగును. అస్వాభావికమును నగును. తిక్కనాదు లస్వాభావికముగా ననృతమాడవలసినంతటి దురవస్థను వీరేశలింగంగారు తెచ్చిపెట్టుకున్నారు. ఇది వారికే యుచితముగాని తదితరు లుచిత మనుకొనరు.

అసందర్భములు

ఈ శేషరచనా పక్షములో నింకొక యసందర్భ మున్నది. అన్ని చోట్లను నర్థ

** ముఖ్యార్థ బాధాదికము లక్షణకు బీజము. అది యిట నన్యోన్యాశ్రయ దోషము వలన సంభవింపదు. ఎట్లనఁగా- ఎఱ్ఱన యారణ్య పర్వశేషమును రచించెనని ప్రమా నిర్ణీతమైనదిగాని 'ఉన్నయ' పదపు ముఖ్యార్థమునకు బాధ చెప్పుట కుదురదు. ఇట్లు బాధయేర్పడినఁగాని యిట రచనయును నర్థము దెల్ప ననువు పడదు.*

వైషమ్యము. "త్రిపర్వము ఒనర్చెన్" "మూఁడు కృతులు- ఒనర్చె-నన్నయభట్టు". "ఆ మూఁడు పర్వములలో నామన్న్య నుడుపు తెనుఁగును" అని యన్న ప్రామాణికులు ముగ్గరి మాటలకును "మూఁడు కృతులు చేయలేదు. రెండున్నఱ కృతులే రచించెను" అని యర్థము తేల్పవలెను. "అరణ్యాపర్వశేషముఁ బూరించెన్" అని కవియే స్వయముగా నన్న దానికి "అరణ్యాపర్వ శేషమును బూరింపలేదు. ఆరణ్య పర్వమునే పూరించెను" అని యర్థము తేల్పవలెను. చేసిన దానికి చేయలేదనియు, నొకటి చేసితినన్న మఱొకటి చేసెననియు" నర్థకల్పన, మిథ్యా కల్పనయే కాని వాస్తవము కాఁజాలదు కదా! (ఇది "ముద్దాయి నేరము చేసితి" నని యొప్పుకొను చున్నను. ప్లీడరు "అతఁడు నేరము చేయలేదు" అని వాదించుచున్నట్లుండలేదా?) అదియునుఁగాక "ఉన్నయను" అనఁగా "రచన" యని యర్థము ననుచితముగాను, నసంగతములుగాను జెప్పవలెను. ఇది కేవలము విపరీతము. ఇన్ని యసందర్భముల తోడి యీ యారణ్య పర్వశేష రచనావాద మారణ్య పర్వశేష రచనవలె యెఱ్ఱన మహాకవీంద్రుని విషయమున మిథ్యా కల్పనయే యగుచున్నది.

భారతము సమగ్రము కాఁబోదు

ఇదియుఁగాక యీ సందర్భములో నింకొక విషయముగూడ ముఖ్యముగా గమనింపవలసియున్నది. తిక్కన విరాటపర్వము మొదలుపెట్టుటలో నిట్లుపపత్తి చూపియున్నాఁడు. అదియును (ఆ భారతమును)

... ...

అష్టాదశ పర్వనిర్వహణ సంభృతమై పెనుపొందియుండ నందాది దొడంగి మూఁడు కృతులొనర్చి .... నన్నయభట్టు

హృదయాహ్లాదిచతుర్థము ... విరాటపర్వమట నుద్యోగాదులుంగూడగాఁ బదియేనింటిఁ దెనుంగుబాస జన సంప్రార్థ్యంబులై పెంపునన్ దుదిముట్టన్ రచియించు టొప్పు బుధ సంతోషంబు నిండారఁగన్ ....

"నన్నయభట్టు మూఁడు పర్వములు రచించినాఁడు. విరాటము మొదలు పదునైదు పర్వములు మిగిలిపోయి గ్రంథము తుదిముట్టలేదు. ఆ గ్రంథము పూర్తికావలెనని జనులు ప్రార్థించుచున్నారు. (జన సంప్రార్థ్యంబులై పెంపునన్) కనుక కవి పండిత మోదకరముగా నా గ్రంథమును మిగిలిన పదియేను పర్వములును రచించి పూర్తి యొనరింతును." అని కదా తిక్కన సోమయాజి

పూనిక! గ్రంథపుటసమగ్రత వలనఁ గల్గిన జనులలో నసంతృప్తినిఁ బోఁగొట్టనే కదా వారి ప్రార్థనపై విరాటాది భారత రచనకుఁ దిక్కన పూనుకున్నది! అంతేకాని యీ కాలము వారివలెనే యూనివర్శిటీలోనయినను దన గ్రంథమును బాఠ్యముగా నిర్ణయింపఁజేసి దాని వలన ధనార్జనమునకై కాదు కదా. అట్టివారి కెన్ని యసందర్భములయినను లెక్కలేదు కదా!

ఇట్టి యెడ నన్నయ రచన యసమగ్రముగా నున్నచో విరాటాదినుండి రచించినను భారత మసమగ్రమే కనుక యసమగ్రతా హేతుక మగు నసంతృప్తి యెట్లు నిరాకరింపనగును? అపుడు తిక్కనయే యిపుడెట్టిన రచించిన భాగమును రచించి పూర్తి యొనరింప వలసినవాఁడగును. లేనిచో నారణ్యాంతము వఱకు సమగ్రత తప్పనిదే. అందువలన సాధుజనులకు హర్ష మొదవదు. "సాధుజన హర్షసిద్ధిఁగోరి" యే కదా మన యెఱ్ఱనయు నా భాగములను బూరించినది? కావున నిందువలన నేమి తేలుచున్నది? తిక్కన నాటికి నన్నయ రచన మూఁడు పర్వములు సమగ్రముగానే యున్నవి. అందువలననే యాతఁడు విరాటాది రచన యొనర్చెను. నన్నయ యారణ్యపర్వ మసమగ్రముగా నుండుచో నసంతృప్తి సజ్జనులకుఁ దప్పదే కదా! కనుక దానినిఁ గూడ నతఁడు పూరించియే యుండును. ఆ తరువాత విరాట పర్వము ప్రారంభించి యుండును.

తిక్కన యబద్ధ మాడెనా ?

అంతేకాక మూఁడుపర్వములు సమగ్రముగా నన్నయ రచింపనిచో "మూఁడు కృతులు రచించెను" అని యేల యనృతమాడవలసివచ్చెను. "వైదికమార్గనిష్ఠమెయి వర్తనమున్ దగ నిర్వహించుచున్" సోమయాజియైన కవిబ్రహ్మ తిక్కన కనృత మాడవలసినంతటి గండకత్తెర యేమి వచ్చినది? వైదికనిష్ఠ కలిగి పరమేశ్వర భక్తులగువారనృత మాడవలయు నవసరము కల్గినపుడుగూడ ననృత మాడరేకదా! ప్రకృతములో నేమాత్ర మనృత మాడవలసిన యావశ్యకత లేనిచోటఁ బ్రకృత కాలపు మానవాపశదులవలె నిరర్థకముగా నా మహాశయుఁడనృత మాడునా? ఒకవేళ నాడెనుబో యట్టి వానికి నెన్నఁడో చనిపోయిన తండ్రి దర్శనము, పరమేశ్వర దర్శనము నబ్బునా? ఇది యంతయు ననృతమను "గజం మిథ్య పలాయనం మిథ్య" వారికి, అసలు భారతము కవిత్రయము వారి రచన యంతయు మిథ్యయే యగును. అట్టి మూలోచ్ఛేది పాండిత్య ప్రకర్ష వారి సర్వనాస్తిత్వ వాదమును పేక్షించి మన మాస్తికులమై సామరస్య దృష్టితోఁ బరిశీలించుచో నన్నయ మూఁడు పర్వములు రచించె నను తిక్కన వాక్యము పరమ సత్యమే యని దృఢపడక పోదు.

"వనవాస సమ్యగనుష్ఠానంబుగా విని" కుదరదు

మఱొక విషయము కూడ మన మీ సందర్భమునఁ బరిశీలింపక తప్పదు. తిక్కనసోమయాజి విరాటపర్వ కథను బూర్వసంగత మొనర్చుటలో "వైశంపాయనుని వలన వినిన కథ యగుటంజేసి తత్ప్రకారంబు నడిపెద నది యెట్లనినఁ, బరమ పవిత్రులగు పాండు పుత్రుల చరితం బుపాఖ్యాన సహితంబుగా వ్యాఖ్యానంబు సేయుచుండ వారల వనవాస సమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా విని జనమే జయుండు వైశంపాయనున కిట్లనియె" అని వెనుకటి కథతో యోజించినాఁడు. అరణ్యపర్వములో సగము పైచిల్లర గ్రంథము వ్రాయఁబడకుండెనని "పాండవుల వనవాససమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా వినుటెట్లు కుదురును? అది వ్రాయఁ బడనిదే జనమేజయుఁడెట్లు వినును" సవిస్తరముగానే యని తిక్కన సోమయాజి సోమాశివదనముతో నన్నృత మెట్లాడును? ఇంక నప్పటికి వనవాసములో నెంతో కథ ముఖ్యమైనది మిగిలియే యున్నది. కడమ ధర్మాది శ్రవణమును వీడినను కేవలము పాండవులకు సంబంధించిన కథయే యెంతో యున్నది. "ఘోషయాత్ర వృత్తాంతము, ద్వైతవనము నందలి మృగములు ధర్మజునికి స్వప్నములోఁ గన్పడి తమ గోడు తెల్పుకొనుట, సత్యాద్రౌపదీ సంవాదము, సైంధవ పరాభవము, యక్షప్రశ్నలు, అజ్ఞాతవాసమునకు వలసిన వరములు యముని వలన ధర్మజుఁడు సంపాదించుట మొదలగునవి కేవలము పాండుపుత్రులకే సంబంధించినవికదా! ఇంతటి వనవాస సమ్యగనుష్ఠాన వృత్తాంతము నిదివరలోఁ జనమేజేయునకుఁ దెల్గున నెవరు తెల్పిరి? నన్నయ యా భాగమును రచింపలేదనికదా వారి వాదము. ఎఱ్ఱన యప్పటికి-అనగాఁ దిక్కన విరాటపర్వము రచించు నాటికిఁ బుట్టనేలేదుకదా!" "వనవాససమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా" ననుట వలన ధర్మాది కథాశ్రవణము లన్నియు సంగృహీతములయినవనక తప్పదుకదా! ఇక ధర్మాది కథలనినచో సత్యకు ద్రౌపది పతివ్రతా ధర్మములఁ దెలుపుట, మార్కండేయునివలన ననేక ధర్మముల వినుట, ధర్మవ్యాధవృత్తాంతము. సావిత్ర్యుపాఖ్యానము, రామకథ మొదలగున వెన్నియో యున్నవి. ఇవి యన్నియు వినెననుట కేవల మన్నృతమేకదా! తిక్కనయెన్ని పర్యాయములన్నృత మాడవలసివచ్చెనో కనుఁగొనుఁడు. ఈ శేష రచనా వాదములో నొక యన్నృతముకొఱకై మఱెన్నియో యన్నృతము లాడవలసివచ్చు చున్నవి. అంతేకాక యీ వాదులు తమ యన్నృతమునకై యసలు వారన్నృత మాడినట్లు కల్పించక తప్పుటలేదు.

విరాటపర్వము సందర్భించదు

ఇంతేకాక వీరి కింకొక యసందర్భముకూడఁ దప్పదు. ఇంత వృత్తాంతమును వీడినచో విరాటపర్వకథ యసందర్భమై తీరును. తిక్కన యెంత సందర్భింపఁ జూచినను నది మొదలే కూడక కుంటుపడును. ఎట్లనఁగా - విరాట పర్వాదిలో నర్జునుఁడు ధర్మజుతో "ధర్మదేవత నీదు సత్కర్మమునకు మెచ్చి యెంతయుఁ బ్రీతిమై నిచ్చినట్టి వరము గలుగంగ మనమేమి వర్తనమున నెచటనున్నను నొరులకు నెఱుఁగనగునె!" అనెను. ఈ వరప్రదాత కథ యారణ్యపర్వములోఁ జిట్ట చివర నున్నది. ఇతఃపూర్వ మిది తెల్పఁబడలేదు కదా! రెండు పర్వముల మూఁడాశ్వాసముల నూట నలువది రెండు (142) పద్యములలో నీ కథ లేదుకదా! శేషమును నన్నయ రచింపలేదుకదా వారికి? అపుడీ క్రింద పద్యము కూడ నసంగతమే యగును కదా!

తండ్రి! నీవు నాకు దయతోడ నిచ్చిన వరము చిత్తగింపవలయు తెలఁగు
సమయ సముచితముగ సమకట్టుమయ్య యీరాకుమారులవిధి బోక యుండ.

విరాట. ౧ ఆ. ౧౮౧ ప.

ఇది "కౌంతేయాగ్రజుండు ప్రాఙ్ముఖుండై నిర్మల చిత్తంబున ధర్మదేవతం దలంచి" యన్న పద్యము, ఇదివరలో నీ వృత్తాంతము తెలుపఁబడనిచో జనమేజయుఁడిటఁ దెలుఁగులోఁ బ్రశ్న యొనర్పవలదా? "అది యేమని?" ఇట్లే ద్రోణ పర్వములోఁ నభిమన్యు వధనాఁడు సైంధవునకుఁ బాండవుల నడ్డగించు శక్తి కల్గుటకుఁ గారణమయిన సైంధవుని శివ తపశ్శక్తి దానికిఁ గారణమైన సైంధవ పరాభవము. దానికి హేతువు. ద్రౌపద్యపహరణము మొదలగు కథ లీ వివాదాస్పద మయిన భారత భాగములో నున్నవి. అవి తిరుగఁ బ్రష్టవ్యములే కదా! ఇదివరలో మఱొకరికిఁ జెప్పిన ట్లున్నను. ప్రకృత శ్రోతకుఁ దెలియుటకై తిరిగి యా కథ యీ భారతములోఁ దెల్పఁబడుటాచారమే కదా! కర్ణ జన్మ వృత్తాంత మదివరలో నాదిపర్వములో శౌనకాదులకు సూతుఁడు తెల్పినను, జనమేజయునకై తిరిగి యీ శేషభాగములోఁ దెల్పఁబడినది కాదా మఱి? అట్లిక్కడఁ దెలుపఁబడలేదుకదా! ఇట్లెన్నియో యసందర్భము లీ శేషరచనావాదములోఁ దప్పవు. పైనఁ దిక్కన నసత్యవాదినిఁ జేయుటొకటి. తిక్కన నన్నృతమాడించు పట్టుదల మానినచో నీ దోషము లేవియు సంభవింపవు.

కాఁగా నన్నయ రచించిన భాగమునకు ననంతర భాగమును రచించి యాంధ్ర భారతమును బూర్తి యొనరింపఁ బూనికగొన్న తిక్కనసోమయాజి

యారణ్యపర్వమసమాప్తముగా నుండఁగా దానిని రచించి పూర్తిచేయకయే పై భాగమును రచింపఁబూనెననుట కేవల మసంభవము, అసంభావ్యముకూడ.

ప్రవాదములు

ఆరణ్యపర్వ రచనమునుగూర్చి తిక్కన కేదో భయము కల్గెనని కల్పించుట యనుచితము. అనేక ధర్మాద్యుద్దీపితములయిన పాండవాది కథను కౌరవపాండవ యాదవ నిర్యాణములను యుద్ధ పంచక శాన్త్యనుశాసనికాదులందుఁ బ్రపంచించిన యా మహామహున కట్టిదే యగు కథ నుపేక్షించుటలోఁ దగు కారణమేమి? పాప మాంధ్ర శబ్దచింతామణి నన్నయకృతము కాదను వాదాభాసమునకై ప్రాక్తనములగు ప్రవాదములను నప్పకవి వఱకును గలవాటిని గ్రంథస్థములైన వానిని నమ్మఁ దగినవి కాదనునపుడీ తెలివితేట లెట వోయినవో? ఇవిమాత్రమిప్పుడు నమ్మఁ దగిన వెట్లయినవి? అసలీ ప్రవాదమున కెచటనయిన గ్రంథాధార మున్నదా? ఉన్నదే యనుఁడు. తిక్కన నమ్మెనే యనుఁడు. ఎఱ్ఱన కేల దానియందు నమ్మకము లేకపోయినది? "ఎఱ్ఱన యా ప్రవాదమును నమ్ముటవలననే తాను రచించినట్లుగాఁ జెప్పుకొనక నన్నయ రచనగా (తద్రచనయ) నే యిది రచించితి నన్నాఁడు" అని యొక తెలివి తక్కువ సమాధానకల్పన. ఇందులో గల తెలివితక్కువతనం చూడుఁడు. నన్నయ రచనగానే శేష పూరణములోఁ గారణమేమి యెఱ్ఱన తెల్పినాఁడు? "ధీర విచారుఁడు తత్కవితారీతియుఁ గొంతదోపఁ దద్రచనయకా" అన్నాఁడు. అనఁగా బాగుగా నన్వేషించిన నన్నయ కవిత్వపురీతి కొంత కన్పడుటవలన నట్లొనర్చితి నన్నాఁడు. అంతేకాని వారు చెప్పు నదృష్టాశ్రుతచర ప్రవాదమువలన ననలేదు కదా; ఇట మరల నొక యన్నృత కల్పన మొనర్పవలెను వారు. "ఎఱ్ఱన యట్లు చెప్పెనే కాని నిజానికి అతఁడీ కారణము వలననే యట్లు చేసినాఁడు" అని. యిది కేవలము ప్రత్యక్ష విరోధముతోఁ బాటు పశ్యతోహరత్వము కూడఁగదా! ఆరణ్యపర్వము విషయములో నంతభయమే యెఱ్ఱన కున్నచో "నారణ్య పర్వశేషముఁ బూరించెన్" అని తన ప్రసంగమేల యట నెత్తుకొనును? ఇంతవఱకు ననగా శేషాంశ పూరణ మొనర్చు వఱకుఁ గర్తృత్వములోఁగాని, యా కర్తృతమును బేర్కొనుటలోఁగాని యెఱ్ఱన కేమియు భయము కలుగలేదు. కాని యది తన రచనగాఁ బూరించుటలో మాత్రము భయము కల్గెనా? ఈ యర్ధజరతీయము కం.వీ. గారికే తగునుగాని యీ యమూలకమును నప్రమాణము నగు ప్రసంగములతోఁ గాలక్షేపము మనకు యుక్తము కాదు.

"దక్షతన్"

మఱియు నీ యవకతవక ప్రసంగములకు నోరుమూఁతగా "విద్యాదయి తుండౌనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్" అని తిక్కన స్పష్టముగానే మూఁడు పర్వము లొనర్చువఱకు నన్నయ విజ్ఞాన (విద్య) ము కానీ. సామర్థ్యము (దక్షత) కానీ యేమియుఁ గొఱఁతవడలేదని చెప్పుచున్నాడు. నన్నయకెట్టి దోషమును సంభవింపలేదనియే యిట సూచించినాఁడు. ఇఁక నంతస్సాక్ష్యమును జూచినను నట్లే కన్పడును.

శారదరాత్రులు

నన్నయ చివర పద్యము

"శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారకహారపంక్తులం
జారుతరంబులయ్యె వికస న్నవకైరవగంధబంధురో
దార సమీరసౌరభము దాల్చి సుధాంశు వికీర్యమాణ క
ర్పూర పరాగ పాండురుచి పూరము* లంబరపూరితంబులై.

ఈ యనువాదమెంతటి బుద్ధివైభవముతో నొనర్పఁబడెనో ముందు వివరింతుము.

ఈ మధురతను కవితామార్గములో నెటనయినను మతిభ్రమణపుఁ జిన్నెలున్నవా? తరువాతఁగూడ నన్నయ పద్యాల జిగిబిగి యేమియుఁ దగ్గలేదు.

---

*ఇక్కడఁ గొందఱు "లంబర పూరితంబులై" యను నొక పాఠమును ప్రస్తావింతురు. దానివలన నొక సూచన యున్నదని వారి తలంపు. దాని వివరణ మిది పై పాఠములో "పర పూరితంబులై" యని యేక దేశమున్నది. దాని యర్థము "ఈ ముందు నుండియుఁ దెలుఁగు భారతము పరులచే రచింపఁబడును." అని యప్రకృతముగా నన్నయభట్టునోట నవశముగా బయల్వెడలినది. కాఁగా నిది ముందు భారతము పరరచితమగు ననుటకు సూచన కావున నిటనుండి యెఱ్ఱనగారు రచించిరి. దాని కనుగుణముగా నక్కడినుండియే వరుఁడైన యెఱ్ఱన కవిత్వము ప్రారంభమైనది" యని వారు తెల్పుదురు. నిజమున కీ పాఠమునన్నర్థము సుసంగతము కాఁజాలదు: కనుక నా పాఠమును నన్నయ రచించినాఁడనుట పొసఁగదు.

సరి, అది యట్లుండుఁడు, వారి యిష్టప్రకారముగా "పర పూరితంబులై" యను పాఠము నొప్పికొన్నను "పరులచేతఁ బూరింపఁబడును" అని మాత్రమే యర్థము సూచింపఁబడునుగాని, "పరులుత్తర భారతభాగము నంతను రచింతురు" అను

ఎఱ్ఱన శిథిల భాగములకడ నెఱ్ఱన పూరించిన చోటుల మాత్రమే యా విభేద మగుపడుచున్నది. అసలు తెనుఁగు భారత రచనలో నారణ్య పర్వమే యత్యం తోత్కృష్టమగు రచన. ఇది మనము క్రమముగా నాది సభాపర్వములను జదువుకొనుచు నారణ్యాపర్వమును బరిశీలించితి మేని మన యంతరాత్మకే బోధపడును. ఇంతేల? శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారే యిటఁ బ్రమాణము. ఇట్టి యత్యంతోత్కృష్ట రచన మతిభ్రమణము కలవానికి సంభవింపదు. కాని యా వాద మొనర్చువానికి మాత్ర మది తప్పదు.

ప్రశ్నాభాసము

అయితే యన్ని ప్రతులందును నొకే పర్యాయ మొక్కచోటనే గ్రంథలోప మెట్లు సంభవించె నని యొక ప్రశ్నాభాసమును కం. వీ. గారొనర్చిరి. నన్నయ

సూచన లేదు. శారదారాత్రులు - అను దానికిఁగదా యిది విశేషము. అథవా కర్పూర పరాగపాండు రుచిపూరములైన విశేష్యమగును. అట్టియెడ నా విశేష్యములచేత బహువచనాంతములచేత సూచింపఁబడునవేవి?. అరణ్యాపర్వమును నొకటి కాదు; పోనీ భారతములోని కడమ పర్వములన్నియు నని సూచింపరాదా? యనినచో నవియైనను బూరింపఁబడలేదే! రచింపఁబడినవి కాని, పూరితమైనదేది యిచట? భారతము. అంతేకాని విరాటాదిపర్వములు కావు. కనుక నీ పక్షము కూడ కుదురదు. ఇఁక నేమనఁగా "శారదరాత్రులు" అను విశిష్ట కాలముల వలనఁగాని లేక కర్పూర పరాగ పాండురుచిపూరముల వలనఁగానీ సూచితము లగునని యారణ్యాపర్వపుటాశ్వాసములు మిగిలియున్నవి. అవియే యనుట కొక యుక్తియున్నది. ఒక యఖండ వస్తువు "శారద" యని సూచితమగును. "రాత్రులు" అనునది దాని విభాగములను సూచించును. ఇట్లే "సుధాంశు" "పాండురుచిపూరములు" అను చోటను గమనించునది, ఆ మొత్తము వస్తువు నారణ్యాపర్వము. దానిలోని విభాగములు నాశ్వాసములు. అవి పూరింపఁబడును. పరులచేతనని సూచన. అంతేకాని మొత్తము రచింపఁబడునని సూచన యెంత మాత్రము కూడ కాఁజాలదు.

పూరింపఁబడునని సూచన కనుగుణముగానే యా యాశ్వాసములలోఁగొన్ని పద్యములును, గొన్ని పద్యభాగములును, గొంత కొంత కథాభాగములును నెఱ్ఱన మహాకవీంద్రునిచేతఁ బూరింపఁబడినవి. దీనినంతను ముందుముందు విస్తరించి నిరూపింతుము, కనుక పై పాఠమునందలి సూచన కూడ మాకే యనుకూలమై యెఱ్ఱన మహాకవీంద్రుఁ డారణ్యాపర్వభాగములను - నాశ్వాసములను నటనటఁ బద్య, పద్యభాగ, కథాభాగాదులఁ బూరించె ననియే స్పష్టపఱచును.

యాదికవిగాఁ డనుటకై నన్నయకుఁ బూర్వమున్న తెనుఁగు గ్రంథము లన్నియు నొకేసారి నశించినవని యొప్పుకొనుచున్న వీరీ యొక స్వల్పభాగము నశించుటను గూర్చి ప్రశ్న వేయుట యాశ్చర్యమే. కూచిమంచి తిమ్మకవి వఱకు ఉన్న యెఱ్ఱన రామాయణ మిప్పుడొక్కసారిగా నన్నియెడలను గన్పట్టక పోవుట కేమికారణము తెల్పెదరో వారు? బమ్మెర పోతనామాత్యుని మహాభాగవతము దశమస్కంధములోని యుత్తరార్థములో రెండువందల తొంబది యేడవ పద్యములోని నాల్గవపాదము నుండి "వెలిగందల నారయగారి కవిత్వము" అని యున్నదికదా! అన్ని ప్రతులందును నచ్చటివఱకే పోతరాజుగారి కవిత్వ ముండి మిగతా గ్రంథ మేల యన్ని ప్రతులలోను నశించిపోయినదో తెల్పెదరా?

వాస్తవ సంభావన

ఇది యంతయు కం. వీ. గారి వాదములోని యసందర్భమును దెలుపుటకై ప్రతిబంధిగా నిరూపించితిమి. కాని నిజముగా విచారించుచో నసలు విషయ మిట్లుండి యుండును. పూర్వకాలములో నచ్చు సౌకర్యములు లేకపోవుటవలనఁ దాటాకులలో వ్రాసికొనువారు. ఆ ప్రతులు వ్రాఁత కష్టము వలనఁ జాల నుండఁ బోవుకదా? ఆ యున్న కొలఁది ప్రతులును జెదలు మొదలగువాని వలనఁ జెడియుండును. అందువలననే యిపుడు భారతములోఁ జాలఁ బాఠభేదముల కవకాశము కల్గుచున్న దనుట మఱువరానిది, అరణ్యపర్వపు టీ భాగము భారతములోని చివరిభాగ మగుటవలన సరిగా వ్రాయఁబడకయు, నడుగున నుండియు దైవవశమున నా చోటువఱకు శిథిలమై యుండును. ఇంకను బైభాగ మెక్కువగాఁ జెడకపోయి యుండును. అథవా కొంతభాగ మేప్రతిలో నయినఁ దరువాతది యున్నను నది శిథిల శిథిలముగానుండి యవి రూపణీయముగానే యుండియుండును. అందువలన నీ భాగమునుండి యెఱ్ఱన పూరణము మొదలుపెట్టి యుండును. ఇంతకుఁ బూర్వము కూడ గ్రంథము కొంత కొంత శిథిలమైనట్లగుపడుచున్నది. ఈ విషయమును ముందు నిరూపింతుము. అయితే యింత చెడిపోయి యుండదు. అట నెక్కువగా నితరసాహాయ్యమవసరమై యుండదు. ప్రకృత భాగములోఁ జాల శిథిలమై యితరుల పూరణాత్మక సాహాయ్యమునఁగాని తమ యావరణముదాటి బయటపడి వెలయుట కవకాశము లేక యుండును. కనుకనే యెఱ్ఱన యఁట నుండి తన పూరణము మొదలుపెట్టినాఁడు. ఈ విషయమున నెఱ్ఱన వ్రాసిన మొదటి పద్యము "స్ఫురదరుణాంశు" అనునది చాల స్పష్టముగా సూచనల నిచ్చుచున్నది. ఆ విషయ మనుపదమే నిరూపింతుము.

అంతరంగ సాక్ష్యము

మన మింతవఱకును బహిరంగ సాక్ష్యమునే-ఆరణ్యాపర్వ రచనా స్వరూపమును బరిశీలింపకయే యెఱ్ఱన తిక్కనల మాటలనుబట్టి మాత్రమే మాట్లాడుచున్నాము. కాని యది యుక్తముకాదు. ఒకవేళ యెఱ్ఱన తానరణ్యా పర్వశేషమును రచించెనన్నాఁ డనుకొందము. అయినను రచన యతనిదిగా లేకపోయినచో నతని మాటను మనము నమ్మవచ్చునా? దానినిఁబట్టి మనము మాటాడుట యుక్తము కాదుకదా! కనుక నిఁక నంతరంగ సాక్ష్యము, అనఁగా నంతస్సాక్ష్యమును బట్టి విచారింపవలసి యున్నది. అది యవిచార్యమైన ప్రమాణము. ఏమనఁగా మన మహా కవులలోఁ గొందఱిపేర 'రచింపఁబడినట్లుగా' నున్న గ్రంథముల నంతస్సాక్ష్యాదులచే వారు రచింపలే దని నిర్ణయించుచున్నారుకదా! కృష్ణదేవరాయలు రచించినట్లున్న యాముక్త మాల్యద నతఁడు రచింపలేదని యొక వాద మున్నది కదా! క్రీడాభిరామమును వల్లభామాత్యుఁడు రచించినట్లున్నను రచనాస్వరూపము నంత స్సాక్ష్యమునుబట్టి యనఁగా సీసాది పద్యముల శైలి మొదలగువానినిఁబట్టి యతఁడు రచింపలేదనియు శ్రీనాథుఁడే రచించి యతని పేరఁ బెట్టెననియు మనవారందఱికిని దృఢ విశ్వాసమే కదా? కనుక గ్రంథములోని రచనా స్వరూపమునుబట్టి యిది యెవరి కవిత్వమో నిర్ణయింపఁ బ్రయత్నింతము. అంతస్సాక్ష్య మన్నింటికన్నఁ గూడ బలవత్తమ మనుట నిరాకరింపరానిదే కదా!

"స్ఫురదరుణాంశు రాగరుచి" యను పద్యము

ఈ పద్య మీ వ్యాసముఖమున నున్నట్లే యెఱ్ఱాప్రగడ భారత కవిత్వ ముఖ మునఁగూడ నున్నది. అక్కడ నుండియే యెఱ్ఱాప్రగడ కవిత్వ మని వ్రాయఁ బడినది. కాని యయితే యసలక్కడనుండి యెఱ్ఱాప్రగడకవిత్వ మని యెట్లు తెలిసినది? ఈ విషయములోఁ బై పద్యమే ప్రధానమైన జ్ఞాపక ప్రమాణముగా నున్నది. అది శబ్ద శక్తి మూలక మగు వ్యంజనా ద్వారమున నీ విషయమును దెలుపును. ఇట 'అరుణ' యనఁగా "ఎఱ్ఱన" యని కదా! ప్రకృతమగు శరదృతు సందర్భమున కుపయోగింపఁబడి సూర్యవాచక మగు పై పదము తన నానార్థ శక్తి వలన 'ఎఱ్ఱన' యని వ్యంగ్యమొనర్చును. అందువలన నెఱ్ఱన మహాకవి యంశువులు కిరణములవంటి పద, పద్యాంశము లిటనుండియే స్ఫురించు నని వ్యంగ్యమగును. దీనివలన నీ పద్యము ధ్వని ప్రధానమై యొక విశిష్టభావమును సమర్పింపఁ గలదనియు నందుకే యిది యిట నుంచఁబడినదనియుఁ దెలియుచున్నది. ఆ విశిష్టభావ మేదో గమనింతము. పద్యము వ్యాసముఖమున నున్నది. ప్రకరణము శరదృతు వర్ణనము. వాచ్యార్థము సుగ్రహము. దాని నిటఁ దెలుపము.

ఇఁక వ్యంగ్యార్థము విషయములో నీ పద్యపుఁ బదము లేయే యర్థములను వ్యంగ్య మొనర్చునో విడివిడిగాఁ దెల్పుదుము.

శారదవేళ-తద్వర్ణనతో నుపలక్షితమగు నన్నయ భారతములోని వాసర ముఖంబులు పద్యములు మొదలగునవి. స్ఫురదురుణాంశు రాగరుచిన్ - ఎఱ్ఱన మహాకవి యొక్క లేశలేశములైన శిథిలభాగముల నదికి వ్యక్తపఱచునట్టి మాటలు 'అంశువులు' అను పదమున వ్యంగ్యము. (అంశువు-కిరణము, దారములోని భాగము). సాలె తెగిపోయిన తంతువుల భాగముల నదికి యొక దారము నవిచ్ఛిన్న మగునట్లు సరిచేసి వ్యక్తపఱచును గదా! అరుణుని కిరణములవలన నదివర కగుపడని వస్తువులు వ్యక్తములు కాఁగల్గును గదా! (ఈ చోట "నన్నయ సారస్వతాంశ ప్రశస్తి దన్నుఁజెందుట" "తత్కవితారీతియుఁగొంతదోప" యనునదియు జ్ఞాపకము దెచ్చుకొనవలెను.) అరుణ కిరణములు స్ఫురించి ఎఱ్ఱన మహాకవి యదుకులు కన్నడి వాని ఛాయ సోఁకుటవలన నన్నయ పద్యములలోని శిథిల భాగములు సొగసుకలవై "నిరస్తనీరదావరణలై" అదివరలో వాటి నగుపడకుండఁ జేసిన చెదలు మొదలగు నావరణములు తొలఁగినవై (చెదపురుగు తాను ప్రాకుచోటినిఁ దన నోటినుండి వచ్చు తడిచేఁ తడిపి దాని నావరించి చెడఁగొట్టుట స్వభావము. "నీరద" పదము కేవల యోఁగముచే జెదపురుగును వ్యంగ్యమొనర్చును.)

దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్ల - నన్నయ
కవి యతిశయము వికసించి విజృంభింపఁగా: నుద్ధుర
తర హంస సారస మధువ్రత నిస్స్వనముల్ సెలంగఁ-గవి
పండిత సుజనులు ప్రశంసింపఁగా మిక్కిలి విలసిల్లెను.

('సారమతిన్' అను నన్నయపద్య మిక్కడ స్మరణీయము.) అందువలననే అనఁగా నీ నిరూపించిన కారణమువలననే 'తద్రచనయకాఁ బూరించెన్' 'కవీంద్ర కర్ణపుట పేయముగాన్' అని తెల్పుట యుచితముగా నున్నది.

ఈ పద్యములో నీ ధ్వని యున్నదా! యను సంశయ మక్కఱలేకుండ 'స్ఫురదరుణ' యనునదియే యిటనుండి* యెఱ్ఱన మహాకవి స్ఫురణ మని

**ఒక్క యెఱ్ఱనయే కాదు, ప్రాచీనులగు మహాకవులందఱును వ్యంగ్య ప్రతిభావంతములుగనే వారి కావ్యములను రచించిరి. కావ్యమనఁగానే వ్యంగ్యావలంబికదా! చూడుడు, భట్ట నాయకుఁ డేమనుచున్నాడో:*

- శబ్దము ప్రధానమైన శాస్త్రంబటందు రర్థము ప్రధానమైన వ్యాఖ్యాన మందురు. ఉభయ మీయది గుణ భావమొంది వ్యాపృతిప్రధానమ్మయిన కావ్యధీ జనించు.

ప్రముఖముగనే వ్యంగ్యపఱచుచున్నది కదా! ఇట్టీ పర్వమువలనఁ గూడ నన్నయ కవితలో నెఱ్ఱన యొనర్చినది శిథిలాంశ పూరణమే యని వ్యంగ్య మొనర్చినది. అసలతఁడే గ్రంథము చివర 'అరణ్య పర్వశేషము పూరించెన్' అని స్పష్టపఱచినాఁడు కదా! శేషభాగరచన యనుటకా మాటతోఁబాటుగా 'స్ఫురదరుణాంశురాగరుచి' 'నిరస్తనీరదావరణములై' యను రెండును బ్రతిబంధకములే కదా!

అయితే శిథిలాంశ పూరణములో నొక విషయమవశ్యము గ్రహింపవలసి యున్నది. నన్నయ కవితలోఁ గొన్ని చోటులఁ బద్యభాగములేకాక పద్యము గద్యములునుగూడఁ బోయినవి. కొన్ని యెడలఁ గొన్ని కొన్ని కథాభాగములే పోయినవి. ఇవి యన్నియు మన యెఱ్ఱన మహాకవి పూరించెను. నన్నయ రచన యగునట్లే యతని పూరణ ప్రయత్నము. కాని యాయా ఘట్టములు మనకు విస్పష్టముగానే చాలవఱకుఁ గన్పడుచుండును. పరిశీలింతము.

మన మహాకవులు తాము వ్రాయఁబోవు గ్రంథములు వేదపురాణములుగా నున్నచో, ననఁగా శబ్దార్థమాత్ర ప్రధానములుగా నున్నచో సకల జనులకును నాస్వాద్యములు గాఁజాలవనియు నుద్దిష్టమగు 'సకల జగద్ధితము, జనసంప్రార్థ్యత, సాధుజన 'హర్షసిద్ధి' సమకూరవనియు గుర్తించి మృదుమధుర రసభావ భాసుర నవార్థవచన రచనా విశారదులయిన మహాకవులు' వోయిన మార్గమునఁ బ్రసన్న కథా కలితార్థ యుక్తితో నక్షర రమ్యత మిళితమగునట్లుగాఁ దమ గ్రంథముల నిర్మించిరి అది వ్యంగమును వీడరానిదేకదా! కొన్ని యెడల వ్యంగ్యము 'మా నిషాద' శ్లోకములో వాల్మీకివోలె వ్యంగ్యము వివక్షితముకాకయే యవశముగానే ప్రవర్తిల్లును. మఱికొన్ని యెడల సూర్యునకు లతాంగి మ్రొక్కె' 'నా బాల్యంబుఁ గరుణ సైపవలయుఁ గమల మిత్ర' యనియు నెడలవలె వివక్షితమై యుండును. ఎఱ్ఱన 'నా బాల్యంబుఁ' అన్నచోట సొగసైన వ్యంగ్యమున్న దనుటలోను నది వివక్షిత మనుటలోను నెవ్వరికిని విప్రతిపత్తి యుండరాదుకదా! ప్రకృత స్థలములో 'అరుణ' పదము 'ఎఱ్ఱనను' వ్యంగ్య మొనర్చుటలోను విప్రతిపత్తి లేదు కదా! అప్పకవియు నీ వంకలే మొగ్గుచున్నాఁడు కదా! ఇఁక నీ 'స్ఫురదరుణాంశు, అను చోట మేము నిరూపించునట్లు వ్యంగ్య ముండుననుటలో విప్రతిపత్తి యేల? ఈ వ్యంగ్యార్థ మిదివరలోనివారు గమనింప లేదని మేము దానిని సక్రమముగా నిరూపించితిమి. ఇంతమాత్రమున నదిలేకపోవునా? మేము గాకున్న మఱొక బుద్ధిమంతులు దానిని నిరూపింపఁగలరు. ఇదివరలోనివారు "రయవిచలత్తురంగమ" అను పద్యమును గమనించినారా! సీసభేదములు నన్నయ రచనలోనివియుఁ

గానివియు నగు వాటిని గమనించినారా? లేదుకదా! అంతేకాక కొన్నింటి నసందర్భముగా గమనించిరి చూడుఁడు. తిక్కన విరాటాదిలో 'హరిహరనాథునకు' - ఏను విన్నపంబు సేయు తెఱంగుగానంతస్సన్నిధింగల్పించుకొని యిమ్మహాకావ్యంబు (వాక్యంబు) నర్థంబు సంగతంబు సేసెద.' కథ జగత్ప్రసిద్ధి గావునఁ బూర్వపర్వార్థయుక్తి సేయునట్టి యెడల, యత్న మించుకంతయయినను వలవదు. వలసినట్లు చెప్పవలసి యుండు' నన్నాఁడు.

ఇక్కడ 'అంతస్సన్నిధి' యనఁగా 'వర్ణనీయాంశము నంతస్సన్నిధి గలిగించు కొనుట లోకోత్తర కవికే సాధ్యము' అని తాత్పర్యము తెల్పిరొకరు. ఇది కేవలము తప్పే. ప్రకృతములో హరిహరనాథునికి-తన యారాధ్య దైవమునకు నంతస్సన్నిధినిఁ గల్పించుకొన్నాఁడు తిక్కన సోమయాజి. అంతేకాని వర్ణనీయ విషయమునకుఁ గాదు. ఈ సందర్భములోని గ్రంథము సరిగా నర్థముకాక యేదో వ్రాయుటయే పనిగాఁ బెట్టుకొన్న వ్రాఁతయిది. అంతేకాక మహాకవియైనను మఱొకరైనను తన వర్ణనీయమును దన మనస్సులో ననుకొనక యెట్లు కవిత రచించును? ఇది 'తలకాయతోఁ గూడ మనిషి వచ్చాఁడు' అన్నట్ల ప్రస్తుత ప్రసంగమైనది. 'అంతస్సన్నిధి, అంటే 'భావనలోఁ బ్రత్యక్షము' అని యర్థమైన నంతే కనుక నిట నంతస్సన్నిధి యనునది, మనోమాత్రగమ్యుఁడగు పరమేశ్వరుఁడు హరిహరనాథుని సన్నిధినిఁ గాని మఱొకటి కాదు. అది యట్లుంచుఁడు. ఇచట నింకొక రకముగా గమనించుట కలదు. 'కథ యేమనఁగా నదివరలో నన్నయ వ్రాసినది యారణ్యపర్వఖండమే కాని పూర్తికాదు, కనుక విరాటపర్వపుఁ గథ మొదలికిని నన్నయ గ్రంథములోని చివరి కథకును సంగతి యిట్లు కుదురును? అను నాశంకతో 'కథ జగత్ప్రసిద్ధమే కావున పూర్వ పర్వార్థము సంగతమగును. దానినిఁ గూర్చుటకై నేను శ్రమపడ నక్కఱలేదు. నాకుఁ దోచినట్లు నేను చెప్పవచ్చును.' అని తిక్కన తాత్పర్యము. అని యొక గమనింపు. ఇదియు యుక్తమగు గమనింపు కాదు. ఏమనఁగా ముందు గ్రంథములో 'జనమేజయుఁడు కృష్ణద్వైపాయన మహాముని కారుణ్యంబువడసి తదీయ ప్రియశిష్యుండయిన వైశంపాయనువలన వినిన కథయగుటంజేసి తత్ప్రకారంబు నడపెద; నది యెట్లనినఁ బరమపవిత్రులగు పాండుపుత్రుల చరితం బుపాఖ్యాన సహితంబుగా వ్యాఖ్యానంబు సేయుచుండ వారల వనవాస సమ్యగనుష్ఠానంబు సవిస్తరంబుగా విని జనమేజయుఁడు వైశంపాయనున కిట్లనియె, అని తిక్కన వ్రాసెను. విరాటపర్వాదికి "వనవాస సమ్యగనుష్ఠానంబు" సవి స్తరంబుగా వినుటయేకదా సరిగా సంగతమగును. దాని నతఁడు తెల్పుచుఁ గథ కూర్చుచున్నాఁడు గదా!

ఇఁకనిప్పుడు పై యూహకుఁ గాని పై పద్యమునకు గాని యవకాశమేది? "వలసినట్లు చెప్పవలసి యుండుట" కానీ, అట్లు చెప్పుట కానీ యేది? అరణ్యపర్వాంతపుఁ గథయే కదా 'వనవాస సమ్యగనుష్ఠానంబు సవిస్తరముగ వినుట' అదియే కదా విరాటపర్వ ప్రారంభమును సరిగా సంగత మొనర్చునది. దానినిఁ దిక్కన సరిగానే తెల్పెనుగదా! కనుక నిపుడు వారి గమనింపంతయుఁ దప్పేయయినది. అంతేకాక వారి గమనింపులోఁ దిక్కన పద్యము కూడ నప్రస్తుతము, నసంగతము నగుటయే కాక తప్పుకూడ నైనది. వలసినట్లు చెప్పవలసియుండుట, యెట్లుచితమగును?

కనుక నా పద్య మేసందర్భములో నుదయించినదో మనమిఁక గమనింతము ఈ పద్యముయొక్క తాత్పర్యమేమో ముందుగాఁ దెలిసికొందము

ఈ విరాట పర్వమును ప్రారంభింపఁబోవు చున్నాను. అది మహాకావ్యమైన భారతములోని నాల్గవ పర్వము. దానికి వెనుకటి కథతో సంబంధము కలుపవలెను గదా! అది తెలుపవలసి యున్నది. అనఁగా వెనుక నేమి జరిగినదో దానికిని నీ విరాటపర్వపుఁ గథకును సంబంధము తెలియనిదే యిది చదువువారి కర్థము కాదు కనుక వెనుకటి కథతో సంబంధము తెలుపవలసి యున్నది. అనఁగా వెనుక నేమి జరిగినదో తెలుపవలెను. కాని నే నది తెలుపుటలేదు. వెనుకటి కథనంతటిని నేను తెల్పుటలేదు. ఏమనఁగా గథ జగత్ప్రసిద్ధమే కనుక నేనీ విరాటపర్వము మొదలు పెట్టి కథ తెల్పినను నందఱికినిఁ దెలియనే తెలియవచ్చును. కనుక నే నీ పర్వము మొదలునుండియే కథను దెల్పుదును.

అయితే యిచ్చట నొక యాశంక కల్గుచున్నది. ఈ మాట తా నేల చెప్ప వలసి వచ్చినది? యని.

ఇతఁడు నిర్వచనోత్తర రామాయణములో నుత్తర రామాయణ కథ సంగత మగుటకై పూర్వరామాయణ వృత్తాంతమును మొదటియాశ్వాసములో సంగ్రహముగాఁ బూర్తిచేసినాఁడు. అట్లే యిచ్చటఁ గూడ నుత్తర కథ (విరాటాది కథ) తెలుపుటకు ముందు పూర్వకథ (ఆది పర్వ ప్రభృతికథ) తెల్పెదనా? యను నాశంక తోఁచినది. దానికై యీ సమాధాన పద్య ముదయించినది. ఇట నీ విషయమును దప్పక గమనింపవలెను.

కొన్ని గ్రంథములు సహజముగా వ్యవహిత భాగములు. మఱికొన్ని యవ్యవహిత భాగములు నైనవి. ఈ యవ్యవహిత భాగములుకూడఁ గారణాంతరములవలన వ్యవహిత ప్రాయములుగా నుండుట సంభవించును. అపుడు వెనుకటి భాగపుఁ గథాయోజన మావశ్యకముగాదా యను నాశంక కల్గును. కాని యట్టి యెడల నా భాగములను నవ్యవహితముగా యోజనచేయుచో నా చిక్కు తొలఁగును. చూడుఁడు శ్రీమద్రామాయణము నుత్తరకాండతోఁ గలిపి యేడు కాండములైనను నాఱు కాండములు మాత్రమే యవ్యవహిత గ్రంథముగను, నేడవది యుత్తరకాండము వ్యవహితముగ నుండుట సుప్రసిద్ధము. అందువలననే రామాయణ మనఁగా యుద్ధకాండాంతమే నుప్రసిద్ధము. ఇట్లే మీమాంస యనఁగా (వాస్తవమునకు నిరువది యధ్యాయముల గ్రంథమైనను) పన్నెండధ్యాయములు మాత్రమే ప్రసిద్ధముగా గ్రహింపఁబడును. ఇట్టి వ్యవహిత భాగములలో నుత్తరభాగరచనమునఁ బూర్వభాగములోఁ దప్పక సంబంధ ముద్ఘాటించి తెలిపి తీరవలెను. కనుకనే యుత్తర రామచరిత నాటకములోఁ బూర్వరామాయణ కథను జిత్రఫలక వృత్తాంత రూపమునఁగవి గూర్చెను. ఆ మర్యాదనే మన ప్రకృత కవి, కవిబ్రహ్మ తిక్కన సోమయాజియు నిర్వచనోత్తర రామాయణములోఁదా ననుసిరించెను. ప్రకృతమునను గూడఁ దిక్కనకు నిదివఱకొరులు రచించిన గ్రంథము నవశేషమే రచింపఁ బడవలసివచ్చినది. ఇదివరలో భాస్కరాదులు రచించిన గ్రంథము నవశేషమే రచింపఁడవలసివచ్చినది. ఇది వరలో భాస్కరాదులు రచించిన రామాయణపు టవశిష్టభాగము నిర్వచనోత్తర రామాయణమును రచించెను. ప్రకృతము నన్నయ రచించిన యారణ్యపర్వావశిష్ట మగు విరాటపర్వాదికము రచింపవలసి వచ్చినది. అందువలన దీనియందుఁ గూడఁ దన వెనుకటి గ్రంథమునందు వలెనే పూర్వకథాను సంధానమును గ్రంథరూపమున రచింపవలయునా? ఇట నా యావశ్యకతలేదు. ఏమనఁగా వెనుకటివి వ్యవహిత భాగములు పరస్పరాసన్నికృష్టములు, ఇట నట్టి ప్రతిబంధము లేదు. అయితే యీ మాటయేల? వినుఁడు నిజమున కీ రెండు భాగములును వ్యవహితములు కావు. కాని దైవ వశమున వెనుకటి గ్రంథము మఱొకరిచే రచింపఁబడి వ్యవహితమై తన కిపుడిచట సన్నికృష్టముగా లేదు. నన్నయ రచించిన భాగముతానెఱుఁగును. కాని యతనితో సమకాలికుఁడు కాని తన గ్రంథ మాతని గ్రంథముతో నొకయెడ నుండిననేకదా యవ్యవహితమును సన్నికృష్టమును నగును. భిన్న కర్తృకములైనను భాస్కర రామాయణములోని భాగములు సమకాలిక కర్తృకములై సమకాలికములై యత్యంత సన్నిహితములే కనుక నా భాగముల కిట్టి యోజనా ప్రస్తావము రాలేదు. ప్రకృతములో వెనుకటిదాని

కన్నింటను వ్యతిరేకమే, గ్రంథముకూడఁదనగ్రంథముతోఁ గలిపి చూచుకొనుట కవకాశములేదు. అట్లు నన్నయ గ్రంథముతోఁ గలిపి చూచుకొనుట కవకాశము లేదని మీకెట్లు తెలిసిన దందురా? నన్నయ గ్రంథ మాదిపర్వము నీ మహామహుఁడు తన గ్రంథ రచన సమయమునఁ జూచియున్నచో నభిమన్యువధనాటి రాత్రి శివపూజా కైలాసగమనాది వృత్తాంతముగాని, ద్రోణపర్వాంతమున శివ మాహాత్మ్యమును గానీ, యందులో లింగ పూజ శివప్రతిమ పూజకన్నఁ బ్రశస్తమను విషయమును గాని వ్రాయునా వ్రాయఁడు. ఏమనఁగా నన్నయనాటి భారత ప్రతులలోనివి లేవు. తిక్కన నాటికి నెవరోశైవులు సందర్భశుద్ధిగూడ గమనింపక యీ భారతములోఁ గూర్చియుండిరి, హరిహరులందు నభేద ప్రతిపత్తిగల యీ మహనీయునకు దానినిఁ గూర్చి చర్చింపవలసిన యావశ్యకత కలుగలేదు. కనుకనే వీనిని-ఈ శివపరత్వ ప్రసంగములను దెనిఁగించెను. 'నారాయణం నమస్కృత్య' అని నారాయణోపక్రమముగను 'భగవాన్ వాసుదేవోపి కీర్త్యతేఽత్ర సనాతనః' అనియు స్పష్టముగాఁ బరమ వైదికమైన నారాయణ పరత్వమును శతసహస్ర ముఖముల నుద్ఘోషించు నీ మహాభారతములో శివపరత్వమున కెట్టి ప్రసక్తియులేదు. అట్టియెడ నవి యిట దూరుట శైవుల ప్రక్షేపవశముననే కదా! తిక్కన నాఁడు శైవమత మోరుగంటి గణపత్యాదుల ప్రభుత్వమున విజృంభించి యున్నదియేకదా! వారు నారాయణ పరమైకాంత మగు నీ మహాభారతమున నెట్లయినఁ గొంత శివపరత్వ ప్రసంగ ముండినఁగాని తమకు లోకగౌరవము కలుగదను తలంపుతో నిందులో వానినిఁ బ్రక్షేపించియుందురు. ఇందు కేమి ప్రమాణ మనఁగా, నన్నయ యాదిపర్వములోఁ దెల్పిన సర్వసంగ్రహాధ్యాయములో శివుని ప్రసంగము లేదు. కర్ణపర్వములోని కథలో మాత్రము త్రిపురదహనోపాఖ్యాన మున్నది. అయితే యొకవేళ దేవతామాహాత్మ్యముల ప్రసక్తి వదలెనేమో నన్నయ యనుకొనుటకు వీలులేదు. ఏమనఁగా నిపుడు శివుని పరత్వ ప్రసక్తి కల కథ లున్నట్లుగాఁ గన్పడుచున్న ద్రోణపర్వములోనే కృష్ణార్జున మాహాత్మ్య మున్నదని స్పష్టముగాఁ దెల్పియున్నాఁడు. కావున దీనినంతయుఁ బరిశీలించి చూడఁగా ద్రోణపర్వములోని శివ ప్రస్తావములేనియు, సౌప్తికములోని భూతాత్మక శివ ప్రస్తావనయు, నింకను నటనట శివప్రసంగమును, శతరుద్రీయము, శివసహస్రనామాదికము భారతములో నన్నయనాఁడు లేవనియు, వానిని శైవ మతపు విజృంభణ కాలములో నెవ్వరో శైవు లందుఁ జేర్చిరనియు స్పష్టము. కనుకనే యా నన్నయ వ్రాసిన తాటాకుల ప్రతినిఁ దనవద్ద నుంచుకొని, దానినిఁ జూచి వ్రాయలేదు కనుకనే తిక్కనగారీ ప్రక్షిప్తములైన శైవ భాగముల నన్నింటినిఁ దెనిఁగించుకొని పోయెను. నన్నయ గ్రంథము తన వద్ద

నున్నచో దానినిఁ బట్టి గ్రంథమును-భారత ప్రతిని సరిగా దిద్ది సరియగు తీరునే తెనుగొనరించి యుండెడివారు. కాఁగా నన్నయ గ్రంథ మవ్యవహితముగాఁ దిక్కనగారు విరాటపర్వము వ్రాయునాటికి నాయనవద్ద సన్నికృష్టముగా లేదు, కనుక వ్యవహితాంశ పూరణమెట్లన్న యాశంకతో 'కథ జగత్ప్రసిద్ధమే', కనుక ననఁగా వెనుకటి కథ విరాటాది వఱకు నందఱకును తెలిసినదే. కనుక నిట వెనుకటి కథను నేను వ్రాయనక్కఱలేదు. అని తెల్పినాఁడు. అయితే పైన వ్రాసిన విరాటాది గ్రంథము సంస్కృతమున కనువాదము. అయితే యిపుడొక యాశంక కలుగవచ్చును. నన్నయ, ప్రతి చూడకయే తిక్కన నన్నయ యారణ్యపర్వములోఁ గొంత రచించిన సంగతి యెఱుఁగకయే మూఁడు పర్వములు వ్రాసెనని తెల్పినాఁడు. కనుక దిక్కన మాటను బట్టి నన్నయ కరణ్యపర్వపూర్తి రచన నంటఁగట్టుట యుక్తము కాదు కదా! యనవచ్చును. కాని మేమొక తిక్కన మాటనే కాక యతని శిష్యుఁ డగు మారన మాటలను, నసలాంతరంగిక సాక్ష్యమును గ్రంథపరిశీలన మను శీర్షిక క్రింద నిరూపించనుంటిమి. ఇఁక నీ యాశంక కవకాశము లేదు కదా! నిజమునకుఁ దిక్కన నన్నయ గ్రంథము లెఱుఁగకపోలేదు. అతఁడు మూఁడు పర్వములు రచించెననుటలోఁ దిక్కన సర్వవిధములను సత్యమునే తెల్పెను. అయితే యందులోని పర్వసంగ్రహాధ్యాయములోని యవాంతర విషయములు గ్రంథమవుట సన్నిధానము వలనను జ్ఞాపకము లేకపోవచ్చును. మఱియుఁ దన హరిహరనాథ భక్తివలన శైవకథా ప్రసంగముల సందర్భశుద్ధి గమనింపఁబడలేదు. ఇంతేకాని మఱొకటికాదు. అంతరంగ సాక్ష్యమును నిరూపించిన దిట్ట కుశంకలన్నియు వారింప వలసియుండియే. కనుకఁ బై పద్యమును బ్రకృతమునఁ బ్రసంగించుట యుక్తమును, నవసరమును నని గమనింపవలెను.

గ్రంథపరిశీలన

ఇపు డెత్తిన కవిత యను భాగము కడమ యెత్తిన రచనలకన్నను, నిటు నన్నయ పూర్వరచనకన్నునుగూడ విలక్షణముగా నున్నది. కొన్ని యెడల జిగి బిగియుఁ, గొంత శైథిల్యమును, సూక్తివైచిత్ర్యమును గన్పట్టుచున్నవి.

"రయ విచలత్తురంగమ తరంగములన్ మదనాగ నక్రసం
చయములఁ జంచలచ్చటుల సైనిక మత్స్యములన్ మహోన్నతం
బయి కురురాజచంద్రు నుదయంబునఁ దద్దయుఁ బొంగెఁ బ్రస్ఫుర
ద్భయద మనోహర ప్రకట భంగులఁ దద్భటవార్ధి యుద్ధతిన్."

ఇందులో సగమువఱకు నవిరతమగు ధారాశుద్ధియుఁ జక్కని జిగిబిగియు

నుండుట ప్రత్యక్షమే. అస లీ సగభాగము సభాపర్వములో నన్నయకవిత్వమే కదా! దిగువ భాగములో శైథిల్యమును, సమానములో నెగుడుదిగుడులును 'భటవార్ధి కురురాజచంద్రునుదయంబునఁ బొంగె' నని కొలఁది సూక్తి వైచిత్రయు నగు పడుచున్నది. ఈ మొత్తము పద్యము నే యొక్కరి కవితయు ననఁజాలము నన్నయ కవితా లక్షణములు మిశ్రితముగా నున్నవి. స్పష్టముగా నన్నయ కవితను గుర్తించుటకై యీ పద్యమును నన్నయ కవిత్వములో సగమున్న దాని నందఱి యెదుటఁ బ్రదర్శించితిని. కాని యింకను బరిశీలించుచో నింకను నన్నయ కవిత కసాధారణములగు లక్షణములు కన్పడితీరును. అవి యివి. ఇందాకఁ జెప్పిన యనర్గళమగు ధార, కూర్పు బిగియేకాక సీసములు, గీతములు, పదప్రయోగములు మొదలగునవి. అందులో మొదట సీసములఁ బరిశీలింతము.

నన్నయ సీసములు

నన్నయ సీసములకుఁ గొన్ని నియమములున్నవనియు, నవి తిక్కనగానీ యెఱ్ఱనగానీ యాదరింప లేదనియు నందఱికినిఁ దెలిసినదే. ఆ నియమము లుండు నెడల నా కవిత నన్నయదియే యని తెలియవచ్చునుగదా! నన్నయ సీసనియమములివి. (1) కేవల యతిసీసము (2) కేవల ప్రాససీసము (3) పూర్వార్ధమున యతి యుత్తరార్ధమునఁ బ్రాస (4) ఉత్తరార్ధమున యతి, పూర్వార్ధమునఁ బ్రాస. ఇవి గాక యింకను వేఱు నియమము లున్నవి కాని, వాటినిపుడు గణింపనవసరములేదు. వీనివల్లనే నిర్ణయము కావింతము. వీనిని మొదట స్పష్ట నిర్ణీతమగు నన్నయ కవితనుండి యుదాహరించి తరువాతఁ బ్రకృత భాగములో నవి యున్నవేమో గమనింతము.

(1) కేవల యతిసీసము

హా మహారాజ మహామహీ రక్షణ దక్ష దక్షిణ భుజదండ దండి
తారాతి నిషధ రాజాగ్రణి నన్నిట్లు వీతదయుండవై విడిచి చనఁగఁ
దగునె నీ వెన్నఁడు ధర్మువుఁ దప్పనివాఁడవు సూనృతవ్రతరతుండ
వోడకుమని నన్ను నూఱడఁబలికిన పలుకిట్లు మఱువంగఁ బాడియగునె?

అరణ్యా. ౨ ఆ. ౭౨ ప.

ఇది నన్నయ నలచరిత్ర లోనిది.

ఇంకను నారణ్య పర్వశేషములో

భాగ్యంబుగాదె యీ పార్థుండు హరుఁడాదియైన నిర్జర సమూహంబువలన
నెలమిఁగృతాస్త్రుఁడై యేతెంచుటరయంగ ధన్యుండవైతివి ధర్మతనయ
నీ ధర్మనిష్ఠయు నీ తపంబునుజూవె యింతకుఁ గారణం బిద్ధచరిత
రాజ్యంబు కంటెను రాజేంద్ర ధర్మంబె యిష్టమై యుండు నీ కెల్లనాఁడు
వేదవేదాంగ విదుఁడవు వివిధయజ్ఞకర్తవైతి ధనుర్వేద కర్మఠుఁడవు
ధరణియెల్ల నేలెడి రాజధర్మ మమర సులభమయ్యె నీకిహపరశోభనములు

అరణ్యా. ౪ ఆ. ౧౫౪ ప.

ఇది యెఱ్ఱన కవితగా ననుకొనవచ్చునేమో విచారింపుఁడు. కేవల వళి నియమము తిక్కన, యెఱ్ఱనాదులు వీడిరి. పై పద్యమున నీ నియమము పాటింపఁ బడినది. నన్నయభట్టారకుని సారస్వతాంశమే. ఇందులోఁ గొన్ని చరణములలో శైథిల్యము కన్పడుచున్నది. "అరయంగ ధన్యుఁడవై తీవు" రాజ్యంబుకంటెను రాజేంద్ర" గీతి యుత్తరార్థమునందును రీతి పాంచాల రీతి. ఇది యెఱ్ఱన పూరణమై యుండును. వాక్యమునకు మొదటఁగాని వాక్యావసానమునఁగాని నన్నయ సామాన్యముగా సంబోధన నుంచును. క్రియ నడుమ నుంచఁడు. అది కూర్పునకు బిగి తగ్గించును. చూడుఁడు

కాదన కిట్టిపాటి యుపకారము తక్షకుఁ డేకవిప్ర సం
బోధనఁజేసి చేసె నృపపుంగవ (ఆది పర్వము ౨ అ ౨౦౪ ప.)
అవిచారం బని పల్క నోడెదము ధర్మాభిజ్ఞ! ఆది. ౩ ఆ. ౧౯౬ ప.

ఇచట 'కాదన కిట్టిపాటి యుపకారము నృపపుంగవ; తక్షకు ఁడేకవిప్ర సంబోధన,' ఈ తీరున నన్నయ కవిత సామాన్యముగా నుండదు. బిగి తక్కువ ప్రత్యక్షమే కదా! కనుక 'రాజ్యంబుకంటెను రాజేంద్ర! ధర్మంబు నీ కిష్టమై పరఁగును. అనునది నన్నయ కవిత కాదంటిమి. 'రాజ్యంబుకంటె ధర్మంబు నీ కిష్టమై పరఁగును రాజేంద్ర!' అని కానీ నన్నయ రచనయుండును. ఇట్లే ముందుముందుఁగూడఁ గ్రహించునది. నన్నయ కూర్పులో సమాసములోఁ బదప్రయోగములో నింకను ననేకములందుఁ గడమవారికన్న వైలక్షణ్యము కన్పడును. గమనింపుఁడు.

(2) సర్వప్రాస సీసము

నన్నయది

అనఘుఁడై యెనుబదివేవురు బ్రాహ్మణ ప్రవరుల బ్రహ్మవిదుల
వెలయంగ నల్లిండ్లనిలిపి ప్రత్యేకంబ ముప్పంద్రుదాసుల నొప్ప నిచ్చి

ముదముతో రక్షించు, పదివేవు రుత్తమ భూసురు లతని యగ్రాసనమునఁ
గలధౌతమయ పాత్రములఁబ్రతిదినమును గుడువనుగట్టను దొడువఁబూయ
సభా. ౨ ఆ. ౧౨౧ ప.

అరణ్యపర్వశేషములో

కడఁగి ధర్మముతోడ నడచుచు నేమిట్లు దందడి దుఃఖంబు లొందుటయును
నేపున నెప్పుడుఁబాపంబు సేయుచు ధృతరాష్ట్రజులు సుఖోన్నతులగుటయుఁ
గని యీ విపర్యయమునకు నేనూహింతుఁ బాయక నరుఁడిప్డు సేయు కర్మ
మన ఫల మిందుఁ బొందునొ? పరలోకంబునందుఁబొందునొ? యిందు
నందుఁ గనునొ?
విశ్వకర్తయైన యీశ్వరుగాననొ? పురుషుఁ గర్మఫలము పొరయకున్నె
యొడలితోన గృతము వెడలిపోవునొ? యిది దెలియవలయు నాకు
నలఘుపుణ్య

అరణ్య ४ ఆ ౧౬౯ ప.

(3) పూర్వార్థమున యతి యుత్తరార్థమునఁ బ్రాసము.

అద్దానవులు దారుణాశ్మ వర్షంబులుఁ గురిసిన నవి నన్నుఁ దెరలఁ గప్పె
నేనును గులిశాస్త్ర మేసి పాషాణముల్ నుఱుముగావించితి నుఱక వెండి
యసురులు నామీఁద ననలాస్త్ర మలుకమై నేసిన గాడ్పుతో మ్రోసి యగ్ని
కణములు నాపైనిఁ గవిసిన నేనును సలిలాస్త్రమున దానిబల మడంచి.
(అరణ్య పర్వము)

ఇఁక నారణ్య పర్వ శేషములో

నీ పుత్రులేవురు నీరజలోచన యదుకుమారులుఁ దారు ముదముతోడ
ననుపమస్నేహ సమాహృతహృదయులై కరిహయారోహణ చరితఁదగిలి
యాడుచు వివిధ శస్త్రాస్త్రవిశేషముల్ గఱచుచు నొండెల్ల మఱచియున్న
వారు ప్రద్యుమ్నుండు వారికి దివ్యాస్త్రజాతంబులెల్లను బ్రీతినొసఁగెఁ
దన్వి యా సుభద్ర దనపుత్రుకంటె నీ తనయులందుఁ గూర్మిఁ దనరఁజేయు
నూఱడిల్లు మింక నుజ్జ్వలోన్నతులఁ బెంపారకాల మనతి దూరమయ్యె.

(4) పూర్వార్థమునఁ బ్రాస యుత్తరార్థమున యతి-నన్నయ కవిత.

ఇమ్మహాభారతం బిమ్ములఁ బాయక విహితావధానులై వినుచునుండు
వారికి విపుల ధర్మారంభ సంసిద్ధియగుఁ బరమార్థంబ యశ్రమమున

వేదముల్ నాల్గు నాది పురాణముల్ పదునెనిమిదియుఁ దత్ప్రమితధర్మ
శాస్త్రంబులును మోక్షశాస్త్ర తత్త్వంబులు నెఱిఁగిన ఫలమగు నెల్లప్రొద్దు.

ఆది. ౧ ఆ ౭౨ ప.

ఇఁక నారణ్యా పర్వశేషములో

కడుఁ గ్రొవ్వి తేఁకువ సెడియె నీ పాఱుండు వీఁకమై నిప్పుడు వీనితొమ్మ
వ్రయ్యంగఁ జేసెదఁ జయ్యన విషదిగ్ధసాయకమును శరాసనమ్ముఁ దెమ్మ
నావుడు న మ్మహీదేవుండు నగుచు నిట్లనియె నన్నేయఁ దెమ్మనిన విశిఖ
మంతఃపురంబున సంతసంబున నున్న ఘనుభవత్సుతుఁ దున్మగాకయిపుడ

అరణ్యా. ౪ ఆ. ౩౫౩ ప.

నన్నయ ఆటవెలదులు

ఇవియుఁ బైనియమము గలవియే.

(1) సర్వప్రాస ఆటవెలది....

నన్నయ కవితలో

ఉన్నఁజూచి హరుఁడు గ్రన్నన యింద్రుల నేవురను మహానుభావ మెసఁగ
మనుజయోనిఁబుట్టుడని పంచె గీర్వాణహితము సేయుపొంటె మతిఁదలంచి.

ఆది. ౨ ఆ.

అరణ్యా పర్వశేషములో నన్నయకవితఁ జూడుఁడు.

కరుణ నిట్టులనియెఁ బరమాస్త్ర లాభంబు నీకు నిష్టమేని లోకవంద్యుఁ
గరళకంఠు నీశుఁ బరముఁ బ్రసన్నుఁగా వేగఁజేయు మధికయోగశక్తి.

ఆరణ్యా. ౧ ఆ. ౨౯౪ ప.

ఇఁక నారణ్యా పర్వశేషములో

డాయఁబోయి తీవ్రసాయకవిద్ధుఁడై పొరలుచున్న విప్రవరునిఁజూచి
తలఁకి యనునయంపుఁ బలుకులు వలికినఁగినిసి యిట్లులనియె మునివరుండు

ఆరణ్యా ౫ ఆ. ౧౩౨ ప.

(2) పూర్వార్థమున యతి ఉత్తరార్థమునఁ బ్రాస.

నన్నయ కవిత

పరుష విషమ భూరి పాషాణ భీషణ గిరులువచ్చి నన్నుఁ దెరలఁగప్ప
వజ్రబాణ మేసి వాని నన్నింటినిఁ బాచియున్న నన్నుఁజూచి యపుడు

ఆరణ్య ౧ ఆ. ౧౯౫ ప.

ఇఁక శేషములో

శ్రీసమేతుఁడై విశేషకాంతి స్ఫూర్తి నొలసి పూర్ణచంద్రు చెలువుదాల్చి
యున్నవానిఁజూచి యుత్ఫుల్లలోచనకుముదు లగుచు మునులు నమరవరులు

అరణ్య ౫ ఆ. ౨౨౧ ప.

(3) పూర్వార్థమునఁ బ్రాస, యుత్తరార్ధము యతి నియమము.

నన్నయ కవితలో

దాని నపనయింపఁగా నిష్ఠ వచ్చితి నధిక యోగలబ్ధ మతిరహస్య
మీ విశేషవిద్య సేవింపఁగాఁ బార్థుఁ బనుపు మితఁడు దీనఁ బడయు సిద్ధి

అరణ్య ౧ ఆ. ౨౭౫ ప.

ఇఁక శేషములో

మదగజాభిరామ మృదులయానంబొప్ప నల్లఁబొలయుచును లతాంతరములఁ
గరము లీలఁ గమ్మవిరుల గోయుచునున్న పువ్వుఁబోఁడి నొక్క పొలఁతిఁ
గనియె,

అరణ్య ४ ఆ. ३२१ ప.

ఇచటి 'మృదుల' పదముకూర్చితరులది.

నన్నయ తేటగీతులు

తేటగీతులును నీ నియమములతోనే యున్నవి.

(1) సర్వప్రాస నియమము, తేటగీతిలో

నన్నయ కవిత

పఱవనోపక యున్న మైమఱచి పెంటిఁ
బెనఁగియున్ననుఁ బ్రసవింపమొనసియున్నఁ
దెవులు గొనియున్న మృగములఁ దివిరి యేయ
రెఱచి యాహారముగ మను నెఱుకులైన.

ఆది ౫ ఆ. ౫౩ ప.

అరణ్య పర్వశేషములో

కనిముదంబునఁ బొందెడు వనిత నీవుసుతుల నత్యంతనిర్మలమతుల శౌర్య
యుతులఁగాంచిన సద్గుణాన్వితవు వగపువలదు చిత్తంబులో నీకు జలజనయన.

ఆరణ్య ౫ ఆ. ౩౨౩ ప.

(2) పూర్వార్థమునఁ బ్రాస యుత్తరార్థమున యతి

నన్నయ కవిత

ముదుసళులు తమ కిమ్ముగాఁ జదివికొంద్రుగాక పతులకు హితమగు కర్జమేల
యొలసిచెప్పుదురహితులఁ గలపికొనుట ధర్మువనిరిది నయవిరుద్ధంబుగాదె?

ఆది ౮ ఆ. ౩౮ ప.

అరణ్య పర్వశేషములో

పరఁగన మ్మధుకై టభాసురుల సుతుఁడు సువ్వె ధరణీశ ధుంధుఁడన్ శూరవరుఁడు
వాఁడు పరగర్వమునఁజేసి వాఁడిమిగిలి యమరపతిఁ దొట్టివేల్పుల నవమతించె

ఆరణ్య ౪ ఆ. ౪౦౦ ప.

(3) పూర్వార్థమున యతియు నుత్తరార్ధమునఁ బ్రాసయు.

నన్నయ కవిత

నా యథాశక్తిఁ జేసి యన్యాయపథముఁ బరిహరించి మహాత్ముల చరితలందు
బుద్ధినిలిపి మీ యుపదేశమున శుభంబులయినవాని ననుష్ఠింతుఁ బ్రియముతోడ,

సభాపర్వ ౧ ఆ. ౫౭ ప.

అరణ్య పర్వశేషములో

నడబెడంగులు నన్నునడుములందు వెలయు వళులుభావంబులు వలుదచన్ను
గవలనిక్కును నేర్పడఁగనికరంగి మదనమార్గణ విదళిత హృదయుఁడయ్యె

ఆరణ్య ౫ ఆ. ౧౬౫ ప.

నన్నయపదప్రయోగములు

నన్నయ్యకు మాత్రమే యసాధారణములగు పద ప్రయోగము లీ శేషములో నున్నవి. ఈ శేషములో

ద్యూత వ్యాజమునన్ సభాంగణములో దుర్యోధనుం డట్లు దు
ర్నీతిం గూరి యొనర్చినట్టి యఘముల్ నిష్కంప ధైర్యోన్నతిన్
జేతఃస్ఫారుఁడవైన నీ కొకనికిం జెల్లెన్ సహింపంగ-వి
ఖ్యాతక్షాంతులు లేరె ధార్మికులు నిక్కం బిట్టిరే యెవ్వరున్?

ఆరణ్య ౪ ఆ. ౧౫౭ ప.

'ఇట్టిరే' యను పదప్రయోగము "ఎఱ్ఱన" యందు సాధారణముగాఁగన్పట్టదు. నన్నయయందీ ప్రయోగమును గమనింపుఁడు.

తద్ద్వారపాలకుల్ దారుణాకారు లపార బలాఢ్యులు పార్థుకడకుఁ జనుదెంచి
సురరాజసన్నిభు నాతనిఁజూచి యచ్చెఱువడి శూరులెందు
నీయట్టిరే కురునృపవీర.

సభా. ౨ ఆ. ౨౩౬ ప.

2. "కాలంబుతోఁ గూడఁ గల్గవు వానలు." (ఆరణ్య. ౪ ఆ. ౧౫౪ ప.)

ఈ ప్రయోగము నన్నయదే. ఇతరులైనచోఁ 'గాలంబు నందునఁ గల్గవు వానలు' అని ప్రయోగింతురు.

3. "నీ ధర్మనిష్ఠయు నీ తపంబును జూవె" (ఆరణ్య. ౪ ఆ. ౧౫౪ ప.)

ఇట 'చూవె' యనునది నన్నయది.

4. ఉల్లము సత్యసంయమము నూనినవాఁడవు నీవు విక్రమం
బొల్లమిఁ గౌరవాధముల యుద్ధతి మైమెయి ఁజెల్లెగాఁక

ఆరణ్య ౪ ఆ. ౧౫౮ ప.

'మెయిమెయి' ఈ ప్రయోగ మెఱ్ఱనది కాదు. నన్నయ సొమ్మె యిది.

నన్నయ రచనా స్వరూపము

పద పదార్థ సంధానము రచన యని యిట వివక్షితము. మొదటఁ బద సంధానమును జూతము.

నన్నయ వచనములు

1. 'అట్టి శారదాగమంబున' నుత్ఫుల్ల కమల కల్హార కేసర కరాళ కలిత కల్లోలమాలినియు (ననేక మునిలోక సంసేవ్యమాన విపుల పులినోత్సంగయు)

నిరంతర తీరవానీర వనమండలీ విలసితయు, నాకాశసంకాశ విశద సలిలయునైన మహా సరస్వతీనది ననుదిన స్నానపానాది విశేషంబులఁ బరితోషంబు నొందుచుఁ బాండునందనులమ్మరుభూమిం గొన్ని దినంబులు వసియించి తదనంతరంబు ధౌమ్యాది భూసురులు నింద్రసేనాది మూలభృత్యులుఁ దోడ నరుదేఱఁగా వృకవనంబునకు వచ్చి.

ఆరణ్య ౪ ఆ. ౧౪౮ ప.

(ఈ గద్యము 'ఉత్కలికాప్రాయము', చూ. ఆంధ్ర కావ్యాలంకార సూత్రవృత్తి.)

2. అగ్నిహోత్రం బస్మదాత్మకం బని యెఱుంగుము. సకల యజ్ఞంబులయందుఁ గల్పింపఁబడు విశిష్ట ద్రవ్యంబులన్నియు మదీయంబు. నేను మహనీయంబైన యగ్నిహోత్ర ముఖంబునఁ బ్రభవింతు నాత్మజ్ఞులైన మహాత్ములకు నఖిల సంశయ చ్ఛేదంబు సేయుదు ననవరత తపస్స్వాధ్యాయ దాన వ్రత పరాయణులైన తపోధనులెందేని విగతశోకులై చరియింతు రట్టిది మామకంబైన పరమపదంబు.

ఆరణ్య ౪ ఆ. ౨౧౫ ప.

(ఈ గద్యము 'చూర్ణము' చూ. ఆంధ్ర కావ్యాలంకార సూత్రవృత్తి.)

ఈ విశదతరములైన వచనములు నన్నయకుఁగాక యితరులకుఁ గూర్పవలను కానివి. 1వ గద్యములో (గుండలితమగు పదసంధానము నన్నయది కాదు. ఏమనఁగా నన్నయ పదసంధానమున నెగుడు దిగుడు లుండవు. ఒకే బిగిని నసుల్బణముగా నుండును. అట్లుగాని సమాస రచన నన్నయలోఁగన్పట్టదు. కనుక నన్నయది కాదంటిమి, కడమ సమాసములఁ జూడుఁడు. అవి నన్నయవే. దానియందలి బిగియు, నెగుడు దిగుడు లేకుండుటయు, శైథిల్య రహితమును గమనింపుడు. అట్లుగాని సంధాన మెట్టినకుఁ దఱచుగ నలవాటు. అది యతని గ్రంథాంతరముల నుండి గ్రహింపవచ్చును. ఇంతకు నీ సమాస మనర్థ మమూలకము.

1. 'అని యక్రూరుం డనేక క్రమంబులఁజెప్పిన వాక్యంబుల యభిప్రాయం బంతయు నెఱింగి కృష్ణుండు కంస ధ్వంసనంబునకు సముత్సుకుండయ్యె'.

2. ఆ రాజపుంగవుండీ రామ దామోదరుల నుదారధీర ప్రతాపధౌరేయులనఁగా వినియుండుం గావున

హరివంశము. పూ. భా. ౮ ఆ. ౧౪౫ ప.

మొదటి గద్యలో గీత గీచిన భాగంబుగడ బిగిలేక పోవుటయు, నుల్బణతయు గమనింపవచ్చును. రెండవదానిలో సమాసము వ్యస్తముగాను పదసంధానముల్బణము గాను నున్నది. 'ధీరోదార ప్రతాపులగు గోపులుగా'నని నన్నయ రచనయుండును.

పైనఁ జూపిన వచనములలో నింకను నొకటి రెండెఱ్ఱన కూర్పు లున్నట్లు తోఁచును. కాని మొత్తము రచన మాత్రము నన్నయదే. అట్లు నన్నయదే యని నిర్ణీతమగు రచనను గమనింతము రండు.

'అక్కురుక్షేత్ర శమంత పంచకంబులకు నడుమ రామహ్రదంబు, నడుమఁ బితామహు నుత్తరవేది యనంబడునట్టి కురుక్షేత్రంబు మెట్టినవారికిఁ, గురుక్షేత్రం బునకుఁ బోయెద మనినవారికిఁ, గురుక్షేత్రంబున వసియించెదమని తలంచిన వారికి సర్వ పాపక్షయంబగు, తదనంతరమున విష్ణుస్థానంబున విష్ణు నర్చించిన నశ్వమేధ ఫలంబు'.

అరణ్య ౨ ఆ. ౨౫౯ ప.

దీనివలెఁబై 'చూర్ణ' గద్య (2) విశదమగు కూర్పేకదా!

నన్నయ పద్యరచన

ఇఁక బద్యరచన గమనింతము

"పొలుపుగాఁ జంపకోత్పలమాలికల్గూర్ప దిట్టండు నన్నయభట్ట సుకవి" సువృత్తతిలకము. శ్రీ వేంకట రామకృష్ణకవులు.

అన్నట్లుగా నన్నయ చంపకోత్పలముల కూర్పు విశిష్టమైనది. ఈ కూర్పులో ధారాశుద్ధి గమనింపవలసి యున్నది. అది నన్నయయందద్వితీయ మని యంద ఱెఱింగినదే!

"విమల యశోనిధీ; పురుషవృత్త మెఱుంగుచునుండు సూవె వే
దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహా పదా
ర్థము లివి యుండగాఁ నరుఁడు దక్కొన నేర్చునె తన్ను మ్రుచ్చిలన్

శకుంతలోపాఖ్యానము, ఆదిపర్వము ४ ఆ. ౮౦ ప.

దీనినిఁ జూతము.

"వినుత భవ న్నియోగ మను వేల యలంఘ్యముగాన యిమ్మెయిన్
ఘన భుజ వీచి విభ్రమ వికాసముఁ జూపక నిల్చెఁగాక స
జ్జనమత చూడ నీయనుజసాగరముల్ దతితోడ విద్విష
జ్జన లయకాలులై కడఁగి సర్వజగంబుల నాక్రమింపఁగాన్"

ఆరణ్య ౪ ఆ. ౧౫౯ ప.

ఈ రెండవ పద్యములో రెండు మూఁడు పాదములందు నన్నయ శైలియే. ప్రథమ చతుర్థ పాదములలోఁ గూర్పుబిగి సడలి యెత్తిన కూర్పును దెల్పుచున్నది. ఈ రెండు పద్యములను గమనింపుఁడు. నన్నయ శైలి యింకను స్పష్టపడును.

"ప్రకటిత కోపవేగమునఁ బద్మదళాయత నేత్రముల్ భయా
నకతరలీలఁదాల్చె నరుణద్యుతి నుద్యతమై త్రిశాఖ మై
భ్రుకుటి లలాటదేశమునఁ బొల్చెఁ ద్రికూటతటీత్రిమార్గగా
నుకృతి ప్రభంజన ప్రియతనూజున కంతకమూర్తి కచ్చటన్".

సభా ప. ౨ ఆ. ౫౧ ప.

ఇది సభాపర్వములోనిది

"శితభల్లద్వితయంబునన్ గడువెసం జేదోయి ఖండించి ఖం
డిత గోత్రాచల తుంగశృంగ శతకోటి స్ఫార ఘోరానల
ద్యుతి సాంద్రంబగు శాతభల్ల మొకటం ద్రుంచెంగనత్కుండలా
న్వితమై యొప్పు నిశాచరేంద్రు శిరమున్ వీరక్రియాదక్షుఁడై".

ఇది యారణ్యపర్వశేషములోని రామకథ యందలిది. చిట్టచివర 'వీర క్రియాదక్షుఁడై' అనునది మాత్రము నన్నయ సమాసముగా దోఁచదు. కాని మిగిలిన దంతయు నన్నయ రచనయే.

ఇఁక ఉత్పలమాలను గమనింతము.

"ఇంతుల గోష్ఠినున్న నరుఁ డెంత వివేకము కల్గెనేని న
త్యంత మదాభిభూతుఁడగు ధర్మువుదప్పుఁ బ్రియం బెఱుంగఁడే
నెంత వివేకి నయ్యును సహింపక యింతులయొద్దఁ బల్కితిన్
వింతయె కాముశక్తి యుడిగింపఁగ శక్యమె యెంతవారికిన్".

మత్తేభమును గమనింతము.

"పతదుర్వీధర ధాతునిర్ఝరజలాభంబై మహాదేహ ని
ర్గత సాంద్రారుణ పూర మొక్కమొగి నొల్కం ద్రెస్సి నారయణో
న్నత దోర్దండ విముక్త చక్రనిహతిన్ నాకద్విష న్మస్తక
ప్రతతుల్ ఘోర రణంబునం బడియె భూభాగంబు గంపింపఁగన్."

ఆది ౨ ఆ. ౨౪

ఇఁక నారణ్య పర్వశేషములో విచారింతము.

"అమరానీకవిసృజ్యమాన బహు శస్త్రాస్త్రాహతిన్ భిన్న దే
హములై ఘోరమదేభముల్ బహుల రక్తాంగంబులై తూలెఁదీ
వ్ర మహావాత నిపాత జాత రభస వ్యాఘూత సంధ్యారుణా
భ్రములో నా నవశంబులై యొఱలుచుం బ్రత్యర్థి సైన్యంబులన్."

ఇంకొకటి

పురుహూతాగ్రసర ప్రభూత జలసంభూతాస్త్ర నిర్ధూతమై
తిరిగెన్ బమ్మరి దైత్యవాహినుల నుద్వృత్తాశ్వీక శ్రేణి వి
స్ఫురితోద్ధూత సమీరవేగ విముఖీభూతాకృతిం దూలు భీ
కర రత్నాకరజాత సంతత తరంగ వ్రాతమున్ బోలుచున్.

ఆరణ్య ౫ ఆ. ౨౨౩. ౨౨౪.

శార్దూలము సొగసు నాస్వాదింతము.

ఇది నన్నయది

త్రేతాద్వాపరసంధి నుద్ధత మందాధీభూత విద్వేషి జీ
మూతో గ్రశ్వసనుండు రాముఁ డలుకన్ ముయ్యేడుమాఱుల్ రణ
ప్రీతిన్ వైరి ధరాతలేశ్వరులఁ జంపెన్ బల్వురన్ దీర్ఘ ని
ర్ఘాత క్రూర కుఠార లూన నిఖిల క్షత్త్రోరుకాంతారుఁడై.

ఆది ౧ ఆ. ౭౮ ప.

ఇఁక నారణ్యపర్వ శేషములో

గీర్వాణ ప్రవిముక్త బాణపటల క్రీడావిలూనంబులై
గర్వోన్నద్ధసురారి శీర్షములు వీఁకన్ డొల్లెఁ గల్పచ్ఛిదా
నిర్విద్ధాంబుద మండలోద్గత మహానిర్ఘాత పాతావధూ

తోర్వీభృద్ఘన గండశైలములతో నూహింపఁ దుల్యంబులై.

ఆరణ్య ౫ ఆ. ౨౬౮ ప.

ఈ కవితాధారను గమనింపుఁడు.

గాండీవము విల్లటె యాఖండల నందనుఁడు విల్లుగలవాఁడటె-త
త్కాండంబులు దివ్యములటె యొండేటికి వారి ధనము యుర్వియు సిరియున్.

ఆరణ్య ౫ అ. ౩౪౩.

ఈ నిరర్గళధారా మాధుర్యము నన్నయయందుఁ దక్క మఱొకయెడఁ గన్పడదు. ఇంకను శ్రీరామచరిత్రమునందుఁ గూడ నిట్టి ధారావైచిత్ర్యమునే గమనింపఁ గల్గుదుము.

తాలై లాగురు చందన సాల తమాలామ్ర నింబ జంబూ జంబీ
రాలంకృత లంకావనజాలంబుల విడిసె వృక్షచర సైన్యంబుల్.

ఆరణ్య ౬ ఆ. ౫౫.

ఇంతేకాక నన్నయ కవితలోఁ బద్యములం దొక విశిష్ట వైచిత్ర్య మున్నది. జాగ్రత్తగా గమనింపవలెను. అది యేదనఁగా - ఏ పద్యమునందైనను మూఁడు నాల్గు చరణములకు నవిచ్ఛేదము. అనఁగా మూఁడవ చరణము చివరయు నాల్గవ చరణము మొదలును నూటికిఁ దొంబది తొమ్మిది పాళ్ళు పరస్పరముఁ గలిసియే యుండి తీరును. ఆ రెండు చరణములను విడిపోవుట యెటనో గాని యుండదు. కడమవారు తిక్కన యెఱ్ఱన లా విషయము నందంత శ్రద్ధ పూనరు. పై వైచిత్రివలన నొక సొగసు పద్యమున కేర్పడును. పద్యము నడక యుయ్యేల యూపుతో నాస్వాద్య మగుట. అది నన్నయ కవితలో ముఖ్యముగా గమనింపఁ దగిన వైశిష్ట్యము. ఇదివరలోఁ జూపిన యుదాహరణములందె యిది వివరించి గమనింపనగును; కావునఁ దిరిగి యుదాహరింపఁబూనను.

ఈ నిరూపించిన యుదాహరణలను బట్టి యారణ్య పర్వశేషంబునందుఁ గూడ నన్నయ కవితయే యున్నదనియు, నటనట మాత్ర మెఱ్ఱన యెరణమని యుఁ దెలియవచ్చునే కదా! అంతేకాక సావిత్ర్యుపాఖ్యానములోఁ జాల భాగ మెఱ్ఱన కవితయే కాని యందులోఁ గూడ నన్నయ రచన చాల చోట్లఁ దలసూపుచునేయున్నది. కొంచెము సూక్ష్మేక్షిక యవసరము. ఈ విషయమున నిప్పటికే చాల గ్రంథము పెరిగియున్నది. ఈ నిరూపించిన మార్గముననే యట

గూడ సహృదయులు నన్నయ కవిత నున్నయ మొనర్పఁగలరు. ఎఱ్ఱన యారణ్య పర్వశేషోన్నయమును గుర్తింపఁగలరు.

నన్నయ యనువాదము

ఇంకొక విషయమును మాత్రము చూపెదను.

సంస్కృత భారతము ననువదించుటలో నన్నయ పద్ధతియే యారణ్య పర్వశేషములోఁ గూడఁ జాల చోట్లఁ గన్పడుచున్నది. ఒకటి యుదాహరింతము.

నన్నయ యనువాద పద్ధతి

నన్నయ సభాపర్వములో సంస్కృత భారతము నిట్లనువదించెను.

సంస్కృత మూలము

ఏవ ముక్త్వాతు కౌంతేయ మపోహ్య వసనం స్వకం
స్మయం నివేక్ష్య పాంచాలీ మైశ్వర్యమదమోహితః ॥
కదలీదండసదృశం సర్వలక్షణ సంయుతం
గజహస్త ప్రతీకాశం వజ్రప్రతిమగౌరవం ॥
ఆభ్యుత్స్మయిత్వా రాధేయం భీమ మాదర్శ యన్నివ
ద్రౌపద్యాః ప్రేక్షమాణాయాః సవ్య మూరు మదర్శయత్. ॥
భీమసేన స్త మాలోక్య నేత్రే ఉత్ఫాల్య లోహితే
ప్రోవాచ రాజమధ్యే తం సభాం విశ్రావయన్నివ ॥
పితృభి స్సహసా లోక్యం హ స్మ గచ్ఛే ద్వృకోదరః
య ద్యేత మూరుం గదయా న భింద్యాం తే మహాహవే
కృద్ధ స్స తస్య......... ....

తెలుఁగు

"అమ్మదితన్ విభీతహరిణాక్షిఁ గలాపవిభాసిఁ కేశభా
రమ్మన నొప్పుదానిఁ దన రమ్య పృథూరుతలమ్ము నెక్కఁగా
రమ్మని సన్నఁజేసె ధృతరాష్ట్ర సుతాగ్రజుఁ డప్డుదాని దూ
రమ్మనఁ జూచి కౌరవకురంగ మృగేంద్రుఁడు భీముఁ డల్కతోన్.
లయసమయ దండధర ని
ర్దయుఁడై ధరణీశులెల్లఁ దన పలుకులు వి
స్మయ సంభ్రమ సంభృతులై

భయమున వినుచుండ నా సభం దగఁ బలికెన్.
ధారుణి రాజ్య సంపద మదంబునఁ గోమలిఁ కృష్ణఁ జూచి రం
భోరు నిజోరుదేశమున నుండఁగఁ బిల్చిన యి ద్దురాత్ము దు
ర్వార మదీయ బాహుపరివర్తిత చండగదాభిఘాత భ
గ్నోరుతరోరుఁ జేసెద సుయోధను నుగ్రరణాంతరంబునన్

ఇంతకుఁ గొంత పూర్వము భీముఁడు ద్రౌపది కేశములను దుశ్శాసనుఁ డాకర్షించుటను గూర్చి యిట్లనెను.

సంస్కృతము

నహి ముచ్యేత మే జీవన్ పదా భూమి ముపస్పృశన్
మర్త్యధర్మా పరామృశ్య పాంచాల్యా మూర్ధజా నిమాన్
....

(దీర్ఘేషు నీలే ష్వథ చోర్మిమత్సు జగ్రాహ కేశేషు నరేంద్ర
సత్యం............................కృష్ణా మతిదీర్ఘ కేశీం).

.............ప్రకీర్ణ కేశీ పతితార్ధవస్త్రా) అనియు నంతకుముందు ద్రౌపది కేశములను గూర్చి చెప్పఁబడినది.

ఇట నున్న యనువాద మంతయు మూలము నతిమనోహరముగా రసైక ప్రవణముగా, నేకముఖమున సవరించినది. ఇదివరలో దుశ్శాసనునిఁ గూర్చి యొనర్చిన శపథములో "ఇట్లు సేయనైతినేని పితృ పితామహుల గతికిం దప్పిన వాఁడనగుదును" అను మాట యిచ్చటఁగూడ మూలములోనున్నను బునరుక్తి యగునని త్యజించెను. ద్రౌపదీకేశము లతి నీల దీర్ఘములు. ప్రకృతమున దుశ్శాసనా కృష్టములు. ద్రౌపది సభలో నుండియు నైదుగురు భర్తలయెదుటఁ బరపురుషుని నెచ్చటను నేవనితయు నొందని యవమానము నొందెను. అపుడామె కనులు భీత విప్లుతము లగుట సహజమే. అప్పటి సౌందర్యమును "విభీతహరిణాక్షి కలాప విభాసి కేశభారమ్మున నొప్పుదాని" అని తెల్పెను. మూలములోని కేశ సౌందర్యమును "కలాప విభాసి కేశభారమ్మున" అని వ్యంగ్య మధుర మొనర్చెను. ఇట్టి పాపుని శిక్షించు సమయమున 'లయసమయ దండధర నిర్దయుఁడై' అని భీము నగ్గించుట యుక్తమేకదా! అది యతనికృత్యమేగదా! 'మహాహవే గదయా' అనుదానికిని "యద్యేత మూరుం న భింద్యాం" అను దానికిని 'దుర్వార మదీయ బాహు పరివర్తిత..... చేసెద' అనునది రౌద్ర రసాభివ్యంజకమగు సరియైన యనువాదమే

గదా! దుర్యోధనుఁడు తన యూరు సౌందర్యమును ద్రౌపదికిఁ బ్రదర్శించినను ద్రౌపదిచూడలేదు. అట్లుగాక చూచెనేని ద్రౌపదియం దనౌచిత్యము సంభావిత మగును. కనుక త్యజింపఁబడినది. ద్రౌపది తనకుఁ గల్గిన యాపదను గూడ గణింపక దుర్యోధనుని తొడ సొగసును జూచుటనుచితముగదా! కనుక నది యట్లు మూలమున నున్నను జెప్పఁబడలేదు. భీముఁడు దానిని గ్రహించెను. కనుకనే తన తొడ నెక్కరమ్మని దుర్యోధనుఁడు ద్రౌపదికి సంజ్ఞచేసినపు డా సౌందర్యము తెలుఁగున జెప్పఁబడలేదు. ఆ సొగసు పాపారంభము. నశింపక తప్పనిది. కనుక నిది గ్రహించి భీముడా సౌందర్య ప్రదర్శనము నపరాధముగఁ బ్రదర్శించెనని భీముని పద్యములో ననువదించెను. 'భీమమాధర్షయ న్నివ' అను మాటయొక్క భావమును దుర్యోధనుని తొడల గుణమును నపరాధ ప్రదర్శనలోనే భీముఁడు నిరూపించుట పాండవులందఱిలోను భీముఁడొక్కఁడే యీ విషయమును జూచుటయు, వీని ద్వారమున వ్యక్తపఱచెను. ఇటఁ గర్ణుని ప్రసక్తి యనుచితము గనుక దానిని వీడెను. అనఁగా వెనుక, మయసభావమాన సందర్భమున ద్రౌపదీ భీములే దుర్యోధనుని పాటు చూచి నవ్విరి. కనుక వారిరువురకును నవమాన కష్టమును గల్పింపవలెనని దుర్యోధనుని తలంపు. కర్ణుఁడటలేఁడు గనుక నప్రస్తుతము. 'ఐశ్వర్య మదమోహితః' అనునది హేతువుగ 'ధారుణి రాజ్య సంపద మదంబున' నని ప్రకృతాను గుణముగ ననువదింపఁబడినది. 'రంభోరు నిజోరుదేశము' ననుటలో 'కదళీదండ సదృశం' అనుదాని యర్థము సంగ్రహింపఁబడినది. 'గజహస్తప్రతీకాశం వజ్ర ప్రతిమ గౌరవం' అను దాని యర్థము భీమునిచే భంగము నొందుట కర్హముగా 'ఉరుతుర పదముచే సంగ్రహింపఁబడినది. ఏ విశేషణ మెటనున్న నెట్టి యర్థమును బోషించి యుచితమగునో యట్లేయత్యంత మనోహరముగాను, నౌచిత్య పరిపూర్ణము గాను ననువదింపఁబడినది. ఇంత చక్కని యనువాదము కూడ కం. వీ. గారికి సరిగాఁ దోఁచలేదు. "పరిశీలించిన పక్షమున భాషాంతర మంతయు నిదే ప్రకారముగా నుండును గాని సరిగా మూలము ననుసరించి యుండదు. మూలముతోఁ బోల్చక ప్రత్యేకముగఁ జూచునప్పుడు మాత్రమాంధ్రభారతము మనోహరముగ నుండుననుటకు సందేహము లేదు." అని వ్రాసిరి. ఈ వ్రాఁత నవాలోచితమనుటను బైకి మా నిరూపణము స్పష్టపఱచును. మూలముతోఁ బోల్చి చూచినను, విడిగాఁ జూచినను గూడ నాంధ్రమహాభారత మత్యంత మనోహరమేగాని యే లోపమును లేదు. కనుకనే కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు యం. ఏ గారు తెల్గు భారతమును గూర్చి యిట్లనిరి. 'సంస్కృత భారత మొక బంగారపు ముద్ద. తెల్గు భారత మందులోనుండి కొంత బంగారము తీసి మంచి పనివానితనముతోఁ దీర్చిన యొక యమూల్యాభరణము' అని.

ఈ యనువాదములో నేమి గన్పడుచున్నది? మూల మెంత విస్తృతముగ నున్నను దగినట్లౌచిత్యమును నావశ్యకతను గమనించి యొప్పిదముగ సంగ్రహించుట నన్నయభట్టారకుని స్వభావము. ఈ మహానుభావుని యనువాద ధోరణినిఁ బట్టియే తిక్కన మొదలగువారు తమ యనువాదపద్ధతుల నేర్పఱచుకొనిరి. కాని యవి యింతటి సముచిత సుందరములుగా లేవు. ఈ యనువాదములోని గుణములే శ్రీనాథుఁడు శృంగార నైషధపుఁ బ్రారంభమునఁ దన యనువాద గుణములని తెల్పెను. అది యట్లుంచుఁడు. ప్రకృతపు టనువాద నైపుణ్యమే యారణ్య పర్వశేషములో ఁగూడఁ గన్పడుచున్నది.

అరణ్య పర్వశేషములోని యనువాదము

మూలము

ప్రోవాచ కృష్ణామపి యాజ్ఞసేనీం దశార్హ భర్తా సహితః సుహృద్భిః
దిష్ట్యా సమగ్రాసి ధనంజయేన సమాగతే త్యేవ మువాచ కృష్ణః ॥
కృష్ణే ధనుర్వేద రతిప్రధానాః తవాత్మజాస్తే శిశవః సుశీలాః
సద్భిః సదైవాచరితం సుహృద్భిః చరంతి పుత్రా స్తవ యాజ్ఞసేనీ ॥
రాజ్యేన రాష్ట్రేచ నిమంత్ర్యమాణాః పిత్రాచ కృష్ణే తవ సోదరైశ్చ
న యజ్ఞసేనస్య న మాతులానాం గృహేషు బాలా రతి మాప్నువంతి ॥
ఆనర్తయే వాభిముఖాః శివేన గత్వా ధనుర్వేద రతిప్రధానాః
తవాత్మజాః వృష్ణిపురం ప్రవిశ్యతదైవ తేభ్యః స్పృహయంతి కృష్ణే ॥
యథా త్వ మేవార్హసి తేషు వృత్తం ప్రయోక్తు మార్యాచ యథైవ కున్తి
తే ష్వప్రమాదేన తథా కరోతి తథైవ భూయశ్చ తథా సుభద్రా ॥
యథాఽనిరుద్ధస్య యథాఽభిమన్యోః యథా సునీథస్య యథైవ భానోః
తథా విసేతాచ గతిశ్చ కృష్ణే తవాత్మజానా మపి రౌక్మిణేయః ॥
గదాసిచర్మ గ్రహణేషు శూరా నస్త్రేషు శిక్షాసు రథాశ్వయానే
సమ్య గ్వినేతా వినయేతతంద్రీన్ తాంశ్చాభిమన్యుః సతతం కుమారః ॥
సచాపి సమ్య క్ప్రణిధాయ శిక్షాం శస్త్రాణి చైషాం విధివ త్ప్రదాయ
తవాత్మజానాంచ తథాభిమన్యోః పరాక్రమై స్తుష్యతి రౌక్మిణేయః ॥
యథావిహారం ప్రసమీక్షమాణాః ప్రయాన్తి పుత్రా స్తవ యాజ్ఞసేనీ
ఏకైక మేషా మనుయాన్తి తత్ర రథాశ్చ యానానిచ దన్తినశ్చ. ॥

అనువాదము

అపుడు కృష్ణుండు నిజసమీపంబుననున్న పాంచాలిజూచి యిట్లనియె.

సీ॥ నీ పుత్రులేవురు నీరజలోచన యదుకుమారులు వారు ముదముతోడ
ననుపమస్నేహ సమాహృతహృదయులై కరి హయారోహణ చరితఁదగిలి
యాడుచు వివిధశస్త్రవిశేషముల్ గఱచుచు నొండెల్ల మఱచియున్న
వారు ప్రద్యుమ్నుండు వారికి దివ్యాస్త్రజాతంబులెల్లను బ్రీతి నొసఁగెఁ
దన్వి యాసుభద్ర తన పుత్రుకంటె నీ తనయులందుఁ గూర్మిఁ దనఱఁజేయు
నూఱడిల్లు మింక నుజ్జ్వలోన్నతులఁ బెంపారఁ గాల మనతిదూరమయ్యె.

(అరణ్య పర్వము)

పై శ్లోకములన్నింటి భావమును నీ యొక్క సీస పద్యములో సంగ్రహింపఁ బడినది. ఇదివరలో ధర్మజునితోడి ప్రసంగమున మొదటి శ్లోకార్థ యుక్తమైనది. 'కుంతియు ద్రౌపదియును బాండవుల నెట్లాదరింతురో యట్లే సుభద్ర వారి నాదరించుచున్నది.' అని మూలములోనుండ హస్తి నగరములో నెటనోయున్న కుంతి ప్రసక్తి యనావశ్యక మని వీడెను. 'తన బిడ్డలను సవతి యెట్లు చూచుచున్నదో' యను నారాటము ద్రౌపదికి సహజము. కనుక నది తీరుటకై 'సుభద్ర తన కొడుకు మీఁద కన్నఁ గూడ నెక్కువ ప్రేమతోనే నీ బిడ్డల నాదరించుచున్నది.' అని సరిగా గ్రహించెను. ఇట నింకొక యౌచిత్యము జూడుఁడు. మూలములో నీ వెట్లు చూతువో యట్లే చూచుచున్నది.' అని యున్నది. దానిని 'నీకన్న నెక్కువగానే చూచును.' అనినచో ద్రౌపది కీర్ష్య గలుగవచ్చును. అందువలన నట్లనక పైఁ జెప్పినట్లనువదించెను. పాంచాలమునకుఁ బంపఁబడిన యుప పాండవులు యదు నగరమున నుండుటకు విస్తృత హేతువులు చూపఁబడినవి. అంత యనావశ్యకము గావున 'కరిహయారోహణ చరితఁదగిలి' యని సంగ్రహింపఁబడినవి. ఈ మొత్తము నభిప్రాయఁమంతయు నుపపాండవు లస్త్రశస్త్రములు నేర్చుటవలనఁ గలుగఁబోవు ప్రయోజనము ద్రౌపదికి సంతోషజనకముగాఁ దెల్పి యామె 'పిల్లల ప్రయత్న మంతయుఁ గౌరవులను జయించుటకే' యని వ్యంగ్యముచేసి పాంచాలి మనసునకుఁ దృప్తిఁ గొలుపు టత్యవసరము కనుక మూలములో లేకున్నను వివక్షితమే కావున 'ఉజ్జ్వలోన్నతులఁ బెంపారఁ గాల మనతిదూర మయ్యె'నని చేర్పఁబడినది.

ఇట్లే యింకను విశేషములతో సంగ్రహణ చాతురి యీ యనువాదమునఁ బ్రకాశింపఁ జేయఁబడినది. ఇది నన్నయ భట్టారకునిది కాక మఱొకరి సొమ్మెట్లగును? ఇట ననువాద పద్యముకూడ నన్నయ సీసపద్యపు నియమముగలదే యనుటను

గమనింపనగును. ఇఁక నెఱ్ఱన యనువాద ప్రకారమును నిరూపించి ప్రకృతి విషయమును దృఢపఱచుకొందము. అన్వయముకన్న వ్యతిరేకము విషయమును దృఢముగా నిరూపించును గదా!

ఎఱ్ఱన యనువాదరీతి

మూలము

యదైవ భర్తా జానీయాత్ మంత్రమూలపరాం స్త్రియం
ఉద్విజేత తదైవాస్యాః సర్పా ద్వేశ్మగతా దివ ॥
ఉద్విగ్నస్య కుత శ్శాన్తిః అశాన్తస్య కుత స్సుఖం
న జాతు వశగో భర్తాస్త్రియా స్స్యా న్మంత్రకర్మణా ॥
అమిత్ర ప్రహితాంశ్చాపి గదాన్ పరమదారుణాన్
మూలప్రచారైర్హి విషం ప్రయచ్ఛన్తి జిఘాంసవః ॥
జిహ్వయా యాని పురుష స్త్వభావా ప్యుపసేవతే
తత్ర చూర్ణాని దత్తాని హన్యుః క్షిప్ర మసంశయః ॥
జలోదరసమాయుక్తాః శ్విత్రిణః పలిత్రా స్తథా
అపుమాంసః కృతా స్త్రీభిః జడాంధబధిరా స్తథా ॥
పాపానుగాస్తు పాపాస్తాః పతీ నుపసృజ న్త్యుత
న జాతు విప్రియం భర్తుః స్త్రియా కార్యం కథంచన ॥

అనువాదము

పర్వశేషములో

చ అలయక మంత్రతంత్ర వివిధౌషధభంగులఁ జేసి యెంతయున్
వలతురు నాథులంట మగువా! కడు బేలతనంబు దాన, మున్
గలిగిన ప్రేమయుం బొలియుగాని యొకంటను సిద్ధిబొంద ద
ప్పొలఁతుకతోడి మన్కి యహిపొత్తుగ జూచు విభుం డెఱింగినన్.

చ మగువ యొనర్చువశ్యవిధి మందులు మాయలు నొందుచందమై
మగనికిఁ దెచ్చు రోగములు మానక మూకజడాదిభావముల్
మొగి నొనరించు నద్దురితముల్ తన చేసిన చేతనై తుదిన్
జగమునకెక్కి నిందయును సద్గతిహానియు వచ్చు నింతికిన్.

అరణ్యా ౫.౨౯౬.౨౯౭

ఈ యనువాదమునందు మూలములోని కొంతభాగము వదలివేయఁబడినది. 'మూలములోని యభిప్రాయము గ్రహింపఁబడినంత వఱకైనను సరిగా గ్రహింపఁ బడలేదు. మొదటి పద్యములోని పూర్వార్థమును. రెండవ పద్యములోని యుత్తరార్థమును నమూల్యములు. రెండవ శ్లోకము మొదలయిదవ శ్లోకము వఱకున్న యర్థము చాలవఱకు విడువఁబడినది. చివర శ్లోకము నుత్తరార్ధము కూడ నంతే. "సర్పాద్వేశ్మ గతాదివ" యనుచోట సరియగు ననువాదము కాదు. ఈ భావమే తిక్కన యుద్యోగ పర్వములో" పగయ కల్గినేని పాము న్న యింటిలోనున్న యట్లు గాక యూఱడిల్లి యుండునెట్లు చిత్తము" అని యనువదించినాఁడు. 'పాము పొత్తు' అను టుచితము. "అహిపొత్తు" అదుకలేదు. కాకున్నను "అహిపొత్తు" అదుకులెందైనఁ గలదా?

అయితే నుడికారపు సొంపున్నది. మొదటిదానిలోని రెండు మూఁడు చరణములును, రెండవదానిలోని యొకటి రెండవ చరణములును నుడికారపు సొంపుతో నున్నవి. ఇట్టీ యనువాదము నన్నయకన్న విలక్షణముగాను ననఁగా మూలములోని కొన్ని విషయములను వీడి, దానికి సొగసులే లేక సామాన్యముగా నున్నది. తిక్కన మూలమున లేకున్నను, వివక్షితములు కాకున్నను గూడ నేవేనిఁ గొన్ని యనుభావములచే మూలభావములను బోషింప దొరకొనును. (ఇది యప్రస్తుతము. కనుక ప్రకృత ముదహరింపలేదు.) నన్నయ యనువాదము మూలగతములగు భావములను వివక్షితములను, వ్యంగ్యములను సమధిక మగు నౌచిత్యముతో ననౌచిత్యమును బరిహరించి వెనుక ముందులు సరిదిద్ది రసోజ్జ్వలముగా నాస్వాదింపఁ జేయును.

కవిత్రయము-అనువాదభేదము

అనువాదమున సామాన్య దృష్టియుఁ. గదళీపాకము, స్వతంత్రమగు నుక్తి వైచిత్రియుఁ., దెనుఁగు సంస్కృతముల సమాదరణమును, బాంచాలి రీతియు, జనులను దృప్తిపఱచుటలో శ్రద్ధయు నెఱ్ఱనకున్నది.

అనువాదమున ననుభావ విశేషములచే (మూల వివక్షితములై నను గాకున్నను గూడ) మూలగత భావముల నుజ్జ్వలముగాఁ బ్రదర్శించుటయు ద్రాక్షాపాకమును దెనుఁగు జాతీయమగు నుడికారము సొగసున నత్యధికమగు దృష్టియు, సంస్కృతము విషయమున సామాన్యమగు దృష్టియుఁ గొలఁది ప్రబంధ బీజధోరణియు నర్థ కైశికీవృత్తియు సామాన్యముగా వైదర్భీరీతియు, జనానంద సంధానమునఁ జూపును దిక్కనది.

మూలగతములగు భావములను వివక్షితములగు విశిష్టభావాంతరములచే వ్యంగ్య సరళిని(బోషించి రసపరిణతములుగా నాస్వాదింప(జేయునట్టి మహోజ్జ్వల మగు ననువాదమున రసైక ప్రవణమైన దృష్టియు, లోకుల వాడుక యందలి సంస్కృతమున నెక్కు డాదరమును, దెను(గున స్వభావాదరణగల తీరును సహజమగు కైశికీ వృత్తియు, సుందర తరమగు వైదర్భీరీతియు, ద్రాక్షాపాకమును లోకహితైక నిరతమగు దృష్టియు నన్నయభట్టారకునిది. ఈ చెప్పిన గుణములకు(గ్రమముగా నెఱ్ఱనసావిత్ర్యుపాఖ్యానమును, దిక్కన విరాటోద్యోగములను, నన్నయ శకుంతలోపాఖ్యానమును జూచిన గ్రహింతుము.

"శారద రాత్రు"లలోని యనువాద వైచిత్ర్యము

ఇంతయేల? నన్నయ 'శారద రాత్రులు' అను పద్యమును మూలములోని

"దృశ్యంతే శాంతరజసః క్షపాః జలదశీతలాః
గ్రహనక్షత్ర సంఘైశ్చ సోమేన చ విరాజితాః ॥

అను శ్లోకమున కనువాదముగా రచించెను. మూల శ్లోకమును ననువాదమును ననువాదము కాదు. మొదటి శ్లోకములోని యొక్క 'హంస'లు తక్క మిగిలిన యంశమేదియు నందు స్పృశింపనుగూడ(బడలేదు. బాగుగా(బరిశీలించినపు(డు.

మఱియు నన్నయ కవితలో నొక వైశిష్ట్యమున్నది. కూర్పునందు(జక్కని యవిషయమైన బిగి. సంస్కృత పదములనుగానీ వాని సమాసములనుగానీ లోకము నందు సుప్రసిద్ధములైన పద్ధతిలోనివాటినే వాడుట యనుప్రాసవాసన లలిత విశదమైన వచన రచన సామాన్యముగానే పద్యమే గానిమ్ము; మూ(డు నాల్గు పాదములకు(గూర్పునందు విడిపోవదు. ఇది యారణ్య పర్వశేషములో(గొన్ని పద్యము లందును, గొన్ని వచనములందును బ్రదర్శించియే యుంటిని.

ఇక నెఱ్ఱన. తిక్కనలవలె సంస్కృత పదములను, నల(తి యల(తి వానిని(గూర్చుటకు నన్నయవలె సంస్కృత పదములను, సమాసములను గూడ సంధించును. ఇద్దఱి పద్ధతులకు సమన్వయ మార్గమై సగము తెలు(గును సగము సంస్కృత పదములును గల రచన కాని తిక్కనవలె లలిత లలితములగు పదము లలవడును. నన్నయవలె నా విషమశ్లేష రచన సమాసములందు మృగ్యము. అంతటి సుప్రసిద్ధ పదసంధానము కూడ వెనుకాడును. కాని సూక్తి వైచిత్రియుండును. ఈ చెప్పిన విశిష్ట గుణంబులను బట్టియే నన్నయ కవిత నెఱ్ఱన కవితను వేఱుచేయ(గల్గెదము. ఆ త్రోవ నీ చెప్పిన ప్రతి వైశిష్ట్యమునందును బ్రదర్శించి యుంటిమి.

కొంతమంది నన్నయ తిక్కనల శైలీసమన్వయము నెఱ్ఱన యొనరించె ననెదరు. ఇది శుద్ధ వెఱ్ఱిమాట. ఈ రెండు శైలులును నెన్నటికిని గలియవు; ఎవ్వఁడును గలుపలేఁడు, నన్నయ శైలి ధారాళమైనది. తిక్కనలోఁ గుంటి, కుంటిశైలి. సుప్రసిద్ధములగు సంస్కృతపదముల సమాసముతో నవిచ్ఛిన్న ధారవాహికముగాఁ బ్రవహించునది నన్నయ శైలి. "అలఁతి యలఁతి తునియలుగా హల సంధించిన విధము" ననునది తిక్కన శైలి. రసోజ్జ్వలమై మూల వివక్షితములైన వ్యంగ్య విశేషములచేఁ బ్రధాన విషయమును బరిపోషించుచు నా కాలపు జనుల సంస్కృత ప్రచార వచోవికాసమును వివరించునది నన్నయ శైలి. భావబంధురమై మూల వివక్షితములైనను స్వీకరించి యానాటి తెనుఁగు నాటి స్వభావానుగుణమగు తెనుఁగు నుడికారపు టందముతో విలసిల్లునది తిక్కన శైలి. ఈ రెండును గట్టుట హిమవద్వింధ్యములను గలుపుట వంటిదే ఇది యెఱ్ఱనలో లేదు. వేఱువేఱుగా వారి శైలుల నతఁడనుకరింపవచ్చును. కాని యిది యైక్యనిర్వాహకము కాఁజాలదు.

ఇతనికి నన్నయ తిక్కన లిరువురియందును హరిహరులందువలె నవిషమమగు భక్తి.

"ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధ పరమేశుఁడనంగ నరణ్య పర్వశే
షోన్నయ మాచరించి సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించితౌ
నన్నయభట్ట తిక్క కవినాథుల కెక్కిన భక్తి పెంపునన్,"

అని నృసింహపురాణాదియందుఁ దానే చెప్పుకొన్నాఁడు. ఆ తీరుననే యారణ్య పర్వశేషమును బూరించినాఁడు.

కాశకుశావలంబనము

అయితే యరణ్య పర్వశేషములో నన్నయ రచనలుగాఁ గన్పడునవి "ఎఱ్ఱన" రచనలే. ఎట్లు? "నన్నయ భట్టారకుని" సరససారస్వతాంశ ప్రశస్తి" -ఏదో విశేష మెఱ్ఱనకుఁ జెందినది. కనుక నతఁడే నన్నయవలె రచించినాఁడు. చెప్పెను గదా! "తద్రచనయకా పూరించెన్" అని కొందఱు చిట్టచివర యాశపడుదురు. ఏటి వరదలోఁ గొట్టుకొని పోవువాఁడు రెల్లుగాని దర్భగాని యాధార మనుకొని పట్టుకొనును గదా!

ఈ విషయము విచారింతము. మొదట వారు చెప్పిన యర్థము తప్పని యిది వరకే నిరూపించితిమి. ఆ పదముల మీఁద నా యర్థము రాదుకదా! పోనీ

వారి సంతుష్టికై యొప్పుకొందము. అపుడు మాత్ర మిది పొసఁగునా? నన్నయ విద్యా విశేష మతనికిఁ గల్గినచో నారణ్యపర్వ మించు మించుగాఁ బ్రతి పద్యమునందును బ్రతి గద్యయందును నన్నయ తీరును నితర రీతియుఁ గలసి శిథిల శిథిలముగా గన్పట్టు నేమి? నన్నయ రచనయే కావలదా వారి పక్షములో? నన్నయ తీరుకన్న వేరు శైలి కనపడుచున్నది. కనుక నిది నన్నయ రచన కాదని వారే తెల్పుచుండిరి. పాప మిది యెఱ్ఱన రచన యనుటకు హేతువుగా వారు తెల్పుదురు కాని; యది కుదురదు. ఎఱ్ఱన యితర గ్రంథముల శైలికిని దీనికినిఁ జాల తేడా కన్పడుచున్నది. ఎక్కడనో యొక సమాసము "స్ఫురదరుణాంశు రాగరుచి" యనునది భారతములోను నృసింహ పురాణములోను సమానముగా నున్నదని, యివి రెండును నెఱ్ఱన రచనలే యనుట చాలఁ బొరపాటు.

పద, పాద, తదర్థ, సమాస పదాదుల యనువాదము సర్వత్ర సాధారణమే

మహాకవులలో సామాన్యముగాఁ బద, పదార్థ సమాసముల యనువాదము తఱచుగాఁ గన్పడుచుండునవి యన్నంత మాత్రమున నది యొకరి రచనలే యనఁదగు ననియు, ధ్వన్యాలోకకర్త యానంద వర్ధనాచార్యులు నాల్గవయధ్యాయము చివరఁ జెప్పియున్నాఁడు. తెనుఁగు కవితఁలో గూడ నిట్టి యనువాదములు చాల నున్నవి. కొన్నిటినిఁ జూడుఁడు.

1. అటఁ బుట్టిన చిగురుఁగొమ్మైనచేవ, (అల్లసాని పెద్దన-మనుచరిత్రము)
చిగురుఁ గొమ్మలు చేవల్. (రామరాజభూషణుఁడు. వసుచరిత్రము.)

2. నరవరులో యమ్మ నూతన ప్రియులు గదే.

3. చంద్రుఁ డుదయించెఁ గాంతి నిస్తంద్రుఁ డగుచు.

పెదపాటి యెఱ్ఱాప్రగడ కుమారనైషధములోను, వల్లభాభ్యుదయములో శ్రీనాథుఁడును నీ పాదమును వ్రాసియున్నారు. కొన్ని యెడలఁ బద్యములు పద్యములే అనూదితము లయినవి.

వాలికలై విరిదమ్ముల యేలికలై భావభవుని యెలదూపులకుం
బోలికలై యుత్కలికల మాలికలై యబలదాఁకె మహీపతి చూపుల్.

(పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు)

వాలికలై తెలిదమ్ముల పోలికలై చందమామ పులుఁగులకును దా

మేలికలైన నిరీక్షణ మాలికల నృసింహుఁ జూచె మదవతి వేడ్కన్
మూర్తికవి. (నరసభూపాలీయము.)

ఇట్టి యనువాదములను బట్టి యేకత్వమును నిర్ణయింపఁ బూనుట చాలఁ బొర పాటు. పోనీ యివి రెండు నొకరివే యందము. అంత మాత్రమ్మున నిట శేషమంతయు నెఱ్ఱన దనుటలోఁ బ్రమాణ మేమి? అట్లే యగుచో మే ముదాహరించిన “రయ విచలత్తురంగమ తరంగములన్ మదనాగ నక్రసంచయముల సంచలచ్చటుల సైనిక మత్స్యములన్ భయంకరంబయి” ఈ నన్నయ పద్యభాగమును ఁబట్టి యిదియంతయు నన్నయ రచనయనియే యనక తీరదుకదా! వారొక చిన్న సమాసము మాత్రమే చూపిరి కాని మేము సామాన్యముగ సగము పద్యమే చూపితిమి కదా! అస లింకొక చిక్కున్నదిచ్చట వారికి. ఇట నన్నయ విద్యావిశేషము సంక్రమించి నన్నయ రచనగానే భారతము నారణ్య పర్వశేషమును బూరించుచున్న వారి యెఱ్ఱన రచన నన్నయ రచన కన్న వేఱుగా నెట్లుండును! అట్లున్నచో నా రచన ‘నన్నయ రచన’గా నెట్లగును? అపుడు నన్నయ విద్యావిశేష మెఱ్ఱనకు వచ్చిన దనుటలో సాక్ష్యము కాని ప్రయోజనము కాని, యేమున్నది?

ఎఱ్ఱన ప్రత్యేక రచన

అంత నన్నయ రచనగా రచించుచో ‘మధ్యాక్కఱ’ ను మూఁడుఁ గణముల మీఁద యతి నిల్పి రచించెనేమి? నన్నయ నాల్గవ గణముమీఁదఁ గదా యతి నిల్పినది? సీసపద్యములు నన్నయ నియమముల వీడి రచియించెనేమి? నన్నయ రచనగదా చేయునది?

నన్నయ యక్కఱ యిది.

ఆ రాజు గుణములు నా కెఱింగించినట్టులు నన్ను
నా రాజునకు నెఱింగించి కరుణ నాయందుఁ గావింపు
మారంగననుడు నిషధ విషయమునఁ గరిగి యాహంస
వీర సేనజునకు దానిగుణరూప విభవముల్ సెప్పె.

ఎఱ్ఱన యక్కఱ యిది.

కలదు దేవగుహ్యం బని కమలబాంధవుఁడు కర్ణుఁ
బలికెనని చెప్పి తదియెద్ది బలియుఁడా సూతజుండు
లలితకవచంబు మణికుండలములు నెమ్మెయిఁ బడసి
వెలసె ని వ్విధమంతయు వివరింపవలయు నాకు.

మఱొకటి

తిక్కన నాటికే శైవేతర కవుల వాడుకలోనుండి యక్కఱలు తొలఁగినవి. వాని నెఱ్ఱన రచించెననుట సంగతము కాలేదు. ఇఁక నేమనఁగా నన్నయ రచించినవే శిథిలములుకాఁగా నెఱ్ఱన వానిని సవరించెను. ఆ సవరింపులోఁబోయిన పదములు పోఁగా నిలచిన వాని నీదుకుటలో మూడింటిమీఁద యతి యేర్పడి యుండును. ఈ యక్కఱలో మొదటి రెండు చరణములును నన్నయ కూర్పుగాఁ గన్పడును. ఆ కూర్పులో మాటలు తొలఁగిపోవుటయుఁ గన్పడును. వివరింతుము.

ఇంతకుఁ గొంచెము వెనుక "దేవనిర్మితంబగు రహస్యం బొక్కటి కలదు" అని యుపక్షిప్తమయినది కర్ణ జన్మవృత్తాంతము. అది యిచట "దేవగుహ్యాము" అనుట సరియైనట్లు కన్పడదు. ఇఁక నేమనఁగా "కలదు దేవనిర్మిత మయిన గుహ్యాంబని కమలబంధుఁడు గర్ణు" అని మొదలు పాఠముండి యుండును. అట "నిర్మితమయిన", "బంధు" ఈ పదములు పోయియుండును. ఎఱ్ఱనగారున్న పదముల నున్నట్లు కూర్చుటలో "కలదు దేవగుహ్యాం బని కమల బాంధవుఁడు కర్ణు" అని సరిచేసి యుందురు. అపుడు మాటమీఁద నా యతి యేర్పడియుండును. ఇది నన్నయ కూర్పే యనుటఁకొక గుర్తుకూడఁ గన్పడుచున్నది. ఇతరులైవరైనను కవచమును గూర్చి చెప్పుటలో "దృఢతమతోణము. హృద్యోదాత్తంబగు కంకటము" (చూ.విరాట ఉత్తర గోగ్రహణము) అందురు. నన్నయ మాత్రమే కర్ణుని కవచమును గూర్చి "లలితకవచము" అని మూఁడవ పాదములో వాడినాఁడు. ఇది నన్నయదే యనుటకుఁ బ్రమాణ మేమనఁగా నాది పర్వములోఁ గర్ణుని వృత్తాంతము నుడువు నపుడు గూడ "సలలితమైన పుట్టు గవచంబు.........................కర్ణుఁడు పుట్టె" (ఆది 5 ఆ. 26 ప.) అని వాడుక చేసియున్నాఁడు. ఎఱ్ఱన తన యితర గ్రంథములందు గూడఁ గవచమునకు "లలిత" యని వాడినట్లు కన్పడదు. ఈ యసాధారణ చిహ్నాము నన్నయ రచించినదే యీ యక్కఱ యని స్పష్టపఱచుచు నెఱ్ఱనచేయి యిందుఁ దగిలెనని యతి విభేదము సూచించును. తక్కినచోట్లఁ గూడ నీ త్రోవయే ప్రవర్తింపఁజేయనగును.

నన్నయనియమముతోడిసీసముల నిదివఱకే యుదాహరించితిమిగదా!

ఆరణ్య పర్వశేషములో నియమము లేని సీసములు

ఇపుడు నన్నయ నియమమును వీడిన సీసముల నారణ్య పర్వశేషములో నుండి యుదాహరింతుము: చూడుఁడు.

విప్రుల గడు నర్థి వేఁడినఁ గలిమిలో బొచ్చెంబు సేయక యిచ్చుటొకటి
బలితంపుఁ బగతురఁ బరిమార్చుటొక్కటి దండియై యనిఁ జచ్చుటొండె
నొకటి
శరణాగతుని నెట్టి శత్రువునైన నను గరుణఁ గయ్యంబునఁ గాను టొకటి
భామినీ ద్విజ వృద్ధ బాలాతురులకైన యాపదఁ జెచ్చెరఁ బాపు టొకటి.

అరణ్య 7 అ. 295 ప.

మూఁడవ పాదము నుత్తరార్థములోఁ బ్రాసయతినియమభంగము.

ఇంకొకటి

అతఁడును దద్భావ మరయంగ మదిఁగోరి రూపించి యొకపరి తేప వత్తు
నని పోయి నడికిరేయర్థితోఁ జనుదెంచు రేయి వచ్చెదనని తేపు వచ్చు
నేప్రొద్దువచ్చిన నింతయప్పుడ భక్ష్యభోజ్యముల్ గ్రొత్తపాల్పుగనొనర్చు
నెయ్యదిగోరిన నిచ్చకు రాఁబెట్టు నలయదు మదినైన నలుగదెపుడు.

అరణ్య 7 అ. 323 ప.

మొదటి పాదపు రెండవ ఖండములోఁ బ్రాసయతి. ఆ నియమము కడమ పాదముల రెండవ ఖండములందు విడువఁబడినది. గమనింపవచ్చును.

తేటగీతిలో నియమభంగము.

తే॥ అనఘు నిద్దేవు సన్నిధియగుటఁగాదె నాకుఁబూర్వవర్తనకథనంబునందు
బోధ మిప్పుడ గల్గెని ప్పుణ్యుఁ బరమపురుషుఁ బ్రభవిష్ణుఁ గృష్ణుని
శరణు సొరుము,

అరణ్య 4 అ. 284 ప.

నాల్గవ పాదమునఁ బ్రాసయుఁ గడమ పాదములందుఁ గేవల యతి.

ఇట్లు నన్నయ నియమముల వీడిన పద్యములు శిథిల శిథిలములైన మార్పులు గలవి. అనువాదభేదములు, పదవైశిష్ట్యాభావములు. ఇన్ని గనుపడుచుండగా నన్నయ యేదో విశేషమితనికిఁ గల్గెనని యట్లనఁగలరో? ఇంతయేల? "రయవిచలత్తురంగమ" పద్యము వలననే యిందు - అనఁగా నారణ్య పర్వశేషమునందు నన్నయ కవిత యున్నదని స్పష్టమైనదికదా! ఈ చోటుననే యెఱ్ఱన పద్యమును జూడుఁడు.

శేషములో నెఱ్ఱన పద్యము

చామర పుండరీక విలస త్సితకేతు పతాకలం గురు
గ్రామణి యాత్ర నెంతయును గాంతి వహించె నభంబు శారదో
ద్దామ మరాళమండల సితస్ఫుట పద్మవనీ పరిస్ఫుర
త్తామర సాకరంబున విధంబున భూచరనేత్రపర్వమై

ఈ యెడనున్న సమాసమేదియు నన్నయది కాదని వెంటనే చెప్పవచ్చును. సితపదము రెండు తడవ లుపయోగింపఁబడినది. శిథిల విషయమయిన సమాస రచన. కాని యుక్తి వైచిత్రి సొగసు కల్గించుచున్నది.

ఎఱ్ఱన యుక్తివైచిత్రి

'పరిఢవింతుఁ బ్రబంధ పరమేశ్వరుని లేవ సూక్తి వైచిత్రి నొక్కొక్క మాటు' అని శ్రీనాథుఁ డన్నాఁడు కదా!

మన యెఱ్ఱన మహాకవి యుక్తి వైచిత్ర్యము స్ఫుటముగా నున్న పట్టొకటి గమనింతము. ఆది పర్వములో కర్ణజన్మ వృత్తాంత మున్నది. ఆరణ్య పర్వశేషములోను నున్నది. ఒకటి నన్నయ రచించినది. రెండవది యెఱ్ఱనది. ఈ రెండు విభేదములను గమనింతము. సూర్యునితోఁ గుంతి పలుకుమాటల నన్నయ కూర్చిన విధమిది.

'అజ్ఞానంబున నిన్నుం ద్రిలోకైకదీపకుం ద్రిపురుషమూర్తిఁ ద్రివేదిమయు రావించిన యీ యపరాధంబు నాకు సహింపవలయు.'

ఆ. ఎఱుక లేమిచేసి యింతు లెప్పుడు నపరాధయుతుల సాపరాధలై న
వారిఁ గరుణ నెల్లవారును రక్షింతు రనుచు సూర్యునకు లతాంగిమ్రొక్కె

నన్నయ కుంతి విశదస్వభావురాలు అమాయిక ప్రకృతి. ఇఁక మన యెఱ్ఱనగారి కుంతిని గమనింతము. ఎట్లుపల్కునో.

ఆ. మంత్రబల మెఱుంగ మదిగోరి తప్పుచేసితి మహాత్మ దీనిఁ జెట్టగాఁగ
నవధరింప నెట్టులైన నాబాల్యంబుఁగరుణ సైపవలయుఁ గమలమిత్ర,

వ. అని మఱియు ననేక ప్రకారంబుల దివాకరు ననునయించి యెట్లునుం గ్రమ్మఱింపనేరక తన కారణంబున గులంబునకును గురుజనంబులకును నపాయం బగుననియును దలపోసి భయంబు మిగులఁ దెగువ సేసి యతని కిట్లనియె.

జగములయందు ధర్మువును సత్యము నీయదిగాదె దేవ! యే
తగవులు నీ యెఱుంగని విధంబులె యిట్టిది నీదు బుద్ధికిం
దగ వగునేని మార్పలుకుదాననె యే నగుఁగాక నీకు నిం

పగు తెఱఁ గాచరింపు మిట నావల నయ్యెడు నింద కోర్చితిన్.

ఈ యెఱ్ఱన కుంతి గడుసరి. లాభనష్టముల నెఱిఁగినది, మొదల నెట్లయిన తప్పుకొనఁ జూచి యుక్తి వైచిత్రితో "నాబాల్యంబుఁ గరుణ సైపవలయు"నని చిన్నతనము వలనఁ బొరపాటు జరిగెను. కనుక దానికి సహింపవలయు ననియుఁ, దన కన్యాత్వము న్రోర్వుమనియు రెండు విధములగు సూచనలతోఁ దెల్పి యతనిని దొలఁగించుకొననేరక "ధర్మాధర్మములు నీవెఱుఁగుదువు. కనుక నా పాపపుణ్యము లన్నియు నీ యందె యుంచుకొని నీ యిష్టప్రకారము నన్నుభవింపుము. కాని ముందేమైన కానీ" యని చాల నిపుణముగా నన్నది. ఈమెయే రవి సమాగమమునకు భయము కారణమున తయారైనది. ఇట నన్నయ కుంతిలోనే గడుసరిదనము లేదు. అచ్చముగాఁ బల్లెటిదిక్కు పిల్లగా నున్నది. ఈ యెఱ్ఱన కుంతి గడుసరి పలుకులు, లాభనష్టములఁ జూచుకొని పనికి తయారగుట. మాటలలో పని యొక్క మంచిచెడ్డలతోఁ దనకేమియు బాధ్యతలేకుండ నెదుటివానియందే పుణ్యాపాపములతోఁ బాటు లాభనష్టములను జూడఁ భారము వైచుటయు, నివి యన్నియుఁ బరికించి చూడఁగా నీమె బస్తీలో నన్ని డక్కా మొక్కాలు తిని తయారయిన యాడుపిల్లగా నున్నది. మన యెఱ్ఱన మాటల పొంక మిట్టిది. కావున నెఱ్ఱన మహాకవి రచన ప్రత్యేకత కన్పడునట్లు కొన్ని యీ శేషములో నున్నవి. కనుక "నన్నయ విద్యా విజ్ఞానము లెఱ్ఱనకు వచ్చి నన్నయ రచననే చేసినాఁ డెఱ్ఱన" అనుట కాశకుశావలంబనమేయని నిరూపించు కొంటిమి.

నన్నయ యారణ్యపర్వము

ఇప్పటికిఁ దేలిన విషయ మిది. నన్నయ యారణ్యపర్వము నేడాశ్వాసములను రచించెను. కాని కాలవశమున నతని గ్రంథములోని సగముపై చిల్లర శిథిలమై పోయినది. అంతకుఁ బూర్వము కూడఁ గొంత శిథిలమైనట్లు, దాని నెవరో కొంత పూరించినట్లును నగుపడుచున్నది. అది కొంచెమే దాని కింతటి పాటురాలేదు.

ఉదహరింతుము.

హితుఁడైన తత్ పురోహితు నుపదేశంబుఁ బేర్మితో జేకొని ధర్మసుతుఁడు
నెమ్మిఁ బుష్పోపహారమ్ముల నాదిత్యుఁ బూజించి భాగీరథీజలంబు
లందుండి విషయంబులం దింద్రియంబుల* ననవరతావధానమున నొడిచి
వాయుభోజనుఁడుఁ బ్రాణాయామపరుఁడనై సూర్యాదినామముల్ సూర్యు

* ఈ చోట వావిళ్ళవారు "అమలవ్రతానుభావమున మడిచి" అని పాఠమును సవరించిరి. కాని యిది సరికాదు. ఇంద్రియ జయము వ్రతానుభావమున గల్గునది

గుఱించి

తపము సేయుచున్నఁ దపనుఁ డాతనికిఁ బ్రత్యక్షమై-త్రిలోకచక్షుఁ డమర
వరుఁడు దురితహరుఁడు తరణిత్రయీమూర్తివనజమిత్రుఁ డిట్టులనియెఁ
గరుణ,

అరణ్య పర్వము

మఱియు

పరశుపాశాంకుశ కరవాల శూలముద్గరములు నామీఁదఁ దెరలఁగురిసె
నేనును గడఁగి యద్దానవు శస్త్రముల్ వాయంగఁజేసితి మాయఁజేసి
వెఱవక సాల్వుండు వెండియు నా మీఁద (బరుషశిలావృష్టిఁగురిసె వరుస
నమర దమఃప్రకాశములతో దుర్దిన సుదిన శీతోష్ణముల్ గదియఁ జేసి
దితిసుతాధముండు శతసూర్య శతచంద్ర శతసహస్రవిష్ణుతతులు వెలుఁగ
గగనతలము నేసె బగలిది రేయిది యని యెఱుంగనైతి మనములోన.

అరణ్య పర్వము

కాదు. ఇంద్రియజయ మొనగూడిన తరువాతఁ గాని వ్రతము సరిగా నెరవేరదు అది నెరవేరినఁ గాని సరియగు ననుభావము కలుగదు. ఏదో యనాలోచితముగా సవరించిరి. ఇంద్రియ జయమునకై "ప్రాణాయామము" ముందు చేయఁబోవుచున్నారు కదా! అనవరతాను.భావమును నొడిచి" "అను పాఠాంతరమును దప్పేయని స్పష్టమే కదా" "అనవరతావధానమును నొడిచి" యను మొదటిపాఠము పొరపాటని కదా యీ పాఠము లుత్పన్నములయినవి. అట లేఖక ప్రమాదమున" అనవరతానధావననొడిచి" అను మూల పాఠమిట్లు చెడియుండును. ఈ యదియే మూలపాఠమగుటకొక కారణ మగుపడుచున్నది. ప్రాఁత ముద్రణలయందు "అనవరతావధానమున నొడిచి" యను పాఠమున్నది కదా! దానికి దగ్గఱగా మనదియు సరియైనదియు నక్షరముల పొరపాటునకావకాశమిచ్చునదియు నీ పాఠమే అనవసరతానుధావనను అనునది లేఖక ప్రమాదమున అనవరతావధానమునట" అనియే యుండుననుట సమంజసము. ఇంద్రియములను విషయములందు వెంటఁబరు వెత్తకుండుటలో నొడిచియని యర్థము విషయవ్యావృత్తి కల్గించి యనియే యట వివక్షితము కాని సర్వోపరోధము కాదు. పాసఁ గును. ఇతర అట్లగుచో సూర్యనామంబుల సూర్యునిఁ గొలిచి జపము సేయుచు (మనసుతో) నుండుట ఇంద్రియములు సర్వతః ఉపరుద్ధము అయిన కుదురదు కదా! ఇట్టివ యగు ప్రకరణాంతరములం దెట్లు నన్నయ వ్రాసెనో చూడుఁడు. "ఇంద్రియార్థంబులం దింద్రియ వ్యాపార ముడిగించి (ఆది.5-60) ఇంద్రియ వ్యాపార మనఁగా విషయాను ధావనయే కదా!

ఇట వక్రాక్షరములను జూడుఁడు. యతి భంగము, సీస నియమభంగము నున్నది. అయినను నీ పర్వశేషమునకు వచ్చినంతటిపాటు రాలేదు. ఈ భాగము బాగుగాఁ జెడిపోయినది. "శారదరాత్రు లుజ్జ్వల లసత్తర తారక హారపంక్తులన్ జారుతరంబులయ్యె వికస న్నవ నీరజగంధ బంధురోదారసమీర సౌరభముఁ దాల్చి సుధాంశు వికీర్యమాణ కర్పూరపరాగపాండు రుచిపూరములం బరిపూరితంబులై" అను పద్యము తరువాత నుండియు నెఱ్ఱనవంటి మహాకవీంద్రుని సాహాయ్యము లేనిదే పైకి వచ్చునట్లు లేదు. అందువలననే యచటినుండియు నెఱ్ఱన మహాకవియా శేషములను నెన్నికతోఁబూరించెను. అసలా పద్యములోనే చిట్టచివర "పరిపూరితంబులై" అను పదముత్తర గ్రంథ మితరులచేఁ బూరింపఁబడునని సూచించుచున్న దందురు కొందఱు పెద్దలు. ఇట నున్న పాఠాంతరముల వలననే గ్రంథము శిథిలమయినదని స్పష్టమగు చున్నదికదా!

అయితే నన్నయ గ్రంథములోని పద్యములలోఁ గొన్ని యటనట శిథిలము లయినవి. కొన్ని యసలే పోయినవి. కొన్ని యెడలఁ గొంత కథాభాగమే నశించినది. తిరిగి యట రచింపవలసిన యావశ్యకతయే కలిగినది. ఇట్లున్న యన్ని రకముల శిథిలాంశములను గూడ నన్నయ కవితారీతి యటనటఁ గొలఁదిగా నెఱ్ఱన మహాకవికిఁ దోఁచినది-కన్పడినది. అట నిట్లు "తద్రచనయకా" ఇట్లు నన్నయ రచనయగునని యెన్నిక చేసి యతఁడా శేషమును బూరించినాఁడు. పద్యములలోఁ బదములు పోయినచోట వానినే కూర్చినాఁడు. కొన్ని పాదములు లేనిచోట నా పాదములఁ బూరించినాఁడు. ఒకటి రెండు పదములే నన్నయవి దొరికినచోట మిగిలిన భాగమును గల్పినాఁడు. కణాంశములలోఁ గొన్ని పద్యములు పోయినవని సంస్కృత మూలమును బట్టి తోఁచినచోట ననువదించి చేర్చినాఁడు. కథలు లుప్తమయిన యెడల వానినిఁ దన రచనతోఁ బూరించినాఁడు.

ఇట్లెన్నో విధముల మన మహాకవి నన్నయ రచనగానే దానితో నదుకు నట్లుగాఁ బూరించినాఁడు. ఇట్లెన్ని విధముల నెన్నిక చేసి కూర్చినను నన్నయ రచనతోడి యానురూప్యమునే, యతని రచనయే యనుకొను నంతటి యనురూప్యమునే ప్రధానముగా మనసులోఁ బెట్టుకొని,* కవీంద్ర కర్ణపుట పేయముగాన్-నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి చెడిపోకుండఁ బురాణ

ఇచట నన్నయ "సారమతిం గవీంద్రులు ప్రసన్న కథా కలితార్థయుక్తిలో నారసి మేలునాన్" అని పలుకుట గమనించినచో "కవీంద్ర కర్ణపుట పేయముగాన్" అని యెఱ్ఱన యనుటలోని రహస్యమును దెలియఁ గల్గుదురు. రెండు కవితలందును నానురూప్యమేకదా సమాన ఫలము నిచ్చునది.

ధోరణిలో నీ మహామహుఁడు తన పూరణాస్త్రమును నెరవేర్చినాఁడు. కనుకనే "తద్రచనయకా నారణ్య పర్వశేషముఁ బూరించె గవీంద్రకర్ణపుట పేయముగాన్" అన్నాఁడు. ఎఱ్ఱనగారి సూక్తి వైచిత్రి యట్టిది. "పరిఢవింతుఁ బ్రబంధ పరమేశ్వరుని లేవ సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు" అన్న శ్రీనాథుని పలుకుల భావ మిదే, కను కనే యీ యారణ్య పర్వములో నన్నయ యెఱ్ఱనల కవితలు కలసి మెలసి నన్నయ రచనయే యను నంతటి యానురూప్యము నొందినవి. వీనిలోని భేదము గుర్తింప వలయు నన్నచో నత్యంత సూక్ష్మేక్షికయే మిక్కిలి యావశ్యకము. అతఁడే తెల్పినాఁ డు. "ధీరవిచార" మత్యంత మావశ్యకమని.

అరణ్య పర్వశేష పూరణ మనితర సాధ్యమైనది

అయితే ఈ పూరణ మితరులకు సాధ్యముకాదు. ఉభయ భాషలందును సమగ్రమగు విజ్ఞాన ముండవలెను. వెనుక ముందు కవుల మార్గములతోఁ బరిచయమును వానిని సరిగా ననుసరింపఁగల శక్తి విశ్వాసములు నుండవలెను. స్వతంత్రముగా వ్రాయుటకన్న, ననువదించుట కష్టము. అట్లనువదింపనైన నగును గాని, యితరుల యనువాదములతో సరిగా నదికి సరిపోవునట్లుగాఁ బదపద్యార్థ రచనానువాదాదికము నెన్నిక చేయుట మిక్కుటమగు కష్టము. అందును, నొకఁ డాంధ్ర భువనోపజీవ్యుఁడు. మరొకఁడు కవిబ్రహ్మ. వారి యిద్దఱి శైలులును, శయ్యలును విభిన్న ప్రస్థానములు. అట్టియెడ వెనుకనున్న నన్నయ కవితతో నీ పూరణము భేదింపకపోవు నవసరమే కాక ముందున్న తిక్కన కవితతోఁ గూడ నానురూప్యము నొందకున్నచో "ప్రసన్న కథా కలితార్థయుక్తి"తో 'నక్షర రమ్యత' నాశించి 'నానా రసాభ్యుదయము'తో 'హృదయాహ్లాదము' నొందఁదలంచి 'సాధుజనులకు హర్షము సిద్ధించునా?' కనుకనే మన యెఱ్ఱన మహాకవి 'నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్' నన్నయారణ్య పర్వశేషము "ఎన్నికమై" సరిగానూహించి యున్నయ మొనర్చెను. అదివఱ కెటనో పడియుండి కన్పడకున్న నన్నయ గ్రంథమును "స్ఫురదరుణాంశురాగరుచి-ఎఱ్ఱన తన పదాద్యవయవ సంధాన స్ఫురణతో ఛాయలనింపి పొంపిరివోవఁజేసి పైకిఁదీసికొని వచ్చెను.

భారతభాగములను బ్రతిబంధించిన వాఁడు-ప్రబంధపరమేశ్వరుఁడు

ఇపుడు నన్నయ తిక్కనల గ్రంథములు. భారత భాగములు సరిగాఁ బ్రబంధింపఁ బడినవి. అందువలన సుజనుల కుత్సవముగల్గెను. అపుడు వారంద రతనికిఁ బ్రబంధ పరమేశ్వరుఁడని యెన్నిక చేసిరి. ఇది వాస్తవముగా జరిగిన కథ. దీని నతఁ డే స్వయముగాఁ దెల్పెను. ఇట్టి వాస్తవికమగు కీర్తికితఁడెల్లవిధముల నర్హుఁడు.

ఉపసంహారము

ఈ ప్రబంధ పరమేశ్వర బిరుద మితని నొంది ధన్యమైనది. ఈ బిరుదము యొక్క వాస్తవ చరిత్రమును విమర్శించి వాస్తవమును దెలిసికొని మనము ధన్యులమైతిమి. "ధన్యో మాఘకవి ర్వయం చ కృతిన స్తత్సూక్తి సంశీలనాత్" అని కదా మల్లినాథుఁడన్నది. శాస్త్రకావ్యమగు మహాభారతమును దాని స్వరూప స్వభావ సౌందర్యములు చెడకుండ శాస్త్రకావ్యశయ్యతో మన తేనె తెలుఁగునఁ గూర్చివైచియా 'కథాసుధారస మజస్రము నాగళపూరితంబుగాఁ గ్రోలునట్లనుగ్రహించిన నన్నయ తిక్కనల గ్రంథభాగములను బ్రబంధించిన దీ యారణ్య పర్వశేషము. దీనితో మన మహాకవి యెఱ్ఱనకున్న సంబంధపు వాస్తవాంశమును దన సూచనల ద్వారమునఁ దెల్పి యతని మనన నిధిధ్యాసలతో నాతని వాస్తవ దర్శనమున కుపయోగించిన దీ పద్యరాజ శ్రవణమే యని యింకొకమాఱు కృతజ్ఞతతో స్మరింతము.

స్ఫురదరుణాంశురాగరుచిఁ బొంపిరివోయి నిరస్త నీరదా
వరణములై దళత్కమల వైభవ జృంభణ ముల్లసిల్లను
ద్ధురతర హంససారస మధువ్రత నిస్వనముల్ సెలంగఁగాఁ
గరము వెలింగె వాసరముఖంబులు శారదవేళఁ జూడఁగన్.

ఓం తత్సత్
శ్రీకృష్ణార్పణమస్తు

ఉన్నత సంస్కృతాది చతురోక్తి విధంబులఁ గావ్యకర్తవై
యెన్నికమైఁ బ్రబంధ పరమేశుఁ డనంగ నరణ్య పర్వశే
షోన్నయ మాచరించి సుజనోత్సవ మొప్పఁగ నిర్వహించి తా
నన్నయభట్ట తిక్కకవినాథుల కెక్కిన భక్తి పెంపునన్.

ఈ పద్య మిట గుర్తుంచుకొనవలెను. (నృసింహపురాణము)

3

శ్రీ తిక్కనగారి విరాట పర్వము

శ్రీ కోరాడ రామకృష్ణయ్య

శ్లో. శ్రీవాణీ గిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాంగేషు యే
లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయః త్రిపురుషా స్సంపూజితా వ స్సురై
ర్భూయాసుః పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరా శ్శ్రేయసే॥

"శ్రీయన గౌరినాఁ బరఁగు చెల్వకుఁ జిత్తము పల్లవింప భ
ద్రాయిత మూర్తియై హరిహరంబగు రూపముఁ దాల్చి విష్ణురూ
పాయ నమ శ్శివాయ యని పల్కెడు భక్తజనంబు వైదిక
ధ్యాయిత కిచ్చమెచ్చు పరతత్త్వముఁ గొల్చెద నిష్టసిద్ధికిన్"

"అంభ నవాంబుజోజ్జ్వల కరాంబుజ శారదచంద్రచంద్రికా
డంబర చారుమూర్తి ప్రకటస్ఫురదీపిత రత్నదీపికా
చుంబిత దిగ్విభాగ నిజసూక్తి వివిక్త నిజప్రభావ భా
వాంబరవీథి విశ్రుతవిహార! మముం గృపఁజూడు భారతీ".

"పరమవివేక సౌరభవిభాసిత సద్గుణపుంజ వారిజో
త్కర రుచిరంబులై, సకలగమ్య సుతీర్థములై, మహామనో
హర సుచరిత్ర పావన పయఃపరిపూర్ణములైన యీ సభాం
తర సరసీవనంబుల ముదంబొనరం గొనియాడి మ్రొక్కెదన్".

"శ్రీమదాంధ్ర సారస్వత పరిషత్తు" వారు హైదరాబాదు నగరమున జరుపుచున్న యీ యాంధ్ర భారత మహోత్సవములోఁ బాల్గొను నవకాశము నాకుఁ గల్పించినందులకు-అందలి కార్యకర్తలకు- ఆ పరిషత్తువారికి నేనెంతయుఁ గృతజ్ఞుఁడను. ఆంధ్ర సారస్వత చరిత్రలో నొక నూతన యుగ ప్రారంభకాలములో మన మున్నాము. ఈ యుగమున ఖండకావ్యములకుఁ, గథానికలకు, నేకాంక నాటికలకు, జానపద గీతికలకుఁ గల ప్రాముఖ్యము ప్రాచీన వాఙ్మయశాఖలకుఁ, నందుఁ బురాణ ప్రబంధములకుఁ గలుగదేమో యనిపించుచున్నది. అట్టి సమయములో నీ హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తువారు "ఆంధ్ర భారత వారోత్సవము"

లనే జరుపఁదల పెట్టిరని వినుట నాకుఁ గొంత యాశ్చర్యమును నత్యంతానందమును గూడఁ గలిగించినది. అంతకుఁ గొద్ది పూర్వమే "కాకినాడ ఆంధ్ర సాహిత్య పరిషత్తు" వారీసారి పరిషత్సభ రాజమహేంద్రవరమున జరుగునని తెలిపినపుడు "వేంగీ దేశమునకు నాయక రత్నముం బోలిన రాజమహేంద్రపురంబునందు" జరుగఁబోవు నా సభలో నన్నయ భట్టారకుని భారత రచనను గూర్చిన ప్రసంగములు జరుపుకొనుట యెంతయో యుక్తము గావున వారట్లు సమ్మతించిన నేనట్లు చేయఁదలఁచితినని సూచించితిని.

ఆంధ్ర సాహిత్యమున కాదికవి నన్నయ్య యెట్లయ్యెనో, యతని కాలము నందు నతనికిఁ బూర్వమునందుఁ దెలుఁగుభాష, జాతీయము, సాహిత్య సంప్రదాయములు నెట్టివై యుండెనో, యింకను బరిశీలించి తెలిసికొనవలసిన యావశ్యకత యెంతైనఁ గనఁబడుచునే యున్నది. ఇంకను-నీ నవ్యయుగములో నాపాఁత కవుల భాషా సాహిత్య సంప్రదాయాలను గూర్చిన చర్చ లెందుకయ్యా-అంటే నేను చెప్పలేను. కాని, యాదికవియని మనము చెప్పుకొనుచున్న నన్నయ, యాదికవి యెందు కయాఁడో, యతనికిఁ బూర్వమున దేశమునఁగల భాషా సాహిత్య సంప్రదాయాలెట్టివో - తెలిసికొనవద్దా? అతఁడు ప్రయోగించిన శబ్దజాలమునకు, నతఁడు వాడిన తెలుఁగు జాతీయమునకు-ఒక పట్టికయైనను నింతవఱకు మనము తయారు చేసికొనలేదే! ఆంగ్లమున షేక్స్పియర్ మహాకవిభాష కొక ప్రత్యేక వ్యాకరణమే రచింపఁబడి యున్నది. కాని మన యాదికవి తెలుఁగు భాషా జాతీయ మెట్టిదో, తెలుఁగు నుడికార మెట్టిదో, సంస్కృత శబ్దప్రయోగ వైఖరి యెట్లున్నదో, యది యిప్పుడు మన వ్యవహారమున నెంతవఱకుఁగలదో, యెంత వఱ కర్థమగుచున్నదో, యను విషయము లింకను బరిశీలనార్హములే యగుచున్నవి.

"నమ్మనేర నయ్యెదను, కరుణ గలుగుమమ్మ కమలనేత్రి", మా యందుఁ గుడిచిపొమ్ము; నూతిలో వెలువడఁ గోమలిం దిగుచట, "వాని వచనంబు లవకర్ణించుట". మహాభారతంబు నిర్మించుట, 'అగ్నులు విహరించుట, దుర్యోధను దూషించుట; నీతదర్థంబుగా దేవనిర్మితము; ధృతరాష్ట్రుననుజ్ఞానము, సాంద్రారుణపూరము' వంటి ప్రయోగము లిప్పుడు సులభముగా నర్థమగుచున్న వనఁగలమా? అర్థము కాక పోతే-వానితోఁ దల బ్రద్దలు కొట్టుకొనుట యెందు కా పుస్తకముల నటకల కెక్కించండి. జానపద గీతాలను బాడుదామంటే, చెప్పలేనుగాని. భాషా పరిణామము, నర్థ విపరిణామము, సాహితీ సంప్రదాయములు నాదికవి నాటివైనా తెలిసికొనవలెనంటే ప్రగతికిఁ బ్రాచీన సంప్రదాయ జ్ఞానము కూడ నావశ్యకమే నంటే, వీనినిఁ గూర్చి మనము ప్రత్యేక శ్రద్ధవహించవలసి యున్నది.

ఇట్లని నేను తలంచుచుండగాఁ - నింతలో నీ హైదరాబాదు పరిషత్తువారు 'ఆంధ్ర భారత వారోత్సవము'లనే తలపెట్టినట్లు విని యెంతయు హృదయాహ్లాదమును బొందితిని. అందులో వారు నన్ను "హృదయాహ్లాది చతుర్థ మూర్జితకథోపేతంబు నానారసాభ్యుదయోల్లాసి విరాటపర్వము"ను గూర్చియే ప్రసంగించమనటం కూడ తటస్థించినది. సుమారు 25 సంవత్సరముల క్రిందట నేను మద్రాసు విశ్వవిద్యాలయములోని తెలుఁగు భాషాశాఖలో నాంధ్రభాషా సాహిత్యములను గూర్చిన పరిశీలన ప్రారంభింపవలసి వచ్చినప్పుడు, మన సాహిత్యములో నాంధ్ర భారతమే తొలి యుద్గ్రంథము గావున, దానితోనే మన భాషా సాహిత్యముల పరిణామమును గూర్చిన పరిశోధన కార్యము ప్రారంభించుట యుక్తమని తలఁచితిని. ఆ కాలములో నీ భారతమును గూర్చి నేను వ్రాసికొన్న మాటలివి.

"It is only proper that a critical and historical appareciation of the Telugu Language and Literature should begin with a study of that great work. Critics are prone to remark that the last word on Telugu Bharata has already been said, and that there is nothing more to be worked on that subject. But it may be said that they have to realise that Mahabharata is a diamond with many facts still demanding the viw and appreciation of the critics of Andhra" ఈ మాట లప్పటికివలె నిప్పటికిని యన్వయించుచునే యున్నవి.

నన్నపార్యుఁడు చెప్పినట్లు "విశ్వజనీనమై" పరఁగు నీ భారతరత్నము. ఇప్పటికి నింకనుగూడ దాని నాశ్రయించిన వారి దృక్పథములను బట్టి యందుఁ దీర్పఁ బడియున్న ముఖవైఖరులను బట్టి-వింతకాంతుల నీనుచునే యుండుననుటకు సందేహము లేదు. ప్రత్యేకముగ నిప్పుడీ పరిషత్తువారు తలపెట్టిన యీ భారత మహోత్సవములే యందుకుఁ బ్రబల నిదర్శనము లగుచున్నవి.

కావుననే యీ మహోత్సవములను జరుపుటకై యీ పరిషత్తు వారినిఁ బ్రేరేపించినందులకు, నా యాంధ్రకవిత్రయ స్తోత్రపాత్రులైన - వేదత్రయ మూర్తులగు నా పురుషత్రయమును, హరిహరనాథ దేవుని, భారతీ దేవిని - నా కవిత్రయము వారి పలుకులలోనే స్మరించి, పరమవివేక సౌరభ విభాసితులగు నీ పరిషత్సభాసదులకు మ్రొక్కి, తొలుత - నించుక కవిత్రయ ప్రశంసకు మీ యనుజ్ఞ వేడుకొనుచున్నాను.

కవిత్రయ ప్రశంస

తిక్కనార్యుని విరాట పర్వమును గూర్చి ప్రసంగింపవలయుననియే పరిషదాజ్ఞ. అయినను నాంధ్ర కవిత్రయములో మిగిలిన యిద్దఱిని గూడ నించుక ప్రశంసించినఁ గాని తిక్కనార్యుని యొద్దకు రాలేము. ఏమనఁగా, నీ యాంధ్ర భారత రచనా రీతి-లేదా నిర్మాణ రీతి, యట్టిదయినది. నన్నయ దీనిని నిర్మాణమే యన్నాఁడు. "అజుండు భువనత్రయంబువలెఁ గృష్ణద్వైపాయనుండు మహాభారతంబు నిర్మించినాఁడఁ"ట. 'రచన' అనుచోట నన్నయ 'నిర్మాణ' శబ్దమును వాడుట మన కిప్పుడు కొంత క్రొత్తగాఁ గన్పడవచ్చును. కాని నన్నయ "నిర్మించి" అనే వాడినాఁడు. అంతేగాక నన్నయ తొలి శ్లోకమున నవితథమగు లోకస్థితి విషయముఁన బేర్కొనిన పురుషత్రయ మెట్టిదో, యతఁడు ప్రారంభించిన యాంధ్ర భారత రచనా విషయమున మనకుఁ గవిత్రయ మట్టిదైనది. సామాన్యముగా నా పురుషత్రయమును మనము సృష్టిస్థితిలయ కారకులుగాఁ దలంచి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను వరుసలోఁ జెప్పుకుంటూ ఉంటాము. కాని నన్నయ తొలి శ్లోకములో వేదత్రయ మూర్తులగు నా పురుషత్రయమును- "బురుషోత్తమాంబుజ భవ శ్రీకంధరు" లను వరుసలోఁ బేర్కొన్నాఁడు. ఈ వరుసనే మన కవిత్రయమున కన్వయించినట్లయితే, పురుషోత్తమ స్థానమున-నాదికవియగు నన్నయ, అంబుజభవ స్థానమునఁ-గాలమును బట్టి తరువాతి వాఁడేయగు-కవిబ్రహ్మ-తిక్కన, యటుపిమ్మట శ్రీకంధర స్థానమును-నటు తరువాతి వాఁడగు "శంభుదాసుఁడు, ఎఱ్ఱా ప్రెగ్గడ" అని. ఈరీతిగాఁ గాలక్రమమును బట్టి మన కవిత్రయము వారితో నన్వయించుకొనవచ్చును. అయితే యిక్కడ నొక చమత్కార మున్నది. నన్నయ తొలి శ్లోకములో "పురుషోత్తమాంబుజభవ శ్రీ కంధరాశ్శ్రేయసే" యని రచించి యా వెంటనే చెప్పిన గద్యలో నేమన్నాఁడో చూడుఁడు. "అని సకల భువన రక్షణ ప్రభువులై యాద్యులయిన హరిహర హిరణ్యగర్భ పద్మోమావాణీ పతులను స్తుతించి" యంటాఁడు. మొత్తముమీఁద స్తుతించినది త్రిపురుషులనే యయినా తొలుత శ్లోకములోఁ జెప్పిన వరుసను వెంటనే చెప్పిన గద్యములో మార్చినాఁడు. తరువాతఁగూడా 'హరిహర పద్మగర్భులను' అనే పద్యములోనే నీ వరుసలోనే స్తుతించినాఁడు. ఈ మార్పువలనఁ గలిగిన విశేష మేమనఁగా బురుషత్రయమునకు మన కవిత్రయము ఛాయా పురుషులుగా మనము గ్రహించినప్పుడు తొలుత శ్లోకములోఁ "బురుషోత్తమాంబుజభవ శ్రీ కంధరా" అను వరుసలోని పురుషోత్తముఁడు. హరి-నన్నయ మొదటిస్థానమునే యాక్రమించి యుండ, రెండవస్థాన మాక్రమించిన-అంబుజభవుఁడగు-కవిబ్రహ్మ" తిక్కన మూఁడవవాఁడగుట. శ్రీ కంధర-హరస్థానమున మూఁడవవాఁడగు

శంభుదాసు-ఎఱ్ఱన రెండవస్థాన మాక్రమించి హరి హిరణ్యగర్భుల నడుమఁజేరుట తటస్థించినది. ఇట్లు వారివారి కాలమునుబట్టి గాక భారత గ్రంథ నిర్మాణమును బట్టి చూచినచో హరిహర స్థానముల నాక్రమించి మొదటి రెండున్నఱ పర్వములు రచించిన నన్నయ, యతడు వదలివేసిన యారణ్య పర్వశేషమును బూరించిన శంభుదాసుఁడగు ఎఱ్ఱనల తరువాతనేగదా "విరాటపర్వమిట నుద్యోగాదులంగూడఁ గా" "పదునేనింటిఁ దెనుంగు బాస" రచించిన "హిరణ్యగర్భ" స్థానీయుఁడగు కవిబ్రహ్మ తిక్కన వచ్చేది. కాబట్టి నన్నయ తరువాతి గద్యములో జెప్పిన 'హరిహర హిరణ్య గర్భ' అను వరుసక్రమము భారత గ్రంథ నిర్మాణ క్రమమున కన్వయించు కొన్నచోఁ జక్కఁగా సమన్వయ మగుచున్నది. ఈ కారణముచేతనే భారత రచనా క్రమమునుబట్టి తిక్కన మూఁడవవాఁడగు చున్నాఁడు. కాఁబట్టే యీతనికి ముందు హరిహరస్థానీయులగు కవుల ప్రశంస కూడఁ జేయవలసి యుంటుంది యని నేను వెనుకఁ జెప్పినది. ఏమైనా యీ యాంధ్ర భారత నిర్మాణమే యొక్క కవిచేతనోగాక యీ కవిత్రయము వారిచేతనే జరిగి యుండుట యాంధ్రజనుల మహాభాగ్యమే యనక తప్పదు. అట్లు జరుగవలసి యుండుటచే మహర్షితుల్యుఁడగు నన్నయ తొలి శ్లోకమునఁ త్రిమూర్తుల స్తవము మూలముగా సూచించినాఁడేమో! ఆంధ్ర సారస్వత ప్రపంచ మవితథమై క్రమపరిణామమును బొంది యాంధ్ర జనుల జీవిత పథమును దీర్చి దిద్దుచు, నాంధ్రలోక స్థితిని నిర్వహించుటలో నీ కవిత్రయము నాంధ్ర సాహిత్యలోకము పూజించుచుండునని సూచించినవాఁడైనాఁడు. అవిరళ జపహోమతత్పరుఁడు, సంహితాభ్యాసుఁడునగు నన్నయ పురుషత్రయమును బూజించుట యతని నిరూఢ వైదికతా సంపన్నత్వమునే సూచించినదైనను, నాశ్లోకముతోఁ త్రిపురుష స్మరణతో నాతఁడవలంబించిన యాంధ్ర భారత రచనా మహోద్యమము కాలగతినిఁ గవిత్రయము మూలముగాఁ గొనసాగిన రీతిని మన మించుక పరిశీలించినట్లయితే "ఋషీణాంపునరాద్యానాం వాచమర్థోనుధావతి" యను నార్యోక్తి స్మరణకు రాక మానదు. తొలుత నాతఁడు చెప్పిన 'పురుషోత్తమాంబుజభవ శ్రీకంధరాః' అను సమాసమును దరువాత వెంటనే గద్యలో 'హరిహర హిరణ్యగర్భులుగా' మార్చుట సంస్కృతములో సమాస రచన కనుకూలముగానో, పద్యములో గణాల కనుకూలముగానో రచించుటయేగాని మఱేమి కాదని తలంపవచ్చును. అట్లే తలంతము గాక; అట్లేయైనను వానిలో మొదటిది భారత రచనను జేపట్టిన కవుల కాల వ్యవస్థకును, రెండవది గద్యలోని 'హరిహర పద్మగర్భ' లనునది భారత గ్రంథ రచనలోని నిర్మాణ పద్ధతికిని సరిపోవుచుండుట యాశ్చర్యజనకము కాదా? నన్నయ కొలిచిన "హరిహరాదులనే"

తరువాతఁ దిక్కనకూడ "హరిహర పద్మగర్భులను నాది కవీంద్రు" నని కొలుచుటయేగాక, నన్నయకు రెండు వందల సంవత్సరముల తరువాతఁ దిక్కన విరచిత భారత భాగమును గృతిగొనుటకు 'హరిహరు' లేకమయిన పరతత్త్వ రూపమే హరిహరనాథుఁడై సాక్షాత్కరించుట కూడ మఱియొక విశేషముగా నున్నది. గ్రంథ రచనా రీతినిఁ బట్టి తొలి మూఁడు పర్వములలో (హరిహరులకు) నన్నయ యెఱ్ఱనల కేర్పడవలసి యున్న సాన్నిధ్యము తిక్కన కాలమునకే "హరిహరనా" థైక రూపమున వెలసి నట్లయినది. మఱియొక విశేష మేమనఁగా నన్నయ తరువాత వచ్చిన కవిబ్రహ్మ, నన్నయ యారణ్య పర్వశేషమును దెలిఁగింపక వదిలివేసినాఁడని తెలిసియే "అందొనర్చె మూఁడుకృతు లాంధ్రకవిత్వ విశారదుండు విద్యాదయితుండు మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్" అని రెండున్నఱకు మూఁడని సామాన్య దృష్టితో వ్రాసి నాఁడా, లేక తెలియకయే యట్లనుకొనినాఁడా యనున దొక ప్రశ్న. అతని కది యసంపూర్ణమని తెలియదనుట యుక్తముగాఁ గనఁబడదు. తెలిసియు దానినిఁ బూరించుటకు ధీరచిత్తుఁడు, నాత్మపదస్థుఁడు నగు నాతని యుదాత్తతను క్రిందు పఱచుటే యగును, తాను రచింపఁదలఁచిన తక్కిన పదేను పర్వముల రచనను గూర్చి "తుదిముట్టన్ రచియించు టొప్పు బుధ సంతోషంబు నిండారఁగన్" అని ఘంటాపథముగాఁ జెప్పుకొని "దీక్షావిధినొంది" చేపట్టినవాఁడింకఁ గొద్దిగా మిగిలి యున్న యారణ్య పర్వశేష భాగమును గూడఁ జేపట్టినచో ముగింపలేకపోవునా? కావున నాతఁ డద్దానినిఁ దెలిసియే చేపట్టఁ దలపలే దనవలసియున్నది. ఈతని నోట వచ్చినట్లుగానే, యా మూఁడు కృతులును, నాంధ్రకవిత్వ విశారదుండగు నన్నయభట్టు రచించినట్లుగానే చెల్లుబడి కావలసి యున్నది కాఁబోలును! భవితవ్యత బలీయము కాదా మఱి!

అయిన మఱొక విషయము. తిక్కన మాత్రము. మానవనాథుఁడగు రాజ రాజనరేంద్రునికిఁ గృతిగాఁ బ్రారంభింపఁబడి, విరచితమయిన భారతారణ్య పర్వముతో, నా రచనను బ్రారంభించి కృతిపతిత్వ మర్థించి వచ్చిన "హరిహర నాథునకు" పరమేశ్వరారాధన మెట్లు చేయగలఁడు? ఎంగిలికూడుతో నా పరమేశ్వరారాధనము చేయఁగడంగుట యెప్పటికైన నా యారణ్యపర్వశేషభాగము, నన్నయ రచించినట్లే మానవనాథుని కంకితముగనే రచింపఁబడవలసి యున్నదని యాతని యుద్దేశ్యమై యుండును. కావుననే తిక్కన దానిని బుద్ధిపూర్వకముగానే ముట్టలే దనవలసి యున్నది.

దీనినిఁబట్టి భవితవ్యత యనునది యాంధ్రుల పాలిటికి భారత రచనకై కవిత్రయమునే నిర్ణయించి పెట్టినదా యని తలంపవలసి వచ్చుచున్నది.

అట్లు పదేను పర్వములు తుదముట్టన్ రచియింతునని చెప్పి రచింప గలిగిన కవిబ్రహ్మ తనకొఱకే వదలివేసినాఁడో యన్నట్లుగాఁ దెలిసియు వదిలివేసిన "యాయారణ్య పర్వశేషమును దద్రచనయకాఁ బూరించుట"కు సిద్ధపడిన - శ్రీ కంధర స్థానీయుఁడగు శంభుదాసుఁ డీయాంధ్రావని నవతరించుటకు మరల నొక శతాబ్దము పట్టినది. అప్పుడైన నాతనిని వెలయింపఁ జేయుటలోఁ బ్రకృతికి లేదా భవితవ్యతకు వేఱొక మార్గము తోఁచక గాఁబోలు నీ పూర్వకవుల యిద్దఱి కవితా లక్షణములనే గ్రహించి మూఁడవ వానిని నిర్మాణము గావించినదా యన్నట్లు నన్నయ తిక్కన ప్రతిభాశక్తులను, రచనా రీతులను నెఱ్ఱనయందు సంక్రమింపఁ జేసి యాతనిచే నా యారణ్య పర్వశేష పూరణమును సాధింపఁ జేసినట్లున్నది.

ఆంగ్ల సాహిత్యమున మిల్టన్ మహాకవినిఁ గూర్చి డ్రైడెన్ అను కవి చెప్పిన యీ క్రింది వాక్యములు మన యాంధ్ర భారత కవితాత్రయము పట్ల నన్వయింపఁ దగినట్లగపడుచున్నవి.

గమనింపుడు.

Three poets in three distant ages born
Greece, Italy and England did adorn
The first in loftiness of thought surpassed
The next in majesty, In both the last
The force of Nature, could no further two.
To make a third She Joined the other two.

Dryden (Under Milton's Picture)

తెనుఁగున భావ భాషా రచనా గాంభీర్యమునకు నన్నయను మించినవారు లేరు. కావ్యకళా ప్రౌఢిని, రచనా శిల్పమునందును దిక్కనను మించినవారు లేరు.

సాహిత్యమున వీనికి మించి కావలసిన దేమి గలదు? ఎఱ్ఱాప్రెగ్గడ కవి త్రయములో వీరి తరువాత వచ్చినవాఁడు గనుక, వీరిద్దఱిలోఁ గల యుత్తమ గుణములను బుణికి పుచ్చుకొని, తనలో జీర్ణించుకొని, యా భారతకథా శేషమును 'తద్రచనయకా నన్నయ రచనగానే పూరించి చీలిపోయి విడివిడిగానుండిన నన్నయ

తిక్కనల భారత భాగములను దాను నడుమఁజేరి కలిపివేసి, తెనుఁగు భారతమున కొక సంపూర్ణతనాపాదించి, యాంధ్ర భారత కవిత్రయములోఁ దాను నొక స్థానమును, నందు నడిమి స్థానమును సంపాదించుకొని ప్రబంధ పరమేశ్వరుఁడై ప్రసిద్ధిఁగాంచినాఁడు.

ఇది యంతయు ననఁగా - నీ తెలుఁగున భారత రచన కవిత్రయము వారిచే శతాబ్దిత్రయకాలాన, నిట్లు జరుగవలసియుండుట యనేది. తిక్కనాచార్యుఁడు మఱొక సందర్భమునఁ జెప్పినట్లుగా "ననన్య సామాన్య కారణంబగు పరమధర్మ ప్రకారంబని" తలంపఁ దగినట్లున్నది.

ఇంతవఱకీ యాంధ్రభారత కవిత్రయ రచనావిధానము "అనన్యసామాన్య కారణం" బనుట యుక్తియుక్తమే యనిపించినను నది యాంధ్ర జనుల జీవిత చరిత్రలో "పరమ ధర్మ ప్రకారం" బగుట గూడ సార్థకమే యనుట యెట్లో నిరూపింపఁబడవలసి యున్నది.

కాలానుగుణ్యముగా నీ యాంధ్ర భారత కవులకు నన్నయ తిక్కన, లాంధ్ర రాజుల సామ్రాజ్యకాలమునుండియుఁ తెలుఁగు దేశమున నెలకొనియుండిన వైదిక మత సంపత్తినిఁ, దరువాత దక్షిణ పశ్చిమ దేశభాగములందువలె వీరత్వమునొందిన వైష్ణవ శైవమార్గములం ద్రొక్కనీయక, ధర్మాద్వైతపథమున, భేదములేని భక్తితో నద్వైతభావనిరూఢితో నాంధ్రజనులను దత్సాహిత్యమునుగూడ నడుపుచు భారతీయాంధ్ర జాతీయపథమును దీర్చిదిద్దఁగలిగిన వారై రనునదియే "యనన్య సామాన్యకారణం బగు పరమధర్మప్రకారము" అగుచున్నదని, యదియే యాంధ్రుల మహాభాగ్య మని చెప్పవలసియున్నది.

ఆంధ్రజాతి - జీవిత పథము

ఈ విషయము బాగుగా బోధపడవలె నన్నచో, యాంధ్రజాతి జీవితపథ ప్రకారమును గూర్చి యించుక మనము పరిశీలించవలసి యుండును. ఇది మీకు శ్రమ కలగినచోఁ గ్లుప్తముగాఁ దెలిపెదను. మొత్తము మీఁద భారతజాతి జీవితపథ క్రమమంతయు వైదిక మార్గనిష్ఠమై యాధ్యాత్మికదృష్టి నమసరించినదే యని చెప్పఁ దగినను, దేశకాల భేదమును బట్టి యది కొన్ని మార్పులకు లోనగుచు వచ్చినది.

విశ్వామిత్ర శాపహతులుగాఁ జెప్పఁబడిన వారిలోఁ జేరిన యాంధ్రజాతివారు, బహుశః కొంతకాలము వైదిక సంస్కారములకు లోనై యుండినను, వింధ్యదక్షిణ భాగము నాశ్రయించిన తరువాతఁ, గ్రమముగా దక్షిణ దిశగా వ్యాపించి; కృష్ణా

గోదావరీ మధ్యభూముల నాక్రమించి, యచ్చటి ద్రావిడ, నాగ జాతులవా రగు "తెలుఁగు" జాతివారితోఁ గలసిపోయి, తమ ప్రాకృతముతోఁ బాటు వారి తెలుఁగు భాషను గూడ నభ్యసించి, వారికిఁ దమ యాంధ్రత్వము నబ్బఁజేసినారు. ఇట్లు తెలుఁగు లాంధ్రులతోఁ గలసి యాంధ్రులై తమ తెలుఁగును మాత్రము విడువక నిలువఁబెట్టుకొన్నారు. ఈ దేశీయులతోఁ జేరుటవలనఁ గలిగిన బలముచేఁ గృష్ణానదీ తీరమున శ్రీకాకుళము రాజధానిగా నొక రాజ్యము స్థాపించి క్రమముగా నుత్తరమున కెగఁ బ్రాకి మగధరాజ్యమును స్వాధీనము చేసుకొని యాంధ్ర సామ్రాజ్య స్థాపకులైనారు. ఆకాలమున నీ దేశమున బౌద్ధమునకు నెలవై యున్నను నాంధ్ర రాజులలోఁ బెక్కురు వైదిక మతావలంబకులేయై యనేకయజ్ఞముల నొనర్చి దేశమున వైదిక మతమునకే స్థిరవాసముఁ గల్పించిన వారిలో ముఖ్యులైనారు. ఆ రాజులలో 'యజ్ఞశ్రీ' వంటి పేళ్ళే యిందుకు నిదర్శనములు. శాతవాహన ప్రభువులలోఁ బెక్కు మంది యశ్వమేధ, రాజసూయ, అగ్న్యాధేయ అప్తోర్యామ, దశరాత్రాది యజ్ఞములను జేసినట్లు నానాఘాట్ శాసనములవలనఁ దెలియుచున్నది. ఇక్ష్వాకురాజులలోఁ గూడ శ్రీశాంతమూలాదులగ్నిష్టోమ వాజపేయాదుల నొనర్చినవారే. కాని యతని సోదరి శాంతసిరి మొదలగువారు బౌద్ధులై నాగార్జునకొండ యందలి పెక్కు శిల్పములకు మూలకారకులైనను, రెండు మతములు దేశమున ద్వేషము లేకయుఁబెంపొంద సాగుటచే దేశము శిల్పవైభవమునకు నెలవైనది. వీరి పిదప నానందగోత్రజులును, నప్రమేయ హిరణ్యగర్భ ప్రసవులు. దామోదరవర్మ 'గోసహస్రానేక హిరణ్యా "గర్భోద్భవోద్భవుఁడు"నని యున్నది. శాలంకాయన ప్రభువులు భగవచ్చిత్రరథ స్వామిపాదానుధ్యాతులు, పరమ భాగవతులు, పరమ మహేశ్వరులు. ఆ తరువాతి విష్ణుకుండినులు శ్రీ పర్వతస్వామిపాదానుధ్యాతులు, క్రీ.శ. 7వ శతాబ్దినుండి తెలుఁగు దేశము నేలిన చాళుక్యులు స్వామి మహాసేనపాదానుధ్యాతులు, సప్త మాతృకలు వారి యభిమానదేవతలు, పంచాయతనపూజ, ప్రాచీన వైదిక మతపోషణము, వర్ణాశ్రమ ధర్మరక్షణము వారి వంశలక్షణములు. కావుననే నన్నయభట్టు 'హరిహరాజ' గజాననార్క షడాస్య మాతృ సరస్వతీ గిరిసుతాదిక దేవతాతతిఁ గొల్చియే భారత రచనను బ్రారంభించుట తటస్థించినది. తొలుత జైన బౌద్ధములు గూడ నీదేశమున విశేషవ్యాప్తి గాంచినను, వైదికమందే పాలకులు చూపుచు వచ్చిన విశేషాభిమానముచేతఁ, గుమారిలభట్టు, శంకరాచార్యులు మొదలగు వారు ప్రతిపాదించిన, వైదికధర్మాద్వైతమతబోధల యందుఁ గలిగిన యాదరాభిమానము లాంధ్రుల కితర మతములందుఁ గలుగలేదు. కావుననే జైన బౌద్ధములు తమిళ కన్నడ దేశములందు విశేషవ్యాప్తిఁ గాంచుటయేగాక,

క్రీస్తుశకారంభమునుండియు నా యా భాషలలోని వాఙ్మయములందును బ్రతిఫలింపఁ జొచ్చినవి. తెలుఁగు దేశమునందు క్రీ.శ. తొలిదశ శతాబ్దిని వైదికమతముతోఁ బాటు సంస్కృత భాషా ప్రాబల్యమెక్కువై, దేశభాషయందు వైదిక పండితులకు నిరసన భావము ప్రబలుటచే నాకాలమున నీ భాషలో శిష్టవాఙ్మయము ప్రబలు నవకాశము సన్నగిల్లిపోయినది. కావుననే క్రీస్తుశకము తొలిశతాబ్దములలో బౌద్ధము కొంత శిల్పకళా మూలముననే యీ దేశమున వ్యక్తమైనదిగాని వాఙ్మయ ధర్మమునఁ బ్రతిబింబింపలేదు తమిళ దేశమందలి ప్రాచీన వాఙ్మయమున జైనబౌద్ధ మతానుయాయుల రచనలే విశేషముగా నుండినవి. దీనినిఁ బ్రతిఘటించుట కేర్పడిన వైష్ణవాళ్వార్లు, శైవనాయనార్లు రచించిన గ్రంథము లిటీవలఁ బ్రఖ్యాతిఁ గాంచినవి. కన్నడ దేశమున జైనమతము రాష్ట్రకూటాది రాజన్యుల ప్రాభవమునఁ బెంపొందుట, కన్నడ సాహిత్యమునఁ దొలియుగమును జైనమత యుగముగాఁ జేయఁగలిగినది. క్రీ.శ. 9-10 శతాబ్దులందలి కవిరాజమార్గకర్త కన్నడ రత్నత్రయము మొదలగు వారందఱు జైనమతాభిమానులే. తెలుఁగు దేశము తొలి నుండియు వైదికమతోద్బుద్ధమగుటచేఁ గాఁబోలు నీవాఙ్మయమున జైన బౌద్ధమత యుగములు లేకపోయినవి. చాళుక్యరాజులు దేశవాఙ్మయమును గొంత పెంపొందించినను, శిష్టులు పండిత సభలలో నీ భాషలో శిష్టవాఙ్మయ రచనను నిరసించు చుండుటచేఁ బ్రభువునుండి ప్రబలమైన యవలంబనము, ప్రోత్సాహము కలిగినఁగాని తెలుఁగులో శిష్ట వాఙ్మయము బయలుదేరుటకుఁ దగిన యవకాశము కలుగలేదు. అట్టితరుణము మనుమార్గవర్తనుఁడగుఁ రాజనరేంద్రుని ప్రభుత్వకాలముననే తటస్థించినది. దానిని నిర్వహించి కొనసాగించుటకు, నన్నయ వైదిక సంపత్తి తోడ్పడినది. ఆ వైదిక వాతావరణమును బెంపొందించుటకు శిష్టవర్గము నొప్పించి, యాంధ్ర జగద్ధితము సమకూర్చుటకుఁ దగిన గ్రంథము పంచమవేదమగు భారతమై వెలసినది. ఈ రీతిగా నన్నియు నొక్కరీతిగా సమకూరుటచే భారత సంహిత యాది కావ్యము, నాది కవి నన్నయభట్టారకుఁడు నగుట తటస్థించినది. ఈ రీతిగా భారతీయమగు సనాతన ధర్మోద్బుద్ధమగు వైదికధర్మమును దక్షిణ దేశమున నాదినుండియు నిలువఁబెట్టినవారాంధ్రులు, వారి సహజతత్త్వము శిష్టవాఙ్మయా దర్శమునఁ బ్రతిబింబింపఁ జేయఁగల రాజ్యము, కాలము, యోగము క్రీ.శ. 11వ శతాబ్దికిఁగాని కలుగలేదు. తూర్పు చాళుక్యరాజులలోఁ బరస్పర కలహము లంతరించి దేశమునఁ గొంత అశాంతి నెలకొన్నది. సమస్త వర్ణాశ్రమ ధర్మరక్షకుఁడు, నాదిరాజ విభుఁడునగు రాజనరేంద్రుఁడే తగినప్రభువైనాఁడు. అతనికిఁ దగిన వాఁడే యతని కులబ్రాహ్మణుఁడు. అవిరళ జపహోమతత్పరుఁడు సంహితాభ్యాసుఁడు బ్రహ్మాండాది

నానాపురాణ విజ్ఞాన నిరతుఁడు. లోకజ్ఞుఁడునగు నన్నయ భట్టారకుఁడు. వీరిద్దఱి దృక్పథములకు నా కాలపు వైదిక వాతావరణమునకుఁ దగిన గ్రంథము పంచమ వేదమై పరఁగిన భారత సంహిత. అయితే యిట్టిదానినిఁ దెలుఁగులో రచించుటకు నప్పుడు మాత్రము శిష్టు లొప్పుకొనినారా? అంటే దానికిఁ దగిన ప్రేరణము ప్రోత్సాహము ప్రభువునుండియే వచ్చినది, రాజు తలఁచుకొన్న-నేమి కొదువ? ఇతఁడు విమలమతింబురాణములు, నర్థ ధర్మశాస్త్రముల తెఱం గెఱింగినా, కావ్యనాటక క్రమములు పెక్కు చూచినా, యీశ్వరాగమములందు బుద్ధి నిల్పినా, యతనికి శ్రీ మహాభారతంబు నందలి యభిప్రాయంబే విన నభిలాష పెద్దదై యుండుననుఁట. అదివఱకే బహుభాషల, బహువిధముల, బహుజనముల వలన నాతఁడు భారత కథను విన్నవాఁడే. లేనిచో నట్లు విన్నవారికి బహుయాగ ఫలంబు వచ్చునని యెట్లు చెప్పఁగలిగియుండును. ఇక్కడఁ బ్రధానవిషయము "వినుట"యే యని మనము గమనించవలె. భారతాదులు, బహుపురాణములు మొదలగునవి పురాణము చెప్పగా నరుగులమీఁద, వీధులలోను, రచ్చకూటములలోను జేరి వినుచుండుటచేతనే పట్టణములలోను గ్రామములలోను జనులంతా, జాతీయ ధర్మతత్త్వాన్ని తెలుసుకుంటూ ఉండేవారు. చదవడం వ్రాయడం రాక పోయిన సామాన్యజనులుకూడ విద్యావంతులై ధర్మతత్పరులై ధర్మప్రవర్తన నల వఱచుకొనడానికిదే మార్గముగా ఉండేది. తమిళ రాజ్యంతోఁగల సంబంధాన్నిబట్టి రాజరాజ నరేంద్రుఁడు తమిళభాషలో పెరుందేవనార్ రచించిన భారతాన్ని పశ్చిమ చాళుక్యుల సంబంధమునుబట్టి కన్నడ భాషలోని పంప భారతాన్ని, రన్న రచించిన భారతకథ గదా యుద్ధాన్ని అతఁడు వినియుండునని మనము నిశ్చయించవచ్చును. కాని యవి భిన్నమత సంప్రదాయాలతోఁ గూడినవి గావున నాతనికిఁ దృప్తి కలిగించినట్లులేవు. అసలు భారతమునకుఁ బంచమవేదమని ప్రసిద్ధి. వేదాధికారము లేనివాని కిదే వేదమార్గమును దెలుపునది. దేశీయములగు తమిళ కన్నడ భాషలలో భారతకథ రచింపఁబడియుండఁగాఁ, దెలుఁగు భాషలో మాత్ర మెందుకు రచింపఁ బడఁగూడదు? వైదికమతానికి విడిదిపట్టయిన యీ తెలుఁగుదేశములో నీ భారతము వైదికమత దృష్టిలో తెనిఁగింపఁబడుట యుక్తముగదా. కావుననే యాతఁడు "జననుత కృష్ణ ద్వైపాయనముని వృషభాభిహిత మహాభారతబద్ధ నిరూపితార్థ మేర్పడఁ -దెనుఁగున రచియింపు మధిక ధీయుక్తిమెయిన్" అని నన్నయ నాజ్ఞాపించుట తటస్థించినది. పంపాదుల కథలవలెఁగాక, కృష్ణద్వైపాయనుని హృద్గతార్థమును వెల్లడిచేయురీతిని దెనిఁగించవలెనని యాతని యభిప్రాయము. అనంతరంబు నీతనికి శ్రీ మహాభారతంఁబునందలి యభిప్రాయంబు విన నభిలాష పెద్దదై

యుండుటకు మఱొక కారణము కూడ కలదు. అది యిది. "హిమకరుఁదొట్టి పూరు భరతేశ కురుప్రభు పాండుభూపతుల్ క్రమమున వంశకర్తలనఁగా మహినొప్పిన తదీయవంశమునఁ బ్రసిద్ధులై విమల సద్గుణ శోభితులైన పాండవోత్తముల చరిత్ర" యది. కావున నది యాతనికి సతతంబు వినంగ నభీష్టము. అట్టివాని యభీష్టమును దీర్చుటకే సర్వవేదశాస్త్రముల యశేషసారమే యనఁదగి, విశ్వ జనీనమై పరఁగు భారతమును "సత్సభాంతర సరసీవనంబులను ముదంబునం గొనియాడి" నారాయణ భట్టు సహాయమునుగొని యందలి పండితుల యనుమతినిఁ గూడఁ బడసియే, నన్నయ భట్టారకుఁడు 'తెనుగునన్ మహాభారత సంహితారచన బంధురుఁడైనాఁడు'. అట్టి మహనీయుని మహారచన యాంధ్ర జగద్ధితంబు "గాక పోవునా!" నర నారాయణు లిద్దఱు గలిసి సాధించిన భారతాంధ్రీకరణోద్యమము జగద్ధితము కాకుండుటెట్లు? అయితే యవితథమగు నీ లోకస్థితి యొక నరనారాయణుల చేరిక చేతనేగాక వేదత్రయ మూర్తులగు త్రిపురుషులచేతను సాధింపఁబడఁదగినదై యున్నది.

ఆంధ్రజాతి తొలినుండి యవలంబించిన వైదికమతము చాలవఱకుఁ గ్రతు నిర్వహణము, పంచాయతనాదిపూజ, యద్వైతభావ తత్పరత, వీనితోఁ గూడినదే గాని ప్రత్యేక శైవ వైష్ణవాగమాది పరతంత్రతతోఁ గూడినది కాదు. కావున వైష్ణవ మతవ్యాప్తికి, దేవాలయోత్సవాడంబరమునకు, వైష్ణవ భక్తికి దక్షిణదేశ మాటపట్టయినట్లే, శైవాభిమానాతి రేకమునకుఁ గన్నడ దేశము ముఖ్యస్థాన మయినది. ఆయా మతప్రవాహము లాయా దేశములలోఁ బొంగి పొరలినప్పుడా పొంగు మాత్రమే తెలుఁగు దేశముపైఁ గొంత పాటినదిగాని, వాని కిచ్చట స్థిరత్వమెప్పుడుఁ గుదరలేదు. ఆదినుండియు నాంధ్రులకు మూర్తిత్రయ విషయమున భేదభావముగాని యొకరికంటె నొకరు హెచ్చుతగ్గను భావముగాని యెప్పుడును లేదు. కావుననే నన్నయ వేదత్రయ మూర్తులను భారతాదిని స్తుతించి పూజింపఁగా, గొంత కాలమునకు శైవ వైష్ణవములలో వీరత్వము నవైదికత్వ చిహ్నములు పెరిగి భేదభావము హెచ్చుగుచున్న సమయమునఁ గవిబ్రహ్మయగు తిక్కనార్యుఁడు పర బ్రహ్మస్థాన మాక్రమించి, యీవైదిక మతమందు శివవిష్ణు భేదమునకుఁ దావులేదు లేదని సూచించుచునే యాంధ్రభక్తజనావళి యెల్లపుడు 'విష్ణురూపాయ నమశ్శివాయ' యని పల్కుచుఁ దన్నుఁ గొల్చుచుండ హరిహర రూపముఁ దాల్చిన యా పరతత్త్వ మెల్లపుడు వారి కభీష్టసిద్ధి గావించుచుండునని విరాట పర్వాది నుద్ఘోషించినాఁడు. ఈ విధముగా వైదిక మతాభినివేశము గలిగిన యాంధ్రజాతి జీవితపథ మవైదిక శైవవైష్ణవ మార్గములఁ బడకుండ, నద్వైత భావనిరూఢి మార్గముననే గలసి

వర్తించున ట్లుద్బోధించుచు, వైదిక మార్గమున ధర్మాద్వైతమే యాంధ్రుల జీవిత పద్ధతి యగునట్లుగాఁ దన భారత రచన మూలముగాఁ దీర్చి ధ్రువము గావించినాఁడు కవిబ్రహ్మయగు తిక్కనార్యుఁడు.

తాను తీర్చిదిద్దుటే కాదు. అసలు తొలుత భారతము రచించిన కృష్ణద్వైపాయనుని పరమోద్దేశము కూడ నదే యన్న ట్లీ విధముగాఁ జాటుచున్నాఁడు చూడుఁడు.

"విద్వత్సంస్తవనీయ భవ్యకవితావేశుండు విజ్ఞాన సం
పద్విఖ్యాతుఁడు. సంయమిప్రకర సంభావ్యానుభావుండు కృ
ష్ణద్వైపాయనుఁ డర్థి లోకహిత నిష్ఠంబూని కావించె ధ
ర్మాద్వైతంబగు భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయమున్."

భారతము ధర్మాద్వైతమును బోధించుట యనఁగా నేమో తిక్కనయే వివరించినాఁడు.

"వేదములకు నఖిలస్మృతి వాదములకు బహుపురాణ వర్గంబులకున్, వాదైనచోటులను దా మూదల ధర్మార్థకామమోక్ష స్థితికిన్", అని.

ఇట్టి ధర్మాద్వైతముతోఁబాటు హరిహరాభేదరూపాద్వైత భావమును వ్యక్త పఱచి యా హరిహర రూపమగు దైవ మా యిద్దఱికంటె నతీతుఁడగు పరతత్త్వమే పరమేశ్వరుఁడేయని, నన్నయవలెనే తానును భారతమును సంహితాదృష్టితోడనే తెనిఁగించుచున్నానని, దీనివలనఁ దన జన్మ కృతార్థత్వమును బొందిన దని తెల్పినాఁడు.

ఇట్టి వరంబుఁగాంచి "పరమేశ్వరునిం గృతి నాథుఁజేసి యే పట్టునఁ బూజ్య మూర్తియగు భారత సంహితఁ జెప్పఁగంటి నా పుట్టు కృతార్థతం బొరసెఁ బుణ్యా చరిత్రుఁడనైతి."

"ఆంధ్రావళి మోదముం బొరయునట్లుగ మహాకవిత్వ దీక్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్."

అని తన నిశ్చయమును వెల్లడించినాఁడు.

ఇట్లాంధ్రజాతి జీవితపథమును భారత రచన మూలముగా ధర్మాద్వైత మార్గమునఁ దిద్దఁగలిగిన పరమ వైదికుఁడు. పరమ ధార్మికుఁడునగు మహనీయుఁ డాంధ్రజాతిలో లభించుటచే నన్నయ తరువాత రెండువందల సంవత్సరముల

కాలము పట్టిన దంటే యాశ్చర్య మేమున్నది. ఆంధ్రరాజుల కాలమునుండియు నీ దేశమునఁ బెంపొందుచు వచ్చుచుండిన యాంధ్రజాతీయ జీవిత లక్షణములు నన్నయ తిక్కన భారత రచన మూలముగా నాంధ్రవాఙ్మయమునఁ బ్రతిబింబించి స్థిరపడినవి. కావుననే దండి మహాకవి చెప్పినరీతిగా, మనము నిట్లు చెప్పుకొనవచ్చును గదా! "రాజరాజ యశోబింబ మాదర్శం ప్రాప్య వాఙ్మయం తస్యాసన్నిధానేపి న స్వయం పశ్య నశ్యతి" అని. తరువాతి కావ్య ప్రబంధాది శిష్టవాఙ్మయమున కంతకు నీ భారతమే యాదర్శగ్రంథమైనది. భారతకవులే యాదర్శపురుషులు మూలపురుషులయినారు. ధర్మాద్వైత పరమైన వైదికమత ప్రతిపత్తిగల యాంధ్ర జీవితమే తరువాతి తెలుఁగు సాహిత్యమునఁ జాల వఱకుఁ బ్రతిపాద్య వస్తువుకూడ నగుట తటస్థించినది.

తిక్కనార్యుఁడు - ఆతని మనఃపరిపాకము

అయితే భారతజాతీయ పథమును దిద్దగలిగిన భారత రచనా కాలమునాటి యీ తిక్కన యంతకుఁ బూర్వము నిర్వచనోత్తర రామాయణము రచించిన కాలము నాటి తిక్కనకాఁడు. ఈతనికి నాతనికి మనః పరిపాకమున విశేషభేద మగుపడుచున్నది. వానియందలి యాతని యవతారికలను బట్టియే యాతని మన స్తత్త్వమును మనము కనిపెట్టవచ్చును. యజ్ఞముచేసి పవిత్రుఁడయిన వెనుకఁ గదా మహాకవిత్వ దీక్షావిధి నొంది భారత రచన కాతఁడు పూనుకొన్నది. భక్తజనంబు వైదిక ధ్యాయితకిచ్చు మెచ్చు పరతత్త్వమునుగదా యతఁడు కొలిచినది. సకలబ్రహ్మ ప్రార్థనంబుగదా యతఁడుచేసినది. కవితా సృష్టినిఁ దలపెట్టినవాఁడు గనుకనే కళాసహిత బ్రహ్మ ప్రార్థనంబుఁజేసినాఁడు. సిరిగౌరి కలిసి యొకటే చెల్వకాఁగానా చెల్వచిత్తము పల్లవింపఁజేయుటకు హరిహర రూపముఁ దాల్చినాఁడా పరతత్త్వము సకలబ్రహ్మ ప్రార్థనమువలన నాతనికి కలిగిన ఫలమేమో గమనించితిరా? అతఁ డిట్లు చెప్పినాఁడు వినుఁడు. కవిత్వ తత్త్వనిరతిశయానుభావానంద భరితాంతః కరణుఁడైనాఁడఁట! ఎంత పెద్ద సమాసము!! ఈ సుదీర్ఘ సమాసము మూలముగా నాతఁడెట్టి మహనీయము గంభీరము నగు భావమును వ్యక్తపఱుపఁదలఁచినాఁడో, యాతని యనుభవ పరిపాకము, హృదయ వికాస మెట్టి యున్నతస్థాయి నందినవో యను విషయములు మనము ముఖ్యముగా గమనింపఁదగియున్నవి. కవిత్వ తత్త్వము, దానియొక్క నిరతిశయానుభావము, దానివలనఁ గలిగిన యానందము, తద్భరితాంతఃకరణము.

ఉత్తర రామాయణ రచనా కాలమున కీతని కీ చిత్త పరిపాక మింకను గుదిరి నట్టులేదు. దాని నీతఁడు నన్నయ్యవలెనె తన ప్రభువున కొక మానవ మాత్రునకే

యంకితము చేసినాఁడు. అతని కొతఁడు కులబ్రాహ్మణుఁడు. ఇక్కడ మామ యల్లుఁడు వరుస. ఆయనను జూచియే యీయనయు సంస్కృతశ్లోక రచనతో మొదలు పెట్టినాఁడు. ఆయనవలెనే యీయనయు హరిహరపద్మగర్భులను స్తుతింపగా నీతఁడు "కవితా విలాస విస్తర మహనీయుఁడయినాఁడట." అనఁగా నా మూర్తి త్రయ రూపముల వలెనే యీతని నప్పటి కాకర్షించిన కవితా సతియొక్క విలాసములు మట్టుకే యన్నమాట. "కవిత్వతత్త్వ నిరతిశయానుభావుఁడు" కాలేదు. తరువాత వీరియందభేదబుద్ధితోఁబుట్టు, కవిత్వతత్త్వ స్వరూపమునుగూడ గోచరించినది. ఆ కవితా విలాసములకు లొంగినవాఁడు గనుకనే గాఁబోలు తానంతటి వాఁడు నింతటివాఁడు నని, కవిత్వ మిలా చెప్పవలె, నలా చెప్పవలెనని నిర్ణయించుచుఁ గొంత ప్రగల్భమును జాటుకొన్నాఁడు కుకవి నిందను గావించినాఁడు. చూడుఁడు;

"అమలోదాత్త మనీష నేనుభయ కావ్య ప్రౌఢి పాటించు శిల్పమునన్ బార గుఁడన్, కళావిదుఁడ. మహేశ్వరాంఘ్రిపద్మైక ధ్యానశీలుండ" అని చెప్పుకున్నాఁడు. ఈ విషయము లాతని యెడ నెంతయు వాస్తవములే. సత్యసమ్మతములే. అయినా భారతమునం దీతఁడు సంపాదించుకొనిన వినయసంపత్తితోఁ బోల్చినపుడే యివి ప్రగల్భము లనిపించునుగాని, వాస్తవముగాఁగానేకావు. ఇంకా "తెలుఁగు కవిత్వము చెప్పఁదలఁచిన కవి యెట్లు చేయవలయునో, పలుకుల పొందు లేక రసభంగము చేయుచుఁ జెప్పు కుకవులు దుర్నీతు లెట్లగుదురో, నిరూపించి, యింకఁ దానో జాత్యముగామి నొప్పయిన సంస్కృత మెయ్యెడఁ జొనుపడఁట: గద్యము తోడుతఁ బద్యమును జెప్పి పెట్టఁడఁట: నిర్వచన కావ్యరచనపై నీతని కింత మోహ మప్పటి కెట్లు కలిగినదో యూహింపరాదు. ఇదంతా కవితా విలాసములకుఁ జిక్కి చిత్తపరిపాకము కుదురని కాలపు రచనగాఁ గనఁబడకపోదు. భారత రచనా కాలమునఁ, గవిత్వ తత్త్వమే బోధ పడిన తరువాత నీ నిబంధనల నన్నిటిని దాటి పోయినాఁడు. ఆత్మశ్లాఘాపరములగు మాటలను మానివేసినాఁడు. ఇఁక మహాకవి లక్షణములను జెప్పఁదలచినపుడు తనపై వేసికొనక కృష్ణద్వైపాయన పరముగాఁ జేసి వర్ణించినాఁడు. అతఁడు 'విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశము కలవాఁడఁట! విజ్ఞాన సంపద్విఖ్యాతుఁడఁట. సంయమిప్రకరముచేతనే సంభావ్యమయిన యనుభావము కలవాఁడఁట. అతఁడు అర్థిలోకహితనిష్ఠఁ బూని లేఖ్యంబయిన యామ్నాయమును" భారతము చేస్తే తాను 'నాంధ్రావళి మోదముంబొరయ' మహాకవిత్వ దీక్షావిధినిఁ బొంది గద్యములఁ బద్యముల రచియింపఁ బూనినాఁడు. "భారత సంహితఁ జెప్పఁగంటి. నా పుట్టు కృతార్థతం

బొరసె వరణీయుఁడ నయ్యెద భక్త కోటికిన్” బాల స్వభావుఁడ-ఇత్యాది పలుకు లెంతగ నాతని వినమ్రభావమును హరిహరనాథ భక్తిని వ్యక్తము చేయుచున్నవో చూడుఁడు. ఈ వినమ్రభావము చేతనే మన హృదయ పీఠములందున్నత స్థాన మాక్రమింపఁ గలుగుచున్నాడు. ఇంతే కాదు. అతఁడు యజ్ఞముచేసి మహాకవిత్వ దీక్షావిధి నొంది భారత రచనను జేపట్టినట్లే తాను దలపెట్టిన యా మహాకార్య గౌరవమును మన కెఱుక పఱచుటకో యన్నట్లు, స్వప్నవృత్తాంతము మూలముగా మనలనుగూడ నొక లోకాంతరమునకుఁ దీసికొనిపోయి, హరిహరనాథావతరణ దృశ్యము నొక దానిని ప్రదర్శించి, ప్రశాంతము, పవిత్రమునగు వాతావరణమున మనలను దింపినాఁడు. దీని మూలముగాఁ దిక్కనార్యుని యాభిజాత్యము, భేదములేని భక్తి, వినయ సౌశీల్యాదులతోఁ గూడిన హృదయ పరిపాకము, జన్మాంతర దుఃఖములను బాసి, బ్రహ్మానంద స్థితినిఁ బొందవలయునను లాలస, వైదిక సంపత్తి మొదలగు నసాధారణ గుణము లనేకములీ దృశ్యము మూలముగా మనకు వ్యక్తము చేయఁగలిగినాఁడు. రెండువందల సంవత్సరముల క్రితము నన్నయ తెలుఁగు భారత రచన ప్రారంభించినప్పటి కంటెను, నానాఁడు తిక్కనార్యుఁడు పూర్తిచేయవలసినవాఁడై దానిని మరల చేపట్టిన సందర్భమును బట్టి తిక్కన యొక్కయేగాక యా భారతము యొక్కయు మహత్త్వ గౌరవములు విశేషముగాఁ బెంపుగాంచినవని చెప్పవలసియున్నది. ఏమనఁగా సామాన్య మానవునకు వినిపించు నుద్దేశముతో మొదలు పెట్టఁబడిన యాంధ్ర భారత రచనకు దైవవశముననే మధ్య భంగము వాటిల్లుట. దానినిఁ దిక్కన చేపట్టుట, పరమేశ్వరుఁడే హరిహరనాథ రూపమున దాని కృతిపతిత్వమర్థించి వచ్చుట. యీ విధముగా నీపదేనుపర్వములు పుణ్యప్రబంధము లగుట, వానిని దేవసన్నిధినిఁ బ్రశంసించుటం జేసి యిది యంతయు నొక యారాధన విశేషంబగుటయును నీ విషయము లన్నియు నీ భారత రచనా సన్నివేశము కొక యపూర్వ మహత్త్వము నాపాదించుటకాదా? నన్నయకుఁ గల విశేష గుణములను నవిరళ జపహోమతత్పరత్వాదులను రాజరాజు వర్ణించి చెప్పినాఁడు. తిక్కనార్యుని మహనీయతను బరమేశ్వరుఁడగు హరిహరనాథుఁడే యెట్లు ప్రశంసించినాఁడో చూడుఁడు!

> "వైదికమార్గ నిష్ఠమగు వర్తనముం దగ నిర్వహించుచున్
> భేదములేని భక్తి మతి నిర్మల వృత్తిగఁ జేయుచుండ మ
> త్పాద నిరంతర స్మరణ తత్పరభావము కల్మి నాత్మ స
> మ్మోదముఁ బొందఁగావ్యరసముం గొనియాడుచు నుండుదెప్పుడున్."

వెనుక "కవితా విలాస విస్తర మహనీయుఁ"డై యుండిన తిక్కన భారత

రచనా కాలమున 'కావ్యరసముం గొనియాడుచున్న' వాఁడైనాడు. కావుననే యాతఁడు కావ్యాదినే "కవిత్వతత్త్వ నిరతిశయానుభవానందభరితాంతఃకరుణుఁడ" వైయని చెప్పి యాతని హృదయ పరిపాకమును మనకు సూచించినాఁడు.

అట్టి యపూర్వ సన్నివేశమున నాతఁడు చూపిన వినయ విధేయతలు, చిత్తౌన్నత్యము, భావపరిపాకము, రచనా గాంభీర్యము నన్యసామాన్యములు. అట్టి పరమేశ్వరుఁ గోరుటఁ గన బాల స్వభావమును గుర్తించి, తా నడుగఁదగునో లేదో యని శంకించి, కొమ్మనామాత్యు నాననం బాలోకించి, యతని యనుమతిఁ బడసి, యుపలాలితుండగు డింభుండు తన కొలఁది యెఱుంగక మహాపదార్థంబు నేడు విధంబున బ్రహ్మానంద స్థితినే గోరినాఁడఁట. ఆ సన్నివేశము నంతను నెంత వ్యక్తముగా మనోగోచరంబగునట్లు చిత్రించినాఁడో గమనింపుఁడు. ఆ కోరుటలో నెంత వినయమో.

"ఇంతకు నేర్చు నీకు నొక యింతటిలోన మదీయవాణి న
త్యంత విభూతిఁ బెంపెసఁగునట్టి నినుం గొనియాడచేఁత దా
నెంతయు పెద్ద? నీ కరుణ నిట్లు పదస్థుఁడ నైతి నింక జ
న్మాంతర దుఃఖముల్ దొలఁగునట్లుగఁ జేసి సుఖాత్ముఁ జేయవే."

అని సర్వాంగాలింగిత మహీతలంబగు నమస్కారంబు చేయఁగా నా జగన్నాథుడు "జనన మరణాదులైన సంసార దుఃఖములకు నగపడకుండ నిమ్మనను దెరువుగను వెలుంగు నీకిచ్చితి" నన్నాఁడు.

ఇంక నతనికిఁ గావలసిన దేమున్నది? అంత మేలు కాంచిన తిక్కన చిత్త వృత్తి యెట్లుండునో యతఁడే వర్ణించి చూపినాఁడు. మనస్తత్త్వమును జిత్రించి చూపఁగల మహాశిల్పిగదా యతఁడు! 'ఎలమి నచ్చెరువును సరియొలసి పొదల మనసమున నెంతయుఁ బ్రొద్దు గలలోఁగన్న చందముఁ దలచుచునుండితి సభక్తి తాత్పర్యమునన్. ఎంత చక్కఁగా విప్పి చెప్పినాఁడో చూడుఁడు.

ఇట్లు పరమేశ్వరునిం గృతినాథుఁజేసి భారతఁ సంహితఁ జెప్పఁగనుటచే నాతని పుట్టు కృతార్థతం బొరసె. పుణ్యచరిత్రుఁడయినాఁడు. కావునఁ దాను నేర్చిన భంగిఁజెప్పి "వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్' అని సభక్తి తాత్పర్యములతో నాపుణ్య ప్రబంధములను దేవసన్నిధినిఁ బ్రశంసింపఁగా నదియొక యారాధన విశేషం బయినది. షష్ఠ్యంతస్తోత్రనామములతో నా పరమేశ్వరునకు విన్నపంబు సేయుచు నా మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేయఁదొడంగినాఁడు. అనఁ

గా నన్నపార్యుఁడు రాజనరేంద్రుని యాజ్ఞపై 'మహాభారత బద్ధ నిరూపితార్థ మేర్పడ' రచియించినట్లే తిక్కనార్యుఁడును 'ఆ మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సేయఁ దొడంగినాఁడు. అనఁగా నివి translations కావన్న మాట వ్యక్తము చేసినాఁడు. ఇద్దఱికినీ మహాభారత మీ పారాశర్యుని కృతి పంచమవేదమే, ఇద్దఱు దీనిని సంహితా దృష్టితోనే తెలిఁగింపఁ దొడఁగినారు. ఇట్లు వీరిద్దఱు సమానముగనే కల్పించిన వైదిక వాతావరణమునకుఁ దిక్కనార్యుఁడొక యపూర్వ పావనత్వము, రసోన్నతి, ధర్మాద్వైత వృత్తి, కళాసౌందర్యము నాపాదించి, యాంధ్ర భారత రచన నాంధ్రజనుల జీవిత తత్త్వముతో సమ్మేళనము నొందించినవాఁడై నాఁడు.

తిక్కన - విరాటపర్వము

శ్రీకృష్ణద్వైపాయనుఁడర్థి లోకహితనిష్ఠంబూని కావించిన భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయము. ఆదరణీయసారవివిధార్థగతి స్ఫురణంబుగల్గియష్టాదశ పర్వనిర్వహణమై పెనుపొందియుండ, నందాది దొడంగి మూఁడు కృతు లాంధ్ర కవిత్వ విశారదుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్" అని తిక్కనార్యుఁ డెప్పుడు చెప్పినాఁడో యప్పుడే తిక్కనార్యుఁడు వాని జోలికిఁ బోదలంపలేదని, భావికాలములో మఱి యెవ్వరు దానినిఁ జేపట్టినా యది నన్నయ పేరను బూర్తి కావలసినదే గాని మఱొకటి కాదని, తిక్కనార్యుఁడే స్పష్టము చేసినాఁడా యన్నట్లు స్ఫురించుచున్నది. ఈ తిక్కన రచనను జూచిన యెఱ్ఱాప్రగడ దాని యంతరార్థ మిది యని గ్రహించియే తానును దద్రచనయకా నారణ్య పర్వశేషమును బూరించి నాఁడేమో అనిపించుచున్నది. మొత్తము మీఁద నన్నయ యే ముహూర్తమున నాంధ్రమున శిష్టకవితా రచన ప్రారంభించినాఁడోగాని, యీ తొలి రచన యగు భారతమువలెనే, తెలుఁగులోని యుద్గ్రంథములగు రామాయణ భాగవతములు కూడా యతుకులతుకులుగాఁ బలువురు కవులచేఁ బూరింపఁబడవలసి నవే యయినవి. ఏమైనను బదేను పర్వములు తుదిముట్టన్ రచియించి యా పరతత్త్వమునకు హరిహరనాథునకు నంకిత మివ్వదలఁచుకొన్న కవిబ్రహ్మ మానవ నాథున కంకితముగా రచింపఁబడిన పర్వములోని కథాభాగముతోఁ దన రచన ప్రారంభించునా?

కావునే 'హృదయాహ్లాది చతుర్థ మూర్జిత కథోపేతంబు నానారసాభ్యుద యోల్లాసి' యగు విరాట పర్వముతో దన రచనను బ్రారంభించినాఁడు.

చతుర్థంబగు నీ విరాట పర్వమున కీతఁడు తొలుతనే యీ పద్యములోఁ బొదిగిన విశేషములు మూఁడును మూఁడు రత్నముల వంటివి.

మొదటిది 'హృదయాహ్లాది' ఈ విరాటపర్వ కథ వెనుకటి యరణ్యవాస కథవలెఁ బాండవులు పదమూఁడేం డ్లరణ్యమునఁ బడినట్టి బాధలతోను గష్టములఁతోను గూడుకొన్నదికాదు. ఇది యజ్ఞాత వాసమైనను నింక నొక్క సంవత్సరమే. దీనికి భంగము కలుగకుండ దాఁటివేయఁ గలరను నమ్మకము కూడా వారికి ధర్మదేవత యిచ్చిన వరమువలనఁ గొంత గలిగినది. అర్జుననకుఁ గలిగిన యూర్వశీ శాపరూపమున నీ యజ్ఞాత వాసమునకు వలయు సన్నాహ మింతకుఁ బూర్వమే కొంత యేర్పడినదిగదా! ఆత్మగౌరవమునకు భంగములేని రీతిని, నింతకుఁ బూర్వము పాండవుల యొద్ద వారి కొలువులో నుండెడు వారమని చెప్పుకొంటూ విరటుని కొల్వులో నాతని ప్రాపున నుండి, సమయము వచ్చినపుడు తమ ప్రజ్ఞాదికమును జూపుటకును, బయట మెఱయుటకునుఁ దగు నవకాశమును గల్పించినదై తుదకు మంగళాంతము గూడ నగుటచే, నిందలి కథయంతయు నీ పర్వమును "హృదయాహ్లాది" యగుననుటకు సందేహ మేమున్నది? అజ్ఞాత కాలమునఁ దమ స్నేహితులకు శత్రువులకుఁ గూడా నజ్ఞాతులై యుండి స్నేహితుల పక్షమునఁ దమకు శత్రువులయిన వారితోనే యుద్ధము చేసి తమ బాహుపరాక్రమములను బ్రకటించి శత్రువుల నుక్కడఁగించి పరాభవించుటకుఁ దగిన యవకాశము లభించుట, తన్మూలముగా నాయజ్ఞాతవాస సమయమును గూడా నిర్వర్తించి, బయలువడుటను దెల్పుకథ హృదయాహ్లాదకరముకాదా? ఊర్జిత కథోపేత మయినది కాదా? ఊర్జిత కథోపేత మనుటలో మఱియొక విశేషముకూడ నున్నది. ఇందలి కథ కొక విధమగు నపూర్వబలము (Excellence) రామణీయకత గూడ నున్నదన వచ్చును. ఎట్లందురా? మొత్తము భారతకథ కంతకు నిదియొక యాయువు పట్టు వంటిది.

ద్రౌపదీ సహితులగు పాండవు లీ యజ్ఞాతవాస సమయమును దాఁటలేరను నిశ్చయముతోడనే గదా దుర్యోధనుఁ డిద్దానిని నియమించినది. ఒకసారి బయలు పడినచో మరల నా సమయము మొదటికి వచ్చునుగదా! అదే దుర్యోధనుని యాశ. అట్టి సమయమును నిర్వర్తింపఁ గలిగిన పాండవుల నింక నడ్డువారుండరు. కావుననే యిది చాల సంకటమయిన కాలము. రెండు పక్షములకు దీని పైననే యాశ-దృష్టి, ఇంతే గాక యిందలి కథయంతయు వెనుక జరిగిన గాథలను మరలఁ దలఁపించుచు, ముందు జరుగఁబోవు కథాంశములకు సూచకముగా నున్నట్లగుపడుచున్నది. పూర్వాపరములగు భారతకథాంశములను సూచించు నొక సంధిపర్వముగా నొక కొలికిగా దీనిని గ్రహింప వచ్చును. పాండవ ప్రవేశ పర్వములో మొదటఁ బాండవులను గూర్చి మన కెఱుక పఱచుటకు వారినిఁ దాను భావించిన రీతి నెఱిఁగించుటకు మంచి యవకాశము దొరికినది తిక్కనకు.

విరాటుని కొల్వులోఁ బాండవులు ప్రవేశించు సందర్భమును బురస్కరించుకొని, మొదట నవతార పర్వములోవలెనే యా పాండవుల సహజ లక్షణాలు, ప్రత్యేక స్వభావరీతులు, కార్యశక్తులు మొదలగు వానిని వ్యక్తపఱచి, మూలమునందలి యాయా పాత్రల కొక విధమగు (New colour) నూతన చైతన్యమును గల్పించి, పాఁత పాత్రలేయైనను నొక విధమగు క్రొత్తరంగులతో స్ఫుటముగా సహజ గుణములతో, గనఁబడువారినిగాఁ జేసి మనదృష్టి పథమున నిలిపినాఁడు తిక్కన. కాఁబట్టే యతఁడన్నాఁడు. కథ జగత్ప్రసిద్ధమైనదే గావున, పూర్వపర్వార్థ యుక్తిచేయు నెడల యత్నమక్కఱలేదు. ముందర కథను వలసినట్లు చెప్పవచ్చి యుండును. అనఁగా యుక్తియుక్తముగా రంజకముగా నుండున్నట్లు, సందర్భానుకూలముగాఁ దగినట్లు నడుపుకుంటూ వెడతానని చెప్పిఁనాడు. కథాభాగములో మార్పులు చేయఁడుగాని, యా కథను నడుపుటలోఁ గథా పాత్రలను బ్రదర్శించడంలో మాత్రము తన ప్రతిభను జూపుచుఁ జెప్పవలసిన రీతిని చెపుతానన్నాఁడు. ఒక్క విషయం చూడండి-విరటుని కొల్వులో భీముఁడు జెట్టిమల్లుతో విలాసముగాఁ బోరుచు శంకరోత్సవముల నాఁడు నా పట్టణములలోఁ జేరిన మల్లులతో నొకఁడు నేల నాలుగు చెఱగులలోను దనతోసాటివాఁడెక్కడను లేఁడని విఱ్ఱవీగుతూ చెప్పు కొనఁగా, నామల్లునితో విరాటుని యాజ్ఞపైన భీముఁడు పోరెనని, యా పోరాటముతో రెండు చేతులతోను వానినిఁ బైకెత్తి, గిరగిరఁ ద్రిప్పి, ముక్కు నోట నెత్తురు కాఱునట్టుగాఁ జేసి వానినిఁ జంపివేసినాఁడని మూలములో నున్నది. కాని తిక్కన దీని నంతను నొక మల్లయుద్ధ ప్రదర్శనముగాఁ జేసి, యాకుస్తీ పట్టులను జక్కఁగా వర్ణించి చూపి, తుదకు వానినిఁగ్రిందఁబడవేసి యోడింపఁగా సభ వారందఱు నార్చిరనియు, నప్పుడు భీముఁడు వానిని వదలివేసినట్లును జెప్పినాఁడు తిక్కన. ఇది యొక విధముగా వెనుకటి కుమారాస్త్రవిద్యాసందర్భమును దలఁ పించును వెంటనే జరుగఁబోవు కీచక వధకుఁ బూర్వరంగమై, తరువాత కాలమున సంభవమగు దుశ్శాసన దుర్యోధనాదుల వధను సూచించినదివలె నున్నది,

కీచకకృత ద్రౌపదీ పరాభవము దానిని కీచకవధ మూలముగా భీముఁడు తొలఁగించుట యనునది. ఒక వైపున వెనుకటి కౌరవ సభలోని ద్రౌపదీ పరాభవమును, మఱియొకవైపున నా సభలో నీతఁడు చేసిన ప్రతిజ్ఞలను నిర్వహించి ముందు ద్రౌపదీవేణీసంహారమును సాధింపగలుగుటకు సూచించుచున్నదనవచ్చును. పాండవులను బయలు పఱచి భంగపుచ్చుటకై చేయఁబడిన గోగ్రహణ తంత్రము వెనుక జరుపఁబడిన లాక్షాగృహ దహనాది తంత్రములను స్మరింపఁ జేయుచు, దాని నుండి వలెనే దీని నుండియు వీరు బయలుపడుటను, భీమార్జునుల

యసమాన పరాక్రమము నటు సుశర్మపైని, నిటు దుర్యోధనాది వీరులపైని వీరికిఁ గలిగిన విజయము మూలముగా, భావిభారత యుద్ధము నందు వీరికిఁ గలుగు విజయమును సూచించున దనవచ్చును.

కౌరవ సభకు జూదమాడుటకుఁ బిలువఁబడి, కాదనలేక వెళ్ళి యాడి రాజ్యము సర్వమును గోలుపోయిన ధర్మజుఁడు, మరల విరటుని కొలువులోఁగూడ నాతనిచే నాహూతుఁడై, సంకోచించుచునే యాతనితో జూదమాడ మొదలు పెట్టి యాతని చేతనే దెబ్బతిన్నవాఁడయినాఁడు. రాజ్యముఁ గోలుపోయి సమయ ప్రతిపాలనమున, భీమాదులయొక్క, ద్రౌపదియొక్క తొందరమాటలకు లొంగిపోక సహనముతోఁ ద్రోసికొని వచ్చుచున్నట్లే. విరాటుని కొలువులోఁ గూడ నత్యంత సహనంతో విరటుని కుపద్రవము కలుగకుండుటకుగాను దమ్ముల కా విషయము తెలియకుండ రక్తబిందువు భూమిపైఁ బడకుండ నంతను గప్పిపుచ్చి, యా విషయ సందర్భము నెంతయు సామర్థ్యముతో మెలఁకువతో నిర్వహించినాఁడు. వెంటనే యుత్తరుఁడు వచ్చి తండ్రిని మందలించుట, మఱునాఁడుదయముననే భీమార్జును లాతని విరటుని సింహాసన మెక్కించుట యనునది-భారత యుద్ధానంతర మాతఁడు మరల సింహాసన మెక్కఁగలుగుటకు సూచనగా గ్రహింపవచ్చును. పిదప వివాహము సర్వమంగళ సూచకము. ఈ యుత్తరా వివాహము విశేష ప్రాధాన్యము గలది. ఏమనఁగా భారత యుద్ధమైన తరువాత. భరత వంశమునకు బీజాంకుర మీ యుత్తరాగర్భమే కావలసి యున్నది గదా! అందుకనే తిక్కనార్యుఁడీ వివాహము నత్యంత వైభవో పేతముగా జరిగినట్లు వర్ణించినాఁడు. ఇన్ని విధములుగాఁ బ్రాధాన్యము వహించుటచే విరాటపర్వము 'హృదయాహ్లాది-ఊర్జిత కథోపేతము' అని తిక్కన వర్ణించినాఁ డంటే యాశ్చర్య మేమున్నది!

ఈ యుత్తరా వివాహ సందర్భమున మఱియొక విశేషము కలదు. మూలములో నీ వివాహ మొకటి రెండు శ్లోకములలోనే ముగిసినది. కాని తిక్కనార్యుఁడు దీని నత్యంత వైభవోపేతముగ జరిపించి, యుత్తమ శృంగార రసావిర్భావమునకు మూలమగునట్లుగను, నచ్చ తెలుఁగు దేశీయ సంప్రదాయానురోధంబుగ జరిగినట్లును వర్ణించినాఁడు. ఈ విషయము తరువాతఁ బరిశీలింతము.

విరాట పర్వమునుగూర్చి తిక్కన వాడిన మఱియొక విశేషణము 'నానా రసాభ్యుదయోల్లాసిత్వము'. ఈ విరాటపర్వకథ యనేక విధములగు సన్నివేశములకు, సంఘటనలకుఁ దావగుటచేత 'నానారసాభ్యుదయోల్లాసి' యగుటకును నవకాశము లేకపోలేదు. ఉత్తర వివాహ సందర్భములో వధూవరుల పరస్పరావలోకనములు.

హోమ సమయ కృత్యముల సంస్పర్శభంగులు మొదలగు వానిని వర్ణనము మూలముగాఁ బోషించినాఁడు. తిక్కనార్యుఁడు చక్కని లలిత శృంగారమును గీచకునికి ద్రౌపది విషయమునఁ గలిగిన యనురాగ విరహవర్ణనా సందర్భమున శృంగారాభాసమును, నుత్తర కుమారుఁడు ప్రజ్ఞలను బలికి కౌరవ సేనను జూచి పారిపోవు సందర్భమున హాస్యరసమును, గోగ్రహణ సంధర్భములందు భీమార్జునుల పరాక్రమ వర్ణనము మూలముగా వీరము, కీచకవధ సందర్భమున బీభత్సము, ద్రౌపదిని విరటు కొల్వునఁ గీచకుఁడు పరాభవించుటను జూచినప్పుడు భీమునికిఁ గల్గిన కోపమును వర్ణించునప్పుడు రౌద్రమును, సందర్భానుసారముగా నాయా రసముల నొప్పించుట కవకాశము కల్పించుటచే నీ పర్వము 'నానారసాభ్యుదయోల్లాసి' యని చెప్పుటలో నాశ్చర్యము లేదు.

తిక్కనార్యుని కావ్యకళా చాతుర్యము

తిక్కనార్యుఁడు సహజముగఁ గళావేత్తయని, రచనా విషయమున నీతనిది శిల్పదృష్టియని యిదివఱకే గమనించి యున్నాము. ఉత్తర రామాయణమున నీతఁడు 'అమలోదాత్తమనీష నేనుభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునన్ బారగుడన్' అని చెప్పుకొనియే యున్నాఁడు గదా! ఈతని ప్రతిభ యమలము-ఉదాత్తమను విషయ మాతఁ డుత్తరరామాయణ కథను నిర్వహించిన రీతినిఁ బట్టియే తెలియుచున్నది. ఉత్తరరామాయణ కాలముననే యాత్మప్రజ్ఞా విషయమున నంత ధృఢ నిశ్చయముగల యాతని హృదయ పరిపాకము, చిత్తవృత్తి, కళాభిజ్ఞత భారత రచనా కాలమున కింకను బరిణత రూపము నొంది యెట్టి మహత్త్వమును సంపాదించుకున్నవో భారతావతారికనుబట్టి మనము కొంత గ్రహించియే యున్నాము, గదా!

భారత సంహితను దెనిగించుటలో నన్నపార్యుని ప్రధాన దృష్టి 'అక్షర రమ్యత' కథాకలితార్థయుక్తి' యనువానిపైఁ గేంద్రీకృతమైనట్లు తిక్కనార్యుఁడు విరాటోద్యోగ పర్వముల నెత్తుకొని 'యా పదునేనింటిఁ దెనుంగుబాసఁ-దుదిముట్టన్ రచియించు టొప్పు' అని నిశ్చయించు కొన్నప్పుడే యని యతని దృష్టిలో నొక "ప్రబంధ మండలి" యైనవి. ఆ ప్రబంధమండలి కధినాథుని కొఱకే విచారింపఁ దొడఁగినాఁడు గదా! కావున భారత రచనను జేపట్టినప్పుడే భారతములోని విరాట పర్వాదులలో రసవంతములగు పట్టులను బ్రత్యేక ప్రబంధములుగాఁ జేసి, తన శిల్ప రచనా చాతుర్యమును, గావ్యకళా సౌందర్యమును వ్యక్తపఱుపవలయునను తలంపాతిక్కనార్యుని హృదయమున గల్గినఁ దనవచ్చును.

సంస్కృత భారతమును దెనిఁగించునప్పు డాంధ్ర భారతకవులా కథను మక్కికి మక్కిగాఁ దెనిగింప సిద్ధపడినవారు కాదు. అందులోఁ దిక్కన “వలసి నట్లుఁ జెప్పవచ్చి యుండు” నని ముందు సూచించియే యున్నాఁడు. వీరు తెలుఁగు సేయు పద్ధతిలో నది మూలముకంటెను రుచిరంబై, రసవంతమై, కథాసంవిధానమునఁ. బాత్రపోషణమున, భావచిత్రీకరణమున, వర్ణనా చమత్కారమున, మూలము కంటెను మిన్నయై యొక విధమైన నవ్యకాంతుల నీనునట్లు చేయవలయునను ధృఢ సంకల్పము కాననగును. కావుననే విరాట పర్వము నొక ప్రబంధముగాఁ జేయుట కనువగు రీతినిఁ గథావస్తువునం దొక విధమగు నైక్య సంపాదనము, పాత్రోన్మీలనచాతుర్యము. రసోద్బోధకత్వము. సందర్భానుకూలమగు వర్ణనాచాతుర్యము. మనోవృత్తివివరణనైపుణ్యము, భావావిష్కరణశక్తి, రూపకల్పనాచాతుర్యము. శబ్దప్రయోగ నైపుణి మొదలగు ప్రబంధ రచన కావశ్యకములగు నసాధారణ లక్షణముల నీ విరాటపర్వ రచనా సందర్భమునఁ దిక్కనార్యుఁడు చక్కఁగా నావిష్కరించినాఁడు.

విరాట పర్వ మీతఁడు చేపట్టిన మొదటిపర్వ మగుటచేతనో, కథ హృదయాహ్లాద మగుటచేతనో మూలముకంటె నిందు గ్రంథము విశేషముగాఁ బెరిఁగినట్లగుపడు చున్నది. ఉత్తరదేశ ప్రతులలో కంటె దక్షిణదేశ ప్రతులలో గ్రంథము పెరుఁగుదల విశేషముగాఁ జూపినను, నీ దక్షిణదేశ ప్రతులలో దాని కంటెను నీతని గ్రంథము విస్తృతమై కనబఁడు చున్నది. ఈ పెరుఁగుదల సామాన్యముగాఁ బాత్రల భావోన్మీలన సందర్భములందును. గథాసందర్భముల కనువైన వర్ణనల మూలమునకు దేశీయాచారవర్ణనా మూలముననను జరిగినదనవచ్చును.

మూలమున నాలుగు పర్వములు గలదానిని తిక్కన 5 అశ్వాసములు గల దానినిఁగాఁ జేసినాఁడు. 2000 అనుష్టుప్పు శ్లోకాలు కలదానిని 1600 పైగా వృత్తములు సీసములతోఁ గూడిన దానినిఁగాఁ దెలుఁగుజేసినాఁడు. కథా సంవిధానములోను, రచనలోను జేసిన మార్పు లతిసూక్ష్మములైనను, సందర్భోచితములు. నతి రమ్యములుగాఁ గనపడక మానవు. ఈ యజ్ఞాతవాస కథావిషయము నెత్తుగడలోనే మూలమందలి దాని కంటెను దిక్కన యెంత రమ్యముగా భావార్థబోధకముగాఁ జేసినాఁడో చూడుఁడు.

అరణ్యావాస మైపోయిన తరువాత కథేమిటని జనమేజయుఁ డడుగట సహజము. అట్లే మూలములో నడిగినాఁడు.

"కథం విరాటనగరే మమ పూర్వ పితామహాః
అజ్ఞాతవాస ముషితాః దుర్యోధన భయార్దితాః" అని.

ఇది సూటి ప్రశ్న. తిక్కన దానినట్లే వదలునా! 'కథం' అనుదానిలోని గంభీర భావాలు. తాత్పర్యమును దిక్కన యెంత చక్కఁగా వెలువఱచినాఁడో చూడుఁడు. ఎట్లు అంటే-ఎలాగో రహస్యముగా కాలక్షేపం చేశారనవచ్చు. కాని, అట్లు చేయడానికి తగినవారు కారే వీరు. ఎలా చేయఁగలిగినారనే భావం వ్యక్తం కావాలి. "కథం" అనే ప్రశ్నలో దానిని వ్యక్తం చేయుటకే తిక్కనార్యుఁడు మూఁడు విశేషణాలు వేసి రచించినాఁడు.

"మహిత సముజ్వలాకృతులు, మానధనుల్, జనమాన్యు లంగనా
సహితముగాఁగ-నేమిగతి-సమ్యగుపాయ నిగూఢ వృత్తిమై
యహితుల కప్రభేద్యమగు నా పదుమూఁడగు నేఁడు మత్పితా
మహులు చరించి రంతయుఁగ్రమంబున నా కెఱుఁగంగఁజెప్పుమా.

సామాన్యముగా దాటిపోవుటకు వీలులేని కారణము లేమున్నవో వాటినిఁ దిక్కన యిక్కడ వ్యక్తము చేసినాఁడు. మనకు వారు సామాన్య మానవుల వంటి వారు కారే? - మహిత సముజ్వలాకృతులు-ఎక్కడపడితే యక్కడ పడియుండ గల్గినవారుకారే! మానధనులు-ఏదో మూల నెవరికినిఁ దెలియకుండ నుండలేరా-అనిన జనులందఱికిని వీరియందనురాగము - జనమాన్యులు. వీటన్నిటికంటె గొప్ప చిక్కైన కారణము మఱొకటి యున్నది. అంగనా సహితులు-ఐదుగురు పురుషులు వీరు. వీరి వెంబడి యొక స్త్రీ కూడనున్నది. ఈ లక్షణాలన్నీ కూడా యెవరైన గుర్తుపట్టి వీరిని బయలు వేయడానికి ఎంతో యనువైనవి. కాఁబట్టీ యెట్టి 'సమ్యగుపాయ నిగూఢవృత్తిమై నమిత్రుల కప్రభేద్యముగా నా పదమూఁడగు నేటినిఁ గడపఁ గలిగినారు' అనేది - ఒక పెద్ద ప్రశ్న యయినది - తిక్కనార్యుని చేతిలో నిదంతా యొక 'కథం'తో సరిపోయింది. సంస్కృతములో దాని కింత వ్యాఖ్యానమవసరమని తోచినది తిక్కనకు. భారత యుద్ధానికిఁ గథ కంతకు గూడా ద్రౌపదే కారణమని చెప్పే సామెత యొకటి యుండాలి. అట్లే విరాట పర్వములోని కథకుఁ గూడా ద్రౌపదే ముఖ్యకారణము. అచ్చట దుర్యోధనాదుల మూలముగా జరిగిన పరాభవము, ఇక్కడఁ గీచకుని మూలముగా జరిగినది. ఆ పరాభవమును దొలఁగించుకొనుటకుఁ గీచకవధ జరిగినది. ఇదియే దుర్యోధనుని యూహకుఁ గారణమై గోగ్రహణమునకు దారి తీసినది.

'వాయుజుం డొక్కఁడ యింక సింహబలు నుద్ధతి మాన్చిన మాన్పువాఁడతం డక్కడ నిల్చెఁగావలయు, నా సతి ద్రౌపదిగాఁగనోపు'

అని ఊహించినాఁడు దుర్యోధనుఁడు, ఇట్లంగనా సహితులగుటయే గదా పాండవుల కిన్నిఁ యనర్థములకుఁ గారణమైనది. కాఁబట్టి యా విశేషణము నెంత సార్థకముగాఁ బ్రయోగించినాఁడో తిక్కన! గమనింపుఁడు. ఈ పద్యముతోఁ బోల్చి చూస్తే మూలమందలి యనుష్టుప్పు - వట్టి పిప్పిలాగు కనఁబడుతుంది.

భారత కథ జగత్ప్రసిద్ధమయినదే గనుక, పాండవులను నందఱెఱిఁగిన వారే! వారి స్వభావము, వృత్తులు తెలిసినవే. కాని వారి నందఱిని నొక్కసారి మన దృక్పథమునకుఁ దెచ్చి, వారి సహజ లక్షణములను జిత్రించుట కీ విరాట పర్వాదినే తిక్కనకు మంచి యవకాశము దొరికినదని చెప్పుకొన్నాముగదా; విరటుని కొల్వులోఁ బ్రవేశించేటప్పుడు వారిలో వారు కూడఁ బలుకుకొనే టప్పుడు, విరటుని కొలువు చేరుటకై వారాతనితో సంభాషించునప్పుడు, వీరి చిత్తవృత్తులను, విశేష లక్షణములను జక్కగా వర్ణించి చూపినాఁడు తిక్కన. ఇంత కాలం నుంచీ, మూడు పర్వాల భారతకథ చదివి పాండవుల నెఱింగియున్నా, వారి నీ విధంగా ఇంత చక్కఁగా మనమెఱుఁగము. వారి లక్షణాలే కాదు. వారి మనోవృత్తులు జీవిత తత్త్వమే సువ్యక్తమౌతుంది యీతని మూలకంగా, ధర్మజుని సన్యాసి వేషము - దానికిఁ దగినట్లు శ్రౌతస్మార్తనిమిత్త జ్యోతిర్విద్యలు గ్రహించి చాతుర్యము మెఱయునఁట. అక్షశిక్షాప్రౌఢి, యాతనితో మృదు ద్యూతమునఁ గ్రీడించుట, మృదు ద్యూతమయినా ధర్మజునికిఁ జివరకుఁ బాచికపు దెబ్బ తప్పినది కాదు. మణిమయమ్ములుఁ, గల ధౌతమయమ్ములునగు నడ్డసాళులు గొనిపోయి చూపునఁట, అనేక చిల్లర విషయముల వర్ణించి, వారి స్వభావమును జిత్రించి భావికథాప్రవృత్తికి వాని ప్రయోజనమును సూచించినవాఁడగు చున్నాఁడు.

భీముఁడు వంటలవాఁడై "ఆరు రసంబులం జవుల యందలి క్రొత్తలు పుట్టు నట్లు వండును." "జెట్టి తండంబుతోడఁజేపట్టా, హోంతకారి విఱిచినట్లగ్గలముగ విఱచు" నఁట! 'పెక్కండ్ర నొక్కపోరున నుక్కఱ భంజింతుఁగాని చంపు టుడుగదు' నని చెప్పినాఁడు." "కోఱ పులినైన, కాఱెను పోతులనైన, మదకరినైన, కాలఁగేలఁ గడింది మగటిమిఁ బట్టి, మాత్స్యుని మనంబు నానా ప్రకారంబుల, వడయుదు" నన్నాఁడు. మూలములో "భ్రామయిత్వా శతగుణం గతసత్త్వ మచేతనం।ప్రత్యహింసన్ మహాబాహుః మల్లం భువి వృకోదరః-తస్మిన్ వినిహతే మల్లే" అని యా మల్లునిఁ జంపివేసినట్లే యున్నది. తిక్కన మాత్రము "చంపు టుడుగుదు" నని భీమునిచేఁ

జెప్పించి, యచ్చట వానినిఁ జంపక, మల్లపుఁ బట్టులను జూపి, క్రింద బడవేసి యోడించి విడిచి పెట్టెనని చెప్పినాఁడు. వేడుకకై జరుగు పోరాటమునఁ బ్రతివీరునిఁ జంపుట యుక్తము కాదనియో, కాక, ముందరి కీచకవధ సందర్భమున ననుమానమునకుఁ గారణమగుననియో యాతఁడట్లు చేసియుండును. నకుల సహదేవుల యశ్వశిక్షక, గోపాలక వృత్తులను వర్ణించుచు, నశ్వజాతులు - వాని శిక్షణ విధానమును గూర్చియు, పశుజాతులు వానినిఁ గాపాడు రీతులను విశేషముగాఁ దెలిపినాఁడు. 'గోడిగ జాతిలోఁ గొదమ పెంటుల నేర్చి మవుల హత్తించు మార్దవంబు" అను సీస పద్యము, అట్లే "వంజలనైనను వల నేర్పడఁగ నొక భంగిఁ జేపఁగఁజేసి పాటిగొనఁగ" అనునది. అట్లే ద్రౌపది "కలపంబు లభినవ గంధంబులుగఁ గూర్చి - వివిధ శిల్పములఁ బ్రవీణనై-మత్స్య రాజమహిషి మనమునకెక్కఁ గొలువనేర్తు" ననుట. ఈ details- చిల్లర విషయములన్నీ సందర్భానుసారముగఁగల్పించి, రచనకుఁ బుష్టి, సార్థక్యమును నాయాపాత్రల చిత్తవృత్తుల వివరించుటకు, స్వభావ పోషణకు నవకాశమును గల్పించుకొన్నాఁడు తిక్కన. మూలమున నీ రసపుష్టి సార్థక్యము కనఁబడదు. వీని మూలముగా గ్రంథము పెరిగినది కూడాను, బృహన్నల తన విషయము రాజు నెదుటఁ జెప్పు కొనిన రీతి యెంత సహజము, సత్య సముపేతమునై యున్నదో చూడుఁడు.

"ఆఁడుదనంబు నిక్కమున నారసి చూడఁగలేదు, పుంస్త్వముం
బోఁడిమి దప్పియున్నది-నపుంసక జన్మ మవశ్యభోగ్యమై
వాఁడిమిగల్గు శాపమున వచ్చెఁ-బురాకృత కర్మభాగ్యమే
వాఁడును నేర్చునే తొలఁగవైవఁగ, నోర్వక పోవవచ్చునే."

వండు పనులకు సెలవు లేకునికిఁజేసి, దండలాసకవిధము, కుండలి, బ్రెక్కణము, పేరణము నభ్యసించినాఁడఁట! అన్ని విధముల శ్రమమును జేయించునఁట. అంతఁ దండ్రి పనువున నుత్తర యలరువిలుతు పువ్వుటమ్మువోలె వచ్చుట, తిగిచి కవుంగలించి జగతీవిభుఁడక్కమలాయతాక్షిని బుజ్జగించి యుపలాలించుట, యిమ్మగువ నీకు నాట గఱపం బాత్రంబగునే యని యడిగి తత్ప్రతివచనంబునకుం జిత్తంబు రంజిల్లఁ గర్పూర సహితంబగు తాంబూలంబు వెట్టుట, యీ మొదలగు దేశీయంబులగు సముదాచారంబులు-ఇవన్నియుఁ దిక్కన కల్పితములే.

ఇట్లు పాండవులు విరటుని కొలువునఁజేరి వారచ్చట నెట్లు మెలంగుచుండిరో యను విషయము గూడ విరాట పర్వముననే సంస్కృత మూలమునఁ జేర్పఁబడి

యున్నది. తిక్కన పాండవ ప్రవేశమును మాత్రము తొలి యాశ్వాసమునఁ జెప్పి, వారచ్చట మెలంగిన రీతితో రెండవ యాశ్వాసము నారంభించినాఁడు. దీని మూలముగా విరటుని కొల్వున ధర్మజుని ప్రేరణమున రాజున కుత్సాహభంగము కాకుండఁ జేయుటకు భీముఁడు మల్లునితో మల్లయుద్ధముఁజేసి, రాజు మన్ననలఁ బడయుట యనునది రెండవ యాశ్వాసమునఁ జేర్చి, తరువాతి కీచకవధ గాధకు దారి చూపినవాఁడయినాఁడు. ఈ విధముగా రెండవ యాశ్వాస కథకు భీముఁడు నాయకుఁడయినాఁడు. అట్టి జగత్ప్రసిద్ధుఁడగు మల్లు నోర్చినవానికిఁ గీచకునిఁ జంపుట దుర్ఘటమా? యనిపించును. కాని, యంత యుద్రేకపూరితుఁడగు భీముఁ డంత నేర్పుతో, రహస్యముగ వానినిఁ జంపగలుగుటయే గొప్ప విశేషము. కావుననే ద్రౌపది చేతనే తుద కా యాశ్వాసాంతమున నుత్తమ నాయకత్వమును బ్రకటింపఁ జేయును. చూడుఁడా యుత్తమ నాయకత్వమెట్టిదో!

"కొలువు లోపల నిన్న కోపమగ్గలెత్తినఁ దలఁకక నిలిచిన ధైర్య మహిమ
నేఁడిందుఁ జనుదెంచి నిర్వికారతఁ బ్రజఁ గన్ను గప్పిన యట్టి గౌరవంబు
మనవారిలోన నొక్కనినైనఁ బిల్వ కుత్సాహంబు సేసిన సాహసంబు
లోకదుర్జయుఁడగు, నీ కీచకుని వ్రేల్మిడి రూపుమాపిన కడిమిసొంపు,
చూడఁ దలపోయ మెచ్చ సంస్తుతి యొనర్ప
నా తరంబె నీ యుత్తమ నాయకత్వ
మెఱిఁగి గొనియాడ నే నెంతదాన
మహిత విస్మయానంద నిమగ్ననైతి."

అతని యుత్తమ నాయకత్వమును జూచి ద్రౌపదియే విస్మయానంద నిమగ్నయైన దఁట: ఆమెతో మన మట్లు కావలసినదే కదా!

సంస్కృతమున రెండవది కీచకవధ పర్వము. ఉపకీచకుల వధ కూడ నిందే తెలుపఁబడినది. కాని తిక్కన దీనిని మూఁడవ యాశ్వాసమునకుఁ ద్రోసి వేసినాఁ డు. రెండవయాశ్వాసము పెద్దదగుననియా? అయితేమాత్రమేమి? అన్నీ సమానముగానే యున్నవా? అది యొక కారణముగాఁ గనఁబడదు. ఈ యాశ్వాసము చివరనే నాటకములోవలె వచ్చే యాశ్వాస కథకు సూచ్యార్థ సూచనగా - "అనిన విని కీచకుఁడు చచ్చిన పిమ్మటఁ బుట్టునవ్విశేషములెల్లన్ వినువేడ్కకు మన మలరెడుఁ జెప్పు" మని జనమేజయునిచే నడిగించినాఁడు. అనఁగాఁ గీచకవధ కారణముగాఁ బుట్టిన విశేషములను దరువాతి యాశ్వాసములోఁ దిక్కన చెప్పఁ దలఁచుకొన్న ట్లయినది. అట్టి విశేషములలో నుపకీచకుల వధయు నొకటేగదా? ఇది యొకటేనా? ప్రధానమైనది మఱియొకటి యున్నది. అది కీచకవధ

వృత్తాంతమును, బాండవులజాడ వెదకఁబంపిన చారులవలన విని దుర్యోధనుఁడు చేసిన యూహ, యతఁడు పన్నిన తంత్రము.

కీచకవధ వృత్తాంతము చారులవలన విని దుర్యోధనుఁడు "తగ విచారించి కార్యంబు తెగువ గాంచిఁ నాడఁట", ఏ విధంబుగాను "సింహబలుఁడు భీమసేనుండు. శల్యుండు హలధరుండు సమాన బలంబువారలు." "వీరలలోన యొండొకరుల కని గెలుపు సమకూరున్", తక్కిన వార లాతనికి దవ్వులచోటుల వారు-వాయుజుం డొక్కఁడ యింక సింహబలు నుద్ధతిమాన్చిన మాన్చువాఁ డితం డక్కడ నిల్చెఁగా వలయు నా సతి ద్రోపదిగాఁగ నోపు వే ఱొక్కరు డాజిఁ గీచకుల నోర్వఁగఁ జాలమి మీ రెఱుంగరే" అని కర్ణ దుశ్శాసనాదులు పాండవులు ప్రచ్ఛన్న వేషులై విరటుని ప్రోల నివసించియున్నవారు-అని నిశ్చయమయిన యూహ చేయఁ గలిగినాఁడు. ఆ యూహకుఁదగినట్లు వారిని బయలు పఱుపఁదగిన తంత్రంబును బన్నినాఁడు. అదేగదా యీతని ప్రధానాశయము.

ఈ విధముగా నీ దుర్యోధనుని తంత్రము తన్మూలకమగు గోగ్రహణము. ఒకవైపున సుశర్మకు, మఱియొక వైపునఁ గౌరవ సేనకుఁ గలిగిన పరాజయము. ఇట్టి తరువాతి కథ కంతకుఁ గూడ నీ కీచక వధయే మూల కారణమని ప్రదర్శించుటయే తిక్కన యుద్దేశ్యముగాఁ గనఁబడుచున్నది. ఇవి యన్నియుఁ గీచకవధకు దరువాతఁ బుట్టిన విశేషములే గదా! దుర్యోధనుని యీ మంత్రాలోచన తంత్ర మను దానినిఁ బాండవుల యీ యజ్ఞాతవాస కథ కంతకు నడిమి కీలుగాఁ (Pivot) జేయుటలోనే తిక్కన కళాకౌశల మంతయుఁ గానవచ్చుచున్నది. అయిదా శ్వాసముల ప్రబంధములో నాటకంలోవలె దీనిని రెండున్నఱ యాశ్వాసముల తరువాత, మూఁడవ యాశ్వాసము మధ్యకుఁ దెచ్చి పెట్టినాఁడు తిక్కన, ఇట్లు ద్రౌపదీ పరాభవ కారణముగాఁ గలిగిన కీచకవధ ఘట్టమునకు భీముఁడు నాయకుఁ డైనట్లే. దాని మూలముగాఁ గలిగిన దుర్యోధన తంత్రమునకు ఫలితమయిన గోగ్రహణ సందర్భమునఁ గలిగిన యుద్ధము నందుఁ గౌరవ పరాజయమునకుఁ దొలుత భీముఁడు. పిదప నర్జునుఁడు, నాయకులైనారు. ఇట్లీ కథ యంతయుఁ బాండవుల యజ్ఞాతవాస నిర్వహణ భంగములపై నాధారపడినదిగా నుండి తుదకు ద్రౌపదీ పరాభవ నిష్కృతి, బంధ మోక్షములతోఁ బాటు, కౌరవులపైఁ బాండవులకుఁ గలిగిన విజయ ముత్తరా కళ్యాణముతో ముగియుచున్నది.

ఇది యంతయు మొత్తము భారతకథనంతను దలపించుట లేదా! కావుననే యీ పర్వమును దిక్కనార్యుఁ డంతగా శ్లాఘించి యుత్తమ ప్రబంధముగా రచించినాఁడు.

మూలకథ జగత్ప్రసిద్ధమే యగుటచే దాని నీతఁడు మార్చింది విశేషమేమీ లేదు. మార్చనూ లేదు. కాని యాయా విషయములనే సందర్భానుసారముగా వలసినట్లు వర్గీకరించుకొని ప్రదర్శించుటలోనే తన కవితా చాతుర్యమును, గళా శక్తిని వ్యక్తపఱచుచుండును. మూలగ్రంథము-నందుత్తరదేశ పాఠమునకు మూలమైన బండార్కరు ప్రతిపాఠమును జదివినచో జగత్ప్రసిద్ధమైన కథ మాత్రమే తెలియవచ్చును. దక్షిణదేశ ప్రతులలో మఱికొన్ని విశేషములు వెనుక ముందుగా, నొక్కొక్కప్పుడు చర్విత చర్వణముగా, నీరసముగాఁ గానవచ్చును. కాని తిక్కనార్యుని రచనలోవలెఁ గథా సంధానమునం దొక విధమైన యేర్పాటు, పూర్వోత్తర సందర్భము, పాత్రల స్వభావోన్మీలనము, రూపచిత్రణము, మనోవృత్తుల వివరణము, రసా విష్కరణము, దేశీయాచార వ్యవహార వర్ణనము, సందర్భోచిత ప్రకృతి వర్ణనాదికము మొదలగు నసాధారణ లక్షణము లందుఁగానరావు. ఈతని రచన మూలకథ కనేక విధములఁ జక్కని మెఱుఁగు పెట్టునదై, యత్యంత రసస్ఫోరకముగను, సచేతనముగను జేయుటచేతనే యాంధ్రావళి కింత మోదముం గూర్చునదైనది.

ఈ మెఱుఁగు లిట్టివియని చెప్పుటకు వీలులేదు. అడుగడుగునకు మూలముతోఁ బోల్చి చూచి యానందింపవలసినదే.

(1) ఉన్న కథయే. అతడు కల్పించిన కథాసంవిధానము మూలముగా నెట్లొకవిధమగు వస్త్వైక్యమునకుఁ దోడ్పడి ప్రబంధ రూపము దాల్చుటకుఁ దోడ్పడి నదో యిదివఱకు చూచినాము గదా!

(2) ఆయా పాత్రల గుణ శీలములను గథానురూపముగా నా యా కథా పాత్రలచేతనే చెప్పించి, వారిని మన యెదుట రూపొందునట్లు చేయుటలోనే తిక్కన చాతుర్యమును మనము కనిపెట్టగలము. ఇదివరలోఁ బాండవులు తమను గూర్చి తాము చెప్పుకొనుట కొంత విన్నాము. ఇతరులకు వారెట్లు తోఁచినారో యని కూడఁదిక్కన వినిపిస్తాఁడు. సన్యాసి వేషమున ధర్మజుఁడు విరాటుని చూడ్కులకు వ్రేగఁయి తోఁచి నాడఁట. జగము లెల్లను నేలఁగఁజాలు తేజమఁట. ఆ మువ్వురితోడను సాటియగు మూర్తి. ఈ మహాత్ముడు చెప్పిన పనులెల్లను జేయువాఁడనంటాఁడు. నీ వెవ్వరని యడిగితే-

'ఉన్నరూపు బలుకు నన్నరు లెవ్వ రని - సత్యభాషణముపై నొక యుపన్యాసము' అది ధర్మజునికే తగు.

ఇక భీముఁడు రావడములోనే-

'సమద వారణపతి గమనమున మత్స్యధరణీవల్లభు సభఁజేరి నరిగినాఁడఁట.

ఈతనిఁ జూచుట తోడనే విరటునికి 'ఉలుకుని వెక్కసపాటును, దలకొన్నవఁట. ఈతఁ డిట్లు తెల్లబోయి చూస్తూ ఉండగానే 'జయ శబ్ద యుతంబుగ వినయంబున మ్రొక్కించి' గంభీరమైన శార్దూల వృత్తంలో మొదలు పెట్టించినాఁడు తిక్కన. 'దేవా! నాల్గవజాతివాఁడ-నిను నర్థిం గొల్వఁగా వచ్చితిన్' నీ చిత్తంబు నన్ మెచ్చునట్లే వండఁగనేర్తు' నంటాఁడు; రాజు నీవు; ధరణీ భరణ క్షమమూర్తిని అవీ యివీ ఇస్తానంటే- "అనుటయు మోఱకు చందంబున మోఁమడ్డముగఁ గదల్చి భూవిభుఁడు సభాజనులు వినఁబ్రస్ఫుట నిరర్గళాలాపములన్" నా కవియెల్ల నేల నరనాథులకుంబ్రియ మొందునట్లుగాఁ బాకము సేయనేర్తు ....అంటాఁడు. భీముని మొఱకుదనానికి సూచకము మోమడ్డముగఁ గదల్చుట.

ఇఁకఁ బేడి యర్జునుని ప్రవేశము.

'మఱుఁగుబడిన మార్తాండుఁడునుబోలె, వేషధారియైన విష్ణుండునుంబోలె' నున్నాడని వర్ణించి, యా భావమునే విరటునిచేత ననిపిస్తాఁడు.

'ఎవ్వడే? నొక జగత్పూజ్యుండు గ్రీడార్థ మిట్లొనరం దాల్చినరూపు గావలయు మీరూహింపుఁడా, యని.

సైరంధ్రీ వేషమున నున్న ద్రౌపది...బోవుచుండఁగా వర్ణన.

'పరమొయిల్ గప్పినఁ బాడఱి నునుగాంతిఁ గదిలిన యమృతాంశు కళయుఁ బోలెఁ బోవుచుండఁగాఁ గేకయ రాజనందన జాలకంబులనుండి చూచి 'యామె పెంపు సొంపు మన కేర్పడుచున్నది'. అని పిలిపించింది. 'ఆ వనితారత్నము వినయ వైభవము సతీతనువొందినట్లు" మత్స్య క్షితీశు నింటఁ గొంత యొప్పెసక మెసఁగ' అరిగినదఁట. అప్పుడు కేకయ రాజనందన ద్రౌపదికి స్వాగతమిచ్చే రీతి. ఆదరభావము నెట్లు రూపొందించినాఁడో తిక్కన; చూడుఁడు.

"కనుఁగొని గారవంబును మొగంబునఁ గేల బురః ప్రసారమున్
దనువున నమ్రభావమును దంత మరీచుల సామి నిర్గమం
బును దమలోఁ గడల్కొనఁగ-

అప్రయత్నంగాఁ దమలోఁ దామే గడల్కొనినవఁట, కడల్కొనఁగా

"భూరితరాదర రేఖనిందు ర మ్మనవుడు
నంత నంత ద్రుపదాత్మజ సేరి వినీతి నిల్చినన్"

అప్పుడా సుధేష్ణ "ఆపాదమస్తకముఁదద్రూపము వీక్షించుచున్ గుతూహల మడరం" నీ కుల మెయ్యది? ఎవ్వరిదాన" వని అడిగింది. "నేను సైరంధ్రీ జాతి సంభూత? బురుష పంచక సనాథ" నంటుంది. అంతలోనే సుధేష్ణకు ననుమానం గలిగింది.

"నిను నీ రూపము చూచి మా నృపతి యువ్విళ్ళూరు"
దుర్భర యగు నిను గర్కటి గర్భము ధరియించినట్లు గైకొని నాకై
నిర్భర విధ్వంస దశావిర్భావముఁ దెచ్చికొనుట వెరవైయున్నే"

దీనినిబట్టి యాభర్త యెంత దృఢ చిత్తుఁడో, యీ భార్య యెంత యను మానపు మనిషియో, స్వకార్య ధురంధరురాలగు కపటచిత్తయో యాలోచించుకొన వలసినదని, వీరి గుణ శీలములపైఁ జక్కని విసురొకటి విసిరినాఁడు తిక్కన. వీరి తెలివితక్కువ మూలముగానే కీచకునివలనఁ గలుగబోవు ననర్థమును సూచించినవాఁ డైనాఁడుకూడా. కాని తన పని చక్కఁబెట్టుకొనువిషయములో ద్రౌపది కూడా సమర్థురాలే. కావున తన పతులు గంధర్వు లున్నారు. ఊరుకోరు; అని భయపెట్టి "మనమున నూఱడిల్లు మనుమానము మానుము నన్ను నేలు" అని మంచి మాటలతో నామె యొద్దఁజేరినది.

ఈ సుధేష్ణయుఁ గొంతవఱకుఁ గీచకునికిఁ దగిన యప్పగారే యని సూచింపదలఁచి గాఁబోలు నామె గుణ శీలములను జిత్రించుటలోఁ గూడ నామె స్వకార్యధురంధరత్వమునకుఁ దగినట్లు శాఠ్యాది నూతన ఛ్ఛాయలను గొన్నింటినిఁ గూడఁ గల్పించి కీచక కథా చిత్రమునకు వన్నె దెచ్చినాఁడు.

రూపాభిమానియు, దుర్విదగ్ధుఁడు నగు కీచకుఁడు తన యప్పకు మ్రొక్కం జనువాఁడై యేతెంచి ద్రౌపదినిఁ జూచి కందర్ప దర్పగోచరుఁడై యామెతోఁదన గోడు వెళ్ళఁబోసికొనుటయే గాక, యామెను దనకు నేమి యుపాయంబుననైనఁ గూర్పు మని యప్ప నడుగుటకు జంకఁడు. తెగించిన దానికి జంకేల? కాని యప్ప సంగతే మనము విచారింపవలసినది. "కాంచన పీఠము వెట్టి ప్రియమ మునుగు నడ" సంభావించినది. "రాగరస నిర్మగ్నుఁడయ్యె; సైరంధ్రిఁజూచి వీని కేమి యుపాయమగునో వలదన్న నుడిగెడువాఁడు కాఁడు. మాయదైవమయేనేమి సేయుదాన" అని తగిన తెఱంగున వారింతమని "యనేకమంది స్త్రీలు నీ కున్నారు గదా" యని జ్ఞాపకము చేయుచు, జారపొందు సుఖము కాదని హెచ్చరిస్తుంది. గంధర్వుల వలని భయము గలదని సూచిస్తుంది. కాని వాఁడు వినకుండుటచే వీని

కెమ్మెయింజావు నిజం బని "నిశ్చయించి, సందర్భానికిఁ దగిన శౌర్యము వహించి ద్రౌపదిని బెల్లించి, దొంగ వేషము వేసి, దొంగ తృష్ణ భావించి "ఒదవెడు తృష్ణ పెల్లిదమున వదనము వరువట్లు వాఱె, కీచకు నింట వారుణి గలుగున్ వే చని యిచటికిఁ గొనిరమ్మా చూతము గాని నీ గమన వేగంబున్" అని ద్రౌపది నకార్య కరణమునకుఁ బురిగొల్పినది. ద్రౌపది చెప్పిన యభ్యంతర వాక్యముల యథార్థ భావమును గప్పి పుచ్చి తాను దెచ్చికో లనునయము నభినయించి.

నేను వేడ్కపడి యానెడు నాసవ మర్థిఁదేర దీని నీవు గొసెక్కఁగఁజేసి నిన్ను నతిహీన విధాన నియుక్త జేతఁగా నిక్కమ యుమ్మలించి తిది నెయ్యముఁ దియ్యము కల్మియే సఖీ"

అని తన శౌర్యము నామెపై నారోపించినది. కీచకునివలనఁ బరిభవమును బొంది యీమెకంటె నిస్సహాయుడై యున్న విరటునివలననే సహాయమును బొంద లేక తన దగ్గఱికే తిరిగి వచ్చి తన స్థితినిఁ జెప్పుకొనుచున్న ద్రౌపది యెడలఁ "దెచ్చికోలు సంభ్రమమునుజూపి" తా నేమియు నెఱుఁగని తెఱఁగుదాల్చి "శౌర్యము న్మలించి, యెలుఁగు వేఱొక భంగిగా, వట్టి బిభీషికలు పలికి చేయునది లేక నివ్వెఱఁగంది" యుండెనఁట. ఇట్లీ సుధేష్ణ సహజ స్వభావమును, శౌర్యమును వెల్లడించుటలో నెట్టి వన్నెలు చిన్నెలు పెట్టినాఁడో చూడుఁడు తిక్కన. మూలమున సుధేష్ణ చిత్రము, శీలమ్ము గూడ వట్టి యగమ్యగోచరముగా నున్నది.

ఈ కీచక కథా సందర్భమునఁ దిక్కనార్యుఁడు గల్పించిన ప్రకృతి వర్ణన లెంత రమ్యములో, సందర్భోచితములో చెప్పనలవి గాదు. మొదటిది ప్రభాత వర్ణనము-రాత్రంతా భీమునితో ద్రౌపది తన భంగపాటు చెప్పుకొని కీచక వధకై యతని యుత్సాహము రేకెత్తించి, యత్యుత్సాహముచే నాఁతడు తొందరపడి బయలు పడకుండునట్లు నచ్చఁజెప్పి సభలో ధర్మజునిఁ దా నన్యాపదేశముగా దూలనాడి జవాబు చెప్పినందులకుఁ దన ప్రవర్తనను సమర్థించుకొంటూ, ముందు జరుగఁబోవు కార్యక్రమమును నిర్ణయించుకొని, "వానిం దెగఁ జూచి నీకుం జూపి నీ చిత్తంబు పడసెద. నిదియ నిశ్చయం బని' చెప్పిన భీమునివలన నోదార్పు నొందుచుండఁగానే వేగుజామైనది "ఇమ్మాటలవలన దలంపముగాని వేగుచున్నయది యని యామెతో భీముడు చెప్పి యత్తన్విం దఱిమి కొన్ని యడుగు లనిచి మరలి వచ్చి నాఁడట తన సెజ్జకు" వచ్చి పర్యంక భాగంబునఁ దనువు వైచి నిద్రం బొరయని కనుదోయి మోడ్చినంతనే ప్రభాతం బయినదఁట. ఈ ప్రభాత మెంత కథానుకూలముగా వచ్చినదో చూచితిరా! ప్రకృతి కథా పాత్రలతో సానుభూతి

చూపు చున్నట్లు వర్ణించుట యొక కవిసమయము. ద్రుపదనందన దుఃఖమునకు దురపిల్లుచు నెత్తమ్మివిరులు వేఁడి నిట్టూర్పులు విడుచుచున్నవి వలె నున్నవఁట. ఒక పెద్ద వచనములోఁ బ్రభాత వర్ణన చేసినాఁడు గాని ముఖ్యముగాఁ జెప్పుకొనఁ దగినది సూర్యోదయ వర్ణనము.

సీ. "నీరజాకరములు నిష్ఠమైఁ జేసిన,
భవ్యతపంబుల ఫల మనంగ,
దివస ముఖాభినందిత చక్రయుగ్మకం
బుల యనురాగంపు బ్రో వనంగ,
హరిహర బ్రహ్మ మహానుభావంబు లొ
క్కటిగాఁగఁ గరఁగిన గట్టియనఁగ
నతుల వేదత్రయ లతికాచయము పెను
పొందఁబుట్టెడు మూలకంద మనఁగ

నఖిల జగముల కండయగుచు, జనన
మాజ కరపుట హృదయ సరోజములకు
ముకుళనంబును జృంభణంబును నొనర్చి
భాను బింబంబు పూర్వాద్రిపై వెలింగె."

ఇందలి రచనా రీతి తరువాతఁ బ్రబంధ వర్ణనలకు ఒరవడి కావచ్చును. కాని యిందుఁ దిక్కన వెలిబుచ్చిన నిగూఢభావంబులతని భావోన్నతిని, నిర్మల జ్ఞానమును వ్యక్తము చేయుచున్న దనుటకు సందేహము లేదు. ఇచ్చటి సందర్భమున నౌచిత్య మేమనఁగా-నిస్సహాయురాలై యున్న ద్రుపదపుత్రి కీచకునింటికిఁ గల్లుదేరఁ బోవుచు మహాపదలకుం బరిహరణంబు హరిస్మరణం బని తలఁచి.

"పాండు పుత్రుల కేను దప్పని మనంబు గలుగుదాననయేని యో కమల మిత్ర కీచకు దెసఁ గీడు బొరయకుండ రక్షింపు" మని సర్వ కర్మసాక్షియగు నా కమలమిత్రునే ప్రార్థించినది. అతండు నామెను రక్షించుట కొక రక్కసునిఁ బనిచి కీచకునివలన నామె కుపద్రవము లేకుండఁ జేసెను. కావున కర్మసాక్షియే ముందు దినము కథను నడుపువాఁడు గదా! అతనిఁ గూర్చిన తిక్కన భావము లెట్టివో తెలుసుకొనవలదా? సూర్యభగవానుఁడే సర్వాతీతుఁడగు ప్రత్యక్ష దైవము. "సర్వాధారః కాలః" అన్నట్లతఁడు సర్వాధారము. మహామునులు చేసెడి యతి కఠిన తపంబులకు ముఖ్య ఫలము ప్రాప్యము. రాగ రసానందానికి నిలయం-ఆనంద నిలయము. సృష్టిస్థితిలయాదులకు మూలకారణము. వేదత్రయ కర్మకు జ్ఞానానికి మూలకందము,

కావునే తనను రెండు చేతుల మ్రొక్కి తనకు హృదయ కమలమును విప్పిన వారి యజ్ఞానాంధకారమును బోఁగొట్టు జ్ఞాన నేత్రమును బ్రకాశింపఁ జేస్తాడు.

ఈ విధముగా సూర్యభగవానుఁడు తన దృష్టిలో త్రిమూర్త్యాత్మకుఁ డగు పరమాత్ముఁడే యను భావమును వ్యక్తము చేసినాఁడు తిక్కన. కాని యిట్టి రవి విరహాతురుఁడగు కీచకునికి మిత్రుఁడు కాలేదు. ఉపవనవిహారములను, శిశిరోపచారములను బ్రొద్దుపుచ్చును "మాయా రవి యేల క్రుంకఁడోకోయని" దుఃఖింపఁ దొడఁగెను. తరువాత నెట్లో రవి గ్రుంకఁ జుక్కలు, చంద్రాస్తమయము, గాఢ తమో వర్ణనము మొదలగునవి యీ శృంగార రసాభాసము నావిష్కరించు సందర్భమునఁ దిక్కన కావశ్యకములైనవి. ద్రౌపదీ, భీములు కలిసి కీచకు నేకాంత ముగఁ బ్రవేశించు సందర్భమున గాఢతమో వర్ణనావృతమగు నాట్యశాల వర్ణన మత్యద్భుతము.

'Sound echoing the sense' అన్నట్లు భావానుగుణమగు పదముల కూర్పు మూలముగాఁ దిక్కనార్యుని చిత్ర రచనాశక్తికి విరటుని సభలో ద్రౌపదీ పరాభవ సందర్భమున భీముని యాగ్రహ పూరిత, భయంకరాకార వర్ణనము నొక యుదాహరణముగా గ్రహింప వచ్చును.

కనుఁగొని కోప వేగమునఁ గన్నుల నిప్పులు రాల నంగముల్
గనలఁగ సాంద్ర ఘర్మ సలిలంబులు గ్రమ్మ నితాంత దంత పీ
డన రట దాస్యరంగ వికట భ్రుకుటీ చటుల ప్రవృత్త-న
ర్తన ఘటనా ప్రకార భయద స్ఫురణా పరిణద్ధమూర్తియై"

"నేలయు నింగియుఁ దాళముల్ గావించి, యేపున రేఁగి వాయించియాడఁ
గులపర్వతంబులఁగూర్చి యొండొంటితోఁదాఁకంగ వీఁకమైఁ దన్నియాడ
నేడు సాగరములు నిక్క డక్కడఁ బెట్టి పలుచని రొంపి మైనలఁదికొనఁగ
దిక్కులు నాలుగు నొక్క చోటికిఁ దెచ్చి పిసికి పిండలుచేసి పిడిచకొనఁగ"

మిగిలిన బ్రహ్మాండ భాండంబు పగుల వ్రేయ
నప్పళించుచుఁ బ్రళయ కాలానలమున
గండరించిన రూపంబుకరణి భీముఁ
డతి భయంకరాకారత నతిశయిల్లె."

ఒకచో సంస్కృత జటిలసమాసముల పటపటల మూలమునను, మఱి యొకచోఁ దెనుఁగున భావ ప్రపూర్ణములగు తేటతెలుఁగు మాటల బిగువైన కూర్పు తీర్పువల్లను భీముని భయంకరాకారము నెట్లు చిత్రించినాఁడో తిక్కన!

ఇఁకఁ బ్రత్యేక మాంధ్రావళికి మోదముంగూర్చునది యుత్తరా వివాహ వర్ణనము. మూలమునందలి బండార్కర్ పాఠములో రెండే అనుష్టుప్పు లున్నవి. "తాం ప్రత్యగృహ్ణాత్ కౌంతేయః వివాహం కారయామాస సౌభద్రస్య మహాత్మనః" తరువాత "ఉచ్చావచాన్ మృగాన్ జఘ్ను ర్మేధ్యాంశ్చ శతశః పశూన్, సురా మైరేయపానాని ప్రభూతా న్యభ్యహారయన్" అని.

దీనినిఁ దిక్కనార్యుఁ డెంత చక్కటి తెలుఁగు దేశీయపుఁ బెండ్లి మహోత్సవముగాఁ దీర్చి దిద్దినాఁడో చదువుకొని యానందించ వలసినదే. మొదటఁ బ్రగల్భములు పల్కి తెలివితక్కువవాఁడుగాఁ గనఁబడిన యుత్తరుఁ డర్జునుని సహవాసము వలనఁ దండ్రి కంటెను జక్కని వివేక వంతుఁడైనట్లు కనఁబఱచినాఁడు తిక్కన. తండ్రి పాండవులకు ధనమిస్తాను. రాజ్యమిస్తా నంటే యీ ధన వర్గములు నీ కెక్కడివి? వారు మొన్న యుద్ధములో గెల్చి నీ కిచ్చినవే గదా! ఇవి వేడ్క సేయవు, తగు నూతనమగు కానుక యీయవలయును. "వే గోడ్తేరఁ బనుపు ముత్తరఁ బ్రీతిన్" అని సలహా యిస్తాఁడు. అప్పు డుత్తరను గై సేసి తెప్పించి యిమ్ముద్దియ నర్జునున కిమ్మనఁగా నాతఁడు ధర్మసూక్ష్మంబు దెలిపి "హరి మేనల్లుఁడు వరియించుఁగాక యభిమన్యుం డీ సరోజాననన్" అన్నాఁడు. అర్జునుని తోడి వియ్యమున కుప్పొంగి, పట్టణాలంకరణంబు సేయించి, యుత్సవంబు సాటింపంబంపగా, వైదిక లౌకిక విధులన్నీ వేదికాలంకరణము పురోహితుఁడు చేసినాఁడఁట. అంత నుత్తర నలంకరింపఁ జేయుట, లగ్నం బాసన్నంబగుచు వచ్చె నని ధర్మతనయున కెఱిఁగింపంబంపుట. యభిమన్యుని శృంగారంబు సేయించి భద్రగజారూఢుం జేసికొని, మఱి గణంబులు, నంబర నికరంబులు ఫల ప్రచయంబులతో విస్తరిల్లిన క్రంత నడిచినదఁట. ఎదుర్కోలు సన్నాహమువారు చల్లు సేసలు గైకొనుచుఁ బెండ్లికొడుకు విరటునింటికి రాఁగాఁ దెర యొద్ద వధూవరుల నిలుపుట, ముహూర్త సమయమున మంగళ తూర్యములు సెలంగఁ దెర యెత్తించుట, వధూవరుల యన్యోన్యావలోకన వర్ణనము, తలంబ్రాలు పోయుట, పాణిగ్రహణము, వధూవరు లేకాసనమునుండి హోమము చేయుట, తాంబూలముల తోడి పళ్ళె రంబుల పచరించి పాండవులకుఁ గట్ట నిచ్చుట; భద్ర సామజ దాస దాసీజనంబుల నరణమిచ్చుట, వార నారీమణుల నృత్యగీతాది వైచిత్ర్యము, కుమారుల చతుర పరిహాస విలాసములు, పాండునందనుల సౌహార్దాదులచేతను నృత్య మందిరము సంపద్భరితమై యుండినదఁట.

మూలమున దానికిని, నన్నయ ద్రౌపదీ వివాహ వర్ణనమునకును, దీనికి నెంత వ్యత్యాసము గలదో పోల్చిచూచిన తెలియఁగలదు. ఇట్టి దాంధ్రావళికి

మోదముం గూర్చుటలో సందేహము లేదు. కాని యాంధ్ర సాహిత్యమున షష్ఠ్యంతములు మొదలుగాఁగల యవతారికా లక్షణములకు నీ దేశీయాచారములతోఁ గూడిన వివాహ వర్ణనమునకు నిదివరలోఁ దిక్కనయే మొదటి వాఁడని చెప్పుకొనే వాళ్ళము. కాని యిప్పుడది మార్చుకొనవలసి యున్నది. నన్నెచోడుని కుమార సంభవము బయలు పడిన పిదప నిట్టి దేశి లక్షణములకు, ననేకములగు ప్రబంధపుఁ బోకడలకు నన్నెచోడుఁడే తెలుఁగు సాహిత్యములో దారి తీసినవాఁడని చెప్పక తప్పదు. కాని యంత మాత్రముచే సర్వవిధముల నప్రతిమాన ప్రతిభావంతుఁ డగు దిక్కనార్యుని కళాప్రతిభల మహత్త్వమున కేమాత్రముఁ గొఱఁత లేదు.

ఇట్లనేక విషయములయందుఁ దిక్కనార్యుఁడు మూలమునందలి విషయములకు మెఱుఁగుపెట్టి, భాషా సాహిత్యముల రెంటను దేశీయతాగుణము పెంపొందునట్లు రచించి, ఆయా కథాపురుషుల హృదయ తత్త్వము, ఆయా కథా సందర్భములందలి విచిత్ర సన్నివేశములు మన కన్నుల యెదుట సాక్షాత్కరించునట్లు వర్ణించుచు మూల కథ కంటెఁ దన రచన యెన్నియో మడుంగులు రమ్యతరం బగునట్లు చేసిన వాఁడైనాఁడు, తిక్కనార్యుని మహత్త్వమే తెలుఁగున భారత కవితా మహత్త్వమును బెంపొందించి, దాని నాంధ్ర సాహిత్యమున కాదర్శ గ్రంథముగాఁ జేసి యాంధ్రుల జీవిత పథమును దిద్ది యాంధ్ర లోకమునఁ గవిత్రయమును బురుషత్రయముతో సమానమైన వారినిఁగా నెలకొల్పినది.

తిక్కన మూలమునకు భిన్నరీతి రచించి మెఱుఁగు పెట్టిన సందర్భములు

(1) భీముఁడు మల్లుని "నుక్కఱభంజింతుఁ జంపు టుడుగుదు"నని చెప్పి చంపక విడుచుట.

(2) పాండవుల ప్రవేశ సందర్భమున వారు వారవలంబింపఁదలఁచిన వృత్తులకు దగిన చిల్లర విషయముల జాబితాలు. వారి ప్రత్యేక లక్షణముల చిత్రీ కరణము.

(3) ధర్మరాజే శమీవృక్షము నెక్కి యాయుధములను వ్రేలఁగట్టుట, భీముఁ డెప్పుడెట్లు చేయునో యను భయముచే వాని నెమ్మెయినయిన వధింపుఁడని, యాయుధములను బ్రార్థించుట.

(4) సింహబలుఁడు "నెల లూర లేఁడని సమర్థించుటకు" "తన యప్ప సుధేష్ణకు మ్రొక్కఁ జనువాఁడు" అని తిక్కన రచించుట.

(5) కీచక వధానంతరము ద్రౌపదిచే "భీముని యుత్తమ నాయకత్వ మెఱుఁ గినను? గొనియాడ నా తరంబే" యని చెప్పించుట.

(6) సూర్యోదయ, సూర్యాస్తమయ, అంధకారాది వర్ణనలు, విరహ వర్ణనమున నుపవన విహార, శిశిరోపచారములఁ బ్రబంధవర్ణనములు.

తిక్కన జాతీయమును గూర్చి చెప్పవలసినది చాల కలదు. కాని కాలము లేదు. "విచారము కోర్కికి గాని నావియే." "ఇట్టి యవగాఢపుఁ బొత్తు మనంగ వచ్చునే." "ఆఁడుఁ బుట్టువుల తోడ నీవును బుట్టినావు", "నేల నాలుగు చెఱఁగుల వర్తించితి". "విసుల దయ్యమెఱుఁగు పడతుల సంతోష మేల నాకు", "తేరెక్కుము తప్పఁ గ్రుంకఁ దీఱదు నీకున్". "రాధేయుం డొక చీరికిం గొనఁడు వీర వ్రాతమున్ బోరులన్", "తొల్లింటి చూఱగలదె", ఒక పలక యాడుదమే", తన యాజ్ఞ సూయాణముగ నొనరించె మంచిగా నేల నాలుగు సెరఁగుల" మొదలగునవి.

౪

తిక్కన - ఉద్యోగ పర్వము

- శ్రీ నండూరి బంగారయ్యగారు

ఆంధ్ర సారస్వత పరిషత్తు తలపెట్టిన యీ భారతోత్సవములు కాలక్షేపము నిమిత్త మేర్పడిన సాహిత్య వినోదములు కావు. ఆంధ్ర మహాభారత మాంధ్ర సారస్వతమునకేగాక విశ్వము నందలి సారస్వతమునకెల్ల నమూల్యాలంకారముగ శోభించుచున్నది. అట్టి మహాకావ్యమునందలి శిల్ప వైభవము నాంధ్రులు పదేపదే స్మరించుకొనుటవలన నూతన చైతన్యమును సంపాదించుకొనఁ గలుగుదురు. ఈ యుత్సవములు "ఆంధ్రావళి" తేజమును మహోజ్జ్వలముగఁ బ్రకాశింపఁజేయు పవిత్ర యజ్ఞములని నా తాత్పర్యము. ఒక్క మీ పట్టణముననేగాక యాంధ్ర దేశమునందున్న ప్రతి పట్టణము నందును, బ్రతి పల్లెయందును నిట్టి యుత్సవములు జరుపవలసి యున్నది. గత కాలమునఁ దమ జాతి యెట్టి యపురూప మాహాత్మ్యమును సాధించినదో తెలిసికొని స్వస్వరూప జ్ఞానమును బెంపొందించుకొనక పోవుట కేవలము తమోగుణలక్షణమని నా మనవి. భారతీయ కళాప్రపంచమున మనకున్న స్థానమును విసర్జించుకొని పద భ్రష్టులమై తిరుగుట యెట్టి దుర్గతియో మీకు నేను వేఱుగా విశదీకరింపనక్కఱలేదు. తులసీదాసు. కంబన్, తుకారాం మున్నగు నితర రాష్ట్రీయ మహాకవులకున్న ప్రఖ్యాతి భారత వర్షమున నన్నయ తిక్కనల కున్నదా? లేకపోవుటకుఁ గారణమేమి? వారిలో నిజమైన మాహాత్మ్యము లేనినాఁడు కేవలము ప్రచారము చేతనే "తొళ్ళిక్కము" పట్టి స్వర్గసీమలకు గెంటవలయునని నా తాత్పర్యము కాదు. కాని నిజమైన మాహాత్మ్య మున్నప్పు డా మాహాత్మ్యమును భూగర్భమునఁ బాఁతి పెట్టుకొని ప్రాలుమాలిక వహించుట యాంధ్రులకే చెల్లినది. కవిత్రయ కృత భారతము ముగిసి యిప్పటి కైదువందల సంవత్సరములు కావచ్చు చున్నను నిట్టి లోకోత్తర గ్రంథరాజము నందలి యథార్థ ప్రాశస్త్యమును నిరూపించుకొనుటకు మన యూనివర్సిటీలు గాని, యితర సంస్థలుగాని యేమియు శ్రద్ధ వహింపకుండట నేమనవలయునో యీ సభవారే నిర్ణయింతురుగాక. ఇట్టి పరిస్థితిలో భారతోత్సవములను దిగ్విజయముగఁ గొనసాగించుచున్న మీకు నా హృదయ పూర్వకమైన యభినందనములు.

ఉద్యోగ పర్వమును గూర్చి ముచ్చటింప వలసినదిగా మీ పరిషత్తు(నా కాజ్ఞాపించినది. ఇది ప్రత్యేక భాగ్యముగా నెంచుకొనుచున్నాను. భారతమునందలి శిల్పకళాలక్ష్మికి వజ్రకిరీట మీ యుద్యోగ పర్వము.

ఒక కావ్యమునందలి మాహాత్మ్యము ననుసంధించుటకు రెండు పద్ధతులు, (1) సమష్టి పద్ధతి. (2) వ్యష్టి పద్ధతి. ప్రకృతిలో రమణీయమైన యొక మహా పర్వతమును గాని, మహానదిని(గాని గైకొందము. వీని సమీపమునకుఁ బోయి యంగోపాంగ విభజన మొనర్చుకొని యానందించుట యొక పద్ధతి, ఒక విమాన మెక్కి కొంతదూరము పై కెగిరి యక్కడనుండి యీ దృశ్యములు మనకిచ్చు నానందమును మొత్తము చేసికొని యానందించుట యింకొక పద్ధతి. అట్లే కావ్యము నందలి యొక్కొక్క పద్యమునే గైకొని దాని వివిధార్థములను నలంకార సౌష్ఠవమును, నితర గుణములను విమర్శించుగొనుచుఁ బోవుట యొక పద్ధతి. దీనిని విభజన పద్ధతి యనిగాని, వ్యష్టి పద్ధతియనిగాని పేర్కొనవచ్చును. అట్లుగాక కావ్యము మొత్తము మీఁద నిచ్చు నానందమునకు నేయే గుణము లెట్లు తోడ్పడుచున్నవో సమూహముపైఁ బరిశీలించుకొనుట యింకొక పద్ధతి. దీనిని సమష్టి పద్ధతియని పేర్కొనవచ్చును. ప్రకృత ముద్యోగ పర్వము నీ సమష్టి దృష్టిమై విమర్శించుకొందము.

ఈ సందర్భమున నింకొక మనవి. తెలుఁగుననున్న యుద్యోగపర్వమును గైకొని నేను గ్రహించినంత వఱకు నవకాశమును బురస్కరించుకొని, దాని యందమును వివరించుటయే ప్రకృతము నేను చేపట్టిన కర్తవ్యము. ఈ యందములో నెంత భాగము వ్యాసునిది? ఎంత భాగము తిక్కనది? అను ప్రశ్నముతో నాకు జోక్యము లేదు. అంతయు వ్యాసునిదేయైనను నాకు సంబరమే. ఉన్న మాహాత్మ్యమును వివరించుటే నాపని. అవసరము వెంబడిని వారికి వాటాలు తెగకపోయినచోఁ దిక్కన మీఁద వ్యాసుఁడుగాని, వ్యాసునిమీఁదఁ దిక్కనగాని పంపకపు దావాలు తెచ్చుకొన నిండు. నిజమున కట్టి పంపకపు దావాల కగత్యమే యుండదని నా విశ్వాసము. సూక్ష్మదృష్టితోఁ జూచినపుడు వ్యాసుఁడే మరల నొక యవతారమెత్తి తెనుఁగు భారతము "వినిర్మించి" నాఁడనిపించును. తిక్కన తన "యహమిక" ను బూర్తిగాఁ జంపుకొని వ్యాసునిలో లీనమై పోయినాఁడు, తిక్కన యాంతరంగిక శిష్యుఁడును, పరమభక్తుఁడు నయిన మారన "నవీన పరాశర సూనుడు" అను విశేషణమును దిక్కన కుపయోగించుటలోని గంభీరార్థ మిదియే యని తోఁచుచున్నది.

విరాటపర్వమునఁ బ్రాధాన్యము కథకు, మనోహరమగు ప్రసంగములు కూడఁ బెక్కులున్నను మొత్తము మీఁద దాని కథకే యాకర్షణశక్తి యత్యధికము. "ఊర్జిత కథోపేతంబు". "నానా రసాభ్యుదయోల్లాసి" యను విశేణములను బట్టి తిక్కనయే యీ యంశమును సూచించినాఁడు. ఉద్యోగపర్వముననున్న చమత్కృతియంతయు బ్రసంగాశ్రయమే. ఇంత చక్కని ప్రసంగము లాంధ్రవాఙ్మయమున నింకెక్కడను లేవు. ఈ ప్రసంగములు మరల ద్వివిధములు, పరస్పర ప్రసంగములని, యుప న్యాసములని, వ్యక్తు లొండొకరితోఁ జేయు సంభాషణములు పరస్పర ప్రసంగములు. జనసమూహము మనస్సు నాకర్షింపఁజేయుటకై సభావేదిక నెక్కి చేయు ప్రసంగము లుపన్యాసములు, ద్రుపదుని పురోహితుఁడును శ్రీకృష్ణుఁడును గౌరవ సభలోను సంజయుఁడుపప్లావ్యపురమున ధర్మరాజు పేరోలగమునను జేసిన ప్రసంగము లిందుఁజేరును. ఇవిగాక నీవనులు symposiums అని పేర్కొను సంప్రదింపులు కూడ నిందున్నవి. అభిమన్యుని వివాహానంతరము విరాటుని కొలువు కూటమునను, సంజయుఁడు పాండవులయొద్దనుండి తిరిగి వచ్చిన వెనుక ధృతరాష్ట్రుని కొలువుకూటమునను, నుపప్లావ్యపురమున మాధవుని మందిరమున ద్వితీయాశ్వాస ప్రారంభమున జరిగిన పాండవుల సమావేశమును నీ సంప్రదింపుల కుదాహరణములు. ఈ పర్వమునకుఁ జేసిన నామకరణములోనున్న యుద్యోగ శబ్దమునకు బ్రయత్నమనికదా యర్థము. దేని నిమిత్తము ప్రయత్నమని ప్రశ్న. సంధి ప్రయత్నమును బట్టి దీని కీ పేరు వచ్చినదా? సమరప్రయత్నమును బట్టి దీని కీ పేరు వచ్చినదా? ఇందు జరిగిన సంధి ప్రయత్నములందు నిజముగా విశ్వాసమున్నవారల్పసంఖ్యాకులు. ఒక్క ధర్మజుఁడు తప్ప నిజముగా సంధి జరుగునని విశ్వసించినవా రెవ్వరును గనఁబడరు. అతనికైన నీ విశ్వాసము దృఢముగ నున్నదో లేదో నిశ్చయించుట కష్టసాధ్యము. ఇందు జరిగిన సంధి ప్రయత్నము లన్నియు నేపక్షమున కాపక్షము "తనయందేమియుఁ దప్పులేదు, తప్పంతయు నెదుటి పక్షముదే" యని నిరూపించి జనాభిప్రాయమును జూఱగొనుటకు జరిగించినదే. అందుచే సంధి ప్రయత్నములకు విస్తృతి యధికముగా నున్నను బ్రాధాన్యమంతయు సమర ప్రయత్నములదే, సంధి ప్రయత్నములుగూడ సమర ప్రయత్నములకు బలము చేకూర్చుటకు జరిగినవే యగుటచే నీ పర్వమును సమరోద్యోగ పర్వముగనే భావించుట యుక్తము.

ప్రాసంగికేతివృత్తములు

ఇందుఁ బ్రాసంగికేతివృత్తములు కొన్ని యున్నవి. మొదటి యాశ్వాసమునఁ బురందర విజయోపాఖ్యానము, చతుర్థాశ్వాసమున అంబోపాఖ్యానము ముఖ్యమైనవి.

ప్రజాగరణ వృత్తాంతము ప్రాసంగికము కాదుగాని కేవలము నీతిబోధతత్త్వబోధ యగుటచే విసుగు జనింపఁజేయఁదగియున్నది. కాని వీనినిఁగూడా మిక్కిలి సంగ్రహించుటవలనను బ్రకృత కథకుఁ బ్రత్యక్షముగ నుపకరించునట్లు చేసికొనుటవలనను వస్తు గమనము నవి యే మాత్రము నరికట్టుట లేదు. పురందర విజయోపాఖ్యానము గై కొందము. ఇందలి యితివృత్తము వృత్రాసుర వధ, ఈ వధను గొంత విపులముగ వర్ణించుటలో నున్న యభిప్రాయమును.

ఉ. "కౌరవనాథుఁడా నహుషు కైవడి నాశముఁ బొందు; వాసవ
శ్రీరమణీయుఁడై జయము సేకొని ధర్మజుఁ డంబురాశి వే
లారశనా సముజ్జ్వల విలాస మనోహర మేదినీ వధూ
సార సమగ్ర భోగముల సన్నుతికెక్కెడుఁ దానుఁ దమ్ములున్."

అను పద్యము ప్రధాన వస్తువుతోఁ గల సంబంధము విశదీకరించుచున్నది. ఇంకొక రహస్యము కూడ నున్నట్లు కనఁబడుచున్నది. బహుశః ఈ వృత్తాంతమునంతను యుధిష్ఠిరుఁ డితరత్ర యదివఱకే వినియుండకపోఁడు. కాని శల్యుని గొప్ప చేసి యాతని వలన నీ వృత్తాంతము నంతయు వినుటవలన నాతని మనస్సు వశపఱచు కొనుచున్నాఁడు. శల్యుని శీలములో నుపచార ప్రియత్వ మొక ప్రత్యేక లక్షణము. అందుచే యుధిష్ఠిరుఁ డాతని కీ విధముగ గౌరవోపచార మొనరించి మున్ముం దాతని వలన సాధింప నెంచిన యర్థమునకు దోహదము చేసికొనుచున్నాఁడు.

ఇట్లే ప్రజాగరణ పర్వమును జూచినను గేవలము నీతిశాస్త్ర విన్యాసముగాఁ బోవుచున్న దాని గతులను మాటిమాటికి "పాండవులకుఁ బాలు పంచియిచ్చుట కంటెఁ గర్తవ్యము లేదు'' అను మతమువంకఁ ద్రిప్పుచు నేకాగ్ర మొనర్చుటయేగాక సందర్భశుద్ధి గలదానిఁగాఁ గూడఁ జేసికొనుచున్నాఁడు, అంబోపాఖ్యానమునఁగల ప్రస్తుతత్వము ప్రత్యక్షముగఁ గనవచ్చుచునే యున్నది, వేఱుగ వివరింప నక్కఱ లేదు.

మూలము నందలి సనత్సుజాతీయము తెలుఁగున నించుమించుగా లుప్తమైనట్లే యెంచవచ్చును, ఇందులకుఁ గొందఱు తిక్కనను మహాపరాధిఁగాఁ బరిగణించుచున్నారు. కాని కావ్యరస దృష్టితోఁ జూచినపు డీ శాస్త్ర గ్రంథ మిక్కడ లేకుండుటవలన రసము, వస్తువు రెండును విక్షిప్తములు గాలేదు. శాస్త్రభాగము నంతను శాంతి, ఆనుశాసనికము, అశ్వమేధము మున్నగు పర్వములలో విశదీకరింప వచ్చుననియు, నచ్చట నున్నచో వస్తుగమనము నరికట్టవనియుఁ గావ్యరస తత్త్వ

వేత్తయగు తిక్కన నిర్ణయించుకొని యుండవచ్చును. కొందఱిది గుహ్యమైన యోగశాస్త్రము గావున నాతడు విడిచి పెట్టియుండవచ్చునని యూహించుచున్నారు. "పరతత్త్వముఁ బ్రసాదించునట్టి గూఢోక్తులను గ్రహించుచుండ" అను వాక్య భాగము వారి యీ వాదనకుఁ జేయూఁతగా నున్నది. కాని యోగశాస్త్రమును గూఢ మని యెంచి విసర్జింపవలసి వచ్చినచో బైనఁ జెప్పిన మూఁడు పర్వములలో విస్తార భాగము లుప్తము కావలసినదే. భారతమున శాస్త్రభాగమునఁ జాల పునరుక్తి యున్నది. సనత్సుజాతీయము, భగవద్గీత, ఉత్తరగీత, అనుగీత మున్నగున వెన్నియో యొక్కొక్కటి ప్రత్యేకముగఁ గైకొన్నప్పు డెంతో మనోహరములగు గ్రంథరాజములే యయ్యును సమూహముగఁ జేర్చి చూచినపుడు చాలభాగము చెప్పినదే చెప్పుట యగుచున్నది. తిక్కన కేవలము "వేదభారవాహి" గానందున నాధ్యాత్మిక సంపద నంతయు గ్రంథముల మూలముననే గాకుండ ననుభవమునఁ గూడ నాపోశనము పట్టినవాఁడగుటచే శాస్త్రభాగమునంతను బూర్ణముగా జీర్ణము చేసికొని వానినిఁ బ్రత్యేకముగఁ గేటాయించి సమర సంరంభము ముగిసిన వెనుక శాంతి యుతముగఁ గూర్చున్నప్పుడు ధర్మజాదుల ప్రసంగములలోఁ గ్రోడీకరించినాఁడు. ఇట్లగుటచే విషయ విభాగమునందును రసస్ఫూర్తి యందునుగూడ నాంధ్ర మహా భారత మున్నత సోపానము లధిరోహించుచు మూలమును మించుచున్నది. దేనిని లోపముగఁ గొందఱు మనీషులు పరిగణింపఁ జూచుచున్నారో యదియే తిక్కన విమర్శనా శక్తికిని, నుచితజ్ఞతకును నిశితమైన తార్కాణముగా నాఁకుఁదోఁచుచున్నది.

ద్వితీయాశ్వాసమున నొక్కచో (107వ పద్యము మొదలు 115వ పద్యము వఱకు) ప్రాతఃకాలవర్ణన మున్నది. దీనిని వర్జించినను గావ్య సౌందర్యమున కెట్టి లోపము రానేరాదు. వాల్మీకివలెఁగాని, కాళిదాసువలెఁగాని ప్రకృతి తాదాత్మ్యము నొంది చేసిన వర్ణనము గాదిది. మధ్యకాలమునందలి సంస్కృత కవుల కృత్రిమ వర్ణనలతో వియ్యమందుచున్నది. దీని నంత దోషముగా ఖండింప నక్కఱలేదు గాని గుణముగా నెంచి పూజించుటకు మాత్రము బుద్ధిపుట్టకున్నది.

ఇఁకఁ బ్రధాన వస్తువును గైకొన్నచో నత్యంత ప్రాముఖ్యము వహించు చున్నవి కృష్ణరాయబారమును, సంజయరాయబారమును, 415 పద్యములున్న తృతీయాశ్వాసమంతయును, జతుర్థాశ్వాసమునందలి మొదటి 93 పద్యములును మొత్తము రమారమి 508 పద్యములు కృష్ణరాయబారము ప్రథమాశ్వాసమున 258 మొదలుకొని యా యాశ్వాసము తుదివఱకును 334 పద్యములు గలిగిన ద్వితీయా శ్వాసమంతయును మొత్తము రమారమి 461 పద్యములు సంజయ

రాయబారము ఇదిగాక విరటుని కొలువుకూటమున జరిగిన సంప్రదింపు సభయు, ద్రుపద పురోహితుని రాయబారమును, చతుర్థాశ్వాసమున 93 పద్యము మొదలుకొని 426 వఱకు ననఁగా నాశ్వాసాంతము వఱకు జరిగిన సేనానాయక నిర్ణయమును బరస్పర బలాబల నిరూపణమును బ్రధాన వస్తువులోఁ జేరుచున్నవే.

ప్రధానవస్తుసంవిధానము

ఉద్యోగపర్వమున నన్నిటికంటెను మిక్కిలి మెచ్చుకొనఁదగినది వస్తుసంవిధాన చాతుర్యము. దీనినే వస్తుప్రదర్శనశక్తి యనికూడఁ బేర్కొనవచ్చును. ఇందున్న రాయబారములకుఁగాని, ప్రసంగములకుఁగాని, సారాంశము తెల్పవలసి వచ్చినచో మూఁడు వాక్యములలోఁ జెప్పవచ్చును. "దుర్యోధనాదులు పాండవులపై నకారణముగఁ బగఁబూని శైశవమునుండియుఁ బడరాని యిడుములకుఁబాల్పఱచిరి. అన్నిటికి నోర్చుకొని పాండవులు శాంతాత్ములై తమ తండ్రిపాలు తమకిచ్చినచో సంధియగునని వార్త పంపుచున్నారు. వారి తండ్రిపాలు వారికిచ్చుటకంటెను న్యాయ మేమున్నది." కృష్ణుఁడే కానిండు, విదుర సంజయులే కానిండు, గాంధారీ ధృతరాష్ట్రులే కానిండు, ఎందరు చెప్పిన వాక్యములకైన నింతే సారాంశము. అందుచే పర్వమునందలి వస్తువునంతను నించుమించుగఁ బునరుక్తి క్రింద జమకట్టుకొన వలసియున్నది. కాని యీ పునరుక్తి నేమాత్రమును విసుగు రానీయకుండఁ బ్రపంచించుటలోనే ప్రదర్శన ప్రాగల్భ్యమున్నది.

ఇందు రాయబారము నెరపినవారు ముఖ్యముగా ముగ్గురు. (1) ద్రుపదుని పురోహితుఁడు, (2) సంజయుఁడు, (3) శ్రీకృష్ణుఁడుఁ. ద్రుపదుని పురోహితుఁడు పారుష్యముతో సత్యమును బ్రదర్శించుచున్నాఁడు.

ధృతరాష్ట్రుని సభలో నిలిచి
...........................దీనికినెల్ల నియ్య
కొనియె నీ పెద్దరాజు నేమనఁగనేర్తు? ధృతరాష్ట్రునకున్
గారవమున బుద్ధి చెప్పఁగాఁదగు మీకున్"

ఇత్యాది వాక్యములతోనే ధృతరాష్ట్రుని హృదయమును గరఁగించి తాను కార్యము నిర్వహించుకొనవలసి యున్నదో యా ధృతరాష్ట్రునే మోటుగా దూఱు చున్నాఁడు. ఇది మన కొక్కరికే తోఁచిన యభిప్రాయము కాదు. ఆనాఁడా సభలోనున్న భీష్మునికిఁ గూడఁతోఁచి

"నీ వాక్యము విప్రస్వా
భావికమై యిట్లు శ్రుతికిఁబరుషం బయిున్"

అని యాతనిచే ననిపించినది. సంజయుఁడు మిక్కిలి చతురభాషణుఁడు. "దుర్ణయమును బెట్టిదమును బెండును నగు పలుకొదవదు నీ నాలుకకు నయోన్నత యెపుడున్" అని ధర్మరాజు మెప్పునందుకొన్నాఁడు. ఎంత కఠినమైన భావమునైనను మధురముగఁ బ్రదర్శింపఁగల శక్తి యితనికున్నది. ఇందులకు ప్రథమాశ్వాసము 291వ పద్యము మొదలుకొని 302వ పద్యము వఱకునుగల యాతని యుపన్యాసమే తార్కాణము. ఇంకొక్కటి; ధర్మజుని కొలువుకూటమున నిలిచి యెట్టి పాలు పుచ్చు కొనకుండఁగనే యహింసాధర్మమును బాటించి యరణ్యమునకుఁ బోవలసినదిగా నుపదేశించుచున్నాఁడు (328-333) ఈ యుపదేశమును సంగ్రహించి నప్పుడు యెంతో కటువుగఁ గనవచ్చు చున్నది. కాని యాతని నోట నిది యెంత మార్దవమును బ్రత్యక్షపఱచుచున్నదో చూడుఁడు.

ఉ. నావిని సంజయుండు నరనాథున కిట్లను; నెట్టి తప్పులుం
బోవఁగఁ ద్రోచి తాలిమియ పూనుదు గావున నన్నిమాటల
ట్లీవు వినంగ నాడియును నేఁ దనివోవక విన్నవించెదన్;
నీ విభవం బహింసయు ననింద్యచరిత్రమ కాక యన్యమే?

క. పాలిక కౌరవులు దుశ్శీలతఁ జెడఁదలఁచిరేనిఁ జెప్పెద రుధిరా
భీలాన్నంబున కంటెను మేలగు భిక్షాన్నమైన మీ నడవడికిన్॥

వ. అది యెట్లంటేని.

సీ. రాజసూయ మహాధ్వరం బట్లు నడపి స
ద్విజులకు సురులకుఁ దృప్తి(జేసి,
శాంతియు, దాంతియు సకల లోకంబులఁ
బొగడొందఁ బ్రదికిన పుణ్యమూర్తి
విట్టి నీచరితంబు హింసా కళంకిత
మగు టెంత యొప్పదు? నదియుఁగాక
దుర్ణయవృత్తి దుర్ద్యూతంబుః బుట్టించి
యంతలు సేసిన యట్టివారి

తే. నేల గర్వంబు సెల్లంగవిచ్చి జగము
చేతఁ దిట్టులు వడునట్లు సేసిపోయి

తేల? యడవుల నిమ్మయి నిడుమగుడిచి
తేల తాల్మియ ధనముగా నింతవడితి?

క. తుదిఁబోయి క్రూరకర్మాస్పదమగు తెఱఁగునకుఁజొచ్చి బంధుల గురులన్
వెదకి వధియించు సౌఖ్యంబదియేటికి? నార్యనింద్య మస్థిర మరయన్.

తే. అల్పులకు మ్రింగఁ జేదయిన హాలహలము
భంగిఁ బొంగెడు కోపంబు మ్రింగికొనఁగ
నీలగళునెన్ని నిన్నెన్నఁ బోలు నట్టి
నీవు సాలినఁగాకేల నెగడుఁ బేరు?

కౌరవులు సేసిన దుర్ణయంబులు పెక్కులు వానిని సమర్థించుట చాల దుస్తరము. సంజయుఁడైనను వానిని సమర్థింపఁజూచుటలేదు. తా నవలంబింపఁ దలఁచు కొన్న పక్షముననున్న నీరసము నంతను మున్ముందుగ నొప్పుకొనుటలోనే యతని గడుసుఁదన మున్నది. దీని నిప్పుడు మనవారు (Concession) అను కళా ప్రావీణ్యముగఁ బరిగణించుచున్నారు. అసమర్థనీయమైనదానిని మున్ముందుగా నొప్పుకొనుటవలన "నీతఁడెంత యుదారస్వభావుఁడో" యను భావ మెదుటివారికిఁ గలిగి వారి చిత్తమును వశముచేసికొనుటకు సాధనమగుచున్నది. ఎదుటివారితో నేకీభవించినట్లుగాఁ గనఁబడుచు వారిని మెల్లఁగ బాట దప్పించి తనవంకకుఁ ద్రిప్పు కొనుట యిందున్న నేర్పు. కౌరవపక్షమున కనుకూలముగ వాదించుట యత్యంత దుర్ఘటమైన సన్నివేశము, ఈ దుర్బల వాదమునకుఁ గూడ సంజయుని నైపుణ్య మమోఘమగు శక్తినిఁ బ్రసాదించుచున్నది. కౌరవ సభలో శ్రీకృష్ణుఁడిచ్చిన మొదటి యుపన్యాసముఁ (తృ. ఆ 256-284) దీసికొన్నచో సారాంశము తేల్చ వలసివచ్చినప్పుడు ద్రుపదుని పురోహితుఁడు చెప్పిన యంశములనే కృష్ణుఁడును జెప్పుచున్నాఁడు. కాని ప్రదర్శనశక్తియందెంత తారతమ్యమున్నది? విప్రుని యుపన్యాసమునకుఁ బారుష్యము, సంజయుని యుపన్యాసమునకుఁ జాతుర్యము ప్రధాన లక్షణములైనచోఁ గృష్ణుని యుపన్యాసమున కౌజ్జ్వల్యము ప్రధాన లక్షణ మనవలసి వచ్చును. ఆతని మాటలు దేదీప్యమానములుగ వెలుఁగుచున్నవి. కాని యీ వెలుఁగు సహించుకొనరాని వేఁడిమి నిచ్చుటలేదుఁ ఇందు సూర్యతేజమును జంద్రజ్యోత్స్నయు సమ్మేళనమొందినవి. రవిదీప్తిలోనున్న సాంద్రత, వెన్నెలలో నున్న చల్లఁదనము నొక్కుమ్మడి నేకీభవించి సదస్యుల హృదయములను హర్షోత్ఫుల్లములు గావించుచున్నవి. ఆ సదస్సులో నున్న వారు సాధారణ మర్త్యులు గారు. నారదాది దేవర్షులు, భీష్మాది రాజర్షులు, విదురాది నీతినిపుణులు, నగాధమైన యనుభూతి, యపారమైన శాస్త్రపాండిత్యము, విస్తారమైన దేశాటనము (నారదుఁడు త్రిలోక

సంచారికదా! ఇంద్రసభలో బృహస్పతి యుపన్యాసమును. బ్రహ్మసభలో వాణీ సాక్షాత్కారమును ననుసంధించినవాఁడు) గల యా మహాత్ములను గూడ స్తబ్ధులను గావింపఁ జాలిన యుపన్యాస మది. సభ్యులపై దాని మహిమను వర్ణించుచు వ్రాసిన-

చ. "అనవుడు రోమహర్షణము లంగములం బొడమన్ సదస్యు లె
ల్లను బ్రియమంది నెమ్మనములం బురుషోత్తముఁ డింత యొప్పఁ బ
ల్కునె! మఱుమాటలాడ నయకోవిదుఁ డెవ్వఁడు? ధీరుఁ డెవ్వఁ? డిం
దనువరి యెవ్వఁ? డంచు నచలాకృతులై నెఱినూఱకుండగన్"

అను పద్యమున దాని విశిష్టగుణము వ్యక్తీకృత మగుచున్నది. విదుర భీష్ముల పాండిత్యము మనకు భారతమునందే పలుతావుల విస్తారముగఁ బ్రత్యక్ష మగు చున్నది, అట్టి గంభీర స్వభావులు కూడ మెచ్చుకొనఁదగిన గుణము లీ యుపన్యాస మునందున్న వనినమాట. ఈ యుపన్యాసము ప్రారంభింపక పూర్వ మంతరిక్షము నుండి యీ యుపన్యాసము వినువేడుకతో మహర్షుల నవతరింపఁ జేయుటవలనఁ గవి దీనికొక ప్రత్యేక గౌరవము కల్పించుకొనుచున్నాఁడు.

ఈనాఁడు పార్లమెంటరీ చర్చలలోనేమి, సమర ప్రచారమున నేమి, యెలక్షను (Elections) లలో నేమి, వక్తృత్వమున కొక ప్రత్యేక గౌరవమున్నది. దీనినొక కళగా నభ్యసించి యారాధించుచున్నాము. ఉపన్యాసము నెట్లు మొదలు పెట్టవలెనో క్రమముగఁ బ్రతిపాద్య విషయము నెట్లు విపులీకరించుకొనవలయునో యీ యంశముల నన్నింటిని జాగరూకతతోఁ గృషిచేసి సాధించుచున్నాము. భారతమున గూడ 'సభలో నెట్లుపన్యసింపవలయును' అను ప్రశ్నకు సమాధానము లభ్యమగుచున్నది.

క. మనమునకుఁ బ్రియంబును హిత
మును బథ్యముఁ దథ్యము నమోఘము మధురం
బును బరిమితమును నగు పలు
కొనరఁగఁ బలుకునది ధర్మయుతముగ సభలన్."

ఈ గుణము లన్నిటికి లక్ష్యభూతములు కాఁదగియున్నవి సంజయ శ్రీకృష్ణుల యుపన్యాసములు. వాక్యోపవాక్యముల నిర్మాణమునందును, విషయ విభాగము నందును, వస్తు ప్రదర్శన శక్తియందును నివి ప్రత్యేకముగఁ బరిశోధనార్హములు. ఉపన్యాసకళకు నాదర్శముగ గ్రహించి వీని నారాధించినను నారాధింపవచ్చును.

మచ్చున కొక యుపన్యాసమును గైకొని నిరూపించిననేగాని యిది కేవలము స్తుతిగాఁ గానవచ్చును. శ్రీకృష్ణుని యుపన్యాసమునే గైకొందము.

కం. "అంబుద శుభగాత్రుం బీ, తాంబరధరుఁ గమలదళనిభాక్షున్ హరిఁజూ
డంబడసి లోచనము లమృతం బానినమాడ్కి సమ్మదంబునఁ దేలన్.
(తృ ఆ. 254)

కం. "ఆ కొలువునందుఁ గర మచ
లాకృతి నొక పలుకులేక యిందఱు వింజం
బాఁకిడినకరణి, నవశము
దాకారిత చిత్తవృత్తులై యుండంగన్"

కం. జలదస్వన గంభీరత
నెలుఁగొప్పఁగ, దంతదీప్తు లెసఁగ ముకుందుం
డలరు చెవుల నఖిల జనం
బులు విన ధృతరాష్ట్ర భూవిభున కిట్లనియెన్.

ఈ మూఁడు పద్యములలోను నుపన్యాసకుని స్వరూపములు గవి వర్ణించుచున్నాఁడు. చక్కని యాకృతివిశేష ముపన్యాసకున కెంత సాహాయ్యకారియో వేఱుగ వివరింప నక్కఱలేదు. ప్రపంచమునందలి వక్తలకెల్ల నగ్రేసరుఁ డనఁ దగిన వివేకానందునిఁ గొనియాడుచు నమెరికాలోని పత్రికలు మున్ముం దాతని యాకృతి విశేషము (Personality) గీర్తించినవి. ఇక్కడఁ గవి యుపయోగించినది రేఖా చిత్రణము. దీర్ఘవర్ణనకుఁ గడంగక యొకటి రెండు రేఖల మూలముననే విగ్రహమునంతను మన యెదుటఁ బెట్టుచున్నాఁడు. నిగనిగలాడు శ్యామలవర్ణము, దానికి వ్యత్యాసనిరూపణము నేర్పఱుపజాలు పీతాంబరము (వివేకానందుని కాషాయ వస్త్రము (Organge robe నాతని యుపన్యాసముల కొక వింత చెలువముఁ గూర్చినదని యానాటి పత్రికలు వర్ణించినవి). మేఘగంభీరమైన కంఠధ్వని (ఉపన్యాసకునకు ముఖ్యము స్వరసౌష్ఠవమే గదా!), దంతదీప్తులు-ఇదే వర్ణిత మయినది. నల్లనివారికి వ్యత్యాస నిరూపణము వలన వారి దంతకాంతులు ప్రాముఖ్యముఁ బడయును. ఈ యాకృతి సంపదకు సభ "వింజంబాఁకిడిన కరణి" నున్నదఁట!

ఇఁకఁ బ్రారంభమును దిలకింతము.

కం. "జననాథ నీ యెఱుంగని
పనులు గలవె? యైనఁ దగవు పరమహితంబుం

దన వారికిఁ జెప్పన తగు
నని వచ్చితి; భారతాన్వయము ప్రియ మొందన్. 257

మానవ స్వభావమును బాగుగ మథించినవారుగాని యిట్టి ప్రారంభమును జేయఁజాలరు. ముఖ్యుఁడు. ధృతరాష్ట్రుడు. అతఁడు కృష్ణునికంటె వయసులోఁ బెద్దవాఁడు. అతని కుపదేశించినట్లుండరాదు. అందుచే "నీకుఁ దెలియని దేమున్నది?'' అనుటతో నుపన్యాస మారంభమగుచున్నది. అట్లయిన 'నీ వెందుకు వచ్చితివి?' అను ప్రశ్నమునకు సమాధానము పై పద్యములోనే యున్నది.

కం. "క్షీరోదకగతిఁ బాండవ
కౌరవు లొడఁగూడి మనికి కార్యం; బది నీ
వారసి నడుపుము; వారన
వీరనఁ గురుముఖ్య! నీకు వేఱుం గలదే?

ఉపన్యాసకుఁడు తాను చెప్పఁదలఁచుకొన్న సారాంశమును దుదివఱకు దాచి పెట్టుట (Suspence) యొక పద్ధతి, సారాంశమును ముందుగ సూటిగఁ జెప్పి వేయుట మఱియొక పద్ధతి. ఈ పద్ధతి నవలంబించి శ్రీకృష్ణుఁడు ముందే యరఁటి పండొలిచి చేతఁ బెట్టినట్లు చెప్పివేయుచున్నాఁడు. ఈ పద్య ముపన్యాసమున కంతకును బీజప్రాయము. తరువాత యుపన్యాస మంతయు దీనికి విశదీకరణమే.

ఈ ప్రకారము విపులీకరించుచుఁ బోయినచో నెంత గ్రంథమయినను వ్రాయవచ్చును. సాధారణముగ నిట్టి యుపన్యాసములలోని విషయ విభాగమును గవియే వేఱొకచోట (తృ. ఆ. 388) "తల్లి చిత్తంబున గర్వించుచు నతనికి ధర్మంబును, నీతియుఁ, జుట్టఱికంబును, బ్రదుకుఁదెరువును, నిజశక్తియు సహాయంబు కొలఁదియు, గురుజన చిత్తప్రకారంబును, బాండుపుత్రుల బలపరాక్రమములను దెలియునట్లుగా! దెఱంగువడం జెప్పి బుజ్జగించియుఁ, గినిసియు ననేక విధంబుల నాడిన యమ్మాట" లనుటలో వ్యక్తీకరించుచున్నాఁడు. తన వచన రచనలోని యమూల్య రహస్యములను గృష్ణుఁడే వేఱొకచో (ఆ. 4. వ. 83) విపులీకరించుచున్నాఁడు. "ఏనును నా యోపినంత సామవాదంబు లాడితి, నారదాది మహామునులను సుయోధనునకు బుద్ధు లేమి సెప్పినను నెంతటఁ బోకున్నం గినుకదెచ్చుకొని జంకించియుఁ భంగించియు, ధిక్కరించియుఁ, దృణీకరించియుం జూచితి. కార్యంబు భగ్నంబగుట కొల్లక వెండియు శాంతివచనంబులు వలికితి.'' ఇది యాతని శిల్ప విధానము (Technique). ఇందలి యసమాపక క్రియలోకే భాగమునకుఁ బర్యాయపదములు గావు వేఱు వేఱు

పద్ధతులను బేర్కొనుచున్నవి. ఉద్ధృత భాగములను బట్టి యా యుపన్యాసములోనున్న శిల్పవైభవ మంతయు బుద్ధిపూర్వకమైనదే యని తేలుచున్నది.

ఇంచుమించుంచుగ నందఱి యుపన్యాసకుల కిదే సారాంశమైనను నొకరు చెప్పినట్లుగ నింకొకరు చెప్పరు. ద్రోణ, భీష్ము లిరువురిచేతను గవి దుర్యోధనునకు బుద్ధి చెప్పించుచున్నాఁడు.

(344, 345, 346, ఆ. 3)

చ. "అన విని భీష్ముఁ డిట్లనియె నా ధృతరాష్ట్ర తనూజుతోడ" నీ
జనకుని మాట పట్టుము ప్రసన్న మతిన్ మన వంశమెల్లఁ బా
వనముగ నిందువచ్చి బుధవత్సలుఁ డీ హరి యిట్లు సెప్పఁగా
వినమి గడుం జెడుందెరువు; వీరుల పం పొనరింపు పెంపుగన్"

క. "మానక ధృతరాష్ట్రుఁడు ప్రా
ణానం గలుగంగ, బంధునాశము, రాజ్య
శ్రీనాశము, నుద్దామ య
శోనాశముఁ జేయ నేలఁ జూచెదు చెపుమా!

వ. కృష్ణార్జునులతోడి విరోధం బీ బంధులోకంబునకే కాదు. లోకంబున నెవ్వరికినిం జూడంబోలదు. లోకంబులు రెంటి హానింజేయక కూడి బ్రదుకుట మేలు." అనినం దదనంతరంబ ద్రోణాచార్యుండు దుర్యోధనున కిట్లనియె.

భీష్ముఁడు తాతగారు. అతనికిఁ జనువున్నది. అందుచే బంధునాశమును గూర్చి రాజ్యశ్రీనాశమునుగూర్చి, యుద్దామ యశోనాశమును గూర్చి స్పష్టముగఁ జెప్పుచున్నాఁడు. అదే సందర్భమున ద్రోణుఁడుకూడ బుద్ధి జెప్పుచున్నాఁడు (347, 248). అతని కంత చనువు లేదు. అందుచే "నిన్ను నొండననేరము. నిండుకొల్వునన" అని యెంత యౌచిత్యముతో ననునయించుచున్నాఁడు.

తే. "పితృపితామహ గురులమై ప్రీతిఁగోరు
చున్న యట్టి మా పరమ హితోపదేశ
వాక్యములు విని దుర్జన వచన రచనఁ
గొనక బంధులతో నొడఁగూడి మనుము."

ఉ. "వెన్నుఁడు ప్రీతిఁ జెప్పిన సవిస్తర వాక్ప్రచయంబు త్రోవఁ బో
వన్న కుమార యిట్లయిన నాయువు శ్రీయును నీకుఁ గల్గు మా

కన్నులు నల్లఁగా నకట గన్గొనుచుండుదు మేము నట్లు గా
కున్నను నీవ నేర్తు విను నొండననేరము నిండుకొల్వునన్." 343

వ్యక్తులు వేఱయినపుడు వైవిధ్య మేర్పడుటయేగాక యొకవ్యక్తి యొకసారి చెప్పినట్లుగా నింకొకసారి చెప్పఁడు. తృతీయాశ్వాసమున శ్రీకృష్ణుఁడే మొదట నుపన్యసించినాఁడు (256 నుంచి 286 వఱకు). మరల ధృతరాష్ట్రుని ప్రార్థనమున దుర్యోధనునకు బుద్ధిచెప్ప నారంభించినాఁడు. (330-343) దాని కాతఁ డనుచిత మైనసమాధాన మీయఁగఁ గినుక వొడమి "పుండరీకాక్షుఁడగు టెల్లఁబోయి యరుణ కమలాక్షుఁడగుచు" నిప్పులు గురిసినాఁడు. (246-271). ఈ మూఁడు ఘట్టములను బరిశీలించి చూచినచో నొకదానికంటె నొకటి స్థాయి హెచ్చుట. కాలము (సంగీత పరిభాష) మఱుట మున్నగు లక్షణము లెన్నో గానవచ్చును. దేని కను గుణమైన శైలి దానికి వాడినాఁడు. సభావేదికపై నిచ్చిన యుపన్యాసము సదస్సును ముగ్ధముచేయుట కేర్పడినది. తక్కినవి రెండును నొక వ్యక్తిని సంస్కరించుట కేర్పడినవి, ప్రయోజన భేదమునుబట్టి శైలిలో భేదముకూడ సిద్ధించుచున్నది.

ఇట్లే సంధికి బయలుదేరుటకుముందు శ్రీకృష్ణునితోఁ దమతమ యభిప్రాయములను బాండవులు ప్రకటించుచున్నారు. ముందు ధర్మరాజొక విధముగఁ బోయినాఁడు. మనసులో నెట్లున్నను భీముఁడు, అర్జునుఁడు, నకుఁ లుడు. "నాతని యభిప్రాయమే మా యభిప్రాయ" మనుచున్నారు. కాని యీ యనుటలోనెంత వైవిధ్యమున్నది? భీముఁడొక్కమాఱుగ నుడికిన బంగాళాదుంపవలె మెత్తఁబడిపోవు చున్నాడు.

గీ. **"అన్నదమ్ములమై యుండి యకట! మనల**
నొరులు తలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగ నేటికి నీ నేలఁ బెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోలదొక్కొ."

ఇంతకంటె ప్రౌఢ సంస్కారముండుటచే "గాండీవంబు దివ్యాస్త్రసంతతియు బెట్టినయట్లుండ మముఁ జింతం బాపరాదో కదే" అని యర్జునుఁడు సన్నాయి నొక్కులు నొక్కుచున్నాఁడు. ఒకరు చెప్పిన దానిని మఱియొకరు పునరుక్తి గావింపక సరిక్రొత్త యంశములచే నూతన బలమును చేకూర్చుచున్నారు. సహదేవుఁ డును ద్రౌపదియు యుధిష్ఠిరుని మతమును బ్రతిఘటించినారు. సహదేవుని వాక్కులు సూటిగ నున్నవి.

ఉ. "రక్కసమాట లాడెదరు రాజును దమ్ములు వానిలోన నీ
వొక్కటియైనఁ గాదనక యూకొనుచుండుట యంతకంటె మే
లక్కట! యిట్లు వేఁడికొననై నను బోయెదవో? సుయోధనుం
డెక్కడ భూమిలోన సగమిచ్చుట యెక్కడ దానవాంతకా!" (94)

కాని ద్రౌపది వాక్యములు పరస్పర విరుద్ధములగు భావసంఘట్టనచే వ్యాజోక్తులుగఁ బరిణమించినవి. నయ నిష్ఠురములతో నామె యగ్నివర్షము గురిసినది.

క. "ఇవి దుస్ససేను వ్రేళ్ళం
దవిలి సగముఁద్రెవ్విపోయి దక్కినయవి కౌ
రవుల కడఁ దీఱుమాటల
యవసరమునఁ దలపవలయు నచ్యుత వీనిన్." (116)

సీ. "ఈ వెంట్రుకలు పట్టి యీడ్చిన యాచేయి
దొలుతగాఁ బోరిలో దుస్ససేను
తను వింతలింతలు దునియలై చెదరి రూ
పఱియున్నఁ గని యుడు కాఱుఁగాక
యలుపాలఁ బొనుపడునట్టి చిచ్చే యిది
పెను గద వట్టిన భీమసేను
బాహుబలంబును బాటించి గాండీవ
మను నొక విల్లెప్పుడును ధరించు

ఆ. కఱ్ఱి విక్రమంబు గాల్పనే? యిట్లు బ
న్నములు వడిన ధర్మనందనుండు
నేను రాజరాజు పీనుంగుఁ గన్గారఁ
గానఁ బడయమైతి మేనిఁ గృష్ణ!" (117)

తుదకు విషాదమును గాఁచుకొనలేక యెలుంగెత్తి యేడ్చినది. ఇచ్చట నామె చేసిన కేశపక్ష ప్రదర్శనమును విలాపమును వాగ్రూపమునుండి క్రియారూపమున ఘనీభవించు విషాద రోషములకుఁ బ్రత్యక్ష నిదర్శనములు, సంకల్ప సిద్ధి కమూల్య సాధనములు. ఈ తీరుగఁ జూచుచుఁ బోయినచోఁ బునరుక్తివలెఁ గమనించు వాక్యములు పునరుక్తులు గాకుండఁ గాఁచిగొనుచు నెప్పటికప్పుడు నూతనముగఁ గని పించునట్లు నవనవోన్మేషశాలినియైన ప్రజ్ఞచే

సాధించికొని వచ్చినాఁడు. ఈతని యీ నైపుణ్యము మిక్కిలి యద్భుతావహము. అనన్యసాధ్యము. ప్రదర్శన శక్తి లోనున్న నైపుణ్యము కొంచెము తఱచిచూచితిమేని యందు ముఖ్యముగ మూఁడు సూత్రములు గోచరించుచున్నవి. చెప్పఁదలఁచుకొనిన యంశముల క్రమమును నిర్ణయించుట మొదటిది. ఏ యంశము తరువాత నే యంశమును నుంచినచో నుద్దిష్ట ప్రయోజనము నెఱవేరునో తెలిసికొని వ్యక్తి యుపన్యసించవలెను. శిరోభూషణమును గాలికిఁ దొడగినఁగాని, పాదభూషణమును శిరస్సుపై నుంచినగాని యెంత యవకరముగఁ గనఁబడునో యట్లే యుచితస్థానమును విడనాడిన యంశము కూడ నందవిహీనమగును. క్రమ మొక్కటే సరిగా నున్నను జాలదు. ఏ యంశమున కెంత ప్రాధాన్యము నీయవలెనో గుర్తింపవలసి యుండును. ముఖ్యమైన విషయమును సంకుచితపఱచియు, నముఖ్యమైన దానిని విశదీకరించియు నేర్పరులుగానివారు మాటాడుచుందురు. అట్లుగాక యాయా యంశముల కుచితవిస్తృతి నిచ్చుట రెండవ విశేషము. ఇఁక మూఁడవ సూత్రము వ్యాఖ్యానమునకు సంబంధించినది. ఒక యుదంతమును గైకొని యథానుకూలముగ వ్యాఖ్యానించుట. దీనికొక్క యుదాహృతి (తృ. ఆ. 280).

> చ. **"మదమడఁగించి భూపతిసమాజము నెల్లను నిన్నుఁ గొల్వఁ జే**
> **యుదునని పూని: దిగ్విజయ మున్నతిఁ జేసి మహావిభూతితో**
> **మది మదినుండ, నీసుతుఁడు మంత్రులు, సౌబలుఁ జూదమార్చి, సం**
> **పద గొని యంతఁబోవక, సభన్ ద్రుపదాత్మజ భంగపెట్టరే?"**

ఇందు రాజసూయాధ్వరమునకు ముందు యుధిష్ఠిరుని దిగ్విజయము గైకొని ధృతరాష్ట్రునికి శ్రీకృష్ణుఁడు వ్యాఖ్యానించుచున్నాఁడు. నిజముగ యుధిష్ఠిరుఁడు తన యశస్సు నిమిత్తమో తండ్రిని (పాండురాజును) నరకమునుండి తప్పించుటకో రాజసూయాధ్వరమును, దాని కంగముగ నేర్పడిన దిగ్విజయమును నిర్వహించి నాఁడు. కాని శ్రీకృష్ణుఁడదే యుదంతమును గైకొని దానిని ధృతరాష్ట్రునకు లాభదాయకముగ నుండుటకయి నిర్వహించినాఁడని వాఖ్యానించుచున్నాఁడు. ఇట్టి వ్యాఖ్యానములు వివిధ వ్యక్తులు పలుతావుల నొనర్చినారు. ఇవి ప్రదర్శనశక్తి నిరూఢములయిన యుదాహృతులు.

ప్రసంగము లన్నియు వ్యంగ్య చమత్కృతితో నలరారుచున్నవి. సంజయునిఁ బాండవుల యొద్దకుఁ బుత్తెంచునపుడు ధృతరాష్ట్రుని ప్రసంగమును గైకొందము. (ఆ. 1ప. 259 మొదలు 272లో (గొంతభాగమువఱకు). ఇందు సంజయునితోఁ

జెప్పిన మాటలకును సభాసదులతోఁ జెప్పిన మాటలకును వ్యత్యాసము నారయుఁడు.

సంజయునకు ముఖ్యాంశమును గూర్చి, యనఁగాఁ బాండవులకుఁ బాలును బంచి యిచ్చుటనుగూర్చి యేమియుఁ జెప్పక లుప్త మొనర్చినాఁడు. సభాసదుల కెట్టి యభిప్రాయమును గలిగించుచున్నాఁడు? "భాగమిచ్చునట్లొడంబడియే. ధృతరాష్ట్రుఁడు కబురంపియుండవలెను." అనునభిప్రాయము జనించునట్లుగ సభాసదులతో మాటలాడుచున్నాఁడు. "ధృతరాష్ట్రుఁడెంత యత్నించినను, ననఁగా సగముపాలు నిచ్చెదనన్నను వెనుకటి వికృతులను మనస్సులో నుంచుకొని పాండవులు సంధి కియ్యకొనలేదు. దప్పంతయు వారిదే" యని లోకమునకుఁ దోఁచవలె నని ధృతరాష్ట్రుని తాత్పర్యము. ఎక్కడను వాచ్యముగ నీ తాత్పర్యము ప్రత్యక్షముగాదు. కాని మొత్తము మీఁద నట్టి యభిప్రాయము గలుగుచున్నది. రాజకీయరంగమున దొంగతనముతో వర్తింపనెంచిన దొరలకెల్ల నీ వ్యంగ్యచమత్కృతి కామధేనువు, ఆ యుపన్యాసమును బూర్ణముగ నిట నిచ్చెదను, బరికింపుఁడు.

తే॥ "పాండు నరపాలసుతు లుపప్లావ్యమునకు
వచ్చియున్నారు నీ వేఁగి వాసుదేవ
సహితముగ వారిఁ గని తద్విషాద మేమి
భంగి మాను నమ్మొయిఁ దగఁ బలుకవలయు. 259

క. "మీ యయ్య మీరు వనవా
సాయాసము నిస్తరించి యభ్యుదయమునన్
డాయుట విని ముదితాత్ముం
డై యిట పుత్తెంచె నన్ను" ననుమీ మొదలన్, 260

వ. అని చెప్పి చుట్టు నున్నవారలతో నిట్లనియె.

క. దుర్యోధనుండు కార్యా
కార్యజ్ఞుఁడుఁ గామి నిట్టి కలఁక గలిగెఁ గా
కార్యులు దృఢధైర్యులు రణ
ధుర్యులు నగు పాండుసుతులు దోషాన్వితులే! 262

క. క్షీరోదక వృత్తి మనము
వారలునుం గలసి బ్రదుకవలదే నెమ్మిన్
వా రిడుమలఁ బడఁదగియెడు
వారే పితృభాగ మేలువారలు గారే. 263

ఆ. మనల నింక నమ్మ రన్నతాత్మ లన్యాయ
పరులు గర్వు లనుచుఁ బాండుసుతులు;
గూడి మనుట కియ్యకొననేర: రైనను
ధర్మజుండుఁ గలఁడు దగవునడప. 264

వ. అని పలికి వెండియు. 265

మ. మన కీకుండగ వచ్చునే? మనము దుర్మానంబువాటించి యొ
ప్పని కార్యంబులు వట్టి వారికి దగం బాలీక గర్వంబు లా
డిన నిక్కంబగు నల్కఁ నర్జునుఁడు గాండీవంబు మోపెట్టి కృ
ష్ణుని సారథ్యమునై జగత్త్రితయ సంక్షోభంబు గాకుండునే? 266

గీ. అలఘు గదఁ బూంచికొని భీముఁ డతిరయమునఁ
గురుకుమారులపై (దీవ్రకోపఁ మెసఁగఁ
గవియు టాత్మ భావించినఁ గంప మడరు
నిక్క మెవ్వరు మార్కొని నిలుచువారు. 267

సీ. కవ లగ్రజన్ములకంటె నేమిటఁ గీడు
ద్రుపదుఁ డల్పుండె తత్పుత్రులు బాహు
గర్వ సమగ్రులుఁగారె విరాటుండు
నాతని తమ్ములు నాత్మజులును
నసదులే సాత్యకి యలఁతులఁ బోయెడు
వాఁడె వృష్ణికుమారవరు లనేకు
లట్టియోధులు పోర నరవాయిగొందురే
పాండ్యుండుఁ గేకయపతులు నాది

గీ. యైన బంధులు మిత్రులు నగ్గలికలఁ
గొఱఁతవడియెడు వారె యందఱును గెల్వ
నోపినను రుద్రునకునైన నోర్వరాని
ధర్మపుత్రుకోపమునకుఁ దలఁకవలదె. 268

వ. అని పలికి సంజయుదిక్కు మొగంబై యెల్ల వారును విన నిట్లనియె. 269

తే. నీవు ధర్మజుపాలికి నెమ్మి నరుగు.
మతఁడు పేరోలగం బున్న యవసరమునఁ

గాన్పు మతనికి ననుజవర్గంబునకును
బంధులకు నింపు పుట్టంగఁ బలుకు మచట. 270

క. నెయ్యము పాటించి కడుం
దియ్యఁ మెసఁగ నలుకలెల్ల దీఱునటులుగాఁ
గయ్యమును దలఁపు లోనుగ
న య్యమనందనుఁడు మానునట్టి తెఱఁగునన్. 271

వ. "శాంతి ప్రకారంబునం గార్యంబు నడపి యొక్కటియై మనుట యొడఁ గూర్చి రమ్ము; రథం బెక్కి పొమ్ము."

ఈ క్రింది పద్యములలోని ధ్వని ధర్మరాజు వ్యాఖ్యానించువఱకు మనము గమనింపము.

ఉ. "పెట్టనికోట నీకు హరి భీముఁడు పార్థుఁడునున్ రణంబునన్
దొట్టిన మంట లాకొలఁది యోధుల సాత్యకియున్ విరాటుఁడున్
జుట్టపు మేరు వుగ్రరణ శోభితుఁడీ ద్రుపదుండు నిన్నుని
ట్టిట్టన వచ్చునే సురలకైన నను నొల్లవుగాక చివ్వకున్ (ఆ. 1. ప.297)

వ. మఱియు నక్కడ

ఉ. ద్రోణుఁడు భీష్ముడుం గృపుఁడు ద్రోణసుతుండును గర్ణ శల్యులుం
బ్రాణము లా సుయోధనునిపాలివ యంఁద్రు నిజానుజన్ముల
క్షీణ పరాక్రముల్ సుతు లజేయులు బాహ్లిక సోమదత్తులా
స్థాణునకైన నోడరు వశంబె జయింఁపఁగ వారి నేరికిన్."

సంజయుని యీ యుపన్యాసమునకుఁ గ్రమముగ నొక్కొక్క యంశమునకే సమాధానమిచ్చునపుడు ధర్మరాజీ భాగమునుగూర్చి యిట్లు వ్యాఖ్యానము చేయుచున్నాఁడు.

క. "మును మమ్ముఁ బొగడి పదపడి
యని వారలఁ గెలువ నరిదియని పొత్తుగఁ జె
ప్పిన మాటకు నే నొడఁబడ
విను సంజయ పక్షపాతవృత్తి విడువుమీ."

సంజయుఁడిరుపక్షములవారినిఁ బొగడుచున్నట్లే స్థూలదృష్టికిఁ గనుపించును, కాని బహుశః వాచకమునుబట్టి పాండవులను గూర్చిన పొగడ్తను దేల్చివైచి

కౌరవులఁ గూర్చిన పొగడ్త నూఁదిపలికి సంజయుఁడు వ్యంగ్యచమత్కృతి సాధించి యుండవలెను. పాండవులను బొగడి దానితోఁబాటు "దుర్యోధనాదులను గెలుచుట యసాధ్యము సుమీ" యని భయపెట్టవలె నని యాతని యుద్దేశము. ఇది ప్రత్యక్షముగఁ జేసినచో మర్యాదగా నుండదు. అందుచే సన్నసన్నముగాఁ జేయుటకయి వ్యంగ్యము నాశ్రయించినాఁడు. కాని సంభాషణా చాతుర్యమున ధర్మరాజు సంజయుని మించినవాఁడు. అతఁడీ దొంగతనమును బట్టుకొనలేకపోవునా? దాని యర్థమును దేటపఱచి మఱిరెండు పద్యములలోఁ జక్కని సమాధాన మిచ్చుచున్నాఁడు.

(అ. 1 ప. 323-325)

ఈ పర్వ మంతయు నిట్టి వ్యంగ్య చమత్కృతులతోడను, దానికి మించిన సమాధానములతోడను నిండి యుండును. అందువలననే యెన్నిసారులు చదివినను నిది యింకను జదువవలయుననియే యుండును. 'ధ్వనిరాత్మాకావ్యస్య' అనుపూర్వాచార్యుల మతమునకు నద్వితీయమైన నిరూపణ మీ పర్వమున నున్నది. కథకుఁగాని, మఱి యే యితర కావ్యగుణమునకుఁగాని యిందుఁ బ్రాధాన్యము లేదు. నదు లన్నియు సముద్రమునఁ గలసినట్లితర గుణము లన్నియు ధ్వనిలో నిముడుచున్నవి.

ఈ యుద్యోగ పర్వమును బఠించుచుండఁగ నీనాటి యుద్ధసన్నాహములు, నీనాటి కపట ప్రచారములు, నీనాటి యుపన్యాసనైపుణ్యములన్నియుఁ బ్రత్యక్షమగుచుండును. అందుచేతనే యీ పర్వము మనకింత యామోదదాయకముగ నున్నది.

ఇందలి (Repartee) సమాధాన నైపుణ్య మొకటి ప్రత్యేకముగ గణనీయము. ఎదుటివారి మనస్సులోని కౌటిల్యములను, వారి వాక్కులలోని నక్క వినయములను గ్రహించి వాఁత వెట్టినట్టుగ సమాధాన మిచ్చుట పలుతావులఁ గనవచ్చుచున్నది.

క. అనుజులు నీవును ద్రోపది
యును బుత్త్రచయంబు నున్న యోగక్షేమం
బున తెఱఁ గారయఁ బుత్తెం
చె నితాంత స్నేహపూర్ణ చేతోవృత్తిన్. (అ. 1. 274)"

అని సంజయుఁడు ధృతరాష్ట్రుని పక్షమునఁ బాండవుల క్షేమము విచారింపఁగ, దానికి ధర్మరాజిచ్చిన సమాధానము -

క. "ఆరాజు మాదెసం గల
కారుణ్యము కతమునను సుఖంబున నిట్లు
న్నారము నినుఁ బుత్తెంచిన
గారవమున నాదుమది వికాసము బొందెన్." (ప. 276)

దీనిలోని భావమును సంజయుఁడు గ్రహింపకపోలేదు. మరల నీ యంశమును గూర్చి ధృతరాష్ట్రునితో ముచ్చటింపవలసి వచ్చినపుడు.

కం. "వారెల్లరు భవదీయ
స్ఫారబలము కారణముగ సౌఖ్యంబున ను
న్నార మని పలుకుదురు; నిజ
మారయఁగా నట్లకాదె యది జననాథా". (ఆ. 2. ప 6)

అని వ్యాఖ్యానించుచున్నాఁడు.

సంజయుని దుర్యోధనాదుల కుశలము నడుగుటలో ధర్మరాజు నిష్ఠురము నెంతో నిపుణముగఁ బ్రయోగించుచున్నాఁడు. (ఆ. 277-281). అతని వాక్య విజృంభణము నంతను సంజయుఁ డొక్కమాటలోఁ గట్టివేయుచున్నాఁడు.

క. "పొం దొందఁగఁ దలఁచితి నీ
విందు శిశిరమైన విమలహృదయంబున వా
రందఱకును సేమం బిట
ముందఱ లేకున్న నేఁడు మొదలుగఁ గలుగున్." (ఆ 1 ప. 283)

కొన్ని కొన్ని స్వల్పాంశములను బెద్దగఁ గొనియాడుటయుఁ బ్రధానాంశమును దాఁచి పెట్టుటయు నిప్పటికి నప్పటికి సామాన్య ధర్మమే.

ఉ. "శాంతతఁబొంది కార్యము దెసన్ ధృతరాష్ట్ర మహీశుఁ డాత్మ న
త్యంతముఁ దేఱినన్నిటఁ బ్రియంబునఁ బంచెడు నప్డునాకుఁ దే
రెంతయు వేడ్కఁ దాన వెర వేర్పడఁ జెప్పుచుఁ బన్నఁబంచె; ని
ట్లింత ఘటించెఁ బొందు మన మీపదనం దెలివొందఁగాఁదగున్".
(ఆ 1. ప 293)

ధృతరాష్ట్రుఁడు పాండవులకడకుఁ బోవుచున్న సంజయుని రథమును స్వయముగఁ బన్నించెఁనాడఁట. ఇదియొక గొప్పగ నాతఁడు గొనియాడుచున్నాఁడు. కాని పొలిచ్చుటఁ గూర్చి యేమియుఁ బలుకఁడు. అంతస్సారము శూన్యమైన ఈ యుపన్యాసము నొక్కమాటలో వాసుదేవుఁడు ఖండించుచున్నాఁడు.

క. "ఆ రాజు సేయు నెయ్యము
గారామును జెప్పె దీవు గడుఁ దీపులుగా
వీరు దమపాలు వడయక
నేరిమి మాటలనఁ దీరనేర్తురె చెపుమా?". (ఆ 1. ప 340)

అసలు విషయమును గప్పిపుచ్చియు ప్రధాన విషయములకుఁ బ్రాధాన్యమిచ్చి మాటలాడుటయు, నీ దొంగతనమును బట్టుకొని యెదిరివా రల్లరిచేయుటయు నేఁడే గాక నాఁడుగూడఁ గనవచ్చుచున్నది. దీనినే మా ప్రాంతములలో నఱచేతిలోఁ దేనెవేసి మోఁచేతివఱకు నాకించుట యని వ్యవహరింతురు. ఈ నైపుణ్యమంతయుఁ బ్రదర్శన శక్తిలోనే చేరును.

సంప్రదింపు సభలలోని ప్రసంగములోఁ బైగుణములు మాత్రమే గాక యిప్పటి Symposiums లోను, పార్లమెంటరీ డిబేట్సులోను గానవచ్చు చర్చా నైపుణ్యము, ఒక మతమువారిచ్చిన యుపన్యాసములోని యొక్కొక్క యంశమునే గైకొని వరుసగా సమాధానమిచ్చు క్రమప్రకారమును నిందు గానవచ్చుచున్నది. భారతమునందలి యుపన్యాసములను బరిశోధించినపుడు వాక్యోపవాక్యముల తార్కిక క్రమము (Logical sequence) లోఁ గాని, యలంకారశోభ (Rhetoric) లోఁ గాని సమష్టిమైఁ గనవచ్చు స్నిగ్ధతాసంసిద్ధి (Total finish) లోఁ గాని, విమర్శనా శక్తిలోఁ గాని, వ్యాఖ్యాన పాటవములోఁగాని, సమాధాన నైపుణ్యములోఁగాని వక్తృత్వ మెంతో యభివృద్ధినందిన దనుకొనుచున్న యీనాటి యుత్తమోపన్యాసముల కేమాత్రమును దీసిపోవు. లాయడ్ జార్జి (Lloyd George), విన్స్టన్ చర్చిల్ (Winston Churchill) మున్నగు నాధునిక మహావక్తల యుద్ధసమయములందలి యుపన్యాసములను గైకొని సంజయ శ్రీకృష్ణుల యుపన్యాములతోఁ బోల్చిచూచినచో మనము భారతీయులమను బక్షపాతబుద్ధిని దూరముగా నుంచి విమర్శించినను గడపటివారిదే పైచేయి యని నిర్ణయింపక తప్పదు.

శిల్పవిధానము (Technique) స్థూలదృష్టి కించుమించుగా నొక్కటిగానే కాన వచ్చుచునున్నను, వ్యక్తుల తారతమ్యమునుబట్టి వానిలో సూక్ష్మవ్యత్యాస మేర్పడక పోదు. ఏ కళయైనను సరే కావ్యరచనమే కానిండు. యుపన్యాస ప్రధానమే కానిండు. విమర్శనమే కానిండు. వ్యక్తుల యనుభావముపై (Personality) గాఢముగ నాధారపడి యుండును. శ్రీకృష్ణుని యనుభావము వేఱుగ వివరించి చెప్పనక్కఱలేదు. ఇఁక సంజయుఁడుకూడ సామాన్యవ్యక్తి కాఁడు. జీవన్ముక్తుఁడై యీశ్వర సాక్షాత్కృతినందిన మహాపురుషుఁడు (ద్వి. ఆ.ప. 319,320) అందుచే

వ్యక్తిగతమైన యాతని యనుభావ మంతయు నాతని ప్రసంగములలోఁ బ్రతిబింబించుచున్నది. కార్యమెట్లయినను సంఘటింపవలెనను నుదారభావముతోఁ బాండవుల కడకు వచ్చినపుడు కౌరవుల పక్షమున మాటలాడినాఁడే కాని నిజమున కాతనికున్న ధర్మోత్సాహ మపారము. ఇది కౌరవుల సభలోఁ బాండవుల కడ నడచిన వృత్తాంతమును గూర్చి యాతఁడు చేసిన నివేదనములోఁ బ్రత్యక్ష మగుచున్నది. సంజయ శ్రీకృష్ణులకున్న మాహాత్మ్యమును ధర్మోత్సాహమును వారి యుపన్యాసములకు నుజ్జ్వలమైన శక్తినిఁ బ్రసాదించుచున్నవి. అతీత భావములనుండియు, సమదర్శనము నుండియు నుదయించువారి యుపన్యాసములలో సంచరించు దివ్యశక్తి స్వార్థపరత్వముతోడను, హింసాపంకిలమైన యుద్రేకము తోడను నాడిన లాయడ్ జార్జి చర్చిల్ మున్నగు వక్తల సమరోపన్యాసములతో నెట్లు ప్రత్యక్షము కాఁగలదు? కొంతకాలమునకుఁ బూర్వము జాతీయత (Nationalism) అనఁగా నేదో మహోన్నతమైన యాదర్శముగా గౌరవించుచుండిరి. కాని రెండు ప్రపంచ మహాసంగ్రామములు చెలరేఁగి దాని గుట్టునంతను బయలు బెట్టినవి గదా!

ప్రాసంగికములగు నిందలి యుపాఖ్యానములుకూడఁ గథనశక్తిచే (Story-telling art) నెంతో మనోహరముగనున్నది. అంబోపాఖ్యానము, వృత్రాసుర వధ కూడ నీ యంశమును నిరూపింపఁజాలును. కాని శాంతిపర్వములో నున్న చిన్న కథలందును, నితర పర్వములోనున్న కథా నిర్వహణమునందును బ్రత్యక్షమగు చున్న కథన కళారహస్యము విమర్శించునపుడు వీనినిఁగూడ విమర్శించి నట్లగును. కావున బ్రకృత మీ సూచనతో విడిచి పెట్టుటగుచున్నది.

ఇఁకఁ బ్రత్యక్షముగా సమరసన్నాహమునకు సంబంధించిన వస్తువున్నది. ఇరు పక్షములవారును వాసుదేవాదుల సాహాయ్య మర్థించుటయు (ప్రథమాశ్వాసము) దండనాథ నిర్ణయమును, బలాబల విచారమును (చతుర్థాశ్వాసము) నిందుఁ జేర్చు చున్నవి. ఇదికూడ నాకర్షణీయముగఁ బ్రదర్శితమైనది. వాసుదేవుని సాయార్థము పోయినప్పుడు దుర్యోధనుఁడు మున్ముందు పోయినను టెక్కుగా నున్నతాసనమున వెనుకఁగూర్చుండుటయుఁ, బార్థుఁడు తరువాత వచ్చినను వినయముతోఁ బాదాంతికము ననుఁ గూర్చుండుటయు, నాయుధలేశమైనను ధరింపని తన్నొక తులయందును బదివేపుర గోపాలరనొకతులయందును నుంచి, కొండికగావున నర్జునుఁడే మొదటఁ గోరుకొన వలెనని చెప్పుటయు మున్నగు నిందలి యుపాంశము లన్నియుఁ బ్రజాసామాన్యము చెప్పుకొను కథలలోనికిఁగూడఁ బ్రాకినవి. ఇట్లే

తుదినిఁ గౌరవ సభలోఁ బాండవసైన్యము నంతను దామొక్కరే సమయించుటకు నెన్ని దినములు పట్టునని తన పక్షపు వీరులను దుర్యోధనుఁడడుగఁగా వారిచ్చిన సమాధానములును, నిది చారులవలన విని ధర్మరాజర్జునునిఁ బ్రశ్నింపఁగా (Hydrogen Bomb) వంటి పాశుపతాస్త్రమును బ్రయోగించినచోఁ బదునొకండక్షౌహిణులను నొక్క నిమిషములోనే తాను సమయింపఁగలనని యాతఁడిచ్చిన సమాధానము హర్ష ప్రదములుగ నున్నవి.

ఇట్లు మొదటి నుండియుఁ దుదివఱకు స్వల్పాంశములను నప్రధాన వస్తువును గూడ నెంతో హృద్య మొనర్చుచు నిర్వహించిన యీ పర్వమునందలి వస్తు చిత్రణ మిందలి కళావైభవమునకు సంజీవని.

వస్తు నిర్వహణమను నొక్క మహాగుణమును విశదీకరించుట కింత పట్టినది. ఇంకను నిట్టి మహాగుణములు మూఁడు నాలుగైన నిందుఁ బ్రత్యక్ష మగుచున్నవి. ముఖ్యముగఁ బేర్కొనఁదగినవి వ్యక్తి చిత్రణమును, శైలియును ఈ పర్వమునందలి యపురూప లావణ్యమును బూర్ణముగ విపులీకరించుకొన చూచినచో నిది యాంధ్ర వాఙ్మయమునకు మణికిరీటమని చెప్పఁదగిన మహాభారతమునఁ 'గోటి కోహినూరుల' కాంతితోఁ బ్రకాశించుచున్నట్లు స్పష్టమగును. ఈ పర్వమునందలి శిల్పవైభవము నాధారముగాఁ గొని విశ్వకళా ప్రపంచమున నాంధ్రులు జైత్రయాత్రకుఁ బ్రస్థాన భేరిని మాత్రమే గాక జయదుందుభినిఁ గూడ మ్రోగింపవచ్చును.

౨౫

శ్రీ మదాంధ్ర మహాభారతము

యుద్ధషట్కము

మహాకవి శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రి

శతావధాని

మహాభారతము భరతవంశ మహారాజుల చరిత్రము. ఒకనాఁటి భారత జాతీయ కుటుంబ జీవిత చరిత్రము. అంతే కాదు. వేదయుగమునుండి వెల్లివిరిసిన భారతాధ్యాత్మిక వైజ్ఞానిక సాంఘిక సారస్వత రాజకీయ సంస్కృతి సంప్రదాయముల సంపూర్ణ జీవిత చరిత్రము. వేదవ్యాస మహాముని ప్రణీతములైన పురాణోపపురాణము లన్నింటిలో నింతటి బహుళవ్యాప్తిఁ గన్నదియు, నిట్లు పెద్దల యాదరమున కెక్కినదియు, నింతగాఁ బ్రజోపయోగమున నిల్చినదియు మహా భారతముకంటె మఱొక్కటి లేదన్నచో నతిశయోక్తి గాఁజాలదు. అది యుపనిషత్తుల యధ్యాత్మ విద్యను మఱువలేదు. పురాణముల విజ్ఞాన విశేషములను విడువలేదు. ఇతిహాసముల యితివృత్త సౌందర్యము నేమఱలేదు. ఈ యన్నిటి మేళనమున వాని వాని యంతస్థును బట్టి, యవసరమునుబట్టి, ప్రయోజనమునుబట్టి, పరమార్థమునుబట్టి యథార్థ సన్నివేశ పరిపాక సౌభాగ్యముగలదై స్థూల సూక్ష్మకారణ శరీరత్రయమువలె నేకాకృతికమై, ప్రతిపర్వ బహిరంతస్స్ఫురద్రసోదయమై యలరారుచున్నది. మహాభారత మింతటి ప్రభావము గలది గనుకనే యీ మన దేశమును, ప్రజలను, సంస్కృతి సంప్రదాయములను, మన సర్వస్వమునుగూడ- నేటికే కాదు మఱియొక నాటికినిఁ -దన పేరనే పిలిపించుకొను పెత్తనము వహించి యున్నది. అందుకుఁ దగిన గౌరవమును గూడ మనకు దక్కించి యున్నది. అందువలననే "ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని, యధ్యాత్మవిదులు వేదాంత మనియు, నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని. కవి వృషభులు మహాకావ్య మనియు-" ఇత్యాదిగా దీనినిఁ బ్రశంసించి యున్నారు.

రామాయణ భారతముల పోలికలు

శ్రీ మద్రామాయణమువలెనే మహాభారతము మహా కావ్యమని ప్రశంసించుటలోఁ గొన్ని పోలిక లున్నవి. అంగోపాంగములుగా నవాంతరములైన కొన్ని యుపకథలు చేరినను, బ్రధానకథ యామూలాగ్రముగ నవిచ్ఛిన్నముగ సాగి పుష్పించి ఫలించు టొకటి; కథాసంవిధానము, విషయ వివేచనము, వాగర్థోపస్కారము

రసోజ్జ్వలములగుట రెండు; దైవాంశ సంభూతులైన మహాపురుషులు నాయకులుకాఁగా, వారి యుదాత్త ప్రవర్తనములతో వికసించినగాథ. మన హృదయములు తడివి, వాచ్యముగా రసానుభూతిని, వ్యంగ్యముగాఁ గర్తవ్యబోధను బరిమళింపఁ జేయుట మూఁడు: విశేషించి, కావ్యకర్తలైన మహర్షు లిద్దఱును (వ్యాసవాల్మీకులు) కథాకాలమునాఁటివారై కథానాయకులతో, వారి కుటుంబములతో, నానాటి ప్రజా జీవితముతో సాన్నిహిత్య సానుభూతులు పొంది, యితివృత్తమునఁ దామును సముచిత పాత్రధారులై భరతవాక్యము పల్కిన వారగుట నాలుగు. ఇట్టి పోలిక లన్నియు రెంట సమముగనేయున్నను, భారత కర్తయైన వేదవ్యాసుఁడు "భారతవంశ వివర్ధనుం" డగుట భారతమున విశేషము. ఇతివృత్త సన్నివేశములును, నాయకాదిగుణ ప్రవృత్తివిశేషములను మన హృదయములకెక్కి, మన యనుభవములతోఁ బాలుపంచుకొని, మనకు రసస్ఫురణ గూర్చుటలోఁ గర్తవ్యోత్సాహము చేకూర్చుటలో, సంస్కృతి సంప్రదాయముల సమన్వయ పఱచుటలోఁ గలియుగమున నగము గడచిన యీనాఁటి మనకు ద్వాపరయుగమునాఁటి భారతము కొంత సన్నిహితమైనది. త్రేతాయుగమునాఁటి రామాయణ మించుక దూరమైనది. ఇది మఱియొక విశేషము. ఇంతకన్న ముఖ్యమైనది మఱియొకటి గలదు. ఆంధ్రీకృతములైన రామాయణ భారతములలో భారత మాంధ్రప్రజా హృదయములలోఁ బొందినస్థాయి నందుకొనుటకై యాంధ్ర రామాయణము లిప్పటికినిఁ బ్రయత్నించుచున్నవి. ఆంధ్ర మహాభారతము మాత్ర మెప్పటివలెనే యద్వితీయమై, ప్రజాహృదయభావాంబర పార్వణ చంద్రబింబమై, యమృతజ్యోత్స్నల నభివర్షించుచున్న దని పెద్దలందురు. ఇందుకుఁ గారణము భారత కవులవంటి వారు రామాయణ రచనకు గంటము పట్టకపోవుటయే యనువారు కొందఱును, "ఆంధ్రుల మనస్తత్త్వమునకు జీవితానుభవమునకు సవిమర్శన ప్రవృత్తికి సంస్కృతి సంప్రదాయములకు నాంధ్ర భారతమే యన్ని విధముల నచ్చుముగా నమరియున్న" దనుకొనువారు కొందఱును గలరు. "తెలుఁగువాఁడు భారతమువలె రామాయణమును వ్రాయనేలేఁ" డని సవాలు చేయువారు గూడ లేకపోలేదు. ఏమైనను నాంధ్రజాతికి నాంధ్రసాహిత్యమునకు భారతమును ఫలిత పారిజాతముగా మహాకావ్యముగా సంతరించి యిచ్చిన కవిత్రయము మనకు సర్వదా సమారాధ్యమైనది.

ఆంధ్రభారతకర్తలు

భారత కవులు జగత్ప్రసిద్ధులు, వారిలోఁ బ్రథముఁడు నన్నయ, రెండవ వాఁడు తిక్కన, మూడవవాఁ డెఱ్ఱాప్రగ్గడ వీరి దేశకాల జీవితవిశేషములు, కవితాపాండిత్య

ప్రాభవములు నాంధ్రులకెల్ల సుపరిచితములు. వీరిలో "నెవరు గొప్ప" యని యెవరికిఁ దోఁచినట్లు వారుగా వింగడించెకొనువారున్నారు. అదంతయు వారివారి యభిరుచి భేద మనవచ్చును. నిజమునకు వారందఱికన్న గొప్పవారును, నంతటివారును మనలో నింతవఱకుఁ బుట్టకుండుటయే వారి గొప్ప. భవిష్యత్తులో నెప్పుడైన నట్టివారు పుట్టవలె నని యాకాంక్షించుటే మనలో గొప్ప. ఆంధ్ర సాహిత్య సృష్టికి వారు ముప్పురు మూర్తిత్రయమువంటి మూలపురుషులు. "మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్, గుండలీంద్రుండు తన్మహనీయస్థితి మూలమై నిలువ" అన్నట్లాంధ్ర సాహిత్యమునకుఁ బురుడు దీర్చి ప్రాణము వోసిన పుణ్యము నన్నయది. దానికి జీవిత సౌభాగ్య సౌందర్యము లలవరించి, సాహిత్య కల్పవృక్షముగా సుచిర ప్రతిష్ఠ చేకూర్చిన ప్రాభవమును తిక్కనది. తిక్కన మొదట నిర్వచనోత్తర రామాయణము రచించి తరువాత యజ్ఞముచేసి సోమయాజియై హరిహరాద్వైతమును సాధించి, యాంధ్ర మహాభారతమును నిర్మించె నందురు. ఆ మహాభారతమునుండి వితతమై విస్తరిల్లినదే యప్పటి మన యాంధ్ర సాహిత్యసర్వస్వము. ఈ సాహిత్య సర్వస్వములో మహాభారతము సంతరించి పెట్టిన విజ్ఞానామృత భాండారములో నాటింట నైదువంతులు తిక్కన మనీషి తెచ్చిన మహాభాగ్యమే యను సత్యము నెవ్వరును గాదనఁ జాలరు. 'అందాదిఁ దొడంగి మూఁడుకృతు లాంధ్రకవిత్వ విశారదుండు' నన్నయ సెప్పెననియు, "విరాటపర్వ మట నుద్యోగాదులుం గూడఁ గాఁ బదియేనింటిఁ దెలుంగుబాసఁ" తాఁ జెప్పుదుననియుఁ దిక్కనయే నిర్వచించి యున్నాఁడు గదా!

తిక్కన - భారతరచన

తిక్కన సోమయాజి "వైదికమార్గ నిష్ఠమగు వర్తనమున్ దగ నిర్వహించుచున్, భేదములేని భక్తి మది నిర్మల వృత్తిగాఁ జేయుచున్...............ఆత్మ సమ్మోదముఁ బొందఁ గావ్యరసమున్ గొనియాడుచు" నుండువాఁడు. ఆయన "మహాభారతంబు సమస్తదురితాపహరంబును, నభిమత శుభావహంబు నైనదనియు, 'వేదములకు నఖిలస్మృతి వాదములకు బహు పురాణవర్గంబులకున్ వాదైన చోటులను', 'ధర్మార్థ కామమోక్షస్థితికి" భారతము "మూఁదల"గా నుండునదనియుఁ, గృష్ణద్వైపాయనుఁ డర్థిలోకహిత చింతంబూని................ధర్మాద్వైతస్థితి భారతాఖ్యమగు లేఖ్యంబైన యామ్నాయము'గా దీనిని రచించెననియు భావించి, 'పంచమ వేదం బారాధ్యము జనుల' కని దద్గౌరవ మూహించి' ఈ భారతమును "దెనుఁగుబాస వినిర్మింపఁ దివురుటఱయ భవ్యపురుషార్థ తరుపక్వ ఫలముగాదే" యని యుత్సాహముఁ

బొంది, 'భారతామృతము కర్ణపుటంబుల నారఁగ్రోలి యాంధ్రావళి మోదమున్ బొరయు నట్లుగా, సాత్యవతేయ సంస్కృతి శ్రీ విభవాస్పదంబయిన చిత్తముతోడ మహాకవిత్వ దీక్షావిధినొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్' అని నిశ్చయించు కొన్నాఁడు. ఇది యాయన యుద్దేశము. కూర్చుట నూత్నరత్నమునకున్ గనకంబునకున్ జనున్, జనాభ్యర్చితమైన భారత మపార కృపాపరతంత్ర వృత్తిమైఁ బేర్చిన దేవదేవునకుఁ బ్రీతిగ నిచ్చుట సర్వసిద్ధి; నా నేర్చినభంగిఁ జెప్పి.......వరణీయుఁడ నయ్యెద భక్తకోటికిన్'-ఇది యాయన పరమవాంఛితము. ఆ యుద్దేశముతో నీ పరమకాంక్షతో 'అమలోదాత్తమనీష నేనుభయకావ్య ప్రౌఢిఁబాటించు శిల్పమున బారగుఁడన్ గళావిదుఁడ' నని చెప్పికొన్న శిల్ప కళావైదగ్ధ్యముతోఁ దిక్కన సంతరించిన మహాకావ్యమే యాంధ్రభారతము. ఈ భారతమును జూచియే యెఱ్ఱాప్రగ్గడ తన కావించిన సృష్టి తక్కొరుల చేతన్‌గాదు నా..........మహత్త్వాప్తిన్ గవి బ్రహ్మనా' వెలుఁగొందిన వాఁడని తిక్కనను బ్రశంసించినాఁడు.

భారతగాథలో యుద్ధషట్కము

పైరచనా పీఠికతో భారతగాథనంతయు నాకళింప పరిశీలించుకొన్నాఁడు తిక్కన. పాండవుల జన్మము మొదలు స్వర్గారోహణవఱకు నొక కథాశరీరము జన్మమునకుఁ బూర్వభాగమో, గర్భవాసమో, పూర్వరంగమో యనఁదగును. పాండవుల బాల్యమునుండి యౌవరాజ్యమువఱకు నొకదశ. ద్యూతము నుండి యుద్యోగము వఱకు నొకదశ. యుద్ధమునుండి స్వర్గారోహణమువఱకు నొకదశ. ఇట్లిది యంతయు బాల్యయౌవనాదులగు నాలుగు దశలతో నడచిన యొక మానవ జీవితము. ఈ జీవితములోఁ బ్రతి దశయందును నారణ్యాజ్ఞాతవాసములవంటి యవస్థలు గోచరించును. చూడుఁడు :- పాండవులెచ్చటనో శతశృంగ పర్వతమున నెవ్వరికిఁ దెలియని రీతి మాతృగర్భమునుండి బయటఁ బడుటయు, హస్తినాపురమునఁ దండ్రిలేని పిల్లలై పెరుగుటయు, నజ్ఞాతారణ్య వాసములు కాఁగా, విద్యాబుద్ధులతో స్వప్రవర్తనముతో యౌవరాజ్యమునందుట ఇది మొదటి ఘట్టము. రెండవఘట్టమున లాక్షాగృహదహనము నుండి బయటఁబడి యరణ్య సంచారముచేసి స్వయంవరముతో రాజసూయముతో నొక ప్రతిష్ఠనందుట. మూఁడవ ఘట్టమున ద్యూతమునుండి బయటఁ బడి యరణ్యాజ్ఞాత వాసములు గడిపి యుత్తరా వివాహముతో నుద్యోగముతో నొక స్థాయికి వచ్చుట చివరి ఘట్టమున యుద్ధమునుండి బయటఁబడి బంధు మరణ కురువృద్ధ నిర్గమనాదులనుండి తేఱుకొని యశ్వమేధముతో నాత్మవివేచనముతో స్వర్గారోహణము చేయుట. ఈ

యన్నింటియందును సంఘటనా తారతమ్యములతోఁ బాటనుభవసామ్యములు గూడఁ బోల్చుకొనవచ్చును. పాండవుల కథలో మూఁడు నాల్గు ఘట్టములు మానవ జీవితములో మూఁడునాలుగు దశలవలె మిక్కిలి ప్రధానములైనవి. వెనుకటి రెండు దశలు కర్షకుని వ్యవసాయ కార్యకలాపములవలె బహుముఖ వ్యావృతములు కాఁగా, నీ మూఁడవ నాల్గవ భాగములు పంటకాలము వలెఁ జేసిన కృషి దైవ పౌరుషముల కలయికతోఁ బరిపాకమునంది ఫలించుటకును, నమర్చుకొని యనుభవించుటకును ముఖ్యరంగములైనవి. కనుకనే భారతమునఁ బైరుల కోఁతవంటి యీయుద్ధషట్కము ముఖ్యభాగమున నిలిచినది. ఇంతయు భావించియే కాఁబోలుఁ దిక్కన విరాట పర్వము నుండియే తన రచన యారంభించి నాఁడని తోఁచును. ఈ విధముగా యుద్ధషట్కము భారతకథా పరిణతికి వలెనే మానవ జీవిత పరిపాకమునకును మూలాధారమగుచున్నది.

యుద్ధషట్కగాథ - శరీరత్రయవిభాగము

ఈ యుద్ధషట్కమునఁ గథాభాగ మిది:- కురుక్షేత్రమున నుభయపక్ష సైన్యములును వివిధాయుధ పరికర సన్నాహములతో మోహరించి పదునెన్మిది యక్షౌహిణులైన బలగముతోఁ బదునెన్మిది దినములు పోరినవి. వివిధ వ్యూహసంధానములతో వివిధ శస్త్రాస్త్రములతో వీరావేశ విజృంభణములతో ధర్మాధర్మ ప్రవృత్తులతో రేయింబవళ్ళు జరిగిన యీ యుద్ధములలోఁ జివరకుఁ గౌరవపక్షమునఁ గృప కృతవర్మాశ్వత్థాములు ముగ్వురును. బాండవులపక్షమునఁ బంచపాండవులను, గృష్ణ సాత్యకి యుయుత్సులును మిగిలిరి. శాప ప్రతిశాపముల శోకోపశమనముల తరువాతఁ జనిపోయినవారి కుదకప్రదానముతో యుద్ధషట్కము ముగిసినది. ఇది యొక స్థూల శరీరము. దీని నుండి సూక్ష్మకారణశరీరము లూహించుకొనవచ్చును.

ఈ యుద్ధము కేవల రాజ్యకాంక్షతోఁ బ్రత్యర్థులైన యిద్దఱు రాజులకు జరుగు పోరాటముగాక యొక కుటుంబములోని యన్నదమ్ముల బిడ్డలకు దాయ భాగనిమిత్తముగా జరిగిన కయ్యమై, యుభయపక్షము లందును విద్యావివేక సంపన్నులును, గురుశిష్య బంధుమిత్రభావ బంధసంబంధము కలవారును గలియుటతో నిది మానవ నిత్యజీవితమునందు సన్నిహితముగా, ననుకూల ప్రతికూలములగు ప్రకృతి పరిసరములతో విధిగా ననివార్యముగా జరుగు పోరాటమే యయిపోయినది. ఇందులో బుద్ధిపూర్వకముగా యుద్ధము చేయనివారున్నారు. చేయననువారున్నారు. చేయ నిష్టములేనివారును, విధిలేక యుద్ధము చేయువారు

నున్నారు. మనసొకవైపు యుద్ధమొకవైపు చేయువారున్నారు. తమవారి కొఱకై కొందఱు, తమపగఁతీర్చుకొనుటకుఁ గొందఱుగా యుద్ధము చేయువారున్నారు. అంతయుఁ దమదే యనువారితోఁ బాటేదియు నాదిగా దనువా రున్నారు. దేవతలు, రాక్షసులున్నారు. నరులు నాగులున్నారు. ఈ యందఱి భావములను, జర్యలను బోల్చు కొన్నచో మానవుఁడు నిత్యజీవిత నిర్వహణమునఁ బ్రత్యక్షముగనో పరోక్షముగనో నిరంతర మెదుర్కొను సంఘటనలే. పోరాటములే యిందుఁ గాంచనగును. ఇది సూక్ష్మమైన బాహ్యజీవిత మనవచ్చును.

ఇఁక నాధ్యాత్మికముగా, సత్యధర్మస్వరూపుఁడైన యుధిష్ఠిరుఁడాత్మ. యజ్ఞకుండోద్భవయైన ద్రౌపది ప్రకృతిశక్తి. పవననందనుఁడు ప్రాణమయ శరీరము. ఇంద్రనందనుఁడు మనో బుద్ధ్యాదిరూపమైన యంతఃకరణము. నకుల సహదేవులు కర్మేంద్రియ జ్ఞానేంద్రియములు - ఇది యొక శరీరము. దీనిపై నరివర్గ విజృంభణము కలిగినపు డెల్ల సమ్మోహ విభ్రాంతులును, వివేచనా గురూపదేశములతో బురోగమన కార్యసిద్ధులును - దీని వృత్తులు. ఇది కారణరూపము. దీనికిఁ బితృపక్షీయుఁడైన వ్యాసుని యాత్మబలము. మాతృపక్షీయుఁడైన కృష్ణుని యంగబలము, వృద్ధులయిన భీష్మద్రోణాదుల యుపదేశబలము, ధర్మబలము, దైవబలము నన్నియుఁ గలవు. ఇంతకు మించినట్లుగా నిరంతర సన్నిహితమై యరిషడ్వర్గ ప్రతిఘటన మన్నిదశల నన్నిదెసల నంటుకొనియేయున్నది. విద్వేషకారణములైన రాజ్యకాంక్షచేతను, బరస్పరాపకార ప్రతీకారచర్యలచేతను, స్త్రీజన కుటుంబబంధుమర్యాదా ధర్మవ్యతిరేక వృత్తులచేతను, నిరువురనడుమఁ బగరేఁగి పొగరాజి చిఱుకయ్యములై యిపుడు భగ్గనమండి మహాసంగ్రామ మేర్పడినది. ఇది యంత ర్యుద్ధము. ఇట్టిది పుట్టకుండుటకును, బెరిగి పెద్దది కాకుండుటకును జేసిన ప్రయత్నము లన్నియు విఫలములైనవి. కడకు యుద్ధ మనివార్యమైనది. కనుకనే యీ యుద్ధము కేవలము కౌరవపాండవులనడుమఁగాక దైవపౌరుషముల నడుమ, ధర్మా ధర్మముల నడుమ, అసుర దైవశక్తుల నడుమ, నాత్మానాత్మల నడుమ, నత్యావశ్యకముగా, నప్రతివిధేయముగా జరుగు యుద్ధముగాఁ బరిణమించినది. అందువలన భారతయుద్ధము దేహత్రయ-గుణత్రయ-శక్తిత్రయ-మార్గత్రయముల నిండుకొని యువస్థాత్రయము నధిగమించి కర్మనిష్ఠతో-దైవపౌరుషములతోఁ దురీయ పురుషార్థము నందుకొనుచున్నది. ఈ యంశమును యుద్ధారంభమున జరిగిన భగవద్గీతోపదేశమే స్పష్టముచేయుచున్నది. యుద్ధరంగమున నందందు జరిగిన సందర్భసన్నివేశ సంవాదములే దీనిని బలపఱచుచున్నవి. వానినిఁ బట్టి ప్రతిభావంతు లాయాచోట్ల నీ విశేషము లన్నియు విపులముగా భావించఁగలరు. ప్రకృతము మన

యీ యుపజ్ఞతో యుద్ధషట్కమును సోమయాజి యెట్లు చిత్రించెనో పరిశీలింతము.

సంగ్రామరంగావతారిక - తిక్కన యేకాగ్రత

"కురుక్షేత్రంబున నారెండు తెఱంగులవారి కంటకంబులును విడిసి కయ్యంబునకుఁ గాలు ద్రువ్వునట్టి సమయంబున ధృతరాష్ట్రుండు గొడుకుల దుర్వినయంబునకు నిర్వేదనంబునొంది సంజయ ద్వితీయుండై చింతించుచున్న యెడకుం ద్రికాలవేది యగు వేదవ్యాసుండు విజయంబుచేసి- "కాలంబగుటయు నృపులకు నాలము సమకూరె. దీని కడలకు మది; నీవాలోకింపఁగవలసిన నే లోనికి దివ్యదృష్టి నిచ్చెదఁ బుత్రా!" అని యడిగెనఁట. "అన్నలు దమ్ములుఁ బోరు క్రూరతన్ గనుఁగొనఁ జాల. నేను వినగావలఁతున్" అని యారాజు పల్కఁగా. సంజయునిఁ గయ్యంబు తెఱంగు వినిపింప నియోగించి, యా రెండు తెఱంగులవారి దివారాత్ర వర్తనంబులు గనునట్లును రహస్య ప్రకార భాషణంబులు వినునట్లు మనోవృత్తంబులెఱుంగునట్లునుంగావరంబిచ్చి, యతి శీఘ్రగమనంబు నొసంగి, భారత సమరధరణిం దిరిగినను శస్త్రాస్త్రంబు లెవ్వియుం దాఁకకుండునట్టి ప్రభావంబు ప్రసాదించి 'ధర్మోజయ' త్యనుచు నిశ్చింతంబుగా నుండుమని ధృతరాష్ట్రు నాశ్వాసించి.......సాత్యవతేయుండు వెడలె"నఁట; అచ్చట "రెండు బలంబులవారలు నొండొరువులకంటె జాల నుక్కు మిగిలి యొండొండఁ గడంగుచు నుజ్వల చండస్థితి నొప్పి "యుద్ధసన్నద్ధులై యుండిరఁట. ఇది యుద్ధారంభము.

మహామాత్యుఁడై యుద్యోగపర్వము నిర్వహించి, మహాసేనానియై, భారత యుద్ధము నిర్వహింపనున్న సోమయాజి యడుగో - యీ సంరంభమునంతయు నిభృతముగా నేకాగ్రముగా ధ్యానమయదృష్టి నీక్షించుచు, నా యుద్ధరంగమున నుభయ సేనలలో, వానిని సమీక్షించు నా సేనాపతులలో, వారిఁ బ్రోత్సహించు మహానాయకులలో, నీ సర్వము గమనించు ధర్మనందనునిలో, నాయనను గనురెప్ప వాల్పక కాచుకొనియున్న కృష్ణార్జునులలో, నీ యన్నిరంగముల, నందఱి చర్యల నన్ని హృదయములఁ దిరుగాడుచున్న సంజయునిలో, నతని కాశక్తిఁ బ్రసాదించిన వేదవ్యాసునిలో నంతట సర్వాంతరములఁ దానుండి యంతయుఁ దొంగిచూచుచు, నన్నింటి కతీతుఁడై నిశ్చల ధారణతో నిర్మలభావనతో లోపలి వెలుపలి చూపు లొక్కటిగా నప్పళించి గంటము నడిపించుచున్నాఁడా యన్న ట్లగుపడును. అట్లు గాకున్న, మెఱపుఁదీఁగవలె వివిధ భావార్థ గర్భితములైన వెలుఁగులు వోయుచు నా కంటివెంట నా గంట మెట్లు పరుగులు వారును? ఈ యలౌకిక దృష్టి యాయనకు సంజయునితోఁ బాటు వ్యాసులనుండి వచ్చెనో, ధృతరాష్ట్రునితోఁబాటు కృష్ణ

పరమాత్మ నుండియే వచ్చెనో తెలియదు. అట్లుంగాక హరిహరనాథుఁడు స్వప్నమున సాక్షాత్కరించి 'కనువెలుంగు నీకిచ్చితి" నన్న యా వెలుఁ గిదియే యౌనేమొ! కనుకనే యా యుద్ధరంగమును గనులఁ గట్టినట్లుగాఁ జూపించు చున్నాఁడు. ఆ రంగమును జూచునపుడుభయసేనామధ్య రథోపస్థితుఁడైన పార్థునకువలెనే మనకును సమ్మోహ విభ్రాంతులు కలుగుట సహజము. తత్త్వార్థపరిజ్ఞానముతోఁ బార్థుడు యుద్ధము చేయుటకు వలెనే మనము చూచుటకును సమర్థులము గావలసియున్నది. "అప్పుడిది కేవల హింసాత్మకమైన ఘోర సంగ్రామముగాఁ గాక కళామయమైన వీరవిహారముగా గోచరించును. ఇచ్చట భేరీభాంకార వీర సింహనదా సైనిక కోలాహలములేగాక దైవపౌరుష ధర్మాధర్మ చర్చలు వినఁబడును. కుత్సితములైన దంభ దర్ప దౌష్ట్యములుగాక యచ్చములైన హృదయ సంవాదములు స్ఫురించును.

మహాయోధుల భావములు, నియమములు, పరికరములు

భారత వీరులు రణరంగమున కలుగునప్పుడు వారి భావములిట్లుండును, "ఆరయ వివృత స్వర్గద్వారము రాజులకు నాహవం, బందు మహోదారులు దొల్లియు నరిగిరి. మీరీ మార్గమున నడప మెయికొనుటొప్పున్" - "ఇంటన్ దెవులునఁ జచ్చుటకంటెను బాపంబు లొండుగలవె! నృపులకుం బంట కలను పొలిగల; నిది గంట విధానంబు గంటగాదే తలఁపన్" -

వారి యుద్ధనియమము లిట్లుండును

"బవరము సేయుచుండియును భాషణముల్ దగఁబల్కుచుండఁగా నవినయ వృత్తిమై వలవ దాయుధమార్చుట, దాఁకిపడ్డఁ-గైదువువడినన్-దొలంగినను-దోర్బల మేది భయంబుఁ బొందినన్- గవియక నీరు బోయినను-వధింపఁగ నెట్టి శత్రువున్".

"విరదల వానిని విరథుని నాయుధంబిడిన వానిని శూరు లేయ రెందు"
"నిద్రించిన వానిని..శరణుసొచ్చిన వానిని వధియించుట ధర్మంబుగాదు"
"గదాయుద్ధంబున నాభికి దిగువయగు శరీరభాగంబు నొప్పించుట ధర్మంబుగాదు"
"పెక్కండ్రు గూడి యిమ్మెయి నొక్కనిఁ జంపుట యధర్మము"
"యుద్ధమునకుఁ బిలిచినఁ బోవకుండు టిది బీదతనం బగు..."

ఇవి సర్వసాధారణ ధర్మములు. "జోడుపుచ్చిన వానినిఁ, గైదువుఁబెట్టిన వానిని, సిడంబు డించినవానిని, నంగనను, నంగనాపూర్వుని, నంగనాభిధానునిఁ, దల చీరవీడిన వానిని, భ్రాతృహీనుని, నపుత్రకునిన్ గని యేటుఁబోటుఁ దక్కి సమరంబు సేయమానుదు" నని భీష్ముని ప్రతిజ్ఞ. "నరుండులేనిచోఁ, దిరమయి

పోర నిల్చిన యుధిష్ఠిరు-ద్రౌపది పుట్టినింటి వేవురు వెఱఁగందిచూడ - నలవుం జలముం జెడఁ బట్టి తెచ్చెదన్'' - అని ద్రోణుని ప్రతిజ్ఞ.

"తునిమెద నెల్లి సైంధవునిఁ దోయజమిత్రుఁడు గ్రుంకకుండుము''న్నని యర్జునుని శపథము. ఇట్టి భావములతో, నిట్టి నియమములతో, నిట్టి శపథములతోఁ బాండవ కౌరవయోధు లిప్పుడు మోహరించియున్నారు.

అమ్మహావీరయోధులు గంధమాల్యానులేపనమణిగణసువర్ణ భూషణాంబరములం గైసేసి, కనకమకుటోష్ణీష శిరస్త్రాణ తనుత్రాణ కరత్రాణ శర శరాసన తూణీరాది పరికరంబు లలవరించుకొని, శ్వేతచ్ఛత్ర చామర ధ్వజ పతాకాద్యభిరాములై, సంగర కథా సల్లాపంబులు సేయుచుఁ బెండ్లికిఁ బోవున ట్లుల్లాసంబున నుల్లసిల్లుచున్నారు. వారి నలుగెలంకుల గజఘటా ఘీంకారములతో, నుత్తుంగ తురంగ హేషారవంబులతో, రథనేమి నిస్వన క్రేంకారములతోఁ, బదాతుల కోలా హలంబులతోఁ, జతుర్విధ బలంబులు బలసియున్నవి. శంఖ కాహళ మురజ మర్దళ పటహ ఢక్కా భేరీ నినాదంబులు ముందర మాఱుమ్రోగుచున్నవి. వారెత్తి పట్టిన యాయుధములలోఁ గోదండ గదాదండ కుంత క్షురికా ముసల ముద్గర తోమర పరశు భిందిపాల శూలకరాశ కరవాలాదులే గాదు; బాణంబులలోఁ బెక్కు విన్నాణంబులనియు, ధనుర్దండములలో భిన్నప్రమాణంబులనియుఁ గలవు. కేవల శస్త్రాస్త్రములేగాదు; బ్రహ్మేంద్ర వరుణ వాయు నాగ మేఘ మోహన ప్రజ్ఞాది దివ్యాస్త్రములు గలవు. జగత్ప్రళయమే సాధింపగల యిప్పటి యాంత్రిక భౌతిక పరమాణు ప్రకల్పితాస్త్రము లన్నింటికంటెఁ గ్రూరములు ఘోరములు నప్రతి విధేయములునైన భార్గవ నారాయణ బ్రహ్మశిరఃపాశుపతాది మహాస్త్రములు గలవు. అభేద్యమంత్ర కవచములు గలవు. నిఖిల కవచ నిర్భేదనాస్త్రములు గలవు. సర్వాస్త్రఘాతి ప్రత్యస్త్రములు గలవు. పలికిన మాత్రమునఁ, దలఁచిన మాత్రమునఁ , జూచిన మాత్రమున భస్మీపటలముఁ, జేయఁజాలు వాగాత్మ చక్షుశ్శక్తి శాపాస్త్రములు గలవు. ఈ సాధన సంపత్తితో నారెండు బలగము లిప్పు డుట్టిట్లూగుచున్నవి.

వ్యూహనిర్మాణము - కళాదృష్టి

భారతయుద్ధమున వ్యూహనిర్మాణమే యత్యద్భుత మైనది. అతి ప్రధానమైనది. ఇది సంస్కృత భారతమునకంటె నాంధ్రభారతమున వివిధ విచిత్ర విన్యాసములతో వర్ణింపఁబడినది. తిక్కనసోమయాజి మహాసేనానియై పెక్కు యుద్ధ రంగముల స్వయముగఁ బాల్గొనియుండుటచే నీ యుద్ధరంగము నిట్లుతీర్చిదిద్దెనో యనిపించును, అదియుఁగాక, కళాకౌశల సౌందర్య దృష్టిలేని సృష్టి యాయన రచనలో నెందును

గనుపట్టదు. ఈ వ్యూహనిర్మాణము కామందకీయాది శాస్త్రపద్ధతుల ననుసరించినదా కాదా యను చర్చయు నిందు సంగతముగాదు. అది కేవల శాస్త్రము. ఇది వీరరసోద్రిక్తులైన మహాయోధుల వీరవిహారముల సాక్షాత్కారము. కళాదృష్టిలో శాస్త్రసంగతి లేదనికాదు. శాస్త్ర మవయవ రేఖామాత్రమై-పై నెదిగినది పొదిగిన దంతయు నాత్మవర్చస్సుతో, విన్యాస కౌశలముతో విలసిల్లిన కళాసౌందర్యము. వీరావేశమున విఱ్ఱవీఁగి సాఁగిమూఁగి ముందుకుదూఁకి మొగ్గరములవెంటఁ బోరాడుచున్న యా మహాయోధు లా చతురంగ బలములు భారత యుద్ధమున మన కన్నుల యెదుటఁ బారాడుచున్న ట్లుందురు. ఈ ప్రత్యక్షీకరణము ప్రాచీనము లయిన రామాయణాది యుద్ధముల నింతగాఁ గనుపట్టదు. ప్రకృతి శాస్త్ర పరిశోధనతో - వివిధ యాంత్రికసాధనములు బహుతర ఘోర మారణాస్త్రములు వెలసిన యర్వాచీన యుద్ధరంగముల యందీ సన్నివేశ సాక్షాత్కార మేర్పడుటకే వీలుండదు. భారతయుద్ధ ప్రతిబింబమైన యాంధ్రభారతమునందే యీ కళామయ వీరవిహారమునంతయు మనమును మన తరువాతి తరముల వారును భావసాక్షాత్కారము చేసికోఁగలరు. పై చూపున కిది ఘోరమైన యుద్ధరంగమేయైనను నిజమున కిది వీర కళాక్షేత్రము. పరమార్థమున భగవద్గీతోపదేశమునకనుష్ఠాన కార్యరంగము.

వ్యూహనిర్మాణము చేయుటలో "అనురూపములగు మాఱొడ్డనములు ప్రస్ఫురితములు దృఢంబులుగాఁ దీర్చినఁగాక తెఱంగగునే" యని మహాయోధుల యుద్దేశము "తొల్లి గురుండు దానవులతోడి రణంబున వజ్రపాణికిన్ దెల్లమిగాఁ గఁజెప్పెనిది దీప్తతరంబగు నొడ్డనంబు" - అని వారు వ్యూహములొడ్డుటకు దేవతల దగ్గఱ నుండి సంప్రదాయము చెప్పుదురు. వ్యూహనిర్మాణము "చారు భీషణస్థాపకము" "పొడుపు ననువు తలకొనవలయు" నదిగా, "ఆరూఢ వీరరస విస్ఫారముగా", 'అభేద్యముగా' 'సర్వతోభద్రముగా' నుండవలెనని వారి యాశయము. శత్రుపక్షములు విజృంభించి పైకొనునపుడు చెదరక నిల్చి మాఱొడ్డుటకును, శత్రువులపైఁ బరాక్రమించి విజయము పొందుటకును, నెదురు తాకుళ్ళలోఁ జిక్కువడకుండుటకును, నెదుటివారినిఁ జిక్కుపఱచుటకును, దమ వారికి సాయపడుటకును, బ్రతిపక్ష సాహాయ్యమును భంగపఱచుటకును, దమ తమ చతురంగ సేనల ననువుగా నడుపుటకును, నక్షతముగా రక్షించుకొనుటకును నీ వ్యూహము లెంతేని యావశ్యయకములు, మానుషవ్యూహము, అచలవ్యూహము, క్రౌంచ-గరుడ-అర్ధచంద్ర-మేఘమాల- మకర-శ్యేన-మండల- వజ్ర-కూర్మ-శృంగాటక- పద్మ-శకట -సూచీ-సర్వతోభద్రాది మహావ్యూహములునెన్నియేని

యిందుఁ బ్రసిద్ధములు. వాని పేళ్ళఁ బట్టియే యావ్యూహములు తీర్చిన యాకారము గోచరించును. వానివాని యవయవ స్థానములనుబట్టియే యందందు నిలువవలసిన మహాయోధుల యర్హతలు ప్రయోజనములు మనసునకు వచ్చును. వాని స్వభావమును బట్టియే యని పరాక్రమమునకో యాత్మరక్షణకో యుద్దేశింపఁ బడుటయు, వాని నడుపవలసిన తీరుబడియు మనకు స్ఫురించును. పాండవకౌరవు లంతయు గమనించి యీ వ్యూహము లన్నియు నొడ్డి యవసరమెంచి చిన్నచిన్న మూకఁలు మొగ్గరములు మోహరములు గల్పించి "యొక్కఁడొక్కఁడపాండవులఁ దాఁకక, సైన్యోపేతగాఢగతినందఱునొక్కొక్క తలగాఁ దలపడి వారికడంక యుడుపఁగ వలయుఁ గ్రీడయపోలెన్", 'మన మొకళ్ళొకళ్ళకుఁ బ్రాపగుచునే పోరినన్ జుల్కన గెల్చుకొనవచ్చు, నిత్తెఱంగు మనకు సమయమునుండీ' ఇత్యాదిగా నియమము చేసికొని పదునెన్మిది దినములు హోరాహోరిగ రణరంగ వీర విహారము చేసిరి.

యుద్ధారంభము

ప్రథమదివసంబునఁ గౌరవులు మానుషవ్యూహముతోఁ, బాండవు లచల వ్యూహముతోఁ గురుక్షేత్రమున మోహరించిరి. చతురంగబలముతో నుభయ పక్షముల యోధానుయోధులు సంగ్రామోత్సాహ దోహలులై దీటుకొని తేజరిల్లుచుండిరి. అప్పుడు కౌరవసేనాగ్రభాగమున "సువర్ణతాళమయి చంచత్కేతువుఁ వర్మమున్ గరమొప్పఁ దెలుపారు వెల్గొడుగుతో గంగాసుతుండు"ను, బాండవ సేనాగ్రభాగమున "భాస్వద్వాహ సంవల్గ నోత్కృష్ట స్యందనముం గనద్ధనువు నుద్దీప్త ధ్వజంబుఁ దగఁ ధృష్టద్యుమ్నుఁడు'ను బొలిచిరి. అయ్యుభయసేనలంఁ దేటిపాఱఁజూడగాఁ, "అమరు తొడవుల వజ్రాంశు లంచపిండుకరణి, హరినీలములఁ బేర్చుకాంతి యళులపగిది, మాణిక్యరుచి పద్మభంగి మెఱయఁ గురుబలంబు గెందామర కొలనిఁబోలె" ప్రకాశించుచుండెనఁట: "అరదములు దీవు, లున్నత కరులు గిరులు, హరులు వీచికలు, సుభట సముత్కర ముగ్రసత్త్వములుగా, శరనిధిగతిఁ బాండుపుత్రసైన్యంబొప్పె" - యుప్పొంగెనఁట! ఈ రూపకోపమాలంకారముతోఁ గౌరవసైన్యము చూచుట కందముగా నున్నను సులభముగాఁ జిందఱవందరై పోఁగలది యనియుఁ, బాండవసేన సముద్రమువలె గంభీరమై యక్షోభ్యమైన దనియుఁ, జివరకు విజయము పాండవులదే యనియు స్ఫురింపఁజేయుచున్నాఁడు తిక్కన. "ఆ రెండు బలములందును దోరంబై యున్నయట్లు దోఁచెం బాండు క్ష్మారమణసుతుబలము నరనారాయణులునికిఁజేసి నాకుం జూడన్" అని సంజయుఁడు స్వయముగనే చెప్పుచున్నాఁడు. ఇంతలో ధర్మరాజు పాదచారియై

కౌరవసేనలోనికిఁ బోయి, పెద్దలైన భీష్మ ద్రోణ కృప శల్యాదులతో యుద్ధముసేయ ననుజ్ఞవడసి వచ్చుటయు, శ్రీకృష్ణుఁడు పార్థునకు గీతోపదేశముచేసి యుద్ధసన్నద్ధునిఁ జేయుటయు జరిగినవి. దుర్యోధనుని పంపున దుశ్శాసనుఁడు పురికొల్పఁగాఁ గురుసైన్యంబులు శంఖ భేరీ మృదంగాది నిస్వనంబులు సెలంగ గాంగేయునితోఁ బాటు ముందుకు నడచినవి. "పాండు నృపాలనందనులు పావనిమున్నుగ నేచి" యురవడింపఁగా "ఘనతర గర్జాధ్వనులును ఘనపద మఖిలంబుఁ దూఁటుకట్టెడు తూర్యస్వనములునున్ గబళించుచు ననిలతనయు సింహనాద మడరి" విజృంభించినది.

జంటలు జంటలుగా జోదుల కయ్యము

అప్పుడు దుర్యోధన ధర్మనందనులు చేయి విసరఁగా నుభయ సైన్యంబులుఁ దలపడినవి. "అర్జునుఁ డప్డు భీష్ముఁగని యగ్గలికన్ గుణరావసంగమ స్ఫూర్జిత దేవదత్త రవశోభితుఁడై" బహుళోగ్ర మహాస్త్రములఁ బఱపఁగా భీష్ముఁడు భీముని పైకిఁ గవిసె. ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునిపై నడర, యుధిష్ఠిరుఁడు శల్యునిఁ దాఁకెను. నకులుఁడు దుశ్శాసనుతో, సహదేవుడుఁ దుర్ముఖునితోఁ దృష్టకేతుఁడు బాహ్లికునితో, నలంబుసుఁడు ఘటోత్కచునితోఁ దలపడి ఘోరంబుగాఁ బోరుచుండిరి. 'తఱిమి సాత్యకి కృతవర్మఁ దాక నతఁడు నేచి మార్కొన, నిరుమేను పూచి యొప్పుమిగులు మోదుగు మ్రాకుల పగిదిగా' న య్యిద్దఱు విలసిల్లిరి.

"మదమునఁగోసలేంద్రు నభిమన్యుఁడు దాఁకిన, నా బృహద్బలుం
డెదిరి కడంగి సూతుఁబడవేసి హయంబులఁ, జంపఁజూడ్కిఁగెం
పొదవఁగ బార్థసూనుఁడు మహోగ్రత నట్టుల చేసి కేతనం
బు దునిమి విల్లుద్రుంచి శరపూరితగాత్రునిఁ జేసె నాతనిన్" --

ఇవ్విధంబున రెండుసేనలన్ జేయంగల దండిమగ లొండురులం దాఁకిన నధికసంరంభ ద్వంద్వ యుద్ధంబు సిద్ధచారణ ఖేచరులు సూచి పొగడునట్లు నిగిడినది.

సంకులసమరము

అప్పుడు చతురంగబలంబులుం దన తన జాతిం బదులు పదులు, నూఱులు నూఱులు, వేలు వేలును, బెక్కులు పెక్కులునుం దలపడి యెడనెడం గలయంబెరయన్, గ్రమంబున సందడి కయ్యంబు నూలుకొనినన్, గ్రందునన్ దమకించి యుభయసైనికు లున్నత్తులగతిన్ గవియ బాణంబులుఁ గృపాణంబులుఁ

గరిదంతంబుల నరదంబుల నొగులు నొండొంటిందాఁకి తుత్తుమురులయిన తుములంబు కతన భయంకరంబగు నతి సంకులంబునఁ ....జేయి దునిసినన్ దక్కటిచేతం గైదువుంగొని కవియువారును. గాలుదునిసిన నెదిరి మీఁదికి లంఘించు వారును, దలదునిసినన్ దారుమున్ను గన్నిడినవారిం బొడిచి పడువారును దెగిపడియు నవుడు గఱచుటయును, బొమముడివడుటయును సడలని తలల నొప్పువారును....... సుభటులు సొచ్చిచెండినన్ వండం దఱిగినట్లుండు వేదండ హయచయంబులును..... వ్రోడు పడురథంబులును. దట్టంబులగు పదాతి గాత్రంబులును..... వికటాకారంబులగు ఘోటకంబులనై ఘోరభంగియగు సంగరంబు సెల్లుచుండ మధ్యాహ్నం బైనఁదట.

ఏకైక వీర విజృంభణము

అప్పుడు "మందాకినీ తనయుఁ డేచి చేది పాంచాల కేకయు లాదిగాఁగల్గు భూపాలకోటి మొగ్గరములెల్లఁ గలఁగఁ - దిరుగువడ - నోరగిలఁగఁ - బెల్లగిల్లఁ - దల్లడపడరణక్రీడసల్పె" నఁట! ఆ భీష్ముఁడు "పాయవడఁజొచ్చు, గుంపులుసేయును. మలఁకలఁ జరించి చించును. గోణవ్యాయామగతుల వలయములై యుండం దిరిగి కలఁచు నరిసైన్యంబున్" అతని శరపరంపరా పాతముతో- "డొల్లెడు తలయును, దునిసెడువిల్లును, ధరకొఱగుమేను. విఱిగెడు సిడముం, బెల్లుదొరఁగు నెత్తురునై పల్లటిలం దొడఁగెనపుడు పాండవబలముల్" - అప్పుఁడభి మన్యుండు కనకవర్ణతురంగంబులును గర్ణికారధ్వజంబును మెఱయం దాఁకి- "శల్యు నారాచ పంచకమున నొప్పించి, యొకకోలఁ గృతవర్మ యురమునొంచి, క్రూరభల్లమున దుర్ముఖుసూతు తలఁద్రుంచి. తఱిమి వివింశతి ధనువు దునిమి, వెడంద యమ్మున నేసి వెండియు మూఁడువాలిక యమ్ము లొడలఁ గీలించి, కృపుని హయముల శరచతుష్టయ తాడనమున నుబ్బఁడఁగించి, భీష్ముపై నడరి, మేన విశిఖనవకంబు నాటించి వెగడుపఱచి, పేర్మి నార్చిన సురకోటి పిచ్చలించె. మెచ్చి భీష్మాదులెల్ల విచ్చుఁబోలు-నెక్కుడగుఁగాని, యసదుగాఁ డీతఁ డనిరి" - భీష్ముతోఁగలిసి "తక్కటి యేవురు పెక్కులమ్ము లొక్క మొగి రయంబునన్ గురియంగా గిరవోలె నతండుదగ్రుఁడై" "వారల శరవర్షంబును వారించుచు, వేఱవేఱ వాలంపగముల్ వారలపైఁ గురియుచుఁ గురువీరుని తాలధ్వజంబు విఱుగఁగ" నేసినాఁడఁట! దీనితోఁ గౌరవసేన జోదుపిండు చిన్నఁబోయెనఁట! అప్పుడలుకతో విజృంభించి "శాంతనవుఁడు తేజోదుర్ధాంతుండై. నావెలుంగు ధరకెల్లను జాలింతు నినుఁడస్త శైలోపాంతమునకుఁ జనిననేమి" యనినట్లుగాఁ బొరెనఁట! ఇంతలో

సూర్యుఁడస్తమింపగాఁ గయ్యంబు సొలించి యుభయసేనలు తమతమ యునికిపట్ల కరిగినవి.

వ్యూహనిర్మాణ భేదనములు

రెండవఁనాడు పాండవులు "క్రౌంచవ్యూహంబు సంఘటించునెడన్ జంచుత్వంబు భజించి ఫల్గునుండునుఁ, గుంతిభోజుండు శైబ్యుండు చక్షుస్థానంబులను, దశార్ణ శూరసేన కిరాత దేశాధీశులు కంఠాకారంబును, భీమ సేనుండును ధృష్టద్యుమ్నుండును దక్షిణవామ పక్షంబులును భజించి పొల్చిరి. వెన్నయి యుధిష్ఠిరుండొప్పె అప్పుడు కౌరవులు మూఁడు గట్టి మొగ్గరంబులుదీర్చి మువ్వైపులం బాండవసేనన్ గవిసి తలపడఁగా, "ఱెక్కలుసించికంఠమున ఱేకులువాసి, శిరంబు వ్రచ్చి, పేరుక్కున గ్రౌంచ చందమగు నొడ్డు తలంగఁగఁజేసి భీష్ముఁడే దిక్కునఁ దానయై దిశలు దీటుకొనన్ శరకోటినింపె" - నఁట; ఈ వ్యూహ భేదమున నెవ్వరెవ్వరి నెట్లెట్లు కొట్టెనో యతని కరలాఘవ శరపాటవము లేపాటివో యొక చిన్న పద్యభాగముతో నిట్లు మన యూహకే వదలినాఁడు తిక్కన, "ఆ వెల్లువ-శరజిహ్వాలఁ ద్రావి ధనంజయ మహాగ్ని దరికొని కవియంగా. వెగడొందెడు కురుబలదావము శాంతనవుఁ డంబుదము క్రియఁగాచె" "ఇ వ్విధపుఁ గయ్యము లెక్కడనైనఁ గంటిమే" యని మెచ్చుకొన్నారు గంధర్వులు. ఒకరికొకరు తోడుపడి చేయు కయ్యము లిట్లుండును.

ద్రోణధృష్టద్యుమ్నుడు వివిధాస్త్ర పరంపర పఱగించి ఘోరంబుగఁ బోరు నప్పుడు, ధృష్టద్యుమ్నుఁడు విరథుఁడై విచ్ఛిన్న కోదండ గదాదండుఁడై, పొలివోని బంటుతనముతో వాలునుం బలుకయుం బుచ్చుకొని గురుని సాయకములు పలుకన్ జడియఁజేయుచు ముందునకుఁ బోవుచుండఁగా, ననిలతనయుఁడడ్డము సొచ్చి, గురుం గ్రూరాస్త్ర సప్తకంబున నొప్పించి, పాంచాలసుతు నొ డొక యరదం బెక్కించె, అప్పుడు కళింగాధిపతియగు శ్రుతాయువు తనుజునితో ననుజునితో గజయూథముతో భీమునిపైకి మార్కొని విరథునిఁజేయఁగా. నతఁడు గదాధరుడై కవిసి తనుజు ననుజుం కూలనేసి శ్రుతాయువును సొమ్మసిల్ల నేయఁగా నింతలో సాత్యకి ధృష్టద్యుమ్ను లాతనికిఁ దోడువచ్చిరి. అది చూచి భీష్ముఁడు భీమునిపైకి విజృంభింపఁగా సాత్యకి నిష్ఠుర భల్లంబున భీష్మసారథిన్ బడనేయుడు "వాయువేగంబులై తద్వాహనములు భీష్మతేరెత్తికొని" పాఱిపోయినవి ధృష్టద్యుమ్నుఁ డమ్మారుతిం దన రథం బెక్కించుకొన్నాఁడు. దాని కోర్వకశల్యకృపాశ్వత్థామ లాతనిం జుట్టుకొని, రప్పుడు ధృష్టద్యుమ్నుఁడు దన యరదంబున నున్న

భీమసేనుని సవినయంబుగా డించి వారి మార్కొనియె. ఆ రథికత్రయంబు పాంచాలపతిసూను మేన నిశితాస్త్ర పరంపరలు నినిచిరి.'' ఇవ్విధంబున నమ్ముమ్మువ్వురచేత నతం డొక్కరుండ పొదువంబడి యుంట దవ్వులంజూచి విజయనందనుఁడు నిజస్యందనంబు దోలికొనివచ్చి కృపాశ్వత్థామలఁ దొమ్మిదేసి యమ్ముల నొప్పించి మద్రపతి యంగంబునఁ బంచవింశతి విశిఖంబులు నాటించె, వారును నతనిఁ బండ్రెండు పండ్రెండు శరంబుల నేసిరి. ఆ సమయంబున లక్ష్మణకుమారుం డయ్యభిమన్యుం దలపడి మర్మభేదులగు నారచంబుల నొప్పించిన నతం డక్కుమారుఁబంచాశత్సాయకంబుల నొప్పించె.

"తనయుఁడు నొచ్చిన దుర్యోధునుఁ డర్జునతనయు మీఁదఁ దనతే రలుకం జననిచ్చి'' తారసిల్లఁగా విప్పచ్చుఁడు-"కనితే రుప్పరవీథిఁ దోలికొని, యా కౌరవ్య సైన్యంబు నజ్జననాథుం దటినీతనుజు గురుఁ జంచద్బాణవర్షంబులన్ మునుఁగన్ జేయుచు'' వచ్చి మార్కొనియె. ఇట్టివి భారతయుద్ధ విహారములు. ఒక్క జంటగా నెక్కటికయ్యం బిట్టు లుండును.

గురుండును గిరీటియు వివిధ బాణాసారంబుల నంబరంబు గప్పుచు, "గురుఁడేయ నరుఁడు ద్రుంపఁగ, నరుఁడేయఁగ గురుఁడు ద్రుంప, నానా విశిఖ స్ఫురణ పరిమారణంబుల కచ్చెరువందుచునుండి రుభయసేనల జనముల్" దొరకొని దివ్య బాణములు ద్రోణుఁడు బల్విడి నైంద్రమారిగా నరుపయినేయ, నాతఁడు మనంబునఁ గొంకక తత్తదస్త్రముల్ వెరపున నేసి యేసి యఫలీకరణం బొనరించి పేర్చె'' - ఇట్టు లసదృశంబుగాఁబోరు నగ్గురుశిష్యుల వీక్షించి సురలు "హరుఁడు వినోదార్థముగా నిరుమేనయి రణ మొనర్చె'' నని యగ్గించి రప్పుడు.'' ద్రోణుఁ డుద్ధతి బ్రహ్మాస్త్రము చేతనే క్రీడయవోలె మరలించెనఁట. ద్వంద్వయుద్ధములలో మఱొక వైఖరియిది. "చేకితానుండు కృపునిపై శితశరములు గురిపె. నాతండు విల్లును గుఱ్ఱములను వ్రయ్యలుగఁజేయఁ, గడగొని రథము డిగ్గి సరభసంబుగఁ జని కృపునివిరథుఁ జేయ'' - "కృపాచార్యుండు పదాఱుమ్ము లెమ్ములం గీలించుటయు, నతండు గదా దండంబువైవ నగ్గౌతముండు దుండంబులు సేసినన్, జేకితానుండు రయంబున రథంబుమీఁది కరవాలంబుగొని, మెఱుంగు మెఱసినట్లు పఱతెంచిన, శారద్వతుండు నిశాత కృపాణపాణియై ధరణి కెఱఁగి యేడ్తెఱ నతనిన్ గవిసి నొప్పించి, యతని చేత నొచ్చె, నట్లిరువురు మూర్ఛిల్లి మేదిని వ్రాలిన "నిద్దెస సుబల తనూజుఁడు నద్దెసఁ గరకర్ణుఁడు రయంబెసఁగఁగ నయ్యిద్దఱఁ దమ రథములపై గ్రద్దన నిడికొని తొలంగఁగాఁజని''రఁట. ద్వంద్వయుద్ధములో గదాయుద్ధ కౌశల మిది.

విరథుఁడై శల్యుఁడు గద యెత్తికొని రాఁగా, నభిమన్యుఁడు 'రమ్మర' మ్మని తానును గదాధరుఁడై యెదురుదాఁకె. ఇంతలో భీమసేనుఁ డెదిరి యాతని వెనుక వేసికొని తాను గదఁబట్టి ముందుకు నడచి నిలఁబడె. 'ఇతని కితఁడే తగు' నను నార్పులు ముట్టుచుండఁగాఁ దలపడి, శల్యసమీరనందనులు మండల ప్రచారం బులును విచిత్రగదా ప్రసారణంబులును మెఱయుచు "గద లన్యోన్య సమాహతిన్ మిడుఁగుఱుల్ గ్రక్కంగ సారించుచున్ గదియన్ - బాయఁగ - వ్రేటు దప్పు - నుసులంగా నేర్పు లంగంబులం దొదవన్, ఘోరపరస్పర ప్రహతు లత్యు గ్రంబుగా నెత్తురుల్ సెదరింపన్, బదశబ్ద హుంకృతులు దిక్సీమంబులన్ దాఁటఁగన్-' 'పోరాడునప్పుడు లావును వీరోద్రేకంబుఁ జలము వెరవును సరియై, మారుతియు మద్రపతియు నుదారగతుల మెఱసి రమరతతి వినుతింపన్" ఇట్లు పెద్దయుం బ్రొద్దుపెనంగి" అఱిముఱి నొండొరు వ్రేసిన, నెఱఁకులు దాఁకుటయు నొచ్చి' యిరువురు నెలకొఱిగిరి. 'ఎక్కు టెక్కటి పెనఁకువ లిట్టు లేచునే..... యింకజనంబు లీ కురుపాండవ సంగరంబు సెప్పికొంద్ర'ని యంబికాతనయుఁ డబ్బురపడెనఁట. ఒక్కనిపైఁ నైదుగురును, ఐదుగురితో నొక్కఁడును గదిసి కయ్యముసేయు టిట్లుండును. "పతియును ద్రోణుండును వివింశతియుం గృప సోమదత్త శల్యులు గంగాసుతుతోడఁ గడఁగి- రర్జునసుతుఁడయ్యేద్వురను దాఁకెసురలు నుతింపన్", అయ్యేద్వురలో భీష్ముఁడు తమపైకి వచ్చు సవ్యసాచిని మార్కొనఁగా!

"అశ్వత్థామ భూరిశ్రవ శ్శల్యపుత్ర చిత్రసేనులు మత్తమాతంగంబులు సింగంబు కొదమం బొదువుపోలిక నభిమన్యుం బొదివిన నతఁడు "కని యల్లన నవ్వుచు, గురుతనయుని యురమేసి, శల్యతనయుని సిడమున్ దునిమి, వెస నీదు తనయుని ధనువునఱికి, సోమదత్తతనయుని నొంచెన్", "వారును ముందటి యార్వురు నీరసమున నొక్క పెట్టునేయఁగఁ బటుదోస్సారుండగు సౌభద్రుఁ డుదారస్ఫురణమున నద్భుతంబుగఁ బోరెన్" - హస్తలాఘవమున- నతులబలంబున- శౌర్యమహిమ-నధిక ధైర్యముననను సవ్యసాచితనయు సరిగార యమ్మహావీరు లంతపట్టు" నని యందఱుఁ బ్రశంసించిరి.

మఱియొకచోట, ద్రౌపదీపుత్రు లేవురు "సౌమదత్తి నొక్కుమ్మడిం జుట్టు ముట్టిన నతం డందఱ కన్నిరూపులై యేపునం బెనంగుచుండ

"హరిసుతసూతి మావుల, బకాంతక సూనుఁడు చాపమున్ యుధి
ష్ఠిర తనయుండు గేతువుఁ, గడింది మగంటిమిఁ ద్రుంప, సూతునిన్

బొరిగొనియన్ వెసన్ నకులపుత్రకుఁ డిమ్మెయిఁ జక్కువడ్డఁ, జె
చ్చెర సహదేవ నందనుఁడు సేసె శిరంబును మేను వేలుగాన్"--

వేఱొక్కయెడఁ గురుకుమారులు 'ఆదిత్యకేతుండును నపరాజితుండును బహ్వాశియుఁ బండితుండును గుండధారుండును విశాలాక్షుండును మహోదరుండును వృకోదరుపై నొక్క పెట్ట కదిసి పెక్కు విధమ్ములగు నమ్ములం బెక్కింట నొప్పించిన, నప్పాండవవీరుండు రోషాతి భీషణుండై యేరికిం దేఱిచూడరాక, పటుభల్లంబున-నిశిత క్షుర ప్రముఖంబున-శిర ప్రదరంబున-శాతక్షురికా ముఖంబున-దీప్తార్ధా చంద్రాంబకంబున- ఖరనారాచంబున- గ్రూర బాణంబున నక్కుమార సప్తకంబు సమవర్తి సమీపంబున కనిచె.

ఇంకొకయెడ, శకునితమ్ము లార్గురు గుఱ్ఱంబులెక్కి యర్జునపుత్రు నిరావంతుం బొదివి సెలకట్టెలవాట్ల దొంకెనపోట్ల నొప్పించి చుట్టుముట్టి - "పొడవఁగ వ్రేయఁగ, నతఁడుం గడు నుఱవగు నేర్పు కడిమి కలిమిన్ దనపైఁ బడకుండఁ గృపాణమ్మునఁ గడుఁ జిత్రపు గతుల జడిసెఁ గైదువులెల్లన్ - ఆ రౌతులు వీఁడుగాలు మానిసి యగుటం జేసి నొప్పింప వెరపు గాదయ్యెడు నని తలఁచి, "అందఱును గడంగి హయముల డిగ్గి పలు ఖడ్గదీప్తులడరఁ గదియుటయును, బ్రమరి తిరిగి వారి పండ్రెండు దునియలు సేసి క్రీడికొడుకు సెలఁగియార్చె.

ఇంకొక్క యెడ నొక్కనిపైఁ బెక్కురు పడి దొమ్మిపోటు నడుపుభంగియిది:-నారాయణ గోపాలురు బలఁగంబులతోఁ బేర్చి యేన్నర నారాయణుల మేనుల నానాస్త్రంబులు నినిచిన, నరుండు త్వష్టయిచ్చిన మహాస్త్రంబు ప్రయోగించినన్ దత్ప్రభావంబున "గాండీవి చందమయి వారొండొరులకుఁదోఁచి, యెకళులొకళుల నానాచండాస్త్ర శస్త్ర సముదయ ఖండితులుగఁ జేసి పడిరి కలనన్ గలయన్" - అంతంబోకతుండి మగధ కేరళ మిచ్ఛిల్లకాదులు సంశప్తకు లొక్క పెట్టు విజృంభించి "పెరయాఁ గలగతిఁ గవియుచుఁ, బొరిఁ బొరిఁ గడుఁదురులపగిదిఁ బొదువుచు, నెరకై వెరవునఁ గాకులుఁ గ్రోతులుఁ బరువడిఁ జీకాకు పఱచుభంగి నలఁచుచున్''- వీరావేశంబున "అరదంబులు మొదలగు నుద్ధర వాహనకోటి డిగ్గి దుర్దాంతగనిన్ దురగంబులపై హరిపై నరుపై నూడుకొనఁబడిరి నలి నార్పులతో." ఇత్తెఱంగునన్ జేయికా లార్పను-జూడ్కి వఱపను రాకుండునట్లుగా గుంపులు గొనన్ బైపయిఁదొరంగినన్....జెమర్చి చేడ్పడి వసుదేవనందనుండు "ఎచట నున్న వాఁడ, వేమైతి- ప్రాణానఁగలవె? యేను నిన్నుఁ గానకునికిఁ దలచుఁచున్నవాఁడ. ధైర్యధౌరేయ నీ యెలుఁగు సూపవే సురేంద్రతనయ!" అని యెలుం గిచ్చెనఁట.

అప్పు డర్జునుండు ముకుందుని మానుషభావం బూహించి యుత్సాహంబు వాటించి, "అనిలాస్త్రంబు ప్రయోగించిన, సంశప్తకులు దెసలఁ జెదరి చౌరవు చాడ్పునఁ దూలఁగ, బహువిధశరవినిహతి బడలువడఁజేసె వెన్నుడు మెచ్చన్" - భారత యుద్ధమున నిట్టి విచిత్రవిన్యాసములతో వివిధ శస్త్రాస్త్ర కళాకౌశలముతో, నద్భుత ధైర్యశౌర్య సాహసములతో నభిరామ భీషణములయిన రణరంగవిహారములు పలు చోటులఁ బలుభంగులఁజూడగలము. వీనిలోఁ బద్మవ్యూహ శకటవ్యూహ నిర్మాణ భేదనము లత్యద్భుతములైనవి.

సంశప్తకు లర్జును నెక్కటి కయ్యంబునకుఁ బిలువఁగా నతఁడు వారితోఁ బోర వేఱొకచోటికిఁ బోయెను. అదిచూచి ద్రోణాచార్యుఁడు పద్మవ్యూహముఁ బన్నెను. అర్జునుడు తప్ప దాని నెవ్వరు భేదింపఁజాల రనియు, నిప్పు డీ వ్యూహమునఁ జిక్కఁబెట్టి "యుధిష్ఠిరుఁ బట్టియిచ్చెద" నన్న తన ప్రతిజ్ఞ నెరవేర్చుకో వచ్చు ననియు నతని యూహ. "పద్మవ్యూహంబు సంఘటించునెడ వివిధ దేశంబుల రాజుల దళంబులును, రాజకుమారులు కేసరంబులును, గర్ణ దుశ్శాసన బహుళ సేనాపరివృతుండయి కురువిభుండు కర్ణికయునుంగా నభేద్యభంగి, బొనర్చిన, నది వలయాకారం బగుటంజేసి చక్రవ్యూహంబు ననంజను, నమ్మొగ్గరంబు మొగంబునం దానుదర్పంబు మెరయ నెఱయం బొలిచి నిలిచె. మఱియు వలయు నెడలకు లావై జయద్రథ గురుపుత్ర కృపశకుని కృతవర్మ భూరిశ్రవ శల్యులును........ నిలిచిరి. శత్రుపక్షమునుండి యెవ్వరైన ద్రోణు నతి క్రమించి లోపలికిఁ బోయినచో ఱేకులును గేసరములుగానున్న రాజు రాజకుమారులుఁ దమ బలములతోఁ జుట్టుముట్టుదురు. కర్ణికగానున్న దుర్యోధనాదులు వాని నెదిరించి పోరుదురు. పైనున్న జోదులలోఁ గొందఱు వానిం బొదివి చిక్కించుకొని ఘట్టుపెట్టుదురు. తక్కిన జయద్రథాదులును ద్రోణుండును బై నుండి తోడురానీయక యడ్డగింతురు. ఇది వారి విధానము. పాండవులు తమలో నెవ్వరికి నీ యొడ్డు భేదించు వెరవులేక యభిమన్యుఁ బ్రోత్సహించిరి. అతఁడును, "దీని ముఖంబు ఖేదించు తెఱంగు నాకెఱిఁగించె మా తండ్రి, ఏను దెఱపిసేయనేర్తుఁ. జొచ్చి చించి చెండాడెద. మూఁకలెల్లఁ జుట్టుముట్టినపుడు వెడలునట్టి తెరవు విన. దానికేమి? నాచొచ్చు నేర్పు బలుపుఁజూడు మధిప" అని యుత్సహింపఁగా, "మెఱపు మెఱసినట్లు మెఱయంగా నరదంబు, కర్ణికార కేతుకాంతి వెలుఁగ, నంపగముల గురుని నలయించి కడచి యింద్రజునికొడుకు మొగ్గరంబు సొచ్చె"! చొచ్చి మహార్ణవంబునం దిరుగు మందర సంగంబు చందంబున సమ్మోహారంబు ద్రిప్పి కొలిపియుం, బొడిసేసియు. రూపుమాపియు నద్భుత విహారం బొనరింప, నవ్వీరవరు నారాచాది నానావిధ

విశిఖ వ్రాతంబులు హేతిసంఘట్టనంబున మండుచుఁ, జతుర్విధబలంబులఁ జించి జెండాడుచు, రథ రథ్య కేతు సూతుల గీటడఁగించుచు, మేనులు చించుచుఁ, దలలు చిదుముచుఁ, గండలు చెక్కుచుఁ నెమ్ములు నలఁచుచుం బరఁగిన, నమ్మెన చిక్కువడియును సుడివడియును గలంగియుఁ దొలంగియు వెఱచఱచియు విచ్చిపఱచియు దీనదశకు వచ్చినది.

అచ్చటి మేటిమగ లెల్లె నొక్క రొక్కరుగా, జంటలు జంటలుగా, గుంపులు గుంపులుగాఁ బంతగించి పైఁబడినను నతఁ డందఱ కన్నిరూపులై యావులమంద వలెఁ దఱిమితఱిమి వెంటఁబడి వేటాడుచుండె; సైంధవుఁ డడ్డుపడుటచేఁ బాండవులు తనకుఁ దోడుపడలేకున్నను నయ్యేకవీరుఁ డెవ్వరినైనఁ దలయెత్తనీక మొగము సూపనీక మారిమసఁగినట్లు చిత్రవధ విహారము సేయుచుండును గాని వెనుకకు మరలిరాఁడయ్యె. భంగపాటునఁ గ్రుంగిన ద్రోణాదు లప్పుడు వంచనచేసి యాతని ధనురశ్వసారథులం దునిమి విరథుం జేసిరి. అయిన నీడంబోవ కామేటి మగఁడు విజృంభించి నురుమాడుచు, నదియుఁ బఱియలుకాఁగా గదాధరుఁడై నుగ్గుసేయుచు నలసి సొలసి డస్సి తూగాడుచు, వీర వ్రతంబు ధీరత్వనిష్ఠం జలుపుచుఁ గడకు గదా ప్రహారమున దుశ్శాసనసుతుఁ బడవేసి యాతనివ్రేటుచేఁ దానును నేలంగూలె పద్మవ్యూహ మిట్లు సౌభద్రుని మ్రింగినది.

భారతయుద్ధమున శకటవ్యూహనిర్మాణ మతివిచిత్రమైనది. అర్జునుఁడు రవియస్తమించులోపల సైంధవుతలఁ ద్రెవ్వనేసెద నని పతిజ్ఞ సేయఁగా, నా ప్రతిజ్ఞను భంగపఱచుటకై ద్రోణుఁడీ వ్యూహమును నిపుణముగా నిర్మించెను. ద్వాదశగవ్యూతి దీర్ఘంబును బంచగవ్యూతి విస్తృతంబునుగా శకటవ్యూహంబు సమకట్టి. దానికిఁ బశ్చిమార్థంబున గర్భవ్యూహంబుగాఁ బద్మవ్యూహంబు పన్నించి,
సమకట్టి. దానికిఁ బశ్చిమార్థంబున గర్భవ్యూహంబుగాఁ బద్మవ్యూహంబు పన్నించి,
తన్మధ్యంబు మొదలు కొని యేలిన సేనాముఖంబు దెసకుంజాలి నిగుడునట్లుగా సూచీవ్యూహంబుగావించి, సూచీముఖంబునం గృతవర్మయు, నట పిఱుందం గాంభోజరాజును మఱియుం బిఱుసన నాప్తులైన శతసహస్రయోధుల మున్నిడుకొని కురురాజును, సూచీమూలస్థానంబగు పద్మవ్యూహగర్భంబునఁ గృపాశ్వత్థామ భూరిశ్రవశ్శల్య కర్ణ వృషసేనులను నార్వురు యోధులతో నసంఖ్యాక చతుర్విధ బలంబులతో సైంధవుండును నిలుచునట్లుసేసి, తాను వ్యూహాగ్రమునఁ బటుధనుర్ధారియై నిలిచెను. మొదట ద్రోణునిఁ, దరువాత వరుసగా నిందఱు మహాయోధుల నింతటి చతురంగబలంబుల జయింపక సైంధవుని దెసఁ దేఱిచూడరా దనియు, నిది యసాధ్యం బనియుఁ గౌరవు లుత్సాహమందిరి.

కపిధ్వజ ప్రభలతోఁ గృష్ణసారథ్యముతో వెలుఁగొందు నరదంబుపై ధనుర్బాణ పాణియై యర్జునుండు దర్పముతో నెదురెక్కి వచ్చిన దుర్మర్షణ దుశ్శాసనులఁ బారఁద్రోలి ధనురాచార్యుం దరిసి వినయముతో 'నను నశ్వత్థామను నీ వనఘా సరికూర్మిఁ బెనిచి తట్లగుటను ద్రోహిని సైంధవుఁ జంపఁగఁ బూనిన నా యుచిత ప్రతిజ్ఞ నెఱపుము కరుణన్' - అని యనుమతి గోరెను. గురుండు చిఱునవ్వుతో 'నన్ను గెలువ కెట్లు సైంధవున్ జేరెద' వని యంపవెల్లి ముంపఁగా నప్పుడ య్యిరువురకుఁ బోరు ఘోరంబయ్యె. ముకుందుఁ డర్జునునితో 'రిత్తతడవుగాకుండఁ గ .... చొత్తము శకటవ్యూహ' మని హెచ్చరించి, గురునకుఁ బ్రదక్షిణముగ రథము నడిపి మొగ్గరమునన్ జొరఁబడెను. పోవుచున్న పార్థుని వెంటనంటి ద్రోణుఁడు 'పగఱఁ బరిమార్పక విచ్చలవిడి' పోయెదవె యని యదలింపఁగా 'గురుఁడవు గాక పగతుఁడవె' యని పలుకుచు నరుల నఱకుచు ముందున కరుగుచుండెను. అతని చక్రరక్షకులగు యుధామన్యుఁడునుత్తమోజుండును దోడన వచ్చి చొచ్చిరి. కౌరవయోధు లడుగడుగున నడ్డువడి ముమ్మరముగఁ బోరుచున్నను. ధనంజయుఁ డస్త్రవిద్యాపాటవమున నందఱఁ గనువు కొట్టి రథగమనమునకు వలయు తెఱపిచూచుకొని ముందున కేఁగుచు నెదురెక్కిన శ్రుతాయుధ ప్రముఖ యోధులఁ బెక్కుర మ్రందించె.

ఈ సమర సమ్మర్దములో రథాశ్వములు శస్త్రాస్త్ర పీడితములై డస్సిపోవు టెఱింగి పార్థుఁడు "వీని నిప్పుడు యఱ్ఱులు విడచి తడవు" మని ముకుందునకుం జెప్పి, తాను గాండీవధారియై నేలకు దిగి. తనపై కుఱికివచ్చు సేనల సేనాధిపతుల నస్త్రపరంపరచే బడలువడం గొట్టుచు, నాలోనన దివ్యాస్త్రహతిచే నేలఁ బగిల్చి కొల నుత్పాదించె. శ్రీకృష్ణుఁ డచ్చెరువందుచు గుఱ్ఱంబుల నిమిరి నీరు ద్రావించి ఖాణంబు మేపి కట్టాయితంబుసేసె, సవ్యసాచి శత్రుసేనా మధ్యంబునఁ బడంతుల పిండులోనం గ్రాలెడు విలాసియుంబోలె విలసిల్లుచు నమ్మహనీయరథం బెక్కి బిక్క మొగంబులతోఁ జూచుచున్న రిపుబలంబుపైఁ గవిసె. "మున్నిట్టివి సూడరున్ వినరు నెవ్వారున్ ద్రిలోకంబులన్" అని యందఱు నివ్వెఱం బొందిరి. ఇంతలో ధర్మజు పంపిన మొదట సాత్యకియుఁ దరువాత భీమ సేనుండును గౌరవ సేనావ్యూహంబుఁ జీల్చికొనివచ్చి వివ్వచ్చునకుం బాసటయై కార్చిచ్చువోలెఁ గౌరవసేనం గసిమసంగిరి.

ఇది యీనాటిఁ కాలి బంతియాట (పుట్‌బాలు) వలె నన్ని పోలికల నొప్పి యున్నది. ఒక బంతిని రెండు జట్టుల నడుమ నేల నుంచగాఁ, నొక జట్టువారు దాని నెదుటి జట్టువారి చివరి హద్దుకుఁ దీసికొనిపోయి లక్ష్యములోని కెగురఁ

గొట్టుటకు (గోలుచేయుటకు) ముందుకుఁ బోదురు. వారిలో సెంటరు ఫార్వర్డ్, రైట్ఇన్, లెఫ్ట్ ఇన్, రైట్ఔటు, లెఫ్ట్ఔటు - అనువా రైదుగు రుందురు. ఇచ్చట నర్జునుఁడు నతని చక్రరక్షకు లిరువురును భీమసాత్యకులు నట్టివారు. ఇట్టివారే యెదుటిపక్షమున నుందురు. వారు దుర్యోధనాదులు, వారుగాక స్వపక్ష రక్షణము (డిఫెన్సు) చేయు వారాఱుగు రుందురు. ఇచ్చట వారు సైంధవుని రక్షించు షడ్యోధులు, ఉభయ పక్షములు తారసిల్లుటతో బంతి ముందువెనుకల కాడుచు పెనాల్టీరింగు ఏరియాలోనికి వచ్చినట్లిప్పుడు పోరాటము సైంధవుని దగ్గఱకు వచ్చినది. గంట (నియమిత కాలము) ముగియవచ్చినట్లు రవి యస్తమింపనున్నాఁడు. పట్టుదలతోఁ బ్రాణములొడ్డి యిరువైపులు ముమ్మరముగఁ బోరుచున్నవి. మేఘాచ్ఛాదనతో రవి యస్తమించినట్లు కనఁబడఁగా సైంధవుఁడు తల నిక్కఁబెట్టి చూచినాఁడు. కృష్ణుని హెచ్చరికతో నర్జునుఁడా తలను దివ్యాస్త్రమున నెగురఁ గొట్టినాఁడు. చెండు నిర్ణీత ప్రదేశమునఁగాక ప్రక్కకో పైకొ యెగురగొట్టఁబడినచో గెలిచినట్లు గాదు. అట్లే సైంధవుతల యతని తండ్రి తొడపైఁ బడకున్నచో విపరీతమే జరిగెడిది. కాని పాశుపతాస్త్ర ప్రయోగముతో నందుఁ గృతకృత్యుఁడై విజయుఁడు విజయో పేతుఁడైనాఁడు. దైవ ధర్మ బలముగల పాండవపక్షము గెలిచినది. అదిలేని కౌరవపక్ష మోడినది.

యుద్ధావశేషము

వీరాధివీరులైన పాండవ కౌరవయోధుల పదునెన్మిది దినముల యుద్ధములో నిట్టి యద్భుత సన్నివేశములు వీరవిహారములు మహాస్త్రప్రయోగములు విచిత్ర సంఘటనము లెన్నియేనిఁ గలవు. అవన్నియు మానవాతీతమైన దైవశక్తికిని, మానవ సాధితమైన విద్యా కళాకౌశలమునకును, ధర్మోపబృంహితమైన యుదాత్త వృత్తికిని, నధర్మావిష్కృతమైన కపటఘాతుక వృత్తికిని నసాధారణోదాహరణములు కాఁ గలవు. వానివాని నిజస్వరూప మంతయుఁ బాఠకు లాంధ్రమహాభారతమునఁ జూడగలరు. కౌరవ సర్వసేనాపతియై భీష్ముఁడు పది దినములు యుద్ధముచేసి యస్త్రసన్యాసము జేసెను. కౌరవులకడ నుండుటచే వారికొఱకు యుద్ధముచేసి, ధర్మవిజయమునకై తన్ను గెలుచు నుపాయము తానే చెప్పి, విధిగా నట్లు సేయుమని యాజ్ఞాపించి కడకు శాంతుఁడైన పుణ్యమూర్తి యీతఁడు. తరువాత ద్రోణుఁడా భారము వహించి యైదుదినములు పోరి యస్తమించెను. ఈయన యాధిపత్యముననే సంగరకౌశలముతోఁబాటు వివిధ దివ్యాస్త్ర ప్రాభవము విరివిగాఁ బ్రదర్శింపఁబడెను. కాని యభిమన్యువధలో నీయనయే కపట యుద్ధ తంత్రమునకు

దారి చూపవలసివచ్చుట దురదృష్ట మనవలెను. ఇది తరువాతి యుద్ధమునఁ గ్రమముగా సర్వసాధారణ మైపోయినది. తరువాతఁ గర్ణుఁడు సేనానియై రెండు దినములు ఘోరముగాఁ బోరి కిరీటి దివ్యాస్త్రముచే నేలఁగూలెను. తానే దుర్యోధనుఁ డన్న యభిమానముతో, నర్జును జయింపఁగల మేటి తానేయన్న యహంకారముతో, భీష్మద్రోణులు పదునైదు దినములు చేసినంత వీరవిహారము-రమారమిగా నంత విపక్ష విధ్వంసన మీతనిచేత జరిగినది. గురుకోపము, బ్రాహ్మణశాపము, శల్యుని కౌటిల్యము, దైవముప్రాతికూల్యము నిమిత్తములుగా దివ్యాస్త్రములు స్ఫురింపక. రథచక్రములు క్రుంగి లేవక, కడకుఁ గర్ణుడు వీరశయన మలంకరించెను. ఈతని మరణముతో దుర్యోధనుని యాశాతంతువు తెగినది కాని, యహంకార గ్రంథి తెగలేదు. గెలిచి రాజ్యమేలెద ననుటకంటె బ్రదికి యింకేమి చేయవలెనను భావమే బలిసి పోయినది. మూర్ఖులపద్ధతి యిట్టిది గనుకనే, యతఁడు శల్యునకు సేనాధిపత్యముకట్టి పోరెను. శల్యుఁడొక్కదిన మింత తక్కువగాఁబోరి కర్ణుని వంచించిన పాపఫలమా యన్నట్లు ధర్మజుని కోపాగ్ని కింధనమై భండనభూమిఁ బడిపోయెను. దీనితో నభిమానము సచ్చి దుర్యోధనుఁడు పలాయితుఁడై ద్వైపాయన హ్రదమున దాగెను. శ్రీకృష్ణుఁడు విధియై, ధర్మజ భీముల యెత్తిపొడుపులు కాలపాశములై యాతనిని బైటికిలాగెను. కడకు భీమునితోడి గదాయుద్ధమున దినశేషముపోరి తన యవినయ ఫలముగా నధర్మబలముగాఁ దొడలు విఱిగి నేలఁ గూలెను. ఇంతకుముందే కురు కుమారశతము నిర్మూలించి, దుశ్శాసను ఱొమ్ముచీల్చి, యిప్పుడు దుర్యోధను తొడలు విఱచి భీమ సేనుఁడు తీర్ణప్రతిజ్ఞుఁడయ్యెను. నకులుఁడు కర్ణుకొడుకులను, సహదేవుఁడు శకున్యులూకులను బ్రమందించి తమవంతు చెల్లించియుండిరి. ఇట్లు పాండవులు గెల్చిరి గాని యుద్ధము ముగియలేదు.

సౌప్తిక యుద్ధము - అప్రతిద్వంద్వము

ఆ రేయి దుర్యోధన ప్రేరితుఁడై యశ్వత్థామ కృపకృతవర్మలిద్దఱు సైనికులుగా సేనాధిపత్యమునొంది యులూకచర్యా దర్శనముచే శత్రువధోపాయ మూహించి, యీశ్వరదత్తఖడ్గముతోఁ బాండవ శిబిరము ప్రవేశించి, నిద్రాముద్రితులైన ధృష్టద్యుమ్నాది ద్రౌపదీసోదరులను, ద్రౌపది పుత్రులైన యుపపాండవులను, జతురంగ బలములతోడి తక్కినరాజులనుఁ బశువులట్ల నఱికెను. పాండవులు దూరమున నుండుటచే నీ యకాలమృత్యువునకు గుఱికాక తక్కిరి. వేకువయగుటకు ముందే యశ్వత్థామ తాఁజేసిన ఘనకార్యమును మరణావస్థలోనున్న దుర్యోధను చెవివేసి పాండవ భీతుఁడై పలాయితుఁడై ద్వైపాయనాశ్రమమునఁ దపసియై కూర్చుండెను.

సోదరుల - కుమారుల మరణముతో మండిపడిన ద్రౌపది ప్రేరింపంగా రథారూఢులై భీమ నకులులును వారివెంట ధర్మజ కృష్ణార్జునులును బోయి యశ్వత్థామను గనుఁగొనిరి.

భీముని తిరస్కార భాషణముచేఁ గుపితుఁడై యశ్వత్థామ యపాండవ మగు నట్లుగా నొక యిషీకమున బ్రహ్మశిరోస్త్ర మభిమంత్రించి విడిచెను. కృష్ణుని యుప దేశమున నర్జునుఁడా బ్రహ్మశిరోస్త్రమునే ప్రత్యస్త్రముగాఁ బ్రయోగించెను. అగ్ని జ్వాలాభీలములై లోకోపద్రవము సేయుచున్న య య్యస్త్రముల నుపసంహరింపుఁ డని వ్యాసనారదు లయ్యిరువురఁ గోరిరి. నియమవంతుఁడు, గురుభక్తుఁడైన. యర్జునుఁ డుపసంహరించెను. అశ్వత్థామ యుపసంహరింపలేక పోయెను. వ్యాసుఁ డు పాండవుల కభయమిచ్చి పరాభూతుఁడైన ద్రౌణిచేఁ బరిహారముగా నతని శిరోరత్నము పాండవుల కిప్పించెను. మాత్సర్యావిష్టుఁడైన యశ్వత్థామ బ్రహ్మశిరోస్త్రమును బాండవేయపత్నీ గర్భములు దహించునట్లు ప్రజ్వలింపఁ జేసెను. శ్రీకృష్ణుఁడీ యకార్యము సహింపక "యుత్తరాగర్భము నేన రక్షింతు" నని ప్రతిజ్ఞచేసి, "బాలఘాతివగు నీకు నశనంబు దుర్లభంబై, సహాయరహితుండవై, దుర్గంధ రక్తంబున నంగంబు దిగ్ధం బగుచుండ మూఁడు వేలేండ్లు దిరుగుచుండు" మని శాపం బిచ్చె వేదవ్యాసుండును "బాహ్మణుఁడవయ్యు నిట్లు క్రూరతకు రోయ కస్మదీయ వాక్యంబుల నాదరంబుసేయ కీపాపకర్మంబు సేసినాఁడ, వచ్యుతుఁడు వల్కినట్టుల యగుము నీవు" అని తథాస్తువచనము పల్కెను. అశ్వత్థామ పాండవులకు శిరోమణి నిచ్చి వ్యాసునకుఁ బ్రతిశాపంబిచ్చి తపోవనంబునకు వెడలి పోయెనఁట. సౌప్తికపర్వముతో యుద్ధము ముగిసినది కాని, పాండవుల యాపద్దశ యింకను ముగియలేదు.

అంతర్గూఢ యుద్ధము - అనస్త్ర శస్త్రము

సుతశత హిత బంధు మరణ శోకవిహ్వలులైన గాంధారీ ధృతరాష్ట్రుల కృప విదుర వ్యాసాదుల యుపదేశములచే నూఱడిల్లి యుద్ధభూమిఁ జూచుటకై పరిజనంబులతోఁ బయలు వెడలిరి, ఈ వార్త విని ధర్మరాజు వారిని దర్శించుటకై తమ్ములతో ద్రౌపదితోఁ గృష్ణ సాత్యకులతోఁ బోయెను. వారలఁ జూచి కౌరవ స్త్రీలు "తండ్రుల మామలఁ దాతలఁ గొడుకులఁ దోడఁబుట్టువుల............గురుజనం బులఁ"గూల్చిరి. వీరియెడ ధర్మమేది? దయయేది యని పాండవులను "ఇందఱఁ జంపితి మని యుబ్బుందీఱద, ద్రుపద తనయ పట్టుల నభిమన్యుం దెగటార్చితి. మఱఁదుల నందఱ మ్రింగితి, విభూతియన నీ కెద్దీ" యని ద్రౌపదినిఁ - జేతులు సాఁచి సాఁ

చి మూతులు నొదచిన ట్లెలుగెత్తి యేడ్చిరి. వా రేమియు బదులాడక మోములవాంచి ముందు కరిగిరి. ధర్మరాజు నమస్కరించుచున్నా(డని చెప్ప(గా, న య్యంధనృపతి చేతులనెత్తి(గౌ(గిలించి, 'భీము(డను మాట వినిన యతిభీమమైన యలుక(బొంది యధర్మవిధికి నాయితంబయ్యె. ఇది యెఱింగి త్రికాలవేదియైన కృష్ణుం డయోమయంబుగా(జేయించిన భీమ ప్రతిరూపం బాతని యెదుర నిలిపె. "కోపం బుత్కటమై యా రూపం నిరుగేల(బట్టి రూఢత ఘోరాటోపం బెసక మెస(గ నా భూపతి వెస(గౌ(గిలించి పొలుపర విఱిచి" లోపల నిర్భర హర్షంబు నొందియు, మెఱమెచ్చునకై హాహాకారంబు లెసంగ రోదనంబు సేసె. అప్పుడు చిఱునవ్వుతో(బద్మనాభుండు జరిగిన దంతయు నెఱింగించి, రోషశోకంబులు విడిచి శాంతుండవై యుండు మని హితము సెప్పె.

ధృతరాష్ట్రుండు తన యవినీతికి(బశ్చాత్తాపంబునొంది పాండవుల(గౌ(గిలించుకొని దీవించి "మీరు గాంధారిం గనుండని పంచిన, నప్పాండవేయులు పద్మనాభ పురస్సరంబుగా(జని వినయంబున వినతులైన, నద్దేవి దీవింప నొల్లక, యుల్లంబు తాపంబు నొంద శాపంబు నిచ్చునదై యజాతశత్రు నుద్దేశించిన - నత్తెఱంగు సాత్యవతేయుం డెఱింగి తక్షణంబ సన్నిహితుండై ... య క్కోడలిం జేరి "యోహో శపింపకు. శమింపు మని, పూర్వవృత్తం బంతయు నుగ్గడించి 'ధర్మంబు పరిగ్రహించి నీ కొడుకులగు పాండవుల దెస రోషంబు నిగ్రహింపు' మని యుపదేశించె, గాంధారియు "పాండవులు కుంతి కెట్లట్ల నాకును భరింప(దగిన వారలు. కౌరవుల తమ దుష్కృతంబులం ద్రుంగి రిది యే నెఱుంగుదు నైన(గురురాజుం దమ్ముని నట్లుసంపి శిరంబు గాలం దన్నుట-ఱొమ్ముచీల్చి నెత్తురు ద్రావుట విన్న (దల్లియుల్లంబు తల్లడిల్లకున్నె; యలుక పుట్టకున్నె" యన(గటకటం బడియె. భీము(డు కంపితాంగకముల వినతుండై "తలపోసి చూడంగ ధర్మమయ్యె, నధర్మమయ్యె(, జేయవలసివచ్చె నే నట్లు సేసితి" నని కౌరవుల దుర్నయమును బాంచాలీ పరాభవమును దన ప్రతిజ్ఞను సంధిగోరునప్పటి తమ హృదయమును విప్పి చెప్పి "ఏమిభంగినైనన్ బగ దీర్పవలసి వచ్చె(గాక..... అనుజు రక్తమాన నే నంత వెట్టినే! యంతపాపకర్ము(డనె! తల్లీ! యంత నిష్కరుణమతినె!" యని దోయిలిపట్టె. అతనియెడ మనసు మెత్తనై యామె "యంధులకు నూ(తకోలగా నకట యొకనినైన నిలుపక. నూర్వుర నదయవృత్తి ద్రింగితం దెవ్వా(డేనియు మీకు నెగ్గు లాచరింపనివా(డు లే(డయ్యెనయ్య ? --" ఒక్కరుని నీవు సంపక తక్కిన, నంతటనె ప్రతినదప్పునె? విభవం బెక్క(గ మీ యన్న నతం డెక్కటి రాజ్యంబు సేయనీ(డె కుమారా! యని పలికి, ధర్మనందనుదెస మనసు

నిగుడం బుత్రపౌత్రవధ సంపీడిత స్వాంతయగు నగ్గాంధారి క్రోధపరుషాక్షరంబుల "నమ్మహారాజెచ్చట నున్నావాఁ" డనిన, నా భూపతి భయకంపితగాత్రుండై, చేతులు మొగిచి, "యేను బాండవాగ్రజుండ" ననుచుం జేరంబోయి, "నీ పుత్రులఁ జంపిన పాపాత్ముని(గ్రూరచిత్తుఁ బరివాదార్హున్ శాపంబునఁ బొలియింపుము. భూపాలక వల్లభాభిపూజిత చరణా!" అని యంజలి పుటంబు ఫాలంబున మోపి యానతుండయ్యె. అప్పుడు మాఱుమాటాడ నాలుకాడక యద్దేవి దీర్ఘోష్ణముగా నూర్పునిగుడ్చి యూరకుండె. నైనను పట్టావృత నయనయగు నప్పతివ్రత దృష్టి పట్టంబునంచు సందునన్ జని యజ్ఞపతి పదనఖంబులం జెందిన, నవి గందినన్ జూచి సవ్యసాచి జనార్దను వెనకకుం జనియె. సమీరనందనుఁడును మాద్రీసుతులుం దిరుగుడు వడి, రప్పుడు గాంధార రాజనందన క్రోధంబు ధర్మపుత్రాదుల దెస మాతృభావం బలవడ సాంత్వన స్వరంబునన్ "కుంతీ సందర్శనంబు సేయ రన్నా" యని పలికినది. ఆహా!నియమ నిగ్రహంబులతో నాత్మ వర్చస్సు చక్షుర్ద్వారమున దుర్వ్యయము చేయని యాతపోమహత్త్వ మా పతివ్రతా ప్రభావమెంత గొప్పది. అపకారులనైన ననుగ్రహించు నా సహనశీల మా సత్యదృష్టి యెంతదొడ్డది! నేఁటి భారతనారీ మణుల కిట్టి యాశయములయిన నవగతములు కావలయుఁగదా!

ఉపశాంతి

మాతృదర్శన భాగ్య మిన్నాళ్ళ కిట్లు గలుగుచున్నదిగదా యను తలంపులఁ గన్నుల నీరుదొరుఁగ జరణంబులు దొట్రిల్లం జని పాండుపుత్రులు కుంతీచరణం బులపై వ్రాల, నామె" యందఱపైఁ జేతులిడుచుఁ బెలుచ నేడ్చి, వారల నెత్తి వేఱు వేఱమేనుల నివురుచు, వివిధ దారుణాస్త్రశస్త్రవ్రణ ప్రచయములు గాంచి యచ్ఛోటులంటి చూచుచు వెచ్చని యూర్పులు నిగుడ్చు. వేఁగుచుఁ బొగులున్, గ్రుచ్చి ·కవుంగిటఁజేర్చుచు. వచ్చితిరే నృపకుమారవరులారా" యని గుండెలు విప్పినది. మాతృవాత్సల్య మాధుర్యము లిట్లు వెల్లివిరియుచుండఁగా, ద్రౌపది కుమారులఁ దలంచి యడలుచు నత్తగారి యడుగుల మ్రోల నేల వ్రాలినది. ఆమెయునయ్యుగ్మలి మీఁద నొఱగి తానును బెద్దయెలుంగున నేడ్చి గుచ్చియెత్తి యక్కునన్ జేర్చి యూరార్చి, యత్తన్వియున్ దనయులున్ దోడన చనుదేర గాంధారి కడకున్ జనినది.

అప్పుడు ద్రౌపది యా గాంధారి పాదములకు మ్రొక్కి యడలున వెక్కు చున్న నద్దీన యమ్ముద్దియ నుద్దేశించి-- "పుత్రి! యిట్లగునమ్మ! నీవు కుందుచు నున్న, నీవలెఁ గొడుకులఁ బోఁగొట్టుకొని నీ భర్తలను' మనమలం బోఁగొట్టుకొని మీ

యత్తయు నేమయ్యెదరో చూడు! నిన్ను నేని ట్లూఱార్చెద, నను నీ వూరార్పవలదె! నా నీ తెఱఁగుల్ వినుమొక్క రూపమున, కేమనఁగలదు. విధాత క్రూరుఁ డయి పఱపంగన్" "ఉపశమింపు" మని యూఱార్చినది. పాండవులీనాఁటి కిట్లు మరలం దల్లియెడిఁజేరి మధురానుభూతు లందుట పుణ్యవిశేషము. వేయి గదాప్రహారముల కంటె బెట్టిదమైన ధృతరాష్ట్రుని బాహుబంధమునుండి దీర్ఘాయుష్కులై బయటఁ బడుట దైవానుగ్రహము. వేయి బ్రహ్మాస్త్రములకంటె దీవ్రమైన గాంధారీ శాపాక్షరంబులకుఁ దప్పి పునర్జన్మ మందిన ట్లుండుట వారి గురువృద్ధ సేవాపూర్వక నైతిక ప్రవృత్తిఫలము, కానిచో, శస్త్రాస్త్ర ప్రయోగ భయంకరమైన యా మహా యుద్ధముకంటె మిన్నగా నీ సన్నివేశ మొక్కటే క్షణకాలములో సర్వనాశనముఁ జేసియుండెడిది. ఇదియే ధర్మవిజయము.

పరిశిష్టము

ఇంకొక్క సన్నివేశముతో నీ స్త్రీపర్వము ముగియును. గాంధారియుఁ గుంతియుఁ గౌరవుల రాణివాసముతో బంధు సుహృదాప్త రాజన్య రమణీమణులతోఁ బొలికలనుఁ జేరంబోయి బీభత్సావహంబయిన యచ్చోట విగతజీవులై వికృతాకారులై పడియున్న బంధుజనుల వీరయోధుల నందఱఁ గలయంజూచిరి. ఇంతలోఁ బాండవులు కృష్ణసాత్యకులతో నందుఁజేరిరి. విహత బంధువులయిన స్త్రీ జనంబులు తమతమ పతుల సుతుల నన్నలఁ దమ్ములఁబేరుపేర వేర్వేఱఁబిలిచి పిలిచి తడవి తడవి వారివారి గుణగణంబు లుగ్గడించి శిథిల తనులఁ గౌఁగిలించి పనవి పనవి యేడ్చుచుండిరి. అంతయుఁ జూచి పరమశోకార్తయైగాంధారి జనార్దనుఁ జేరంబిలిచి యుద్ధరంగముఁ జూపి యందలి భయంకర దృశ్యములఁ, బడియున్న యోధాను యోధుల, వారివారి దీనదుస్థితుల, నవ్వానిఁదలపోసి వాపోవుచున్న వధూజనంబుల వేఱు వేఱుగ నభివర్ణించి, 'ఇదియంతయు నీచేత సాధితంబైన కార్యం' బని పలికి, మనస్సులోఁ గుములు పుత్రశోకం బలఁతిగాని యలంతఁ బెట్టఁ బద్మనాభుని దెసఁ జూచి కోపోద్దీపితయై, "కౌరవులుఁ బాండవులు నీసునఁ దలపడ నడ్డపడవైతివి; సమర్థుఁడ వయ్యు నుపేక్ష చేసితివి. కురురాజుఁ జెరుపన తివిరితివి. అందఱఁ జంపితివి. అంతయు నాశముఁ జేసితివి. ఈ పాపఫల మనుభవింపక తీఱునే. నిన్ను శాపానలజ్వాల దగ్ధమూర్తిన్ జేయుచున్నాను-నా పాతివ్రత్య తపోబలముఁ జూడుము. నీ దాయదు లంద ఱిట్లే యొకరినొకరు పొడుచుగొని చత్తురుగాక! నేఁటికి ముప్పది యాఱేండ్లనాఁటి కిట్లే నీవు దిక్కులేని కుచ్ఛితపుఁ జావునఁ జత్తువుగాక; మీ వధూజనము లిట్లే యేడ్తురుగాక" యని శపించినది.

విపులాశయుండగు కృష్ణుఁడు చిఱునవ్వుతో "మున్నకాదె యాదవులకు మునివరేణ్య కలిత దారుణశాపంబు గలదు. నీకు నేల చర్వితచర్వణ మిట్లు సేయ, దీన నీ వేమి తప్పితి దానిఁజెపుము" "యదువంశజాతులకుఁదప్పదు నాశము, వారి సురలుఁ బరిమార్పఁగలే, రదికారణంబుగాఁగఁ దెగుదు రొండొరుచేత రణము ఘోరత్వమునన్" అని పలుకుచు, "లేవమ్మా! మృతులైన సకల బంధుమిత్రులకు నగ్ని కార్యంబులు సేయింపవలయు.......... --మీ యపరాధంబున వచ్చునట్టి కీడునకు నింత నొవ్వంగ ననుఁబల్కఁదగునె! యుమ్మలికంబు ధృతిఁబట్టి మాన్పుమింక" నని పలికిన విని నిరుత్తరయై గాంధారి యూరకుండె నఁట. అంత ధౌమ్యానుమతంబున విదురు యుయుత్సు సంజయాదుల తోడ్పాటున మృతుల కందఱి కగ్ని సంస్కారములు పితృమేధక్రియలు నడిపి, యందఱును గంగాస్నాన మాచరించి తిలోదక ప్రదానము నిర్వర్తించి, రఁట నప్పుడు కుంతి కన్నీరుపెట్టుచుఁ గర్ణుని చరితం బుగ్గడించి యుధిష్ఠిరునితో "మీకు నగ్రజుండు, నాకు భాస్కరుదయలలిత కవచకుండలములతోడఁ బుట్టినాఁడు. కాన పోయంగవలయుఁ దిలోదకంబుల మ్మహోన్నతునకు" నని వినిపింపఁగాఁ బాండవులు పరమ దుఃఖావేశంబు నంది, రందు ధర్మనందనుండు కర్ణుని ప్రాభవంబు గొని యాడుచు. "అట్టి కర్ణునిఁగొంగున నగ్నిదాఁచినట్టు నెమ్మెయి దాఁచితో యమ్మ!" అని యుమ్మలించుచు, "అతఁడు మాకు నన్నయని మున్న యెఱుంగంగ గన్నం గురుకులంబు గలఁగఁబడక మనుదు, మట్టులైన మనుజలోకమునకుఁ గలుగ దడలు, మాకుఁ గలుగ దడలు" అని విలాపంబు సేసి, యతనికై యనేక విధ పుణ్యకర్మంబులు, భూరి దక్షిణంబులుగా ననుష్ఠించి కృతకృత్యతానందంబు నొందె

పరామర్శము

గంగాస్నానముతో నుదకప్రదానముతో నందఱి హృదయములు శాంతించినవి. పాండవులకు విగతారివర్గముగా నాత్మరాజ్యంబు దక్కినది. భారత సమరగాథ యిట్లు ముగిసినది. దీనితో మానవ జీవితగాథయు రాగద్వేషాదుల పొంగులతో హృదయ బంధముల రాపిళ్ళతో ధర్మాధర్మములు సమన్వయించుకొని "స్మశానాంతాని వైరాణి" యన్నట్లు ముగిసినది. యుద్ధమున గెలిచినవారికి రాజ్యము దక్కుట సరియే-చచ్చిన వారికో! "సమరమున నెత్తెఱంగున సమసిననుం గీడు తెరువు చన, రుత్తమలోకము నకు పోదురు జనము" లని ధర్మరాజే పలికినాఁడు. కాని, యుద్ధమున సాయపడిన యశ్వత్థామ 'రెండికిం జెడిన రేవణ'యై శోచనీయ స్థితి నందినాఁడు. ఇట్లే సాయము చేయవచ్చిన శ్రీకృష్ణునకుఁ గూడ ఘోరశాపము

తప్పినది కాదు; గాని తన దైవ భావముతో దానినాయన సమర్థించుకొన్నాఁడు. అశ్వత్థామ యట్లుగాక శాంతుండుగాని విప్రుండు సెడు...భాగ్యహీనతవలన రాజోచిత ధర్మం బనుష్ఠించితి'' ననియెఱిఁగినవాఁ డయ్యు మ జ్జనక హనన సంతుష్టుండగు ధృష్టద్యుమ్నుండు లోనైన యప్పాపాత్ములఁ బాపంబు తెరువున రూపుమా పెద, దీనంజేసి కీటజన్మంబు వాటిల్లినను మేల కాని యా కడంక మాననేర'' నని సివమెత్తి దుస్సాహసముఁ జేయుటతో నీ దుస్థితి వచ్చినదని ప్రజలకుఁ బారము సెప్పుచున్నాఁడు. ఇట్లే భారతగాథఁ బరామర్శించి. 'కుంతీ ద్రౌపదీ గాంధారీ రూపక శక్తిత్రయ విజృంభణమే భారత సృష్టి స్థితి లయములకుఁ గారణ' మని ప్రకృతముగాఁ బ్రాకృతికముగాఁ బరమార్థముగా సమన్వయించి తత్త్వజ్ఞులు భావించుచున్నారు.

ఒక వంశమునఁ బుట్టిన పాండవ కౌరవుల సంగర మొక శరీరమున జరుగు సదసద్వృత్తుల - దైవమానుషముల-సురాసుర ప్రకృతుల సంఘర్షణము. అసత్పక్షమునుండి యరిషడ్వర్గమైన కామక్రోధాదులవలె భీష్మద్రోణాదులార్వురు వరుసగాఁ బ్రముఖనాయకులై యుద్ధముచేసిరి, సత్పక్షమునుండి శిఖండి భీష్ముని గెలిచెను, ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునిఁ జంపెను. పార్థుఁడు కర్ణుని, ధర్మరాజు శల్యుని భీముఁడు దుర్యోధనుని వధించిరి. ఈ సందర్భమున శిఖండి మొదలగు వారా చరిత్రను బట్టి తాదృశప్రవృత్తులే కామాదుల జయింపఁ గలుగుదురనుట వివేచనా సంగత మగు చున్నది. శరీరపాతానంతరమునఁగూడ మాత్సర్యము విడువక వెంటఁబడునని దుర్యోధన ప్రేరితుఁడైన యశ్వత్థామ చరిత్ర సూచించుచున్నది. "తపమును బ్రహ్మచర్యమును దానము సత్యము గల్గువారు" గురుభక్తియు వ్రతయుక్తియుఁ' గలవారు మాత్రమే మాత్సర్య విజృంభణము నరికట్టి పరాభవింపఁజాలుదు రని, బ్రహ్మశిరోస్త్రముపైఁ ద దస్త్రమునే ప్రయోగించి యశ్వత్థామను బరాభూతునిఁ జేసిన యర్జును చరిత్ర వెల్లడించుచున్నది. మాత్సర్యము పరాభూతమయ్యును బరాఙ్ముఖముగాక జన్మాంతర సాధనాంతరము లందియైనఁ బగఁదీర్ప సాహసించుననియుఁ, జివరకుఁ దిరస్కరింపఁబడి దిక్కులేనిదయ్యును శేషించియుండుననియు నశ్వత్థామ చరమజీవితముతోఁబాటు గాంధారీ ధృతరాష్ట్రుల చర్యలు తెలియఁ బఱచుచున్నవి. ఇట్లు భారత యుద్ధ మంతరంగ యుద్ధమని యధ్యాత్మవిదులు భావింతురు. ఈ యుద్ధమున నింకొక్క విశేషము గలదు. పది దినములు యుద్ధము చేసినను నిర్లిప్తుఁడై కడకు విసిగి యస్త్రసన్యాసము చేసిక్షత్రధర్మముతోఁబాటుగ నాత్మధర్మమును గాపాడుకొని స్వేచ్ఛామరణము పొందిన దేవవ్రతుఁడును, బదునెన్మిది దినములు యుద్ధము చేసియు, ద్రోణాశ్వత్థామలవలెఁ దాను బ్రాహ్మణుఁడు ధనురాచార్యుఁడయ్యును, ద్రోణునివలెఁ

జంపఁబడక యశ్వత్థామవలెఁ బరాభూతుఁడుగాక 'యదహ్నాత్కురుతే పాపం తదహ్నా ప్రతిముచ్యతే' యన్నట్లు ఏపూట యుద్ధము విధినిర్వహణముగా నాపూట నెరవేర్చి నిర్లిప్తుఁడై, కడకు బ్రహ్మవర్చసముతోఁ బాటు పరీక్షిత్తులకు భవిష్యదాచార్యకత్వము గూడ నిలుపుకొన్న మహామహుఁడు చిరకాలజీవి కృపాచార్యుఁడును భారత ధర్మమూర్తులుగా విలసిల్లుచున్నారు. యుద్ధరంగము వెంట భీష్మని చరిత్రను - చివరి వఱకు బరిశీలించినచో నా మహామహుల ధర్మనైష్ఠికజ్యోతి మనకు వెలుఁగు బాటలు చూపఁగలదు.

భారత సంగ్రామమునఁ బ్రవృత్తులైన మహాయోధుల నొక్కొక్కరిని నిట్లే పరిశీలించినచోఁ బెక్కు విశేషములు గ్రహింపవచ్చును. యుద్ధషట్కముఁ జదువుచు, నందలి పాత్రల గుణశీలవృత్తములు భావించు నప్పు డిందఱు మహామహులుఁ బెద్ద లుండియు, నీ యుద్ధ మనివార్యమగుటకు మూలకారణ మెవ్వరను విచికిత్స గలుగక మానదు. తండ్రిపాలు రాఁబట్టుకొనఁగోరిన పాండవులే కారణ మనువారును. దిరస్కరించిన కౌరవులే కారణ మనువారును. నుభయపక్షములు గూడఁ గారణ మనువారును గలరు. కాని. నిజమును లోకదృష్టితో, బరిశీలించిన ధృతరాష్ట్రుఁ డును, దైవదృష్టితోఁ జూచిన శ్రీకృష్ణుఁడును ముఖ్యకారణము లని తోఁచును. రాజ్యభాగము పరిష్కరించుటకుఁగాని, పాండవ కౌరవుల తప్పొప్పులు తడవి దండించుటకుఁ గాని యన్ని విధముల నధికారము బాధ్యతయుఁ గలవాఁడు ధృత రాష్ట్రుఁడు. ప్రభువుకూడ నతఁడే హృదయపూర్వకమైన యతని తీర్పును గాదనువాఁ డెవ్వఁడును లేఁడు. నెఱవేర్చుటకు సమర్థులై వారున్నారు. కౌరవుల దుర్నయము లన్నియు నతనికిఁ దెలిసియే జరిగినవియో, జరిగినమీఁదఁ దెలిసినవైనఁ గావలయును. జరుగకుండఁ జేయుటకుఁగాని జరిగినమీఁద నేదోయొక్క పరిహారము చేయుటకుఁ గాని యతఁడు చేసిన ప్రయత్న మేదియు నున్న ట్లగుపడదు. అతని లోభముచేతనో దుస్సంకల్పముచేతనో కడకుపేక్షచేతనైన యుద్ధ మత్యావశ్యకమై కురుక్షేత్రమున మోహరించినది. సంజయునిచేఁ జెప్పిపంపునప్పుడును. శ్రీకృష్ణుఁడు రాయబారము వచ్చినపుడును ధృతరాష్ట్రుడు మాటల విందుచేసెనేగాని మనసు విచ్చి కార్యము పొందుచేయలేకపోయెను. యుద్ధమే జరిగినచో భీష్మ ద్రోణాదుల సాయమున జయము తప్పక తమదే యని మనసున గట్టిగానమ్మి, తాను పైకి మంచివాఁడుగా నటించి తప్పంతయుఁ, దనయుల దలపైఁ బడద్రోసిన ట్లగుపడును. ఈ క్రింది యంశముల గమనింపుఁడు.

యుద్ధారంభమున వేదవ్యాసుఁడు ధృతరాష్ట్రుని కడకువచ్చి "కులక్షయంబును

నానా నరేంద్రనాశనంబును నగు నుపేక్షింపందగదు. దుర్యోధనాదుల వారించి నీ తమ్మునిపాలతని కొడుకుల కొసంగి శాంతి సేయుటమేలు" ఇత్యాదిగ బోధింపఁగా, ధృతరాష్ట్రుడు "హితమును ధర్మముం దలఁచి యిమ్మెయిఁ జెప్పితి. రిట్లు మున్ను నా సుతుల నయంబుమైఁ దటిమిసూచితి. వారలఁ బంపు సేయనేఁ జతురుఁడఁ గాను, ప్రాభవము సాలదు. నాదెసఁ దప్పులేమి మీ మతిఁ దలపోసి యీ పలుకు మానుఁడు. పాకముఁదప్పెఁ గార్యముల్" అని బదులిచ్చినాఁడు. ఇవి యాతని పైపై మాటలు, దుర్యోధనుని మరణానంతర మా వార్త సంజయుఁడు సెప్పఁగా, ధృతరాష్ట్రుఁడు, దుఃఖపరవశుఁడై, యంతఃపుర స్త్రీలనెల్ల నవ్వలకుఁబంపి సంజయునితో నొంటరి పాటున "చావరు నొవ్వరు పాండవు లేవురు నని నీవు చెప్ప, నిప్పలుకులు దుఃఖావేశ కరములై చేతోవృత్తి దహింపఁజొచ్చె దుర్భరభంగిన్" అని పల్కెనఁట. పాండవులపై నాతని యంతఃకరణ మట్టిది. తరువాత మృతుఁడైన దుర్యోధను నుద్దేశించి "కుమారా! కయ్యంబు మాటపుట్టిన యప్పుడు నీవు నాతో" చాపాచార్యుఁడు భీష్ముడుం గృపుఁడు నశ్వత్థామయుం గల్గ...... "ఏనును గర్ణుఁడు దమ్ములు నా నలువురు వీరులైన నటుసూడు పృథాసూనుల నెట్లు జయించెదనో! నమ్ముము నా బలంబునున్ గలితనమున్" అని యూఱడిల్లఁ బలికిన విని భవదీయానివార్య విక్రమమునఁ బాండునరేంద్రసుతులు దెగుదురయని తలఁచితి; నీవె తెగితి య వ్వీరులచే" నని యేడ్చెనఁట; ఇదే యాతని మనసులోని గట్టి నమ్మకము, ఇదియొక్కొక సేనాపతి మరణముతోఁ గ్రమక్రమంబుగా సన్నగిల్ల చుండఁగా 'దేవవ్రతుండు దెగినయప్పుడ తక్కిన యంతపటును దెగియునుం కాఁ దలఁచెద' ననుటయు, ద్రోణాచార్య వధతోఁ 'దన కొడుకుల గెలుపు నెడ నాస మానుటంజేసి' సొమ్మసిల్లిపడుటయు, "అట్టి కర్ణుఁడీల్గెనట్టె; యిం కెక్కడి బ్రదుకు మనకు, నేటి భండనంబు" "పేదముదుకఁడు వేశ్యాజనముం గోరుట-దుర్యోధనుఁ డింక జయంబు గొనఁగఁ దలంచుట" యని వాపోవుటయు, "గాంగేయుఁ జంపి రాజ్యముసేయ సమ్మతించి తొడరిన పాండు పుత్రులకును దైవంబు తోడయ్యె.

ధర్మంబుఁ గీడుపఱచి పరఁగి యధర్మంబు పెరిగినట్లున్నది" అని నివ్వెఱఁ బొంది, "గురుఁడు పడినయపుడు కురుసైన్యములఁగలఁవారణాశ్వసుభట వర్గములును బడియెఁగాక! యేలపడకుండు-నా ధర్మపుత్రు భాగ్య మలఁతిఁ బోవునెట్లు!" అని యసూయఁజెంది, "పౌరుషమేటికి, దైవం బేరూపునఁజూడ ఫలద; మేమందము-దోస్సార, నితాంతోజ్వలుఁడగు నా రాధేయుండు సచ్చె నర్జునుచేతన్" అని దైవమును ధర్మమును వ్యతిరేకముగా భావించుటయు ధృతరాష్ట్రుని భావమును స్వభావమును నాత్మగోపనము బరవంచనమును విస్పష్టముగాఁ దెలుపుచున్నవి.

రోషశోకావేశము పొంగినపుడెల్ల "నాచే వచ్చెం గౌరవులకుఁజేటెమందున్" అని హృద్గతభావమును దనే వెల్లడించుటయు, సంజయుఁడు "కొడుకు లంతరాజ్యంబును గొనఁగశక్తులను దురాశను వారల యవినయములు నీవుపేక్షింతు, మానునే యావిరుద్ధకర్మమున ఫలమొందక కౌరవేంద్ర" యని యాతని దుర్వినీతినే లుమాఱొత్తిచెప్పుటయుఁ బై సంగతిని ధ్రువపఱచుచున్నవి. విదురుఁడును శ్రీకృష్ణుఁడును నీ యభిప్రాయము నింతకుముందే వ్యక్తపఱచియున్నారు. పాండవులు పరామర్శింప వచ్చినపుడు కౌఁగిటిలో నుక్కుభీము నుక్కడఁగించుటయు ధృతరాష్ట్రుని హృద్గతమునకు నిదర్శనము కాఁగలదు. పాండవులనుగూర్చిన తన ప్రయత్న మట్లు విఫలముకాఁగా, ధృతరాష్ట్రుఁడు పాండవులతో 'మీరు గాంధారిం గనుం' డని పంచుటలోఁ 'దన చేతఁగాని పనిని గాంధారిచే ముగియింపఁజేయుటకై యిట్లుచేసెనా' యని యనుమానించుటకును వీలు కలుగుచున్నది. ఈ విధముగా, భారతయుద్ధమునకు ధృతరాష్ట్రుఁడు కారణ మనువా రాతని లోభగుణమును బాండవద్వేషమును గపటవర్తనమును వివరించెదరు. అంధుఁడైపుత్రులపై మమత విడువలేక, యవినీతులగు నవ్వారినిఁదనమాట వెంట నడుపలేక, 'యెట్లయిన నట్లగుఁగాక' యని విధిలేక వారి మాటవెంటఁ దా నడిచెనని మనము సమాధానముఁ జెప్పికొందముగాక. అప్పుడుఁగూడ 'నట్టికొడుకులతండ్రి'గా నతనినిఁ 'బాప' మని యనవచ్చునుగాని 'అతఁడొకరాజుగా, నీ యుద్ధము ప్రజలకుఁగూడ బాధాకరమైనదిగా' భావించినపుడీ సమాధానము తృప్తికరము కాఁజాలదు. ఏమైనను, 'ఇట్టిగుణముల కిట్టి ఫలము' లను గుణపాఠమును ధృతరాష్ట్రుఁడు లోకమునకు సోదాహరణముగా నిచ్చినట్లయినది.

ఇఁక శ్రీకృష్ణుఁడే యుద్ధమునకు మూలకందమను విషయము యుద్ధషట్కమునందంతటను సూచింపఁబడియున్నది. అతిమానుషములైన పెక్కుకార్యము లీ యుద్ధరంగమున శ్రీకృష్ణునిచేతనే నిర్వహింపబడియున్నవి. భీష్మ ద్రోణ కర్ణ దుర్యోధనాదులందఱును శ్రీకృష్ణుఁడే కారణమను భావమునే వ్యక్తము చేసియున్నారు. గాంధారి 'నీవే యింతకుఁ గారణ' మని కృష్ణునితోనే పల్కినది. గురు బంధుమిత్రాది సంహారమునకు విముఖుఁడైన పార్థునిఁ బ్రోత్సహింపుచునే శ్రీకృష్ణుడు "నాచేతంజచ్చిన వీరినెల్లను జయించుటకు నిమిత్తమాత్రముగ" మ్మని తానే చెప్పియున్నాఁడు. విశ్వరూపముఁ జూపి రెండుమార్లు చక్రధరుఁడై తానే యుద్ధమునకు దూఁకినాఁడు. యుద్ధమంతయు ముగిసినమీఁద రథమునుండి ముందుగా నర్జునుని దింపి తర్వాత శ్రీకృష్ణుఁడు దిగుచో'న త్తేరు తత్‌క్షణము మండినపు 'డిదియే మని' పార్థుఁడడుగఁగా "గురుకర్ణుల యస్త్రాగ్నుల నెరసినయది మున్న, దీని నిటుఁ

గాకుండన్ భరపడి రక్షించితి సంగరము దెగినఁ దొలఁగి యిపుడు గాల విడిచితిన్" అని తన నిర్వాహకత్వమును వెల్లడించినాఁడు. ఈ విధముగా యుద్ధ నిర్వహణమంతయుఁ గృష్ణుని భుజస్కంధములపై నుండుట విస్పష్టము చేయఁబడినది. కాని, వ్యాసుఁ డీ సందర్భమున ధృతరాష్ట్రునితో "నీ వెఱుంగక యుండగా వచ్చెనే వైరబంధంబు కౌరవ పాండవులకు..........విదురుఁ డిట్టు లగుట యెఱిఁగి బుద్ధి తగఁజెప్పె నీకు జూదంబు సమయమునన, దాని వినవ" అని యంధ భూపతియే కారణమగుటను జెప్పి, దేవసభలో భూదేవి తనకు భూభార ముడువుమని-యడుగఁగా నారాయణుండు నవ్వుచు, "కురుక్షేత్రసంగ్రామంబున ధృతరాష్ట్రుని పెద్దకొడుకు నీ భారమంతయు నుడువు"నని చెప్పినట్లుగా జెప్పి దుర్యోధనుఁడు కారణమగుటను వివరించి, 'నియతిఁ దప్పింప నేరికి నేరనగునె' యని 'దైవచేష్టితము'గా సమన్వయించినాఁడు.

ఇట్లే, భారతయుద్ధమున ధర్మమెవ్వరి' దను చర్చయు విస్తారముగాఁ గలదు. పాండవులను గౌరవులును 'తమధర్మ' మని వ్యాఖ్యానించుటయుఁ, గొందఱు సమర్థించుటయుఁ బెక్కుచోట్లఁ జెప్పఁబడినది. ధర్మమను దాని నెవరికిఁ దోఁచినట్లు వారు తమకుఁ దమ కనుకూలముగా నన్వయించుకొనుటే దీనికిఁ గారణము. పాండవపక్షమువారు తమ యిడుములకుఁగారణముగా మొదటి నుండియుఁ గౌరవుల యధర్మప్రవృత్తినే చెప్పుచు, యుద్ధమునఁగూడ మొదటఁ గౌరవులే యధర్మముగా నడచిరని యభిమన్యువధాదుల నుదహరింతురు. కౌరవ పక్షమువా రన్నియుఁ దడవక ద్రోణవధాదులుగ్గడించి పాండవులదే యధర్మమందురు. కాని, కౌరవపక్షమునఁ బెద్దలయిన భీష్మద్రోణ విదుర సంజయాదులును, గడకు ధృతరాష్ట్రుఁడు గూడ "యుధిష్ఠిరుండు ధర్మదేవత కొడుకు. ధార్మికత్వసత్త్వాది గుణగరిష్ఠుం, డతని గెలువ దేవతలకు నశక్యం" బని యంగీకరింతురు. దుర్యోధనుఁడు మాత్రము "కపట ధర్మకంచుకంబున వెలసిరిగాని, సత్యపురుషకారపరులు గారు పాండుసుతులు" అని వారిని దూషించి "సమరము శమంతపంచక సమీపమున ధర్మవృత్తిఁ జలుపఁగ నత్యుత్తమ లోకము సమకూఱెను విమలాత్ముఁడ నైతి" నని తన్నుఁదానే భూషించుకొనును. భూషించుకొనుఁగాక, అతఁడిట్లు చరము దశలోఁ దన ధన్యతను జెప్పికొన్నప్పుడు పుష్పవర్షంబులు గురిసి దేవదుందుభులు మెఱయుటయు, దాని ననుసంధించి కౌంతేయులు 'దారు ధర్మంబు దొఱంగి గాంగేయాదుల వధించినట్లుగాఁ' దోఁచిన విన్ననై యుండుటయుఁ, గృష్ణుండు "మీరు వగవకుఁడు. వారి విధి యివ్విధమునఁ జావంగఁజేసె, సురలు దనుజులు గెల్చిన చొప్పు లిట్ల, సంతసపు సమయంబున వంతలేల" యని ప్రోత్సహింపవలసి

వచ్చుట మిక్కిలి యాశ్చర్యమును గలిగించుచున్నది. ధర్మస్వరూపము విస్తరించి చెప్పవలసినదైనను నీ సందర్భమున యుద్ధధర్మమును గూర్చి గీతోపదేశ మొక మార్గము చూపఁగలదు. "పురుషుఁడు సెడు ననువాఁడును, బురుషుఁడు సెఱచునని పలుకు పురుషుండును నయ్యిరువురు నవివేకుల" "సమరంబు రాజులకు నుత్తమధర్మం బది యపావృత స్వర్గద్వారము" "ఫలములయెడ బ్రహ్మార్పణకలన పరుండగుచుఁ గ్రామ్యకర్మము నడుపన్ వలయున్" "వైరమున నులిచి త్రెంపక, కారాకులు డుల్లినట్లు కర్మము లెల్లన్ దార పెడఁబాయవలయును" "క్రందుకొను సర్వధర్మవికల్పములను నెడల విడిచి దృఢంబుగ నే నొకండ శరణముగ నాశ్రయింపుము" -- ఈ యుపదేశము ననుసరించి శ్రీకృష్ణు నాశ్రయించియే యుధిష్ఠిరుఁడు ధర్మాధర్మము లేవియైనఁ గృష్ణానుమతంబునన చేసి కృతార్థుఁ డైనాఁడు. కనుకనే పాండవులది ధర్మయుద్ధమైనది.

ఫలశ్రుతి

యుద్ధషట్కమునఁ గేవల వీరవిహారమే గాక ధర్మసందేశముగా నీతినియమ సంప్రదాయములు సందర్భానుగుణముగఁ బెక్కులు వర్ణింపఁబడినవి. అవన్నియు నాంధ్రభారతమునఁ జదువనగును. మచ్చునకు రెండుమూఁడుదాహరణము అవి. రాజధర్మమిట్టిది. "వినికిగలిగి రక్షించుచు ననువున దయతోడి పాఁడి నాయతు లెల్లన్ గొనుచుఁ, దగ నేలి పొగడొందిన రాజున కుర్వి కామధేనువుగాదె" "క్రూరత కోర్చి యించుకయు తోయక పైకొని యెల్లభంగులన్ వైరులఁ జంపి భూప్రజకు వర్ధనమున్ గలిగించి పాడిమైఁ గోరరి గొంచు సద్వ్యయముగోరి యొనర్చుట రాజధర్మ విస్తారము" - మానవధర్మ మిట్లుండు. "ఒపి ధర్మార్థకామంబు లొకటి నొకటి నాశ మొందింపకుండంగ నడపవలయు ఁగాక ధర్మంబుసెడ నర్థకామములను గోరు పురుషుండు నిందకుఁ గుదురుగాఁదె" "కులనాశము చేసినఁ దత్కులధర్మము లడఁగు. నష్టకుల ధర్మలకున్ గలుగును దుస్సంకర మక్కులఘ్నులేగుదురు నరకకూపంబులకున్" --

ప్రకృతి ధర్మ మిది:- "తగఁ బర్జన్యుని సొంపునన్ బ్రతుకు భూతవ్రాతమున్ వార్ధిసొచ్చి గరిష్ఠస్థితినొందు నేఱులును సంక్షీణంబులై యుర్వి నిల్చి గుణాధిక్యముఁ బొందు బీజములు" - మానవుఁడు ప్రవర్తనములో గుర్తింపఁదగినవి:- "నెవ్వగఁగుందిన మానవుండు వైరులచేతన్ దెగుఁగాని తనదుకార్యముఁ దగ నొనరింపంగలేఁ" డఁట! "మతి కర్మము వెనుక జనక మానఁ" డఁట! "ప్రాణభయ మెట్టివానినైన గీడ్పఱుపకయుండ" దఁట! లోకారిష్టములు రాఁబోవునపుడు "నలువురు

నేవురు బిడ్డలు గలిగెద రొక్కొక్క వనితగర్భంబున, వారలు పుట్టినపుడె యాడుచుఁ గలకల నవ్వుచుఁజెలంగఁ గనియెద" మఁట.

సుభద్ర యభిమన్యునిఁగూర్చి విలపించి విలపించి తుద కిట్లు కోరుచున్నది! "అలఘుతపంబులన్ బ్రకట యాగములన్ మునిచోదిత వ్రతంబుల మహనీయ దానములఁ బుణ్యచరిత్రములన్ మహాత్ము లెంతలు రమణీయ విశ్రుత పదంబుల కేఁగుదురంతకంటె నుజ్జ్వలమగు సద్గతిం బడయు వాసవపౌత్ర పవిత్రవర్తనా!" పుత్రులఁగూర్చి భారతమాతల పరమాకాంక్ష యట్టిది. వారి సంప్రదాయ మిట్టిది, సైంధవునివధింతు నని యర్జునుఁడు చేసిన ప్రతిజ్ఞ విని య వ్వీటవారెల్లను 'ఇది యెట్లు నెఱవేరునో, నెఱవేరకున్న నర్జునున్న కెట్టి విపత్తు వచ్చునో, యని కళవళం పడుచు 'మనచేసిన సుకృతంబుల వినుత ఫలములెల్ల-నెల్లి విజ్వచ్చుఁడు సింధు నరేంద్రుఁ జంపునట్లుగా నొనర" వలయునని దృఢోక్తిఁ బలుకుచున్నారఁట! "అగ్రపుస్తకంబు లర్పించి చూచుచుఁ బరమనియతియై నుపశ్రుతులకుఁ బోవుచును శుభంబు లావహించుటఁగాంచి చెలంగి యొండొరులకుఁ జెప్పికొనుచు" నున్నారఁ ట! "గురునట్టివారు పదివేవురు గాఁచిన నెల్లి సైంధవునిఁ బగలిటిలోఁ బొరిగొనునట్లుగ నరునకు వరమిండీ వేల్పులారా!" యని ప్రార్థించుచున్నారఁట! తమకు నచ్చిన నాయకునిఁ గూర్చియు న్యాయమును గూర్చియుఁ బ్రజల యుత్సాహ మట్టిది, అభిమాన మట్టిది, త్యాగశీల మట్టిది. వారి సంప్రదాయము లట్టివి! ఉభయపక్ష యోధులును బగలెల్ల హోరాహోరిగఁ బోరు సలిపి వచ్చి "రెండు వీళ్ళజనంబులు రేలు వివిధ హృద్యసంగీతములను సాహిత్యమధుర లలితగోష్ఠి వినోదంబులను బ్రమోదభరితులై ప్రొద్దువుత్తు"రఁట యుద్ధమనఁగా విధినిర్వహణ మనువారి పవిత్రాశయమిది. నిత్యము లయిన వారి విహారక్రీడలు నభ్యాసములు నవి.

భారతయుద్ధమున దైవపౌరుషబలములు పలుచోట్లఁ బెక్కువిధములుగఁ జెప్పఁ బడినవి. అందులో నీ సుకుమార సమన్వయ మెంతరమణీయమో యనిపించును. "ప్రారంభములకెల్లఁ బౌరుషమ్మును దైవమును సాధనమ్ములు. వినుము-వానిలోన నొక్కటి చేతఁగానేర వనఘ! తత్ఫలసిద్ధి లెట్లన్న.....కాపు లావు వెరవు గల్గికర్మము సేయంగ దృష్టి దగినయట్లుగలుగ. ఫలముగలుగునట్లు పౌరుషంబునకు దైవంబు తోడుపాటు వలయు నెందు" - అప్పుడుఁగూడఁ దగు పని కుద్యోగింపవలె" నఁట! "తగ వెఱిఁగెదు హితుల కనుమతంబుగఁ" జేయవలెనఁ ట! అట్లయినచోఁ గార్యము నెఱవేరును. విధి సహాయత్వముగూడఁ గలుగును. అట్లు చేసినప్పటికిని, ధర్మము దప్పక నయగతిఁ గర్మాచరణంబు నడుపుట

ముఖ్యము. అందువలన ఫలసిద్ధియు నిర్మల కీర్తియుఁ గలుగును. ఒకవేళ నా ఫలములు తప్పినను, బేర్మి తొలఁగదు-- నిందగలుగదు. నీతిరహితముగఁ బట్టుపట్టి కార్యము నెఱవేర్చు కొన్నను, దానివల్ల నేదోయొక భయము నొక నిందయుఁ గలుగక పోదు. జనులు వానికీడునకు బొంచియుండఁబోరు. కార్యము నెఱవేరకపోవుటే సంభవించెనా - వాని కాపదలు తప్పనే తప్పవు, కనుక మంచిపనిగఁ జూచుకొని పెద్దలతో నాలోచించి ధర్మయుక్తముగాఁ బనిచేయవలెను. అప్పుడు దైవముగూడఁ దప్పక తోడుపడును. అన్యాయముగఁ బట్టుపట్టి పనిచేయరాదు. అందువలనఁ దప్పక కీడు కలుగును. ఇది భారతమున నీతి సమన్వయము. మఱియుఁ, బెక్కు విశేషములు ప్రజాహితముననను బనికివచ్చునవి భారతమునఁ గలవు. ఆ యన్నింటి ననల్ప కవితా శిల్పముతో నుజ్జ్వల సాహితీనందనము సృష్టించినాఁడు తిక్కన. దానిఁ జదివి రసాస్వాదనముఁ జేయుఁడని కోరుచు నీ ఫలశ్రుతితో నీ వ్యాసము ముగించుచున్నాను.

"అనలుఁడు భాస్కరుండును సుధాంశుఁడు నధ్వర సంప్రవర్తకుల్
వినుము నరేంద్ర యీ క్రతువు విష్ణుమయం, బిది నిర్వహించి ర
ర్జునుఁడును గర్ణుఁడున్ సమరరూపమునన్, దగ నీప్రబంధ మిం
పొనరఁ బఠించినన్ వినిన నొందు నరున్ జిరసౌఖ్య సంపదల్!"

" స్వస్తి ప్రజాభ్యః "

౬

శ్రీమదాంధ్ర మహాభారతము

శాంతిత్రయము

- శ్రీ కురుగంటి సీతారామయ్య

పూర్వరంగము

నేను మహాభారతము నామూలాగ్రముగఁ జదివి యెన్నియో సంవత్సరము లయ్యెను. ఈ మధ్య కారణాంతరములచేఁ బూర్వపర్వము లప్పుడప్పుడు చదువ వలసి వచ్చెను.

భారతము చతుర్వేదసారము. వేదము లేయే ధర్మముల నుపదేశించినవో యవి యన్నియు వ్యాసమహర్షి భారతమునుపదేశించెను. ఆ కారణముచేతనే దానికిఁ బంచమ వేదమని ప్రశస్తివచ్చెను.

"ప్రత్యక్షే ణానుమిత్యా వా యస్తూపాయో న విద్యతే
ఏతం విందంతి వేదేన తస్మా ద్వేదస్య వేదతా"

పంచమ వేదమయిన భారతమునందుఁ బ్రత్యక్షాది ప్రమాణములకు లభ్యము కాని ధర్మ ముపదేశింపఁబడినది.

"పారాశర్యుని కృతియయి
భారతమను పేరఁ బరఁగు పంచమవేదంబు" (1-17)
"ధరణి యెందాఁక నుండు సుస్థిరత నీదు
కీర్తి యందాఁక నక్షయస్ఫూర్తిఁ దాల్చి
నడవఁగలయది నీవు సెప్పెడి సువాక్య
ములును వేదతుల్యంబులై వెలయుచుండు" (శాంతి 2-148)


అట్టి మహాభారతమును గవిత్రయము తెనుఁగున నవతరింపఁజేసిరి. మాతృక సమస్త ధర్మములకును బ్రమాణమైనట్లే, యాంధ్రమహాభారతము కూడ ప్రమాణమయ్యెను. అంతియేగాక మహాకావ్యమై, యాంధ్రభాషకును, నాంధ్ర సాహిత్యమునకు బ్రమాణమయ్యెను.

ఈ గ్రంథమును దెనిఁగించునప్పుడు కవిత్రయమువారేయే నియమములను బాటించిరి? వారి కావ్యము ఫలవంత మయ్యెనా? యను ప్రశ్నలు వచ్చును. మొదట మహాభారతము యొక్క పరిమితిని స్పృశింతును. మహాభారతము శతసహస్రగ్రంథ పరిమిత మని సంప్రదాయ మనుశ్రుతముగా వచ్చుచున్నది. మహాభారత గద్యమున "శతసాహస్ర్యాం సంహితాయాం" అని యున్నది. ఒక లక్ష శ్లోకములు కలదని యర్థము. సామాన్యముగా మహాభారత మంతయు దాదాపు "అనుష్టుప్ఛందము" న నున్నది, కావునఁదప్పక లక్ష "యనుష్టుప్ "శ్లోకము లుండవలెను. ఇప్పుడు ప్రచారములో నున్నయే భారత గ్రంథమునందును నిన్ని శ్లోకములు కానరావు.

దాదాపు 50 సంవత్సరముల క్రిందట చెన్నపురిలో తెనుఁగక్షరములతో ముద్రింపబడిన భారత ప్రతిలో 84,770 శ్లోకము లున్నవి. ఆంధ్ర సాహిత్య పరిషత్తు వారికి లభించిన యొక భారత ప్రతిలో 99,057 శ్లోకము లున్నవి. నన్నయభట్టు ప్రకారము 1,00,078 శ్లోకము లుండవలెను. (ఆంధ్ర మహాభారత పీఠిక, మ. సూ. p. XII) (Criticism of Maha Bharata, V. Venkatramaiah) ఈ లక్ష సంఖ్యఖిలమని చెప్పఁబడు హరివంశములోఁ గలిసి యుండవచ్చునని పండితుల యభిప్రాయము. (ఆ. మ. భా. ఆది, 1-33) భవిష్యపర్వమును హరివంశములు కలిసి 18,100 శ్లోకములని చెప్పుదురు. (Ibid). ఈ సంఖ్య కలిసిన మొత్తము శ్లోక సంఖ్య లక్షకు మించును. హరివంశమును మాత్రమే కలిపిన లక్ష పూర్తికాదు. అర్జునమిశ్రుఁడను నొక భారత వ్యాఖ్యాత హరివంశమును భారతాంతర్గత మని యెంచి దానికిఁ గూడ వ్యాఖ్యానమును రచించి యుండెను. (M. B. Bhandarkar Epis P Lxll.) హరివంశము భారతములోని ఖిలభాగమను సంప్రదాయము వచ్చుచున్నది. ఔంద్ సంస్థానమున స్వాధ్యాయమండలి యను నొక సంస్థ భారత సంస్కృతికి మహోపకారము చేసినది. ఆ సంఘమువారు భాషా టీకతో నొక మహాభారతమును ప్రచురించినారు. ఈ ప్రతి యిటీవల ప్రచురితములైన భారత ప్రతులలో నెన్నఁదగినదై యున్నది. ఈ ప్రచురణమున మొత్తము శ్లోక సంఖ్య 84,095 గా నియ్యబడినది. ఈ విధముగా శ్లోక సంఖ్య సమానముగాను, నిర్దుష్టముగాను లేదు. భండార్కరు పరిశోధక సంఘము వారు ప్రచురించుచున్న భారత ముద్రణ మింకను బూర్తికాలేదు. అందుచే వాని సంఖ్య యిప్పుడు చెప్పుటకు వీలులేదు. మహాభారతమునకు బీజభూతమైన భాగమున దాదాపు 24,000 శ్లోకములు మాత్రమే యున్నవని వింటర్నిజ్ మొదలగు పాశ్చాత్య విమర్శకుల యభిప్రాయము. (History of Indian Literature, Dr. Winternetz Vol. I. P.

324 Maha Bharata V. V. Iyer). మొత్తమున భారతము కాలక్రమముగాఁ బెరుగుచున్నదనుట స్పష్టము. భారతాంతర్గతములని చెప్పఁబడు కొన్ని శ్లోకములును, భాగములును వివిధప్రతులలో వివిధములుగా నున్నవి. ఏనాఁడీ పెరుగుదల ప్రారంభమయ్యెనో చెప్పుటకు వీలులేదు. 4,5 శతాబ్దముల నాటికే పెరిగియుండవచ్చునని కొందఱు విమర్శకు లనుచున్నారు. (History of Indian Literature. Dr. Winternetz Vol. 1 P. 321 Mahabharata. V. V. Iyer, P. 99), భారతమునకు సమగ్రవ్యాఖ్య యొక్క నీలకంఠియనియే చెప్పవచ్చును. ఈ నీలకంఠుఁడు 17వ శతాబ్ది నున్నవాఁడు. ఆయన తన కాలమునకున్న ప్రతులను బరిశీలించి తన పాఠమును నిర్దేశించు కొంటినని తన వ్యాఖ్యానమునఁ దెల్పినాఁడు. కాఁబట్టి యప్పటికే వివిధ పాఠము లున్నట్లు స్పష్టమగుచున్నది. భారతము యొక్క వ్రాఁత ప్రతులను దిలకించిన, వెనుకకు వెడలినకొలఁది దాని పరిమితి తగ్గుచున్నట్లు తెలిసికొనగలము. మాతృకను బ్రచురించ వలెనని వివిధ ప్రతులను, బాఠములను భండార్కర్ పరిశోధనాలయము వారు విమర్శించి తమ యభిప్రాయములో నిర్దుష్టమని తలఁచు ప్రతినిఁ బ్రచురించుచున్నారు. ఆ ప్రచురించుటలోఁ గొన్ని ప్రతులకుఁ బ్రాధాన్యము నిచ్చినారు. జావా భారత పాఠమును, కాశ్మీర, నేపాళముల యందలి పాఠములను సాధ్యమైనంతవఱకుఁ జెక్కుచెదరకుండఁ బ్రక్షిప్తములు లేకుండ నున్నవని వీరభిప్రాయపడుచున్నారు. అందుచే వానికిఁ బ్రామాణ్యము నెక్కువగ నిచ్చుచున్నారు. వ్యాసుఁడు లక్షశ్లోకములనసలే రచించలేదనియు నీ సంప్రదాయము తదర్వాచీన కాలమునఁ బుట్టినదని కూడ విమర్శకు లందురు. కాని సాక్షాత్తుగ వ్యాస రచిత భాగములను మాత్రమే వేఱుచేయయత్నించుట పొసఁగదు. కాని భారతము ప్రచారమునకు వచ్చుటలో రెండు సాంప్రదాయములు మాత్రము స్పష్టముగాఁ గనఁబడుచున్నవి.

వీని నుత్తరదేశ, దక్షిణదేశ సంప్రదాయము లని వ్యవహరించుచున్నారు. ఈ రెండు పాఠ సంప్రదాయములకును జాలభేదము కలదు. (మ.భా. కవితా విమర్శనము, కో. రా. P. 176, 177). శ్లోక సంఖ్యలో నేమి, యుపాఖ్యానములలో నేమి యా భేదము కనఁబడును. ఒకదానిలో లేని యుపాఖ్యానములు రెండవ దానియందున్నవి. ఈ భేదమెప్పుడు వచ్చెనో చెప్పుటకు వలనుపడదు. ఇప్పుడుత్తర హిందూస్థానమున శారద, నేపాలీ, మైథిలి, బెంగాలీ, దేవనాగరి లిపులలో నున్న భారత పాఠములు దాదాపుగా సమానములై యుత్తర పాఠముయొక్క బిడ్డలనియుఁ దెలుఁగు, అఱవగ్రంథ మళయాళ లిపులలో నున్నవి దక్షిణ పాఠముయొక్క శిశువులనియుఁ జెప్పవచ్చును. బాగుగాఁ బరీక్షించిన డా॥ సూక్తంకర్ పండితుఁడు


వ్యాస భారతము
విడిపోని కాలమునాటి పాఠము
ఉత్తర పాఠము
దక్షిణ పాఠము
శారద
(కాశ్మీరము)
నేపాళ
మైథిలి
బెంగాలి
దేవనాగరి
తెనుఁగు
గ్రంథాక్షరము
మళయాళము

పాఠ విషయమున నీ క్రిందివిధముగా వంశవృక్షము నిచ్చినాఁడు. దానివలనఁ బైనఁ జెప్పిన సంగతులు సులభగ్రాహ్యములగును. వీని కన్నిటికిని వ్యాసభారతము బీజము. ఉత్తర, దక్షిణ పాఠములు విడిపోక పూర్వమే వ్యాసభారతమునందు మార్పు కలిగియుండునని యూహించుచున్నారు.

పరికించి చూడఁగా దక్షిణదేశ పాఠ ముత్తరదేశ పాఠముకంటె విపులముగాఁ గనఁబడును. (M. B. Bandarkar Prolegomina). ఈ పాఠ భేదములు శ్లోక వ్యతిక్రమణమునకు ముఖ్యకారణములనవచ్చును. వ్యాఖ్యాతలలో దేవబోధుని మొదలు నీలకంఠుని వఱకుఁ బరికించినను నీ శ్లోక సంఖ్యాసమస్య తేలునది కాదు. దాక్షిణాత్య పాఠమును బరిష్కరింపించి శ్రీవావిళ్ళ వేంకటేశ్వరశాస్త్రిగారు ప్రచురించినారు. ఈ సేవకు వారు వంద్యులు. భండార్కరు పరిశోధనాలయమువారు ప్రచురించుచున్న దింకను బూర్తికాలేదు. ప్రక్షిప్తములను ద్యజించి నిష్కృష్ట భారత పాఠమును బ్రచురించుచున్నందులకు వారభినందనీయులు. కాని యదియే వ్యాసభారత మని యెంత మాత్రమును జెప్పవీలులేదు. దానికి దగ్గఱగ నుండునది మాత్ర మనవచ్చును.

పర్వసంఖ్య పదునెనిమిది యని సుప్రసిద్ధము. కాని "పర్వశతం" అనునానుడి యొకటి కలదు. పరికించిన నీ శతసంఖ్య యవాంతర పర్వవిషయమని తేలును. లోపల సంభవపర్వ మనియు, నాస్తీకపర్వమనియు, రాజధర్మపర్వ మనియు, ననుగీతాపర్వమనియు మొదలగు నవాంతర పర్వనామములు కనఁబడును. డా॥ సూక్తంకరుగారి యభిప్రాయము కూడ నిదియే. "The Parava sangraha gives only the names of 100 Sub-parvams and the contents of the major 18 parvams. But from the date. We cannot say from what Adhyaya to what Adhyaya to particular Sub-parvam extends" (B.O.Q, I.M.B. Prolegomina P. XXXIII).

ఒక్క చమత్కారము. ఉత్తరదేశ పాఠమే యీ యవాంతర పర్వము లన్నిటినిఁ బేర్కొనుచున్నది. దాక్షిణాత్య పాఠము కొన్నింటిని విడచుచున్నది. ఇటీవలి కొన్ని ప్రచురణము లుత్తరాది పాఠము జూచి యవాంతర పర్వనామముల నిచ్చుచున్నట్లు కనఁబడును.

తెనుఁగు భాషాంతరీకరణము

కవిత్రయమువారు తెనిఁగించిన పాఠము దాక్షిణాత్య పాఠమునకు దగ్గఱగా నున్నదని చెప్పవచ్చును. ముగ్గురు కవులును భిన్నకాలములవారు కావున వారికి లభించిన ప్రతులు భిన్నము లనుటలో సందేహములేదు. (ఆం. మ. భా. కవితా విమర్శనము కో. రా. పేజి 182) పరికించి చూచిన నన్నయనాటికే పాఠభిన్నత యున్నట్లు స్పష్టము. జావా పాఠము 1000 సంవత్సరముల క్రిందటిదఁట (B. O. Q. I. M. B. Prolegomina P. XXV) భండార్కరు పరిశోధనా సమితి వారు తమ భారతపాఠమును బ్రచురించుటలో మిగిలిన గ్రంథములతోఁ బాటు నన్నయ భాషాంతరీకరణమును గూడ నుపయోగించినారు. భాషాంతరీకరణములలో నొక్క తెనుఁగు భాషాంతరీకరణమునకే ప్రాధాన్యము నిచ్చినారు. ఇది మనకొక గర్వకారణము. ఈ క్రింది వ్రాఁతలవలన వీరి యభిప్రాయము స్పష్టపడుచున్నది.

"The Telugu adaptation, Andhra Maha Bharatham is a metrical efatome of Maha Bharatha, commenced by Nannaya Bhatta, a court poet of Eastern Chalukya king, Vishnu Vardhana, who had his capital at Rajahmundry on the east coast of India, and who appeared to have ruled between 1022-1066 A.D. The tarso of the Telugu rendering left by Nannaya consisting of a version of the first two parvams and a part of the third was completed by many years later by two other poets Nannaya's version is valuable for the light it throws on the condition of the Southern recension." (Ibid P. XXVI)

"There are numerous Vernaculars abstracts of the Maha Bharath beside the Telugu abstract mentioned above, but most of them are of a later date Mere over they are all too free to be of numerous to us in reconstructing the next of Maha Bharatha' (Ibid P. XXVI), పంప భారతమందురు. కాని దాని పేరు విక్రమార్జున విజయము" అది వెనుకటి భారతముకంటె ననేక రెట్లు పరిమితియందు చిన్నది. నన్నయ యుపయోగించి యుండునుగాని తిక్కన యుపయోగింపలేదని నిశ్చయము.

పై యనువాదములనుండి రెండు సంగతులు విశదమగును. మొదటిది, యన్ని యనువాదములకంటె నన్నయ యనువాదము చాలవఱకుఁ బ్రాచీనమని,

మిగిలిన వానికంటె నన్నయ యనువాదము మూలమునకు దగ్గఱగా నున్నదని, ఒక్క నన్నయ యనువదించిన భారత భాగమునేగాక తిక్కనచే రచియింపఁబడిన భాగముతోఁ గూడ యావద్గ్రంథమును వారుపయోగించుచున్నారు. (Editorial notes to fascicules, 81, 21, & 22 M. B. B. O. R. I,) దేశభాషలోని భారతానువాదములలో నాంధ్రానువాద మగ్రగణ్య మని దీనివలనఁ దేటపడుచున్నది. ఇందులకు మనము గర్వపడవలెను. నన్నయకు దొరికిన పాఠమెట్టిదో తిక్కనకు దొరికిన దెట్టిదో మనము నిర్ణయింపఁజాలము. కాని, నా పరిశోధననుబట్టి యిప్పుడు ప్రచురింపఁబడిన ఔండ్ భారత ప్రతియు, వావిళ్ళవారి ప్రతియు దాదాపు సమానముగనే యున్నవి. వీని యందలి యధ్యాయ వివరములును దాదాపు సమానముగనే యున్నవి. తిక్కన భాషాంతరీకరణము కూడ యీ యధ్యాయానుపూర్వినే యనుసరించుచున్నది. కావునఁ దిక్కనకు దొరికిన భారతము కొన్ని యుత్తర పాఠములు, మఱికొన్ని దక్షిణ పాఠములున్న గ్రంథ మనుకొనుటలో నెట్టి విప్రతిపత్తియు లేదు.

సంస్కృతమున లక్ష గ్రంథములని ప్రశస్తి వహించిన మహాభారతము తెనుఁగు ననేఁ బదివేల గ్రంథములై నట్లు పండితుల యభిప్రాయము. (గ్రంథ మనఁగా 32 అక్షరముల పరిమితి), అందును నెట్టినను, నన్నయను వదలి, తిక్కన రచియించిన పదునైదు పర్వములను బరిశీలించిన మాతృకలో నీ భాగము 72,741 శ్లోకములై యుండఁగాఁ దిక్కన యీ మొత్తమును 33,600 గ్రంథములలో ముగించినట్లు గనఁబడును. (ఆంధ్రమహాభారత పీఠిక. మ. సూ.) అనఁగా సగముకంటెఁ దక్కువగా నున్నది పరిమితి. ఈ పదునేను పర్వములలోను 46 ఆశ్వాసములున్నవి. మొత్తము తిక్కన పద్యముల సంఖ్య 20,000 లుండవచ్చు నని శ్రీ వీరేశలింగం పంతులుగారు వ్రాసినారు. (ఆం.క.చ.భా. 1. P. 140). ఈ 20,000 ల పద్యములు దాదాపు 34,000 గ్రంథములగునని తలఁపవచ్చును. ఇఁకఁ దిక్కన కాలవివరమునకు నేను గడంగను. పూర్వగ్రంథమును గూర్చి చర్చింపువారీ విషయమును ముచ్చటించి యుందురు. తిక్కన కాలము క్రీ.శ. 1300 లకు వెనుకకుబోదని శ్రీ వీరేశలింగంపంతులుగారి వాదము మల్లాది సూర్యనారాయణశాస్త్రిగా రన్యథా తలంచుచున్నారు. (ఆంక.చ.భా. 1 P. 120. ఆం. మ. భా. పీఠిక. మ. సూ. P XIX. 13వ శతాబ్ది పూర్వార్ధము). ఈ విషయము నింతటితో విడుతును. ఈ సందర్భమున నిటీవలఁ గవితరంగిణి విరచించిన శ్రీ చాగంటి శేషయ్యగారి వాదమును గూడ గ్రహింపనగును.

శాంతిత్రయము

ఇఁక మన వ్యాసాంశమునకు వత్తును. శాంతిత్రయ మనఁగా శాంతి పర్వముతో మూఁడు పర్వములు, శాంతి, ఆనుశాసనిక, ఆశ్వమేధిక పర్వములు. వీని పరిమితిని ముందు ముచ్చటింతును. వీనిలోని యధ్యాయ సంఖ్యవిషయములోఁ గూడ వివిధ ప్రతులలోఁ గొంచెము భేదమున్నది శాంతి పర్వమున 3 భాగము లున్నవి.

(1) రాజధర్మము.

(2) ఆపద్ధర్మము.

(3) మోక్షధర్మము.

ఇది స్థూలవిభాగము. ఒక యధ్యాయ వివరణము నుల్లేఖింతును. వెనుక నేను మనవిచేసిన స్వాధ్యాయమండలివారి భారత ప్రతిలో నీ క్రింది యధ్యాయ విభాగ మగుపడును.

రాజధర్మము	- 130	అధ్యాయములు.
ఆపద్ధర్మము	- 43	అధ్యాయములు.
మోక్షధర్మము	- 192	అధ్యాయములు.
మొత్తము	- 365	అధ్యాయములు

వావిళ్ళప్రచురణములోని యధ్యాయ విభాగ మిట్లున్నది.

రాజధర్మము	- 130	అధ్యాయములు.
ఆపద్ధర్మము	- 43	అధ్యాయములు.
మోక్షధర్మము	- 193	అధ్యాయములు.
మొత్తము	- 366	అధ్యాయములు

భండార్కరు పరిశోధక సమితివారి ప్రచురణములో నధ్యాయ విభాగ మిట్లున్నది.

రాజధర్మము	- 128	అధ్యాయములు.
ఆపద్ధర్మము	- 39	అధ్యాయములు.
మోక్షధర్మము	- 186	అధ్యాయములు.
మొత్తము	- 353	అధ్యాయములు

పై లెక్క వలన వావిళ్ళ ప్రచురణముకంటె స్వాధ్యాయమండలివారి ప్రచురణయొక్క యధ్యాయము తక్కువ యనియు, భండార్కరు ప్రతి 13 అధ్యాయములు తక్కువయనియుఁ గన్పట్టుచున్నవి. మిగిలిన యధ్యాయము లన్నియుఁ ప్రక్షిప్తములని యా సమితివారి యభిప్రాయము. ఆ ప్రక్షిప్తములను దుదిభాగమునం దనుబంధములుగా నిచ్చినారు. వావిళ్ళ, స్వాధ్యాయ మండలివారి ప్రచురణము నందలి విభేదమొక గొప్ప విషయముగాదు. పరీక్షింపఁగా మోక్ష ధర్మములోని 283, 284 అధ్యాయములను రెంటినిఁ గలిపి యొకే యధ్యాయముగా నివ్వఁబడినది. స్వాధ్యాయ మండలివారి ప్రచురణమున.

ఆనుశాసని కాశ్వమేధిక పర్వములలోని యధ్యాయ సంఖ్య మొదటి రెండు ప్రతులలోను సమానముగనేయున్నది. భండార్కరు పరిశోధనాసమితివారి ప్రచురణములో లేదు గాన వారి యధ్యాయసంఖ్య యివ్వనైతిని.

ఆనుశాసనికము - 168 అధ్యాయములు.

ఆశ్వమేధికము - 92 అధ్యాయములు.

శ్లోకసంఖ్య కూడ పై రెండు ముద్రణములందును సమానముగనే యున్నది.

శాంతి	- 13,775	శ్లోకములు.
ఆనుశాసనికము	- 7,701	శ్లోకములు.
ఆశ్వమేధికము	- 2,845	శ్లోకములు.
మొత్తము	- 24,321	శ్లోకములు.

నన్నయ భట్టారకుఁడీ శ్లోక సంఖ్య నిట్లు తేల్చినాఁడు. శాంతి 14,525; అను శాసనికము 12,000 ఆశ్వమేధికము 4,520 - మొత్తము 30,945 (ఆం. మ. భా. P. 57, 59, 67)

అవాంతర పర్వనామములలోఁ జిన్న మార్పొకటి కలదు. స్వాధ్యాయ మండలి ప్రచురణలో నానుశాసనికము యొక్క తుది రెండధ్యాయములకు "స్వర్గారోహణ పర్వ" మని నామకరణము చేయఁబడినది. దీనిని నన్నయ భీష్మ స్వర్గారోహణ పర్వమున కిది కొంచెము విరుద్ధముగా నున్నది. మఱియు నాశ్వమేధికపర్వమున 16వ అధ్యాయమునుండి తుదివఱకు నా ప్రచురణమున "అనుగీతాపర్వ" మని నిర్దేశింపఁబడినది. అర్జునుఁడు భగవద్గీతలోని తత్త్వమును మఱచి మరల కృష్ణుని

తత్త్వమును దెలుపుమని యడుగగాఁ గృష్ణుడుపదేశించిన ఘట్టమిది. భగవద్గీతలోని తత్త్వమునే యనుసరించినందున దీనికి "అనుగీత" మని నామకరణము కలిగినది. ఆశ్వమేధిక పర్వమున "వైష్ణవధర్మపర్వము" అనునొక భాగము కుంభకోణ ప్రతిలోఁ గలదు. ఇతర ప్రతులలో నిదిలేదు. తెనుఁగు భారతమందిది లేదు. భాషాంతరీకరణ కర్తలు దీని నెఱుఁగరు.

ఇచ్చట నొక విశేషము కలదు. మహాభారతము మొత్తమును, నందలి కొన్ని భాగములు నైరోపియనుల నాకర్షించినవి. అనేకములైన యట్టిభాగములు జర్మనీలోను, ఫ్రాన్సులోను, ఇటలీలోను బ్రచురింపఁబడినవి. వీనిలో సాల్‌డాయ్‌సన్ అనునొక పండితుఁడు మహాభారతములోని తాత్త్వికభాగములను బ్రచురించినాఁడు. అవియెవ్వి యన-భగవద్గీత, సనత్సుజాతీయము. మోక్షధర్మము. అనుగీత యనునవి. వీటి నాయనయు Straus (స్ట్రాస్) అను మఱియొక పండితుఁడును జర్మన్ భాషలోని కనువదించినారు. (Philosophical texts of Maha Bharatha Leipzig 1902) ఆ ప్రతిలో వీరి కచ్చట నుపలభ్యమానములయిన రెండు భారత ప్రతులనుండి తమ పాఠమును గ్రహించినారు. ఒక ప్రతిలో శాంతి పర్వమున 367 అధ్యాయములు రెండవదానిలో 365 అధ్యాయములు నున్నట్లు వ్రాసినారు. కాని పరీక్షింపఁగా నీ సంఖ్యాభేద మొక ప్రతిలో 228,229 అధ్యాయములును, 285, 286 అధ్యాయములును గలసినందువలనఁ గలిగినది. వెనుకటి సంఖ్య కీ సంఖ్య దగ్గఱకు వచ్చును. మఱియు 16-51 అధ్యాయములను మాత్రమే యనుగీతగా నా పండితులు గ్రహించినారు. మన ప్రతులలోఁ దుదివఱకు "అనుగీత" గానే నిర్వచింపఁబడినను, 51 అధ్యాయముతో శ్రీకృష్ణ వాక్యముతోఁ బూర్తియగుచున్నది గాన, వారి నిర్వచనమే సమంజసమని తోఁచును. శాంత్యానుశాసనిక పర్వములు వ్యాసభారతమున లేవనియుఁ బురాణోపబృంహణ కాలమునఁ జేర్చబడినవనియు విమర్శకులందురు. అందున నానుశాసనికము శాంతికంటె యర్వాచీనమఁట! అసలు కథ కీ భాగములు సంబద్ధములు కాకపోవుట యిందులకుఁ గారణ మని వారి వాదము. కొన్ని యుపాఖ్యానములు బౌద్ధ వాఙ్మయము నుండి గ్రహింపఁ బడినవని కూడ వారి యభిప్రాయము. (History of Indian Literature; Winternetz vol. P 1, 409) ముఖ్యముగ నహింసను బోధించునవి యట్టివని వారనుచున్నారు. కాని యష్టాదశ పర్వ సంఖ్య సంప్రదాయముగ వచ్చుచున్నందున నీ వాదము మన కిప్పు డనవసరము. అన్ని భాగములకు నేకవాక్యత పొసఁగుచున్నందున మనము వీనిని మాతృకాంతరములేయని గ్రహింతము. ఒకవేళ నున్నను నా సమస్య మాతృకకుఁ గాని మన యాంధ్ర మహాభారతమునకుఁ గాదు.

శాంతిత్రయముయొక్క విశిష్టత

భారతీయ సంప్రదాయము ననుసరించి ధర్మార్థ కామమోక్షములని పురుషార్థములు నాలుగు. వానిలో మోక్షము తురీయము. ధర్మము మొదటిది. అర్థకామములను ధర్మబద్ధములుగా నార్జించి తద్ద్వారమునఁ దురీయ పురుషార్థమును సాధించుట మానవుని కర్తవ్యము. కర్మ-జ్ఞానములలో నేది గొప్పది యని మఱియొక ప్రశ్న. భారతామ్నాయమున నిదివఱకే యొకమాఱు, కేవల జ్ఞానముగాక నిరభిసంధి కర్మానుష్ఠానము మోక్షమార్గమని భగవద్గీతలో నుగ్గడింపఁబడినది. అర్జునుఁడు యుద్ధము చేయ నిరాకరించెను. భగవంతుఁడైన శ్రీకృష్ణుఁడు గీతలను బోధించి తన విశ్వరూపమును జూపి యర్జునునకు క్షత్రియధర్మమును నిర్వర్తింపుమని పురి కొల్పెను. గీతాతాత్పర్యము, "తదేతత్కర్మసన్యాసాత్కర్మయోగోవిశిష్యతే" యను వాక్యమున నిమిడియున్నది. అట్టి కర్మయోగమును బోధించి యర్జునునిఁ గార్యశూరునిఁ జేసెను. అనఁగా క్షత్రియునకు విధింపఁబడిన కర్మ యవశ్యాచరణీయ మనియు, కులధర్మములతోనే ప్రజలను బ్రజాపతి సృష్టించెననియు దృష్టాంత పూర్వకముగ బోధించెను. తుదకుఁజేసెడి కర్మఫలమును గోరకుండ సమస్త కర్మలను దన కర్పణము చేయుమని నచ్చఁజెప్పెను. తరువాత భారత యుద్ధము జరిగెను. సౌప్తికపర్వము తుదివఱకు యుద్ధచ్ఛాయలను వర్తించుచునేయున్నది సర్వనాశనమైనది. ఇఁక ముందేమి యను ప్రశ్న ముత్పన్నమైనది. రాజు లేక పోయిన దేశమరాజకమగును. ధర్మములు నశించును.

యుధిష్ఠిరుఁడు జరిగిన సర్వనాశమునకుఁ దానే కారకుఁడనియు, నందుచేఁ దనకు రాజ్యార్హత లేదనియుఁ దాను మహాపాతకిననియు, తత్పాపశాంతికై యరణ్యమునకు వెడలి తపమాచరించి పునీతుఁడ నగుదుననియు, నస్త్రసన్యాసము చేసెను పట్టాభిషేకమొల్లకుండెను. యుద్ధము గాకమునుపే జరగబోవు సర్వనాశనమున కర్జునుఁడు పరితపించెను. యుద్ధానంతరము జరిగిన సర్వనాశనమునకుఁ బశ్చాత్తప్తుఁడై ధర్మరాజు చింతాక్రాంతుఁడయ్యెను. యుద్ధమున కర్జునునిఁ బురి కొల్పినట్లే ధర్మరాజును బట్టాభిషేకమునకుఁ బురికొల్పవలసి వచ్చెను. అందులకై తమ్ములును, గృష్ణుడును మరల బోధింపవలసి వచ్చెను. అన్నిటికంటె నెక్కుడుగఁ గర్ణుఁడు తన యన్నయని కుంతీదేవి చెప్పిన వృత్తాంతము ధర్మజుఁని గలంచెను. అందులకై కటకటపడి స్త్రీలకు రహస్య గోపనము లేకుండునట్లు శపించెను. దీని వలనను మనశ్శాంతి కలుగలేదు. వేదవ్యాసుఁడు కూడ బోధించెను. ఎందఱెన్ని చెప్పినను దుదకు షోడశమహారాజు చరిత్రమును బోధించిన తరువాత

నెట్టెట్టో పట్టాభిషేకమునకు సమ్మతించెను. పట్టాభిషేకానంతరము కూడ ధర్మజుని మనస్సు శాంతింపలేదు. అప్పుడు కృష్ణుఁడాలోచించి యాయన మనశ్శల్యమును బాపుటకుఁ గురువృద్ధుఁడగు భీష్ముఁడే తగునని యంపశయ్యపై యుత్తరాయణమునకు వేచి యున్న కురుపితామహుని వద్దకుఁ గొంపోయెను. విధ్యుక్త ధర్మము నాచరించి, కర్మబద్ధుఁడుగాక, మోక్షమునకై యెదురు చూచుచున్న భీష్మునిఁజూచి ధర్మజుఁడు కొంత మనశ్శాంతి నొందెను. అనన్య మరణుఁడయ్యుఁ గృష్ణుని ప్రేరణముననను ధర్మజునిపై నున్న ప్రేమవలనను రాజుయొక్క యావశ్యకతవలనను, ధర్మజునకు సమస్తధర్మములను బోధించి తుదకు మోక్షధర్మము నుపదేశించెను. రాజ్యము చేయుటకు ధర్మజు నొడఁబఱచి పరమపదముం బొందెను. అర్జునుని కుపదేశించినను, ధర్మజున కుపదేశించినను "స్వధర్మాచరణమే" యంశము. ఇది యీ భాగముయొక్క ప్రసక్తి.

ఇందు రాజధర్మ, ఆపద్ధర్మ, మోక్షధర్మములున్నవి. ఆపద్ధర్మ మెందుల కనుప్రశ్నకు, సర్వనాశన మాపత్తుగాన నప్పుడవశ్యానుష్ఠేయములగు ధర్మములను జెప్పవలసి వచ్చెను. రాజెట్టి ధర్మము లవలంబించి పాలించి తుదకు మోక్షమును సంపాదింపవలెనో యిందుగ్గడింపఁబడినది. ఈ భాగముయొక్క వస్తువును డా॥ వింటర్నిజ్ పండితుఁడిట్లు చెప్పినాఁడు.

"They deal with the three things which the Indians term, Note, i.e. worldly wisdom effecienly, for kings, also politics, Dharma i.e. systematic law as well as general morality and Moksha i.e. liberation as the final aim of all philosophy" (A History of Indian Literature. Dr. Winterntez, Vol 1, P 422.)

కావున ధర్మరాజును మరల ధర్మబద్ధమైన కర్మాసక్తునిఁ జేయుటకై భీష్ముఁడు బోధించెను. కావున నీ భాగము భగవద్గీతతోఁ బాటు కర్మయోగమును బోధించిన రెండవ ఘట్టము. భగవద్గీత వలెనే యీ భాగము కూడ పవిత్రమును, నవశ్యపఠనీయమునునై యున్నది. రెండుపదేశములకును నొక గొప్ప భేదము కలదు. భగవద్గీత ప్రభుసమ్మితము, వేదతుల్యము. అందు పాఖ్యానములు లేవు. గురుశిష్యసంవాదరూపమయినది. శ్వేతకేతునకుఁ దండ్రిచెప్పినట్లున్నది. అర్జునుఁడు "నాథమాం ప్రసన్నం" అనినాఁడు. ఆయన ప్రసన్నుఁడు. కృష్ణుఁడతని శాసించినాఁడు. ఈ ద్వితీయోపదేశము సుహృత్సమ్మితము, అనేకోపాఖ్యానముల మూలమునఁ గర్మయోగము బోధింపఁబడినది. ఈ యుపాఖ్యానము ధర్మముల యొక్క

ప్రాశస్త్యమును, నధర్మము యొక్క యప్రాశస్త్యమును దెలుపుచుఁ గర్మయోగమునకుఁ బురికొల్పుచున్నది. ఈ యోగము కూడ మనువిక్ష్వాకునకు బోధించినదే! పై పెచ్చు మనోరంజకము. అనఁగా నీ బోధ యొక్కొక్కచోఁ గాంతా సమ్మితత్వమును గూడఁ గలిగియున్నది. మనుప్రోక్త మనుట కీ క్రింది యుదాహరణమును దిలకింపుఁడు.

నిర్మలమగు, నేకాంతిక
ధర్మము, నారాయణోదితంబై, క్రియలన్
గర్మఠుఁడగు బ్రహ్మమతిని
ధార్మికవర యొలసె, నతఁడు దయ సిగురొత్తన్

దక్షునకు నెఱింగించిన
దక్షుఁడు బోధించెఁ దనదు దౌహిత్రు జగ
చ్చక్షుని, నా సవితృండు, మ
ను క్షితిపతి కిచ్చె, నవ్వినుతధర్మంబున్

మను, విక్ష్వాకున కొసఁగె న
తనివలనఁ దదీయ యోగ్యతాకలితులు, స
జ్జనములు, వడసి, రనేకులు
విను నారాయణునిచేత విని నారదుఁడున్ **(శాంతి 6-495, 496,497)**

భగవద్గీతలోని ధర్మము మధ్యను నష్టముకాఁగా మరలఁ గృష్ణుఁ డర్జుననకు బోధించెను. కాని యిది పరంపరగా వచ్చుచునే యున్నది.

ఈ శాంతిత్రయము యొక్క ప్రాశస్త్యమున కింతకంటె మఱియొక ప్రబల దృష్టాంతము కలదు. అశ్వమేధము కాఁబోవు సమయమున నర్జునుఁడు తాను యుద్ధాత్పూర్వము వినిన తత్త్వోపదేశమును మఱచితిననియు, మరల దాని నుపదేశింపు మనియుఁ గృష్ణుని వేఁడెను.

"అనిన నగుచు నాకకేల న
తనిఁ గౌఁగిటఁజేర్చి బుద్ధితత్త్వ విహీనుం
డును శ్రద్ధారహితుఁడు నై
తని దూఱి ముకుందుఁ డిట్టులను నాతనితోన్"

"బ్రహ్మపద వేదనమునకుఁ బరమ హేతు
భూతములు నాటివాక్యముల్ బుద్ధి దన్మ

హార్థములు నిల్పవైతి శక్యంబె యింక
న వ్వచనములు సెప్పంగ నలఘు శౌర్య". (ఆశ్వ. 1-156-157)

"ఇందున్న యలఘు శౌర్య" యను సంబోధనము మిక్కిలి సాభిప్రాయము. అనఁగా "నీవు నా బోధ తరువాతఁ జూపిన శౌర్యమువలన నా బోధమఱచితి" వని యెత్తిపొడుపందుఁ గలదు. కృష్ణుఁడర్జునుఁడడుగఁగనే యతనిఁ గౌఁగిటఁ జేర్చెనఁట దీనివలనఁ గృష్ణునకర్జునునిపై నెంత ప్రేమయున్నదో తేటతెల్లమగుచున్నది. యుద్ధకాలమునఁ గూడ విశ్వరూపము చూపునప్పుడు "నాకు నీపై నున్న ప్రేమ పెంపునఁ" జూపుచున్నాననెను. అచ్చట నర్జునునిఁ గౌఁగిటఁ జేర్చినట్లులేదు. కాని యిచ్చటఁ గౌఁగిలించుకొనెను. కావున భగవద్గీత గురువువలెనుపదేశించెను. ఇప్పుడు స్నేహితునివలె నుపదేశించెను. అందుచే నీ ఘట్టము సుహృత్సమ్మితము. ఎడనెడఁ గాంతా సమ్మితము కూడ ననవచ్చును. భగవద్గీతయందలి తత్త్వమునే యీ భాగము కూడ యనువదించుటచే దీనికి "అనుగీత" యని నామకరణము చేయఁ బడినది. ఇది జర్మన్ భాషలోనికేగాక యాంగ్ల, గుజరాతీభాషలలోనికి బరివర్తనమైనది. తెనుఁగునఁ గూడఁ బరివర్తనమయ్యెనని మన వ్యాసాంశమే తెలుపును. ఈభాగమందలితత్త్వము చెప్పి నదియేచెప్పఁబడినది. కృష్ణుఁడు "శక్యంబె యింకనవ్వ చనములు చెప్పంగ" అనివాఁడు. మరలఁచెప్పిన ప్రకరణమగుటచే నీ భాగము గీతవలెఁ బారాయణయోగ్యము గాక పఠనయోగ్య మయ్యెను. గీతయొక్క పావిత్ర్యమీ భాగమునకు లేదు. కాని యచ్చటి తత్త్వమే యిందుండుటచేత నీ భాగము కూడ నుదాత్తమైన కృష్ణుని మూలమునుండి వెలువడుటచేఁ గొంత పవిత్రమై యల రారుచున్న దనుటలో నభ్యంతరము లేదు. భీష్ముఁడు ధర్మజునకుఁ జేసిన యుపదేశమును, గృష్ణుఁడర్జునునకుఁ జేసిన పునరుపదేశము నిందుండుటచే నీ భారతభాగము కూడ విశిష్టమై మోక్ష ధర్మోపదేశమువలన విశిష్టతరమై యొప్పారు చున్నది. (Maha Bharata V.V. Iyer 277,78) - తిక్కన భగవద్గీతను వదలి వేసెను.

తిక్కనార్యుని భాషాంతరీకరణ పద్ధతి

ఇఁక నీ భాగమును దిక్కన సోమయాజి యెట్లాంధ్రీకరించినది చూతము. తిక్కన భారతమును యథామాతృకముగా భాషాంతరీకరింపలేదని మీ కిదివఱకే తెలియును. తిక్కన యొక్కఁడేకాదు. నన్నయకూడ తన యిచ్చవచ్చినట్లు కుదించుట పెంచుట చేసెను. తిక్కనార్యుఁడుతన కృతి యారంభించినప్పుడే యథా మాతృకముగా ననువదింప నుద్దేశించినట్లు కనఁబడును. పీఠికలో "ఏది యేనాటి

దెనుంగు బాస. "తెనుంగునన్ మహాభారత సంహితారచన (నన్నయ) జన సంప్రార్థ్యంబులై పెంపునఁ దుదిముట్టన్ రచియించుటొప్పు" అనివాఁడు. తిక్కన తెనుఁగునఁ దుదిముట్ట రచియింతు నన్నాఁడు. ఇందె మఱియొక ధ్వని కలదు. "నన్నయ యే విధానమునఁ దనభాగము రచించెనో యా విధానమునే నేనును దుదిముట్ట నిర్వర్తింతును" అని స్ఫురించును' యథామాతృకముగాఁ జేయ సంకల్పించిన యెడలను నన్నయభాగము యథామాతృకముగా లేదు గాన నా భాగమును గూడ రచియింప సమకట్టియుండును. తరువాత "పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్" అనినాఁడు. మూఁడు కృతు లాంధ్ర కవిత్వ విశారదుండు". దీనిచే నధ్యాయాను పూర్విగాక యాశ్వాసానుపూర్విగా వ్రాయుదునని చెప్పినట్లయినది. తరువాతఁదన యభిప్రాయము నాతఁడు స్పష్టపఱచుచు "అమ్మహాకావ్యంబు నర్థంబు సంగతంబు సెసెద" ననెను. "భారతార్థమును దెనుఁ గునఁ జెప్పెదను" అనుట భారత పాఠము నందుఁగాక తదర్థంబునఁ దనకెక్కువ యభినివేశన మున్నట్లు స్పష్టపఱచుచున్నది. కావుననే యచ్చటి యర్థమునకుఁ బ్రాముఖ్యము నిచ్చుచు రచించినాఁడు. చేసిన పని కూడఁ బై యభిప్రాయమునకును, నుద్దేశ్యము నకును ననుగుణముగానే యున్నది. శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారును నీ యభిప్రాయమునే వెలిబుచ్చినారు. మఱియుఁ దన రచనను "ప్రబంధ మండలి" (ప్రబంధపరమేశ్వరుఁడు-ఎఱ్ఱన) యని పిలిచినాఁడు. అనఁగాఁ బ్రబంధముల యొక్క సమూహము ప్రబంధము యొక్క ఛాయలాకాలమునకే కనఁబడుచున్నవని కూడ మనమనుకొనవచ్చును. సంస్కృతమునకుఁ జేయు భాషాంతరీకరణమునందును దెనుఁగులోఁ జేయునది సరియై, మాతృకననుసరించినయెడలఁ దప్పక మాతృకకంటె విస్తరించుననుట నిజము. తిక్కన కృతి మాతృకకంటెఁ గొన్ని మడుంగుల పరిమితిలో న్యూనము దాదాపు మూఁడవ వంతుండవచ్చునని నా యూహ. వెనుక నీ పరిమితినిఁగూర్చి స్పృశించియే యున్నాను. మాతృకలోనున్న 4,321 శ్లోకములను 6,423 గద్యపద్యములలో ముగించెను. ఇవి లెక్కింపఁగా దాదాపు 14,000 గ్రంథము లుండును. (32 అక్షరములు). ఆయన రచియించిన మొత్తము 33,600 గ్రంథములలో నీ భాగము 3వ వంతుకుఁ గొంచెమెక్కువగా నున్నది.

ఈ కుదింపుచేసిన తెఱవుకూడ దిఙ్మాత్రముగ నుల్లేఖింతును.

శాంతి పర్వము

కర్ణ జన్మాదివృత్తాంతము స్త్రీశాప కథనమువఱకు నున్న 156 శ్లోకములను 47 పద్యములలో ముగించెను. తరువాత 12 అధ్యాయములలోని వివిధ

హితవచనములను దేవస్థాన వాక్యమువఱకు 96 పద్యములోఁ గుదించెను. 152 శ్లోకములలో నున్న షోడశమహారాజు చరిత్రమును 19 పద్యములలో ముగించెను. ఇట్లు కుంచించఁగా 43 అధ్యాయాంతమునకుఁ బ్రథమాశ్వాసము ముగియును. 84 శ్లోకములలో నున్న భీష్మస్తవరాజమును 56 పద్యములలోఁ గుదించిన తదుపరి 99 అధ్యాయముతో రెండవ యాశ్వాసము ముగియును. ఈ సందర్భమున నొక విషయము స్మరణీయము. సంస్కృత మాతృకలో రాజధర్మ పర్వమనియు, నాపద్ధర్మ పర్వమనియు, మోక్షధర్మ పర్వమనియు, నవాంతర పర్వముల ప్రశంస కలదు. తిక్కనార్యుఁడా విధమైన విభాగమే చేయ సమకట్టలేదు. ఒక్కొక్కచో సంస్కృత విభాగ మాశ్వాసమధ్యమున నుండుట కలదు. (రాజధర్మ పర్వము మొదలైన పర్వనామము లిందు లేవు). ఒక యుదాహరణము. మాతృకలో ఋషభ గీతతో రాజధర్మము పూర్తియగును. అది 130వ అధ్యాయము. తిక్కన ద్వితీయాశ్వాసాంతమున నాపద్ధర్మ మారంభించినాఁడు. మాతృకలో నాపద్ధర్మమున నున్న పలితరోమశ వృత్తాంతమును తృతీయాశ్వాస మధ్యమున నెలకొల్పినాఁడు. 113 శ్లోకములలోనున్న బ్రహ్మదత్తపూజనీ సంవాదమును 22 పద్యములలోనికి దించినాఁడు. 7 అధ్యాయములలోనున్న, కపోతలుబ్దకోపాఖ్యానమును 17 పద్యములలోఁ గొట్టివేసినాఁడు. చతుర్థాశ్వాసము మోక్షధర్మముతో నారంభమగును. అన్ని యవాంతర పర్వములలో మోక్షధర్మము పెద్దది దానిని మూఁడాశ్వాసములలో ముగించెను.

"రాజోచిత ధర్మంబుల
యోజ విశదభంగిఁ జెప్పి తుజ్జ్వల విసర
త్తేజోధన నాకు సకల
భూజన పరమాహిత ధర్మముం దెలుపు దయన్"

అని ధర్మజుఁడడిగినాఁడు "పరమహిత" మనఁగాఁ బరమ పురుషార్థమగు మోక్షము. ఈ పర్వము మూఁడవవంతుకంటెఁదక్కువగా నున్నది. విషయ ప్రతీకలలోను గూడ మార్పు చూపెను. మాతృకలోనున్న విషయనామములఁ గొన్నింటిని విడచెను. కొన్నిటిని మార్చెను. భృగుభరద్వాజ సంవాదమును దదనంతర కథయునుగల 11 అధ్యాయములందలి విషయమును 20 పద్యములలోఁ గొట్టివేసెను. ఉపాఖ్యానములను మిక్కిలి సంగ్రహించెను. మాతృకలో 8 అధ్యాయములలోనున్న వార్ష్ణేయాధ్యాయమును 100 పద్యములలో ముగించెను. ఇంద్రబలి సంవాదముతోఁ జతుర్థాశ్వాసము ముగియును. శ్రీ శక్రసంవాదముతోఁ బంచమాశ్వాస

మారంభించును. 24వ యధ్యాయపరిమితమైన శుకవ్యాససంవాదమును 160 పద్యములలో నిమిడ్చెను. ద్యుమత్సేన సత్యవద్వాక్యములను 56 పద్యములకంటె మించనీయలేదు. వృత్రకథయు సంగ్రహింపఁబడినది. శివ సహస్ర నామములను బూర్తిగ వదలివేసెను. పరాశరగీతకును, హంసగీతకును మధ్యనున్న 9 అధ్యాయములను దాదాపు 60 పద్యములలో సంగ్రహించెను. "సాంఖ్యాదితత్త్వ విషయములు మాటి మాటికి వచ్చుచుండుటచేత వానిని మిక్కిలి కుదించెను. ఇంతటితోఁ బంచమాశ్వాసము ముగియును. క్షరాక్షరనిర్వచనముతో షష్ఠాశ్వాస మారంభమగును. శుకోత్పత్తివఱకు నున్న 21 అధ్యాయముల గ్రంథమును 22 పద్యములలో ముగించెను. (అనుత్పన్న) ఇచ్చట నొక విచిత్రము కలదు. మోక్షధర్మ పర్వములో 190-192 అధ్యాయములు గద్యాత్మకములు ఆరణ్య పర్వములోఁ గూడ గద్యములు కలవు; దీనినిఁ దిక్కనార్యుఁడు స్పృశించినట్లేలేదు, ఒకవేళ చెప్పినను కొద్దిలో ముగించెను. ఈ భాగము నరనారాయణోపాఖ్యానము. ఉంఛవృత్తి కథనముతో శాంతిపర్వము ముగియును, మాతృకలోని యంత్యాధ్యాయములను విడచివైచెను. ఈ విధముగాఁ దిక్కనార్యుఁడు మాతృకయొక్క యుద్దేశ్యమును నేకవాక్యతయుఁ జెడకుండఁ బాఠకుల కింపైన యట్లు తన కర్తవ్యమును నిర్వర్తించెను.

ఆనుశాసనికాశ్వమేధములు

ఇందును సంగ్రహ కథనము గలదు. సుదర్శనోపాఖ్యానమును సంగ్రహించినను మిక్కిలి రసవంతముగఁ జేసినాఁడు. గరుత్మంతుని చరిత్రమును మిక్కిలి రసవంతము చేసెను. కాని యిది మాతృకలోఁ గానరాదు. శివమాహాత్మ్యమును విడచివైచెను. అష్టావక్ర చరిత్రముతో నానుశాసనిక ద్వితీయాధ్యాయమారంభమగును. ఈ పద్యమున దాన తీర్థమాహాత్మ్యము అనేకములు కలవు. వానిలో ననేకాధ్యాయముల నెగురఁగొట్టెను. తన విషయ వివేచనాశక్తి నుపయోగించి రసవంతములుగానుండు ఘట్టముల నేరి రచించెను. 3 అధ్యాయములలోనున్న విపులోపాఖ్యానమును 38 పద్యములలో ముగించెను. కాని మాతృకలోకంటె రసవంత మొనర్చెను. చ్యవనోపాఖ్యానమును సంగ్రహించిన వెనుక నౌద్దాలిక పుత్రచరిత్రముతో ద్వితీయాశ్వాసము ముగియును. ఆరంభమైన గోదాన మహిమాదికము తృతీయాశ్వాసములోని కనువృత్తము లయ్యెను. శ్రాద్ధప్రకరణమును స్పృశించి వదలెననియే చెప్పవలెను. నహుష దానములతోఁ జతుర్థాశ్వాస మారంభమగును; ఇది మాతృకయందు 100వ యధ్యాయము. హస్తికూటాధ్యాయమును రసవంతముగా 30 పద్యములలో సంతరించెను. ఆ

యుపాఖ్యానమును మిక్కిలి సరళము గను సులభగ్రాహ్యముగను నొనరించెను. ఉమామహేశ్వర సంవాదారంభముతోఁ జతుర్థాశ్వాసముముగిసి తదనంతర సంభాషణమంతయుఁ బంచమాశ్వాసములోని కనువృత్త మగుచున్నది. శివ పార్వతీ సంవాదమున విష్ణు సహస్రనామములు తిక్కన తన మామూలు ననుసరించి విడచివైచెను. మిగిలిన యీ యాశ్వాసమంతయు శివపార్వతీ సంవాదమే యనవచ్చును. భీష్ముఁడు మఱికొన్ని ధర్మములనుదెలిపి ధర్మజు నొడంబఱచి హస్తిపురికిఁ బోవ ననుజ్ఞ నిచ్చును. మరల ధర్మజుఁడు కృష్ణసహితముగాఁ బితామహుని యంత్యకాలమునఁ గురుక్షేత్రమునకు వచ్చిన తదుపరి శ్రీకృష్ణుని యనుజ్ఞను గొని భీష్ముఁడు శరీరమును జాలించును. ఆయన యంత్యక్రియలు జరిగిన వెనుక గంగను గృష్ణుడు సమాశ్వాసము చేయుటతో నానుశాసనికము ముగియును.

అశ్వమేధికములో మొదటి 15 అధ్యాయముల తరువాత "అనుగీత" యారంభించును. మరుత్తుని చరిత్రతోఁ బద్యమారంభించును. యజ్ఞమాచరించుటకు వలసిన ధనము లేదని యుధిష్ఠిరుఁ డనఁగా నీ మరుత్తుని చరిత్రమునకుఁ బ్రసక్తి వచ్చును. ప్రథమాశ్వాసమున 153 పద్యములతో ననుగీత యారంభమగును. అనుగీతలోని బ్రాహ్మణ గీతాధ్యాయముతో ద్వితీయాశ్వాసము మొదలిడును. మాతృకలో 51 అధ్యాయాంతమును మన యనువాదములో ద్వితీయాశ్వాంతమునకు సరిపోవుచున్నది. అనుగీతలో దాదాపు 300 పద్యము లుండును మాతృకయందలి 36 అధ్యాయములు, తరువాత నుదంకుని చరిత్ర మిక్కిలి రసవంతమయ్యు సంగ్రహమే యనవలెను. విశ్వరూప దర్శనముతో నుదంకుఁడు ముక్తుఁడగును. వసుదేవునితో భారతయుద్ధమును సంగ్రహముగఁజెప్పును. తరువాతఁ బరీక్షిజ్జన్మమును, నశ్వత్థామబ్రహ్మాస్త్రమును బ్రయోగించుటయుఁ, బరీక్షిత్ప్రాణ దానమును హృదయవిదారకముగ వర్ణించినాఁడు తిక్కన . తరువాత నశ్వమేధ సంకల్పము, యజ్ఞాశ్వ రక్షణమునకై యర్జునుఁడు వెడలుటయు, నాయన చేసిన యుద్ధములు వర్ణితములైనవి. నకులోపాఖ్యానముతోఁ బర్వము ముగియును.

ఇది తిక్కనార్యుని సంగ్రహ కథన పద్ధతి, పాఠకులకు విసువు జనించకుండఁ దాత్త్విక భాగములను మిక్కిలి కుదించిన స్థలములలోఁగూడ రసమునకుఁ గొఱవడకుండ రచించుటయుఁ, గథయుఁగాక, యేమియుఁగాక, నామపుంజములగు సహస్రనామములనువదలుటయు మొదలగు పద్ధతులచేనాంధ్ర మహాభారతమును సర్వజన పఠనీయముగాను, మహాకావ్యముగాను దిక్కనార్యుఁడు సంతరించెను. దీనిచే నాయన రచించిన భాగము ప్రబంధమండలి యయ్యెను.

రచనా విధానము

ఈ ప్రసంగనాటకమున కిది గర్భసంధి యనఁదగును. ఆయా సందర్భములలోఁ దిక్కనార్యుఁడు మాతృకలో నున్న దాని నెట్లు వర్తించెనో, యెక్కడెక్కడ యెట్లు మెఱుగు పెట్టెనో సాకల్యముగ, సమగ్రముగాఁ దెల్పుట కీ ప్రసంగము చాలదు. ఒక గ్రంథ మగును. కావున స్థాలీపులాకన్యాయముగాఁ గొన్ని సందర్భములను మాత్రముల్లేఖించి పూర్తి కావ్యమును సహృదయులకే వదలెదను. తిక్కన యొక్కొక్కప్పుడొకటి రెండు మాటలతో నుద్దేశిత రసమును, భావము నుత్పత్తి చేయును. కర్ణుని మృతికిఁ దాను కారణమని విలపించుచున్న ధర్మరాజుయొక్క మనసు మాతృకలో నిట్లు వర్ణింపఁబడినది.

"తన్మే దహతిగాత్రాణి తూలరాశి రివానలః" దీనినిఁదిక్క నారుర్యుఁడిట్లు వ్రాసెను.

"అంతరంగంబు నిప్పులం బొరలిన ట్లయ్యె"

మాతృకలో గాత్రములను దహించుచున్నట్లుండుటకంటె నా మనసు దహించు చున్నదనుటలో విశిష్టత కనఁబడుటలేదా? మనసుయొక్క ప్రాధాన్య మంగముల కున్నదా? దుఃఖించినది మనసుకదా! సుఖదుఃఖానుభవమును బొందునవి యంగములా? మనసా? తిక్కన మనసు నెఱిఁగి వ్రాసెను.

నారదుఁడు కర్ణవధకు కారణములను జెప్పు సందర్భమున మాతృకలో నింద్రుఁడు కుండలముల నపహరించిన వృత్తాంతము తరువాత నీ శ్లోకము లున్నవి.

"విముక్తః కుండలాభ్యాం చ సహజేన చ వర్మణా
నిహతో విజయే నాజౌ వాసుదేవస్య పశ్యతః
బ్రాహ్మణస్యాపి శాపేన రామస్య చ మహాత్మనః
కుంత్యా శ్చ వరదానేన మాయయా చ శతక్రతోః
భీష్మావమానా త్సంఖ్యాయాం రథ స్యార్ధానుకీర్తనాత్
శల్య తేజో వధాచ్చాపి వాసుదేవ నయేన చ
రుద్రస్య దేవరాజస్య యమస్య వరుణస్య చ
కుబేర ద్రోణయో శ్చైవ కృపస్య చ మహాత్మనః
అస్త్రాణ్యాదాయ దివ్యాని యుద్ధే గాండీవధన్వినా
హతో వైకర్తనః కర్ణో దివాకరసమద్యుతిః"

పై విధముగాఁ బునరుక్తులతో నిండియున్న కర్ణవధకు వస్తువును గారణ జాతము కొఱవడకుండఁ దిక్కనార్యుఁ డొక్క పద్యములో రసవంతముగా వర్ణించినాఁడు.

"వినుము నరేంద్ర విప్రుఁ డలిగెన్, జమదగ్ని సుతుండు శాపమి
చ్చె నమరభర్తవంచనము సేసె, వరంబని కోరి కుంతి మా
న్పె నలుక, భీష్ముఁ డర్ధరథుఁజేసి యడంచె, గలంచె మద్రరా
జనుచిత మాడె, శౌరి విధి యయ్యె, నరుం డనిఁ జంపెఁ గర్ణునిన్."

(శాంతి. 1-35)

కారణ జాతమును సంగ్రహించి సారాలంకారముతోఁ దిక్కనార్యుఁడీ ఘట్టమునకు మెఱుగు పెట్టినాఁడనుటలో నతిశయోక్తిలేదు.

భీమసేనుని యాశ్వాస వాక్యములు మాతృకలో నిట్లున్నవి.

"యథా హి పురుషః ఖాత్వా కూప మప్రాప్య చోదకం
పంకదిగ్ధో నివర్తేత కర్మేదం న స్తథోపమం
యథారుహ్య మహావృక్షం అపహృత్య తథో మధుః
అప్రాప్య నిధనం గచ్ఛే త్కర్మేదం న స్తథోపమం
యథా మహాంత మధ్వాన మాశయా పూరుషో వ్రజన్
స నిరాశో నివర్తేత కర్మేదం న స్తథోపమం
యథాశత్రూన్ ఘాతయిత్వా పురుషః కురునందన
ఆత్మానం ఘాతయేత్పశ్చా త్కర్మేదం న స్తథోపమం
యథాన్నం క్షుధితో లబ్ధ్వా న భుంజీయా ద్యదృచ్ఛయా
కామీ చ కామినీం లబ్ధ్వా కర్మేదం న స్తథోపమం
వయ మే వాత్ర గర్హ్యా హి య ద్వయం మందచేతసం
త్వాం రాజ న్ననుగచ్ఛామో జ్యేష్ఠేయ మితి భారత"

పురాణశైలి గాన పునరుక్తము లున్నను మాతృక కెట్టిలోపమునూ లేదు. ఉపమాన పరంపరయుఁ గొన్ని సరిపడీ సరిపడక పరిపరివిధములుగా నున్నవి.

"తిక్కనార్యుఁడీ ఘట్టము ని ట్లనువదించినాఁడు-

"పనివడి త్రవ్వి కూపమునందు నుదకంబు
పానంబు సేయనివాని భంగి
యున్నత తరువెక్కి జున్ను సేకుఱఁగొని

తేనియ యానవిాని భంగి
యాఁకొని యొడఁగూర్చి యన్నంబు తళియకు
వచ్చినఁ గుడువనివానిఁ భంగి
తమకించి యొకభంగిఁ దనవశంబుగఁ జేసి
మానినిఁ గవయనివాని భంగి

గాదె కురువరేణ్య ఘనశక్తి శౌర్యసం
పన్నులైన పగఱ ఖండనమున
నోర్చి పూజ్యరాజ్య మొల్లక యడవికి
నేఁగు టీవ యెఱుగు ది త్తెఱంగు.

నీ వడవి కరుగ నొడఁబడి
నీ వెనుకన వచ్చునపుడు నిందింతురు మ
మ్మీ వెఱ్ఱు లితని మాన్పం
గా వలఁతులు గార యని జగజ్జను లధిపా." (శాంతి 1-64)

ఈ పద్యమున మాతృకలోని దృష్టాంత పరంపరయం దొక దానినిఁ బూర్తిగా వదలివేసి యొక దాని నాటవెలఁది పాదములో నిమిడ్చినాఁడు. ఈ పద్యమునందలి విశిష్టతను గొంచెము స్పృశించెదను. ఒక పనినిఁ జేసి యిష్టమును సాధించి తరువాత ఫలము ననుభవింపకపోవుట యీ సందర్భము. మాతృకలో "అప్రాప్య చోదకం" అనుటలో విప్రతిపత్తినిఁ జూడుఁడు. ఉదకము పొందలేదని యర్థము వచ్చును. ఉద్దేశ్యమది కాదు. "ఉదకము ప్రాప్తించెను గాని, త్రాగలేదు." ఈ విధముగా మాతృకలోని మొదటి యుపమానము సమగ్రార్థమున కొఱవడినది. అట్లే రెండవ యుపమానములో "మధు అప్రాప్య" అనునప్పుడు కూడ నట్టి యర్థమునే యిచ్చుచున్నది. తర్వాతి యుపమానమున దూర ప్రయాణ మే యాశతోఁ జేసెనో, యెందులకు నిరాశతో నివర్తించెనో తెలుపలేదు. ఒక యాశతో వెడలి యా యాశ పూర్తికాకుండ నివర్తించిన గదా యుపమ సార్థక మగును? శత్రువులను జంపి తరువాతఁ దాను చచ్చుట యనునది వర్తింపనే వర్తింపదు. ఇట్లు మాతృకలో నిన్ని విప్రతిపత్తులున్నవి. కార్యమును సాధించి ఫల మనుభవింపకుండుటను దిక్కన పద్యమునందలి యంశము లన్నియు స్ఫురింపఁ జేయుచున్నవి. "ప్రాప్తించిన దానిని విడచుట" ప్రతి పద్యపాదము తెల్పుచున్నది. "ఉదకంబు పానము సేయని" యనుటచే నుదకము ప్రాప్తమైనది కాని త్రాగలేదు. చెట్టుపై మధు వుండునా? అందుచేఁ దిక్కన "జున్ను సేకుఱగొని" యనినాఁడు.

అచ్చుటఁ దేనెపట్టు చేకూఱినది. కాని దాని యందలి తేనె యానకుండుట కదా ప్రసక్తము. దూర ప్రయాణమందలి యాశయేమియో తెల్పనందున దానిని విడిచినాఁడు తిక్కన. శత్రుజయమును దుది యాటవెలఁదిలో నిమిడ్చినాఁడు. శత్రువులను జంపి తానే చచ్చుట యను భావమును గూడ వదలివేసినాఁడు. ఈ విధముగా నుపమాన పరంపరను సార్థకమును, సమాన ధర్మమునుగ నొనర్చినాఁడు. ఇఁక "భంగి" యను నంత్యనియమముతో సీసపాదములను ముగించినాఁడు. "జున్ను" అను జాతీయము నుపయోగించి శ్రోత్రపేయము గావించినాఁడు. ఈ పద్యము తరువాత నున్న కంద పద్యమునుగూడ మాతృక కంటె మిన్నగా రచించినాఁడు. భీముఁడు ధర్మరాజును "మందచేతసం" అని చెప్పుట యన్నగారిని దూషించుట యగునుగదా? తమ్మున కది యవినీతి యని తిక్కన భావించి యా యవినీతిని, యాయన వెంటఁబోవు తమ కాపాదించుకొను నట్లు చేసినాఁడు. "ఈ వెఱ్ఱులు" అని తమను ననఁగా నన్నగారి వెంబడిపోవు తమ్ములను వెఱ్ఱులని జనులు భావింతు రని మార్చుట మిక్కిలి సమంజసముగా నున్నది. ఇట్లు తిక్కన యౌచితినిఁ గాపాడి భీమున కవినీతినిఁ బోగొట్టి ఘట్టమును రసవంతమొనర్చినాఁడు. ఇట్టి ఘట్టములు లెక్కకు మిక్కిలిగా నున్నవి. ఇట్టి స్థలము లన్నిటిని నిచ్చుట యొక గ్రంథమును రచియించుట యగును. అయినను మఱికొన్ని దృష్టాంతముల నియ్యకుండ వెడలఁజాలను.

సంస్కృత మాతృకలో శ్రీ కృష్ణునిఁ గూర్చినస్తోత్రము వచ్చినపు డెల్ల ననేక విశేషణముల నిచ్చుట కలదు. ఒక్కొక్కప్పు డవి పునరుక్తము లగుట కూడఁ గలదు. కాని తిక్క నార్యుని కిది గిట్టదు. సందర్భమునుబట్టి వానిని మార్చుచుండును. అనవసరమని తోఁచిన వానిని విడచివైచును. ఒక్కొక్కచో నక్కడ వానిని విడచి తాను స్వయముగా నూతన విశేషముల నిచ్చుచుండును. ధ్యానాసక్తుఁ డైన శ్రీకృష్ణుని వర్ణించునప్పుడు మాతృకలో దాదా పేఁబది విశేషణము లున్నవి. (మ. భా. 43 అ; ఆం. మ. భా. శాంతి 2-3) వీనిలోఁ గొన్ని సామాన్యములు. "విశ్వకర్మన్ నమస్తేఽస్తు" మొదలు "శార చక్రాసిపాణయె" యని ముగియును. తిక్కనార్యుఁడా సందర్భమున నొక్క సీసపద్యమును రచియించి ముగించెను. ఇందలి విశేషణములు మాతృకలో లేవు.

"మణిహేమ పర్యంక మహితోపవేశను
సురుచిరాభరణ విస్ఫురితగాత్రుఁ
గౌస్తుభరత్న వికాసి వక్షస్థలుఁ
బీతకౌశేయ సంవీతమూర్తి

మేరుతటీగత మేఘసంకాశు న
    క్షత్ర గణావృత గగన సదృశు
నూతనోదిత రవి ద్యోతితోదయగిరి
    నిభు రుక్మబద్ధేంద్రనీలతుల్యు
న మ్మురారిఁ గని కృతాంజలియై భక్తిఁ
    జిత్తవృత్తి గరముఁ జొత్తిలంగ
నంతకంత కాననాంబుజ మలరంగ
    నిట్టులనియెఁ దియ్యమెసక మెసఁగ," (శాంతి 2-3)

కృష్ణుని మూర్తియు, వేషమును నతి రమణీయములుగా వర్ణింపఁబడినవి. పాఠకుల మనశ్చక్షువుల యెదుటఁ గృష్ణుని యాకారము మూర్తీభవించును. పాఠకుఁడు చిత్రకారుఁడేయైన యెడల వెంటనే కృష్ణునిఁ జిత్రింపఁగడఁగును. ధర్మరాజు శ్రీకృష్ణునిఁ జూడఁజూడ నాయనకుఁ గ్రమముగా నాహ్లాద మెట్లు గలిగెనో "అంతకంత కాననాంబుజ మలరంగ" అను మాటలలో నిమిడి యున్నది. వచ్చినప్పటి కంటె మాటలాడ నుంకించునప్పటికి హృదయమునందలి సంతోషముతో ముఖము క్రమ వికసిత మయ్యెను. ఆ సంతసమున దాని తరువాతఁ దియ్యని పలుకులు రాలేదు. మాతృకలో నీ ఘట్టమును జదివిన దారి తప్పిన బాటసారివలె ననుభవింతుము. విశేష పరంపరలోఁ గృష్ణుని యాకారమునే మఱతుము. భీష్మునివద్ద నుండి మరలిన యుధిష్ఠిర సేన వచ్చుచుండగాఁ జంద్రోదయ మయ్యెను. ఆ సందర్భమునఁ జంద్రోదయ వర్ణనము మాతృకలో నిట్లున్నది.

"తతః పురస్తా ద్భగవా న్నిశాకరః
సముత్థిత స్తామభిహర్షయ చ్చమూం
దివాకరాపీతరసా మహౌషధః
పునః స్వకేనైవ గుణేన యోజయన్"

ఈ శ్లోకమునకుఁ దిక్కన తెనుఁగు సేఁత యి ట్లున్నది.

"దినమునఎల్ల నుష్ణకర దీప్తులు పర్వి రసంబుఁ బీల్వ వం
దిన సకలౌషధి ప్రవితతిం దెలివొందగఁ జెయు నేర్పు గ
ల్గిన తన రశ్మిజాలమున లీలఁ జకోరములన్ మదింప జే
య నుదయమై వెలింగె నమృతాంశుఁడు సేనకుఁ దన్పు సేయుచున్"
(శాంతి 2-126)

మాతృకలో "స్వకేన గుణేన" యను నప్పుడా గుణ మేమియో, యది చంద్రుని గుణమో లేక యౌషధములగుణమో విస్పష్టముగా లేదు. చంద్రుఁ డోషధుల కధిపతి ఆయన యుదయముచేఁ దపించిన యోషధులు మరలఁ దెలివొందెను. అంతేగాని యోషధులయందలి గుణ మెచ్చటికిఁ బోయెను? ఎండిపోయిన యోషధులు చంద్రుని చల్లదనముచే దమ రసమును మరలఁ బొందెను. సేనకుఁ జంద్రోదయము సంతసము కలిగించుట యానుషంగికము. ఓషధులను బునరుజ్జీవితములు చేయుట సహజము. ఇందుకుఁదోడు సహజమైన చకోరానందమును జొన్పినాఁడు. ఇది విశేషము "వందిన" యనఁగాఁ దపించుటయని యర్థము. ఈ నుడికారము "అపీతరసాః" అను మాతృకలోని మాటలకంటె నర్థవంతము. వసుమన్యునకు బృహస్పతి చెప్పిన నీతి సందర్భమున మాతృకలో నిట్లున్నది.

"యదా పశ్యతి చారేణ సర్వభూతాని భూరిశః
స పుత్ర పౌత్రాన్ సామీత్యాన్ తదా భవితి సోంతకః
యదా త్వధర్మకాన్ సర్వాన్ తీక్ష్ణైర్దండై ర్నియచ్ఛతి
ధర్మకాంశ్చానుగృహ్ణాతి భవ త్యథ యమ స్తదా"

పై రెండు శ్లోకముల యర్థమును గలిపి తిక్కనార్యుఁ డిట్లు వర్ణించినాఁడు.

"చారచక్షుఁడై కను నెల్లజగము నపుడు
సూర్యుఁడంద్రు నరేంద్రు నకార్యకరుల
దునుము నయ్యెడ జముఁడు నాఁ జనునతండు
దేవతాత్ముఁడగుట సందియమె యధిప!" (శాంతి 2-271)

మాతృకలో రెండు స్థలములను "అంతకః" అనియు, "యమః" అనియు రెండుమార్లు యమసామ్యమే చెప్పఁబడినది. కాని తిక్కన దీనిలోని పునరుక్తినిఁ జూచి మొదటిపనిలో సూర్యసామ్యమును, రెండవపనిలో యమసామ్యమును దెల్పినాఁడు. సంచరించుచుసర్వభూతములను జూచువాఁడు సూర్యుఁడుఁగాని యముఁడు కాఁడుగదా! కావునఁ దిక్కన మాతృకలోని యర్థమునకు సార్థక్యమును గల్పించినాఁడనవలెను. ఈ రెండుదాహరణములనుండి రాజుదేవతాత్ముఁడను నర్థాంతరన్యాసము సాధించినాఁడు. ఎంత రమణీయము! ఆ సందర్భముననే రచియించి మాతృకాభాగములో లేని యీ క్రింది భాగమును దిక్కన స్వయముగా సంతరించినాఁడు.

"రాజునకు బ్రజ శరీరము
రాజు ప్రజకు నాత్మ రాజుం బ్రజయున్
రాజోత్తమ యన్యోన్య వి
రాజితులై యుండవలయు రక్షార్చనలన్ (శాంతి 2-274)

మాతృకలో "రాజా ప్రజానాం హృదయం గరీయో" యని యున్నది. హృదయమునకు, నాత్మకును నెంత తారతమ్య మున్నదో, పై రెండు భాగములకు నంత భేద మున్నది. ఈ పద్యమునఁ బ్రజారాజ సంబంధ మున్నది. ఇందు రాజనుటకు మాఱుగా "రాష్ట్రము" అని యుంచుకొనినయెడలఁ బ్రజాస్వామ్య సిద్ధాంతము తెల్లమగును. శరీరమును, నాత్మయు నొకే యుపాధి కలవి. రెండింటికిని నవినాభావ సంబంధము. అట్లే రాజ, రాష్ట్రములకును నవినాభావ సంబంధము. శరీర మాత్మనర్చింపవలెను. ఆత్మ శరీరమును రక్షింపవలెను. ఇట్టి నిగూఢ రాజకీయభారమీ ఘట్టమునఁ గన్పట్టును. ఈ సందర్భముననే మాతృకలో నిట్లున్నది.

"ఆత్మా జ్ఞేయ స్సదా రాజ్ఞ స్తతో జేయాశ్చ శత్రవః
అజితాత్మా నరపతిః విజయేత కథం రిపూన్"

ఈ భావమును దిక్కన యిట్లు పరివర్తించినాఁడు.

"తనుదాన తొలుత గెలువ
మనుజపతికి వలయుఁ బిదప మార్తుఱ గెలువన్
మనమునఁ దలంచు నదియును
దనుగెలువని పతికి గెలువఁ దరమే పగఱన్." (శాంతి 2-278)

మాతృకలో "జ్ఞేయః" యని యున్నదేగాని జయ ప్రశంసలేదు. కాని ద్వితీయ పాదార్థము మొదటఁగూడ జయ ప్రశంస యుండవలెనని తెలుపుచున్నది. "జయ" ప్రశంస యున్నను "అజేయః" అని పదవిభాగమగును. గాన కోరిన యర్థము వచ్చుటకు వీలులేదు. తిక్కనార్యుఁడు మాతృకలోనియర్థమునకు మెఱుఁగు పెట్టినాఁడే యనవలెను.

రాజధర్మ ప్రకరణమందలి రాజనీతి సార్వకాలీనమగుట కభ్యంతరము లేదు. 87-88 అధ్యాయముల పరమార్థమును 10,62 పద్యములలో ముగించుచు నందీ క్రింది సిద్ధాంతమును నిర్వచించినాఁడు తిక్కన!

"విను కర్షకులును వణిజులును
ననఘా! గోరక్షకులు ధరాధీశునకున్
ధన మొడఁ గూడెడు చోటుల
ననేక విధములకు నెల్ల నాద్యస్థలముల్.

ధనములకు ధాన్యములకు నుత్పత్తి తలము
లయినవాని కించుకయును హాని గాక
యుండఁ దనకును బండార మొదవఁ దగును
పార్జనము సేయ వలయు భూపాలకుండు" (శాంతి 2-391, 392)

రాజు పన్ను లెవ్వరివలన వసూలుచేసి తన బండారమును గూర్చికొనవలెనో యిందుదహరింపఁబడినది. కర్షకులు, వణిజులు. గోరక్షకులు ననువారినుండి పన్నులు గ్రహింపవలెను. గోరక్షకు లనఁగాఁ బెద్ద పశువుల మందలు గలవారు. గొప్పభూస్వాములని పిండితార్థము. రైతులు, వర్తకులు, భూస్వాములు వీరినుండి యెంత పన్ను గొనుటకు వీలుండునో యంత గైకొనవలెను. ఇఁక వాణిజ్యము ధనమునకును, భూమి ధాన్యమున కుత్పత్తిసాధనము లనఁగా నాంగ్లమున "Means of production", వీని కెంత మాత్రమును హాని కలుగఁగూడదని తిక్కన నిర్వచించినాఁడు. ధనవంతుల వద్దనున్న ధనమును సమయముచూచి రాజస్వయముగాఁ జేసికొనవలెనని క్రింది పద్యమునఁ జెప్పబడినది.

"దమియింపఁ దగినవారల
సమయమున దమించి వారిసంపదలు మహీ
రమణుండు తనదు బండా
రముగా సమకూర్చు జనము రాగిల్లంగన్ (శాంతి 2-395)

ఇట్లు గొనిన రాజు ద్రవ్యము నెట్లు వినియోగము చేయవలయును?

"ధనము సవరించినఁ బ్రయో
జనమేమి యపాత్రములకుఁ జల్లి చెఱుచునే
ని నరేంద్ర ముఖ్య వ్యయములు
విను రక్షయ సిరికిఁబాత్ర విషయములై నన్" (శాంతి 2-399)

ఇట్టి నీతిరత్నములకు లెక్కలేదు. రాజనీతియందుఁ దిక్కన యందెవేసిన చేయి యని యుద్యోగపర్వముననే మీకుఁ దెలిసియుండును.

శుకాను ప్రశ్న సందర్భమున శుకునకుఁ బరమధర్మము నుపదేశించునపుడు మాతృకలో నీ శ్లోకము లున్నవి.

"యథా పుష్పఫలోపేతో బహుశాఖో మహీద్రుమః
ఆత్మనో నాభిజానీతే త్వమే పుష్పం త్వమేఫలం
ఏవ మాత్మా న జానీతే త్వగమిష్యే కుత స్త్వహం
అన్యోఽన్యాత్మాంతరాత్మాస్తి యస్సర్వ మనుపశ్యతి
జ్ఞానదీపేన దీప్తేన పశ్యత్యాత్మాన మాత్మనా
దృష్ట్వా త్వ మాత్మ నాత్మానం నిరాత్మా భవ సర్వవిత్
విముక్త స్సర్వ పాపేభ్యో ముక్తత్వచ ఇవోరగః
పరాం బుద్ధి మవా ప్యేహ విపాప్మా విగతజ్వరః

పై శ్లోకములయందలి యర్థమును నీ క్రిందిపద్యమున రసవంతముగా వివరించినాఁడు.

తన కుసుమంబులన్ ఫలవితానము మూర్కొన నాన ప్రాను నే
రని క్రియఁ గాననేరఁడు పరంబగు తత్త్వము నైజభంగి వి
న్ననువున నంతరాత్మగను నైష్ఠికతం గను మింత వట్టుఁ బా
మెనసిన తోలు వాయుక్రియ నీవు దొఱంగుదు పాపపుంజమున్"

(శాంతి 5-183)

మొదటి పాఠమునందలి క్రమాలంకారమర్థవంతము. రమణీయమునై యున్నది. మాతృకలోని క్లిష్టత లేకుండ వర్ణించినాఁడు.

చిరకార్యుపాఖ్యానమునఁ దల్లిదండ్రులయొక్క విశిష్టతను జెప్పుటలోఁదండ్రి కంటెఁ దల్లి కెక్కువ ప్రాముఖ్యము నిచ్చి తల్లి గొప్పతనమునకు మాతృకలోలేని రెండవ కారణము నిచ్చినాఁడు. మాతృకలో యిట్లున్నది.

"యో హ్యాయం మయి సంభూతో మర్త్యత్వే పాంచభౌతికః
అస్య మే జననీ హేతుః పావకస్య యథారణిః"

తిక్కన యనువదించిన విధంబును వినుఁడు.

"కరచరణాది సంఘటితకాయము సంజననంబు వహ్ని పు
ట్టరణికిఁబోలెఁ దల్లిదెస నైనది గాదొకొ యట్లుఁ గాక దు
ర్భరమగు గర్భభేదమును బట్టికినై నిజదేహ చింతపై
భర మొక యింతలేక పడుపాటులు నక్కట యెక్కు డింతకున్"

(శాంతి 5-273)

తిక్కనకుఁ దల్లిదండ్రులలోఁ దల్లియెడలఁ బ్రేమ మొగ్గగా నున్నట్లు తెలియుచున్నది.

ఇపుడు ననువదింపఁబోవు భాగము మిక్కిలి రసవంతమైనది. తిక్కన వర్ణనాచాతుర్య మందుఁ బ్రతిబింబించుచున్నది. సుదర్శనోపాఖ్యామున నగ్ని దేవుఁడు సుదర్శనాకరణము గోరు సందర్భమునఁ దిక్కన నూతన సన్నివేశమును గల్పించి ఘట్టమును రసవంత మొనర్చినాఁడు. మాతృకలో నిట్లున్నది.

"దుర్యోధన సుతా యావ దభవ ద్వరవర్ణినీ
తా మగ్ని శ్చకమే సాక్షా ద్రాజకన్యాం సుదర్శనామ్
భూత్వాచ బ్రహ్మణో రాజన్ వరయామాస తం నృపం
దరిద్ర శ్చాపవర్ణశ్చ మమాయ మితి పార్థివః
న దిత్సతి సుతాం తస్మై తాం విప్రాయ సుదర్శనామ్"

ఇచ్చటనున్న సంగ్రహ కథను విపులీకరించి శృంగారరసమునకు వలయు విభావాదిసామగ్రిని సమకూర్చినాఁడు. మఱియు నగ్నిదేవుఁడు సుదర్శనా లగ్న మనస్కుఁడయ్యెనని చెప్పకుండఁగనే "తా మగ్ని శ్చకమే" అని యున్నది. మాతృకలో నిద్దఱకును సమావేశము జరిగినగదా చిత్తజుఁడు మనమును బ్రేరించును తిక్కన చేసిన యనువాదమును జూఁడుడు.

"విను దానికిఁ బేరు సుద
ర్శన య న్నరనాయకుండు సంప్రీతిమెయిన్
బెనిచి తన యగ్నిహోత్రం
బునఁ బరిచర్యలకు నునిచె బుజ్జవ మొప్పన్" (అను 1-46)

ఈ విధముగా సుదర్శన హుతాశనులను సన్నిధికిఁ జేర్చినాఁడు. ఒండొరుల దర్శనము కలిగినది. అంత నే మయ్యెనో వినుఁడు.

"అర్చించునప్పు డ య్యంగన కెంగేలి
జిగి సొంపు చిత్తంబుఁ దిగిచికొనఁగ
నరసి కనుఁగొనునప్పు డ య్యింతి కనుఁగవ
పొలపంబు రాగంబు వొదలఁజేయ
నన్యులఁ బనిఁ బంచునప్పుడ ముద్దియ
పలుకుల తీపు గోర్కులఁ గెరల్ప

నల్లన యూఁదెడునప్డు డక్కొమ్మవా
తెఱతావి ధైర్యంబుఁ ద్రిప్పుకొలుప
మరుఁడు దోడ్తోడఁ దేఁకువమాలి కదిసి
తూపుగముల క్రొవ్వాఁడిమి సూప నంత
కంత కగ్గలమగు వలవంతఁ దూలి
పోయెఁ బావకుఁ డేమి సెప్పుదు నరేంద్ర! (అను 1.48)

ఇందుభయులకును సంబంధమును గల్పించి యా సంబంధమును ప్రతి దినము వృద్ధియగునట్లు చేసెను. "అంతకంత కగ్గలము" అనుటలో నా సంబంధము క్రమాభివృద్ధి యెట్టిదో చెప్పక చెప్పెను. సీసపద్యముపాదమునందలి పను లన్నియుఁ బ్రతిదినమును జఱుగునవియేకదా! అచ్చతెనుఁగు, సంస్కృత పదములను సగ పాలుగా నుపయోగించి యిది సాధించినాఁడు. అగ్ని కిఁజేయు పరిచర్యాకాలముననే యీ దగ్గఱ సంబంధము కలిగెను. "అర్చించుట," "అరయుట," "పనిఁబంచుట," "ఊఁదుట" యను పనులలో నుపయుక్తములగు సుదర్శనావయవ చేష్ట లగ్నికి వానియొక్క సాన్నిధ్యమును దెల్పియగ్ని దేవుని ప్రేమకు విభావాదులను గల్పించినాఁడు. తరువాత నగ్నిదేవుఁడు సుదర్శనతో నిట్లనెను.

చిగురుటాకుల గాసిసేయు నీ యడుగుల
చెలువంబు సూడ్కులఁ జేర్చుకొనియె
మారేడు పండుల గారాము సెఱచు నీ
యెల చన్నుఁగవ వేడుకల నొనర్చె
ననుఁదీవఁ జీరికిఁ గొనని నీ మైఁదీవ
మురిపెంబు డెందంబు మరులుకొలిపె
నెఱసందురుని నిగ్గువఱుపంగఁ జాలు నీ
నెమ్మోము దాలిమి వమ్ముసేసె
నాతి నీకునై పెక్కు బన్నములు పడితి
నంగజునిచేత వల్లభ వగుము నాకు
నావుడును సిగ్గుగదిరి యాననము వాంచి
యలఁతి యెలుఁగున నిట్లను నా లతాంగి (అను 1-50)

స్త్రీలకంటెఁ బురుషు లీ విషయమున సాహసులనియు, నట్టివాక్యములు వినినపుడు స్త్రీలకు సహజముగాఁ గల్గు లజ్జాదికములను నచ్చతెనుఁగు నుడికారములతోఁ గడు రసవంతముగ వర్ణించెను, రమణీయ పదజాలము చేర్చి

కూర్చినాఁడు. "వల్లభ" పదము సాభిప్రాయము. నన్నేలికొను మని భావము. ఇందులకు సుదర్శను చెప్పు ప్రత్యుత్తరమును వినుఁడు.

"కులకన్యకలకు వేడుకఁ
దలవిళ్ళనఁ బరులతోడి తగుమాటలకుం
దలకొనఁ దగునే గురుజన
ముల కాక త్తెఱఁగువారు పురుషార్థనిధీ!" (అను 1-51)

ఇందు సుదర్శన నుత్తమనాయికగాను, పితృదత్తగాను జిత్రించినాఁడు తిక్కన. క్షత్రియకన్య యయ్యు శకుంతలవలె సుదర్శన యాత్మదత్తకాదు. అంతట నగ్నిదేవుఁడు బ్రాహ్మణవేషమున రాజునొద్దకుఁబోయి కుమార్తెకర మర్థించును. సామాన్యముగాఁ బ్రేమికుల మనస్తత్త్వము నగ్నిదేవునియందును, కులకన్యకల మనస్తత్త్వమును సుదర్శనయందును జిత్రించినాఁడు. ఇట్లు ప్రకరణమునకు వన్నె పెట్టు భాగము లనేకములున్నవి. ఇచ్చటనున్న యౌచితీ నిర్వహణము కడురమణీయము. తిక్కనార్యుని కవితారచన యిట్టి స్థలములఁ గన్పట్టును. తత్త్వమును, వేదాంతమును నెంత సరళముగ వర్ణింప సమర్థత గలిగినను దిక్కనార్యుని సహజప్రతిభ స్వభావోన్మీలనము నందును, సందర్భోచిత భావవర్ణనము నందును, నాటకీయ పద్యరచనమునందును నున్న దని యిట్టిఘట్టములు చాటును. తత్త్వవేదాంతములను, సంగ్రహముగను, మరల విశదముగను వర్ణింపసామర్థ్యమున్నట్లు కూడ స్పష్టముగఁ గన్పించును. అట్టి ఘట్టములందుఁ గూడ మాతృకకు మెఱుఁగు పెట్టెనని పై యుదాహరణములు కొన్ని తెలుపుచున్నవి. కాని సమయము, ప్రకరణము, నవకాశము వచ్చినప్పుడు మాత్రము తన సహజమగు రచనా పద్ధతిలోనికి దిగును. సుదర్శనోపాఖ్యానమున నట్టి యవకాశము లభించినది. విజృంభించినాఁడు. ఈ ఘట్టము వ్రాసిన వెంటనే యిట్టి యవకాశములను గల్పించి ప్రతిభ చూపవలెనని బహుశః తోఁచియుండును. అందువలననే మాతృకలో లేకపోయి, నప్పటికిని సమయము కల్పించుకొని గరుత్మంతుని చరిత్రను గైకొని వర్ణించినాఁడు. (శ్రీకృష్ణ భారతమున నిదిలేదు.) వెంటనే దానినిఁ గొని వ్రాయుట చూడ యాయన యిచ్ఛ తీవ్రమైనట్లు తోఁచును. అట్లుద్భవించిన తన కోరికను దీర్చుకొనెను. దైవపౌరుషకదనము నకును, భంగాస్వినోపాఖ్యానమునకును నడుమ మాతృకలో గరుత్మంతుని చరిత్రకానరాదు. తరువాతనైన శివమాహాత్మ్య కథనము వఱకున్న యధ్యాయము లన్నియుఁ జిన్నవి. శివమాహాత్మ్య కథనమని కొన్ని ప్రతులలోనున్న 14,15,16 అధ్యాయముల కథను స్వాధ్యాయ మండలి ప్రచురణము మేఘవాహన

పర్వమని పిలచుచున్నది. ఆయధ్యాయములలో మేఘవాహనుని చరిత్ర కలదు గాన, నా పేరిచ్చియుందురు.

గరుత్మంతునిచరితము భారతమున వచ్చుటది మొదటి పర్యాయము కాదు. కర్ణజనన వృత్తాంతమువలె వినతాకద్రూవృత్తాంత మనేక మాఱులు వచ్చినది. ఈ ఘట్టము సంగ్రహముగను రసవంతముగ నున్నది. కద్రూవినతల శీలములును, గరుత్మంతుని మాతృభక్తియు సాహస కృత్యములును నిందుఁ గన్నులకుఁ గట్టి నట్లు వర్ణింపఁబడినవి. గరుత్మంతుని పుట్టువు నిట్లు తెల్పినాఁడు.

"ఘనతర కంధరుండు దృఢకాయుఁడు దీప్తముఖుండు రక్తలో
చనుఁడు మహోత్తమాంగకుఁడు చారుసుసంగత పక్ష సార మం
డనుఁడు పరిస్ఫురద్ద్యుతి విడంబిత బాలదివాకరుండు లో
క నయన పర్వ నిర్వహణకారి సుపర్ణుఁడు పుట్టె భూవరా!" (ఆను 1-177)

ఉల్లేఖాలంకారము నుపయోగించి గరుత్మంతునికిఁ దగిన యుదాత్తత కల్పించినాఁడు. కద్రూవినతల మున్నీటిచేరువ వనవిహారమును వినుఁడు.

"చంచుల జిగురాకుఁ జించియాడుచు నలి
నెలుఁగించు గండుఁగోయిలల సొంపు
నలరుఁ దేనియఁ గ్రోలి యున్న సోలంబుల
మురియు తేఁటుల నునుమ్రోఁత యింపుఁ
దమిఁ బండ్లరస మాని తమలోనఁ జెలఁగుచుఁ
బలికెడు రాచిల్క పటురవంబుఁ
గొలఁకుల గెలకులఁ గూడి క్రీడించుచుం
డెడు నంచతండంబు నడబెడంగుఁ
దరఁగఁదేలుచుఁ బూదీవఁ దగులఁబడుచు
వచ్చు చిఱుగాలి సోఁకును మెచ్చి మెచ్చి
తగిలి కొనియాడుచును వినతయును గద్రు
వయును మున్నీటీ చేరువ వనమునందు (ఆను 1-181)

ఇందు మొదటి రెండు పాదములకు నంత్య నియమము. తర్వాత రెండు పాదములకును నంత్యనియమము 'ల'కార మనేక మారులు వచ్చి పద్యమునకు స్వారశ్యమును జేకూర్చినది. సరసమైన యచ్చతెనుఁగు పదములతోఁ బద్యమును వెలయించినాఁడు. అచ్చటఉచ్చైశ్రవమును జూచిరి. అది యిట్లున్నది.

"కరువునఁ బోసిరో విధునికాంతి సుధాబ్ధి తరంగఁ దెచ్చి గం
డరు బొనరించిరో హరుజటాస్థలికిం దొడవైన యేటి పె
న్నురువునఁ జేసిరో యన మనోజ్ఞ సితచ్ఛవి నుల్లసిల్లు సుం
దర తురగోత్తమంబు దవుదవ్వులఁ గాంచిరి చారులోచనల్."

(ఆను 1-183)

ఈ పద్యమునందలి యుత్ప్రేక్షాపరంపర కడుంగడు రమణీయము. రసవంతము. "కరువు, గండరువు" అను నచ్చ తెనుఁగు పదము లీ పద్యమునకు వన్నె దెచ్చుచున్నవి. మఱియు "చారులోచనల్" అను విశేషణము సాభిప్రాయము సమంజసము, లోచనములచేఁగదా వారా గుఱ్ఱమును జూచిరి! సుందరలోచనములచేఁ జూచి రనుటలో వారి దర్శనాసక్తియు, వారి నేత్ర సౌందర్యమును ధ్వనించుచున్నవి. ఈ పద్యమే కావ్యమునకు వన్నె తెచ్చునదికాదు! అంతట సవతులిర్వురు పన్నిదమ్మును గద్రువచేసిన మోసమును, గద్రువ పుత్రులను శపించుటయు మోసముఫలితముగాఁ గద్రువకు వినత సేవ చేయుటయు, మొదలగు కథయంతయు సంగ్రహముగాఁ దెల్పి వర్ణనమునకును, విపులీకరణమునకును, ననువైన యమృత భాండానయన వృత్తాంతము నెత్తుకొని బహురమ్యముగా వర్ణించినాఁడు తిక్కన. గజ కచ్ఛపముల పోరు కండ్లకుఁగట్టినట్లు వర్ణించి తన సహజసుందర యుద్ధవర్ణనా కౌశలమును జూపినాఁడు. బమ్మెర పోతనామాత్యుఁ డీ వర్ణనమును దన గజేంద్ర మోక్షమునందలి గజమకర యుద్ధమునకుఁ దీసికొనియుండునని నా యూహ. ఈ క్రింది పద్యమును గమనింపుఁడు.

"దంతి సనంగ భూరి మదధారల గాలి యెఱింగి కూర్మ మ
త్యంత సముద్ధతిం గొలని కడ్డుపడన్ వెస వచ్చె వచ్చినన్
దంతియు నీరువట్టున నుదగ్రపుఁ గోపము సందడింప దు
ర్దాంత సముద్యమం బెసఁగ దానిపయిం గవిసెన్ మహోగ్రతన్.

కవిసి ఖరంబులైన మునిగాళ్ళను వ్రేయఁగఁ సాము నీరిలో
ను వెడల కుండి కూర్మ మతనును స్థిర తీవ్ర నఖంబులం బదా
గ్రవిదళనంబు సేయఁగఁ గరంబున మోఁదఁగ వారణంబు దం
త విహతి నొంపఁ గచ్ఛపము దారుణమయ్యె రణంబు భూవరా!"

(ఆను 1-231, 232)

ఇఁక గరుత్మంతుఁడు రెండింటిని మోఁదిన విధంబును జూడుఁడు.

"ఇమ్మెయిఁ బోరి పోరి మది నేపును గోపము నగ్గలింపఁ గూ
ర్మమ్ము గడంగి నీర్వెడలి మత్తకరిన్ వడి నాక్రమింపఁగాఁ
గ్రమ్మన రెంటినిఁ బొదివి కచ్ఛపమున్ వలకాల వామ పా
దమ్మున వారణంబును ముదమ్మునఁ బట్టి తగిల్చె గోళ్ళులన్.

పెలుచన్ గోళులనొత్తియ గ్గజముఁ దాఁబేలుఁ వసంబేది మూ
ర్ఛల నొందన్ వెస నెత్తి మేఘయుగళీ సక్తోల్లస ద్దైరికా
చల వైహాయసకేలియో యన నభస్సంచారియై యుబ్బు న
గ్గలికన్ దవ్వుగఁ బాఱి యొక్క ఘనవృక్షం బయ్యెడన్దోఁచినన్."

(అను 1-233, 235)

ఈ పద్యములందును జరిగినపోరును, గరుత్మంతుఁడు రెండింటినిఁ బొదివిన తీరును మిక్కిలి రసవంతముగను, గండ్లముందఱ జరుగుచున్నట్లును జిత్రింపఁబడి నవి ఈ వర్ణనమును జదివి గజేంద్రమోక్షమునందలి వర్ణనమును జూచిన రెండింటి యొక్క సామ్యము కనపడక మానదు. నారదుఁడు గరుత్మంతుని తల్లి దెస విడుదలకై యత్నింపుమని చెప్పిన విధమును వినుఁడు.

"దాసియై సవతాలికిఁ దల్లి పనులు
సేసి నలఁగంగ నద్దెసఁ జింత వంత
లేక నీ విట్లు తిరుగుట లెస్స యగునె?
యద్భుతోజ్జ్వల తేజ! కశ్యపతనూజ!" (అను 1-205)

ఈ పద్యము ప్రతిపద రసవంతము. "దాసియై", "సవతాలికి", "పనులు సేయుట", "నలఁగుట" మొదలగు శబ్దములు గరుత్మంతుని తల్లి సేయునట్టి దాస్యములోని నైచ్యమును, గారిన్యమును వ్యక్తము చేయుచున్నవి. కశ్యపుని భార్య దాస్యము చేయుట! "మీ తండ్రి యంతవాని భార్య" యని తుది సంబోధన చెప్పుచున్నది. గరుత్మంతుఁ డెట్టివాఁడు? "మహోజ్జ్వల తేజుఁడు", అందుచే "నీతండ్రికి భార్యయై నీ యంతవానికిఁ దల్లియైనది" యామె! చేయుచున్నది దాస్యము! ఎవరికి? "సవతాలికి". ఎట్టి దాస్యము? నలఁగు నంతటి దాస్యము". దానిని "చింతవంత" లేక తిరుగుచున్నాఁడు గరుడుఁడు. ఏమైనఁ బనిచేయుచున్నాఁడా? లేదు. ఊరక తిరుగుచున్నాడు. ఎంత యర్థవంతముగ రచించెనో చూడుఁడు. ఇట్లు పురికొల్పిన నభిమానము కలుగకుండునా! ఈ విధముగ రసవంతమైన తెనుఁగు సేఁత తిక్కనార్యునిది.

తరువాత నష్టావక్ర చరిత్రము కూడ నిటువంటి ఘట్టమే. మూఁడధ్యాయములఁ కథను 30 పద్యములలో రసవంతముగ సంతరించెను. స్త్రీ స్వభావము మాతృకలో నతి విపులముగా నున్నది. కాని దానినంతను దిక్కన యొక్క పద్యముతో ముగించినాఁడు. దీని వెనుకటి ఘట్టము, అనఁగా భంగాస్వన చరిత్రకూడ స్త్రీస్వభావ వర్ణనమునకు సంబంధించినదే!

వనితలు కామార్తి వశతఁ బొంది
వంశహానిఁ దలంపరు వరున కలుక
రాత్మజులఁ జూడ రగ్రజుఁ ననుజుఁగొనరు"

(అను 2-17)

ఇది కొంచె మతిశయోక్తిగఁ గనఁబడినను నిందు లోకవృత్త మెఱింగినవారికి సత్యమున్నదని తోఁచును, సోదరీమణులు నన్ను మన్నింతురుగాక! అష్టావక్ర పాత్రము మిక్కిలి యుదాత్తమైన ఘట్టము. స్వచ్ఛంద యగు నుత్తరదిశయు, స్వచ్ఛుఁడగు నష్టావక్రుఁడును విరుద్ధ స్వభావములుగల పాత్రలు, వారి పరస్పర సంభాషణము మిక్కిలి హృదయంగమము. ఒకరి నొకరు జయింప నుద్దేశింతురు. కానఁ దుదకు సుశీలయే గెలిచెను అష్టావక్ర పాత్రపోషణమును వరవడిగాఁ గొని ప్రవర పాత్రను దీర్చి దిద్దినాఁడు పెద్దనయని నా యూహ. చూడుఁడు.

"పదపడి నయమున మెయిమెయిఁ
గదియించి లతాంగి చిక్కఁ గౌఁగిట చేర్పం
గదలని చిత్తముఁ గలిగియు
మద మేమియు లేక యతఁడు మ్రాన్పై యుండెన్" **(అను 2-14)**

కౌఁగిలించిన కాంతను ద్రోసి పడవేసిన ప్రవరునికంటె నితని ప్రవర్తన యెక్కువ చిత్తస్థైర్యమును జెప్పక చెప్పుచున్నది. "అశిథిలపరిరంభము"ను జెప్పఁ దలఁచి "మెయి" శబ్దద్విరు క్తితోఁ గార్యమును సంతరించినాఁడు తిక్కన "మ్రాన్పై యుండెన్" అని వెనుకటి పరిరంభముయొక్క వైఫల్యమును దెలిపినాఁడు. అందులకై "కదలని చిత్తము." "మదము లేకపోవుట" యను కారణములను దెల్పు కావ్య ....తోఁ గార్యమును, సాధించినాఁడు. అష్టావక్రపాత్ర మాదర్శ బ్రహ్మచారి పాత్రము తాను ప్రేమించిన కన్యయెడల నతని కెంత గాఢరతి యున్నదో తెల్పియాయన రతి కవిదిత వేద్యాంతరత్వమును గల్పించి స్థాయి భావమును బోషించినాఁడు. ఇట్టి యుదాహరణము లనేకము లియ్యవచ్చును. ఇఁక నొకటి రెండుదాహరణముల నిచ్చి యీ భాగమును ముగింతును.

గంగావతరణ ఘట్టమున నా నది భువి కెట్లు వచ్చెనో యొక్క పద్యమునఁ దెల్పినాఁడు.

"విష్ణు పదమువలన విధునివలన సూర్యు
వలన మేరురూప కలితుఁడైన
విష్ణువలన త్రిపురవిజయ మౌళివలన
నుండి హిమనగమున నొలసె గంగ. (అను 2-118)

"విష్ణు పాదోద్భవ" గంగ వైకుంఠమున నున్నది. అచ్చటినుండి హిమవత్పర్వతమున కెట్లు క్రమముగా వచ్చెనో యీ పద్యము వర్ణించుచున్నది. ఇది తిక్కనార్యుని ప్రకృతి పరిశీలనమును, స్వాభావిక వర్ణనాకౌశలమును జాటుచున్నది. ఇట్టి స్థలము లనేకములు కలవు. "ఇంతిం తై వటుఁడింతై" అను భాగవత పద్యమును స్ఫురింపఁ జేయుచున్న దీ పద్యము. ఆచారాధ్యాయము తప్పక ప్రతి స్త్రీయుఁ బురుషుఁడును జదువఁదగినది.

"ఇన్ని యాచారములలోన నెక్కుడండ్రు
సకల భూతంబులందును సదయుఁడగుట
యాదిమును లట్లుగావున నఖిలవర్ణ
ములకు దయకల్మి పెద్దయు వలయు గుణము" (అను 4-18)

అహింసాప్రభావ మిందు వర్ణింపఁబడినది. సమస్త ధర్మములు నహింసలో నిమిడి యున్న వనుటకుఁ జక్కని యుపమాలంకారమును వాడినాఁడు. పద్యరసములను జిప్పిలఁజేయు రచన చేసినాఁడు.

విశేషములు

ఇఁక దిఙ్మాత్రముగాఁ దిక్కన నుడికారముల విశిష్టతను, నలంకార విన్యాసమును జూపుదును. వెనుక "కరువు" "గండరువు" "పాము" మొదలగు కొన్ని పదములను వినియున్నారు. అనేక పదము లిప్పుడు వాడుకలో లేనివి తిక్కన యుపయోగించినాఁడు. ఒకవంక భాష విశాలమగుచున్నదని మనము సంతసించు చుండఁగా దేశీయములై భాషకు నాయువుపట్టులైన యనేక పదములు విస్మృతము లగుట యాశ్చర్యము గొల్పక మానదు. "శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారును, కీ శే. శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారును, శ్రీ మల్లాది సూర్యనారయణ శాస్త్రి గారును ననేకములైన విశిష్ట పదములను బ్రయోగములను నిచ్చియున్నారు. తిక్కన ప్రయోగములను బదములను నన్నింటి నిచ్చుట యిచ్చట సాధ్యముకాదు. కొన్ని మాత్రమే యిచ్చట సంభవము.

1. "ఆఁగు ఈ పదము "ఆపు" అను నర్థమున నుపయుక్తమైనది. (శాంతి 5-179, 6-264)
2. "సుఖమునప్పుడు, దుఃఖంబున యపుడు" ఇందు మధ్యనున్న నుగాగమ, యడాగమములు. (శాంతి 5-489)
3. "అగుగామి" అగుట, కాకపోవుట యను నర్థమునం దుపయుక్తమైనది. (శాంతి 6-171)
4. "నాదు చొచ్చుట" ప్రథమ యిప్పుడు వాడుకలో నున్నది. "నేనుచొచ్చుట" (శాంతి 6-202)
5. "నను బొంకగుట" ప్రథమార్థమునందు ద్వితీయ యుపయుక్తమైనది (శాంతి 6-209)
6. "కావుట" = ఆగుట. (శాంతి 6-270)
7. "ఒఱగనాడుట" = తప్పుకొను మాటలాడుట.
"ఒఱగుట" = స్థానమును దప్పుట. (అను. 1-29)
8. వడ్డోడి" "వడ్డొడ్డి" = వెల్లివిరిసి. (అను. 2-416)
9. సోడుముట్టుట" = వ్యాపించుట, "సోడు" అనిన "తల" యని యర్థము. ఇప్పుడు మనము "తలపట్టినది" యందుము. (Ibid)
10. "మడ" = నదిపాఱు "అలుగు" ప్రవాహమార్గము. (అను 2-452)
11. "చిట్టలు" = ఆశ్చర్యము, వింత. (అశ్వ. 1-21)
12. "గనప" = పెద్ద (అను. 2-460)
13. "బుజ్జవము" = బుజ్జగింపు. ఉపలాలనము. (అను. 1-46)
14. "కుంతి యట్టులకై వడి" రెండుపమావాచకముల యుపయోగము. (శాంతి 1-12)
15. "తలవీడులు", "తలవీళ్ళు" = సమీప ప్రదేశము. (అను. 1-51) ఇపుడు "తలవాకిలి" యని యుపయోగించుచున్నాము.
16. "తళియ", "భోజనము" విశిష్టాద్వైతుల పరిభాషలోని మాట. (శాంతి 1-64)
17. "హజ్జ" = కాలు దాచినప్పటి యడుగు. (శాంతి 2-239)
18. "కొఱవి" = కోరి, సమ్మతించి (శాంతి 5-310)
19. "కుప్పగూరలు" = కుప్పలు, (అశ్వ. 1-31)

20. "కింకిరవడుట" = అసహ్యాపడుట (అను. 1)

21. "కరువు" వెనుక "అచ్చు" అనువర్తమున నున్నది. ఇప్పుడు "పిండుము" అను నర్థమున నుపయుక్తము (అను. 7)

ఒకచోఁ గొలతల పేర్లుకలవు. వానిలోఁ గొన్ని యిప్పటికిని వాడుకలోఁ నున్నవి.

"పుట్టి", "కుంచెఁడు", "మానెఁడు" (ఆశ్వ. 4-221)

ఇట్లెన్నిపుటలైన నింపవచ్చును.

తిక్కనార్యుఁడు వ్రాసిన యీ భాగమునఁ గవితాధార యెంతమాత్రమును బ్రయత్నమును గనుపఱుపదు. ఆయన మాటలాడుచుఁ బోయిన యతిప్రాసములు తమంతటఁదాము వచ్చి నిర్ణీత స్థానముల నిలిచినట్లు కనఁబడును. విరాటోద్యోగములలోఁ బ్రయత్నమును జూడుఁడు. అచ్చుటఁ దిక్కనార్యుఁ "డిట్లు వ్రాతును" అని వ్రాసినట్లు కనబడును. అట్లని యిచ్చుట నుద్దేశ్యమే లేదనుకొనరాదు, వెనుక ననేక స్థలముల నాయన వివేచనాశక్తినీ, యౌచితీ నిర్వహణమును జూచినాము. "అప్రయత్నముగాఁ గనబడుటయే" కళకు లక్షణము, ఆంగ్లమున "Art consists in concealing art' అని యొక నానుడి యున్నది. తిక్కనార్యుని కవిత్వమున కది వర్తించును. ఆ పద్ధతి యీ భాగమున స్పష్టముగఁ గనఁబడును. ధారావాహిక శైలి కీ క్రింది పద్యములను జూపవచ్చును. "యతి ప్రాసంబులకుఁగాని సందర్భోచిత పదంబులకుఁగాని తడువుకొనక వచన రచన శైలివలె నడచుట" తిక్కన కవితాశైలి విశిష్టత యనినారు మల్లాదివారు (ఆ.మ.భా. పీఠిక P. XX)

"సవినయంబునఁ దనశక్తితో గురునకు
దక్షిణ యిచ్చి యాతండు వనుపఁ
గా సమావర్తన కార్యంబునడపి వి
వాహమై హవ్యకవ్యముల నతిథి
తోషణ బాంధవపోషణంబుల సత్య
భాషల నిజదార పరతఁ బుత్ర
సంశిక్షఁ గ్రతు విశేషంబుల నొక యాయు
రంశంబు గడపి గృహస్థ ధర్మ

వృత్తిఁ గృతకృత్యుఁడగు నగ్ని విడువ కడవి
బూరిపంటల ఫల మూలములను భిక్షు

పూజ సలుపుచుఁ బరిశిష్టములు భుజించి
తపము సేఁత వానప్రస్థ ధర్మసరణి". (శాంతి 5-139)

అపుడు మందాకిని సాకార యై వచ్చి
మంగళస్నాన సమన్వితుఁడుగ
నొనరించె నాకసంబుననుండి పడియెఁ గృ
ష్ణాజిన దండంబు లతని యెదుర
దివ్య దుందుభులును దేవాంగనా గాన
ములును వీతెంచె నద్భుతముగాఁగఁ
గుసుమ వర్షంబులు కురిసె నింద్రాది దే
వతలు గారవమున వచ్చి రంబి
కాసమేతుఁడై యేతెంచిఁ గామవైరి
యతని నుపనీతుఁ గావించె నమరనాథుఁ
డుజ్జ్వలంపుఁ గమండలు వొసఁగె నిచ్చి
రమరు లెన్నండు మాయని యంబరములు. (శాంతి 6-252)

ఇట్లెన్నియేనిఁ బద్యముల ననువదింపవచ్చును.

తిక్కన యుపయోగించు నుపమాలంకారములు సందర్భమును మనసున కెక్కించి సంతసము గొల్పుటయే గాక మిక్కిలి రమణీయములై, వాల్మీకి యుపమలను స్మరింపఁజేయును.

"మణిమయములుఁ గనకమయములు రజితమ
యములు మఱియు మృణ్మయాదికములు
నైన పెక్కుపూసలందుఁ ద్రాడున్నట్లు
భూతకోటియందుఁ బురుషుఁ డుండు" (శాంతి 4-194)

అంతర్యామి రూపము చిత్రింపఁబడినది.

"బాలపుత్రులఁ దండ్రియుంబోలె" నింద్రియముల నాపవలయును.

(శాంతి 5-179)

"విను పాంసూదకముల చా
ద్పున జతుకాష్ఠములభంగి భూతంబులకున్
మనుజేంద్ర కలుగుఁ బొందు" (శాంతి 6-192)

"అగ్ని వెచ్చనా? చల్లనో? యని మనమునఁ
గరము సందియ మందుట గాదె నిన్ను
నధిప ముక్తుండవో? కావొ? యని తలంచు
టది మదీయ బాలిశ భావ మని తలంపు" (శాంతి 6-216)

"తాను యోగబలంబున ననేకంబులైన గిరి సరి
దరణ్యంబులు గడచి యెందునుఁ దగులువడక
కార్ముక జ్యా వినిర్ముక్త శరంబు చిందంబున నేతెంచుటకు"
(శాంతి 6-295)

"ఎట్టినవ్వు తన మోమున దమ్మికి లేఁత యెండయై" (అశ్వ 4-8)
మోము సూర్యునివలె నున్నదని యలంకార ధ్వని.

ఈ క్రింది మాలా రూపకంబును గనుఁడు.

"యాన పాత్రంబుగా దీని (సాంఖ్యమును) నవలంబించిన యార్యుండు, ప్రజ్ఞా కర్ణధార సామర్థ్యంబున, దుఃఖౌదకంబును వ్యాధి మృత్యు మహాగ్రాహంబును, భయోరగంబును, హింసావేగంబును, రాగపంకంబును, దృష్ణావర్తంబును, నానాప్రీతి రత్నంబును, సత్యతీరంబును నగు సంసార సాగరంబు నుద్ధరించి" (శాంతి 5-613)

తిక్కన యౌచితీ నిర్వహణమును, సందర్భోచితత్వమును జూపుటకుఁగొలఁది యుదాహరణముల నిత్తును. కృష్ణుఁడు ద్వారకకుఁ బోయినప్పుడు వసుదేవుఁడు భారత యుద్ధమును జెప్పుమని యడుగ సంగ్రహముగాఁ జెప్పెను. చెప్పునప్పుడు "లఘుతరోక్తులఁ" దెల్పెదనని ప్రతిజ్ఞచేసెను. అ య్యదును విపులముగాఁ జెప్పుఁటకుఁగాలముగాదు, అనంతర కథ కాలస్య మగును. తిక్కన యిక్కడ 19 పద్యములలో యుద్ధమును ముగించెను. ఇరువాగుల సేనా సంఖ్యయుం సేనానులెవరెన్ని దినములు సంగ్రామము చేసినదియు, నెట్లు మరణించినదియు, దుర్యోధనునకును, భీమునకును, ద్వంద్వ యుద్ధమున దుర్యోధనుండు మడియుటయును, సౌప్తికపర్వ వృత్తాంతమును, దుద కిరువాగుల నెవరెవరు మిగిలినదియు, నంతయు నింతలో ముగించెను. ఇది భారత రణప్రకారంబు", (అశ్వ. 3-121 నుంచి 129)

ధర్మదేవత యతిథిగా వచ్చి యోఘవంతి పొందు గోరినప్పు డామె భర్త యింట లేనందున నామెవడిన తల్లడమును, తత్తరమును నీ క్రింది పద్యమున వివరించెను.

"సతి తన పతి వచనంబులు
మతిఁ జొనుపున్ దెంపుమాను మాన వెఱచు న
య్యతిథి పనుపు సేయక త్రో
చు తలంపలవఱుచుఁ జేయఁజూచున్ దలఁరున్" (అను 1-72)

అధిక సంఖ్యాకములగు హ్రస్వాక్షరములతోఁ బద్యమును గూర్చి యామె హృదయము నందలి వెనుక ముందులను రసవంతముగా వర్ణించినాఁడు. (చూ. అడిగెదనని కడు వడి జను.)

కథను త్వరితగతిని నడుపుటలోఁ తిక్కన దిట్ట. ఈ క్రింద పద్యము గూడ పై ఘట్టములోనిదే!

"పేర్కొని పలుమాఱుఁ బిలచి యో యనుటలే
కున్న నయ్యింటిలోఁ గన్ను వఱపి
వల్లభఁ గానక వహ్నితనూజుఁడు
దలఁకొంది ప్రేముడిపలుకు వలుక
నతని నుద్దేశించి యతిథి నా కాతిథ్య
మొనరించుచున్నది వనిత నీవు
గృహధర్మ విదుఁడవు కినియకుమయ్యః మ
మ్మనుఁడు నప్పరమ పుణ్యాత్మకుండు

నీదు కతమున నేను సమ్మోద మగ్న
మానసుఁడ నైతి నతిథులు మహితపూజ
నములు గాంచిన గృహములు విమలతరము
లంద్రు బుధు లింత యెఱుఁగుదు నట్ల నడతు." (అను 1-76)

పరీక్షి న్మరణఘట్టమును గరుణరస పూరితముగ సంతరించెను. అందంతః పుర స్త్రీల విలాపములు మిక్కిలి స్వభావసిద్ధములై యున్నవి. రెండుమూఁడు దాహరణముల నిత్తును.

"పద్మనాభుఁడు వచ్చిన బాలుఁ జంకఁ
బెట్టుకొనిపోయి మ్రొక్కింతుఁ బ్రీతియెసఁగ
నని తలంచుచు నుండితి న మ్మనోర
థంబు విఫలంబుగాఁజేసె ద్రౌణిపేర్చి

తాత లోకగురుఁడు దామోదరుఁడు వచ్చి
యుండ వేచి మ్రొక్క వుజ్జ్వలాంగ
ధర్మవేదియైన తండ్రికిఁబుట్టి య
ధర్మ పరుఁడ వగుట తగునె నీకు
కనువిచ్చి గొంతిఁ జూడుము
ననుఁ జూడుము ద్రుపద నృపతనయఁ జూడుము నీ
జనకుని తల్లి సుభద్రం
దనయా! చూడు తలయెత్తి దరహాసముతోన్" (ఆశ్వ. 3-182, 184, 185)

ఎంత హృదయవిదారక వాక్యములు! ఏ తల్లి కన్నుల నీరు గారదు?
శబ్దార్థ శ్లేషలయందుఁ దిక్కనకు వైముఖ్యము లేదు.
ఇందులకొక యుదాహరణ మిత్తును.
ఇంద్రుఁడంబరీషునకు సుదేవ వృత్తాంతమును దెలుపు ఘట్టమున నిట్లున్నది.

పసఁగన్ వేచని దోర్బలంబున రణ ప్రావీణ్యముం జూపి నీ
వసురానీకముఁ ద్రుంచి భూప్రజలకున్ హర్షంబు గావించిరా
క సుమీ రాక, జయంబులేక ప్రజ దుఃఖంబొందగా రాక నీ
యసువర్గంబుల పోకగా నెఱుఁగు పెక్కాడంగ నిం కేటికిన్"

(శాంతి 2-433)

ఇందు "క" పై వృత్త్యనుప్రాసము "రాక" పై శ్లేషించినాఁడు. ఇట్లెన్నియో విశేషములను జూపవచ్చును. మఱియు శ్లేషాది కావ్యగుణములలోఁ దిక్కన రచన యందు లేని కావ్యగుణము లేదు. తిక్కన తెనుఁగు నుడికారముల నెక్కువగా వాడి నను "తద్దహన భీకర భూరి శిఖాప్రవేశ సంజాత దురంత తాపము" వంటి దీర్ఘ సంస్కృత సమాసములును నెన్నియో గలవు. కాని యవి యన్నియు నా యా సందర్భముల కుచిత మనుటలో సందేహము లేదు. తత్త్వ వేదాంత నీతులతో నిండిన యీ భాగముల నింత రసవంతముగా రచించె ననినఁ దిక్కన రచనా చాతుర్య మసమానమని తప్పక చెప్పవచ్చును. ఈ భాగమునందలి యుద్ధ వర్ణనములు వచ్చినపుడు వెనుకటి యుద్ధపంచకములోని ప్రతిబింబములు కన్పడును. ఆశ్వమేధిక పర్వమునఁ ద్రిగర్త సింధు దేశాధీశులపైనను బభ్రువాహనుని తోను జరిగిన యుద్ధములలో వెనుకటి యుద్ధవర్ణనములు తప్పక జ్ఞాపకమునకు వచ్చును. ఒక్క పద్యము నుదాహరణముగా నిచ్చి తృప్తిచెందుదును.

సారథిఁ గూల్చి యశ్వములఁ జంపి రథంబుఁ బగిల్చి కేతువుం
జీరి శరాసనంబుఁ బొడిచేసిన నమ్మగధుండు ధీరతో
దారగతిన్ సముజ్జ్వల గదాభ్రమణంబున బాహువొప్పన
వ్వీర వరేణ్యుపైఁ గవిసె విక్రమ మాకృతిఁ దాల్చి పోల్చెనాన్". (ఆశ్వ. 4-104)

పూజ్య మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు తమ మహాభారతమునఁ బీఠికలోఁ దిక్కన కవితా విశేషముల నీ క్రింది విధముగా నిచ్చినారు.

(1) వివిధ శైలి, ముఖ్యముగా ప్రవాహగతి

(2) ఒక్క యక్షరమే పూర్వపదమునందలిది, పూర్వపాదములో మిగిలిపోవుట.

(3) ధారావాహికగ నుండుట.

పై గుణముల కన్నిటికి వెనుకనే యుదాహరణముల నిచ్చియున్నాను. ఆంగ్లమున ధారవాహికశైలిని "Run on verse" అందురు. అనఁగాఁ గావ్యము పరుగులిడుచు నడచుట, పైమూఁడింటిలో 1, 3 గుణములు సమానము లనవచ్చును. ఆంగ్లమున నట్టి గుణ మొకయుత్తమకావ్యగుణము. మిల్టన్, షేక్స్పియర్ మొదలైన యుత్తమ కవులీ గుణముతో రచియించినారు. ఆ గుణము తిక్కనార్యుని రచనలో మెండుగా నున్నదని యిప్పటికే తెలిసియుండును. శ్రీ వీరేశలింగం పంతులుగారు తిక్కన రచించిన గ్రంథ విస్తార మితరులకు సాధ్యమేయైనను యాయన శైలితో సమానముగ వ్రాయవలె ననిన నెవ్వరికిని సాధ్యము కాదని గట్టిగ వ్రాసినారు. (ఆం. క. చ. 1; పేజి 142) "ఎచ్చట నే విశేషము నుంచి, యేరీతి నే పదమును ప్రయోగించి రసమును బుట్టింపవలెనో యాతనికిఁ దెలిసిన ట్లితరులకుఁ దెలియదు." అని కూడ నొక్కి చెప్పినారు. ఇది ముమ్మాటికిని నిజము అందులకుఁ గూడ వెనుక నుదాహరణములతో నిదర్శనములను గనుగొంటిమి.

ఉత్తమ మహాకావ్యము ధర్మశాస్త్రము

రమణీయతాది యితర లక్షణములతోఁబాటుత్తమ కావ్యములకు సార్వజనీనత్వ సార్వకాలీనత్వములు ప్రధానలక్షణములు. ప్రపంచమునందలి యుత్తమ కవుల కావ్యములన్నియు నీ గుణములు కలవే! హోమర్, డాంటే మొదలయిన కవుల కావ్యముల కీ రెండు గుణము లుండుటవలననే యింత వఱకును బ్రపంచమున నుత్తమ కావ్యములుగఁ బరిగణింపఁబడుచున్నవి, వాల్మీకి వ్యాసాదులును, గాళిదాస భవభూతులును నట్టివారే! ధర్మము సార్వజనీనము,

సార్వకాలీనము, అట్లే మానవ స్వభావమును, ధర్మము మానవ స్వభావము నను నీ గుణద్వయము మహాభారతమున నున్నవి. వీనితోఁ బాటు కావ్యానందమ ననదికూడ రామయణ భారతాదులయందుఁ గలదు (History of Indian Literature Dr. Winternetz Vol 1, P. 321). తిక్కన తన తెనుఁగు సేఁతలో నీమూఁడు గుణములను సమగ్రముగ నెలకొల్పినాఁడు. కావున తిక్కన రచిత భారతమునందు సుహృత్సమ్మితముగ ధర్మమును బోధించు పురాణేతిహాస గుణమును గాంతా సమ్మితముగ బోధించు కావ్యత్వమును సమగ్రముగా నున్న వనిన సత్యము చెప్పుటయే యగును. (History of Indian Literature Dr. Winternetz Vol 1, P. 424) ఇదియే యాంధ్ర మహాభారతము యొక్క విశిష్టత. ఈ రెండు ధర్మములను సంతరించినకవిత్రయము వారి రచన యాదర్శ రచన యగుటలో నతిశయోక్తియేమున్నది? వారందుచే నాదర్శ కవులైరి, స్తుత్యులైరి. వందనీయులైరి అనుకరణీయులయిరి.

మహాభారతము, అందును నాంధ్ర మహాభారతము, అందును దిక్కన రచియించిన భాగములోనే సర్వధర్మసంగ్రహము కలదు. శాశ్వతముగా నార్థిక సాంఘిక, రాజకీయ, నీతి సమస్యలకు సమాధానము లందు దొరకును. అందును నన్నిటికిని మూలభూతములగు భావము లందుఁ గలవు. ఇందులకుఁ గొంచెముగాఁ దార్కాణముల నిత్తును. ఇప్పుడు మనదేశమునకు ముఖ్యమైనది ప్రజారాజ్యసమస్య. అందునూ సోషలిస్టువిధానసమస్య, ఇటీవల భారత జాతీయ కాంగ్రెస్‌కూడ నీ విధానమునే యంగీకరించినది. ఈ విధానమున ముఖ్యవిషయము "జాతీయ సంపద. దాని యుత్పత్తి, దాని పంపిణీ." వెనుక నొకచో రాష్ట్రమును "రాజు" అను పద స్థానమున నుంచిన, నందలి రాజనీతి మన దేశమునకు వర్తించునని మనవి చేసి యుంటిని. ఈ సందర్భమున నీ క్రింది పద్యములను గొన్నిటిని ననువదింతును.

"కోరి తోటవాఁడు కుసుమఫలంబులు
కోయునట్లు రాజు గొనఁగవలయు
నప్పనములు నరికి యంగరములు సేయు
భంగియైన భూమి పాడుగాదె!" **(శాంతి 2-300)**

ఇప్పుడు మనదేశమునందలి పన్నుల విధానమును గొంచెము పోల్చి చూచిన నిఁకఁగ్రొత్తపన్నొకటియైనను భరింపనట్టి పరిస్థితి వచ్చినదని తెలిసికొనగలము. పన్నుల భారము దుర్భర మగుచున్నది. ఎవరివలనఁ బన్నులు గ్రహింపవలెనో యా

క్రింది పద్యము తెల్పుచున్నది.

విను కర్షకులును వణిజులు
ననఘా! గోరక్షకులు ధరాధీశునకున్
ధన మొదఁగూడెడు చోటుల
ననేకవిధములకు నెల్ల నాద్యస్థలముల్" (శాంతి 2-391)

ఇప్పటి కర్షకులకు సంపూర్ణభారము తగిలినది. వణిజులనింకను బూర్తిగ దాఁకలేదు. గోరక్షకు లనఁగాఁ బెద్ద భూస్వాములు. దాదాపు నశించినట్లే! కాని పూర్తిగఁ బోవుటకింక రెండు మూఁడుతరములుపట్టును. కాని దాఁచియుంచిన వణిజుల ద్రవ్యము ప్రభుత్వమున కెక్కువగా నుపకరించుటలేదు. తరువాత నుత్పత్తి సాధనము నిట్లు తెల్పినాఁడు.

ధనములకు ధాన్యములకు నుత్పత్తి తలము
లయిన వాని కించుకయును హాని గాక
యుండఁ దనకును బండార మొదవఁదగును
పార్జనము సేయవలయు భూపాలకుండు" (శాంతి 2-392)

ధనముల కుత్పత్తిస్థానము వాణిజ్యము, వర్తకము, ధాన్యములకుత్పత్తి స్థానము భూమి. ఈ రెండును రాజుచేత నుండవలయును. అనఁగా రాష్ట్రాధీనములై యుండవలెను. వానికి హాని కలుగఁగూడదు. కాని యెల్ల రాజధర్మములకును మూలమును క్రింది పద్యము తెల్పుచున్నది.

"అర్థసిద్ధికంటె నరయ నెక్కుడు ధర్మ
సిద్ధి దాన సకల సిద్ధులును బ్ర
శస్త భంగిఁ జేరు శాశ్వతకీర్తియు
సంభవించుఁ గలుగు సద్గతియును" (శాంతి 2-408)

"ప్రమాదంబున నర్థకామంబులు హీనం
బులై నను ధర్మ నిష్ఠంజేసి ధరణీ పరిపాలనం
బు సుస్థిరంబై చెల్లు" (Ibid 2-285)

ప్రజలందఱకును సామాన్య ధర్మము లీ క్రింది పద్యమున వివరింపఁబడినవి.

"కోపంబులేమి సత్యా
లాపంబు నిజదార పరవిలాసము శుచితా

గోపన మద్రోహం బవ
నీపాలక సర్వవర్ణ నియతగుణంబుల్" (Ibid 2-221)

మన మందరము నీ యాదర్శమునుండి యెంత పతితులమైతిమో యంత రాత్మ నడిగిన సమాధానము రాఁగలదు. ఇప్పుడు మన కున్న కష్టము లన్నిటికి నీ పతనమే మూలకారణము. "సత్యాలాపా ద్రోహములు" రెండును మృగ్యము లయినవి. సత్యాహింసలు సమస్త ప్రజలకును సంస్థలకును నాచరణమున మూల ధర్మములు.

భూదాన సమస్య యిప్పుడు మిక్కిలి యాదరణమున నున్నది. తత్ప్రశంసను చూడుఁడు.

"దానము లన్నిటికిని భూ
దానం బెక్కుడు సమస్త ధాన్యములు ప్రభూ
తానేక వస్త్రధనర
త్నా నూనత్వమును భూమినవుట కతమునన్" (అను 2-350)

భూమి సమస్త ధనధాన్య సంపదకుఁ బుట్టినిల్లగుట యందులకుఁ గారణము. భీష్ముని తుది సందేశ మిట్లున్నది.

"అన్యశంస్యంబును సత్యంబును
నిత్యంబులుగాఁ బాటించి బ్రతుకుండు"

ఈ సందేశము నిచ్చి యాచరణలోఁ జూపిన తుదివ్యక్తి గాంధీమహాత్ముఁడు. ఆయన మాటలను జిలుక పలుకులవలె నుచ్చరించుచున్నామే గాని ఆ యాచరించుటకు వలసిన నీతినిఁ గోల్పోయినాము. సైనిక సహాయ మిప్పుడు ప్రతిదేశమునకును ముఖ్యవిషయమైనది. వివిధదేశముల మధ్య సైనిక సంధులు నడచుచున్న కాలమిది. దానినిఁ గూర్చిన మాట లిట్లున్నవి.

"తెలివాటున ద్రుచ్చిమి ను
ద్ధురు లగు క్రూరులకు మూఁక తోరంబగు న
వ్వైరవరి దొరల బలంబుగ
ధరణీశుఁడు కూర్చుకొనుట దైన్యముఁ దెచ్చున్.
అన్యాయంబునఁ బొదలిన
సైన్యముచే సమర జయము సమకూర ద

నూన న్యాయపరులు గాంతురు
మాన్యత్వము దస్యులైన మనుజాధీశా"   (శాంతి 3-174,175)

ఈ వాక్యములను విపులీకరించుకొనిన నిపుడున్న ప్రపంచపరిస్థితుల నైచ్యము తేటపడును.

ఎట్టి యాయుధముతో యుద్ధము చేయఁగూడదో క్రింద దెల్పఁబడినది.

విను చిల్ల యిడిన యాయుధ
మును విషలిప్త మగు శస్త్రమును నెట్టి యమి
త్రునిపై నైనఁ బ్రయోగిం
చిన నరపతి నరకమున వసించు నృపాలా"   (శాంతి 2-421)

ఇప్పుడు తయారగుచున్న మారణాయుధములను, గ్రిమియుద్ధ యత్నములను స్మరించుకొనవలెనని మనవి. బహుశః వాని నుపయోగింప నుంకించువారు నరకము లే దందురు కాఁబోలు! వారీ యాయుధముల నుపయోగించి భూమిని నరకముగా మార్పఁదలఁచుచున్నారు.

అహింసా ప్రభావమును వెనుక నొకమాఱు మనవిచేసినాను. ఆ సందర్భమున నీ క్రింది పద్యమును జూడుఁడని మనవి.

"మనసునను వాక్కునను గాయమునను హింస
నడపు మాంసంబు దినుటతో నాలు గయ్యెఁ
దెఱఁగు లవి సుర్వె హింస వర్తింపఁజేయుఁ
గానఁ గడు గీడు మాంస భక్షణము దలఁప"   (అను. 4-286)

నడపు = నడచుట

విశ్వామిత్ర చండాల సంవాద ఘట్టమునఁ గాటకము వర్ణింపఁబడినది. ఆ పరిస్థితులిప్పటి మన దేశమునకు సరిగా వర్తించును. మన జీవిత పరిమాణమును బెంచుకొనుచున్నా మనియు సంపద ననుభవించుచున్నా మనియుఁ దలంచుచు నాత్మ వంచన గావించుకొనుచున్నా మని మనవి. ధర్మచ్యుతితో సంపదకల్గుట కల్ల. భారతముయొక్క పరమార్థ మద్వైతమా? విశిష్టాద్వైతమా? యను ప్రశ్న మొదటఁ దలయెత్తును. మధ్వాచార్యులవారు భారత తాత్పర్య నిర్ణయ మను గ్రంథమును రచియించి యందు విష్ణు పారమ్యము భారత పరమార్థ మని గట్టిగాఁ దెల్పినారు. ఎవరి పారమ్యము నుద్ఘాటించెనో చర్చించుటకంటెఁ దిక్కనార్యుని

భావము శివ విష్ణ్వైక్యమని మనవి చేయుచున్నాను. ఈ యైక్యము నాయన యనేక స్థలముల నుగ్గడించినాఁడు. ఒకటి రెండు చిన్న యుదాహరణముల నిత్తును.

"శివుఁడవు నీవు జగములకు
శివమొనరింపంగవలదె చేయుము క్రోధ
ప్రవిహతి విష్ణుండనఁగా
శివుఁడన నొకఁడొట దివ్యచిత్తమ యెఱుఁగున్" (శాంతి 6-446)

విష్ణు విట్లనును:-

"నిను నెవ్వఁ డెఱిఁగె నాతఁడు
నను నెఱిఁగినవాఁడ నిను నెమ్మిగ సేవిం
చిన నదియు నన్నుఁ గొల్చుట
యనువాదిత లేదు భేద మరయఁగ మనకున్" (శాంతి 6-451)

భారతమున వైద్యము కూడఁ గలదు. కొన్ని చర్చనీయాంశములు కూడనాఁడు చర్చింపఁబడినవి. వ్యాసుఁ డొకఁడా కాఁదా యను నీ విషయము పండితులకుఁ గొంత చర్చనీయాంశము. భారతమున వ్యాసుఁడొక్కడేయని చెప్పఁబడినది. ఆ చెప్పుట చారిత్రకముగ సరిపోకపోవచ్చును. చర్చకు మూలముగా నుండుటకుఁ దగును (శాంతి 6P -277,278) తుదకు మరణ సూచనలు కూడఁ జెప్పఁబడినవి. వానినిఁబట్టి ప్రతివాఁడును తానెన్ని నాళ్ళకు మరణించునో తెలిసికొనవచ్చును. నాబోఁటి వృద్ధుల కిది చాల యుపయోగమైన విషయము. ఇంక జతుర్యాగ పరిమితి, పైతృకము, నన్నదమ్ము లెట్లు పంచుకొనవలెనో మొదలగు విషయము లందుఁ జేర్చఁబడినవి. ఈ విధముగా సమస్తవిషయములు భారత మందుపదేశింపఁబడినవి. ఇట్టి సర్వతోముఖ గ్రంథ మెచ్చటను లేదు.

భారతమును వ్యాసుఁడు తనశిష్య చతుష్టయమగు జైమినీ వైశంపాయన పైల శుకులకుపదేశించినట్లు కలదు. వానిలో వైశంపాయనుఁడు వినినదే మనకు సమగ్రముగా వచ్చినది. జైమినికిఁ జెప్పినదానిలో నొక యాశ్వమేధికము మాత్రమే మిగిలినది. మిగిలినవి యసలే నామమాత్రావశిష్టము లయ్యెను. జైమిని భారతమును జూచిన నది వైశంపాయన ప్రోక్తముకంటె ననేక విషయముల నర్వాచీనముగాను, నసమగ్రముగాను గనఁబడును. అందు పేణీలను పిండివంటయు, పర్పటములను నప్పడములును బ్రశంసింపఁబడినవి. శైలిలోఁ గూడ నర్వాచీనముగనే కన్పడును.

ఈ జైమినీ ప్రోక్తమైన యశ్వమేధమును బిల్లలమఱ్ఱి పినవీరన యను పండితకవి యాంధ్రభాషలోనికి గద్యపద్య రూపముగా ననువదించినాఁడు. సముఖము వేంకట కృష్ణప్పనాయకుఁడు పదునెనిమిదవ శతాబ్దమున దానిని వచన కావ్యముగా సంతరించినాఁడు. జైమిని భారతమున నశ్వమేధమునకు సంబంధించిన వృత్తాంతము తప్ప నితరములు లేవు. అనుగీతయసలే లేదు. ఉత్తరరామ చరిత్రకథయు, చంద్రహాసచరిత్ర కథయు విపులముగా వర్ణింపఁబడినవి. ఇంకఁబినవీరన రచననకును, దిక్కనార్యుని రచనకును బోలికలేలేవు. పినవీరన భాషాంతరీకరణము ప్రబంధ ధోరణిలో నడచినది. దీర్ఘ సంస్కృత సమాసములు, నలంకార బాహుళ్యము, శబ్దార్థ చిత్రములు మెండుగ నుండి, కవి పాండిత్యప్రకర్షకే యెక్కువ స్థానము గలదై యున్నది. పినవీరన కవిత్వమును జూచిన నీయనకు బోతనార్యుఁడు, శ్రీనాథుఁడు గౌరవస్థానములని తోఁచును, పోతన యంత్య నియమాదుల యనుకరణము లిందుఁ గలవు. ఒక పద్యము నుదహరింతును.

"అని చాణూర బకాంతకుల్ సముచిత వ్యాహారులై ముందటన్
గని రుత్ఫుల్ల సరోజ హల్లక పరాగ స్ఫార వీచీ ఘటా
కన దుత్కూజిత రాజహంస బక చక్ర క్రౌంచ సంచారమున్
జనితాంతః పరితాప వారణ సుధాసారమ్ముఁ గాసారమున్" (జై.భా. 3-64)

గజేంద్రమోక్షమునఁ బోతనామాత్యుఁడు రచియించిన కాసార వర్ణనము యొక్క ప్రతిబింబ మిందుఁగనఁబడుచున్నట్లు తోఁచకపోదు. జైమినీభారతమునఁ బురాణలక్షణములు కొన్ని యున్నను మహాభారతముతోఁ బోల్చిన నీరసమై కన్పట్టును. పినవీరన భాషాంతరీకరణము మాత్రము మిక్కిలి ప్రౌఢము. తిక్కన భారతము నందలి శైలీ సారళ్యము, ప్రవాహ వేగము మొదలగు లక్షణము లిందుఁ గానరావు. కాని దీని కొక యుద్గ్రంథ మనియు, ననేకులకు మార్గదర్శి యనియు నుత్తమ కావ్యమనుట కెట్టి యభ్యంతరమును లేదు.

భారతీయరాజనీతి

రాజ్యాంగము

అనాదిగ భారతజాతి చక్రవర్తులచేతను, మహారాజులచేతను బరిపాలింపఁ బడు చుండెను. షట్చక్రవర్తులును షోడశ మహారాజులును వారి పరిపాలనమును బురాణముల పుటలలోఁ జిత్రింపఁబడియున్నవి. చక్రవర్తులు మహారాజులును క్షత్రియులునై యుండిరి. మొదటఁ బ్రజల నేలినది మనువు. ప్రజ లందఱుఁ

దమకుఁ బాలకుఁ డుండుట యవసరమనియు, లేకపోయిన నధర్మము ప్రబలు ననియు నెంచి మనువువద్దకుఁబోయి, యాయనను దమకు రాజు కమ్మని వేఁడిరి. ఆయన చెప్పినట్లు విందుమని యాయనతో నొడంబడిరి. (Mouryan Polity Dr. Winternetz P 2 Hindu civilization R. K. Mukherjee P. 78) ఆయనయు నందులకు సమ్మతించెను. తరువాత క్షత్రియులును జక్రవర్తులును, మహారాజులును బాలకులు కాఁగా వీరు నిస్స్వార్థపరులును సకల ధర్మవేత్తలును నగు మహర్షుల సలహా, సహాయములతో నేలుచుండిరి. భారతమున నెట్టివాఁడు మంత్రిగా నుండఁ దగునో తెల్పఁబడియున్నది. (పురోహితుఁడు ముఖ్యమంత్రి (Ibid P. 79). రాజ్యమున కష్టాంగములు ముఖ్యములు. వీనిని జాగ్రత్తగఁ గాపాడుకొనుచు రాజ్య మేలు చుండిరి. ఒక్కొక్కప్పుడు రాజధర్మవర్తనుఁ డైనపుడు ప్రజలు వానినిఁ దొలగించుట కూడ కలదు. (ancient Indian Classical Literature, Sec. V. Mauryan Polity P. 86). ఈ రాజ్యాంగపద్ధతి యిటీవలి వఱకు ననుసరించినది. ఈ రాజు లొకరిపై నొకరు యుద్ధములు చేయుచుండి రను వాదమప్రస్తుతము, యుద్ధములు ప్రపంచము, మానవజాతి యున్నంత కాల ముండును. రెండవ ప్రపంచ యుద్ధ మాఁగి 9 సంవత్సరము లైనది. మరల యుద్ధజ్వాలలు రగుల్కొను సూచనలు కన్పట్టుచున్నవి. కావున యుద్ధములేకుండ నుండుటకుఁ బ్రజారాజ్యము కావలయు ననెడి వాదమున కెంత మాత్రమును జోటులేదు.

ఆ కాలమునఁ గూడఁ బ్రజలు లెక్కకుండలేరు. ధృతరాష్ట్రుఁడు వనమునకు వెడలునపుడు ప్రజల యనుమతినిఁ గై కొనవలసివచ్చెను. వారి యనుజ్ఞమేరకే యాయన వానప్రస్థమునఁ బ్రవేశించెను. కావున ప్రజలకుగూఁడ రాజ్యాంగమున స్థానము కలదు. ప్రజల కెంత స్థానము కలదో యుత్తర రామాయణముదాహరణము. ఒకవ్యక్తి యాక్షేపణమున రాముఁడు భార్యను వదలవలసి వచ్చెను. రాజులు మత్తులై ప్రజలను బాధించుచుండిరి గాన వారినిఁ దీసివేయవలె ననుట సమంజసము కాదు. రాజుండుట, యాయన ప్రజలను బిడ్డలవలెఁ గాపాడుట మనపద్ధతి. "రాజునకుఁ బ్రజ శరీరము" అని వెనుక మనము తెలిసికొని యున్నాము. కావున" రాజు ప్రజలును పరస్పరము రక్షార్చనాపరులై యుండవలెను.

ప్రజలు, వారి ప్రతినిధుల నెన్నుకొనుట. వారి సంఘము రాజ్యముచేయుట యను పద్ధతులు భారతీయ రాజ్యాంగమునకు విపరీతములు, ప్రజారాజ్యమున్న దేశము లందుఁగూడ నొక యధ్యక్షుఁ డుండును. అమెరికా యధ్యక్షుని నెన్ను కొనినది. రష్యాయధ్యక్షుని నెన్నుకొనినది. మన యాధునిక భారత రాజ్యాంగ

మునఁగూడ నధ్యక్షుఁడున్నాడు. ఆయన సమస్తాధికారములు సమయము వచ్చినపుడుపయోగింపవచ్చును. ప్రజలయనుమతిని, మంత్రిద్వారా రాజ్యమేలుటకును నిప్పుడున్న పద్ధతికిని సామ్యముకలదు. ప్రపంచమందలి యన్ని దేశములలోను బ్రిటిన్ రాజ్యాంగపద్ధతి యుత్తమ మని యంద ఱొప్పుకొందురు. ఏల? ప్రజా రాజ్యమే: కాని రాజు, ప్రజయను సిద్ధాంతము, విధానమున నున్నది. ఇది మన కనాదినుండి యున్న సిద్ధాంతము, విధాన, మిప్పు డున్నట్లు చేతులు లెక్క పెట్టి పాలించు పద్ధతి మనకు విజాతీయము, ఇందులకు శ్రుతి ప్రమాణము కలదు.

"ఆక్రాన్ సముద్రః ప్రథమే విధర్మం జనయన్"
ప్రజా భువనస్య రాజా" (యజు రారణ్యకము,)

"ప్రజా భువనస్య రాజా" యనునది ప్రజాస్వామ్య సిద్ధాంతము. అనఁగా బ్రజలే భూమికి రాజు లనెడి రాజ్యాంగము. ఇదియే యిప్పుడు మనదేశమునఁగూడ నవతరించినది. ప్రజ లెట్లు పరిపాలించఁ గలరు? అసంఖ్యాకులు గదా! వారు తమ ప్రతినిధుల నెన్నుకొని తద్ద్వారమున రాజ్యమేలుట యవసర మగుచున్నది. కావున నీ సిద్ధాంతమున నెన్నికలు, ప్రతినిధులు నను భావము లుత్పన్నము లగుచున్నవి. కాని యీ సిద్ధాంతమెక్కడ వర్తించును? అను ప్రశ్నకు వెనుకటి వాక్యము "ఆక్రాన్ సముద్రః" ఇచ్చుటి ద్వితీయకుఁ బ్రథమ వచ్చినది. అట్లయిన సముద్రమును దాటి యని యర్థము వచ్చుచున్నది. కావున నీ సిద్ధాంతము సముద్రమును దాటి వర్తించును. కావున బ్రహ్మ యీ సిద్ధాంతమును దాటినతరువాత నుపయుక్త మగునట్లు సృష్టించును. ఇది భారతభూమికెందులకు వర్తింపదు? దానికి సమాధానము "విధర్మం" అను పదమున నిమిడియున్నది. అది మన భారత సంస్కృతికిని, జాతికిని విధర్మం. ఇఁక మన ధర్మమేమి? యని ప్రశ్న యంకురించును." మన కనాదిగా రాజ్యాంగము రాజగతము. "రాజు" మూలము, రాజునుబట్టి రాజ్యము తరువాత రాజ్యంగము. ఇప్పుడును మన మీ రాజ శబ్దము నుపయోగించుచున్నాము. కాని యా సంస్థను దిరస్కరించినాము. ఏది యెట్లున్నను బరము ధర్మమునకు స్థానమైన మహాభారతమున రాజు, రాజ్యము. రాజ్యాంగము మొదలయివానిద్వారా రాజనీతి బోధింపఁ బడినది. ప్రజలు ఓట్లిచ్చి ప్రతినిధుల నెన్నుకొనుట. వారొక విషయమై యధిక సంఖ్యాకులు చేతు లెత్తుట. యా నిర్ణయ మమలులోనికి వచ్చుట యను రాజకీయపద్ధతి మన భారతదేశమునకు సహజము కాదు. అది వెనుకఁ జెప్పినట్లు విధర్మము. "ఒకవేళ నీ నవీనపద్ధతి మంచిదే యనుకొందము. అది యిప్పుడు నడుచుచున్నదా! ప్రజాప్రతినిధులు చేతుల

నెత్తుటయేగాని యొక్క శాసనమైనను, తీర్మానమైనను, వారుపపాదించి నదియామోదింపఁ బడుటలేదు. అన్ని శాసనములును ప్రభుత్వముచేతనే యుపపాదింపఁబడుచున్నవి. ఇఁకఁ బ్రజా ప్రభుత్వ చిహ్నము లెక్కడ? స్వార్థరహితుఁ డగు మంత్రి సలహా పోయి మంత్రి మండలిలోనున్న యల్పసంఖ్యాకుల సలహా యైనది, వీరంగీకరించినది. ప్రజాప్రతినిధులధికసంఖ్యాకు లామోదించిన యది శాసనమగును. అట్టియెడ నీ మంత్రిమండలి భారతములోఁ జెప్పినట్లు ధర్మనిష్ఠమై స్వార్థరహితమైనది తప్ప సుప్రభుత్వ మనిపించుకొనదు. స్వార్థరాహిత్య మిప్పుడు చూచిన నెక్కడనో యల్పసంఖ్యాకులలోనే యగుపడుచున్నది. రాజ్యాంగము వారిచేతులలో లేదు. ఇట్టి విప్రపత్తులన్నియు మన సనాతన రాజ్యాంగవిధానము మాఱుటవలనఁ గలిగినవి. బహుశః భావికాలమున వెనుకఁ బ్రజ లెట్లు మనువువద్దకుఁబోయి వేఁడిరో యట్లే పోయి వేఁడుకాలము వచ్చినఁగాని పరిస్థితులు చక్కఁబడకపోవచ్చును. ఏదేశము నైనను జూడుఁడు. ప్రజల పేరిటఁ బైమెట్టున నున్న స్వల్పసంఖ్యాకులే రాజ్యాంగము నడుపుచున్నట్లు చూచుచున్నాము. వీరి చిత్తవృత్తులు కేవల ధర్మప్రవణములై యున్నట్లు కన్పట్టదు. దీనికంతకు మానవుని నైతిక పతనమే కారణము. వెనుకఁ జెప్పిన సర్వప్రజాసామాన్య గుణముల నలవఱచుకొనినఁగాని మరల వ్యక్తికిని, వ్యక్తి సమూహమునకు నైతికశక్తిరాదు.

భారతభాగవత రామాయణములు

ఒక్క విషయమును మనవి చేసి యీ ప్రసంగమును ముగింతును. భారతీయ సంస్కృతికి రామాయణ భారత భాగవతములు మూలభూతములయిన యుద్గ్రంథములు. వానిలోఁ జారిత్రకముగ రామాయణము ప్రాచీనతమము. (History of Indian Literature Dr. Winternetz Vol 1, P. 503) అయినను రామాయణము భారతముకంటె యర్వాచీనమని చెప్పు పాశ్చాత్యవాసన గల పండితులు లేక పోలేదు. పద్మినీసేన్‌గుప్తయను నొక యువతి భారతీయ సంస్కృతినిఁ గూర్చియొక పుస్తకము వ్రాసెను. అది విశ్వవిద్యాలయ పాఠ్య గంథముగాఁగూడ నుండెను. ఆమె యందు భారతము ప్రాచీనతమమని వ్రాసెను. ఇట్టి తప్పు డభిప్రాయముగల గ్రంథములను పాఠ్యగ్రంథములుగా నియమించుట కంటె ఘోర మింకొకటి లేదు. ఏది యెట్లున్నను రామాయణము ప్రాచీన తమ మనుట నిక్కువము. భారతీయ సంస్కృతికి మూలభూతములగు నీ మూఁడు గ్రంథములును సమగ్రముగను, సర్వోత్కృష్టముగను నే భాషలోని కవతరించినవో యా భాష యదృష్టవంతము. ఆ జాతి యదృష్టవంతము. మన తెనుఁగు భాషలోనికి భారత,

భాగవతములు మాత్రము మాతృకల విశిష్టతతోను, బవిత్రతతోను నవతరించిన వనుటలో నెట్టి యభ్యంతరమును లేదు. ఒక్కొక్కచో మాతృకల కంటె మిన్నగా నవతరించినవి కూడ ననవచ్చును కాని యట్టి గుణములు గల రామాయణమునకుఁ దెనుఁగుజాతి నోచుకొనలేదు. అట్టిపని చేయుట కొక వ్యక్తి యవతరింపవలయును, ఈ యదృష్టము. హిందీ, అఱవభాషలకుఁ గలిగినది. తులసీదాసును, కంబురును మహాభక్తులై వారి వాక్కు ప్రాశస్త్యమును బడసినది. నన్నయ, తిక్కన, పోతన లవతరించుట మన యదృష్టము. వారు భారత భాగవతముల నవతరింపఁజేసిరి. వైదికధర్మము నుద్ధరింపవలెనను భగవత్ప్రేరణముచే నన్నయ, తిక్కన, పోతన లవతరించుట మన యదృష్టము. వారు భారత భాగవతముల నవతరింపఁజేసిరి. వైదికధర్మము నుద్ధరింపవలెనను భగవత్ప్రేరణముచే నన్నయ మొదట యనువదింపఁ జేయుటకు సమకట్టెను. కాని పూర్తియగుటలో భగవదిచ్ఛ యన్యథాయయ్యెను. అట్టి పవిత్రోద్దేశ్యముతో నారంభింపఁబడిన కృతి కభ్యర్హత వచ్చుట కాశ్చర్యమే మున్నది? ఆ పవిత్రోద్దేశ్యము రెండు శతాబ్దముల తరువాతఁ బూర్తియయ్యెను. తగిన వ్యక్తి కొఱకై యింతకాలము వేచియుండవలసి వచ్చెను. (ఆ.మ.భా. పీఠిక. సూ) తిక్కనార్యునకే పూరించు భాగము దక్కెను. ఆయన పితృభక్తియు, దైవభక్తియు, నా కార్యమును బ్రేరేపించెను. పిత్రాజ్ఞచే శివ విష్ణ్వైక్యమును సందర్శించి తన కృతిని హరిహరనాథుని కంకితము చేసెను. అందుకుఁగాను పవిత్రతను సంపాదించుటకై జ్యోతిష్టోమ మాచరించి పునీతుడై తన విజ్ఞానమును బ్రతిభను బవిత్రకార్యమున నుపయోగించి తరించుచున్నా నను విశ్వాసముతో రచింపసాగెను. అందువలననే మహాభారతము సర్వోత్తమముగ నవతరించినది.

ఇఁక భాగవతమా! మహాభక్తుఁడును, బవిత్రచరిత్రుఁడును, భగవత్ప్రేరితుఁడునగు పోతనామాత్యుని చేతిఁలోబడి యవతరించి యభ్యర్హతలువడసెను. వ్యాసరచితములగు నీరెండు గ్రంథములును దద్రచనకుఁ దగినమహానుభావుల చేతులకంది ప్రపంచ వాఙ్మయమున కలంకారభూతములై వఱలినవి. రామాయణముపై రెండు గ్రంథములతో సంస్కృతి విషయమునఁ దులఁదూగు గ్రంథము. రామాయణము కావ్యముగా, నితిహాసముగా నుత్తమము. మఱియు భారతజాతి కాదర్శ పురుషులగు సీతారాములు నాయికా నాయకులుగానున్న గ్రంథము, సీతారాములాంధ్రుల కులదైవములు, వీరాంధ్రదేశములో నివసించి యాంధ్రుల కష్టసుఖములను బంచుకొనిరి. వీరు మెట్టిన పవిత్రస్థలము లిప్పటికిని మనకు క్షేత్రములుగా నున్నవి. రామాలయముగాని, హనుమదాలయముగాని లేని యూరు సామాన్యముగా నుండదు. సేనను రామదండనియు, భజనను

రామభజనయనియు విరివిగాఁ బిలుతుము. సీతయనుపేరు స్త్రీలలోను, రాముని పేరు పురుషులలోను విరివిగాఁ గన్పట్టుచున్నాము. తుదకుఁ బెండ్లిండ్లలోఁ గటకమునుండి నెల్లూరివఱకు.

"ఆనంద మానందమాయెను, మన
రాముఁడు పెండ్లికొడుకాయెను, మన
సీతమ్మ పెండ్లి కూఁతు రాయెను"

అనుపాట వినఁబడును. త్యాగరాజుమహారామభక్తుఁడు. రామదాసు మహారామభక్తుఁడు. రాముని కింత ప్రియమైన జాతియైనను రామాయణము సంతరించుటకుఁదగిన వ్యక్తి జాతిలోఁ బుట్టలేదు. రామాయణములున్నవి. వ్రాసిన వ్యక్తులున్నారు. కాని తద్రచిత గ్రంథములు భారత, భాగవతముల యభ్యర్హతను సంతరించుకొనలేదు. ఇది విషాదకరము. నేటివఱకుఁ దత్కార్యమున నసమర్థులు, కీర్తికాయులు, ప్రయోజనాశాపరులు, నహంకారపూరితులు, వివాదపరులు. గర్విష్ఠులు నగువారి చేతులలో రామాయణము పడుట మిగుల శోచనీయము. ముందైనను దిక్కన పోతనల ప్రతిభా సామర్థ్యమును, బావిత్ర్యమును, మహాభక్తియు, వినమ్రతయు, నైహికాశాచితారాహిత్యమును గల మహావ్యక్తి యుద్భవించి యాకార్యము సంతరింపవలెనని భగవంతునిఁ బ్రార్థించుచున్నాను. ఉన్న రామాయణములలో గ్రంథము చిన్నదైనను మొల్లకృతియే యుత్తమ మని నా సవినయాభిప్రాయము, కీ. శే. వాసుదాసులుభక్తులే! కాని యందు రసము కొఱవడినట్లగు పడును. తిక్కన పోతనల రచన పద్ధతినిఁగాక రామాయణాంధ్రీకరణ కర్తలు యథామాతృకముగానో, తద్విరుద్ధముగానో రచింప సమకట్టిరి.

"It (Ramayana has become the property of the whole Indian people, and scarcely any other poem in the entire Literary world, has influenced the thought and poetry of the Nation for centuries" (History of Indian Literature, Dr. Winternetz Vol 1, P. 467). అట్టి సార్వజనీన సార్వకాలీనతలును, మహాకావ్యత్వమును గల్గిన రామాయణము మన భాషలో నవతరించుఁగాక!

ఈ కార్యభారము సారస్వత పరిషత్కార్యకర్తలు నాకిచ్చినపుడు మిక్కిలి యనుమానముతో నంగీకరించితిని. తిక్కన రచనయు, నేను విమర్శించుటయునా! "అపచార" మనితోఁచెను. ఈ కృతముగా నైనను దిక్కనార్యుని స్మరణము కల్గుననియు, తద్రచిత గ్రంథమును సమగ్రముగాఁ బునః పఠనావకాశము

కల్గుననియు నంగీకరించితిని. ఇదివరలో నీ భాగముపై రచియింపఁబడిన రచన లేమైన నున్న వేమోయని వెదకితిని, అట్లుండిన నాకుఁ గొంతమార్గము గోచరించి యుండును. అట్టివేవియు నాకు లభింపలేదు. విరాటోద్యోగ పర్వములను గూర్చి విపులములైన విమర్శనములు కలవు. అట్లు వ్రాసిన వారెవ్వరును నీ భాగమును స్పృశించలేదు. కావున మార్గమును నేనే యేర్పఱచుకొనవలసి వచ్చెను.

౭

శ్రీ శారదాయై నమః

మహాభారత సమీక్ష

ఆశ్రమవాస చతుష్టయము

కేశవపంతుల నరసింహశాస్త్రి

పాండవులు పితృపితామహ క్రమప్రాప్తమైన సామ్రాజ్యమును జగత్పూజ్యముగాఁ గైకొని యధ్వర ప్రముఖములయిన ధర్మకార్యముల నొనరించుచు, హత పుత్రుఁడై తమవద్దనున్నయెడ ధృతరాష్ట్రుని యందు భక్తివినయములు గలిగి మెలఁగుచుండిరి. ధర్మజుఁడు తమ్ములకును సచివులకును గాంధారీ ధృతరాష్ట్రులేమిటను నుమ్మలింప కుండునట్లు నడచుకొనుఁడని యాజ్ఞాపించెను.

ధృతరాష్ట్రుఁడు పుత్రశతకమునకై గో కనకాది దానములును బారలౌకిక క్రియలును జేయుచుండెను. ఎందును గొఱఁతలేని పూర్వవైభవము ననుభవించుచు మానసమునఁ బాండవుల మేలును గోరుచుండును. యుధిష్ఠిరుఁ డెన్నఁడును దుర్యోధనుఁడు చేసిన కీడును దలఁపకుండెను. ఇట్లు పదునైదు సంవత్సరములు గడచెను.

ఒకనాఁడు ధృతరాష్ట్రుఁడు బంధువులను గూర్చి, గద్గదకంఠుఁడై నా మూలమునఁ గౌరవులకు నాశము వాటిల్లినది. లోభియుఁ, గ్రూరుఁడును, జాతిద్రోహియునైన జడుని రాజునుగాఁజేసితిని. భీష్మాదుల పలుకుల నాదరింపకపోయితిని. అంతయు నంతశ్శల్యమై బాధించుచున్నది. ధర్మజా! నీవు నా సుఖమున కెట్టి కొఱఁతను గలుగనీయవు. నీ చనువువలనఁ బెక్కు దానధర్మముల నాచరించితిని. పాంచాలికిఁ గీడుచేసిన యధముల నిర్జించి నీవు రాజ్యమును గొంటివి. నా కొడుకుల కింకఁ జేయవలసిన దేమియు లేదు. నా శరీరమును బవిత్రముగా గావించుటకై తపస్సును జేసికొందు ననుమతింపుమని పల్కెను.

అంబికేయుఁడు వానప్రస్థుఁడ నయ్యెద నన యుధిష్ఠిరుఁడు దుఃఖితుఁడై నీ విట్లు గూఢముగా దురపిల్లుచు దుష్కరమైన పనికిఁ బూనిన, నీవు లేని రాజ్యము నా కేల యని పలికెను. వ్యాసుఁడు ప్రత్యక్షమై. ధృతరాష్ట్రుఁడు చెప్పినట్లు

చేయుము. గాంధారికిని నిదియే వాంఛితము. పూర్వరాజన్యుల మార్గమునఁ జనుటయితనికిశ్రేయము. విచారమువిడిచి యానతిమ్ము, వినయ సంభావనములచే వీరి వగలఁ బాపి శుశ్రూష గావించితివి. ఇంకఁ బోనిమ్ము' అని పలుక ధర్మజుఁడు మారాడ నోడి యనుమతించెను.

పిమ్మట నాశ్రమవాసమున కేఁగనున్న ధృతరాష్ట్రుఁడు పాండవాగ్రజు నేకాంతమునకుఁ గొనిపోయి రాజనీతి విశేషముల బోధించెను. పౌరులను రావించి తాను వనస్థుఁడగుటకు వారి యనుమతినిఁబడసెను. కార్తిక కృష్ణ పాడ్యమినాఁడు గాంధారీ సహితముగా వల్కలములు ధరించి యాజకు లగ్నులను గొని ముందు నడువ నగరు వెడలెను. కుంతి వలదని వారించుచున్న ధర్మతనయునకు నచ్చఁ జెప్పి గాంధారీ ధృతరాష్ట్రుల శుశ్రూషకై వారి ననుసరించెను. విదుర సంజయులు వారితోఁ జనిరి.

ధృతరాష్ట్రుఁడు కురుక్షేత్రమునుఁ జేరి శతయూపాశ్రమ ప్రాంతమున వాన ప్రస్థ ధర్మములను నడుపుచుండెను. నారదుఁడువచ్చి తత్తపోవనమహిమను, ధృతరాష్ట్రుఁడు సుగతిఁ బొందు కాలపరిమితినిఁ జెప్పిపోయెను, (శతయూపుఁడు కేకయ వంశమునకుఁ జెందిన రాజర్షి. ఇతఁడే ధృతరాష్ట్ర నాహ్వానించెను,) కొంత కాలము గడచిన పిమ్మటఁ బాండవులు పితరులను దలఁచి వారు మృతి నొందక ముందు మరియొకసారి చూడఁదలఁచినవారై శతయూపాశ్రమమునకు వచ్చిరి. యోగియై తిరుగుచున్న విదురుఁడు తన తేజస్సును యుధిష్ఠిరునందుఁ బ్రవేశింపఁ జేసి దేహమును విడిచెను.

వ్యాసుఁడు సైత మిచ్చటికి వచ్చి ధృతరాష్ట్రాదులను గంగాతీరమునకుఁ గొనిపోయి తన మహిమవలన యుద్ధమృతులైన వారినిఁ బ్రత్యక్షముఁ గావించెను. అందఱును బంధు సమాగమ సౌఖ్యమునఁ దేలిరి. ఆ యద్భుతములను గాంచి తృప్తులైన ధృతరాష్ట్రాదులు తిరిగి యాశ్రమమునకు వచ్చిరి. పాండవులు నెల రోజు లుండి హస్తినాపురమునుఁ జేరిరి.

మఱి రెండు సంవత్సరముల పిమ్మట నారదుఁడు వచ్చి కుంతీసహితముగా గాంధారీ ధృతరాష్ట్రులు కార్చిచ్చున దగ్ధులై మరణించిన వార్తను బాండవులకుఁ దెలిపెను. దుఃఖితుఁడై యుధిష్ఠిరుఁడు వారికిఁ దిలోదకము లొసఁగును. ముప్పది యైదు వత్సరములు చన్న పిదప హస్తినలో నుత్పాతములు పుట్టెను. హలధర చక్రదరులు తప్ప యాదవులందఱును నొకరి నొకరు చంపుకొని మడిసిరన్న వార్త యుధిష్ఠిరునికిఁ దెలిసెను.

నారద విశ్వామిత్రులొకప్పుడు శ్రీకృష్ణ సందర్శనార్థమై ద్వారకకు రాఁగా, విధిప్రేరితులైన వృష్ణికుమారులు సాంబుఁడనువాని కంగనావేషమువేసి, మునుల కెదురుపోయి మహాత్ములారా! యిది బభ్రుని భార్య, దీనికి సంతానము కల్గునా? యని ప్రశ్నించిరి. మునులాగ్రహించి యాదవ క్షయాపాదకమైన ముసల మీ సాంబుని గర్భమునఁ బుట్టునని శపించి తిరిగిపోయిరి. సాంబుని కడుపున ముసలము పుట్టెను. యాదవులు వసుదేవునకుఁ దెలుప నతఁడు విధివిలాసమునకు వగచి దానినిఁ జూర్ణముచేసి సముద్రమునఁ గలుపుఁడని యాజ్ఞాపించెను.

ద్వారక యందును మహోత్పాతములు పుట్టెను. శ్రీకృష్ణుఁడు యాదవక్షయము కానున్న విషయమును దన దివ్యబుద్ధిని గ్రహించి మఱునాఁడు సముద్రతీరమున జాతర యని చాటింపించెను. ఆ రాత్రి నిద్రించిన యాదవు లందఱికిని స్వప్నమున మృత్యుదర్శన మయ్యెను. మరునాఁ డుదయమునఁ బుత్రమిత్ర కళత్రయుతులై భక్ష్యభోజ్యమాంస మర్యాదలతో సముద్రమునుఁ జేరిరి. తినియుఁ ద్రావియు నుల్ల సము లాడుచున్న యాదవబృందమునఁ బరస్పర కలహము రేఁగెను. యదువృష్ణి భోజాంధకులు నిర్నిమిత్తములైన యాగ్రహములు వహించి. ముసల చూర్ణమువలన మొలచిన ముయ్యంచుల తుంగతోఁ గొట్టుకొని యెల్లరును మడిసిరి. గోవిందుఁడు వారించుటకు శక్తుఁడై యున్నను విధి కెదురుసేయ నిష్టపడక యుపేక్షించెను. రణసంకులతలోఁ బడని దారుకుఁడును, బభ్రుఁడును, శ్రీకృష్ణుఁడును గలిసిపోయి బలభద్రుని గాంచిరి. అర్జునుని ద్వారకకుఁ దోడ్కొని రమ్మని కృష్ణుఁడు దారుకుని హస్తిపురికిఁ బంపెను. బభ్రుఁడు బోయచే హతుఁడు కాఁగా స్త్రీజనము నిండ్లకుఁ జేర్చివత్తు నిచ్చటనే యుండుమని బలరామునికిఁ జెప్పి కృష్ణుఁడు ద్వారకకుఁ బోయెను.

కురుయాదవ సంక్షయమువలనఁ దనకు వైమనస్యము గలిగిన దనియు, దా నింక ద్వారకయందు నిలువలే ననియు, నర్జునుఁడు వచ్చి యాదవుల యోగ క్షేమము లరసికొనుననియుఁ జెప్పి వసుదేవునికి నమస్కరించి శ్రీకృష్ణుఁడు బలరాముని చెంత కరిగెను. బలభద్రుఁడు శేషావతారమును ధరించి యుదధిలో మునిఁగెను. శ్రీకృష్ణుఁడు తన యవతారమునఁ గావలసిన పనులన్నియు ముగియుటను దలఁచి, యోగశక్తిచేఁ దనువు విడుచువాఁడై యొక వృక్షముక్రిందఁ బరుండెను. ఒక వేటకాఁడు కృష్ణుని దేహమును జింకయని భ్రమించి బాణము వేసెను. తను విముక్తి నిమిత్త మట్లు చేకూర శ్రీకృష్ణుఁడు తన భౌతిక దేహమును విడిచి వైకుంఠమున కేఁగెను.

దారుకుఁడు విన్నవింప దుఃఖితుఁడైన యర్జునుఁడు ద్వారకకుఁ జేరిన తోడనే వసుదేవుఁడు మరణించెను. దేవకీ ప్రభృతులగ్నినిఁ బ్రవేశించిరి. అర్జునుఁడు సముద్రతీరమునకు వెళ్ళి వెదకుచుండ బలరామకృష్ణుల కళేబరములు కనుపించెను. విధివైపరీత్యమునకుఁ జేయునదిలేక దుఃఖాక్రాంతుఁడై వారి కగ్ని సంస్కారమునుఁ జేసెను. మఱునాఁడే ద్వారకయుదధిని మునుఁగనుండుటచే రామకృష్ణుల మరణ వార్తను దెల్పక స్త్రీ బాల వృద్ధ సహితముగా నెల్లవారిని దెల్లవారులోపల ద్వారక నుండి తరలించుకొని పోవుచుండ మార్గమధ్యమున బోయలు వచ్చి యాదవాంగనలను, సొమ్ములను దోఁచుకొనిరి. విస్మితుఁడైన యర్జునుఁడు రామకృష్ణుల నిర్యాణము నెఱిఁగింప రుక్మిణీ ప్రభృతులగ్నినిఁ బ్రవేశించిరి.

అర్జునుఁడు గంగాతీరమున నున్న వేదవ్యాసుని చెంతకుఁబోయి బోయలవలన జరిగిన పరాభవమునుఁ దన నిర్వీర్యతను విన్నవించెను. మునిశాపమును, శ్రీకృష్ణుఁడు వైకుంఠమున కేఁగుటయు నట్టి సంఘటనమునకుఁ గారణము లని చెప్పి వ్యాసుడోదార్ప నతని యుపదేశమును గ్రహించి హస్తినకుంబోయి యన్నకుఁ దన పోయినపని తెఱఁగును విన్నవించెను.

మౌసలాహవ కృష్ణ నిర్యాణ వ్యాసోపదేశములను విన్న యుధిష్ఠిరుఁడు కర్మ త్యాగమును జేయఁదలఁపఁగా నర్జునుఁడును దానికే పూనెను. అప్పు డజాతశత్రుఁడు భీమాదులను బిలిపించి తన పూనికను దెలుప వారును మహాప్రస్థానమునకుఁ గడఁగిరి. ఈ విశేషమును యుయుత్సున కెఱిఁగించి రాజ్యతంత్రమును నడుపు నుపాయముల బోధించి పరీక్షిత్తు నభిషిక్తుఁజేసెను. సుభద్రను రావించి 'నీ మనుమఁడు కురుభూభారోద్వహుఁడైనాఁడు. యాదవవంశ శ్రేష్ఠుఁడైన వజ్రునికి నింద్రప్రస్థ రాజ్యమును గౌరవ పురస్సరముగా నిచ్చినాను. (వజ్రుఁ డనిరుద్ధుని కుమారుఁడు). ఈ రెండు కాపురములను రక్షించుకొను భారము నీది' యని చెప్పి సుభద్ర తమ వెంట బయలు దేరకుండునట్లు చేసెను.

కృపాచార్యునికిఁ బరీక్షిత్తును శిష్యునిఁగా నప్పగించి, పౌరజానపదులకుఁ దమ ప్రస్థానమును బరీక్షిత్తురాజుగా నుండుటయు నెఱుకపఱచి వారి యనుమతినిఁ బడసెను. ప్రస్థానయాత్ర సాగించి జ్యేష్ఠానుక్రమముగా నడచుచున్న వారివెంట నొక శునకమును బోవుచుండెను. ఉపవాస వ్రతపరులై భాగీరథికిఁ జని యచ్చటి నుండి బ్రాఙ్ముఖముగా నడచి సముద్రతీరమును జేరిరి.

అచ్చట నగ్నిదేవుఁడు ప్రత్యక్షమైయింక నీ దగ్గఱనుండఁదగదని గాండీవిచే గాండీవమును సముద్రమున వేయించెను. అది వరుణునిఁ జేరుకొనెను. పిమ్మటఁ

బాండవులు దక్షిణాభిముఖులై సముద్రతీరము వెంబడి వచ్చి ద్వారక మార్గముగా హిమాలయమును దాఁటి మేరునగ సమీప భూమికిఁ జేరిరి. యోగసాధన పరులై సత్వరముగా నడుచుచున్న వారిలో యోగశక్తి సడలి ద్రౌపది నేలఁబడి విగత జీవిక యయ్యెను. పిమ్మట సహదేవ నకులార్జున భీములును నట్లే పడి ప్రాణములు విడిచిరి. శునకము మాత్రము యధిష్ఠిరు ననుగమించుచుండెను.

ఇంద్రుఁడు దివ్యరథమును గొని ధర్మజుని కెదురుగా వచ్చి స్వర్గమున కాహ్వానించెను. శునకమును సయితము రానిచ్చినచో స్వర్గమునకు వత్తు నని పట్టుబట్టిన యుధిష్ఠిరు మనశ్శుద్ధికి సంతసించి సారమేయ రూపము వీడి ధర్ముఁడు ధర్మరాజును దీవించెను. యుధిష్ఠిరుఁడు స్వర్గమునకుఁ జనెను.

దేవమునుల యాజ్ఞచే నొకఁడు ధర్మజునికిఁ దనవారినిఁ జూపుచుండ దుర్యోధనుని స్వర్గవైభవమునుఁ జూచి విమనాయమానుఁడై తమ్ములను జూపుమని యడిగెను. దేవదూత నరకమునకుఁ గొనిపోవ నచ్చట నాక్రందించుచున్న కర్ణార్జునాదులను గాంచి మిక్కిలి దుఃఖపరవశుఁడై తమ్ములు నరకము ననుభవించుచుండ నా కేటి స్వర్గము? నే నచ్చటనే యుందు ననెను.

ఇంద్రుఁడు వచ్చి కల్పితమైన నరకము నంతర్ధానముఁ గావించి నరకఫలమతి స్వల్పమగుటచే ముందు దాని ననుభవించి యిప్పుడు నీ తమ్ములు స్వర్గమున నున్నారు. రమ్మని గంగావగాహనముఁ జేయింపగా యుధిష్ఠిరుఁడు మానవత్వ వాసనలను విడిచి దేవభావము నొందెను. పిమ్మట నింద్రుఁ డతనికిఁ దేవత్వము నొందిన స్వజనులనుఁ జూపెను.

నరనారాయణులుగా మాఱిన కృష్ణార్జునులను, నాదిత్యులలోఁ గలిసిన కర్ణుని, మరుద్గణమునఁ జేరిన భీమునిఁ నశ్వినీ దేవతల చెంతనున్న నకుల సహదేవులను, లక్ష్మీరూపమున నున్న ద్రౌపదిని, వసు ప్రభృతులఁ గలిసిన భీష్మాదులను, బాండు రాజునుఁ జూచి, యుధిష్ఠిరుఁడు ధర్మునియందుఁ జేరి శాశ్వతభావము నొందెను. ఇది యాశ్రమవాసాది చతుష్టయమునందలి కథాసంగ్రహము.

పర్వసమన్వయము

సంస్కృత భారతము దేశమునందలి వివిధ ప్రాంతములలో దొరుకుటయు, భాగములు శిథిలములగుటయు మున్నుగాఁగల కారణములవలనఁ బరిశోధకులు పాఠభేదముల నుగ్గడించి ముద్రించిరి. క్రీ.శ. 1882-90 ప్రాంతమునఁ గలకత్తాలో నొక ప్రతి ప్రతాపచంద్రరాయ్ సంపాదకత్వమున ముద్రింపఁబడెను. ఇప్పటి కెనుఁ

బది సంవత్సరముల క్రిందఁ జెన్నపట్టణమున నొక ప్రతి తెలుఁగు లిపిలో ముద్రితమయ్యెను. వావిళ్ళ వారును దెలుఁగులిపి భారతమును బ్రకటించిరి. కుంభకోణమునందలి పండితులు పరిశోధించిన ప్రతి దేవనాగరిలిపిలో క్రీ. శ. 1906లో బొంబాయి నగరమున ముద్రింపఁబడినది ఇది ద్రావిడ ప్రతి. మఱియొక బొంబాయి ప్రతి కలదు. 1932 లో స్వాధ్యాయ మండలి ప్రతి ప్రకటితమైనది. భండార్కర్ పరిశోధనాలయము వారి సమగ్ర పరిశోధనాత్మకమైన ప్రతి శాంతి పర్వము వఱకే ముద్రితమైనది. తక్కిన భాగ మిఁకముందుఁ బ్రకటింపఁబడవలెను.

ఇట్లు మనకు లభించుచున్న ప్రతులలోఁ బరస్పర భేదములు కలవు. ఆశ్రమ వాసిక పర్వమునఁ గలకత్తా బొంబాయి ప్రతులు 39 అధ్యాయములను జూపుచుండ ద్రావిడ ప్రతి 41 అధ్యాయములను జూపుచున్నది. మౌసల పర్వము కలకత్తా బొంబాయి ప్రతులలో 8 అధ్యాయములుగా నుండ ద్రావిడ ప్రతిలో 9 అధ్యాయము లయినవి. స్వాధ్యాయమండలి ప్రతి యాశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణ పర్వములందు వరుసగా 39, 8, 3, 5 అధ్యాయములను జూపు చున్నది. ఇట్లన్ని ప్రతులయందును నేదియో యొక భేదము కానవచ్చును.

ఆశ్రమవాసము:- పర్వసంగ్రహపర్వమున యుధిష్ఠిరుఁడు శతయూపాశ్రమమునకు వెళ్లిన విషయము సూచింపఁబడలేదు. గ్రంథమునందు మాత్రము పాండవులు పితృదర్శన లాలసులై సపరివారముగా నాశ్రమమున కేఁగుటయు, యుద్ధమృతులను గనుఁగొనుటయు, వ్యాసుని సందర్శించుటయు మున్నగు నంశములు విపులముగా వర్ణింపఁబడినవి. ధృతరాష్ట్రుఁడు చూచిన యద్భుత దృశ్యమును పాండవులు సైతము చూచుట బాగుండునని యర్వాచీను లీ భాగమును గల్పించి యుందురని కొందఱు విమర్శకులు తలంచిరి. "యత్ర ధర్మం సమాశ్రిత్య విదురః సుగతిం గతః" అని పర్వసంగ్రహ పర్వమున నున్నది. విదురుఁడు యోగమహిమచేఁ దన తేజస్సును ధర్మరాజునందుఁ బ్రవేశింపఁ జేసి శరీరమును విడచెను. ఇది యుధిష్ఠిరుఁడు శతయూపాశ్రమమునకు వెళ్ళినచో నెట్లు జరుగును? ధర్మం అనఁగా ధర్మదేవతయని యర్థముఁ జెప్పుదుమేని దానికిఁ దగిన గ్రంథము లభ్యము కాలేదు. పర్వసంగ్రహమునకు యుధిష్ఠిర శతయూపాశ్రమ గమనము ముఖ్యముగాని సూచింపఁబడలేదనియు, విదురదేహత్యాగము ముఖ్యమగుటచే సూచింపఁబడిన దనియు, నీ సూచనముచేతనే పాండవులాశ్రమస్థ పితరులను జూడఁబోయిన యంశమాక్షిప్త మగునని యుఁదలంచితిమేని నిది కల్పితమని చెప్పువారి విమర్శనము నిరాధార మని తేటపడఁగలదు.

పుత్రదర్శన పర్వకథను జనమేజయుఁడు నమ్మకపోఁగా వ్యాసుఁడు వచ్చి జనమేజయునికిఁ బరీక్షిత్తును, శృంగిని, శమీకునిఁ జూపి యనుమానమును దీర్చెను. ఈ కథాంశము సంస్కృతాంధ్ర పర్వసంగ్రహములం దెచ్చటను సూచితము కాలేదు. నన్నయభట్టు లెక్క ప్రకారము 1106 శ్లోకములుండవలసిన యాశ్రమవాస పర్వమున శ్లోకసంఖ్య భేదించుచున్నది. జనమేజయునికి వ్యాసాను గ్రహలబ్ధమైన పరీక్షిద్దర్శనము తిక్కన భారతమున లేదు. కావున నీ భాగము ప్రక్షిప్త మనుటకు వీలున్నది.

మౌసలపర్వము: ఇది యెనిమిదధ్యాయములు గల పర్వము. పర్వసంగ్రహ పర్వము 320 శ్లోకము లుండవలెనని చెప్పుచుండగానే ప్రతియందును 300కు మించిలేవు. కథాంశములు సంస్కృతాంధ్రములం దొక్కరీతిగనే యున్నవి. పర్వ సంగ్రహ పర్వమున నాశ్రమవాసిక పర్వమునందే నారదుఁడు ధర్మరాజునకును వృష్ణివినాశమును గుఱించి చెప్పినట్లున్నది.

దదర్శ నారదం యత్ర ధర్మరాజో యుధిష్ఠిరః
నారద శ్చైవ శుశ్రావ వృష్ణీనాం కదనం మహత్
ఏత దాశ్రమవాసాఖ్యం పర్వోక్తం మహ దద్భుతమ్"

తెనుఁగు భారతమునందలి పర్వసంగ్రహమునందు సైత మాశ్రమవాసాం తర్గతముగానే "పాండవులు నారదునివలన నిఖిల యాదవ వ్యసనం బెఱుంగుటయు" నని యున్నది. ఇచ్చట సంస్కృతాంధ్ర భారతములు రెండింటను బర్వసంగ్రహ పర్వమునకును గ్రంథములకును బొత్తుకుదురుట లేదు. శ్రీకృష్ణులు తప్ప యాదవు లందఱును మరణించినట్లు యుధిష్ఠిరుఁడు కర్ణాకర్ణిగావినెను. జరిగినదియు నంతే.

దారుకుఁడు హస్తిపురికి వెళ్ళి చెప్పిన పిమ్మటనే యర్జునుఁడు ద్వారకకు వచ్చెను. ఇది సంస్కృతాంధ్రములు రెండింటియందును నున్నది. నారదునివలన ముందుగానే వినియున్నచో దారుకుఁడు వచ్చుదాఁక హస్తిపురికి నాటు బాటమీఁదఁ జిన్న రథముతో వచ్చెను. అర్జునుఁ డె ట్లేగెనో తెలియదు. ద్వారకకు వెళ్ళి యాదవుల నోదార్చి, తరువాత మృతుఁడైన వసుదేవుని కగ్ని సంస్కారకృత్యమును జేయించి పిమ్మట సముద్రతీరమునకుఁ బోయినాఁడర్జునుఁడు. అచ్చట వెదుకఁగా వెదుకఁగా రామకృష్ణుల కళేబరములు కనఁబడినవి. అప్పుడు వాని కగ్ని సంస్కారమును జేసినాఁడు. ఇంత కాలవిలంబమైనను కళేబరములు చెడలేదు. రామకృష్ణుల మరణవార్త ద్వారకావాస జనులకును దెలియలేదు.

ఇచ్చట యోగమహిమగల శరీరములగుటచే నట్లుచెడకయుండె నని యూహింపవీలగుచున్నది. బలరాముఁడు కృష్ణుని యెదుటనే ప్రాణములు విడిచెను. కృష్ణుఁడే బలరాముని కలేబరమున కగ్ని సంస్కారము నేల చేయలేదో! రామకృష్ణుల శరీరములు గన్నులతోఁ జూచినఁ గాని యర్జునుఁడు నమ్మఁడనియు నతని చేతులతోనే తమ శరీరములకు సంస్కారము జరుగవలయుననియుఁదన నిర్యాణమునకు వ్యవధిలేకుండుటయుఁ గారణముగా నట్లు శ్రీకృష్ణుఁడే చేసియుండు ననియు మాత్రమూహింప వీలగుచున్నది.

భాగవతము నందు

"హరిఁజూడన్ నరుఁ డేఁగినాఁడు నెల నేఁడయ్యెంగదా! రారు కా
నరు లెవ్వారును, యాదవుల్ సమదలోలస్వాంతు లీ వేళ సు
స్థిరులై యుండుదురా? మురారి సుఖియై సేమంబుతో నుండునా?
యెఱవై యున్నది చిత్తమీశ్వర కృతం బెట్లోకదే మారుతీ!"

అని ధర్మరాజు దుర్నిమిత్తములఁగని చింతిల్లి నట్లున్నది. భాగవత కథాను సారముగా నర్జునుఁడు యాదవ వ్యసనముకన్న ముందే ద్వారకకుఁ బోయి కృష్ణ నిర్యాణ సమయమున సన్నిహితుఁడై యుండెను. భాగవత కథ పర్వసంగ్రహమును సమర్థించుచున్నది. భారత గ్రంథము భిన్నముగా నున్నది.

ద్వారక సముద్రమున మునుఁగుట సుప్రసిద్ధమైనను బర్వసంగ్రహ పర్వము పేర్కొనలేదు. "సవృద్ధబాల మాదాయ ద్వారవత్యా స్తతో జనమ్" అని మాత్రమున్నది. దీనికిఁ గారణము యాదవుల నింద్రప్రస్థమునకుఁ జేర్చుటయే గాని ద్వారక సముద్రమున మునుఁగుట హేతువు కాదని విమర్శకులు తలఁచిరి. మౌసల పర్వము బహుపురాతన కాలమునందే రామకృష్ణుల ప్రభావ ప్రదర్శనార్థమై ప్రక్షిప్తమైన దనియు, వ్యాసరచిత భారతమునఁ బర్వసంగ్రహములో నున్నట్లు యాదవ వ్యసన ఘట్ట మాశ్రమవాస పర్వాంతర్గతముగానే యుండి యుండు ననియు వారి భావన పర్వసంగ్రహ పర్వపరీక్షతో గ్రంథమునందలి భాగములను వడఁబోయ నారంభించినచో బహుళములై కథాంశములు ప్రక్షిప్తప్రాయము లగును. అట్లు ప్రక్షిప్తములే యధికముగా నున్నవని యాధునిక విమర్శకు లందఱును దలఁచుచున్నారు. ఇట్లు మౌసలము క్లిష్టసమన్వయముగల పర్వము, తిక్కన దీని నేకాశ్వాస పర్వముగా రచించెను.

మహాప్రస్థానిక పర్వమునందలి శునకవృత్తాంతము పర్వసంగ్రహ సూచితము కాదు. యుధిష్ఠిరుఁడు మృతులయిన పత్నీ సహోదరులను విడువఁగలను గాని బ్రదికియుండి వెంటవచ్చుచున్న శునకమును విడువఁజాలనని యింద్రునితో

వివాద పడిన యంశయు పర్వసంగ్రహపర్వ సూచన ననుసరించి స్వర్గారోహణ పర్వమున నుండవలెను. కాని యిది యెట్లో మహాప్రస్థానిక పర్వమున కెక్కినది. 320 శ్లోకములుండవలసి యుండఁగా 120, 109, 110, సంఖ్యలను దెలుపు పర్వ సంగ్రహ పర్వము కలకత్తా బొంబాయి ప్రతులు చూపుచుండుటచే నిచ్చట గ్రంథము తారుమా రైనట్లు గోచరించును. మహాప్రస్థాన స్వరూపమును మనుస్మృతి యిట్లు వివరించెను.

"అపరాజితాం ప్రవాసాయ వ్రజే ద్దిశ మజిహ్మగః
అవిపాతా చ్ఛరీరస్య యుక్తో వార్యనిలాశనః"

చికిత్స చేయనలవికాని వ్యాధి వచ్చినపుడీశాన దిక్కు మొగమై పోవుచు యోగనిష్ఠుఁడై జల వాయు భక్షణము చేయుచు శరీరము నేలఁగలియు వఱకును మహాప్రస్థానమును జేయ వలయు నని యర్థము.

స్వర్గారోహణపర్వము: మహాప్రస్థానికమువలెఁ దెలుగున నిదియు నేకాశ్వాస పర్వమే. మూలమున దీనియందయిదధ్యాయములు గలవు. హరివంశాంతర్గత భారత శ్రవణ విధ్యధ్యాయమునుఁ జేర్చుకొన్న ప్రతు లాఱధ్యాయముల పర్వమునుగా దీనినిఁ బ్రకటించినవి. శునకవృత్తాంతము దీనియందుండవలసియుండగాఁ బూర్వపర్వమునందే చేర్పఁబడి యుండుటచేత నిచ్చటను బర్వసంగ్రహ పర్వ గ్రంథభాగములకుఁ బొత్తు కుదురుటలేదు. తెలుఁగు పర్వసంగ్రహము. "కర్ణు నరక ప్రాప్తియుఁ. దన్మోక్షణంబును, స్వర్గంబున భారత వీరుల సంగమంబును, గర్మ పరిపాకోపభాగంబు ననువృత్తాంతంబుల నొప్పి యిన్నూరు శ్లోకంబులు గలిగి పదునెనిమిదవ పర్వంబై స్వర్గారోహణంబు నాఁబరఁగె" నని యున్నది. సంస్కృత పర్వసంగ్రహమునఁ గర్ణుని నరకప్రాప్తిని గుఱించిన ప్రశంసయే లేదు. అందఱితోఁ బాటు గర్ణుని పేరును గలదు గాని యతని నరకమునకుఁ బ్రత్యేకతలేదు. తిక్కనయుఁ గర్ణుని నరక ప్రాప్తిని విశేషించి వర్ణింపలేదు. కాఁగాఁ దెలుఁగు పర్వ సంగ్రహమున నీయంశమెట్లు చేరినదో చిత్రముగా నున్నది. తిక్కనకుఁ బూర్వమే పై యంశము నన్నయ ప్రణీత భాగమున నున్నచో నేల విపులీకరింపఁడు? యుధిష్ఠిరునికిఁ గర్ణుఁ డన్నయని విదితమైన పిమ్మట నతని యాత్యంతిక నరకవర్ణన మనుచిత మని వదలివేసెనా? ఏమైనను నమూలమును ననుచితమునైన యీ వర్ణనము తిక్కన భారతమున లేదు.

వ్యాసభగవానునిచేఁ బ్రణీతమైన భారత గ్రంథముయొక్క నిజస్వరూపమూ

హకందనిది. బహు పురాతనకాలమునందే సంప్రదాయగతములైన యుపాఖ్యానములందుఁ జేరినవి. వివిధ ప్రాంతములందలి భాగములను జేర్చుటచేతనే యది భారత సంహితయైనది. (సంహిత యన నొక్కచోఁ జేర్పఁబడిన భాగములు గల గ్రంథము. ఉదా:- ఋక్సంహిత, యజుస్సంహిత మొదలయినవి). పర్వానుక్రమణిక మాత్రమే వ్యాసరచితమై యుండును. పర్వసంగ్రహపర్వము సంహితాకారుల చాతుర్య విలసితమేయని విమర్శకులు తలఁచుచున్నారు. పర్వసంగ్రహము పుట్టు నాటికే యితరుల రచనలు భారతమునం దెక్కినవి. తరువాతఁ బర్వసంగ్రహమెంత త్రోసినను మొండిచుట్టములై చేరిన ప్రక్షిప్తములును గలవు. కనుకనే మనకు లభించుచున్న సంస్కృత ప్రతులలో నిన్ని మార్పులు కానవచ్చుచున్నవి. తిక్కనకుదొరికిన ప్రతి నేటి యుత్తర దక్షిణ దేశప్రతులకు మధ్యగానుండిన విలక్షణ ప్రతియని పరిశోధకులు తలంచుచున్నారు.

భాషాంతరీకరణశిల్పము

స్వతంత్రరచనముకన్నను భాషాంతరీకరణమునఁ గ్లేశమెక్కువ, ఉభయ కవి మిత్రుఁడైన తిక్కయజ్వ మాతృకలోని యర్థములను మాత్రము గ్రహించి యనువాదమునఁ దెలుఁగుభాషా సంప్రదాయములను విలసిల్లఁజేసినాఁడు. భారత కవులు సర్వకవితాలక్షణములందువలెనే భాషాంతరీకరణమునందుఁ దరువాతి వారికి మార్గదర్శకులు.

తిక్కన విరాటపర్వాదిగా నవలంబించిన భాషాంతరీకరణ పద్ధతులను జివరి భాగముకదా యని జాఱవిడువక యాశ్రమవాసాది చతుష్టయమునందును నడపెను. అనౌచిత్యమును బరిహరించి యౌచిత్యమును బాటించి పాత్రములు పరస్పరము సంభాషించుచున్నట్లు నాటకరచనాశిల్పమును, రసానుకూలమైన రీతులను శైలిలో నిముడ్చుట తిక్కన యుద్దిష్టవిషయము. ఈ గుణము పూర్వపర్వములందువలెనే యిచ్చటను బ్రతిఫలించుచున్నది. ఈ పర్వములు చిన్న వగుటచేత నంతగాఁ గుదింపులును మదింపులును జరుగలేదు. ఆశ్రమవాస పర్వకథ మూలమునందు సైతము స్వతస్సిద్ధమైన నాటకతత్త్వము కలిగియుండుటవలనఁ బాత్రముల చిత్తవృత్తులను వివరించుపట్లఁ దప్ప కథాంశములను గుంచించుట కాని ప్రస్తరించుట గాని యంతగా జరుగలేదు.

ఒక్క భాగము మాత్రము విడువఁబడినది. సంస్కృత భారతమున జనమేజయుఁడు ధృతరాష్ట్రాదులకుఁ గల్గిన పుత్రదర్శన పర్వమునందలి యద్భుతమును నమ్మక, భగవంతుఁడైన వ్యాసుఁడు మృతుఁడైన మా తండ్రిని నాకుఁ జూపి యను

గ్రహించినచో నానాటి సంఘటన సత్యమని భావింతు నని వైశంపాయనునితో ననెను. అప్పుడు వ్యాసుఁడు వచ్చి పరీక్షిత్తును, నతనికి శాపమిచ్చిన శృంగిని, నతని తండ్రి శమీకుని సయితము చూపి దన మహిమను ఋజువు చేసుకొన వలసినవాఁ డయ్యెను. జనమేజయ ఉవాచ:-

"మమాపి వరదో వ్యాసో దర్శయే త్పితరం యది
త ద్రూప వేష వయసం శ్రద్ధాద్యాం సర్వమేవ తే
ప్రియం మే స్మాత్ కృతార్థశ్చ స్యా మహం కృతనిశ్చయః
ప్రసాదా దృషిముఖ్యస్య మమ కామః సమృధ్యతామ్."

సౌతిరువాచ:
"ఇత్యుక్తవచనే తస్మిన్ నృపే వ్యాసః ప్రతాపవాన్.
ప్రసాద మకరో ద్ధీమాన్ ఆనయచ్చ పరీక్షితమ్
తత స్తద్రూప వయస మాగతం నృపతిం దివః
శ్రీమంతం పితరం రాజా దదర్శ జనమేజయః
శమీకం చ మహాత్మానం పుత్రం తం చాస్య శృంగిణమ్
అమాత్యాన యే బభూవుశ్చ రాజ్ఞ స్తాం శ్చ దదర్శహ."

ఇది పర్వసంగ్రహ పర్వమున సూచింపఁబడని కథాంశము గనుక ప్రక్షిప్తమై యుండునని విమర్శకులభిప్రాయపడిరి. ఆశ్రమవాసపర్వమునందలి 34, 35 అధ్యాయములందు జనమేజయుని సంశయములు తన్నివారణములును వర్ణింపఁ బడినవి. వానినిఁ దిక్కన యనువదింపలేదు. తిక్కనకు దొరికిన ప్రతి యందుఁ బై రెండధ్యాయములును లేకుండెనని సమర్థించుటకంటె రసజ్ఞశేఖరుఁడైన తిక్కన జనమేజయునికి న్యూనతాపాదకమైన యా నీరసభాగము ననువదింపక విడిచెననుట లెస్స. పరీక్షిత్తును దర్శించుట న్యూనతాపాదక మెట్లగునని శంకించుట కాక వ్యాసుఁడట్లు చూపినఁగాని నేను యుధిష్ఠిరాదులకును ధృతరాష్ట్రాదులకును గలిగిన బంధు దర్శనమును నమ్మఁజాలఁ ననుటలోనే యా నీరసబీజము కలదు.

భారతశ్రవణ విధిరూపమైన యధ్యాయము హరివంశాంతర్గతమైనను భారతము చివరి భాగమున నతుకఁబడినది. దానిని సైతము తిక్కన తెనిఁగింప లేదు. నియమనిష్ఠలతో మహాభారతమున జదివి తదంగములుగా జపహోమాదులు చేయుట మున్నగు నంశములుగల విధిరూపాధ్యాయము సంస్కృత భారతమునకే సంబంధించిన విషయము. తెలుఁగు భారతము ధర్మజ్ఞానమును గావ్యానందమును మాత్రము ప్రసాదించుట కుద్దిష్టమై యుండుటచేతఁ బారాయణవిధినిఁ దెలుపు భాగమవసరము లేదని కాఁబోలు దానిని విడిచెను.

ముప్పదితొమ్మిది యధ్యాయములును దాదాపు పదకొండు వందల శ్లోకములును గల యాశ్రమవాస పర్వమును రెండాశ్వాసములలో 356 పద్యములతో ననువదించినాఁడన్నచో రసస్పర్శలేని బహుళమైన పదజాలమును సార్థకపద సంపదతోఁ గుంచించియు, ననవసరము లయినవని తోఁచిన వానిని విడిచియు నాంధ్రీకరించెనని వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. అట్లే మౌసల మహాప్రస్థానిక స్వర్గారోహణ పర్వములందును గథాంశములు లుప్తములుగాని భంగినిఁ దన యనువాద కౌశలమునుఁ జూపెను "ప్రాప్య రాజ్యంమహాత్మనః" అని మూలముననుండ, జనమేజయ హృద్గత పాండవ గౌరవమును వివరింపఁదలచినవాఁడువలె "పితృపితా మహక్రమప్రాప్తంబయిన సామ్రాజ్యంబు జగత్పూజ్య ప్రకారంబునం గైకొని" అని యనువదించినాఁడు. సంస్కృత మహాభారతమునందలి జనమేజయుని కన్నను దెనుఁగు భారతపు జనమేజయుఁడు తత్తద్భావములచే నెక్కువగాఁ బ్రభావితుఁ డగచుండుననుట కిట్టి యుదాహరణములు పెక్కులు గలవు.

యుధిష్ఠిర పరోక్షమున భీమ ధృతరాష్ట్రులు సన్నిహితులైనచోఁ బుత్రులఁ దలంచుకొని యాంబికేయుఁడును, దుర్యోధుచెయ్దములను స్మరించి వాయు నందనుఁడునుఁ నుమ్మలించుచుందురు. యుధిష్ఠిరుని యెదుటఁగాని బంధుసన్నిధినిఁ గాని మనోవృత్తులను బయల్పడనీయక మెలంగుదురు. ఈ యంశము మూలమున నంత చక్కఁగా నుపవర్ణితము కాలేదు. పాత్రముల చిత్తవృత్తుల విశదము చేయుటయే కథాగమనమునకు జీవగఱ్ఱ యని భావించు తిక్కన

గీ॥ "హృదయముల నొండొరుల దెస నిట్టివార
లయ్యు నతఁడు నతండు నన్యోన్య భాష
ణముల యప్పుడు మృదుల విన్యాసమొప్ప
నాడుదురు చుట్టములు మెచ్చునట్లు గాఁగ"

అని వ్రాసినాడు. ఇది మూలమునకు సౌందర్యదాయకమైన యాంధ్రీకరణము.

ధృతరాష్ట్రుఁడు పౌరులను రావించి తనను వనస్థుఁడగుట కనుమతింపుఁ డని వేఁడినప్పుడు వారు దుఃఖితులై తమ పక్షమునఁ బౌరానుమతినిఁ దెల్పుటకై యొక బ్రాహ్మణుని నియోగించిరి. అతని పేరును గుఱించి రెండు మూఁడు పాఠములున్నవి. స్వాధ్యాయమండలి ప్రతిలో "సాంబాఖ్యో బహ్వృచో రాజన్" అని యున్నది. వావిళ్ళ వారి ప్రతిలో సంభావ్యో బహ్వృచో రాజన్ అనియున్నది. తెనుఁగు భారతమున "ఆర్య చరితుండును జతురాలాప కల్యుండును నగు శంభుడను విప్రోత్తమునకుం జెప్పి" యనియుండ టిప్పణిలో 'శాకల్యుండను' అను

పాఠభేదము చూపఁబడినది. ఈ విధముగా నితఁడు సాంబుఁడు. శంబుఁడు, శాకల్యుఁడును నగుటయేకాక వావిళ్ళ ప్రతి ననుసరించి యనామధేయుఁడు.

ఇందు శాకల్యశబ్దము సుప్రసిద్ధమైనట్టిది. బ్రహ్మాండ పురాణ మొక శాకల్యునిఁ బేర్కొన్నది. ఇతఁడు అతిథియై వచ్చిన పరసువను రాక్షసుఁడన్నము చాలదని తనను మింగ రాఁగా, వేయితలలు రెండువేల చేతులును గల రూపమును ధరించి వానిని బెదరించి పాఱఁద్రోలెను. జనకుని యజ్ఞశాలలో నితనికిని యాజ్ఞవల్క్యునికిని శాస్త్రచర్చ జరుగటయు నందులో నితఁడోడి ప్రతిజ్ఞా ప్రకారము ప్రాణములు విడుచుటయు జరిగెను. భాగవతము శాకల్యుఁడు సౌభరి పుత్రుఁడనియు, నితఁడు చదివిన ఋగ్వేదము నయిదు విధములుగా విభజించి వాత్స్యుఁడు, మౌద్గల్యుఁడు శాలీయుఁడు, గోముఖుఁడు, శిఖరుఁడు ననువారికి బోధించినట్లును దెలుపుచున్నది.

తిక్కన 'శంబువు' అనికాక శాకల్యుఁడనియే తెనిఁగించి యుండును. కానిచో నతనికిఁ జతురాలాపకల్యుండను విశేషణము నతికియుండఁదు. 'బహ్వృచః' అను సంస్కృత భారతమునందలి విశేషణము ఋగ్వేది యగు బ్రాహ్మణుఁ డని తెలుపు చున్నది. ఋగ్వేదియైనను, యజుర్వేదియైనను ప్రస్తుతమునకుఁ గలుగు లాభమొక్కటియే కావున, బహ్వృచ శబ్దమును గౌణముగా గ్రహించి తిక్కన చతురాలపకల్యుండని తెనిఁగించెననియు, నతని గంటమునుండి దొరలినది శాకల్య శబ్దముగాని 'శంబు' శబ్దముగాదనియు నూహింపవీలగుచున్నది.

ధృతరాష్ట్రుఁడు కురుక్షేత్రమును జేరినప్పుడతని నాహ్వానించి యచ్చటనే యుండు మని కోరిన శతయూపుని తండ్రి తాతల ప్రశంస యప్రస్తుత మగుటచేఁ దిక్కన యనువదింపఁ డయ్యెను.

యుధిష్ఠిరాదులు పితరులను జూడఁగోరి శతయూపాశ్రమమునకు వెళ్ళినప్పుడందలి మునులు వేర్వేఱుగా నందఱను నెఱుకపఱచు మని సంజయునిఁ గోరిరి. అతఁడు యుధిష్ఠిరాదులను, ద్రౌపదీ ప్రభృతులను జ్యేష్ఠానుక్రమమున నెఱుక పఱచెను. ఇచ్చట సంస్కృత భారతమునఁ బాండవ పత్నుల నెఱిఁగించిన తోడనే యుత్తరను, తరువాతఁ బూర్వ సువాసిను లయిన దుర్యోధనాదుల భార్యల నెఱుక పఱచినట్లు కలదు. ఈ సందర్భమునఁ దిక్కన యౌచిత్యమును బాటించి ధృతరాష్ట్ర-స్నుషల పిమ్మట నుత్తరను బరిచయము చేసినట్లు వ్రాసినాఁడు. ఒకటి:

పూర్వసువాసినియైన యుత్తరను నట్టివారేయైన ధృతరాష్ట్రుని కోడండ్రను విడిచి ముందుగాఁ, బేర్కొనుట జ్యేష్ఠానుక్రమ మర్యాదకు విరుద్ధము. రెండవ యంశ మేమ నఁగా సువాసిను లయిన పాండవ పత్నులను జెప్పి వెంటనే యుత్తర నెఱుక పఱచినచో నొక్కసారిగా నందఱికిని నభిమన్యుమరణము జ్ఞప్తికి వచ్చి భిన్ను లగుదురు. చెప్పువాఁడు సంజయుఁడు. అతఁడొకరి మనస్సులను నొప్పించు నట్లు పల్కుట యాదినుండియు నెఱుఁగఁడుగదా! కనుక నుత్తరను జిట్టచివర నెఱుక పఱచినట్లు వ్రాసినాఁడు తిక్కన.

ధృతరాష్ట్ర-స్నుషల నెఱుకపఱచుటద్వారా నందఱికినిఁ గురుశత మరణము జ్ఞప్తికి వచ్చినమీఁదట నభిమన్యు మృతి స్మృతికివచ్చుట యంత బాధాకరము గాదు. ఈ ఘట్టమున వ్యాసుఁడు మంచి వృత్తములను వ్రాసెను. తిక్కనయు మంచి పద్యములను రచించెను.

ఉత్తరను గుఱించి

"ఇయం తు నిష్టాప్తసువర్ణగౌరీ
రాజ్ఞో విరాటస్య సుతా సపుత్రా
భార్యాభిమన్యో ర్నిహతో రణే యో
ద్రోణాదిభిస్తై ర్విరథోరథస్థైః

అని వ్యాసుఁడును.

"వీరి చందంబయై కడు గారవమునఁ
దనుసుభద్ర వొదువ నున్న తరుణి, ద్రోణ
కర్ణ ముఖ యోధవీరులఁ గలఁచి తెగిన
యట్టి యభిమన్యు ప్రియ యుత్తరాభిదాన"

అని తిక్కనయు వ్రాసిరి. వ్యాసుని యొడిలోఁ బరీక్షిత్తు కలఁడు. తిక్కన యుత్తరను సుభద్ర పొదివియున్నది. కురువంశాంకురమైన పరీక్షిత్తుమేనికి మన్నంటనీయక యెత్తుకొనువా రెందఱో కలరు. తరుణియైన యుత్తరకుఁ గలిగిన పతివియోగ దుఃఖ మపరిహార్యము. కనుకనే మూలమునందలి "సపుత్రా" యను విశేషణమును ద్రోసిపుచ్చి యుత్తరకు 'తరుణి' యనియుఁ 'నభిమన్యు ప్రియ' యనియు విశేషణములను జేర్చి, యామె సుభద్రచేఁ బొదువఁ బడి యుండుట నభివర్ణించి తిక్కన తన లోకజ్ఞతను వెల్లడించినాఁడు.

సంస్కృత మహాభారతమునందలి జనమేజయుఁడు పుత్రదర్శన పర్వకథను విని "కథం ను త్యక్తదేహానాం పున స్తద్రూప దర్శనమ్" అని వైశంపాయను నడుగుటయు, నతఁడు "అవి ప్రణాశః సర్వేషాం కర్మణా మితినిశ్చయః" అని ప్రారంభించి సమాధానములను జెప్పుటయుఁ గలదు. చనిపోయినవారు పూర్వదేహములతోనే యెట్లు కనఁబడిరి? అని జనమేజయునివంటి బుద్ధిమంతుఁ డడుగుటయు, దానికి, గర్మ సిద్ధాంతమును భూతనిత్య సంవాదమును బ్రతిపాదించి వైశంపాయనుఁడు చెప్పుటయు జిజ్ఞాసుజనబుద్ధి వైశద్యార్థమని ధర్మప్రధాన రచనగల సంస్కృత భారతమునకు సరిపడును. కావ్యదృష్టితో వ్రాయఁబడిన తెనుఁగు భారతమును నా యంశమును జేర్చినచో జనమేజయునికి న్యూనతాపాదకము కాకపోదు. కనుక నా భాగమును బూర్తిగాఁ దిక్కన యనువదింపక విడచెను.

సుమారు మూఁడువందల శ్లోకములలోనున్న మౌసలపర్వమును 223 పద్యములలో రసవత్తరముగా ననువదించినాఁడు తిక్కన. కృష్ణ బలరామ మహత్త్వమును ప్రతిపాదించుటకై పుట్టినదని భావింపఁబడు నీ పర్వము మూలమునందే రసవంతముగానున్నది. దానిని రసవత్తరముగా రచింపక కావ్యకళానిష్ణాతుఁడైన తిక్కన యేల విడుచును? సంస్కృత రచన ననుసరించి యాదవకుమారుఁడయిన సాంబుని కడుపునఁ బుట్టినది "ఆయసముసలము." తెనుఁగు సీమలో నెచ్చటను నినుపరోకలి వాడుకలో లేనందున నాయన విశేషణమును దీసివేసి తిక్కన 'ముసలము' అని మాత్రమే వాడినాఁడు!

సముద్రతీరమున జరిగిన యాదవ మౌసలాహవము. సంస్కృత భారతమున "తతః పరిషదో మధ్యే యుయాధానో మదోత్కటః" అని యుయాధానుఁడు కృత వర్మను దూలనాడుట కారణముగా రేగినట్లు కలదు. తిక్కన సాత్యకి కృతవర్మను దూషింపఁగా యుద్ధము వాటిల్లినట్లు వ్రాసినాఁడు. వీరుఁడై యెక్కువ మందిని చంపినవాఁడు సాత్యకి. మధుపాన మత్తులైనవారి కలహ మెవ్వరిమూలమునఁ బెఱిగినను దుల్యమే. కావున నిది విశేషములేని మార్పు. మూలమును సంగ్రహించుటయే యిచ్చటి యనువాదకుని యుద్దేశము. ఇట్టి యనువాదము లచ్చటచ్చటను గలవు.

యాదవులందఱును మడిసిన పిమ్మట శ్రీకృష్ణుఁడు ద్వారకకు వెళ్ళి వసు దేవునితో నెల్ల వృత్తాంతమును జెప్పి. తన కింక ద్వారకయందుండుటకు బుద్ధి పుట్టుట లేదనియు, బలరామునితోఁబాటు తపస్సున కేఁ గెద ననియుఁ జెప్పి వసుదేవునికి నమస్కరించి వచ్చిన పట్టున వసుదేవుని స్థితి యెట్లుండెనో మూలము వివరింపలేదు.

చం॥ "విని బలుజీవివోయి మది విహ్వాలమై మెయి మ్రానుపాటు వొం
దనునికి, మీఁదఁగేశవుఁడు దానును రాముఁడు నిల్లువాసి కా
ననమున నుండువారమని నైష్ఠికతం బలుకంగ నున్నచే
తనయు నడంగఁజేష్టితము దక్కి శవాకృతి నుండె నత్తతిన్"

అని తిక్కన వివరించినాఁడు. వ్యాసుని యైతిహాసిక కథాగ్రంథము. తిక్కనది చిక్కని కావ్యరచన.

మహాప్రస్థానిక పర్వమున యుధిష్ఠిరుఁడు సకళత్రసోదరుఁడై యరుగుటకు ముందు పరీక్షిత్తును హస్తిపురికిని, వజ్రుని నింద్రప్రస్థమునకును నభిషిక్తులను జేసి, వారిరువురిని నరసికొనుమని సుభద్రకుఁ జెప్పు నవసరమున మూలమునందు "దుఃఖార్తశ్చాబ్రవీ ద్రాజా సుభద్రాం పాండవాగ్రజః" అని యున్నది. పాండవాగ్రజున కీ దుఃఖమేల కల్గినదో! వీతరాగుఁడై తానై మహాప్రస్థానమును జేయనున్నాఁడు. చిన్నవాఁడయిన పరీక్షిత్తుకు లోపములేని యట్లు యుయుత్సుని మంత్రిగా నియమించినాఁడు. కృపాచార్యుని యండ యుండనేయున్నది. ఇఁక వశీకృతచిత్తుఁడైన ధర్మరాజు కీ దుఃఖమెందులకు? తాను దుఃఖించుచు నివారించినచో, ప్రాణప్రియుఁడయిన ధనంజయుని శాశ్వతముగా వదలి సుభద్ర పరీక్షిత్తును గాపాడుటకై నిలుచునా? కావున నా దుఃఖార్తత్వమును బరిహరించి యుల్లాసముగాఁ బలికించినాఁడు తిక్కన.

మ॥ "భవదీయాత్మజు నాత్మజుండు కురుభూభారోద్వహుండయ్యె యా
దవ వంశోత్తరుఁ డైన వజ్రునకు నింద్రప్రస్థరాజ్యంబు గౌ
రవ దీప్తంబుగ నిచ్చినాఁడ సుచరిత్రా! రక్షణీయంబులై
నవి యీ యిండులు రెండు నీవు దృఢ ధైర్యం బొప్పరక్షింపుమీ."

యుధిష్ఠిరాదులు ధర్మాదులలోఁ గలిసినట్లును, ధృతరాష్ట్రుఁడు కుబేరలోకమునకుఁ జేరినట్లును, తక్కినవారు తత్తద్దేవతాభావము నొందినట్లును జెప్పుకొని పోవుచు దుర్యోధనుఁడు కలియందును, నతని తమ్ములు రాక్షసులందునుఁ గలిసినట్లు చెప్పఁబడినది. ఇచ్చట స్వాధ్యాయమండలి ప్రతిలో "ధృతరాష్ట్రాత్మజాః సర్వే యాతుధానా బలోత్కటాః, బుద్ధిమంతో మహాత్మనః శస్త్రపూతా దివంగతాః" అని యున్నది. స్వర్గమును ధృతరాష్ట్రతనూజులు చేరినట్లే భాషాటీక వివరించినది. తిక్కన "యతని తమ్ములెల్ల యాతుధానావలిఁ గలిసిరి" అని వ్రాసెను. వావిళ్ళ ప్రతి "ధృతరాష్ట్రాత్మజాః సర్వే యాతుధానాన్ ప్రపేదిరే" యని తిక్కన రచన కనుకూలమైన శ్లోకమును బ్రకటించినది.

ఉత్తరదేశ ప్రతి ప్రకటించిన శ్లోకమునఁ గౌరవులకు 'బుద్ధిమంతః, మహాత్మానః ' అను విశేషణములు సయితముఁ గలవు. శస్త్రహతులయిరి కావున తత్కాలమున మాత్రము స్వర్గమునకుఁజేరి పిమ్మట యాతుధానులయందుఁ గలసిరని సమర్థించుటకు వీలున్నది. కాని తత్తద్వ్యక్తులు తత్తద్దేవతలలో లీనమైరన్న సందర్భము నందే పై శ్లోకమును స్వాధ్యాయమండలి ప్రతి ప్రకటించినది. కాఁగా నసంగతమైన యీ పాఠమును హరించియో సరియైన మూలము చిక్కుటచేతనో తిక్కన ధార్త రాష్ట్రులు యాతుధానులందుఁ గలసినట్టు లనువదించినాఁడు. వావిళ్ళ ప్రతి పాఠము తిక్కన యనంతర కాలమున విలసిల్లెనేమో! ఈ విలీనత, యందఱకును స్వర్గనరక ఫలము లనుభవించుట పూర్తియైన పిమ్మట జనమేజయుఁ డడుగుటచేఁ బరమ గుహ్యమైనదనుచుఁ జెప్పఁబడినది. దుర్యోధనుఁడు కలియందుఁ గలిగిన యంశము నుత్తరదేశ దక్షిణదేశ ప్రతులు రెండును దడవలేదు. సందర్భముల కతుకని యిట్టి ప్రక్షిప్తములు తన యెదుటఁ బడినప్పుడు వానినిఁ బరిహరించి స్థలాంతరమునఁ జెప్పఁబడిన సత్యముల నాధారముగాఁ గొని (వ్యాసుఁడు ధృతరాష్ట్రాదులను గంగా తీరమునకుఁ గొనిపోవుటకు ముందు దేవతాంశములు రాక్షసులవతారములెత్తి కురుక్షేత్రమున యుద్ధముచేసి మరణించిరని చెప్పునప్పుడు "కలిసుయోధనుఁ డయ్యె రాక్షసులు పుట్టిరాతని యనుజులై" యని వ్రాసిన తిక్కన రచనకు సరియైన మూలము కలదు. "కలిం దుర్యోధనం విద్ధి శకునిం ద్వాపరం తథా దుశ్శాసనాదీన్ విద్ధి త్వం రాక్షసాన్ శుభదర్శనే") తిక్కన యనువదించినాఁడని మనము గ్రహింపవలసియున్నది.

ఇట్లు విరాటపర్వాదిగా నారంభించిన తన భాషాంతరీకరణ పద్ధతులను దుది ముట్ట నవలంబించి నన్నయ భట్టారకుఁడు నాఱువోసిన యనువాద రహస్యములను దన రచనా క్షేత్రమునఁ బంట పండించినాఁడు తిక్కన. భారతమును గావ్యపద్ధతి ననువదించు నూహ నన్నయకుఁ దట్టుటకుఁ గన్నడ భాషయందున్న పంపభారతము కారణమై యుండునని కొందఱు విమర్శకుల యూహ. ఖండాంతరాలలో వాణి జ్యాదులను నడుపుచుండిన యాంధ్రులకుఁ దమ పొరుగువారైన కన్నడిగుల సాహిత్యము సుంతయుఁ దెలియకుండె ననుటకంటెఁ దనకు ముందొక శతాబ్దకాలమునఁ బుట్టి పశ్చిమ చాళుక్యులవలనఁ బ్రచారము నొందుచుండిన పంపభారతము తెలిసి యుండె ననుటయే సమంజసము. అది కొంతవఱకుఁ దన నూతన కావ్యమునకుఁ దోహదమగుటయుఁ దప్పుకాదు. పంపభారతమును ముందు పెట్టుకొని తెనిగించు నంతటి ప్రతిభా దరిద్రుఁడు కాడు నన్నయ. పంపఁడు సంగ్రహించి వ్రాయుటయుఁ గావ్యపద్ధతిని ననువదించుటయు నను మార్గములను

గనిపెట్టెను; గావునఁ దన్మార్గములు భట్టారకునికి నచ్చి యవలంబించె నన్నంత మాత్రమున మనములికిపడ వలసిన యవసరములేదు. తిక్కన రచనలను ననుసరించిన కర్ణాట కవికుల సార్వభౌమాదులగు కన్నడకవులును నున్నారు. పంపఁడు జన్మతః ఆంధ్రుఁడగుటయుఁ గారణముగా నతని గ్రంథమున కాంధ్ర ప్రాంతమునఁ బ్రచారముండుటయు నన్నయ నారాయణభట్టులు దాని నాదరించుటయు నసంభావ్యములు గావు.

పంపకవి జైనుఁడు. భారతమునకు "విక్రమార్జున విజయమని" పేరు పెట్టి చాళుక్యాన్వయుఁడైన తన యేలిక "అరికేసరి" యందులోఁ బ్రతిబింబించునట్లుగా నర్జునుని నాయకుఁడుగాఁ జేసినాఁడు, తెనుఁగు భారతమున యుధిష్ఠిరుఁడే మహానాయకుఁడు. "అరికేసరి" పదమును చాళుక్యవంశీయుల బిరుదమైన "విక్రమ" శబ్దమును నర్జునునికి విశేషములుగా మార్చినాఁడు పంపకవి. అతని కావ్యమున నర్జుననకే పట్టాభిషేకము. సుభద్రయే మహారాణి. సంస్కృత భారతమునందలి వైదిక ధర్మములను, నుపాఖ్యానములను విడిచి కేవల పాండవకథను శాంతి పర్వాంతముగా స్వీకరించి పదునాలుగాశ్వాసముల కావ్యముగా రచించినాఁడు. అతని యాదర్శమునకును నన్నయభట్టారకుని ధ్యేయమునకును మిక్కిలి యంతర మున్నది.

ఇఁకఁ దెనుఁగుదేశపు నడిగడ్డపై గంటమునుబట్టి దేశీయమైన సంస్కృతిని, సభ్యతను, బలుకుబడులను బంట పండించిన తిక్కయజ్వ, యెదుటనున్న సంస్కృతవాణినిఁ దనచుట్టు మెలంగుచున్న తెలుఁగు భారతిని నుపాసించి, తరువాతివారయిన కన్నడ కవులకు సైతము కావ్యసౌందర్య భిక్షను బెట్టియుండు ననియే భావింతము. తెనుఁగుకవుల కానాటినుండి నేటివఱకును దిక్కన పెట్టినదే కదా భిక్ష!

కాశ్యప గోత్రుండును వల్లభసూరిపుత్రుఁడును నగు తిమ్మయ మహాభారతమును ద్విపదకావ్యముగా రచించెను. ఇతఁడు సభాపర్వమును వ్రాసెనో లేక యది శిథిలమయ్యెనో కాని దానిని బాలసరస్వతీశ్వరుఁడు వ్రాసెను. ఇట్లు వీరిద్దఱి రచనములును గలసి ద్రోణపర్వము వఱకును గలవు. క్రీ. శ. 1684-1710 ప్రాంతమునఁ దంజావూరు నేలిన శహాజీ కొలువులోని కుప్పయ్య మంత్రి యీ ప్రతులను వ్రాసియుంచినట్లు సరస్వతీమహలు కేటలాగు తెలుపుచున్నది.

కర్ణపర్వము మొదలుకొని తుదివఱకును దిమ్మయ కుమారుఁడయిన సోమన రచించెను. ఆశ్రమవాస పర్వమును దిక్కన రెండాశ్వాసములుగా రచింప సోమనయు

రెండాశ్వాసముల ద్విపదనే వ్రాసెను. మౌసల మహాప్రస్థానిక స్వర్గారోహణ పర్వము లుభయుల రచనలయందును నేకాశ్వాసములే. మహాప్రస్థాన పర్వాదిని "యుధిష్ఠిరుఁ డు ప్రస్థానంబునకు మదియొలయనన్నరునితోడ" నని తిక్కన రచన

"క్రమమున వినిపింపఁగా ధర్మసుతుఁడు
మౌని మహాప్రస్థానమునకుఁ జిత్తంబు
దగిలియున్నది నేఁడు తన మేన ననఘ
పదిలమే యిదియేని పార్థనావుడును"

అని సోమన ద్విపద యన్ని విధములను ద్విపద భారతమునకుఁ గవిత్రయ భారతము మార్గదర్శకమై యుండును. దైవ చమత్కృతియేమన ద్విపద భారతమునకు (తిమ్మయ, బాల సరస్వతీశ్వర సోమనలు) గవిత్రయ మేర్పడినది. వచన రచనలు, నాటకములు, కథలు, ఖండకావ్యములు మొదలయినవాని కెన్నింటికో తిక్కన భాషాంతరీకరణ వరప్రసాదమైనది.

మహాభారత పరిసమాప్తియందు జనమేజయుఁడు తక్షశిలనుండి హస్తినకు వచ్చినట్లు కలదు. "విసర్జయిత్వా విప్రాన్ తాన్ రాజాపి జనమేజయః తత స్తక్ష శిలాయాః స పున రాయా ద్గజాహ్వాయమ్'', తిక్కన తక్షశిల ప్రశంస నెత్తలేదు. ఇది యర్వాచీన పాఠమని కాని, తిక్కన గ్రామనామముల కంత ప్రాధాన్యము నీయలేదని కాని తలంపవలసియున్నది. ఇట్లు తిక్కన తన భాషాంతరీకరణ శిల్పము ననల్పముగాఁ జూపెను.

పాత్రచిత్రణము

ధృతరాష్ట్రుఁడు: తిక్కన గంటముతో నొక్కులు దీరి సజీవమునయిన పాత్రములలో ధృతరాష్ట్రుఁ డొకఁడు. యుద్ధానంతరము యుధిష్ఠిరుని చెంతనున్న సమయమున నితఁడు సంపూర్ణముగాఁ బశ్చాత్తాప శుద్ధుఁడయ్యెను. ధర్మజుఁ డెంత భక్తిని దన్పైఁ జూపిన నతనిపై నంత వాత్సల్యమునుఁ జూపెను. పాండవులకు శ్రీయు, నాయువు వైరిజయమును గలుగునట్లుగా మానసమున నాశాసింపఁగల చిత్తశుద్ధినిఁ బొందెను. వనవాసమున కేఁగవలదని నివారించుచు బాష్పపరిప్లుత నేత్రములతోఁ జరణములపై వ్రాలిన యుధిష్ఠిరునిఁ గ్రుచ్చి యెత్తి కౌఁగిటఁజేర్చి "నీవు శుశ్రూష చిర కాలనియతిఁ జేసితే ను వృద్ధుండనైతి. నాకింక దపము వలదయ్య?'' అని బుజ్జగించిన యాంబికేయుఁడు వెనుకటి ధృతరాష్ట్రుఁడుగాఁడు. కన్నతండ్రివలె మాఱి పోయినాఁడు. వనవాసగమనము నిశ్చితమైన పిమ్మట

ధర్మరాజు నేకాంతమునకుఁ గొనిపోయి రాజనీతి విశేషములను బ్రేమపూర్వకముగా నుపదేశించినాఁడు.

ఆశ్రమవాసమున కేఁగునప్పుడు పురజనులయెదుటఁ దమ పూర్వులు పాలించిన తెఱఁగును దడవి యుధిష్ఠిరునికిఁ బౌరులకును, బౌరులను యుధిష్ఠిరునికిని నిల్లర (న్యాసము) గావించుచున్నానని పలికిన యాంబికేయునియందుఁ బ్రజాను రంజకమును, బుత్రవాత్సల్యమును నుద్దీప్తము లయినవి.

యుద్ధానంతరము పదునైదుసంవత్సరములు పాండవపోషణలోనుండి గతమును విస్మరించిన ధృతరాష్ట్రుఁడు బంధుమిత్రులయు, పౌరజానపదులయు నభిమానమును జూరగొన్నాఁడు. కనుకనే యతఁడు వనవాసమునకై నగరు వెడలి నప్పుడు కుంతి మొదలయిన యంతఃపురాంగనల పక్ష్మాంతములనుండి భాష్పసలిల సంతానములు దొరలినవి. పాండవాగ్రజుఁడు శోకదీనుఁడై "హా మహారాజముఖ్యా! యెందరిగెద" వని యొడలు కంపింపఁ జదికిలఁబడినాఁడు. ఎల్లవారును శోకవ్యాకులత్వము నొందినారు. ఎండకన్నెఱుఁగని నగర స్త్రీలు వృద్ధునిఁ జూడ నార్తి వికలగతులై వచ్చినారు.

శతయూపాశ్రమమందును, గంగాతీరమునందలి పుత్రదర్శనాద్భుతము నందును, మునులసన్నిధియందును మన్ననలను బడసి, గంగాద్వార బరిసరారణ్యమునఁ దుష్కరతపముఁ జేసి, కార్చిచ్చునందు మేనుఁదొఱఁగి, స్వర్గధామమును జేరుకొన్న యాంబికేయునియందు గుణలోపమించుకయుఁ గానరాదు. అట్లు కానరాకుండఁ దిక్కన ధృతరాష్ట్రపాత్రమున కమృతముఁ బోసి యుజ్జీవింపఁజేసినాఁడు.

ధర్మరాజు: తిక్కన విరాటపర్వాదిగాఁ దీర్చిదిద్దిన పాత్రము లన్నియుఁ గడ ముట్టువఱకును దమతమ స్వభావములను జారవిడువక వెనుకటి బిగువుతోనే నడచినవి. జూదము మొదలుకొని రణయజ్ఞము ముగియువఱకును యుధిష్ఠిరుఁడు ధీరోదాత్తుఁడై వశీకృతచిత్తుఁడై మెత్తని పులియై, నీతికుశలుఁడై వ్యవహరించినాఁడు. తదుపరి భీష్మోపదేశమునఁ గాకలుదీరిన ధర్మజ్ఞుఁడైనాఁడు. మనశ్శాంతి నిమిత్తమును, బ్రాజ్యసామ్రాజ్య పునస్థాపనార్థమును నశ్వమేధముఁ గావించి రాజ్యరమా వల్లభుఁడైనాఁడు. పితృసేవాతత్పరుండును బ్రజారంజకుఁడునై ముప్పదియైదు సంవత్సరములు చక్రవర్తిత్వమును నెరపినాఁడు. మహానాయకుఁ డైన యుధిష్ఠిరుని యందేఘట్టమునను నాత్మగుణములు తఱుగలేదు. ధర్మజ్ఞుఁడు నీతిజ్ఞుఁడు నియతిజ్ఞుఁడునైన యతని త్యాగ శౌర్యధైర్యముల కెన్నఁడును దక్కినవారు తక్కువయే.

కలిమి గలిగినఁ గలవరవడుటయు, విపత్తువచ్చిన వితాకుపడుటయు నధీరుల లక్షణములు, ధర్మజునియం దెన్నఁడును మార్పులేదు. మహాపరాక్రమవంతుల మనుకొనుచున్న సోదరులను గళ్ళెములువేసి బిగించుచుండెనే కాని యెన్నఁడును స్వేచ్ఛగా విడువలేదు. గాంధారీ ధృతరాష్ట్రులు హతపుత్రులై తమ పంచను జేరిరి గదా యని యొక్కనాఁడును జులకనగాఁ జూడలేదు. ఇతరులను జూడనీయలేదు. భీమునంతటివాఁడును మనస్సునఁ గలఁతఁజెందవలసినదే కాని యన్నయెదురుగా నెన్నఁడును వృద్ధుల యెడ భిన్నప్రవర్తనతో నడఁచి యెఱుఁగఁడు. యుధిష్ఠిరుని యాజ్ఞాశక్తి యప్రతిహతమైనట్టిది. ఆ తల్లిదండ్రులకుఁ గుడువను గట్టను బెట్టను నుదాత్తస్ఫీతములైన వస్తువ్రాతముల నిచ్చుటయేగాక తన్నుఁగొలువవచ్చినవారు మున్నుగా ధృతరాష్ట్రునిఁ గొలిచిరేని దానికి మనస్సు పల్లవింప ముద మొందఁగల చిత్తపరిపాకము యుధిష్ఠిరునివంటి వానికే లభ్యము.

ధృతరాష్ట్రుఁడు వల్కలములు ధరించి కాననమున కేఁగెద నన,

"తల్లియుఁ దండ్రియున్ గురుఁడు దైవము నా కరయంగ నీవ భూ
వల్లభ! నీవు కానన నివాసముఁ గోరి చనంగ నెట్టులే
నుల్లమువట్టి హస్తిపురి నుండఁగనేర్తు? యుయుత్సు బెంపు శో
భిల్లఁగరాజుఁ జేయు నినుఁబ్రీతి యెలర్పఁగఁగొల్చి వచ్చెదన్."

అన్నాఁడు యుధిష్ఠిరుఁడు. వ్యాసుఁడు వచ్చి "పోనిమ్ము" అని యనున యించిన పిమ్మటఁగాని ధృతరాష్ట్రు వనవాసమున కంగీకరింపలేదు. అంతగా వృద్ధుల మనస్సున కెక్కిన పితృసేవాతత్పరుఁడతఁడు. మంచివైన గుణము లన్నియు నతనియందుఁ బరాకాష్ఠను జెందినవి.

ఆంబికేయుఁడు రాజనీతిని బోధించి నదీతనూజుఁడును, హరియుఁ, బరాశరా త్మజుఁడును మొదలగు పెద్దలు నీకుఁ బెక్కులు చెప్పిరి. అయినను నీ మీఁది ప్రీతి వలన నా యెఱిఁగినంత చెప్పితి నన్నప్పు, డాపగాసుతుఁడు లేఁడు. అబ్జనాభుఁ డాత్మపురికేఁగినాఁడు. వాత్సల్యమునఁ జెప్పువారు నీవుతప్ప నెవ్వరున్నా రని బదులు బలికిన ధర్మరాజును ధృతరాష్ట్రు నాత్మలో నెంతగాఁ బొగడెనో!

బంగారపు వన్నెగల పలుచని దేహ, ముచితదీర్ఘసమున్నతమైన ఘ్రాణము, నిడుదలై విశాలములయిన కన్నులును గలిగి కంఠీరవమువలె నున్న యజాత శత్రుఁడు శతయూపాశ్రమస్థ మునిజనుల కనులకే వ్రేఁగయి చూపట్టినాఁడు. ధర్మవిదుఁడైన విదురుఁడు యోగమార్గమునఁ దన తేజస్సును యుధిష్ఠిరునియందుఁ జేర్చెనన్నచో నతని ధర్మద్వయ భావమెంతటిదై యుండవలెను?

అర్జునుఁడు ద్వారకనుండి వచ్చి యాదవసంక్షయమును, బలరామకృష్ణుల నిర్యాణమును జెప్పినపిమ్మట యుధిష్ఠిరుని చిత్తమున ధర్మసంస్కార సమాత్తమైన వైరాగ్యము సహజముగా నావిర్భవించి మహాప్రస్థానమునకుఁ గడంగినాఁడు. నిరంతరమైన వైదికధర్మ నిరతికి ఫలముగా నవసానకాలమున నతఁడు వీత రాగుఁడై స్వర్గమున కేఁగఁదలఁచుట యతని ధర్మజీవిత సోపానములలోఁ దుది మెట్టు. ఈ ఘట్టమునందును ధార్మికతా సముల్లసితమైన ధైర్యమును విడనాడలేదు. ప్రాణాధిక ప్రియులైన సోదరులును ద్రౌపదియు విగతజీవులై పడిపోవఁ దిరిగియైనను జూడక ముందడుగు వేసినాఁడు. పవిత్రములై ధర్మార్థకామములను సాధించి యంత్యముగాఁ దురీయపురుషార్థమును జూఱగొన్న ధర్మరాజు, తక్కువ లెక్కడను బొడమకుండునట్లు చిత్రింపఁబడినాఁడు.

కుంతి: యుధిష్ఠిరునికిఁ తగినతల్లి. గాంధారీ ధృతరాష్ట్రులను గతమును విస్మరించి యాదరించిన దొడ్డయిల్లాలు. వృద్ధులవెంటఁ దానును బయనమైనప్పుడు యుధిష్ఠిరుఁడు నివారింప రోషములు పలికి లజ్జితునిఁ జేసి ప్రయాణము సాగించు కొన్న ధీరురాలు. పాండురాజు దివంగతుఁడైన నాటినుండియుఁ దానుపడిన యగచాట్లు నేటికి ఫలించినవి. కుమారులు తమతమ భోగము లనుభవించుచున్నారు. తనకుఁ గావలసిన దేమున్నది? ఇఁక నామె నంతశ్శల్యమై బాధించునది కర్ణుమరణము. అప్రతి విధేయమైన యా వైమనస్యమునకుఁ దపశ్చరణము కన్న మార్గాంతరము లేదు.

బావయు నతని భార్యయుఁ గన్నులులేని కబోదులు. వారెట్లును వనవాసము నకుఁ గడఁగినారు. వారి నొంటిగా నరణ్యమునఁ జత్తురుగాకయని విడిచి దానును దన కొడుకులును రాజ్యసుఖములఁ దేలుచుండిన లోకమువారేమందురు? తానును దన కొడుకులును నరణ్యావాసక్లేశములనుభవించునాడు ఇష్టసుఖములఁదేలిన ధార్త రాష్ట్రులకును నేటి పాండవులకును భేద మేమియుండును? చిన్ననాటినుండియు నెన్నోక్లేశముల కోర్చి తీర్చిదిద్దిన యుధిష్ఠిరుని కీర్తికి నెంత కొంచెపు మచ్చయైన నిప్పుడు కలుగుట తగునా?

ఈ భావపరంపర హృదయమున రేఁగుటచేత నరణ్యమున కేఁగి వృద్ధ దంపతులను సేవించి కీర్తినెల్లను గొల్లగొట్టి ధర్మజుని కీయఁదలచిన కుంతి, మాతృ ప్రేమచేఁ గొడుకు లాపినంత మాత్రమున నాఁగిపోవునా? ఆమరణాంతమును గాంధారీ ధృతరాష్ట్రులను బాండవులు కనిపెట్టియే యుండిరన్న మంచి లోకమున వ్యాపింపవలెను. కనుక దుష్కర వనవాసమునకు సమకట్టినది. గురుసేవను

దపస్సును బరమజీవిత కృత్యములనుగా నిర్ణయించుకొన్నది. క్లేశసహనమున నీమెకీమెయే సాటి. ఇట్టి తల్లియుండుటచేతనే పాండవులంతవా రైనారు.

భీముఁడు: పుట్టిననాటినుండియుఁ గల్లకపటము లెఱుఁగని ధీరోద్ధతిగల నాయకుఁడు. తన మనస్సునకు విరుద్ధమైన యంశమును మ్రింగఁజాలని శుద్ధ హృదయుఁడు. ధార్తరాష్ట్రులు తమను భంగపఱచిరి. కావున వారియెడ నెన్నటికిని గతమును విస్మరించి సౌమనస్యమును వహించుట యతని చేతఁగాని పని. కావుననే యంధనృపతినిఁ గాంచినపు డెల్లను గొఱకొఱలాడుచుండెను. ఒక్క యుధిష్ఠిరుని యాజ్ఞకుమాత్రము బద్ధుఁడై క్రోధమును దిగ మ్రింగుకొనఁగల యలవాటు కొంతవఱకున్నది. ఈ పాత్రమును దిక్కన తుదివఱ కేకరీతిగాఁ బోషించెను.

అర్జునుఁడు; యుధిష్ఠిరునికిఁ దగిన తమ్ముఁడు. పరిస్థితుల నర్థము చేసుకొనఁ గల్గిన ప్రతిభాశాలి. పూర్వసంఘటనములం దపూర్వశౌర్య ధైర్యములను జూపిన యీ పరాక్రమశాలి యాదవ సంక్షయ కృష్ణనిర్యాణముల యనంతర మొక్కసారిగా నిర్వీర్యుఁ డగుటకుఁ గల కారణమును వేదవ్యాసమునీంద్రు నడిగి తెలిసికొన్నాఁడు. వీతరాగుఁడైన యుధిష్ఠిరుని చిత్తవృత్తిని గమనించి మహాప్రస్థానమునకు ముందడుగు వేసినాఁడు. కాలప్రభావమును గుర్తెఱిఁగిన విజ్ఞుఁడు. భారత సంగ్రామమున నేకైకనాయకుఁడైన యితఁడు క్షణములో శాంతమనస్కుఁడై మహాప్రస్థానమునకు గడఁగుట బంగారమునకుఁ బరిమళము వచ్చిన ట్లయినది.

తిక్కన విరాటోద్యోగాది పూర్వపర్వములందే యన్నిపాత్రములను సముజ్జ్వల వృత్తములతోను, నే సన్నివేశమునందైనను గుర్తుపట్టఁదగిన చిత్తవృత్తులతోను, దమతమ భావములతోను మలఁచివేసినాఁడు. ఆ పాత్రపోషణ కిరణప్రసార మప్రతిహతముగాఁ దుదివఱకును బ్రసరించినది. చివరి పర్వములైన యాశ్రమ వాసాదులందుఁ గ్రొత్తగా రూపొందించవలసిన పాత్ర మొక్కటియు లేదు. పూర్వ సంపాదితములైన గుణములు జారిపోవకుండునట్లును, వెనుకటి బిగువు సడలకుండు నట్లును నిర్వహించుటయే యిచ్చటి కర్తవ్యము. అట్టి కర్తవ్యమునం దలసటను బొడమనీయక పాత్రము లన్నిటిని నడిపినాఁడు.

కావ్యనాటకరీతులు

ఆశ్రమవాస చతుష్టయము నొకభావనతో ధ్యానించితిమేని నదియొక కావ్యము, లేదా నాటకముగా భాసించును. ఈ పర్వచతుష్టయమునందలి యితివృత్తమునకు

వస్త్వైక్యము కలదు. నాయకుఁడు యుధిష్ఠిరుఁడు. ధృతరాష్ట్ర వన ప్రయాణమువలన నాయకునియందుఁ బ్రక్షిప్తమై నిర్వేదబీజము వృద్ధమరణ మౌసలాహవములఁ బ్రతీయమానమగుచున్న కరుణముచేఁ బోషింపఁబడి, మహాప్రస్థానోద్యమ రూప మగు విస్తృతినిఁ బొంది మోక్షలక్షణ పురుషార్థమును సిద్ధింపఁజేసినది. ఇందలి రసము శాంతము.

యుధిష్ఠిరాదులును. గాంధారీధృతరాష్ట్రులును నొండొకరులయెడల నడచికొనిన ప్రవర్తనములందుఁ గావ్యమర్యాదలును, నాటకరీతులు బహుళములుగా విలసిల్లినవి.

"గుళ్లుఁ జెఱువులు, గట్టించుఁ గోరి యూళ్లు
లగ్రహారముల్ గావించు నాంబికేయుఁ
డధిప! ధర్మతనూజుఁ డత్యంత హర్ష
చిత్తవృత్తియై యనుమతి సేయుచుండ."

పెక్కు దానములు చేసె ననుటకు బదులిట్లు వర్ణించుట కావ్యపద్ధతి.

"ద్యూతంబున దుర్యోధను
చేతం దమ పడిన పాటు చిత్తంబున క
త్యాతురతఁ జేయుచుండుట
నాతఁడు ధృతరాష్ట్రుఁ జూచి యలుగు మనమునన్."

ఇది కథాకథనరీతి. ఇట్లు ప్రసాద మాధుర్యాది గుణములను. నలంకారములను బొదిగి రచించిన పద్యము లెన్నియో యున్నవి. రాజనీతి విశేషములును, బాండవులు శతయూపాశ్రమమునకుఁ బ్రధాన చతురంగ సముదీర్ణ భంగికంబుగా నందలంబులు, బాటబండ్లు, శకటంబులు, బటకుటీరములుఁగొని యేఁగుటయుఁ జక్కని కావ్యపద్ధతిలో వర్ణితములైనవి.

సంజయుఁడు శతయూపాశ్రమస్థ మునిజనులకుఁ బాండవులను బరిచయము చేయునప్పుడు "జాంబూనదచ్ఛాయ చందంబు వర్ణంబు గలిగిన పలుచని గనపమేను'' మొదలగురీతిగా వర్ణించి చెప్పుటయంతయు నలంకార ప్రధానమైన రచన.

వేదవ్యాసుఁడు యుద్ధమృతులను రావించి చూపిన యద్భుతఘట్టమున కెనలేని కావ్యప్రయోజనమున్నది. ఇందు కావ్యశిల్ప నాటకతత్త్వములు రెండును బెనవేసికొని యున్నవి.

"చతుర గంధర్వ లప్సరోజనులు గాన
ములఁ బ్రమోద మొనర్పంగఁ; బొగడ వంది
సమితి నిరహంకృతులు హృదయముల గౌర
వముల దెల్లంబు సేయంగ వచ్చి రొప్పి"

ఇట్లువచ్చిన రాజరాజ గాంగే యాభిమన్యు ప్రభృతులు కావ్యమార్గమున వర్ణితు లైనారు. మహాభారతమంతయు నొక మహానాటక మని భావింతుమేని నద్భుతమైన పుత్రదర్శన పూర్వకథ నిర్వహణసంధిలో నున్నదనియు, "కుర్యాన్నిర్వహణే ద్భుతమ్" అను లక్షణమున కుదాహరణప్రాయము కాఁజాలుననియు విశదముకాఁ గలదు.

సీ॥ "పటుతరంబగు ఛటచ్ఛట రవ మెసఁగంగ
క్రూఁకులుఁ బొదలును గాఁచిగొనుచుఁ,
గమరును నార్తనాదములను బెల్లుగ
నఖిల మృగంబుల నాఁచికొనుచు,
లాఁగలఁ బుట్టల లోఁగినశిఖల భు
జంగమ కులముల మ్రింగికొనుచు,
వెగడొంది యఱచుచు నెగయు బల్పులుఁగులఁ
బొగ నూర్ధ్వకీలలఁ బొదివికొనుచు,

గీ॥ దెసల నన్నిటఁ దన సముదీర్ణ గతులు
దారుణ స్ఫురణమున విస్తారమొంద
ఖేచరులకును భయముగ నేచి పరఁగె
నద్భుతోద్భవ మైన మహానలంబు."

సమాంతర వాక్యవిన్యాసముగల యీ సీసమునందు వర్ణితమైన కార్చిచ్చు కుంతీ సహితముగా గాంధారీ ధృతరాష్ట్రులను దగ్ధులను గావించినది. ఉపవాస క్లేశమునఁగాలు గదల్పఁజాలని కుంతీ గాంధారీ ధృతరాష్ట్రుల నిట్టి మహానలము చుట్టుకొనుట చేతనే యుక్కిరిబిక్కిరై దిక్కుఁగానక యోగనిష్ఠామాత్ర శరణ్యులై దేహములను విడిచిరి. ఇది కావ్యమర్యాదలతో విలసిల్లిన కరుణరస ఘట్టము. అంగియైన శాంత రసమున కిది దోహదము. దీనికిఁ దోడైనవి యాదవ సంక్షయ కృష్ణనిర్యాణములు. కరుణ ప్రధానములైన యీ ఘట్టములవలన వీతరాగుఁడైన యుధిష్ఠిరునియందలి నిర్వేదస్థాయి పరిపక్వదశకు వచ్చి శాంతరస ప్రతీతినిఁ గలిగించినది.

మహోత్పాతముల వర్ణనలు, యాదవుల సముద్రయాత్ర, సాత్యకి కృత వర్మాదుల కలహము. బలరామునిశేషావతారప్రాప్తి, ఇంద్రయుధిష్ఠిరులకుఁ గుర్కుర విషయమున జరిగిన సంవాదము. స్వర్గనరక వర్ణనములును నచ్చముగాఁ గావ్య వర్ణనలే.

పాత్రములు చిత్తవృత్తులు విశదములగునట్లు సంభాషించుట, ప్రతి చిన్న సన్నివేశమునందును రసభావస్ఫూర్తి, యాగతానాగతములను గన్నులయెదుట నిల్చి నట్లు వివరించుట మున్నగునవి పుష్కలముగా నాటకీయశోభను సంపాదించుచున్నవి. నాటకమునందువలెఁ బాత్రములు పరస్పరమును భావపరిప్లుతముగా సంభాషించును. వనవాసానుజ్ఞను వేఁడిన ధృతరాష్ట్రునితోఁ బౌరులపక్షమున నియుక్తుఁడయిన శంబువను బ్రాహ్మణుఁడు "భరతవంశోత్తమ మీ మహాన్వయంబున మహీవిభులయం దొప్పమి వెదకియైనఁ గానము. మము మీరు గన్నట్టి ప్రజల నెట్టట్ల రక్షించితిరి. దుర్యోధనుఁడు సేసిన యనర్థ మొక్కటియు లేదు. త్రిలోకోత్తముఁ డైన సత్యవతి కొడుకు సమ్మతించి నిన్నేమని పంచిన దానిన చేయుము" ఇత్యాదిగాఁ బలుకును. ఇది తిక్కన పాత్రముల స్వభావము. ఇదియే నాటకీయ తత్త్వము.

"ధృతరాష్ట్రుం డేకతంబ యున్నయెడ వృకోదరుండతని నింతనంతనుండి గాంధారియు వినుచుండి.............. బలుకును" "అంధనృపతి బంధుజనంబుల గూర్చి, ధర్మనందను రావించి యతండు వినుచుండ గద్గదగంతుండగుచు వారలతోడ....... నను." "తెగనాడకున్నఁ బోవరని కన్నీరు దుడుచికొని, వారలం గలయంగనుంగొని, వారలు వినుచుండఁ దత్పరిజనంబులతోడ............. అని, ధర్మతనయు వదనంబు వీక్షించి పాంచాలిం జూపి........................... పలికిన కుంతి పలుకులకు ధర్మసుతుండును, భీముండును సిగ్గువడిరి." ఇట్టి సూచన లడుగడుగునను(గలవు. నాటకములందలి పాత్రములభినయింపవలసిన భావములను "పరిక్రమ్య, లజ్జాం నాటయిత్వా, సోద్వేగం" అని పదములతో సూచించినట్లుగా నున్నవి పై వచనములు, కనుకనే తిక్కన పాత్రములన్నియుఁ దత్త ద్ఘట్టములయం దభినయించుచున్నట్లుగా నుండును. త న్మూలమున భావుకుని హృదయమునందలి సంచారిభావములు చర్వణ గోచరములగు చుండును.

విదురుఁడు వచ్చి ధృతరాష్ట్రుఁడు మృతులయిన బాండవులకు సవిశేష శ్రాద్ధములు చేయఁదలఁచినాఁడని చెప్ప యుధిష్ఠిరుఁ డానందపడెను. అర్జునుఁడు ప్రీతుఁడయ్యెను. భీముఁడు మాత్రము కమర్చిన మోముతోడ విదురు వదనంబు సూచుచుఁ బెదవు లదర నేమేనిం పలుకఁ జూచిన భీభత్సుండు మెలుపున నతని

వారించి యల్లన యిట్లనియె.............'నమ్మాటల క య్యనిలతనియుఁ డిట్టులనియె నన్నరుతోడన్' ఈ సన్నివేశము చిన్న రంగస్థలముగా మాఱినది. విదుర యుధిష్ఠిరులు వినకుండునట్లు భీమార్జునులు భావగోపన సమర్థమైన సంభాషణమును జేసినారు. ఇది 'జనాంతికం' 'అపవార్య' అను సూచనలతో నడచిన నాటక భాగమువలె నున్నది.

ఇట్లు విరాటపర్వాదిగా నెన్నియో సన్నివేశములు నాటకతత్త్వము గలిగి ప్రతి ఘట్టమును నాటక భాగమువలె గోచరించును. రసభావ స్ఫురణము దేని యందును ప్రతీయమానము కాకపోదు. పాత్రములను స్థిరముగా నొక్కొక్క రసమున కవలంబనము లగునట్లు మొదటినుండి తుదివఱకుఁ బోషించినాఁడు తిక్కన. ధర్మవీరుఁడును, శాంత చిత్తుఁడును నగు యుధిష్ఠిరుఁడు ధీరోదాత్త నాయకుఁడు. అర్జునుఁడును శౌర్యగుణ మధికముగా నున్న ధీరోదాత్తుఁడే! భీముఁడు తుదివఱకును దీరోద్ధతుఁడు గానే వ్యవహరించినాఁడు. ధృతరాష్ట్రుఁడు, యుద్ధపరిసమాప్తి వఱకును నాగతానాగతముల నూహింపలేని దీర్ఘసూత్రుఁడు దుర్యోధనుఁడు పరప్రత్యయ నేయ బుద్ధియైన మూర్ఖుఁడు. ఇట్లొక్కొక్క పాత్రమునందుఁ గల్పితమైన ప్రత్యేక గుణముఁ జివరివఱకును స్థిరమై యున్నది. ఒక్క ధృతరాష్ట్రునియందు మాత్రము పశ్చాత్తాపవహ్నిలో బుటము వేసిన సుగుణసంపద యుధిష్ఠిర పాత్రపోషణ ప్రయోజనమునకై క్రొత్తగా సంపాదింపఁబడినది. ఇట్లు గ్రంథమున కంతటికిని రసమయ కావ్యత్వమును జేకూర్చి మహాభారత సంహితా వైభవము నినుమండిపఁ జేసినారు కవిత్రయమువారు.

సంస్కృత మహాభారతము శుష్కమైన యైతిహాసిక రచన యని మనము భ్రమింపరాదు. అదియు మహాకావ్యము. "కవి వృషభులు మహాకావ్య మనియు" నని నన్నయ వర్ణించినది తన యాంధ్రీకరణమును గుఱించి కాదు. విశ్వజనీన మగుచుండ విష్ణు సన్నిభుఁ డైన వ్యాసుఁడు రచించిన మహాభారతమును గుఱించియే వ్యాసుని స్తుతించుటలో "విద్వత్సంస్తవనీయ భవ్య కవితావేశుండు" అని తిక్కన వ్రాసినది క్రాంత దర్శియగు మహాకవి వ్యాసునిగుఱించియే. ధ్వన్యర్థసిద్ధాంతమును దత్ప్రాధాన్యమును నిర్ణయించి మార్గదర్శకుఁ డయిన లాక్షణిక మూర్ధన్యుఁ డానందవర్ధనుఁడు. "తస్య హిధ్వ నేః స్వరూపం సకల సత్కవి కావ్యోపనిషద్భూత మతిరమణీయ మణీయసీభి రపి చిరంతన కావ్యలక్షణ విధాయినాం బుద్ధిభిరనున్మీలిత పూర్వమ్. అథచ రామాయణ మహాభారత ప్రభృతిభిర్లక్ష్యే సర్వత్ర ప్రసిద్ధ వ్యవహారం లక్షయతాం సహృదయానా మానందో మనసి లభతాం

ప్రతిష్ఠామితి ప్రకాశ్యతే" అని వ్రాసిన ధ్వన్యాలోక వాక్యమునందు సంస్కృత మహాకావ్యములలో భారత రామాయణము లుత్తమోత్తముము లైనవియేకదా యుదహరించెను. కావున వేదశాస్త్రోపబృంహిత కథాసంవిధాన మహత్త్వముగల మహాకావ్యము సంస్కృత భారత మనియు. దాని నాంధ్రభాషను వెలయించి కావ్యనాటక రీతుల కొకింత ప్రాధాన్య మొసఁగినది కవిత్రయ భారతమనియు మనము తలంపవలయును.

కావ్యజీవితము వ్యంగ్యవైభవము, వ్యంగ్యము రసాలంకార వస్తురూపములతో గోచరించును. అందు రసధ్వని యుత్తమము, మహాభారతమునందలి రసమును గుఱించి తొమ్మిదవ శతాబ్దమువాఁడైన యానందవర్ధనుఁడు చర్చించి నిర్ణయించినాఁడు. తన ధ్వన్యాలోకమునఁ బ్రబంధ రసస్వరూపమున వివరించు పట్టునఁ (బ్రబంధశబ్దమాంధ్రోపజ్ఞము కాదు.) "తథాచ రామాయణ మహాభారతాదిషు సంగ్రామాదయః పునః పున రభిహితాఅపి నవనవాఃప్రకాశంతే" దీనిని గ్రంథము నందలి పూర్వవాక్యములతో సమన్వయించుకొనవలెను). "ప్రబంధే చాంగీరస ఏక ఏ వోప నిబధ్యమానోஉర్థవిశేషలాభం ఛాయాతిశయం చ పుష్ణాతి, యథా రామాయణే యథా వా మహాభారతే, రామాయణే హి కరుణో రసః స్వయ మాదికవినా సూత్రితః శోకః శ్లోకత్వమాగతః ఇత్యేవం వాదినా, నిర్వ్యూఢశ్చస ఏవ సీతాత్యంతవియోగ పర్యంతమేవ స్వప్రబంధ ముపరచయతా, మహాభారతేஉపి శాస్త్రరూపం కావ్యచ్ఛా యాన్వయిని వృష్ణిపాండవ నిరసావసాన వైమనస్యదాయినీం సమాప్తి ముపనిబధ్నతా మహా మునినా వైరాగ్యజనన తాత్పర్యం ప్రాధాన్యేన స్వప్రబంధస్య దర్శయతా మోక్షలక్షణః పురుషార్థః శాంతో రస శ్చ ముఖ్యతయా వివక్షా విషయత్వేన సూచితః " అని వ్రాసినాఁడు.

కావున మహాభారతమునందలి రసము శాంతము. కావ్యచ్ఛాయాన్వయియైన మహాభారత శాస్త్రమునందు యాదవక్షయము, పాండవ మహాప్రస్థాన క్లేశము. శ్రీకృష్ణునికి వ్యాధునివలన మృతియుఁ గల్పించి స్వప్రబంధమునకు వైరాగ్య జననమే పరమతాత్పర్య మని చూపిన వ్యాసమునీంద్రునిచేత మోక్షపురుషార్థము, శాంతరసమును ముఖ్యముగా వివక్షితములైనట్లు సూచింపఁబడినది. ఈ యంశము తనకన్నఁ బూర్వులగు కొందఱు వ్యాఖ్యాతలు సయితము వివరించినట్లును.

"యథా యథా విపర్యేత లోక తంత్ర మసారవత్
తథా తథా విరాగోஉత్ర జాయతే నాత్ర సంశయః"

అను మహాభారత శ్లోకమునందు వ్యాసభగవానుఁడే పై యంశమును వ్యక్తము చేసినట్లును నానందవర్ధనుఁ డుదహరించి వివరించినాఁడు. (లోకతంత్రం = లోకైః తంత్ర్యమాణం జనులచేత యత్నపూర్వకముగా సంపాదింపఁబడు నర్థ కామములును, దత్సాధనలక్షణమైన యభిమతవస్తుజాతమును, నది యార్జన రక్షణాదు లయిన యేయే ప్రకారములచేత నెట్లు నిస్సారముగా నింద్రజాలము మాదిరి విపర్యాసమును పొందునో, యాయా విధముల లోకతంత్రమునందును విరాగము కల్గును. విరాగము నిర్వేదాపద పర్యాయము, నిర్వేదము, శాంతిరసమును, ధర్మార్థ కామములో ననుగమింపఁబడుచున్న మోక్షలక్షణ పురుషార్థమును బ్రధానముగా వివక్షితములై యున్నట్లు ధ్వన్యాలోక సమీక్ష.

వీరాదిరసము, ధర్మాదిపురుషార్థములు మహాభారతమున నాయా పర్వము లందు సువ్యక్తము లగుచుండ వాని సప్రధానములనియు, సంగము లనియు, నెట్లు నిరూపింపఁగల మని శంకింపఁ బనిలేదు. పారమార్థికమైన యంత స్తత్త్వము యొక్క యపేక్షలేకయే యంగభూతమైన శరీరము రమణీయముగా గోచరించినట్లు, అంగభూతములయిన వీరాదిరసములను, ధర్మాది పురుషార్థములను జారుత్వాదాయకము లగుటలో విరోధములేదు.

"శాంతో రసశ్చ ముఖ్యతయా వివక్షా విషయత్వేన" అను ధ్వన్యాలోకపంక్తి యందలి 'ముఖ్యతయా' అను పదమును వివరించుచు లోచనమునందు "యద్యపి ధర్మే చార్థేచ మోక్షచే త్యుక్తం (ధర్మే చార్థే చ కామేచ మోక్షేచ భరతర్షభ, యది హాస్తితదన్యత్ర యన్నేహాస్తితత్ క్వచిత్) తథాపి చత్వారా శ్చకారా ఏవమాహుః యద్యపి ధర్మార్థకామానాం సర్వస్వం తాదృజ్నాస్తియ దన్యత్రనవిద్యతే, తథాపి పర్యంతవిరసత్వ మత్రైవావలోక్యతాం. మోక్షేతుయద్రూపం తస్య సారతాత్రైవ విచార్య మితి, " అని అభినవగుప్తపాదుఁడు వ్రాసెను. భారత శ్లోకమునందలి చకార చతుష్టయమువలన లభ్యమగుచున్న తాత్పర్య మేమనఁగా ధర్మార్థకామముల సర్వస్వ మన్యత్ర లేనిది యిచ్చట లేదు. కాని పర్యంత విరసత్వముగల యీ భారత గ్రంథము నందే మోక్షలక్షణ పురుషార్థమును విచారింపు మని లోచనకారుని యభిప్రాయము.

మహాభారతమునందలి విషయముల నన్నింటినిఁ బర్వసంగ్రహ రూపమైన యనుక్రమణిక తెలుపుచున్నది కదా! అచ్చట శాంతిరసప్రసక్తి లేదే? మీఁదుమిక్కిలి మహాభారతమునకు సర్వపురుషార్థ ప్రబోధ హేతుత్వము, సర్వ రసగర్భత్వమును స్వశబ్దనివేదితములై యున్నవే? అని శంకింపవచ్చును. నిజమే.

మహాభారతమునందు శాంతియే యంగిరసము. మోక్షమే యన్ని పురుషార్థముల కంటెను బ్రధానము. అను విషయము స్వశబ్దాభిధేయము (వాచ్యము)గా ననుక్రమణిక యందుఁ జెప్పఁబడలేదు. వ్యంగ్యముగా సూచింపఁబడినది.

"భగవాన్ వాసుదేవశ్చ కీర్త్యతేఽత్ర సనాతనః"

పై వ్యంగ్యార్థ మెట్టి దనఁగా మహాభారతమునందలి పాండవాది చరితము సర్వమును నవసాన విరసము. అవిద్యా ప్రపంచరూపమునను! పరమార్థమైనా సత్యస్వరూపము భగవంతుడైనవాసుదేవుఁ డచ్చటఁ గీర్తింపబడుటయే కాఁబట్టియా భగవంతుడైన వాసుదేవునియందే మీరు భావిత మనస్కులు కండు. కేవలము లయిన నయవినయ పరాక్రమాదులందుఁ గాని నిస్సారము లయిన సంపద లయందుఁ గాని, రాగవతుల గుణములందుఁ గాని ప్రతి నివిష్టబుద్ధులు కాకుఁడు. సంసారము యొక్క నిస్సారమును జూడుఁడు. అనునర్థమును స్ఫురింపఁజేయుచు వ్యంజక శక్త్యనుగృహీతమైన శబ్దము స్ఫుటముగానే యవభాసించుచున్నది. "స హి సత్యం" శక్త్యనుగృహీతమైన శబ్దము స్ఫుటముగానే యవభాసించుచున్నది. "సహిసత్యం" మొదలయిన యనంతర శ్లోకములను నిదే తాత్పర్యమును వెల్లడించుచున్నవి.

మహాభారతావసానమునందు హరివంశ వర్ణనమును జతకూర్చిన కవిబ్రహ్మ కృష్ణద్వైపాయనుని చేతనే నిగూఢ రమణీయ మైన పైయర్థము చక్కఁగా స్ఫుటీ కరింపఁబడినది. సంసారాతీతమైన తత్త్వాంతరమునందు భక్త్యతిశయమును బ్రవర్తింపఁజేయుచున్న పై యుద్ధముచేత సకలమైన సాంసారిక వ్యవహారము సంపూర్ణముగాఁ బూర్వ పక్షీకృతమై ప్రకాశించుచున్నది. దేవతా తీర్థ తపః ప్రభృతుల యొక్కయుఁ దత్తదేవతా విశేషముల యొక్కయుఁ బ్రభావాతిశయవర్ణన మా పర బ్రహ్మప్రాప్త్యుపాయమును దద్విభూతియునైయున్నది. పాండవాదిచరిత్ర వర్ణనమునకు వైరాగ్యజననము తాత్పర్యము. వైరాగ్యము మోక్షమునకు మూలము. మోక్షము భగవత్ప్రాప్తికుపాయము. భగవద్గీతలయందుమోక్షమునకుఁ బరబ్రహ్మ ప్రాప్త్యు పాయత్వము ప్రదర్శితమై యుండుటచేతఁ బాండవచరితము భగవత్ప్రాప్త్యు పాయముగాఁ (పరంపరా సంబంధము చేత) బర్యవసించుచున్నది.

వాసుఁదేవుఁడనఁగా శ్రీకృష్ణుఁడు. శ్రీకృష్ణుని మహిమ భారతమునం దుపవర్ణితమైనంతమాత్రమునఁ బరబ్రహ్మతత్త్వవర్ణనము తత్ప్రాప్తికి నుపాయమును నెట్లు సూచితము లయ్యె నందురేని, యపరిమిత శక్త్యాస్పద మైన పరబ్రహ్మము పరంపరాగతమైన వాసుదేవాది సంజ్ఞాభిధేయత్వమును బొందియున్నది. భగవద్గీతల

యందును మఱికొన్ని గ్రంథములందును, వాసుదేవాది, శబ్దములు బ్రహ్మపరముగా లబ్ధప్రసిద్ధి గలవై యున్నవి. సనాతనాదిశబ్దములు విశేషణములుగాఁ గల వాసుదేవ శబ్దముచేత మాధుర ప్రాదుర్భావానుకృత సకల స్వరూపములుగల బ్రహ్మమే వివక్షితము కాని మాధుర ప్రాదుర్భావాంశము మాత్రమే కాదు. (మధురయందుఁ గల్గిన ప్రాదుర్భావము మాధుర ప్రాదుర్భావాంశము అనఁగా శ్రీకృష్ణుఁడై పుట్టుట) రామాయణమునందుఁ బరబ్రహ్మము రామశబ్దాభిధేయము కాలేదా? అట్లే యిచ్చటను వాసుదేవ శబ్ద వాచ్యము పరబ్రహ్మమే.

ఇట్లు భారతానుక్రమణికయందు భగవద్వ్యతిరిక్తమైన సర్వమును ననిత్యమని చెప్పు వాక్యముచేత మోక్షలక్షణమైన పురుషార్థము మాత్రమే శాస్త్రమార్గము నందును (అనఁగా మహాభారతము శాస్త్ర మని తలంచువారి దృష్టియందు), కావ్య మార్గమునందుఁ దృష్ణాక్షయ సుఖపరిపోష లక్షణమైన శాంతరసమంగిగా అవక్షిత మైనట్టు లుపపాదింపఁబడినది. అత్యంత సారభూత మైనందువలన నీ యర్థము వ్యంగ్యముగా సూచింపఁబడినది కాని వాచ్యముగాఁ జెప్పఁబడలేదు. సారభూతమైన యర్థము స్వశబ్దానభిధేయమై ప్రకాశింపఁబడినచో మిక్కిలి శోభావహముగానుండును. విదగ్ధ విద్వత్పరిషత్తులయందు వ్యంగ్యముగానే యభిమతతరమైన వస్తువు ప్రకాశింపఁ జేయఁబడుటయు, సాక్షాచ్ఛబ్దములతో వాచ్యముగాఁ జెప్పఁబడకుండుటయుఁ బ్రసిద్ధములు గదా! ఇది యానందవర్ధనుని మహాభారత ప్రకాశమానమైన శాంతరసాంగిత్వ నిరూపణము.

సంస్కృత మహాభారతమునందలి యంగిరసమును గుఱించి చర్చించి, యది శాంతరసమని చెప్పిన యానందవర్ధనాచార్యుని పలుకులు తెలుఁగు భారతమునకును సమన్వయించును. కావున కవిత్రయ భారతమునందలి ముఖ్యరసము శాంత మనియే విశ్వసింతము. ఇట్లు కావ్యనాటకరీతులు గల యాశ్రమాది చతుష్టయమునఁ బ్రతీయమాన మగుచున్న రసము గ్రంథమునం దంతటనుద్దీప్త మగుటచేత రసవిషయకముగా నీ భాగము తక్కిన భాగముల కుపకరించుచు మహాభారత గ్రంథ తాత్పర్యమునకు దోహద మగుచున్నది.

సంపూర్ణము.

[illegible]